
గొల్లపూడి మారుతీరావు

# రుణం



Creative Links
PUBLICATIONS

## 'స్వాతి'లో సీరియల్‌గా వచ్చినప్పుడు కొందరి పాఠకుల స్పందనలు

గొల్లపూడి మారుతీరావుగారి 'ఋణం' సీరియల్ ప్రారంభం గుండెను బాగా పిండివేసినట్లుగా ఉంది. నా భావాలను ఏ విధంగా వెల్లడిచేయాలో కూడా తెలియడంలేదు. ఎన్నో అతిశయోక్తులు... పాత్రలు సాధించిన విజయమెంతగానో ఆకట్టుకున్నాయి. కాని అదే మూసలో మూడు తరాల మరణం. ఆరోజున నాకెంతో దుఃఖం కలిగింది. నా భార్యకు ఈ సీరియల్ చెపుతూ నిజంగా ఏడ్చేశాను. సీరియల్ హృదయాన్ని ఎంతగానో స్పృశిస్తున్నది. ప్రతి వారం నా హృదయం కలత చెందుతోంది. నా కళ్ళు తడి అవుతున్నాయి. ఎన్నో ఏళ్ళ తర్వాత పూర్తి విలువలు, భావోద్రేకాలతో నిండిన కథ చదువుతున్నాను.

**– డి.లక్ష్మణ కుమార్,** పలాస

విశ్వనాథవారి వేయి పడగలులాంటి నవల గొల్లపూడి మారుతీరావుగారి 'ఋణం' చాలా సీరియస్‌గా సాగుతోంది. మన సంప్రదాయాల్ని... ఆచార వ్యవహారాల్ని లోతుగా విశ్లేషిస్తూ... అన్వయిస్తూ రాస్తున్నారు.

**– డి.శ్రీనివాస దీక్షితులు,** నరసరావుపేట

'ఋణం' సీరియల్ అద్భుతంగా ఉంటున్నది. ఇందులో నేను వేదవతి, వేదపురుషుణ్ణి చూస్తున్నాను.

**– జి.ఎస్.వి.గోపీకృష్ణ,** హైదరాబాద్

శ్రీ విశ్వనాథ సత్యనారాయణగారూ, సిగ్మండ్ ఫ్రాయిడ్, ఆర్థర్ కోనన్ డాయిల్ (షెర్లాక్ హోమ్స్ సృష్టికర్త) ఏకాత్మగా శ్రీ గొల్లపూడి మారుతీరావుగారిని ఆవహించి, భారతీయ తత్వ శాస్త్ర సారాన్ని, మానసిక విశ్లేషణతో మేళవించి అపరాధ పరిశోధన నేపథ్యాన్ని రంగరించి 'ఋణం' ధారావాహికగా తెలుగు పాఠకులకి అందిస్తున్న అనుభూతి కలుగుతోంది. తెలుగు సాహిత్యంలో మరో జ్ఞానపీఠ పురస్కారాన్ని దక్కించుకునే రోజు త్వరలోనే రానున్నదని 'ఋణం'లోని ప్రతి వాక్యం ఆశ కల్పిస్తోంది. ప్రచురిస్తున్న స్వాతికి కృతజ్ఞతలు.

**– ఆచాళ్ళ శ్రీనివాసరావు**

విశ్వనాథవారు భూమికి దిగి వచ్చి, వేయి పడగలకు సీక్వెల్ రాస్తున్నారా అనిపిస్తుంది మారుతీరావుగారి 'ఋణం' సీరియల్ చదువుతుంటే.

**– డా॥బి.ఎస్.ప్రసాద్,** భీమడోలు

# ఋణం

స్వాతి వారపత్రికలో ధారావాహికంగా
ప్రచురితమయిన నవల


## గొల్లపూడి మారుతీరావు



క్రియేటివ్ లింక్స్ పబ్లికేషన్స్

హైదరాబాద్ – 500044.

# రుణం - నవల

**గొల్లపూడి మారుతీరావు**
(gmrsivani@gmail.com)

**© రచయిత**

తొలి ప్రచురణ : సెప్టెంబర్ 2016

వెల : రూ. **250/-**
**$ 15**

ముఖచిత్ర కళాకారులు : **గోపి**

ప్రచురణ :
**క్రియేటివ్‌లింక్స్ పబ్లికేషన్స్**
1-8-725/ఎ/1, 103 సి, బాలాజి భాగ్యనగర్ అపార్ట్‌మెంట్స్,
నల్లకుంట, హైదరాబాద్-500044.
ఫోన్స్ : 9848065658, 9848506964.

ప్రతులకు :
**విశాలాంధ్ర బుక్ హౌస్** (అన్ని పట్టణ శాఖల్లో)
**నవ తెలంగాణ బుక్ హౌస్** (అన్ని పట్టణ శాఖల్లో)
**నవచేతన బుక్ హౌస్** (అన్ని పట్టణ శాఖల్లో)
**ప్రజాశక్తి బుక్ హౌస్** (అన్ని పట్టణ శాఖల్లో)
**నవోదయ బుక్ హౌస్,** కాచిగూడ, హైదరాబాద్.
**తెలుగు బుక్ హౌస్,** కాచిగూడ, హైదరాబాద్.
**ఇంకా ప్రముఖ పుస్తక విక్రయకేంద్రాల్లో**

**Online :** kinige.com, telugubooks.in, logili.com, anandbooks.com

# ఋణం

## 1

కాలువ పక్కన బూరుగుచెట్లు వేదాన్ని ఘోషిస్తున్నాయి. స్వరిత ఉదాత్త అనుదాత్తాలు మోహరిస్తూ పది పన్నెండు శంఖాలు–శతాబ్దాల తాత్విక సంపదను పూరిస్తున్నాయి. అదొక ఆవేశం. ఆనందార్ణవం.

చిన్నతనంలోనే సంస్కృతీ వైభవాన్ని వంటబట్టించుకున్న పదిమంది వటువుల క్రీడ. దైనందినం. మహాయజ్ఞం.

బ్రహ్మోపదేశం అయింది లగాయితూ ఆ పసివారి ఆటాపాటా కూడా అధ్యయనమే. ఏకభుక్తం, పరాయితం, వల్లె, ఉభయసంధ్యల్లో సంధ్యావందనం, గురువుగారి శుశ్రూష– మధ్య మధ్య క్రీడలో కూడా విద్యే ఊతం.

ఉదయం స్నానానికి ముక్కామల కాలువకి బయలుదేరినప్పుడే చిన్న ఆటవిడుపు. ఎక్కడో తుల్యభాగలో ఈతలు కొట్టిన మరీ పసితనపు చాపల్యం కాస్త రెచ్చగొట్టగా తురాయి, సెప్టోప్లామ్ చెట్లెక్కి విసురుగా కాలువలో దూకుతూ కేరింతలు కొట్టడం – కుర్రతనం పురివిప్పిన ఆ కాస్తపాటి వెసులుబాటు. అదీ ఓ గంటసేపు.

అనుకోకుండా ఆ రోజు పొగమంచు దట్టంగా కమ్మింది. రాత్రి వర్షంలో తడిసి ముద్దయి, పచ్చని పొలాలు మెత్తబడి, జేగురు రంగు తివాచీల్లాగ విస్తరించి కనిపిస్తున్నాయి.

కాలువ పక్కనే రోడ్డు. రోడ్డుకి అటుపక్క కొబ్బరిచెట్లు అప్పుడే అభ్యంగనం చేసి తలలు ఆరబెట్టుకుంటున్న ముత్తయిదువల్లాగ ఉన్నాయి. నిశ్చలమైన వాతావరణంలో వటువుల గొంతులు ఖంగుమంటున్నాయి. అది వారి ఆనందానికి రెక్కలొచ్చిన అరుదైన విశృంఖలత్వం.

తైత్తిరీయ బ్రాహ్మణంలో ద్వితీయాష్టకంలో పన్నా వల్లెవేస్తూ కొమ్మలమీద దూకుతున్నారు.

అంగీరసోవై సత్ర మాసత

తేషాం పృశ్నిర్ఘర్మధుగాసీత్

అంటోంది ఒక బూరుగ.



ముత్యాల ఆలయం

సర్జీషేనా జీవత్ తేబ్రువన్

అంటూ సెప్టోప్లామ్ సమాధానం.

పరాయితం ఆకాశాన్ని స్పృశిస్తూ పసి హృదయాల్ని రసప్లావితం చేస్తోంది. ఒక్కొక్కరు విడిగా చదివితే స్వస్తి. నలుగురూ కలిస్తే వల్లె. కాని సప్తగోదావరులు ఏకీకృతమై అఖండమైనట్లు అన్ని గొంతులూ ఒకే ధారగా ప్రవహిస్తున్నాయి.

అందరిలోకి అబ్బుశాస్త్రి చిన్నవాడు. సూరావధాని పెద్ద. అబ్బుకి పదకొండు. సూరవధానికి పదమూడు. ఇంకా బాపన్న, చిట్టిజోగి పంతులు, అప్పయ్యశాస్త్రి, బ్రహ్మదేవుడు, సర్వమంగళం–అంతా కొమ్మలమీద పరుచుకున్నారు.

అరకొర చదువులూ, అపసవ్యపు చదువులూ... పట్నపు వాతావరణం ఇంకా విరగబడని రోజులవి. ఆ వికారాలూ ఇప్పుడిప్పుడే ఒళ్ళు విరిచుకుంటున్నా–ముక్కామల ఇంకా సంప్రదాయానికి ఋషిపీఠంలాగ వెలుగొందుతున్న రోజులు. చెవులు రిక్కిస్తే ఆ చుట్టుప్రక్కల గాలి వేదం పలుకుతుంది. ఐశ్వర్యాన్ని, విద్యతో బేరీజు వేసుకుని, సంపన్నతని సంస్కారంతో కొలుచుకుంటున్న రోజులవి.

అవిద్యని అర్హతగా, కుసంస్కారాన్ని సామూహిక శక్తిగా మలుచుకుంటున్న ఈతరం కొంచెం శ్రమపడితే తప్ప ఆలోచనకి అందని ఆర్ష సంప్రదాయపు వైభవానికి అద్దంపట్టే స్థలమది.

ఆ ప్రాంతానికి చిన్న ఐతిహ్యం ఉంది. రావణ సంహారం తరువాత శ్రీరాముడు బ్రహ్మహత్యాపాతకం నివృత్తికి ఇక్కడ 40 ఆమడలలో దేవాలయాలు నిర్మించాడట. ముక్కామలలో బాలాత్రిపురసుందరీ సమేత రాఘవేశ్వర స్వామి కొలువై ఉన్నాడు.

ప్రతి సంవత్సరం కనుమ రోజున ఇక్కడ ప్రభల ఉత్సవం అతి వైభవంగా జరుగుతుంది. నాలుగు కిలోమీటర్ల దూరం నుంచి – మొసలిపల్లి, జగ్గన్నతోట మొదలైన ఊళ్ళ నుంచి 11 గ్రామాల ప్రభలు ముక్కామల చేరుతాయి. ఏకాదశ రుద్రుల కలయిక ఆనాటి పర్వదినం ప్రత్యేకత. స్వామివారికి వైశాఖ శుద్ధ ఏకాదశిన కళ్యాణం.

ముక్కామల పురవీధుల్లో ప్రతీ అరుగూ వేదపారాయణం చేస్తుంది. ఈ సంప్రదాయ వైభవాన్ని కొనసాగించడానికి, ప్రవర్ధకం చేయడానికి ఆనాటి పిఠాపురం రాజులు దువ్వూరివారికి ముక్కామలని కానుకగా ఇచ్చారని ప్రతీతి. దీనిని దువ్వూరివారి ముక్కామల అని కూడా అంటారు.

ఈ ఆర్ష సంప్రదాయానికి ఇటీవలి వారసులు ప్రస్తుతం పంటకాలువ పొడవునా తైత్తిరీయాన్ని విస్తరిస్తున్నారు. ఆటా, వల్లె పడుగుపేకలవుతోంది.

❖ ❖ ❖

కొండమర్రి శ్రీరాములునాయుడుగారి పూర్వీకులు - కోనసీమ నుంచే ఇండోనేషియాకు వలస వెళ్ళారు. ఆరోజుల్లో కోనసీమ దాటడమే విడ్డూరం. అలాంటిది ఊరు దాటి, జిల్లా దాటి, రాష్ట్రం దాటి, దేశం దాటి మరో దేశానికి వెళ్ళడం అనూహ్యం, ఆశ్చర్యకరం.

దీనికి కారణం–ఒకే ఒక్క పదంలో చెప్పవచ్చు. కొబ్బరి. వ్యాపారం మనిషికన్నా అవసరాలను–ఆ మనిషికి రెండడుగులు ముందువేసి గుర్తుపడుతుంది. సరసమైన సౌకర్యంతో అందిస్తుంది.

అవసరాన్ని అవకాశం చేసుకోవడం అవినీతి. అవసరాన్ని ప్రోదుచేసి సౌకర్యానికి ధరకట్టడం వ్యాపారం. అవసరాన్ని గుర్తుపట్టి సర్వకాలీనమైన ఉపాధిగా మలచడం ఉద్యమం. నూట డెబ్భై సంవత్సరాల కిందట–అలాంటి పనిని ఈ దేశంలో ఒకాయన చేశాడు. ఆయన పేరు జమ్సెడ్జి టాటా.

ఈ దేశం భవిష్యత్తు పారిశ్రామికంగా అభివృద్ధి చెందడంలో ఉన్నదని గుర్తుపట్టి, అందునా ఉక్కు పరిశ్రమ ప్రధాన భాగం కాబోతున్నదని గ్రహించి–దేశంలో ఉక్కు ఉత్పత్తికి పునాదులు వేసి, దేశాభ్యుదయానికి తనకి చేతనైన కృషిని చేసి–ఆ ప్రయత్నంలో తన వాటాని పంచుకున్న అరుదైన వ్యాపారి టాటా.

అవసరాల్ని రెచ్చగొట్టి, అవకాశం చేసుకుని, రక్తాన్ని పీల్చుకు తినే కుహనా వ్యాపారుల కాలంలో టాటా అనే వ్యాపారి దేశభక్తుల జాబితాకి చెందుతాడనడం చాలామందికి విడ్డూరంగా కనిపించవచ్చు. స్వాతంత్ర్యం వచ్చాక ఈ దేశపు చరిత్రలో 'భారతరత్న' గౌరవాన్ని ప్రభుత్వం ఇచ్చి గౌరవించింది ఒకే ఒక్క వ్యాపారిని - ఒకే ఒక్కసారి. ఆయన పేరు జె.ఆర్.డి. టాటా. ముత్తాతగారి జీవలక్షణాన్ని వారసత్వంగా పొందిన మరో గొప్ప వ్యాపారి. ఆ దేశంలో మొదటి విమానాన్ని నడిపినవాడు. ఈ దేశంలో యాభై సంవత్సరాల పండుగకి మళ్ళీ విమానాన్ని నడిపి వారసత్వాన్ని నిలిపినవాడు.

వ్యాపారంలో సత్సంప్రదాయాలకు యింకా చెదలు పట్టని రోజుల్లో కొండమర్రి శ్రీరాములునాయుడుగారు–నాలుగు కొబ్బరికాయల్ని పట్టుకుని–బొంబాయిలో షిప్పు ఎక్కి మరో నాలుగు నెలల తర్వాత రెండున్నర లక్షల కాంట్రాక్టుతో షిప్పు దిగారు. ఆరోజుల్లో ఆయన పట్టుకున్నది బంగారం. రెండున్నర లక్షలు ఈనాటి రెండున్నర కోట్లు పైన.

అయితే ఇరవై ఐదు ఏళ్ళ శ్రీరాములునాయుడుగారు రెండున్నర లక్షల కొబ్బరి కాంట్రాక్టుతో పాటు మరొకటి  కూడా తెచ్చారు. లీలా ధాంపే అనే అతి సౌందర్యవతి అయిన భార్యని. స్నేహితులూ, ప్రజలూ ఆమె సౌందర్యాన్ని చూసి అచ్చెరువొందారు.

కొందరు రహస్యంగా ఈర్ష్యపడ్డారు. బంధువులు అతని వ్యాపారదక్షతకి మురిసిపోయారు. కాని ఆనాటి సమాజం శ్రీరాములునాయుడిని వెలివేసింది. దేశాన్ని దాటిన సంబంధ బాంధవ్యాలు ఇంకా కొరుకుడుపడని రోజులవి.

శ్రీరాములునాయుడు ఉక్కుమనిషి. కొబ్బరికాయని నమ్ముకున్నవాడు. లీలాధాంపేతో జీవితాన్ని, కొబ్బరికాయతో వ్యాపారాన్ని–అనితరసాధ్యంగా నెరుపుకువచ్చాడు. అవసరానికి ఆదుకోవడం వ్యాపారమని నమ్మిన మనిషి శ్రీరాములునాయుడు. బంధువుల సంప్రదాయ వైముఖ్యాన్ని దిగమింగి ఇద్దరికే తన డబ్బుతో చేదోడువాదోడుగా నిలబడ్డాడు–అడిగినవాడికి, అడగనివాడికీ. డబ్బులో చిన్న దుర్మార్గం ఉంది. 'అవసరం'లో చిన్న మెలిక ఉంది. ఎలాంటి వైరుధ్యాలకైనా డబ్బు దగ్గర తోవ. కుటుంబాల పరపతి, సంప్రదాయ భ్రష్టత, అరాచకం–అన్నిటికీ అవసరం సమాధానం చెప్తుంది.

పేగుతీపి–ఎన్ని మతాంతర, కులాంతర వివాహాలకి 'వంతెన' కావడాన్ని మనం చూడడంలేదు? కేవలం రెండు సంవత్సరాలలో శ్రీరాములునాయుడు తనని వెలివేసిన సమాజంలో 'పరివర్తన'ని బేరం చేశాడు. మరొక్కసారి–శ్రీరాములునాయుడు ఒడుపు తెలిసిన వ్యాపారి.

నాయుడు భార్య లీలాధాంపేకి చాలా కాలం పిల్లలు పుట్టలేదు. శ్రీరాములు నాయుడు భారతదేశపు దేవుళ్ళనీ, ఇండోనేషియాలో వైద్యుల్నీ నమ్ముకున్నాడు. ఇంక పుట్టరని అశలు వదులుకున్నాక, రకరకాల దేవుళ్ళు అతన్ని కరుణించరని నిర్ధారణ చేసుకున్నాక ఓసారి ఇద్దరూ వేలంగిణి చర్చికి, నాగూర్ దర్గాకీ వెళ్ళి వచ్చాక – భార్య నెల తప్పింది.

ఆరోజుల్లో కోనసీమలో ఎవరూ ఊహించలేనంత పెద్ద పండుగ చేశాడు శ్రీరాములునాయుడు. కముజువారిపాలెం, రామర్తివారిపాలెం కలిపేసి పందిళ్ళు వేయించి–మనుషుల్ని పెట్టి చింతపల్లి నుంచి సీమపందుల్ని తెప్పించి, ఇటు ఆత్రేయపురం నుంచి పూతరేకులూ, అవిడి పాలకోవా, పోతాయిలంక ముంజిలూ విస్తళ్ళలో వద్దనేవరకూ వడ్డింపించాడు.

అదొక వైభవం. రెండు తరాలు నాయుడు విందు గురించి మాట్లాడుకున్నారు. ఏతావాతా–లీలాధాంపే పురిటికి ఇండోనేషియా వెళ్ళింది. మరి తిరిగిరాలేదు. కొడుకుని కని మూడో రోజు పురిటిలోనే వాతం కమ్మి కన్ను మూసింది. ఇది పెద్ద షాక్ అందరికీ. కాని శ్రీరాములునాయుడు చలించలేదు. మళ్ళీ పెళ్ళి చేసుకోనూ లేదు. కొడుకు మరిడి నాయుడుని గుండెలమీద పెట్టుకుని పెంచాడు. తనే గొల్లభామ డబ్బాపాలు కలిపి స్వయంగా

కొడుక్కి పట్టేవాడు. కొబ్బరిని మరిచిపోయి మరిడి నాయుడు ధ్యాసలో మునిగిపోయాడు.

కొందరి దుఃఖం కళ్ళల్లోంచి పెల్లుబుకుతుంది. కొందరికి తన్నుకు వస్తుంది. మరికొందరికి మెదడులోంచి. చూస్తుండగానే శ్రీరాములునాయుడు తన చుట్టూ గిరి గీసుకున్నాడు. ఆ గిరిలోకి ఎవర్నీ రానివ్వలేదు. బయటికి భార్య పోయిన దుఃఖం పెల్లుబుకలేదు కాని కాండానికి పట్టిన చెదలాగా క్రమంగా అతని గుండెకాయని తినేసింది. ఇవాళైతే అది క్యాన్సరని గుర్తుపట్టేవారు కాని ఆరోజుల్లో గుర్తుపట్టే అవకాశం లేదు.

మరిడి నాయుడికి పదేళ్ళు వచ్చేసరికి శ్రీరాములునాయుడు వెళ్ళిపోయాడు. ఎవరు చెప్పారో, ఎక్కడినుంచి వచ్చాడో లీల దూరపు తమ్ముడు రతన్ థాంపే వచ్చి కుర్రాడిని తీసుకువెళ్ళిపోయాడు. తర్వాత కొబ్బరికాయల వ్యాపారం ఆగిపోయింది. ఇండోనేషియాకి, ఇండియాకి సంబంధాలు తెగిపోయాయి. ఎవరికి దొరికింది వారు తిన్నారు. కొందరు గొప్ప వైభవంతో వస్తారు. కొందరు గొప్ప వైభవాన్ని తెస్తారు. కొందరు గొప్ప వైభవాన్ని జ్ఞాపకంలాగా ఇచ్చి పోతారు. ఆ కోవ మనిషి శ్రీరాములునాయుడు.

మరో తరంపాటు శ్రీరాములునాయుడు గురించికానీ, మరిడి నాయుడు గురించికానీ ఎవరూ వినలేదు. దరిమిలాను మరిడి నాయుడు ఇండియా వచ్చాడని విన్నారు కాని–ఎప్పుడు ఎక్కడికి వచ్చాడో ఎవరికీ అంతబట్టలేదు. కానీ ఒకరోజు ఉన్నట్టుండి–ఓ అందమైన యువకుడు కోనసీమ చేరాడు. మరిడినాయుడు తల్లి అందంతో, తండ్రి వ్యాపారదక్షతతో పడుగుపేకల జవుళిగా పుట్టాడు. కానీ తండ్రి చేసిన పని చేయలేదు. కోనసీమ పెద్దల ఆశీర్వాదంతో కోనసీమ అమ్మాయిని చంపావతిని పెళ్ళిచేసుకుని బొంబాయి వెళ్ళిపోయాడు.

ఆ తర్వాత కొన్నాళ్ళు 'కొబ్బరిపీచు'ని నమ్ముకున్నాడు గాని–తన వ్యాపారానికి కొబ్బరి చాలదని గ్రహించాక–ఆరోజుల్లో ప్లాస్టిక్ పీచు, తర్వాత థర్మాకోల్ వ్యాపారాన్ని బొంబాయిలో సాగించాడు.

శ్రీరాములునాయుడి మంచితనం కోనసీమలో వేరుదిగి వేర్వేరు దారులలో కలిసివచ్చింది కాని మరిడి నాయుడి సరసమైన వ్యాపారదక్షత బొంబాయిలో అవకాశవాదులకి మాత్రమే కలిసివచ్చింది.

వ్యాపారం దెబ్బతింది. కోనసీమ నుండి అత్తమామల కుటుంబమూ ఆరోజుల్లోనే బొంబాయికి తరలిపోయింది. తండ్రిలాగే తనూ ఒకే కొడుకుని కని–చెడి–పుట్టిన ఊరుకి రావడం ఇష్టంలేక–బొంబాయిలోనే చిన్న సైజు పేదరికాన్ని అనుభవించి కన్ను మూశాడు. చిన్న సైజు అంటే? ఉండడానికి ఇల్లూ, తినడానికి తగుమాత్రం వసతీ ఉన్న 'లేమి' అది. గొప్ప బతుకుని ఎరిగినవారికి అది పేదరికం. నిజానికి అది లేమి కాదు, గొప్ప

తరాన్ని చూసిన ముందు తరంతో పోలిస్తే అది లేమి. ఈ తరానికి మర్యాదయిన, తగుమాత్రపు జీవనోపాధి. కొడుకు పేరు శ్రీరాములునాయుడు.

రెండో తరం శ్రీరాములునాయుడు మొదటి తరం శ్రీరాములునాయుడుకి ఫక్తు కార్బన్ కాపీ.

ఆలోచనలు ఆకాశంలో, వ్యాపారదక్షత కూడా ఆకాశంలోనే ఉన్న మనిషి. తన తాత గురించి ఆనాటి పెద్దలూ, కలిసిరాని వ్యాపారం గురించి తన తండ్రికాలంనాటివారూ చెప్పగా విని-ఏం చెయ్యకూడదో, ఏం చేసినా ఎలా చెయ్యాలో బాగా వంటబట్టించుకున్నాడు. ఆలోచనలు ఆకాశంలో ఉన్నా, కాళ్ళు నేలమీద ఉండాల్సిన వాస్తవాలు ఎరిగినవాడు. బొత్తిగా తాతలాగ ఔదార్యానికి తల వొంచకుండా కీలెరగడం అర్థం చేసుకున్న మనిషి. చక్కగా చదువుకుని, కుటుంబంలో రెండు తరాల ఎగుడు దిగుడులను అవగాహన చేసుకుని, ఆపోశన బట్టి ఏం చెయ్యాలో నిర్ణయాలు తీసుకున్న మనిషి. అయితే ఆ నిర్ణయాలు కార్యాచరణలోకి రావడానికి పరిస్థితులు కలిసిరాలేదు. పెట్టుబడులు చేతికి రాలేదు. అప్పటికి పెళ్ళయింది. బొంబాయిలోనే స్థిరపడిన ఒకనాటి తెలుగు కుటుంబంలో చదువుకున్న ముత్తేలమ్మ అతని భార్య. ఆమె ఒక్కగానొక్క తమ్ముడు రాజశేఖరం. ముత్తేలమ్మ తెలుగుదనాన్ని నూటికి నూరుపాళ్ళూ కాపాడుకుంది. రాజశేఖరం బొంబాయి నగర వైకల్యాన్ని నూటికి నూరుపాళ్ళూ అందిపుచ్చుకున్నాడు.

శ్రీరాములునాయుడికి తన నాయనమ్మ అంత అందమైన కూతురు పుట్టింది. పేరు లీల. తన తాత పేరు తండ్రి తనకి పెట్టాడు. తన మామ్మ పేరు తన కూతురికి శ్రీరాములునాయుడు పెట్టాడు. ఆలోచనల్లో చిన్న మెలిక ఉంది కాని సంప్రదాయాన్ని ప్రేమించే పెద్ద మనస్సులో మెలిక లేదు. లీల అందకత్తె. ఆరేళ్ళ వయస్సులోనే ముత్తాత మొండితనం, ముత్తవ్వ అందం-చూచాయగా ఆమెలో ద్యోతకమయ్యాయి. తల్లిదండ్రులిద్దరూ ఆ ఒక్క కూతురే చాలుననుకున్నారు.

శ్రీరాములునాయుడు పోయినచోటే ఏదైనా వెదుక్కోవాలని నమ్మినవాడు. వ్యాపారదక్షతలో తాతగారి 'అంశ'ని పూర్తిగా పుణికిపుచ్చుకున్నవాడు. తండ్రి తరంలో కోనసీమలో తమ ఆస్తులన్నీ అమ్మగా ఒక్క ఆస్తి ఎలాగో కనుమరుగైపోయిందని ఎవరో మధ్యవర్తి చెప్పగా విన్నాడు. అది పదెకరాల కొబ్బరి తోట. పుల్లేటికుర్రు సమీపంలో. అప్పటి మార్కెట్ ప్రకారం అది బంగారు గని. నాలుగు కొబ్బరికాయలతో ఇండోనేషియా వెళ్ళగల సామర్థ్యం ఉన్న శ్రీరాములునాయుడికి పదెకరాల కొబ్బరితోట చేతికి వస్తే ఏం చెయ్యాలో తెలుసు. మరో తరానికి వైభవాన్ని సృష్టించగలడు. తమ ప్రాణానికి ప్రాణంగా ప్రేమించే కూతురుకి కొత్త సామ్రాజ్యాన్ని స్థాపించి ఇవ్వగలడు.

కాని ఆ తోట ఎక్కడుంది? ఎవరి చేతుల్లో ఉంది? ఎవరు చెప్తారు? వాళ్ళు ఉన్నపాటునా తనకి అప్పజెప్తారా? మొరాయిస్తారా? వాళ్ళని నిలదీయాలా? అన్నిటికీముందు వాళ్ళని గుర్తుపట్టాలి. మధ్యవర్తిని సమాయత్తంచేసి ఆ ప్రశ్నలకు సమాధానాలు వెదికి పట్టుకున్నాడు.

శ్రీరాములునాయుడి మనుమడు-పదెకరాల ఆస్తిని దక్కించుకోబోతున్న వ్యాపారి-కోనసీమకి బస్సులోనో, బండిలోనో దిగడం లాయకీ కాదు.

అప్పటి ప్రముఖ రాజకీయవేత్త, ప్రాంతీయ నాయకుడు సలాది స్వామినాయుడి పేరునీ, ఫోన్ నెంబరునీ సంపాదించాడు. ఆయన పేరు వినడమేకాని పరిచయం లేదు. అయితే ఓ స్థాయి సంపన్నతకి పరిచయాలు అక్కరలేదు. కాగా తను శ్రీరాములునాయుడు మనుమడు. ఫోన్ చేశాడు.

ఊహించినట్టుగానే శ్రీరాములునాయుడి పేరు వినగానే స్వామినాయుడు స్పందించాడు. ఆయన గొంతులో మర్యాద, గౌరవం పలికాయి.

“మీ సేతికి రాని ఆస్తి యిక్కడ మిగిలినాదా? ఎవుడి సేతిలో వుందో సెప్పండి. బొడ్డులో సెయ్యెట్టి ఇప్పిత్తాను. తేడాలొత్తే పీకలు తెగిపోతాయి” అని గర్జించాడు స్వామినాయడు.

మొదట కోనసీమ రావడానికి కారు కావాలన్నాడు శ్రీరాములునాయుడు. బొబ్బర్లంకకి డ్రైవరునిచ్చి కారు పంపిస్తానన్నాడు స్వామినాయుడు.

“రుజువులన్నీ నిర్ధారణ అయ్యేదాకా విషయం బయటికి రావడం మంచిది కాదు. నాకు కొన్ని విషయాలు తెలిశాయి. వచ్చాక తెప్తాను. కోనసీమలో మీరు స్వామి దేవుడు. మీరు కారు పంపితే-వార్త ఆ ప్రాంతమంతా తుపాకీలాగ పేలుతుంది. నాకు మీదికాని కారు కావాలి. మీ డ్రైవరు కూడా అక్కర్లేదు. బొబ్బర్లంక దగ్గర కారు అప్పగించి, దారి చెప్పి మాయమైపోతే చాలు. నేను వస్తాను. వచ్చాక-ఎక్కడ నుంచి డొంక కదలాలో చెప్తాను” అన్నాడు శ్రీరాములునాయుడు.

తాను విన్న శ్రీరాములునాయుడి వ్యవహారదక్షత ఈ కుర్రాడిలో కనిపిస్తోందనుకున్నాడు స్వామినాయుడు. వ్యాపారంలో ఆయువుపట్టుని ముందు ఒడిసి పట్టుకోవాలి. దొరికేదాకా ఉరకకూడదు. జింకపిల్ల మీదకి లంఘించే పులి కూడా మొదటి పట్టుతో జింక మెడని కరుచుకోలేకపోతే వదిలేస్తుంది. ఒడుపు దొరక్కపోతే విసురుగా విదిలించుకునే జింకపిల్ల కొమ్ములు చాలు-పులిని గాయపడేటట్టు చేయడానికి. గాయపడిన పులిని అడవిలో నాలుగు కుంటినక్కలు-దారికాసి కబళిస్తాయి.

అడవిలో జంతువుల ప్రాథమిక జీవన రహస్యం–సభ్యసమాజంలో వ్యాపారదక్షత. వెదికినా ఆచూకీ దొరకని కారుని వెదికి పట్టుకుని, ఏ విధంగానూ తన వరకూ రాని ఓ మనిషినిచ్చి కారుని ఫలానా శ్రీరాములునాయుడు అనే ఆసామీకి అప్పగించి తప్పుకోమని ఏభై రూపాయలు ఇచ్చి పంపాడు.

శ్రీరాములునాయుడు భార్యాబిడ్డతో కలిసి రాజమండ్రిలో దిగి లాంచీల రేపు దగ్గర లాంచీ ఎక్కి బొబ్బర్లంకలో దిగాడు. కొత్త మనిషిని అందరూ వింతగా చూశారు గాని, ఎవరికీ నిజం కొరుకుడు పడలేదు. రేవు దగ్గర ఉన్న ఒక కారు తాళంచెవులు అందుకుని ముగ్గురూ కారెక్కారు. పులిదిండి, ఉచ్చిలి, ఆత్రేయపురం మీదుగా ఓబలంక దాటి, కొత్తపేట గడిచి ముక్కామలవైపు కారు పరుగులు తీస్తోంది.

అప్పుడే తెల్లవారుతోంది.

తెల్లారితే కొత్త వ్యాపారానికి, కొత్త జీవితానికి నాంది.

❖ ❖ ❖

తెల్లారింది. కాని సూర్యుడింకా మబ్బు విడలేదు.

రాత్రి పడిన కుంభవృష్టికి–బాలింతలాగ నీటితో బరువెక్కిన చెట్లు కొమ్మల్ని వంచుకు నిలబడ్డాయి.

తైత్తిరీయంలో బ్రాహ్మణం తృతీయ సవనంలో పది శంఖాలూ పూరిస్తున్నాయి. మత్తుగా కళ్ళిప్పిన ఉదయం కొత్త గొంతుకు పూరించుకున్నట్టుంది.

ఈ వాతావరణం–ఇంత ముగ్ధమోహనమైన పచ్చదనం, పంట కాలువలూ–ఎటు చూసినా ముసురుకున్న పచ్చని కొమ్మల్తో పరుచుకున్న చెట్లూ చూస్తూ–తన తాత ఇంత గొప్ప వాతావరణాన్ని వదిలి ఎందుకు దూరమయ్యాడా అని ఆలోచిస్తూ కారు నడుపుతున్నాడు శ్రీరాములునాయుడు.

దృశ్యాలు మనస్సుని మత్తెక్కిస్తున్నాయి. పక్కన కూర్చున్న భార్య కూడా అంతే ఆనందంలో ఉంది. వెనుకసీటులో లీల హాయిగా నిద్రపోతోంది.

ఆకాశంలో ఇంకా మేఘాలు విడలేదు. రోడ్డుమీద ఇంకా వెలుగు సరిగ్గా వడపోత కాలేదు.

బూరుగు చెట్టుమీద అతి హృద్యంగా వల్లెవేస్తున్న అబ్బుశాస్త్రి ఉన్నట్టుండి–రెండు ద్విత్వాలకు ఊపిరిని బిగించి–మంత్రంలో అనుదాత్తాన్ని కంఠంలో పూరించి–ఒక కొమ్మమీదనుంచి సింహంలాగ మరో కొమ్మమీదికి దూకాడు.

తను వదిలేసిన కొమ్మ కొనవూపిరితో అంతవరకూ చెట్టుని పట్టుకుని ఉందేమో ఆ దూకుడికి కాండంతో ఉన్న సంబంధం తెగి పెళ్ళుమని శబ్దం చేస్తూ ఉన్న పళంగా కిందకి జారింది. ముందు ఆవిష్కరించబోతున్న అద్భుతమైన వ్యాపారాన్ని గురించి ఆలోచిస్తూ, ఆ ప్రాంతపు సౌందర్యాన్ని చూసి పరవశిస్తూ కారు నడుపుతూ ఉన్న శ్రీరాములునాయుడి కారుమీద పెద్ద శబ్దంతో–అతి పెద్ద కొమ్మ పడింది.

మరుక్షణంలో పెద్ద బాంబు పేలిన శబ్దం. స్టీరింగు పట్టుకున్న శ్రీరాములునాయుడు ఊహించని ఉపద్రవానికి చేతిపట్టుని వదిలేశాడు. భార్య గావుకేక పెట్టింది. అతివేగంగా పోతున్న కారు క్షణంలో అదుపు తప్పింది. దారి తప్పి పక్కనే ఉన్న సెప్టోప్లామ్ చెట్టుని భయంకరంగా ఢీకొంది.

మళ్ళీ మరో శబ్దం–ఈసారి కారు ముందుభాగం పేలిన శబ్దం. మరుక్షణంలో శ్రీరాములునాయుడి గుండెలోకి స్టీరింగు దూసుకుంది. భార్య ముఖం నిండా కారు ముందు కిటికీ పగిలిన వందలాది గాజుపెంకులు, కారు ఇంజన్‌లోంచి పొగలు లేచాయి. నెమ్మదిగా పొగ, వేడి కారుని అలుముకుంది. కారు మెల్లగా కాలువలోకి దిగిపోయింది.

స్పృహ తప్పిన–రెండు పెద్ద ప్రాణులు కాలువ నీటిమట్టం దిగువకి జారిపోయాయి. స్పృహ వుంటే గాలికోసం పెనుగులాడేవేమో!

ఆరేళ్ళ లీల ఎవరో కదిపినట్టు లేచింది. కారు వెనుకభాగం–ఒడ్డుకి వంతెన వేసినట్టు నిలిచింది. లీల మెల్లగా కారులోంచి దిగింది. చేతిలో టెడ్డీబేర్‌ని పట్టుకుని–రోడ్డుమీద తీరికగా అడుగులు వేసుకుంటూ ముందుకి నడిచిపోయింది.

## 2

సంప్రదాయపు మూలాలు ఆ జాతి విశ్వాసాల్లో ఉంటాయి. విశ్వాసం మూలాలు ఆ సంస్కృతి పునాదుల్లో ఉంటాయి. సంస్కృతీ మూలాలు వ్యక్తి సంస్కారంలో ఉంటాయి. ఇదొక వలయం. ఎక్కడ ఎప్పుడు ప్రారంభాన్ని గుర్తుపట్టినా అక్కడే ఆ వలయంలో బలహీనత ఉన్నట్టు లెక్క. ఇదొక ప్రవాహం. మధ్యలో కట్టెపుల్లలు, అక్కరలేని, అవసరంలేని వస్తువులూ నిలిచినా దాని ఉనికి బలహీనతే సంప్రదాయ బలానికి గొప్ప మదింపు.

కర్రా వేంకట శ్రీనివాస పెదచయనులు అలాంటి సంప్రదాయ వైభవానికి మేరువులాంటివారు. వారి తాతలకూ, ముత్తాతలకూ తరతరాలుగా ఒక్కటే తెలుసు. వేదాన్ని అభ్యసింపజేయడం. వారి ఇల్లు ఓ పెద్ద విశ్వవిద్యాలయం.

ఎప్పుడో వారి ముత్తాతల కాలంలో చిన నరసింహంగారు కాశీ నుంచి 'ఘన'ని కోనసీమకి తీసుకువచ్చారని చెప్పుకుంటారు. ఆరోజుల్లో–అంటే ధవళేశ్వరం బ్రిడ్జి ఇంకా

రాని రోజుల్లో-వారి ముత్తాతగారు కౌశిక గట్టుకు సూర్యోదయాత్పూర్వమే వెళ్ళిపోయేవారు-గిన్నెడు పెరుగు జోలిలో పెట్టుకుని.

గోదావరిలో బాసింపట్టు వేసుకుని, నీటిమీద పద్మాసనం వేసుకు జపంచేస్తూ అవతలి ఒడ్డుకు వెళ్ళిపోయేవారట. అంగవస్త్రాన్ని గుర్తుపెట్టుకుని ఇసుకతిన్నెమీద పరిచేవారు. మధ్యాహ్నం పెరుగులో నదిలోని ఒండ్రమట్టి కలుపుకు తాగేవారు.

చంద్రశేఖర సరస్వతీ స్వామివారికి ముక్కామల అంటే వేదపీఠం. మహాప్రీతి. అవకాశం దొరికినప్పుడల్లా వేంచేసేవారట. వారి సమక్షంలో చయనులుగారి పెదనాన్నగారు ఓంకార పనస చదివారట-అనర్గళంగా. వారిని ఓంకార ఘనాపాఠి అనేవారు.

1937లలో శ్రీచరణులు కాశీయాత్రను ముగించుకుని ఆంధ్రప్రదేశ్‌కు విచ్చేసి ముక్కామలలో బసచేశారు. దువ్వూరి బాలకృష్ణమూర్తిగారు, దువ్వూరి వెంకటేశ్వర్లుగారు, భమిడిపాటి సోమనాథశాస్త్రిగారు పూర్ణకుంభాలతో స్వామిని ఆహ్వానించారు. అప్పుడు శ్రీవారి అధ్యక్షతన తొమ్మిది రోజులపాటు బ్రహ్మసత్రం జరిగింది. *

భమిడిపాటివారి దొడ్లో ఇప్పటికీ పెద్ద నుయ్యి ఉంది. ఆ నూతి నీళ్ళలో స్నానం చేసినవాళ్ళు గొప్ప పండితులు అయిపోతారని-ఇప్పటికీ ఆ ఊరివారు గర్వంగా చెప్పుకుంటారు. గర్వానికి దక్కిన గొప్ప గౌరవం అది.

ఆ ప్రాంతంలో ఎవరైనా పెదయనులుగారి అరుగుమీద కూర్చుని, వారి శుశ్రూష చేస్తూ వేదం చెప్పుకోవడం ఒక అదృష్టంగా భావిస్తారు. వారి సమక్షంలో వేదం చెప్పుకోవడమే పెద్ద అర్హత. విద్యార్థులంతా-ఇంట్లో బారులుతీర్చి భోజనాలు చేయవలసిందే.

చయనులుగారి భార్య సోమిదేవమ్మ దొడ్డ ఇల్లాలు. అందరి పిల్లలకీ తల్లి అయి నీడపట్టేది. పేరు పేరునా కడుపు తడివి మరీ అన్నం పెట్టేది. శిష్యులంతా ఆ తల్లి చుట్టూ-పందిరిమీదకి పాకిన బీరపాదుకి చుట్టుకున్నట్టు అల్లుకుపోయేవారు.

ఆ ఇంట్లో ఏటి పొడుగునా పండగలే. వైఖానస జయంతి, మతత్రయ ఏకాదశి, కల్కి ఏకాదశి, సంకటహర చతుర్థి-ఇలాగ ఎన్నో ఎన్నెన్నో.

ఇవాళ మినపసున్ని విస్తట్లో వడ్డిస్తే-"ఏమిటోయ్ విశేషం-" అంటూ చయనులుగారు నడుంకి బిగించిన ఉత్తరీయం సడలిస్తే-

"అయ్యో మరిచిపోయారా? కిందటి శ్రావణంలో మన చిట్టిపంతులు ఇవాళ సంహిత పూర్తిచేసి బ్రాహ్మణంలో అడుగుపెట్టిన రోజు" అనేది సోమిదేవమ్మ.

---

*** నీలంరాజు వెంకట శేషయ్యగారి "నడిచే దేవుడు"లో కీ.శే. మండలీక వేంకట శాస్త్రిగారి వ్యాసం.**

చిట్టిపంతులు అనే పదకొండేళ్ల శిష్యుడు ఆర్ద్రతతో కుంచుకుని కుంచుకుని అవిసె పువ్వయిపోయేవాడు. చదువులో అభివృద్ధిని పండుగ చేసుకోవడం మనకేనాడయినా గుర్తుందా?

ఒకసారి కర్ణాటక నుంచి ఇద్దరు విద్యార్థులు ఆరణ్యకంలో అయిదు పన్నాలు సరిచూసుకోడానికి వారి గురువులు పంపగా వచ్చారు.

సోమిదేవమ్మ మండువా లోగిలి ఉత్తరపు అరుగుమీద కందులు దంచుతున్నారు. వల్లెలో శిష్యుల మంత్రం తప్పుదోవ పట్టడం గమనించిన ఆవిడ–"మరోసారి చెప్పుకోండి బాబూ, రెండో సవనంలో మంత్రం దారి తప్పుతోంది. గురువుల దగ్గర మాటపడతారు" అని సవరించేది.

ఎన్నో సంవత్సరాలు–నిజానికి తాను కాపురానికి వచ్చిన దగ్గరనుంచీ–ఎన్నో గొంతులు అనునిత్యం క్రమంతప్పక చదవగా చదవగా విన్న పాఠం–ఆమెకి అలవాటుగా వంటబట్టింది. ఆవిడ ఏ రోజుకారోజు కందులు దంపి, దోరవేపుడు చేసి, కట్టెలపొయ్యిమీద ముద్దపప్పు చేసి, దోసెడు నెయ్యి వేసి అన్నం వడ్డిస్తే–రెండో ముద్దకే ఆవలింతలు వచ్చేవి శిష్యులకి.

గద్వాల నుంచి వచ్చిన కుర్రాళ్ళయితే–కావాలని పదభాగంలో క్రమం తప్పి గురువుగారిచేత తిట్లు తినేవారు.

"అదేంటి బాబూ? రాత్రి బాగానే వల్లెవేశారు కదా! ఎందుకు మాటపడ్డారు?" అని అంటూ సోమిదేవమ్మ బుగ్గలు పొడుచుకుంటే–

"అమ్మా– మీ చేతి ముద్దపప్పు గురువుగారి తిట్లకి గొప్ప ఉపశమనం. మరో రెండు రోజులపాటు తినాలన్న జిహ్వాచాపల్యానికి లొంగిపోయి–మేము పదాన్ని కావాలనే అటకెక్కించాం" అనేవారు శిష్యులు. పిల్లల్ని బుగ్గలు పుణికి ముద్దులాడి–ఆరోజు పప్పులో మరింత వాత్సల్యాన్నీ, మమకారాన్ని కలిపి వడ్డించేది ఆ తల్లి.

చయనులుగారి తండ్రి భోగేశ్వర శర్మగారు నిత్యాగ్నిహోత్రులు. అగ్నిహోత్రం ఆ కుటుంబంలో తరతరాల వారసత్వం. ఓరోజు దక్షిణంవేపు గదిలో హోమం చేస్తూ చేస్తూ పెద్ద కేకపెట్టారు.

"ఒరేయ్! నా పని అయిపోయింది. పెరట్లో దర్భలు పరవండి–త్వరగా" అంటూ పైమీద ఉన్న శాలువాని నడవలోకి విసిరేసి దిగ్గున లేచిపోయారు. పెరట్లో తులసికోటకి ఎదురుగా దర్భలు పరిచారు శిష్యులు. వెళ్ళి – భోజనం కానిచ్చాక విశ్రాంతికి ఉపక్రమించినట్టు దర్భలమీద పడుకుని దేవీ త్రిశతిని ఖంగుమని ప్రారంభించారు శిష్యుల్ని గొంతు కలపమంటూ.

మెల్లగా శిష్యుల కంఠాలలోంచి ఆయన కంఠం జారిపోయింది.

గొంతు బలహీనపడి మెల్లగా ఆగిపోయింది. ఒక్కసారి తేనుపు వచ్చింది. గొంతులోకి మారేడుదళాలు వచ్చి పెదవులమీద నిలిచిపోయాయి. ప్రతిరోజూ దేవుడికి మారేడుదళాలతో పూజచేసి ముందురోజు నిర్మాల్యాన్ని తప్పకుండా నోట్లో వేసుకునేవారు భోగేశ్వర శర్మగారు. ఒక జీవితకాలం స్వామి నిర్మాల్యం వారి కర్మ సంచితాన్ని నిర్మలం చేసింది. శరీరం మారేడుద్రవంతో పునీతమయిపోయింది.

మృత్యువుని గుర్తుపట్టి, ఆహ్వానించి, సిద్ధపడి, చెప్పి శలవు తీసుకున్న తపోధనులు భోగేశ్వర శర్మగారు.

ఆ పరగణాలో ఆయన నిర్యాణాన్ని కథగా చెప్పుకుంటారు. మొదట్లో ఆ కుటుంబానికి 12 ఎకరాల మాగాణీ ఉండేది. క్రమక్రమంగా పొలం కరిగిపోయింది. ఏనాడూ ఏ శుభకార్యానికీ చెయ్యి జాచి అడిగేవారు కారు చయనులుగారు. ఎవరైనా పిలిచినా–వెళ్ళి మనసారా ఆశీర్వదించి–

"పిల్లలు పై ఊళ్ళ నుంచి వచ్చి చదువుకుంటున్నారు. వాళ్ళకి ఉదారంగా ఇవ్వండి" అనేవారు.

పంట కోతలయాక ప్రతీ యేటా–ఎంతో కొంత చయనులుగారి పొలం అమ్మకానికి పెడతారని ఊళ్లో అందరికీ తెలుసు. పెట్టక ఆ ఇల్లు సాగదనీ తెలుసు. కొనేవారికీ మనస్సు ఒప్పేది కాదు. కాని ఎలా? పొలం ధర రూపాయికి రెండు జతచేసి–దొంగలెక్కలు చెప్పి అదనంగా డబ్బు చెల్లించి మనస్సు ఒప్పకపోయినా రాయించుకునేవారు.

ఎప్పుడైనా సోమిదేవమ్మ కాళ్లు పడుతూ "ఇలాగైతే ఎలాగండీ–ఇంటి నిండా పిల్లలు" అంటే చయనులుగారు నవ్వేవారు. "నా ఆస్తి వేదం. నా సంపద నా శిష్యులు" అంటూ కృష్ణయజుర్వేద సంహితలో ఏడవ కాండలో మొదటి అనువాకం చదివేవారు–

"ప్రజాపతి రకామయత ప్రజాయే యేతి సమఖత

స్త్రివృతం నిరమిమీత తమగ్నిర్దేవతా సృసృజ్యత..." అంటూ.

"అమ్మీ, ప్రజాపతి ఈ సృష్టిని మొదలెడుతూ మనల్ని సృష్టించాడు. ఎవడికోసం అన్నం పెడతాడు. నా పని నేను చేస్తున్నాను. నీ పని నువ్వు చెయ్యి. నాన్నలాగే–మనం వెళ్లేనాటికి ఆకాశం నుంచి పూలరథం వస్తుంది" అనేవారు.

సంప్రదాయం ఇచ్చిన అహంకారం అది. దేవుడు చెయ్యి జాచాక బలిచక్రవర్తికి భయమేముంది? ఇచ్చేవాడే కావాలంటున్నాడు. ఇచ్చే అర్హతనిచ్చి, ఇవ్వాలనే మనస్సునీ ఇచ్చాడు.

"ఇవ్వవా? అని చెయ్యి జాపాడు. ఏం గడుసుదనమయ్యా? నువ్వు నన్ను చేసి మళ్లీ నన్ను నిన్ను చేసుకోవాలని చూస్తున్నావా? తీసుకో నీకేం కావాలో?" అని పొగరుగా అన్నాడు. అందుకే యుగాలు గడిచినా పాతాళంలో బలిచక్రవర్తి ముందు భగవంతుడి ఊడిగం.

ఇది కథ అయినా, ఐతిహ్యమయినా, పురాణమయినా మించిపోయింది ఏమీ లేదు. ఇది వితరణకి పట్టాభిషేకం. తనకున్నది ఇవ్వడంలో గర్వం ఉంది. తనకి ఏమీ మిగలకుండా ఇవ్వడంలో ఉదాత్తత ఉంది. లేనిది దోచుకునే నేటి తరం ఉన్నది ఇచ్చుకునే ఆ తరం నుంచి ఎంతగా పతనమవుతోంది నానాటికీ!

❖ ❖ ❖

ఉదయమే బ్రహ్మముహూర్తానికి శిష్యులంతా లేస్తారు–దక్షిణామూర్తి శ్లోకాలు చదువుకుంటూ.

స్నానాదికాలు ముగించుకుని అగ్నిహోత్రానికి ఉపక్రమిస్తారు. తర్వాత ఋషి రుణం తీర్చుకోవాలి. అంటే ఋషుల ద్వారా ఈ ఆర్షభూమిలో అందిన సంపదని వారికి విన్నవించడం. ముందురోజు చదువుకున్న పన్నాని అప్పగిస్తారు. తర్వాత ఋషితర్పణం. తర్వాత చద్దన్నం. ముందురోజు పప్పుపులుసో, మిరపకాయో, ఆవకాయో నంచుకు తినడం. ఏడున్నరకి సభ తీరుస్తారు. గురువుగారితో కలిసి చదివేది సంత. తనకి తాను మననం చేసుకునేది వల్లె. గురువుగారికి తిరిగి అప్పగించేది ఆవృత్తి. కృష్ణయజుర్వేదంలో సంహిత వికృతిపాఠంలో పదం, క్రమం అయ్యేసరికే సంవత్సరాలు గడిచిపోతాయి. తర్వాత పరాయితం, ఆరణ్యకం.

ఒక పన్నం పదిరోజులు సంత చెప్పుకోవాలి. దాన్ని దృఢం చేసుకోడానికి మరో పదిరోజులు వల్లె. మిగతా నెలంతా ఏకరువు. ఇలా ఒక్క సంహితకే మూడు సంవత్సరాలు పడుతుంది. రెండో దశలో ఈ సంహితలో 44 పన్నాలకీ గొలుసుకట్టులాగ పదం ఉంటుంది. శిష్యుడి ధారణనుబట్టి పదభాగం ఒక్కటీ సంవత్సరన్నర అధ్యయనం.

రాతలూ, అక్షరాలూ, కాగితాలూ లేని రోజుల్లో–ఊహించనైనా ఊహించలేని వేల సంవత్సరాల కిందటి ఈ సంపదని అపౌరుషేయాలుగా అప్పటి ఋషులు ఇన్ని తరాలపాటు ఎలా కాపాడుతూ అక్షరం పొల్లు పోకుండా ప్రవచించే మార్గాన్ని కనిపెట్టారు! అయినా కాలగర్భంలో కొంత సంపద లుప్తమైపోయింది. ఇప్పుడు ఉన్నదాన్ని మిగుల్చుకుని కాపాడుకోగలిగే సాధనాలు సమకూరాయి. అయితే ఇప్పటి దరిద్రం–సమాజం విశ్వాసం. ప్రపంచంలోకల్లా అతి పురాతనమైన matrix వేదం. ఇది శృతి. కేవలం నోటి ద్వారా వేల సంవత్సరాలు నిలుపుకున్న సంపద. ఎన్ని గొలుసులతో ఒక్కో సూత్రాన్ని

సంధించి–మానవ సహజమైన మరుపు, జ్ఞాపకశక్తి లేమి, అవగాహన లేమి, శిష్యుడి అసమర్థత, పరాకు–వీటన్నిటినీ పరిగణనలోకి తీసుకుని, వీటన్నిటినీ దాటి నిలవగల ప్రణాళికాబద్ధం చేసిన అనూహ్యమైన శిల్పం వేదంలో కనిపిస్తుంది.

ఈ మాట విషయానికి సంబంధించి అంటున్న మాట కాదు. శాస్త్రాన్ని బతికించడానికి ఆనాటి ఋషులు నిక్షిప్తం చేసిన ప్రణాళిక మాట. మళ్ళీ దీన్ని విప్పడానికి సాధనాలు కావాలి. అందుకని అనుబంధ విద్యలన్నీ అవసరమయ్యాయి. శిక్ష, వ్యాకరణం, ఛందస్సు, జ్యోతిషం, నిరుక్తం, కల్పం–అన్నిటికన్నా సంస్కృత కావ్యాలూ–ఇన్నీ అవసరం. సంస్క ృతం అతిహృద్యమైన, సున్నితమైన సూక్ష్మాతి సూక్ష్మమైన కారణాలకి అర్థాన్ని విభేదించగల భాష. సముద్రమంత లోతైనది. చిన్న శబ్దం మారితే అర్థం మారిపోతుంది. పలకడంలో బద్ధకిస్తే కొత్త అర్థం పుట్టుకొస్తుంది. స్వరంలో తేడా వస్తే ఉద్దేశమే వేరైపోతుంది.

అతి సామాన్య ఉదాహరణ: శివ అంటే స్వామి. శివా అంటే అమ్మవారు.

తన శత్రువైన ఇంద్రుడిని సంహరించే కొడుకు పుట్టాలని త్వష్ట అనే అసురుడు తపస్సు చేశాడు.

“ఇంద్ర శత్రుః వర్ధస్వ” అని సంకల్పం చెప్పుకున్నాడు. సంస్క ృతం స్వర ప్రధానమైన భాష. కేవలం ఉచ్చారణలోనే బీజాక్షరాలు ప్రాణశక్తిని పరిపుష్టం చేస్తాయి. ఈ సంకల్పంలో చివరిలో నొక్కి పలికితే (అంత్యోదాత్తము) “ఇంద్రుడిని పరిమార్చువాడు ఉద్భవించి, వర్ధిల్లును” అని అర్థం.

కాని ముందు వత్తి పలికితే (ఆద్యోదాత్తము) “ఇంద్రునిచే నాశనము పొందువాడు ఉద్భవించును” అని అర్థం వచ్చింది. ఫలితంగా వృత్రాసురుడు జన్మించి ఇంద్రుని చేతిలో హతమయ్యాడు.

సంస్కృత భాషలో ప్రతి అక్షరానికీ అర్థం ఉంది. పలికే ప్రతి శబ్దానికీ అర్థం ఉంది. ప్రతి అపశబ్దమూ విపర్యయం అయ్యే ప్రమాదమూ ఉంది. సంస్కృతం జీవభాష. ఆరోగ్యం నుంచి ఆముష్మికం వరకూ వంతెనలు నిర్మించగల విస్తృతి గల, సమగ్రమైన భాష.

ఈ మెలకువల్ని, అర్థాన్ని, ప్రణాళికని, ధారనీ–నిరంతర స్రోతస్వినిగా కాపాడుకున్న సంస్క ృతి మరెక్కడైనా ఉందా? స్త్రీకి రుతు దోషం ఉంది. కాని స్త్రీ మూలవిరాట్టు. అమ్మ. ఆమె లేనిదే ఈ సృష్టే లేదు. అయితే ఆ ఒక్క కారణానికే వేదాన్ని ఆడపిల్లకి చెప్పకూడదన్నారు. మరి తెలిసో తెలియకో గుర్తొస్తే? పాపం లేదు. మననం చేస్తే తప్పు. ఇప్పుడు కాలం మారిపోతోంది కదా? మాకూ హక్కులు ఉన్నాయని వారంటే? ఎవరు కాదంటారు? తండ్రి ముందు చుట్ట కాలిస్తే తండ్రి ఆత్మహత్య చేసుకోడు. కొడుకుని

ఉరితీయడు. ఒక సంప్రదాయం చచ్చిపోతుంది. సమాజ మర్యాదకి ఆంక్షలు లేవు. గురువుని కత్తితో పొడిచే శిష్యపుంగవుల కథల్ని మనం వింటున్నాం కదా? మళ్ళీ ఈ అధ్యాయం మొదటి పేరాలో మొదటి వాక్యం దగ్గర ఈ మీమాంస ఆగుతుంది.

"సంప్రదాయపు మూలాలు ఆ జాతి విశ్వాసాలలో ఉంటాయి" ఆ విశ్వాసాలు అనుసరణలో వ్యక్తమౌతాయి. ఇది అనుశృతం". గురువుల ఇళ్ళలో ఉండలేని శిష్యులు పాఠం అయ్యాక ఇంటింటికీ వెళ్ళి ఉంఛవృత్తి చేసుకుంటారు.

మధ్యాహ్నం పంచకావ్యాలూ–రఘువంశం, మేఘసందేశం, కుమార సంభవం వగైరా. శబ్దమంజరి, అమరం, శబ్దాలు, ధాతువులు–తర్వాత్తర్వాత నాగర లిపి కూడా నేర్పడం ప్రారంభించారు. వేదం–ఇటీవలి రోజుల్లో క్రమంగా లిపిబద్ధమైంది కనుక. చిన్న విరామం తర్వాత మళ్ళీ గురువుల పాఠం. సాయంత్రం మళ్ళీ స్నానం, సంధ్యావందనం, అగ్నికార్యం, ఒక పన్నా ఆవృత్తి. తర్వాత నిద్ర.

ఇదేమిటి? మరి జన్మ ఎత్తినందుకు తాను తరించే మార్గాన్ని వెతుక్కోవాలి కదా? ఆధ్యాత్మికచింతనో, దైవప్రార్థనో, తపస్సో ఏదో ఒకటి చెయ్యాలి కదా? నిరంతరం ఇదే వ్యాపకమా?

'నియంత కురు కర్మత్వం' అని చెప్పనే చెప్పాడు గీతాచార్యుడు.

కాక "స్వాధ్యాయ ప్రవచనే ఏవేతి నాకో మౌద్గల్యః, తద్ధి తపస్తద్ధితపః" అని తైత్తిరీయ ఉపనిషత్తు చెప్తుంది.

వేదాన్ని ప్రవచించినవారు–ఎవరు తాను చదువుకుని ఇంకొకరికి నేర్పుతారో–అదే తపస్సు. ఈ జాతి ఆర్షధర్మాన్ని నిరంతరంగా సాగడానికి తనూ ఒక గొలుసు కావడమే తపస్సు. జీవన ధ్యేయం.

చయనులుగారి దగ్గర తమ పిల్లల్ని విడిచిపెట్టడానికి తల్లిదండ్రులు తపస్సు చేస్తూంటారు. తీరా చేరిన తర్వాత వారు ఆ కుటుంబంలో భాగమైపోతారు. చయనులుగారింట్లో వేదానికి చేరడం–ఈనాడు ప్రతీ కుటుంబం తమ పిల్లల్ని అమెరికాలో ఉంటున్నారని చెప్పుకున్నంత గర్వకారణం.

"వారబ్బాయి చయనులుగారి దగ్గర వేదం చెప్పుకుంటున్నాడు"

"పూర్వజన్మ సుకృతం. తరించిపోతాడు. తరాల్ని తరింపజేస్తాడు"

అంటే తండ్రి హృదయం ఆకాశం అంత ఎత్తు పొంగుతుంది.

ఇరుసుమండ, వద్దిపర్రు, కోరుమిల్లి, నందంపూడి, పుల్లేటికుర్రు–ఇంకా ఇరగవరం, కవిటం నుంచి కూడా తల్లిదండ్రులు తరలివచ్చి, చయనులుగారి ముందు

ప్రవర చెప్పుకుని, దంపతులకి బట్టలు పెట్టి, వటువుతో సాష్టాంగం చేయించి, తామూ చేసి అరుగుముందు కూర్చుని వీధిలోంచే రెండు పాఠాలు విని మరీ పారవశ్యంతో ఇళ్లకు మరలుతారు.

ఓరోజు చయనులుగారింట్లో ఓ విచిత్రం జరిగింది. తెల్లవారుఝామునే బ్రహ్మ ముహూర్తంలో–వీధి అరుగుమీదనుంచి పసిపిల్లాడి ఏడుపు వినిపించింది. అందరూ గతుక్కుమని లేచారు. అరుగుమీద–పొత్తిళ్లలో రోజుల పిల్లాడు ఏడుస్తున్నాడు. నాలుగైదు పౌన్ల మాంసపు ముద్ద. సోమిదేవమ్మని చూడగానే ఏడుపు ఆగిపోయింది.

జన్మాంతరబంధమా? ఆ తల్లికి బొటబొటా కళ్లనీళ్లు కారాయి. బిడ్డని అక్కున చేర్చుకుంది. అలా మరో పురిటిగుడ్డు వేదాలయంలోకి వచ్చి చేరాడు. ఎవరీ బిడ్డ? కులాంతర జననమా? పేదరికంవల్ల వదులుకున్న బాంధవ్యమా? లేక చయనులుగారింటికి పుట్టుకతోనే చేర్చాలన్న ప్రలోభంతో చేసిన పన్నాగమా? ఏమో తెలియదు.

తెలుసుకోవాలని ఎవరూ ప్రయత్నించలేదు. శిష్యులకి ఇదో పెద్ద ఆటవిడుపు. అందరూ ఆ పసిగుడ్డుకి తోడబుట్టినవాళ్లు అయిపోయారు. మంచి ముహూర్తం చూసి షట్కర్మలూ చేయిద్దామన్నారు చయనులుగారు. ఎప్పుడు పుట్టాడో తెలీదు కదా? 11వ రోజు ఎలా గుర్తుపట్టడం? కుర్రాళ్లంతా బారసాలదాకా ఆగలేదు. అందరూ సంస్కృతం, వేదం చదువుకుంటున్నవాళ్లే. అనుకోకుండా అబ్బినవాడు కదా? అంటే ప్రాప్తించినవాడు. కనుక వాడిని 'అబ్బి' అన్నారు. పేరుకి ముద్దు కలిస్తే అబ్బిలు అయ్యాడు. పది గొంతుల్లో వందసార్లు తడిసిన ఆ పేరు రుచిమరిగి, స్థిరపడిపోయింది.

చయనులుగారు నవ్వుకున్నారు–వీడు 'అబ్బిలే!' అంటూ జాతకర్మ చేసి, బియ్యంలో పసుపుకొమ్ముతో 'అబ్బిశాస్త్రి' అంటూ ఆ పేరుని లౌకికం చేశారు. అన్నప్రాశన, చౌలం–అంటే చెవులు కుట్టడం–అన్నీ యథావిధిగా జరిపారు.

కుర్రాడు పెరుగుతున్నకొద్దీ సోమిదేవమ్మకి చిన్న బెంగ పట్టుకుంది. శరీరం గట్టిపడి, చూపు నిలిచి, మాటలు రావడం మొదలెట్టాక కుర్రాడి నాలుక మడతపడడం గమనించింది. భర్త దృష్టికి ఆ విషయాన్ని తెచ్చింది. గమనించారా? అబ్బికి చిన్న నత్తి ఉందని.

చయనులుగారూ మనస్సులో కాస్త నొచ్చుకున్నారు. "అయ్యో. బ్రాహ్మడయివుండీ కనీసం గాయత్రినైనా చెప్పుకోలేడా? అని. కుర్రాడికి ఇంకా ఉపనయనం చెయ్యలేదు.

ఒకరోజు దగ్గర కూర్చోపెట్టుకుని అక్షరాలన్నీ అనిపించారు. అబ్బి గొంతులో కంఠ్యాలు (అ,ఆ,క,ఖ,గ,ఘ,హ) పలుకుతున్నాయి.

తాలవ్యాలు (ఇ,ఈ,చ,ఛ వగైరా) పలుకుతున్నాయి. కాని దంత్యాలు (త,థ,ద,ధ

వగైరా) పలకడంలేదు. నాలుక లొంగడంలేదు. అయ్యో! అనుకున్నారు. గాయత్రీ మంత్రంలోనే మూడుచోట్ల దంత్యాలున్నాయి-తత్, సవితృ, భర్గోదేవ... మరి ఎలా? ఉపనయనానికి ముందు ప్రతిరోజూ తనతోపాటు కాలువకి తీసుకెళ్లి సాధన చేయించారు. ఏడేళ్ల అబ్బు-గురువుగారు చెప్పినదల్లా తు.చ. తప్పకుండా చేశాడు.

అబ్బుకి గర్భాష్టమాన చయనులుగారు, సోమిదేవమ్మ పీటలమీద కూర్చున్నారు. తండ్రీ, గురువూ అబ్బుకి చయనులుగారే. కొత్త పంచె తలమీద కప్పి మంత్రోపదేశం-గాయత్రిని చెవిలో చెప్పారు. శారీరకమైన అశక్తతని, తండ్రీ, గురువు మీద భక్తి జయించింది. అబ్బు అనే వటువు-తండ్రి చేసే మంత్రోపదేశానికి-అతిశ్రద్ధాళువైన భక్తుడైపోయాడు. శరీరంలో శక్తినంతా పూరించాడు. సవితృ మండలం కరుణించింది. గాయత్రీదేవి ఆశీర్వదించింది. పుట్టాక మొదటిసారి దంత్యాల చెలియలికట్ట దాటాడు. మననం చేయాల్సిన గాయత్రీమంత్రం సాక్షాత్కరించింది. సోమిదేవమ్మ వటువు శిరస్సుమీద ముద్దుల వర్షం కురిపించింది.

చయనులుగారి కళ్లలో నీళ్లు తిరిగాయి. గాయత్రీదేవి తలుచుకుంటే ఏది అసాధ్యం? ఆయనది అబ్బురం కాదు. అనురక్తి. అబ్బు అమ్మ ఒడిలో తలదూర్చి ఏరు అయిపోయాడు.

ఆటవికుడికి-కాళిదాసుకి అమ్మ కటాక్షం ఉంటే-ప్రపంచ సాహిత్యం ఎన్నడూ కనీవినీ ఎరుగని 'శ్యామలా దండకం' అవతరించింది. మూగవాడిని తల్లి కరుణిస్తే-మూకపంచశతి-వాక్కుగా ప్రవహించింది.

గాయత్రీదేవి కరుణించిన బ్రహ్మోపదేశం విశ్వరూపం దాల్చింది. తదాదిగా మూడు సంధ్యల్ని ముప్ఫై సంధ్యలు చేసి గాయత్రిని ప్రసన్నం చేసుకున్నాడు అబ్బు. వాడి పట్టుదలకి తోటి విద్యార్థులంతా ఆశ్చర్యపోయారు.

వాళ్లది కేవలం అధ్యయనం. అబ్బుది ఉపాసన. సరస్వతీ సాక్షాత్కారం. చయనులుగారు ఇక ఆగలేదు. సందేహించలేదు. శ్రావణ పున్నమినాడు ఉపాకర్మని జరిపించారు. అంటే ఒడుగులో వేసిన కృష్ణాజినాన్ని విడిచిపెట్టి, నూతన యజ్ఞోపవీతధారణ చేయించి-నాలుగు వేదాలూ స్థాలీపులాక న్యాయంగా అనిపించి ఏ పాఠం వటువుకి బాగా పట్టుబడుతుందో అది అతనిచేత అనిపించి నిర్ణయిస్తారు. కంఠాన్నిబట్టి, స్వచ్ఛతనుబట్టి, స్వరాన్నిబట్టి మంత్రానికి బలం. కంఠం మూడు సవనాల్లో శంఖాన్ని పూరించాల్సిన దేవదత్తం. మూడు రోజుల తరువాత హోమాలు జరిపించి తండ్రి గురువుకి విద్యార్థిని అప్పగిస్తాడు.

అంటే (చయనులుగారు తనకు తానే) అబ్బుశాస్త్రిని అప్పగించుకున్నారు. సోమిదేవమ్మ ఆరోజు బిడ్డలందరికీ పాయసం వడ్డించింది.

అబ్బుశాస్త్రి ధారణకి సహచరులంతా విస్తుపోయారు. అందర్లోకీ చిన్నవాడు కావడం, తన ఒళ్ళో పెరగడంవల్ల సోమిదేవమ్మకి అబ్బు అంటే కాస్త ప్రీతి ఎక్కువ. పంక్తిలో అందరికీ అన్నం వడ్డించి ఒక్క పులుసుముక్క అబ్బు విస్తట్లో జారేసేది. చయనులుగారు చూసి ఓసారి మందలించారు–

"అమ్మీ. అది దోషం" అంటూ.

"తల్లికి చిన్నవాడిమీద మక్కువ ఉండడం ఆక్షేపణ ఎలా అవుతుంది?" అంది సోమిదేవమ్మ.

అప్పుడు పాణిని కథ చెప్పారు చయనులుగారు. శాస్త్రానికి 'సిద్ధాంత కౌముది'ని ప్రసాదించిన సాక్షాత్తూ శివాంశ పాణిని. కాని గురువుగారి దగ్గర చాలా మేదకుడిగా ఉండేవాడట. గురుపత్నికి అతనంటే మక్కువ. పాణిని ఆమెకి అబ్బు. ఓసారి గురువుగారు పాణినిని పొలంలో నీరు పెట్టమన్నారు.

పెడుతూండగానే కుండపోతగా వర్షం కురిసి గట్టు తెగిపోయింది. ఒంటరిగా ఉన్న వటువుకి ఏం చెయ్యాలో తోచలేదు. ప్రవాహం రానురాను ఎక్కువవుతోంది. పక్క పొలాలు తడిసిపోతున్నాయి. గత్యంతరంలేక గండిపడిన చోట రెండు గట్లకీ కాళ్ళు ఎగదన్ని తనే పడుకున్నాడట. కాస్సేపటికి వర్షం తగ్గింది. నీటి ఉధృతీ తగ్గింది. కాని మునకలో స్పృహ తప్పిపోయాడు పాణిని. మిగతా శిష్యులు ఆలస్యంగా వచ్చి చూసి స్పృహ లేని విద్యార్థిని మోసుకొచ్చారు.

గురువుగారు గతుక్కుమన్నారు. గురుపత్ని భోరుమంది.

క్రమంగా పాణిని తేరుకున్నాడు కాని విద్యలో మాత్రం చురుకుదనం రాలేదు.

ప్రతిరోజూ గురుపత్ని భర్తతో పోరేది–"ఆచిన్నవాడికి నాలుగు ముక్కలు చెప్పరాదా?" అని, వాడికి బుద్ధిమాంద్యం అని తప్పుకునేవారు గురువు.

ఆమె విడిచిపెట్టక–భర్తకి దివారాత్రాలూ సపర్యలు చేసి ఆయనను మెప్పించి పాణినికి విద్యాదానం చెయ్యమని భర్తని వరం కోరుకుంది.

గురువుగారు ప్రసన్నులయ్యారు. ఓ సుముహూర్తాన నడుంలోతు నీళ్ళలో శిష్యుడిని నిలబెట్టి శివచింతామణి విద్యని ఇచ్చారు.

అంతే. పాణిని పుంజుకున్నాడు. సరస్వతి ప్రసన్నమైంది. అలా ఎన్నేళ్ళు? 12 సంవత్సరాలు.

శంకరుడు సాక్షాత్కరించి 'ఏం కావాలి?' అని అడిగాడు. పాణిని నమస్కరించి "విద్య స్వామీ" అని అన్నాడు.

శివుడు నవ్వి "నేను డమరుకం వాయిస్తాను. శబ్దాన్ని గ్రహించు" అన్నాడు. సృష్టిలో అంతకన్నా గొప్ప గురువు ఎక్కడ దొరుకుతాడు? శివుడి ముఖతః-డమరుకం సాక్షిగా-జాతికి శివశక్తుల బీజాలతో పద్నాలుగు సూత్రాలను ప్రతిపాదించాడు పాణిని తన 'సిద్ధాంత కౌముది'లో. ఆనాటికీ ఈనాటికీ శాస్త్రానికి ఇదే ప్రమాణం.

సోమిదేవమ్మ ఈ కథ విని పొంగిపోయింది. భర్తలోనే అపరశివుడిని దర్శించుకుంది. అబ్బు-ఏనాడైనా పాణినిలో ఏ చిన్న అంశ అయినా కాగలడా?

## 3

కారు చెట్టుకి ఢీకొనగానే పేలిన శబ్దం చుట్టుపక్కల గ్రామాలన్నింటిలోనూ మారుమ్రోగింది. అందరూ ఆ శబ్దం వచ్చినవైపుకి పరుగులుతీశారు. హఠాత్తుగా జరిగిన విపత్తుకి బూరుగ, సెప్టోప్లామ్‌లు అవాక్కయిపోయాయి.

వేదం నిలిచిపోయింది. తాను దూకిన కారణంగా కొమ్మ విరిగి కారుమీద పడడం, ఆ కారణంగా కారు అదుపుతప్పి చెట్టుకి ఢీకొనడం స్పష్టంగా చూసిన అబ్బుశాస్త్రి స్తంభించిపోయాడు.

వారు చూస్తుండగానే కారులోంచి పొగలు లేచి, క్రమంగా మంటలు ప్రారంభమై, కారుని కమ్ముకోవడం, క్రమక్రమంగా కాలువలోకి జారిపోవడం చూశాడు. మరొక్కటి-ఒక్క అబ్బుశాస్త్రి మాత్రమే చూశాడు.

ఆరేళ్ళ పసిపాప-కారులోంచి దిగి దూరంగా నడిచి వెళ్లిపోయింది.

ఎక్కడికి? ఎందుకు? మిగతా అందరి దృష్టీ కారుమీదే ఉంది.

చుట్టుపక్కల ఊళ్లనుంచి అంతా వచ్చేసరికి జరగవలసినదంతా జరిగిపోయింది. ఏం జరిగిందో, ఎందుకు జరిగిందో ఎవరికీ తెలీదు.

పర్యవసాన్ని మాత్రం చూశారు. చూసిన, చెప్పగలిగిన ఒకే ఒక్క వ్యక్తి-అబ్బుశాస్త్రి. ఆ తర్వాత కొన్ని సంవత్సరాలపాటు చెప్పలేని స్థితిలో ఉండిపోయాడు. అది విచిత్రమైన, అనూహ్యమైన మలుపు.

పోలీసులకి కబురు వెళ్లింది. మధ్యాహ్నానికి రెండు శవాల్ని నీళ్లలోంచి తీశారు. కారు ముందుభాగం, అందులో ఉన్న వ్యక్తులతోసహా కాలి, నీటిలో నాని నామరూపాలు లేకుండాపోయింది.

అందులో ఉన్న వ్యక్తులెవరు? ఎక్కడినుంచి వచ్చారు? కారు ఎవరు తెచ్చారు? ఏ పనిమీద వచ్చారు?

ఎవరూ ఏమీ చెప్పలేకపోయారు. శ్రీరాములునాయుడు వ్యాపారదక్షతతో వేసిన

ముసుగు-వారిని గుర్తుపట్టడానికే అసాధ్యమైన తెరలు దించింది.

అబ్బు, బ్రహ్మదేవుడు, సర్వమంగళం-అంతా కాలువకి దూరంగా కూర్చున్నారు. ఆరోజు అగ్నికార్యం లేదు. పాఠం లేదు. ఎవరూ దేని గురించీ ఆలోచించడంలేదు. కుర్రాళ్లు గుర్తుపట్టని విషయం ఏమిటంటే- అబ్బు అక్కడ ఉన్నాడేకాని నోరు పెగలని అపస్మారంలో ఉన్నాడు. ఎవరూ ప్రత్యేకంగా అతన్ని గమనించలేదు.

కళ్లముందు అనూహ్యమైన సంఘటన జరిగిపోయింది. అందరూ ఏదోవిధంగా షాక్‌లోనే ఉన్నారు. సలాది స్వామినాయుడుగారికి తెలిసేసరికి మర్నాడు చీకటిపడింది. శ్రీరాములునాయుడిని గుర్తుచేసుకుంటూనే ఉన్నాడు. కబురుకోసం ఎదురుచూస్తున్నారు.

సాయంకాలానికి ఎవరో యాక్సిడెంటు వార్తని తెచ్చారు. ఆయనా గతుక్కుమన్నాడు. హుటాహుటిన అక్కడికి చేరారు. అక్కడ కన్ను మూసిందెవరో తనకి తెలుసు (విచిత్రంగా పసిబిడ్డ సంగతి అతనికీ తెలీదు).

ఐతే ఎవరిని కలవడానికి వచ్చాడు? ఏం చెయ్యాలని వచ్చాడు? తనకీ తెలీదు. తీగె లాగితే డొంక కదులుతుంది. కాని ఆ డొంక ఏమిటో ఎవరికీ తెలీదు.

సాయంకాలానికి రెండు శవాలూ పోలీస్ స్టేషన్‌కి చేరాయి. అక్కడ శవాల్ని ఉంచే ఏర్పాట్లు లేవు. శవాల చుట్టూ ఐసు వేసి కాపాడారు. కనిపించనివాళ్ళు చెప్పిన, తెలిసిన కథని పంచనామా చేసి రాసుకున్నారు పోలీసులు. యాక్సిడెంటు గురించి, శవాల గురించి పేపర్లో ప్రకటన ఇచ్చారు. కానీ ఎవరూ తమని కలుసుకోలేదు.

అనాథ శవాల్ని మూడు రోజులు ఉంచి, తర్వాత అంత్యక్రియలు జరిపారు. ఎక్కడైతే తాత శ్రీరాములునాయుడు ఒక సామ్రాజ్యాన్ని స్థాపించి వ్యాపారం నడిపాడో-అక్కడికి రావడానికి మనవడికి వేళ మించిపోయింది. కాగా వచ్చింది ఫలానా అని కూడా తెలియని అజ్ఞాతపు ముగింపు ఆ జీవితానికి.

ఈ సంఘటన భయంకరమైన ప్రభావాన్ని చూపింది అబ్బు శాస్త్రిమీద. దారుణంగా, అనూహ్యంగా తన కళ్ళముందు-తన కారణంగా జరిగిన ఆ భయంకరమైన దుర్ఘటన-అతని మెదడును సమూలంగా చిత్రవధ చేసింది. ఆ క్షణంనుంచి అతను అతనుగా లేదు. బయట ప్రపంచానికి దూరమై కేవలం స్థాణువుగా మిగిలాడు. పదమూడేళ్ల కుర్రాడి మనస్సు అంత ఉధృతానికి సిద్ధంగా లేదు. ఈ అనర్థం తన కారణంగా జరిగింది. ధారణలో, ప్రతిభలో, చిత్తశుద్ధిలో సాటివారికంటే మిన్నగా నిలపగల శక్తిసామర్థ్యాలు గల మెదడుకి హఠాత్తుగా షాక్ తగిలితే ఏమవుతుంది? స్తంభించిపోతుంది. అదే అయింది అబ్బు విషయంలో. తెలియని అపస్మారంలోకి మెదడు జారిపోయింది. చలనంలేని కట్టెగా మారిపోయాడు.

సాయంకాలానికి ఒళ్లు మరిగిపోయేంత జ్వరం. మెదడుని తాకిన షాక్‌ని జీర్ణించుకోడానికి శరీరం చేస్తున్న పోరాటానికి చిహ్నమది. చివరికి శరీరం ఓడిపోయింది. అంత పెద్ద అగ్నిపర్వతాన్నించి అతని స్వస్థతని కాపాడడానికి ఆ శరీరానికి శక్తి చాలదు. మిగతా పిల్లలందరూ ఎన్నడూ చూడని ఉపద్రవానికి నివ్వెరపోయారు. వారి స్పందన అంతవరకే. కానీ అబ్బు స్థితి వారినందరినీ ఆశ్చర్యపరిచింది.

సోమిదేవమ్మ కేవలం కట్టెగా మిగిలిన అబ్బుని కరుచుకుని గుండెల్లో పొదువుకుంది. కానీ ఎవ్వరూ చేయగలిగింది ఏమీ లేదు. మనస్సులోకి ఎక్కించే అతి అమూల్యమైన కృషి చేస్తున్న ఆ తరానికి–తమ శరీరం తట్టుకోలేనంత 'ఆవేశం' లేదా షాక్ తగిలితే ఏమౌతుంది? అదే అయింది అబ్బుకి.

వారాలు, నెలలూ గడిచిపోతున్నాయి. అబ్బు కోలుకోలేదు. ఆయుర్వేద వైద్యుడు వచ్చి ఆనుపానులు చెప్తూనే ఉన్నాడు. మందులు ఇస్తూనే ఉన్నాడు. కానీ చికిత్స శరీరానికి కాదు మెదడుకి జరగాలి. ఆ పరికరాలు అక్కడెవరికీ లేవు. కాగా ఏం చెయ్యాలో ఎవరికీ అంతుబట్టలేదు.

ఓ రాత్రి ఉన్నట్టుండి అబ్బు గొంతు విని ఇంటిల్లిపాదీ తుళ్లిపడి లేచారు. అందరూ అబ్బు దగ్గరకి పరుగున వచ్చారు–చయనులుగారితో సహా. అబ్బు కళ్లు మూసుకునే ఉన్నాయి. పెదాలు కదులుతున్నాయి–కాస్త అస్పష్టంగా. ఏమంటున్నాడు? సహచరులు చెవులు రిక్కించారు.

సర్వమంగళం అబ్బు నోటిదగ్గరే చెవిని చేర్చాడు. బలహీనంగా అబ్బు గొంతు – ఉదాత్త అనుదాత్తాలు చెడకుండా ఏదో మంత్రాన్ని చెబుతోంది.

"సమిథో యజతి వసంత మేవర్తునా మవరుంధే" ఏదో గజిబిజి అయిన జ్ఞాపకం. ఎవరికీ అర్థం కాలేదు.

ఒక్కటిమాత్రం తెలిసివచ్చింది. అబ్బు మెదడులో ఏదో ప్లేన్‌లో ఆలోచనలు కదులుతున్నాయా? మళ్లీ పెదాలు కూడదీసుకుంటున్నాయి. విన్నారు.

"అశ్వన్నూర్జం పర్వతే శి్శ్రీయాణాం వాతే పర్జన్యే"

ఇదేమిటి? రెంటికీ బొత్తిగా సంబంధం లేదు. మనస్సు ఏవో ఆలోచనల్ని ఏరుకుంటోంది. ఎందుకు? అబ్బుకి స్పృహ వస్తోందా? ఈ లోకంలో పడుతున్నాడా? అబ్బు ఇంకా అపస్మారంలోనే ఉన్నాడు.

అలా నెలలు గడిచిపోయాయి. సంవత్సరమూ దొర్లిపోయింది. బ్రహ్మదేవుడూ, సర్వమంగళం అంతా ఏడ్చేశారు. సోమిదేవమ్మయితే మూర్తీభవించిన శోకదేవతే అయిపోయింది.

చయనులుగారు రుత్విక్కులను రప్పించి నట్టింట మృత్యుంజయ హోమం, నవచండీ హోమం చేయించారు. గురువుగారి పాఠంలో పరాకు తెలిసివచ్చింది. నిత్యాగ్నిహోత్రి నీరసపడి నిస్సహాయుడైన తండ్రి మిగిలాడు. సహచరులంతా ఆ కాలంలో అబ్బు శాస్త్రికి పరిచర్యలు చేసే పదిమంది తల్లులయ్యారు.

ఎప్పుడైనా అబ్బు నోటివెంట వచ్చినా రెండే మంత్రాలు–

"సమిధో యజతి వసంత మేవర్తూనా మవరుంధే"

మెదడు ఏదో హింసని అనుభవిస్తోంది. మెల్లగా మరో మంత్రం–

"అశ్మన్నూర్జం పర్వతే శ్రిశ్రీయాణాం వాతే పర్జన్యే"

పిల్లలంతా గొల్లుమనేవారు.

❖ ❖ ❖

బొంబాయి వర్లీలో ఓ ఏడంతస్థుల భవనంలో–ఒకానొక అపార్టుమెంటులో ఓ తెల్లవారుఝామున టెలిఫోన్ మోగింది. మంచంమీద ముఖమల్ దుప్పటిలోంచి ఓ చెయ్యి బయటికి వచ్చి బద్ధకంగా ఫోన్ అందుకుంది.

అట్నుంచి ఎవరో అడిగారు :

"ఎవరూ?"

"రాజమండ్రి నుంచి ట్రంక్‌కాల్–రాజశేఖర్?"

రాజశేఖర్ గడియారం చూశాడు. తెల్లవారుఝామున మూడున్నర. విసుగూ, కోపం తోసుకొచ్చాయి.

"బుద్ధిలేదూ! ఈవేళప్పుడు..."

మాట వినిపించుకోలేదు ఆపరేటర్. కాల్‌ని కలిపేసింది. ''మీరు శ్రీరాములునాయుడుగారి బావమరిదేనా?" అంటూ అటునుంచి ఓ గొంతు ప్రశ్న.

రాజశేఖర్‌కి నిద్ర కాస్త విడింది.

"ఎవరది?"

"శ్రీరాములునాయుడుగారూ, భార్యా వారంరోజుల క్రితం యాక్సిడెంటులో చచ్చిపోయారు"

రాజశేఖర్‌కి నిద్ర పూర్తిగా విడింది.

"ఎవరు మాట్లాడేది?"

అయ్యో అనలేదు. పాపం అనలేదు. అలాంటి ఆలోచనలు ఆ గొంతుకి అలవాటు లేదు.

“అది మీకనవసరం. ఆరేళ్ళ అడపిల్ల ఇక్కడ ఉంది” అన్నాడు.

“ఎక్కడ?”

“రాజమండ్రి తాలూకా ఆఫీసుపక్క–కుడిచేతివేపు ఆఖరి మేడకి వచ్చి తీసుకెళ్లొచ్చు” ఫోన్ పెట్టేశారు.

రాత్రి తాగిన స్కాచ్ మత్తు పూర్తిగా దిగిపోయింది ఇప్పటికి. టెలిఫోన్‌లో విన్న విషయాన్ని ఆకళించుకోడానికి ప్రయత్నిస్తున్నాడు. అర్థమవుతున్నకొద్దీ అతనిలో దుఃఖం పెల్లుబుకలేదు. ఆనందం కట్లు తెంచుకుంది. అనుకోకుండా చిన్న నవ్వు పెదవులమీద కలిసొచ్చింది.

పక్కనే దుప్పటికింద బొత్తిగా బట్టల్లేని ఓ మరాఠీ ఆడగొంతు హిందీలో అడిగింది : “ఎవరది?”

రాజశేఖర్ ఆలోచనలు అప్పటికి దారులు వెతుక్కుంటున్నాయి.

“మరేం లేదు డార్లింగ్. రాజమండ్రిలో ఓ డబ్బుసంచీ నాకోసం ఎదురుచూస్తోందట. వెళ్లి తెచ్చుకోవాలి”

“నేనూ వచ్చేదా?” అంది మరాఠీ ఆడ గొంతు.

“అక్కర్లేదు. ఇకనుంచీ ఎక్కడకీ రానక్కరలేదు. ఇకనుంచీ నా వ్యాపారంలో సబ్సిడీలు లేవు. బట్టలేసుకో” అని లేచాడు రాజశేఖర్.

❖ ❖ ❖

కొందరు లేకపోవడంవల్ల కొందరికి కొన్ని ఉపకారాలు జరుగుతాయి. కొందరు ఉండడంవల్ల కొన్ని ప్రతిబంధకాలు ఏర్పడతాయి.

శ్రీరాములునాయుడుగారి వారసుడు–వదిలిపోయిన పదెకరాలకోసం వస్తున్నాడన్న సంగతి–దక్కించుకున్న వ్యక్తులకు తెలియదా?

కాగల కార్యం గంధర్వులు తీర్చినట్టు–మధ్యలో యాక్సిడెంటు–దంపతుల మరణం–ఆ సమస్యకు పరిష్కారం. అయితే బతికివున్న ఆరేళ్ల పిల్ల?

అలాంటి పిల్ల ఒకరున్నారని–ఆ చుట్టుపక్కలవాళ్లకీ, ఆ మాటకి వస్తే పోలీసులకీ తెలీదు. వాళ్ల పోస్టుమార్టం రిపోర్టులోనూ ఆ పిల్ల ప్రసక్తి లేదు. ఇద్దరికే ఆ పిల్ల గురించి తెలుసు.

ఒకరు– కళ్లారా చూసిన అబ్బుశాస్త్రికి. కారు దిగి రోడ్డుమీద సరాసరి నడిచి వెళ్లిపోవడం చూశాడు.

మరొకరు– పదెకరాలు దక్కించుకున్నవారికి. వారికి శ్రీరాములునాయుడు వస్తున్న విషయం తెలుసా?

శ్రీరాములునాయుడు చావులో–ఎట్టి పరిస్థితులలోనూ అందుకు ఆస్కారం లేదు. అబ్బుకీ, ఆస్తికీ–యాక్సిడెంటుకీ, వ్యాపారానికీ లంకె లేదు. ఇది దైవికం.

ఏమైనా–ప్రస్తుతం పదెకరాలు ఆధీనంలో ఉన్నవారికి యాక్సిడెంటు కారణంగా సమస్య దానంతటదే పరిష్కారమైపోయింది. మరి పిల్ల?

న్యాయంగా ఈ ఆస్తికి–ఆ మాటకి వస్తే ప్రస్తుతం శ్రీరాములునాయుడు ఆస్తికి–ఇప్పుడు ఈ ఆరేళ్ల పిల్లే వారసురాలు. ఆమెని కూడా తప్పిస్తే?

హత్య అన్నిటికీ పరిష్కారం కాదు. ఎంతో కొంత ఆస్తి శ్రీరాములునాయుడికి బొంబాయిలో ఉంది.

ఆ ఆస్తిని హరించే పెద్ద రాబందు బొంబాయిలోనే ఉంది. ఇక్కడి సమస్యని అక్కడికి బదిలీ చేస్తే? ఫోన్ చేయించింది ప్రస్తుతం పదెకరాలు అనుభవిస్తున్నవారా? లేక నిజమైన ఉపకారులా?

దుర్మార్గం రెండు రకాలు. సన్మార్గం ముసుగు తొడిగింది ఒకటి. సన్మార్గం అనిపించేలాగ చేసేది మరొకటి.

రాజశేఖరానికి పోలిశెట్టి అనే ఓ పొగాకు వ్యాపారి పిల్లని అప్పగించాడు. ఎవరతను? ఎవరు పిల్లని రక్షించారు? రాజశేఖరం వివరాలు ఇతనికెలా తెలిశాయి? ఎందుకీ ఉపకారం చేశాడు? ఇలాంటి ప్రశ్నలకి సమాధానం చెప్పగల శక్తిసామర్థ్యాలున్నవాడిగా పోలిశెట్టి కనిపించలేదు.

విచిత్రంగా రాజశేఖరం అడగనూలేదు. కోటి రూపాయల చెక్కు చేతికి వస్తున్నప్పుడు సంతకం చేసిన ఇంకు సంగతి ఎవరు పట్టించుకుంటారు? శ్రీరాములునాయుడు, భార్యా పోయాక– తన విచ్చలవిడితనానికి పెద్ద ఇన్సూరెన్స్ ఈ పిల్ల. కొంగుబంగారం.

రెండు భోజనం పొట్లాలు, పూతరేకులూ, మామిడితాండ్ర–అన్నీ సంచిలో మూటకట్టి అమ్మాయితోసహా రైలెక్కించాడు పోలిశెట్టి. రైలు గోదావరి బ్రిడ్జీమీదకి రాగానే పోలిశెట్టి ఇచ్చిన సంచీ గోదావరిలో పారేసి సూట్‌కేస్‌లోంచి స్కాచ్‌ని తీశాడు రాజశేఖరం.

అప్పటికి లీల తన టెడ్డీబేర్‌తో కబుర్లు చెప్పుకుంటోంది.

## 4

బొంబాయి పగలు మనుషుల్ని వెదజల్లుతుంది. రాత్రి సంఘటితపరుస్తుంది. తెల్లారినప్పటినుంచి అందరూ అన్ని చోట్లకీ పరుగులుతీస్తూంటారు.

ఉపాధి వాళ్ళని ఊరిస్తూంటుంది. చీకటి పడ్డాక పుండుమీద ముసిరిన ఈగల్లాగ సుఖం చుట్టూ ముసురుకుంటారు. ఉద్యోగులూ, వ్యాపారులూ, సినిమావాళ్లూ, శరీరాలు బలిసినవాళ్లూ, శరీరాలు అలిసినవాళ్లూ, గూండాలూ, దోపిడీదారులూ, హంతకులూ–అందరూ పురివిప్పి నాట్యంచేసే హరిశ్చంద్ర ఘాట్ బొంబాయి.

ఇక్కడ బతికున్న శవాలు కాలుతూంటాయి. కాలుతున్న శవాలు బతికున్నట్టు నడుస్తూంటాయి. 'జీవించడం' ఎంత అవసరమో, అగత్యమో, వ్యసనమో జారిపోతున్న ప్రతీ క్షణం ఎదురువచ్చే క్షణాన్ని హెచ్చరిస్తున్నట్టుంటుంది.

రాత్రివేళ బొంబాయి పండి ముదిరిన రాచపుండు. విషపుకోరల్ని విస్తరించిన సుఖం. పక్కవాడి అవసరాన్ని తాకట్టుపెట్టే ఉల్లాకు దుకాణం. ఎదుటివాడి అవసరానికి వెలకట్టే వెలయాలు.

చెంబూరు పొలిమేరల్లో జోపడ్‌పట్టీ ఈ కార్యక్రమాలకి ఒకానొక రంగస్థలం. రేకుల్తో, అట్టలతో, వెదుళ్లతో మరుగుని ఏర్పర్చుకున్న ఎన్నో గుడారాల సమూహం. ఇక్కడ పారిశుద్ధ్యానికి అర్థం లేదు. సరళమైన జీవితం ఓ బూతుమాట.

తెల్లవారాక జీవితం ఎలా గడుస్తుందో అక్కడ చాలామందికి తెలీదు. విచిత్రం. అక్కడ చాలా ఇళ్లలో–వాటిని ఇళ్లు అనాలనుకుంటే–ఖరీదైన స్కాచ్ సీసాలుంటాయి. లక్షల డబ్బు ఉంటుంది. ఒళ్లు విరుచుకున్న యౌవనం ఉంటుంది. భయంకరమైన నేరస్థులుంటారు. కత్తులుంటాయి. బాంబులుంటాయి. ఆకలి ఉంటుంది. ఆర్తి ఉంటుంది. నేరం ఉంటుంది. నేలబారు జీవితం ఉంటుంది.

రుస్తుంకి చిన్నతనంలోనే పెళ్లయింది. ఎక్కడో గుజరాత్‌లో మారుమూల గ్రామంలో–అప్పుడింకా ఏం చెయ్యాలో ఆలోచించని తొలిరోజుల్లో పెళ్లయింది అతనికి.

భుజానికి సంచీ తగిలించుకుని ఖాళీసీసాల్నీ, చిత్తుకాగితాల్నీ రోజంతా వీధులు తిరిగి పోగుచేసేవాడు. ఒకరోజు న్యూస్‌పేపర్ల మధ్య నూరు రూపాయల నోటు, ఖాళీసీసా అడుగున ఖరీదైన స్కాచ్ రెండు పెగ్గులూ దొరికాయి.

ఇవి అడిగినప్పుడల్లా దొరికే స్థలం మరొకటి ఉందని అతని సాటి నేస్తం చింతూ చెప్పాడు. దాని పేరు బొంబాయి అన్నాడు. ఆ విధంగా పెళ్లాన్ని తీసుకుని బొంబాయిలో దిగాడు.

మొదట మలార్‌లో తర్వాత జుహూ పొలిమేరల్లో గడిపి–ఈ జోపడ్‌పట్టీలో ఒక రాత్రి గొడవలో సోడాసీసా పోటుతో ఒకడు చచ్చిపోగా ఖాళీ అయిన గదిలో ప్రవేశించాడు. అది రుస్తుం జీవితంలో మొదటి విజయం.

అనుకోకుండా జరిగిన ఓ సంఘటన రుస్తుం జీవితాన్ని ఒక మలుపు తిప్పింది. అది ఖాళీసీసాలో అట్టడుగున దొరికిన స్కాచ్. అది సుఖాన్ని మప్పింది. అంతవరకూ ఉపాధికోసం అర్రులుజాచే మనిషి అక్కడినుంచీ సుఖంకోసం ప్రయత్నాలు ప్రారంభించాడు.

ప్రస్తుతం ఈ దేశం దరిద్రం ఇదే. ఉపాధిని పక్కనపెట్టి సుఖాన్ని అందలం ఎక్కించడం–మనిషి పతనానికి దగ్గర తోవ. "ఈ దేశంలో ప్రతి మనిషీ జీవించడానికి కావలసిన వనరులున్నాయి కానీ అతని పేరాశని తీర్చేపాటివి లేవు" అన్నాడు మహాత్ముడు.

మనిషి–తన మానాన తనూ, తన కుటుంబమూ బతికే ఉపాధి సాధించుకోవడం మనిషి హక్కు. అది సజావైన ప్రయత్నం. కాని–తనకి అర్హతలేని, అనుకోకుండా తారసపడిన కొత్త సుఖానికి అర్రులుజాచాడు. దాన్ని సాధించడానికి దగ్గరతోవలు వెదికాడు. తక్కువ కాలంలో ఎక్కువ ఆదాయాన్నిచ్చే మార్గాలేమిటి?

రుస్తుం ఈ దేశపు ప్రాథమిక మానసిక స్థితికి, దురాశకీ ఆ క్షణంలో ప్రతినిధి. అతని భార్య–పూర్వాశ్రమంలో సుగంధి. ప్రస్తుతం దుర్గంధభూయిష్టమైన వాతావరణంలో కుళ్ళిపోయిన జీవితానికి–ఆమె సహచరుని పక్కన నిలిచింది. అది ఆమె తప్పు కాదు. జీవితం తిప్పిన మలుపు.

ఖరీదైన స్కాచ్‌కి బదులు మత్తుని ఇచ్చే దగ్గరతోవలు మరిగాక సుగంధికి ముద్దుపేరు పెట్టుకున్నాడు రుస్తుం–చవ్వా. చవ్వా వయస్సు అప్పటికి ఇరవై నాలుగు. కుళ్ళిపోయిన ఎరువులోంచే నవనవలాడే పువ్వు వికసిస్తుంది. కుళ్ళి, పురుగులు పట్టిన దుర్గంధం–ఎరువు. అందులోంచి ఏపుగా పెరిగే సృష్టి–పుష్పం. విచిత్రంగా చవ్వా సౌందర్యం ఆ వాతావరణంలో మరింత ఏపుగా, తీపిగా పెరిగింది. నిజానికి అది సౌందర్యం కాదు. కసిగా విచ్చుకున్న శరీరపు ఒంపులు. వేళపాటున లేని ఆహారం, సమయానికి చాలని నిద్రా, ఒక పద్ధతి అంటూ లేని జీవనసరళీ–ఇవన్నీ ఎరువు కుళ్ళిపోడానికి అనుపానాలు. వీటి మధ్య వికసించిన శరీరం–చవ్వా.

పొద్దున్నే నగరంలోకి దూసుకువెళ్లే రుస్తుం ఓ మధ్యాహ్నం అనుకోకుండా ఇంటికి వచ్చినప్పుడు–సగం బట్టల్లేని పోలీసు తన ఇంట్లోంచి వస్తూ కనిపించాడు. రుస్తుంని చూసి–

"ఎవడ్రా నువ్వు బాం..." అంటూ చక్కని బూతులు విసిరాడు.

చవ్వా బెనకలేదు. వాడు నా మొగుడు అని చెప్పింది. పోలీసు ఒక్క క్షణం

ఆశ్చర్యపోయి అంతలో నవ్వుకున్నాడు.

ఇంట్లో తిరిగే బొచ్చుకుక్కని నిమిరినట్టు చవ్వా బుగ్గలు రెండూ రుస్తుం సమక్షంలోనే నిమిరి "షోకయిన పెళ్ళాన్ని సంపాదించావురా బాం..." అని బూతుతోనే పలకరించి జేబులోంచి పెద్ద నోట్లకట్ట తీసి, తన చేతిలో మిగిలిన సీసాతో సహా రుస్తుం చేతిలో పెట్టి వెళ్లిపోయాడు.

రుస్తుం ఒక్క క్షణంసేపు బిత్తరపోయాడు. మరుక్షణంలో ఆనందించాడు. చేతిలో రెండు వేలు. సగం విస్కీ ఉన్న సీసా. అప్పటికి రుస్తుంకి ఒక విషయం అర్థమైంది. తన ఇంట్లోనే పెట్టుబడిలేని ముడిసరుకు ఉన్నదని.

ఆ తర్వాత సగం సీసాని రుస్తుం, చవ్వా పంచుకు తాగారు. ఇద్దరూ జుహూ బీచ్‌లో గోల్‌గప్పా తింటూ సరదాగా గడిపారు. అర్థంకాని గుజరాతీ సినిమాని చూసి ఆలస్యంగా గూడుకి చేరారు.

అప్పుడే చవ్వా అందం మరింత రెచ్చిపోయే రెండు బ్రాలూ, రెండు సల్వార్ కమీజులూ కొన్నాడు.

అవినీతిలో చిన్న దుర్మార్గం ఉంది. ఒడుపు కుదరాలేకాని ఎన్నో దగ్గరతోవలున్నాయి. ఖరీదైన స్కాచ్‌తోనూ మత్తు వస్తుంది. అర్థంలేని చౌకబారు సరుకుతో కూడా మత్తు వస్తుంది. అసలు అవినీతే అడ్డతోవ.

అటుతర్వాత రుస్తుం తన మందు బ్రాండుని మార్చాడు. పోలీసు తన రాక టైముని మరిచిపోయాడు.

కానిస్టేబుల్ వంటి చిన్న ఉద్యోగం చేసేవాడికి రెండు వేలు ఇవ్వగల స్థోమత ఎక్కడిది? మిట్టమధ్యాహ్న సమయంలో సగం మత్తులో ఓ స్త్రీ పొందులో ఉండడం మరిగిన గవర్నమెంటు ఉద్యోగిని అటువంటి ప్రశ్న అడగడం–బూతు.

ఒక జీవితకాలం అవసరాల్ని విస్తరించుకుని, అవకాశాల్ని లొంగదీసుకుని, అవినీతిని 'అవినీతి' అని గుర్తుపట్టే విచక్షణ కూడా చాలని నేపథ్యంలో మరొక జీవికి అంకురార్పణ జరిగితే ఏమౌతుంది? అది రింకీ అవుతుంది.

రింకీ చివ్వాకు పుట్టిన కలుపుమొక్క. ముగ్గురు జీవించడానికి చాలని చిన్న ఆవరణలో–ఆకాశాన్నంటే కోరికల్ని విస్తరించుకున్న రెండు జీవితాల దురాశకు ప్రాణం పోసిన జీవి పేరు–రింకీ.

రింకీ చిన్నతనంనుంచీ రంకుని చూసింది. వచ్చిపోయే మనుషుల్ని చూసింది. ఆ చిన్నగదిలో తల్లి చుట్టూ శరీరాలు మారే పరిణామాన్ని చూసింది.

ఎప్పుడూ ఖరీదైన ఆటబొమ్మలతో, అతి విలువైన పలకరింతలతో, ఉదారంగా వెదజల్లే డబ్బుతో, అతి సులువుగా రెచ్చిపోయే ఆవేశంతో, చిన్న కారణాలకే రక్తం కళ్ళజూసే ఘర్షణలతో-వెరసి-ఏరోజూ విశ్రాంతి లేని జీవితాన్ని చూసింది.

రింకీ పెరుగుదలకి-కుళ్ళిన ఎరువు-బురద, చెమట, కంపుకొట్టే దుర్గంధం-అన్నీ సమృద్ధిగా కుదిరాయి. రింకీ తల్లి విశృంఖలత్వాన్ని, తండ్రి విచ్చలవిడితనాన్ని-పుణికిపుచ్చుకుని పుట్టింది.

అన్నిటికీ మించి-తన ప్రత్యేకత ఏమిటో గుర్తుపట్టే కిటుకు, దాన్ని ఎరగా చూపి ఫలితాన్ని రాబట్టే నేర్పు-ఒడిసి పుచ్చుకుంది.

రింకీ చిరునవ్వు నవ్వితే వెన్నెల కురుస్తుంది. కళ్ళు కదిపితే పిల్లవాయువులు ముసురుకున్నంత సుఖంగా ఉంటుంది. నోరు విప్పితే ముత్యాలు గలగలమని రాలుతాయి. నోరెత్తితే ఊహించలేని బూతులు విరివిగా జాలువారుతాయి. చిన్న కారణానికి చెయ్యి విసురుగా లేస్తుంది. అన్నిటికీ మించి-ప్రాణంమీదా, యవ్వనంమీదా-బొత్తిగా ఖాతరులేని తిరుగుబాటు జీవితాన్ని రూపుదిద్దుకుంది.

మురికికూపంలోంచి ముముక్షువులు ఉద్భవించరు. కానీ మురికిజీవితంలోంచి మూర్ఛపోయేటట్టు చేసే యవ్వనం ఉద్భవించగలదు. ఆ యవ్వనం కొండొకచో ముముక్షువులనీ బలి తీసుకోగలదు. నియతిలేని పదునైన కత్తి-ఆ శక్తి. డబ్బు దాని రుచి. సుఖం ఎర. నిర్లక్ష్యం దాని ఆకర్షణ. 'రేపు' మీద దృష్టిలేని అజ్ఞానం దాని సాంద్రత. వెరసి-రింకీ ఆ మురికివాడలో గొప్ప శక్తిగా తయారైంది. అది బాధ్యత తెలియని, పాటించని, పాటించనక్కర్లేదని భావించే వ్యవస్థ చేతుల్లో అణ్వాయుధం లాంటిది.

పరమ సాధువుకి తన మంచితనాన్ని ఎలా వినియోగించుకోవాలో తెలీదు. అసలు వినియోగించుకోవాలని తెలీదు. నిజానికి తెలియనక్కర్లేదు. మంచితనం పరిమళం. అది ఉన్న చోట వ్యాపిస్తుంది. దురాశకీ, కోరికకీ-రేటు నిర్ణయించడం నేర్చుకున్నాడు రుస్తుం.

ఇప్పుడు చవ్వా శరీరం బాగా అలసిపోయింది. ఎందరో విటుల, ఎన్నో రాత్రుల కోరికల పెట్టుబడితో శరీరం అరిగిపోయింది. ఆ అనుభవంతో రింకీని-పదిలంగా బేరంపెట్టడం నేర్చుకున్నాడు. రోడ్డుపక్క బడ్డీకొట్టు స్థాయి నుంచి ఖరీదైన షోరూమ్ స్థాయికి ఎదిగింది అతని వ్యాపారం.

బొంబాయిలో రాత్రి మేల్కొనే బార్లూ, రెస్టారెంట్లూ, బహిరంగంగా సాగే పాటల ముషాయిరాలూ, డ్యాన్సులూ, కాస్త మోతాదు మించిన తైతక్కలూ-వందలూ వేలూ, వాటి అడ్రసులు మరిగిన విటులూ వేలు.

డబ్బుమాత్రం లక్షలు. మలబార్ హిల్, బీచ్ కాండీ ప్రాంతాలలో ఖరీదైన

వ్యాపారాలున్నాయి.

అక్కడ దొంగ వ్యాపారా చేసేవాళ్లూ, కేవలం ఫోన్‌కాల్‌తో లక్షలు ఆర్జించేవాళ్లూ, వజ్రాల వ్యాపారులూ, నల్లబజారు వ్యాపారులూ–కోకొల్లలు.

రుచి చూపి, ఆకలిని రెచ్చగొట్టి–అందాన్ని ఖరీదైన రేపర్లలో చుట్టి–అందినంత దగ్గర్లో, అందనంత ప్రియంగా–ఆకర్షణకి రేటులు నిర్ణయించే బారులున్నాయి. జోపడ్‌పట్టీనుంచే కాక–చిన్న చిన్న గూళ్లలో నివాసముంటూ–రాత్రి జీవితానికి ఖరీదైన తలుపులు తెరిచే–లక్షలు గడించే అందాల భరిణలు చాలామంది ఉన్నారు నగరంలో.

అందరికీ అందం ఉండదు. కొందరికి సెక్సీ ఉంటుంది. కొందరికి పగలు ఉంటుంది. కొందరికి తమకున్నదాన్ని వ్యాపారానికి పెట్టే హొయలు ఉంటుంది. దాపరికాన్ని ఆకర్షణచేసే–అవసరాన్ని తీర్చలేని–ఖరీదైన రేపర్లే–కొన్ని ఉంటాయి. అదొక ప్రపంచం.

ఆ ప్రపంచంలో అడుగుపెట్టే సమయానికే–రోజంతా అలసి, లేదా ఆర్జనతో బలిసి–మత్తులో ఆ టెన్షన్‌ని విప్పుకోడానికి–పెగ్గుల్లో, మాత్రల్లో, నిషాల్లో, ఇంజెక్షన్‌లలో మునిగిన–సగం ఆదమరిచిన ఖరీదైన శరీరాలు అక్కడికి వస్తాయి.

వారు ఓ చిన్న స్పర్శకి పదివేలిస్తారు. చిన్న చిరునవ్వుకి పాతిక ఇస్తారు. ముద్దుకి లక్ష. పొందుకి లెక్కలేదు. సగం సగం వెలిగే–ఆ హాళ్లలో–పాలవెన్నెలలో–సగం జోగుతున్న మనుషుల నరాలను–ఏ కాస్త సడలించినా–శరీరం పులకిస్తుంది. జేబులు వర్షిస్తాయి.

ఆ ఒడుపుని–వయస్సు ఇంకా పుష్పించకముందే చీకటి రాత్రులలో, తల్లి పలకరింతలలో, ఆ చిన్నగదిలో సాగే వ్యాపారంలో గ్రహించింది రింకీ.

ఇది చెప్పడానికి అభిరుచి దారిద్ర్యంలాగ కనిపించినా–తల్లి కడుపులో ఉండగానే ప్రహ్లాదుడికి నారదుడి ద్వారా ఆధ్యాత్మిక సంపద అందినంత జ్ఞానోదయాన్ని పొందింది. ఉపమానం కేవలం ఆ వెసులుబాటుని కళ్లకు కట్టడానికి మాత్రమే. తల్లి కడుపులో జీన్ స్థాయిలోనే అందానికి సాకుల్ని వంటబట్టించుకుంది.

రుస్తుంకి వస్తువుని వ్యాపారానికి 'మన్నిక'ని ఎలా జతచేసుకోవాలో అనుభవం నేర్పింది. ఆకలివేసిన కుర్రాడు పరమాన్నాన్ని జుర్రుకుంటాడు. ఆకలిని రెచ్చగొట్టి, రెచ్చే స్థాయిలో శక్తిని జోకొట్టి, ఆ శక్తికి రేటుని గట్టి, పరమాన్నం కేవలం 'రుచి' స్థాయిలోనే నిలిచిపోయిందని గుర్తుపట్టే దశలో కూడా లేకుండా–నాలుకకు తగిలిస్తే? అదే తాయిలం–అయిదు వందలమందికి అయిదు వందలసార్లు పంచవచ్చు.

ఆనాటి రోజ్‌లాండ్ నైట్ క్లబ్బులో రింకీ జీవితాన్ని ప్రారంభించి క్రమంగా 'తార' అయింది.

జోపడ్‌పట్టీలోని చిన్న ఇంట్లో ముగ్గురి ఇరుకు జీవితాన్ని పరిహసించేలాగ-మూడు నాలుగు ఖరీదైన చమ్కీ దుస్తులు చోటుచేసుకున్నాయి.

మార్కెట్లో-ఖరీదైన మురికి శరీరాలను అలంకరించే సెంట్లు-ఓ మూల చిరుగులు పట్టిన తోలుపెట్టెలో కొలువుతీరాయి. కుళ్ళు జీవితానికి సెంటు రాస్తే ఏమౌతుంది? రుస్తుం ఇల్లవుతుంది-దాన్ని ఇల్లనుకుంటే.

బొంబాయిలో ఖరీదైన ఇళ్లల్లో ఉండే మిక్సీలు, స్టీలు సామగ్రి-అన్నీ ఇక్కడ ఉన్నాయి. బోలెడంత డబ్బు వచ్చిపడుతోంది. స్కాచ్‌కి కొదువలేదు. చవ్వా, రుస్తుం కలిసి తాగేటంత.

మరి ఇక్కడే-ఈ మురికి కూపంలోనే మ్రగ్గడం ఎందుకు? కారణాలు బోలెడు. ఇది మ్రగ్గడం అని వారు భావించడంలేదు కనుక. ఏది ఖరీదైన జీవనమో వారికి తెలీదు కనుక. ఇక్కడ వారి జీవితం సురక్షితం కనుక.

దేవాలయాల్లో ఎటు చూసినా భక్తులుంటారు. ఇలాంటి చోట ఎటు చూసినా తమలాగే జీవిక సాగించే మురికి కూపాలుంటాయి. అవి బ్రతకడానికి ధైర్యాన్నిస్తాయి. మురికి జీవితానికి వనరులు జోడించినా అభిరుచి కలిసిరాదు.

గొప్పగా ఉండే లోగిళ్లలోనూ మురికి బతుకులుంటాయి. మురికి లోగిళ్లలో వనరులుంటాయి. స్థాయి ఉండదు-అదేమిటో వారికి తెలీదు కనుక. రాత్రి 9 వరకూ రింకీ అతి సాదాసీదా బట్టల్లో ఉంటుంది. పది గంటలకి ఆమె మిరుమిట్లు గొలిపే అవతారాన్ని ఎత్తుతుంది. టాక్సీలో రోజ్‌లాండ్ చేరుతుంది.

ఆమె దర్శనానికి-అతి ఉదారంగా మత్తులో మునిగిన కస్టమర్లు ఎదురుచూస్తుంటారు. రింకీకి ఆ ముఖాలు తెలుసు. గారపట్టిన నవ్వులూ, బరువెక్కిన జేబులున్న నవ్వులూ, తన చెమ్కీ వల్లె వాటుని ఒక్కసారి అందుకోవాలని కోరలు జాచే విటులూ, మత్తులో మూసుకుపోయే కళ్లూ-మారిజువానా, బ్రౌన్ షుగర్‌తో తూలిపోయే శరీరాలూ-అన్నీ తెలుసు.

అందంలో చిన్న చిలిపితనం ఉంది. యౌవనంలో అహంకారం ఉంది. తన చుట్టూ ముసురుకున్న ముఖాలు తనని ఖరీదుచెయ్యాలని బరువెక్కిన సంచుల్తో సిద్ధంగా ఉన్న శరీరాలని తెలుసు.

ఒక చిన్న చెమ్కీ విదిలింపు, ఒక్క కనుసన్న, రహస్యంగా బ్రౌన్ షుగర్ ముఖాన్ని పలకరింత ఖరీదు పాతిక వేలు. ప్రతీ డాన్సర్‌కీ ఒక ఆషిక్కు ఉంటాడు. ఒక ముఖం ఉంటుంది. విలాస జీవనం వ్యసనం. రోజూ కనిపించే ముఖాల పలకరింతా వ్యసనమే. వాటి మధ్య పరాకుగా, నిశ్శబ్దంగా, కాస్త నిజాయితీగా కళ్లల్లో ఆశనీ, కాని కదలికల్లో

నిండుదనాన్నీ నింపుకున్న బరువైన శరీరం–ఆమె ఆషిక్కు. అభిమాన విటుడు. అతనికి ఆయాచితంగా చిరునవ్వుని విసురుతుంది. అతను వంగిన ఆమె స్తనాల మధ్య దూరనంత పెద్ద నోట్లకట్టని ఉంచుతాడు. అంతే.

ఆ తర్వాత ఇంకేమీ చెయ్యడు. అతని నిరాసక్తత ఆమెకి ఆకర్షణ.

నలుగురిలాగ అతను నవ్వడేం? తనని అందుకోవాలని తొందరపడడేం? తనకోసం దేబిరించడేం? మరొక గొప్ప విశేషం. అందరిలోకీ ఎక్కువ డబ్బు వెదజల్లే ఆ మనిషి–అందరికంటే తనని తక్కువగా ఆకర్షించాలని ప్రయత్నిస్తాడు. ఆ కారణంగానే రింకీని అతను ఎక్కువ ఆకర్షించాడు.

అతను అడగకుండానే, ప్రయత్నించకుండానే–అతనికి రింకీ చెయ్యి తగిలిస్తుంది. చెంప తగిలిస్తుంది. చిరునవ్వు విసురుతుంది. అయినా డబ్బు విదిలించడం వినా అతను ఎక్కువ చొరవ తీసుకోడు. ఎవరతను?

ప్రతీ నైట్ క్లబ్బుకీ కొందరు రక్షకులుంటారు. వాళ్ల పని కస్టమర్ల మీద కన్నేసి ఉండడం. ఎవరి జేబులు ఎంత బరువుగా ఉన్నాయో కనిపెట్టడం. తరచుగా వచ్చే కస్టమర్లని మచ్చిక చేసుకోవడం. వనరులున్న వ్యక్తుల్ని జల్లెడపట్టడం. ఏ మనిషి ఆకర్షణకి ఎవరు లొంగుతున్నారో బేరీజు వెయ్యడం. ఆ యా కార్యక్రమాలలో వాళ్ళకి సౌకర్యాలు కల్పించడం. హద్దుమీరిన వాళ్ళని హెచ్చరించడం. మరీ చెలియలికట్ట దాటితే చావగొట్టడం. అల్లరికాకుండా అధికారుల్ని మేపడం.

రింకీ–ఆ మనిషి వివరాలను సేకరించింది. మాతుంగాలో పెద్ద వజ్రాల వ్యాపారి కొడుకు–పేరు అంబరీష్. వ్యాపారంలో అతనిది మూడో తరం. వయస్సు 48. రోజూ వాక్స్‌హాల్ కారులో వస్తాడు. ఈ నైట్ క్లబ్బులోనే రింకీ డ్యాన్సునే చూస్తాడు. మరెక్కడికీ పోడు. సరాసరి ఇంటికి వెళ్తాడు.

వివరాలన్నీ రింకీకి నచ్చాయి. అతని రాకకి రోజూ ఎదురుచూసేది. ఎప్పుడన్నా రాకపోతే ముఖం చిన్నబుచ్చుకునేది. మరునాడు–చెవిలో సుతారంగా "నిన్న మీకోసం ఎదురుచూశాను" అనేది.

అంబరీష్ చిరునవ్వు నవ్వేవాడు. విర్రవీగిపోయేవాడు కాదు. అది రింకీకి మరొక ఆకర్షణ. ఒకటి రెండుసార్లు రింకీ కలల్లోకి దూరాడు అంబరీష్.

నిశ్శబ్దంగా ఉన్న వ్యక్తుల మనస్సుల్లో నిర్దుష్టమైన ప్రణాళిక రూపుదిద్దుకుంటూంటుంది. గలగల మాట్లాడేవారి మనస్సుల్లో ఆలోచనకి ఆస్కారం ఉండదు. తర్వాత–వరుసగా వారంరోజులు రాలేదు అంబరీష్. రింకీ ఆశ్చర్యపోయింది. అతనికోసం ఎదురుచూసింది. ఎక్కువసార్లు ఆలోచించింది.

ఒక సాయంకాలం–ఊహించని రీతిగా అంబరీష్ జోపడ్‌పట్టీలోని ఆమె ఇంటికి వచ్చాడు. ఇరుగుపొరుగు వారంతా పేటలోకి పాము వచ్చినంతగా అంబరీష్‌ని చూసి తుళ్లిపడ్డారు.

ఈ రేకు కదిలితే పక్క ఇల్లు. ఆ పోస్టర్ కదిలితే వెనుక ఇల్లు. ఆ సందంతా అంబరీష్ సెంటుతో గుప్పుమంది. ఆయన తొడుక్కున్న ఖరీదైన బూట్లు బురదలో మునిగిపోయాయి. మోచేతికి వేలాడుతున్న వజ్రాల గొలుసు ఆ చీకటిగదిలో తళుక్కుమంది. అంబరీష్ వెనకే రుస్తుం వచ్చాడు. అతని చేతిలో బరువెక్కిన సంచీ ఉంది. ముఖం నిండా ఆనందం ఉంది. చవ్వా కళ్లల్లో తృప్తి ఉంది. ఇంకా రాత్రి మత్తులోంచి తేరుకోలేదు రింకీ. బద్ధకంగా పక్కమీద దొర్లుతోంది.

అంబరీష్ మాటల మనిషి కాదు. రింకీ అనుపానులు కనిపెట్టి, అడ్రసు తెలుసుకుని, రుస్తుం అలవాట్లు క్షుణ్ణంగా చదివి, తన కారు దగ్గరికి పిలిపించి–అతని పేరాశకు ధరకట్టి–రొక్కంగా చెల్లించి–రింకీని ఖరీదు చేశాడు.

ఆ ఖరీదు ఐదు లక్షలు. ఆరోజుల్లో–రుస్తుంకది–ఐదు జీవిత కాలాలు.

రింకీ షాక్ అయ్యింది. కాని కంగారుపడలేదు. తెల్లబోయింది. కాని ఎదిరించలేదు. మరో గంటలో అంబరీష్ కారెక్కింది. విచిత్రంగా–ఆరోజు రోజూ వచ్చే టాక్సీ రాలేదు.

రోజ్‌లాండ్‌లో మనుషులు పలకరించలేదు. పదకొండున్నర డ్యాన్స్‌కి రింకీ లేదు. ప్రపంచం ఏమీ మారలేదు. రింకీ ఎందుకు రాలేదు? చాలామందికి అర్థం కాలేదు. చాలామంది నిరుత్సాహపడ్డారు.

లోకావాలా రాస్తాలో ఒక పన్నెండు అంతస్థుల అపార్టుమెంటుకి రింకీ చేరింది. ఆమెకోసం ప్రత్యేకమైన వసతులు అన్నీ ఏర్పాటు చేయించాడు అంబరీష్. ఆమెకోసం ఇరవై నాలుగ్గంటలూ పనిచేసే నౌకరుని సిద్ధం చేశాడు. ఆమెకోసం కారు కొన్నాడు. అపార్టుమెంటుని శోభనం గదిలాగ అలంకరింపజేశాడు. అతనికి భార్యా, ముగ్గురు పిల్లలూ ఉన్నారని అప్పుడు తెలిసింది రింకీకి.

పెద్దబ్బాయి పన్నెండు. మిగతా ఇద్దరూ అమ్మాయిలు. చిన్నపిల్లలు.

అపార్టుమెంటులో చేరిన ఆరోజున రింకీని మొదటిసారిగా చేతితో తాకాడు అంబరీష్. రింకీకి ఆ స్పర్శ అపురూపమనిపించింది. ఆ స్పర్శని ఆహ్వానించింది. అతను ఊహించలేనంత ఆనందాన్ని పంచి ఇచ్చింది. కానీ ఆ శరీరంలో తను ఆశించినంత ఆనందం లేదని గ్రహించింది. అతని మధుమేహం–శరీరంలో ఉన్న కోరికలకీ శరీరానికీ మధ్య వారధి. కానీ తనకేం లోటు లేదు.

అయితే అది ఎంత భయంకరమైన పంజరమో–అతి తక్కువ కాలంలోనే ఆమెకి తెలియవచ్చింది.

రద్దీగా ఉన్న–మనుషుల్తో క్రిక్కిరిసిన రోడ్డు ఎప్పుడూ కదలికల్తో కొత్తగా ఉంటుంది. ఏమీ చలనంలేని ఏకాంతం నరకంలాగ ఉంటుంది. చైతన్యం–అదెంత అనుచితమైనా–ఆకర్షణీయం. స్తబ్ధత–అదెంత స్వర్గమైనా–నరకప్రాయం.

కాగా మత్తెక్కే రాత్రులూ, బద్దకంగా నడిచే పగళ్లూ–తనని నంచుకుతినే చూపులూ, రవికె పిగిలిపోయేటట్టు ఒరుసుకునే కరెన్సీ, చెమటతో తడిసిన సెంట్లూ, వాళ్లకి అందకుండా రెచ్చగొట్టే తన అహంకారం, స్పష్టంగా తెలిసే కోరికల్ని ధిఃక్కరించే స్వాతంత్ర్యం–ఇవన్నీ మృగ్యమయ్యాయి.

ఏకాంత జీవనం, ఖరీదైన నిశ్శబ్దం, కేవలం కోరగానే ఎదురుగా ప్రత్యక్షమయ్యే సౌకర్యాలు–ఇదంతా పెద్ద బోరు. ఏకాంతం ఆశించని వ్యక్తికి నరకం. అందులోనూ తప్పనిసరిగా సంధించిన ఏకాంతం దుర్భరం. డబ్బున్న జీవితంలో ఇంత మొనాటినీ ఉన్నదని, అందుకే వీరంతా రాత్రి జీవితానికి అలవాటుపడతారని రింకీ అర్థం చేసుకుంది.

ఒకటి రెండుసార్లు అంబరీష్‌ని ఎదిరించింది. అతను ఎక్కువ మాట్లాడే మనిషి కాదు. ఆచరణ–అతని సూత్రం. తనకి నచ్చని విషయాన్ని లొంగదీసుకోవడం ఎలాగో ఎరిగిన వ్యాపారి.

ఎదిరించిన రింకీ చెంప పగలగొట్టాడు. ఆమె జీవితం కరెన్సీమయంగా సాగడంతప్ప–మరింకేవిధంగానూ మలుపు తిరగదని హెచ్చరించాడు.

నేలబారు జీవితాల్లో 'కదలిక'లో రుచి, అనిశ్చితత్వంలో ఎంత విచ్చలవిడితనం ఉందో క్రమంగా తెలిసివచ్చింది రింకీకి. ఈ ఖరీదైన పంజరంలోంచి తప్పించుకోవాలనే కోరిక క్రమంగా బలపడింది.

ఆ దశలో ఆమెకి అర్థమైన విషయం–తనని ఆ అపార్టుమెంటు దాటకుండా కాపలాకాసే ఇద్దరు మనుషులు ఎల్లకాలం బయట కాపలా ఉంటున్నారని.

రింకీకి ఓటమి తెలీదు. వీగిపోవడం అర్థంకాదు. ఎప్పటికప్పుడు–కోరికల కత్తుల బోనులోంచి దారులు వెతుక్కోవడం ఆమె అలవాటు.

తనకి అక్కర్లేని తీరికలో–అక్కడినుంచి తప్పించుకునే ప్రణాళికని సిద్ధం చేసుకోవడాన్ని ప్రారంభించింది. అందుకు ఆమెకున్న ఆయుధాన్ని పదునుపెట్టింది. ఏమిటది? శరీరం. మొదట తనంతట తాను కారు నడపడాన్ని నేర్చుకుంది. కారులో ఎక్కకుండా కారుని వెంబడించే పనులు చేస్తున్నారు అంబరీష్ మనుషులు. రింకీ సుదీర్ఘమైన

ప్రాణాళికలో ఇది మొదటి భాగం.

అపూర్వమైన భవనాన్ని బలహీనం చెయ్యాలంటే దేనికి లాయకీ-చెదపురుగు. చెదపురుగుకి వ్యక్తిగతమైన ఉనికి లేదు. ఏకాకిగా ఉన్న చెదపురుగు నేలని కాలరాసేంత బలహీనమయినది. కానీ సామూహికంగా నెరవేర్చే ధ్వంసకాండ అనితరసాధ్యం.

అలాంటి అస్తిత్వంలేని చెదపురుగుని వెదికి పట్టుకుంది రింకీ. రోడ్డుమీద కారు నడుపుతూ-ఏమీ వ్యక్తిత్వంలేని, ఎవరూ పట్టించుకోని, మాసిపోయిన జీవితం గడుపుతున్న గత జీవితపు మూలాల్లోంచి ఒక మనిషిని ఏరింది.

అతని పేరు రాజశేఖరం. అతను అందాన్ని చూసి చొంగ కారుస్తాడు. రోజ్‌లాండ్‌లో దిగే తనని ముట్టుకోడానికి ఏ సాహసమైనా చేస్తాడు.

ఓ రాత్రి అతని పక్క కారాపి రాజశేఖరాన్ని ఎక్కించుకుంది. అతి ఖరీదైన కారులోంచి అతి ఖరీదైన అమ్మాయి-తను కేవలం ముట్టుకోడానికి ఉవ్విళ్లూరే అమ్మాయి కారెక్కించుకుంది. అతని భుజాన్ని ఆమె చెయ్యి కారులోకి లాగింది. ఆమె సెంటు వాసన అతన్ని మత్తెక్కించింది. కళ్లు మూసి తెరిచేలోగా అతి సుందరమైన అపార్టుమెంటులో ఉన్నాడు.

తన కళ్లముందు పరుచుకునే కలలోంచి తేరుకునేలోగానే రింకీ తన ఆయుధాన్ని సంధించింది. అతని ముందు నగ్నంగా నిలబడింది. అంతే. రాజశేఖరం అక్కడినుంచీ ఆమెకి మచ్చికచేసిన కుక్క అయిపోయాడు.

ఎవతరను? అనవసరం. పెంటకుప్పని బెల్లించే గునపం-ఒక సాధన. అంతకన్నా దానికి మరో అస్తిత్వం లేదు. ఆ అపార్టుమెంటునీ, ఆమెనీ కనిపెట్టుకుని ఉంటున్న అంబరీష్ మనుషులకి ఆ అపార్టుమెంటులోంచి ఆమె బయటికి వెళ్లిపోకుండా కాపాడడమే పని.

ఆ అపార్టుమెంటులోకి-తరచూ వెళ్లే నేలబారు మనిషి వాళ్లకి అనుమానాన్ని పెంచలేదు. కాగా అంబరీష్ వంటి కోటీశ్వరుడి ఉంపుడుకత్తె దగ్గరికి ఓ సాదాసీదా మనిషి తరచూ రావడం అనుమానించాల్సిన విషయంగా కనిపించలేదు.

రాజశేఖరానికి అల్లుకోవడం తెలుసు. అమ్మాయిలకి చీకట్లో మతి పోగొట్టడం తెలుసు. రింకీ పనిని చేసిపెట్టే లోపల-రింకీలాంటి అందగత్తెల ఖాతాల్ని ఆమె ద్వారా పరిచయం చేసుకున్నాడు.

తను వ్యాపారంలో స్థిరపడ్డాక ఓ నెలరోజుల తరువాత ఓ అర్ధరాత్రి రింకీని గమ్యం తెలీని ప్రయాణానికి, ఊహించలేని పాసింజరులో ఎక్కించి మాయమయ్యాడు.

రైలు దక్షిణదేశానికి దూసుకుపోయింది. అప్పటికి రాజశేఖరానికి ఓ విషయం వంటబట్టింది. బొంబాయిలో కేవలం సుఖపడడానికి కాదు-ఖరీదైన అమ్మాయిల్ని సుఖపెట్టడానికీ ఒక ధర ఉందని అర్థమైంది. ఖరీదైన జీవితాల్లో కూడా నేలబారు కోరికలు తీరడానికి కూడా ఖరీదు ఉన్నదని తెలుసుకున్నాడు.

చెదపురుగు తన బృందంతో కథని నడపగలిగితే నాశనం చెయ్యగల సరుకులు చాలా ఉన్నాయి.

అవినీతికి పెట్టుబడి, ఆదాయాన్ని సాధించిపెట్టే జల్తారు ప్రపంచం ఒకటి ఉంది. అందులోకి జొరబడ్డాడు రింకీ ధర్మమా అని. ఈ సంఘటనకి అనుబంధంగానే రాజశేఖరం మగ వ్యభిచారి (male prostitute)గా మారాడు.

## 5

ఖండవల్లి సర్వమంగళేశ్వరశాస్త్రి బగళ బ్రహ్మర్థ మంత్రసిద్ధులు. అఖండమైన సాధనచేసి-ఎన్నో సిద్ధుల్ని వశం చేసుకున్నారు. కలలో బ్రహ్మరాక్షసి దగ్గర పాఠం చెప్పించుకుని పగలు సాధనచేసేవారని అంటారు.

ఆ ఊరి జమీందారుమీద మరకవాడు (మత్స్యకారుడు) ప్రయోగంచేస్తే-చావడానికి సిద్ధమైన ఆయన్ని ఎనిమిది రోజులు అఖండమైన తపస్సుచేసి మంత్రాన్ని ప్రయోగించి ప్రయోగ విముక్తిని ప్రసాదించారు.

ఆ జమీందారు ప్రసాదించిందే ఈ ఎనిమిది ఎకరాల తామర్ల గ్రామం. అది ఒకనాటి మాట. ఇనాం తనకి అక్కర్లేదని-ఆ ఊళ్లో పెంకుటింటిని, రెండెకరాల కొబ్బరితోటనీ ఉంచుకుని-అందులో పర్ణశాలని వేసుకున్నారు.

అబ్బు శాస్త్రి అనారోగ్యం ఆ నోటా ఈ నోటా శాస్త్రిగారి చెవిన పడింది. కాలినడకన బయలుదేరి-రెండు ఝాములు కాలవగట్టున సంధ్య వార్చుకుని పెదచయనులుగారి ఇల్లు చేరాడు. తలవని తలంపుగా అంత పెద్ద పండితులు గుమ్మంలో కనిపించేసరికి సోమిదేవమ్మ, చయనులుగారూ ఉబ్బితబ్బిబ్బయిపోయారు.

కాళ్లు కడిగి-ఇంట్లోకి ఆహ్వానించి పీటవేసి ఆసీనుల్ని చేశారు. ఎర్రటి పట్టుపంచె, అంతే ఎర్రటి పైపంచె, నుదుటి నిండా పెద్ద కుంకుమ బొట్టు, చెవులకు సింహతలాటాలూ బ్రహ్మతేజస్సుతో ప్రకాశమానమైన మూర్తి వారిది.

"ఎలా ఉన్నాడు కుర్రాడు?" అన్నారు అతని సంగతి వినే వచ్చానంటూ. సోమిదేవమ్మ కరిగి నీరై ఏరైపోయింది.

"వాడికేం పరవాలేదు. వాడిని చూడకుండానే మాట ఇస్తున్నాను. ప్రారబ్ధాన్ని

మార్చడం మానవతరం కాదు. కానీ పోయిన మతిని సరిచేస్తాను–అది లౌకికమైన అనర్థం కనుక”

ఇంకా పరాకుగా ఉన్న అబ్బుశాస్త్రిని సర్వమంగళం తీసుకువచ్చాడు.

తల్లి భుజంమీద మంచుముద్దలాగ వాలిపోయాడు అబ్బు.

అబ్బుని చూస్తూనే ఒక్కక్షణం భ్రుకుటిని బిగించి నవ్వారు సంగమేశ్వర శాస్త్రిగారు. “వీడు చెయ్యాల్సిన పనులు చాలా ఉన్నాయి. మీరూ నేనూ చేసే, చెయ్యగల పనులు కావు. ఈ ఇంట్లో, ఈ ఊర్లోనే తెల్లారే బతుకు కాదు వీడిది”

చయనులుగారి వెన్నుపూసలోకి వేడి ఎగదన్నింది. ఎదురుగా సాక్షాత్తూ బ్రహ్మదేవుడు సభ తీర్చి–లలాటలిఖితాన్ని తిరగరాస్తున్నంత ఆనందం కలిగింది. అర్భకుడైనా, అసమర్థుడైనా, అనామకుడైనా–ఇంకా రవంత ఆయుర్దాయం ఉన్నదని ఆసరా ఇచ్చినందుకు సోమిదేవమ్మ అబ్బుశాస్త్రిని గుండెలకు హత్తుకుని పొంగిపోయింది.

వెంటనే వైద్యం ప్రారంభమయింది. తనతో నడవలేక ఈడిగిలపడుతున్న అబ్బుశాస్త్రిని కాలవగట్టుకి లాక్కెళ్లి మొలలోతు నీళ్లల్లో దింపి, చెవిలో గంటన్నర మంత్రోపదేశం చేశారు–ఇద్దరి ఒళ్ల మీదా తడిబట్టలు ఆరిపోయేవరకూ.

ఓ మనిషిని రంపచోడవరం హుటాహుటిన పంపించి తాయిలిగూడెంలో ఉంటున్న పెఠికిలిచ్చిన్న అనే ఆటవికుడి దగ్గర్నుంచి లేడికొమ్ముని తెప్పించారు. చిన్న గుడ్డని తడిపి–లేడికొమ్మును అందులో చుట్టి అబ్బుశాస్త్రి భుజానికి కట్టించారు. అంతకుముందు లేడికొమ్మును నీటిలో వేసి–నీటిని అబ్బుశాస్త్రి అరచేతిలో వేసి ఆచమనం చేయించారు.

ఉదయం కాలవకి వెళ్లకముందే శంకువు కిందభాగాన్ని కాల్చి–నీటిలో ఆ భస్మాన్ని కలిపి స్నానం చేయించారు. యవలను అన్నంగా వండి–

అధర్వణ వేదం మూడో కాండంలోని రెండో అనువాకంలోని మూడో మంత్రంతో హోమం చేశారు.

అదోయవ రోచతే చతుష్పక్ష మివచ్ఛదిః!
తేనాతే సర్వం క్షేత్రియ మంగేభ్యో నాశయామసి॥ *

ఆ శేషాన్ని అభిమంత్రణ చేసి అబ్బుకి తినిపించారు. కౌమారీ మహాశాన్తిని నలభై రోజులు తను స్వయంగా దగ్గర ఉండి జరిపించారు. తన అనుష్ఠానం అయిన తర్వాత స్వయంగా వంట చేసుకుని భోజనం చేసేవారు.

---

*** వేద సార రత్నావళి (ద్వితీయ భాగం) ఉప్పలూరు గణపతి శాస్త్రి, పేజీ 563.**

విచిత్రంగా పది రోజులకి అబ్బుశాస్త్రి వెన్నుపూస నిలిచింది. నిటారుగా కూర్చోగలిగాడు.

కాలవగట్టు వరకు కేవలం పాకిన శరీరం–క్రమంగా అడుగులు వేసింది. ఇరవై రోజులకి–అడిగి విస్తరిముందు కూర్చుని అన్నం తిన్నాడు. మండలం పూర్తయ్యేనాటికి అబ్బు శాస్త్రి అందరిలో పడ్డాడు. కానీ మనస్సు ఇంకా అపస్మారంలోనే నిలిచిపోయింది.

“కోలుకుంటాడు. ప్రారబ్ధానికి అడ్డం పడడం ఋషులకే సాధ్యం కాదు. నేనా సాహసం చెయ్యలేను'' అంటూ, వచ్చిన తోవనే ఒక తెల్లవారురఝామున బయలుదేరిపోయారు ఖండవిల్లి సర్వమంగళేశ్వరశాస్త్రిగారు.

ఊరు దాటగానే ఒంటెద్దుబండి యిరుసు విరిగి బెదిరిన ఎద్దు, శాస్త్రిగారి తోవకి అడ్డు వచ్చింది. తప్పించుకోబోయిన శాస్త్రిగారి కాలు మడతబడింది. అంతే. మడమ దగ్గర ఎముక విరిగి కూలబడ్డారు. చయనులుగారూ, శిష్యులూ–ఊరంతా పరుగున వచ్చారు.

సర్వమంగళేశ్వరశాస్త్రిగారు నవ్వి– “అబ్బు శాస్త్రి పాపశేషాన్ని నిర్మూలించాక నేను పంచుకోవలసిన వాటా ఇది. పెద్ద ప్రాణాన్ని మిగుల్చుకోగలిగాను” అన్నారు. రెండెడ్ల బండిమీద–కేవలం గావంచా చుట్టిన కాలితో–పాలివాడు బండి వెనుక నడిచిరాగా, ప్రయాణం కొనసాగించారు సర్వమంగళేశ్వర శాస్త్రిగారు.

❖ ❖ ❖

శారీరకమైన ఆరోగ్యం ఓ పద్ధతిలో కుదుటపడిందేకానీ–అబ్బుశాస్త్రిలో అర్థంకాని లోపమేదో మిగిలిపోయింది. ఏ కోశానా మునుపటి మనిషి కాలేకపోయాడు. చయనులుగారు వేదపాఠం చెప్తున్నప్పుడు పరాకుగా స్తంభానికి చేరబడి కూర్చునేవాడు.

మనస్సు మరేదో లోకంలో ఉండేది. అయితే ప్రాణం దక్కినందుకే తృప్తిపడి–స్థాణువులా ఉన్న బిడ్డని చూసుకుని రహస్యంగా కళ్లు తుడుచుకునేది సోమిదేవమ్మ. ఓరోజు ప్రయత్నం చేసి–పంచపాత్ర, ఉద్ధరిణా ముందుంచి–సూర్యునికి అభిముఖంగా తనతోపాటు తన పక్కనే కూర్చోపెట్టుకుని సంధ్యావందనం చేయించబోయారు చయనులుగారు.

పెదాలు గాయత్రికోసం తెరుచుకున్నాయి. కానీ దంత్యాల దగ్గర నాలిక తిరగబడింది. తత్, సవితృ–పలకలేదు. ఏడేళ్ల క్రితం అనుగ్రహించిన గాయత్రీదేవి–అబ్బుశాస్త్రి పెదాలనుంచి శలవు తీసుకుంది. ఆమె అనుగ్రహానికి తలుపులు మూతబడ్డాయి.

ఎప్పుడో చిన్నతనంలో కనిపించిన–ద్విజత్వానికి మొదటి గురువు అనుగ్రహంగా గాయత్రి కరుణించిన వరం మరుగునబడి మళ్లీ నత్తి అడ్డుబడింది. చయనులుగారు హతాశులయ్యారు. తోటి శిష్యులందరూ ఒక్కపెట్టున భోరుమన్నారు.

కానీ విచిత్రం! అబ్బుశాస్త్రి ముఖంలో విషాదం లేదు. పశ్చాత్తాపం లేదు. కళ్లు మరేదో ప్రపంచాన్ని చూస్తున్నాయి. ఆలోచనలు వాళ్లకందని లోకాన్ని అన్వేషిస్తున్నాయి.

అబ్బుశాస్త్రి చూడడానికి అందరిలాగే కనిపిస్తున్నాడు. కానీ అది అందరికీ అందని అపస్మారం. సర్వమంగళం మాత్రం తన ప్రాణమిత్రుడిని పొదివి పట్టుకుని అతనితోపాటే చాపమీద పడుకునేవాడు. అది ఆలోచనలతో ప్రమేయం లేని ఆప్యాయతల వెల్లువ.

ఏ ఆలోచనల కారాగారానికీ తల్లి ప్రేమను అటకాయించే శక్తి లేదు. కానీ సోమిదేవమ్మ ప్రయత్నమూ అక్కడే ఆగిపోయింది. ఆ తర్వాత అబ్బుశాస్త్రిని బాగుచేయాలంటే ఏం జరగాలో ఆమెకీ తెలీదు. ఓ తెల్లవారుఝామున ఉన్నట్టుండి సర్వమంగళానికి ఎవరో తట్టి లేపినట్టు తెలివొచ్చింది. అతినిర్దుష్టంగా–అనుదాత్త ఉదాత్తాలు అపశృతిలో పడకుండా వేదం చదువుతున్నారెవరో. పక్కమీద అబ్బు కనిపించలేదు. ఈ సమయంలో వేదం చదువుతున్నదెవరు? లేచి బయటికి వచ్చాడు. వీధి అరుగుమీద కర్రస్తంభానికి తల ఆనించి అబ్బుశాస్త్రి వల్లిస్తున్నాడు. రెండు కారణాలకి సర్వమంగళం నిర్ఘాంతపోయాడు.

కాలవగట్టున సంఘటన తర్వాత నాలుక మడతబడి దంత్యాలు పలకడానికి మొరాయించిన అబ్బుశాస్త్రి నాలుక మడత విడి అతి స్వచ్ఛంగా, స్ఫుటంగా, నిర్దుష్టంగా మంత్రాన్ని చెప్తోంది.

సమిధో యజతి వసంత మేవర్తూనాం మవరుంధే
తనూనపాతం యజతి గ్రీష్మమేవా వరుంధే
ఇడో జయతి వర్షా ఏవావరుంధే
బర్హిర్యజతి శరీర మేవావరుంధే
స్వాహాకారం యజతి హేమంత మేవావరుంధే

ఉచ్చారణలో ఏ పొల్లూ లేదు. దంత్యాలూ, కంఠ్యాలూ, తాలవ్యాలూ, మూర్ధన్యాలూ–అన్నీ స్పష్టంగా పలుకుతున్నాయి. అబ్బుశాస్త్రి ఆ సమయంలో లేచి కూర్చుని వేదంలో మంత్రాన్ని చదవడంలో ఆశ్చర్యాన్ని–అంత నిర్దుష్టంగా చదవగలిగే అతని స్ఫూర్తి జయించింది.

ఒక్కడుగు ముందుకు వేసి 'అబ్బూ' అని పలకరించబోయాడు సర్వమంగళం.

కానీ సర్వమంగళం భుజంమీద మరో చెయ్యి పడింది. చూస్తే–చయనులుగారు. మాట్లాడవద్దని ముక్కుమీద వేలు వేశారు. ఆగిపోయాడు.

అబ్బుకి–పదడుగుల దూరంలో గోడని ఆనుకుని గురువుగారూ, శిష్యుడూ ఒకే షాక్‌ని పంచుకుని చతికిలబడిపోయారు. అబ్బుశాస్త్రి ఏదో అపస్మారంలో ఉన్నాడు. పెదాలు కదలడం ఆగిపోయింది. ఓ గంట గడిచింది. ఇక పలకరించాలా వద్దా అనుకుంటూండగా మళ్ళీ శంఖం గర్జించింది. అబ్బు మరో మంత్రం చదువుతున్నాడు.

ఆశ్మన్నూర్జం పర్వతే శిశ్రియాణాం వాతే పర్జన్యే వరుణస్య సుష్మే ।
అద్భ్య ఓషధీభ్యో వనస్పతిభ్యోధి సమ్భృతాం పయః ॥

ఇద్దరూ నిర్ఘాంతపోయారు. ఏమి ఈ గాంభీర్యం? ఏమి ఈ ధారణ? ఎంత స్పష్టత! ఎంత మాధుర్యం? మంత్రం చదువుతూనే అక్కడే అలాగే నేలమీద పడుకుని నిద్రపోయాడు అబ్బు శాస్త్రి.

చయనులుగారు భుజంమీద ఉన్న శాలువా కప్పి–అతని పక్కనే గోడని ఆనుకు కూర్చున్నారు. చయనులుగారి కంటతడి ఏనాడూ చూడలేదు సర్వమంగళం. కానీ ఆనాడు వారి కన్నులు ధారాపాతం కావడాన్ని చూసి ఆకులా చలించిపోయాడు.

❖ ❖ ❖

ఈ రెండు మంత్రాలూ–కేవలం ఈ రెండు మంత్రాలే వినడం అప్పటికి పదిసార్లయినా జరిగింది. ఆ మంత్రాల్లో ఏముంది?

గాయత్రిని కూడా సరిగ్గా ఉచ్చరించడానికి శారీరకమైన వైకల్యం అడ్డుపడిన వ్యక్తి–అంత స్పష్టంగా, అంత నిర్దుష్టంగా ఆ మంత్రాల్ని ఎలా చదవగలుగుతున్నాడు? అంతకుమించి ఎందుకు చదువుతున్నాడు? ఆ మంత్రాలకూ, అతని అపస్మారానికీ–లేదా పూర్తిగా కోలుకోలేని నిస్సహాయతకీ ఏమైనా సంబంధం ఉందా?

ఈ విచికిత్స సర్వమంగళానికి మాత్రమే కాదు, చయనులుగారిదీను. తదాదిగా–పది రోజులు శిష్యులకి పాఠం చెప్పడం మానుకున్నారు. సంధ్యావందనం పూర్తయ్యాక–ఆ రెండు మంత్రాల్నీ ఆపోశనపట్టడం ప్రారంభించారు.

సందేహం లేదు. అబ్బుశాస్త్రి అనారోగ్యానికీ, లేదా వైకల్యానికీ ఈ మంత్రాలకీ సంబంధం ఉంది.

ఉంటే ఏమిటది? విచిత్రంగా రెండు మంత్రాలకూ ఒకదానికొకటి పొంతన లేదు. అర్థంలోనూ సమన్వయం లేదు. అవి రెండూ కృష్ణయజుర్వేద సంహితలో ఒక భాగం–అంతమట్టుకే.

"సమిథోయజతి..." అన్న మంత్రం–యవల్ని ఫలానా ఋతువుల్లో వేస్తే ఏయే ఫలితాలు వస్తాయో–ఆ అనువాకంలో వివరించబడింది. నిజానికి–అది కూడా కాదు.

"వసంత ఋతువులో వచ్చే ఫలాన్ని సమస్త జీవరాశికీ అందజెయ్యి. అలాగే గ్రీష్మ, వర్ష, శరత్, హేమంత, శిశిర ఋతువులలో వచ్చే ఫలాన్ని అందజెయ్యి" అని చెప్తోంది ఈ అనువాకం.

ఈ ఆలోచనను పదేపదే ఎందుకు గుర్తుచేసుకుంటున్నాడు? యాక్సిడెంటు వర్ష ఋతువులో జరిగింది. 'ఇడో జయతి వర్షాయేవా వరుంధే' అని అనువాకం. వర్ష ఋతువులో వచ్చే ఫలమేమిటి? సస్యం, ధ్యానం. ఆ ఫలాన్ని ప్రజానీకానికి ఇవ్వడానికీ, ఇచ్చే ఆలోచన పదేపదే అబ్బుశాస్త్రి మనస్సులో పునరుక్తం కావడానికీ కారణం ఏమై ఉంటుంది? ఆనాటి సంఘటనకీ వర్ష ఋతువుకీ ఏదైనా సంబంధం ఉందా? సంబంధం ఉందని అబ్బు మనస్సు ఘోషిస్తుందా? ఉంటే ఏమిటది? చయనులుగారు చీకటిలో వెదుకుతున్నారు.

సమాధానాలు ఒక్కరికే తెలుసు. బొత్తిగా పొంతన కుదరని అబ్బు మనస్సుకి. వాటిని అన్వయించే శక్తి ప్రస్తుతం ఆ మనస్సుకి లేదు. అదిప్పుడు పూర్తిగా చీకటి గుయ్యారంలో ఉంది.

రెండో మంత్రం? "అశ్మన్నూర్జం పర్వతే..." ఇది మరీ జటిలం. దీని అర్థం ఏమిటి? సూర్యుడు ఏ విధంగా చెరువులు, జలాశయాల్నుంచీ, వనస్పతుల్నుంచీ శక్తిని తీసుకుని–మేఘమండలం ద్వారా భూమికి వర్షం ద్వారా అందజేస్తాడో, ఆ వర్షం కారణంగా భూమి ఇచ్చే ఆహారాన్ని–క్షుధానివృత్తికి మానవుడు వినియోగించుకుని, బలాన్ని పెంచుకుని, తద్వారా దుష్టుల్ని నాశనంచేసి–మంచివారి దుఃఖాన్ని హరింపజేస్తాడో–అలాగే ఇతరుల దుఃఖాన్ని, కష్టాన్ని హరించే శక్తిని మాకు ప్రసాదించు గాక".

అసలు ఇంత వివరంగా మంత్రాన్ని అర్థం చేసుకునే శక్తి అబ్బుశాస్త్రికి ఉందా? వేదాన్ని చదువుకునే విద్యార్థికి ముఖ్యంగా అవసరమైంది ధారణ. అటుతర్వాతే పదక్రమం, అర్థం, అన్వయం.

న్యాయంగా ఆ దశకి ఇంకా అబ్బుశాస్త్రి రాలేదు. మరి ఈ మంత్రం పదేపదే అతని పెదాలమీద ఎందుకు కదులుతోంది? పైగా ఏ లోపమూ లేని ఉదాత్త అనుదాత్తాలతో కంఠం శంఖమయి ఎందుకు పూరిస్తోంది? ఈ మంత్రం అర్థం ఏ కొంచెమో అబ్బుశాస్త్రికి అర్థమై ఉంటుందా? అయితే ఏ దుర్మార్గానికి ప్రకృతి అందించే ఈ విరుగుడుని అతని మనస్సు కాంక్షిస్తోంది? ఏదైనా దుర్మార్గాన్ని, లేదా అన్యాయాన్ని అతని మనస్సు గుర్తుపట్టిందా? రెండు మంత్రాలనూ సమీకరిస్తే–ఒక వర్ష ఋతువులో జరిగిన ఏదో సంఘటన అతని మనస్సుపై బలమైన ముద్ర వేయడాన్ని పదేపదే అతని మనస్సు మననం చేసుకుంటోందా? ఆనాడు కాలవగట్టున జరిగిన సంఘటన ప్రభావమా ఇది?

అదే అయితే–ఈ రెండు మంత్రాల అన్వయం ఏమిటి? కేవలం పునశ్చరణా? ఆదేశమా? ఆక్రోశమా? మననమా? ఒకవేళ అదే నిజమైనా ఏ విధంగా ఈ మంత్రాల పునశ్చరణ చికిత్సకు ఉపయోగపడుతుంది? ఏం చేస్తే అపస్మారంనుంచి అబ్బుశాస్త్రి బయటపడగలుగుతాడు? ఈ రెండు మంత్రాలలో కేవలం సూచనే ఉందా? ప్రశ్న ఉందా? సమాధానం ఉందా? ఉంటే అది ఏమిటి?

చీకిటికి ఆవల వెలుగు కనిపించడంలేదు. ఆలోచించినకొద్దీ చయనులుగారు అలసిపోతున్నారు.

అతి విచిత్రంగా–ఓ అర్ధరాత్రి–సోమిదేవమ్మ భర్తను లేపింది. ఆయన కళ్లిప్పి–ఎదురుగా భార్య ముఖాన్ని చూసి ఆశ్చర్యపోయారు.

"ఏమైంది?" అన్నారు కంగారుగా. భయంభయంగా సోమిదేవమ్మ అంది: "మీకు తెలుసా? నిద్రలో మీరు ఆ రెండు మంత్రాలను కలవరిస్తున్నారు"

"సమిధోయజతి వసంతం..."

"అశ్మన్నూర్జంతే పర్వతే..."

ఒక్క క్షణం తెల్లబోయి పగలబడి నవ్వేశారు చయనులుగారు.

ఆయన అలా కావడం సోమిదేవమ్మకి కొత్త. భయపడింది. అంతలో ఆగిపోయారు చయనులుగారు.

సాలోచనగా– "సమాధానం రాని ప్రశ్నని–అపస్మారంలో–మనస్సు మననం చేసుకుంటోంది. అబ్బుశాస్త్రి రుగ్మతకీ, ఈ రెండు మంత్రాలకీ బలమైన సంబంధం ఉంది. నా పలవరింత అందుకు నిదర్శనం" అన్నారు.

## 6

ఒకరోజు చయనులుగారింటి ముందు ఊలు బంతులతో జీనును పూన్చిన గుర్రబ్బండీ ఆగింది. బండీలోంచి గుమ్మటంలాగ ఉన్న రొంకిలి తంబళ్లమ్మ దిగింది. రొంకిలి ఇంటిపేరు కాదు. ఊరిపేరు.

ఏనాడో–దాదాపు 150 సంవత్సరాల కిందట శ్రీవైష్ణవం పుచ్చుకున్న వైశ్యులు. కళింగ కోమట్లు అన్నది ప్రచారనామం. సోంపేట, పాతపట్నం, మందసా, చినగిన్నంగి ప్రాంతాలవారి ఇళ్లల్లోకి ఎప్పుడో ఈ వైష్ణవం తొంగిచూసింది.

ఎక్కడో శ్రీరంగం ఇంత దూరం వచ్చేసరికి పలచబడింది. పొరుగు ప్రాంతాల కృష్ణతత్వం, పక్కనే ఉన్న జగన్నాథుడి ఆరాధన–అన్నీ కలగలుపుగా ఈ కుటుంబాల్లో ఓ తెలియని సాత్వికతనూ, ఆధ్యాత్మిక చింతననూ మిగిల్చాయి. కష్టపడి లోతుకుపోయి

చూస్తే అరిగిపోయిన 'తిరువాయ్‌మొళి' మూలాలు ఇంకా పాత తరాల గొంతుల్లో ప్రతిధ్వనిస్తాయి. మతం మానవ జీవితానికి మార్గసూచి అనుకుంటే–దాన్ని తమ భావాల పొంతనలో, జీవన విధానంలో ఏ కాస్తో మిగుల్చుకుని పాపభీతితో–కానీ వ్యాపార దృక్పథాన్ని వీడని సత్ప్రవర్తనతో జీవిక సాగిస్తున్న కొన్ని నమూనా కుటుంబాలవి.

తంబళ్లమ్మది ఐశ్వర్యం ఉట్టిబడే అవతారం. చింతాకుపచ్చ పట్టుచీరె, రెండుచేతుల నిండా బంగారం గాజులూ, ముక్కున ఎర్రటి వజ్రపు నత్తు, చెవులకు చెంపసరాలు, నుదుటిన కళ్లు జిగేల్‌మనిపించేలాగ మెరిసే ఎర్రటి కుంకుమ.

చిన్న పళ్లెత్తు. మాటలో అనూహ్యమైన సంస్కారం. బండి దిగుతూనే చయనులుగారి వీధిమెట్లకే దండంపెట్టి–అరుగుమీదే కూర్చుండిపోయింది. ఆమె రాకని ఆ వీధివారంతా అబ్బురంగా చూశారు.

చయనులుగారు, సోమిదేవమ్మ ఆమె నెప్పుడూ చూడలేదు. కానీ ఆమె ఐశ్వర్యాన్ని గురించీ, వితరణ గురించీ విన్నారు. బండివాడు అమ్మగారిని పరిచయంచేసి ఆ ఇంటి మెట్లను కూడా తాకకుండా వీధి మొగిలోనే నిలిచిపోయాడు. చయనులుగారిని చూడగానే మరొక్కసారి లేచి ఆయన నిలబడిన స్తంభానికి సభక్తికంగా నమస్కారం చేసింది తంబళ్లమ్మ.

ఏం మాట్లాడాలో తెలీక నిలబడిపోయారు చయనులుగారు.

"అబ్బుశాస్త్రి బాబు ఎలా ఉన్నాడు అయ్యగారూ?" అంది తంబళ్లమ్మ. చయనులుగారు ఆశ్చర్యపోయారు.

"అబ్బు గురించి మీకెలా తెలుసు? అసలు మీరు...?"

"మాది ఈ ప్రాంతమే బాబూ. మా తాత చాలా యేళ్ల కిందట రాజమండ్రి చేరిపోయారు. అప్పుడప్పుడు వచ్చిపోతుంటాను. ఆమధ్య ఇక్కడేదో కారు యాక్సిడెంటు జరిగిందని విన్నాను. తమ ఇంటి బాబులు అప్పుడక్కడే ఉన్నారని వినబడ్డాను. చినబాబుకి ఒళ్లు బాగులేదని మా ఊరి అయ్యవారు చెప్పారు. పొలంలో కంద తవ్వించుకుపోదామని వచ్చాను. ఒక్కసారి తన దర్శనం చేసుకు వెళ్దామని..." అంటూ వీధిలో నిలబడిన గుర్రబ్బండీ సైసుని చూసింది.

రెండు బస్తాలతో కంద, రెండు పనసపళ్లు దింపి అరుగుమీద ఉంచాడు.

సోమిదేవమ్మ ఒకడుగు ముందుకు వేసింది. "ఆరోజు ఏమైందో–అప్పట్నుంచీ మా అబ్బు..."

సోమిదేవమ్మ మాటని పూర్తి కానివ్వలేదు చయనులుగారు.

"అబ్బు బాగానే ఉన్నాడు" అన్నారు చయనులుగారు ముక్తసరిగా.

"అవును బాబూ. మాయదారి యాక్సిడెంటు. కాలవలో రెండు శవాలు తేలాయని చెప్పుకున్నారు. బొడ్డూడని పిల్లలు. ఆ వల్లమాలిన చావుల్ని చూసి బెంబేలుపడిపోయినా ఆశ్చర్యంలేదు" అంది తంబళ్లమ్మ.

అప్పటికి నలుగురైదుగురు శిష్యులు అరుగుమీదకి వచ్చారు. చిన్న చిన్న అంగవస్త్రాలతో అప్పుడే వెలిగించిన దీపకళికల్లాగ మెరిసిపోతున్న పిల్లల్ని చూసి ముచ్చటపడిపోయింది తంబళ్లమ్మ.

"అబ్బుబాబెక్కడ నాయన్లారా?" అంది అందర్నీ చూస్తూ. దూరంగా నిలబడిన సర్వమంగళం ఒక్కడుగు పక్కకి వేశాడు. అతని వెనుక గోడకి ఆనుకుని నిలబడిన అబ్బుశాస్త్రి కనిపించాడు.

అతనే అబ్బు శాస్త్రి అని ఎలా పోల్చుకోగలిగింది? అన్ని దీపశిఖల మధ్య మబ్బు వెనుక ఉన్న ఉదయసూర్యుడిలాగ కనిపించాడు అబ్బుశాస్త్రి.

లేచి దగ్గరకు వెళ్లబోయి అంతలో తమాయించుకుంది తంబళ్లమ్మ. "బెదిరావా రాజా?" అంది అనునయంగా. సమాధానం అబ్బుశాస్త్రి నిశ్శబ్దం.

"విన్న మాకే గుండె చెరువైపోయింది. కళ్లారా చూసిన మీకు?..." ఆ సంభాషణ చయనులుగారికి నచ్చలేదు.

అబ్బుశాస్త్రి నుదురు ముడుతలుపడడం ఆయన గమనించారు. ఒక్కడుగు ముందుకు వేసి "చూడమ్మా" అని ప్రారంభించబోయారు చయనులుగారు.

తంబళ్లమ్మకి అర్థమైపోయింది. "వద్దు బాబూ, మానని గాయాన్ని కెలకడం మహా పాపం. నేనొచ్చింది అందుకు కాదు. పాపడి ఆరోగ్యం బాగుంటే అంతే చాలు" అంటూ కొంగుముడి విప్పి మూడు బంగారు కాసులు పనసపండుమీద ఉంచింది.

ముడుతలుపడిన అయిదు వందల నోట్లు తన సంచీలోంచి తీసి వెండికుందె కింద పెట్టింది. "బాబూ. వేదం చదువుకుంటున్న పుణ్యాత్ములు. బిడ్డలకేమైనా కొనిపెట్టండి బాబూ–మీకు లేదని కాదు. నా జన్మ తరించడానికి–" అంటూ లేచింది.

అందరూ ఆమెని ఆశ్చర్యంగా చూస్తూనే ఉన్నారు. "పాటికంద. పది నెలలైనా పొడవదు. పదిమందికి ఆటొస్తుంది. లోపల పెట్టించమంటారా? రారా బాపీ" అంటూ చయనులుగారి సమాధానానికి ఎదురుచూడకుండా పనసపళ్లు పట్టుకుని పక్క వసారాలోకి నడిచింది.

అవాక్కయి–అందరూ ఆమెకి దారి వదిలారు. మధ్యవసారాలోకి రెండు బస్తాలూ చేరాయి. పనసపళ్లు పక్కనే ఉంచి ఈసారి చయనులుగారు నిలబడిన అరుగును

దాటి–పిల్లలు నిలబడిన అరుగువైపు నడిచింది తంబళ్లమ్మ–

"శలవు బాబుగారూ" అంటూ. అబ్బుశాస్త్రికి ముఖాముఖిగా వచ్చాక ఆగింది తంబళ్లమ్మ. వెళ్లిపోతోందనుకున్న ఆమె ఆగడాన్ని ఎవరూ ఊహించలేదు పిల్లలతో సహా. ఇప్పుడు ఆమెకి ఎదురుగా ఉన్నాడు అబ్బుశాస్త్రి. అతని ముఖంలోనూ ఆశ్చర్యం ద్యోతకమైంది.

"ఆరోజు ఏం చూసి బెదిరావు చిన్నరాజా?" అంది తంబళ్లమ్మ అనురాగం, ఆప్యాయతా ఉట్టిపడుతున్న గొంతుతో–అతి లాలింపుగా. హఠాత్తుగా అబ్బుశాస్త్రి కళ్లలో నీళ్లు నిండాయి. మనస్సులో ఆలోచనలు–ఒకవేళ ఉన్నా–అతని పెదాలు సహకరించలేదు. హఠాత్తుగా అనువాకాన్న ఎత్తుకున్నాడు:

"సమిధోయజతి వసంతమేవర్తునా మవరుంధే ।
తనూనపాతం యజతి గ్రీష్మమేవా వరుంధే ॥"

ఎన్నోసార్లు విన్నారు అబ్బు గొంతు పూరించిన ఈ మంత్రాన్ని. తర్వాత ఏమొస్తుందో అక్కడ ఉన్న అందరికీ తెలుసు. అందరూ అసంకల్పితంగా గొంతు కలిపారు.

"ఇడో జయతి వర్షా వరుంధే బర్హిర్యజతి శరదమేవా వరుంధే

అబ్బు ముఖంలో అనుకోని వెలుగు తొణికిసలాడింది. అబ్బుశాస్త్రి కంఠంలో తర్వాతి అనువాకం అసంకల్పితంగా జాలువారింది.

"అశ్మన్నూర్జం పర్వతే శిశ్రీయాణాం వాతే పర్జన్యే వరుణస్య సుష్మే
అద్భ్య ఓషధీభ్యో వనస్పతిభ్యో అధిసమ్భృతాం పయః ॥"

చయనులుగారి ముఖంలో చిరునవ్వు మొలిచింది. సోమిదేవమ్మ కళ్లు చింతపువ్వులయ్యాయి. తంబళ్లమ్మ తెల్లబోయింది. ఊహించని ఈ ఉపద్రవానికి ఏం చెయ్యాలో ఎలా స్పందించాలో తోచలేదు. ఇది ఆమెకి తెలీని, అర్థంకాని ప్రపంచం.

"కారు కాలవలోకి పోయింది–దాంట్లో ఇద్దరు–" అన్నాడు సర్వమంగళం నోట మాట తెచ్చుకుని.

"అయ్యో! చినతండ్రీ! ఎంత బెదిరావయ్యా" అంటూ అబ్బుశాస్త్రి బుగ్గలు పుణికి గుర్రబ్బండీ ఎక్కి కూర్చుంది. గుర్రబ్బండి వచ్చినప్పుడు ఎక్కువమంది గమనించలేదు.

చెంగుచెంగున దూకుతూ–కంచుగజ్జెలు గణగణలాడిస్తూ–వీధి దాటిన బండీని అందరూ వరసలో ప్రభని చూసినట్టు నోరెళ్లబెట్టుకుని చూశారు.

తంబళ్లమ్మకి వచ్చిన పని అయిపోయింది. వస్తుతః ఆమెలో ఏ కోశానా దుర్మార్గం లేదు. కీడు తలపెట్టే ఆలోచన లేదు. కాగా దైవచింతన ఉంది. పాపభీతి ఉంది. పరోపకార

చింతన ఉంది. అన్నిటికీ మించి–తన ప్రయోజనాన్ని కాపాడుకునే మెలకువ ఉంది. ఆ రాత్రి రెండో ఝామున రాజమండ్రిలో ఫోన్ మ్రోగింది. అటుపక్క గొంతు ధైర్యంగా, నమ్మకంగా, తృప్తిగా, ఎక్కువ విశ్రాంతిగా చెప్తోంది.

"అమ్మాయి సంగతి అక్కడెవరికీ తెలియదు. కుర్రాడు చెప్పగలిగే స్థితిలో లేడు" ఇద్దరికే కారులో లీల ఉన్న సంగతి తెలుసు ఆనాటికి. ప్రస్తుతం తంబళ్లమ్మకి. ఆరోజు కళ్లారా చూసిన అబ్బుశాస్త్రికి. ఒకరికి చెప్పాల్సిన అవసరం లేదు. మరొకరు చెప్పగలిగే స్థితిలో లేరు.

## 7

ఓ పెద్ద విపత్తు నెత్తిమీద పడినప్పుడు–విచిత్రంగా ఆ విపత్తులో తలమునకలైనవారందరిలోనూ ఏ ఒక్కరో బాధని నెత్తిన వేసుకోడానికి మిగులుతారు. ఇది ఒక సమూహంలో అనిర్వచనీయంగా జరిగే మానసికమైన ఏర్పాటు. ఎవరూ చెప్పరు. అలా జరిగిపోతుంది. అంతే. This is a weird psychological occurance in a dire need of a group handicap. ఈ విపత్తువల్ల ఎవరెక్కువ నష్టపోవడమూ, పోకపోవడమో కారణం కానే కాదు. ఎవరూ నిర్దేశించని బాధ్యత ఆ కూటమిలో ఒక్కరికి మిగిలిపోతుంది.

అతి నేలబారు ఉదాహరణ: మందు తాగిన కూటమిలో–అందరూ ఒకేవిధంగా పుచ్చుకున్నా, అందరికీ న్యాయంగా ఒకేవిధంగా మత్తెక్కవలసి ఉండగా ఆఖరి అవసరానికి ఒక వ్యక్తి స్పృహలో మిగులుతాడు. ఇది విచిత్రమైన మినహాయింపు.*

---

*** ప్రఖ్యాత హిందీ నటుడు, 'షోలే' చిత్రంలో గబ్బర్‌సింగ్ పాత్రతో ప్రపంచాన్నే ఉర్రూత లూగించిన అంజాద్ ఖాన్‌తో కలిసి ఒక తెలుగు చిత్రంలో (పినిశెట్టి రవిరాజా 'సాహస పుత్రుడు') పని చేశాను.**

**ఆయన గొప్ప షేక్స్పియర్ రంగస్థల నటుడు, ఆయన చెప్పిన సంఘటన ఇది. ఒకసారి ముంబై సమీపంలో కుటుంబంతో కలిసి ప్రయాణం చేస్తూఉండగా కారుకి భయంకరమైన యాక్సిడెంట్ జరిగింది. అతనితో సహా-అందరూ తీవ్రంగా గాయపడ్డారు. అందరూ స్పృహ తప్పిపోయారు. అతనికీ భయంకరమైన గాయాలయ్యాయి. కానీ స్పృహ పోలేదు. కళ్లముందు తన వాళ్లందరూ రక్తసిక్తమైన శరీరాలతో పడి ఉన్నారు.**

**ఎలాగో రోడ్డుమీదకి వచ్చి ఆ దారిన వెళ్ళే ప్రతీ వాహనాన్నీ ఆపడానికి ప్రయత్నం చేశాడు. అందరూ యాక్సిడెంటుని గమనిస్తున్నారు.**

**అంజాద్ ఖాన్‌ని గుర్తుపడుతున్నారు. ఆ కారణానికే ఆపడం లేదు. కారణం? బహుశా అది**

ఈ కథకూ, ఈ ఆలోచనకూ పొంతన ఏమిటి? అబ్బుశాస్త్రి నెత్తిన పడ్డ పిడుగు ఆ కుటుంబాన్ని ఎంతగా ఛిద్రం చేయగలదో, చేసినప్పటి పర్యవసానమేమిటో నిర్ద్వంద్వంగా గుర్తుపట్టిన వ్యక్తి ఒకరున్నారు. అతను సర్వమంగళం. మరో నాలుగేళ్లకు అతనికి సంహితలో 44 పన్నాలూ పూర్తవుతాయి. అయినా ఆ పని చెయ్యదలుచుకోలేదు. సర్వమంగళానికి అబ్బుశాస్త్రి బాహిరప్రాణం. అతని అపస్మారాన్ని చూసి ఆకులాగ వణికిపోయిన వ్యక్తుల్లో సర్వమంగళం మూడవ వ్యక్తి. మొదటి ఇద్దరూ–చయనులుగారూ, సోమిదేవమ్మ. సర్వమంగళానికి తనకున్న అర ఎకరం సాగుమీద వచ్చే ఆదాయంతో వేదం చెప్పిస్తున్న విధవరాలు మేనత్త బుచ్చిరాముడు ఉంది. జేగురుపాడు ఆమె స్వస్థలం.

గురువుగారి దగ్గర ఒక మంచిరోజు శలవుతీసుకుని–ఇంటికి వెళ్లిపోయాడు.

ఇదేమిటి? ఛిద్రమైన పరిస్థితిలో బాసటగా నిలవవలసింది పోయి–ఆ వాతావరణానికి దూరంగా వెళ్ళడమేమిటి? సర్వమంగళం మనస్సులో స్థూలమైన ప్రణాళిక ఉంది. దాన్ని అతికుశాగ్రతతో, నిర్దుష్టంగా తీర్చిదిద్దుకున్నాడు.

వెళ్లేముందు ఒక్క అబ్బుశాస్త్రితోనే ఏకాంతంగా చెప్పాడు. “అబ్బూ! ఇప్పుడు నేను వెళ్తున్నది ఎప్పుడూ నీతో ఉండడానికే. ఎందుకు వెళ్తున్నానని అడగకు. ఎక్కడికి వెళ్తున్నావని అడగకు. ఎప్పుడు వస్తావని అడగకు. ఒకనాడు–నా అవసరం నీకూ, ఈ కుటుంబానికి ఉంది. అది మనిద్దరం తీర్చుకోవలసిన రుణం. ఆ అవసరాన్ని ఎదుర్కొనే ఆసరాని కల్పించుకుని గుమ్మంలో అడుగుపెడతాను” అన్నాడు.

అతని మాటలు అర్థం కాలేదు అబ్బుకి. కానీ చంకలో మూట అతను వెళ్లిపోతున్నాడు అని చెప్తోంది. ఇద్దరూ ఒకే చాపమీద పడుకుని, కలిసి వల్లె వేసుకునేవారు. ఇప్పుడు ఆ సాన్నిహిత్యం దూరమవుతోంది.

అబ్బుశాస్త్రి కళ్లల్లో నీళ్లు తిరిగాయి. ఇది ఆలోచనకి పర్యవసానం కాదు. ఇన్‌స్టింక్ట్. రోగి రుగ్మతని పోగొట్టే వైద్యుడు రోగి బాధని చూసి వగవడు. సర్వమంగళం చలించలేదు.

---

**పెద్ద క్రిమినల్ కేసేమో? ఎక్కించుకుంటే తాము ఇరుక్కుంటారు. ఇంలాంటివేవో భయాలు. కొన్ని గంటలు నిస్సహాయంగా ప్రయత్నం చేశాడు అంజాద్ ఖాన్.**

**చివరికి ఎవరో నిలిపారు. అందర్నీ బండిలో ఎక్కించారు. కొన్ని గంటల్లో కారు ముంబై చేరుకుంది. ఎదురుగా ఆసుపత్రి బోర్డుని చూశాడు అంజాద్ ఖాన్. ఇక తమకి భయంలేదు. సురక్షిత ప్రాంతానికి చేరారని మనస్సు చెప్పింది. అంతే. అతనికి స్పృహ తప్పిపోయింది.**

**రెండు నెలల తర్వాత కళ్లిప్పాడు. ప్రాణాన్ని కాపాడడానికి అతని శరీరంలోకి స్టెరాయిడ్స్ విపరీతంగా ఎక్కించారు. ప్రాణం నిలిచింది. కానీ శరీరం బరువెక్కింది. అది వేరే కథ.**

సోమిదేవమ్మకి సాష్టాంగ ప్రణామం చేసి–మంచినీళ్లు నింపిన రాగిచెంబు ఇవ్వమన్నాడు. నీరు ప్రాణధాతువు. ఆ కుటుంబంతో రుణాన్ని గట్టిపరుచుకునే సర్వమంగళం ప్రయత్నమది. సోమిదేవమ్మకీ కళ్లనీళ్లు తిరిగాయి.

గంపెడు సంసారంలో ఒకడు దూరమవుతున్నాడు.

"ఎందుకురా వెళ్తావు మంగళా! ఉండరాదూ?" అంది గాద్గదికంగా.

"ఉండడానికే వెళ్తున్నానమ్మా. చీమ రెక్కలు ముక్కలు చేసుకునే కష్టం రానున్న శ్రావణానికి గొడుగుపట్టడానికే. "వసంతే వసంతే జ్యోతిపాయజేత" యజ్ఞం చేయకపోతే అన్నం పుట్టదన్నారు గురువుగారు. అందుకే ఈ ప్రయత్నం"

సర్వమంగళం నిష్క్రమణ ఎవరికీ అర్థం కాలేదు. చయనులుగారు మాత్రం నిశ్శబ్దమైపోయారు.

"ఇప్పటిదాకా సాగిన చదువు వాడి భవిష్యత్తుని నిర్దేశించుకునేపాటి శక్తి నిచ్చింది. వాడు సంస్కారి. ఎక్కడున్నా ఓడిపోడు. ఆపడానికి మనమెవరం?" వెళ్లమన్నారు. సర్వమంగళం మాయమయ్యాడు.

❖ ❖ ❖

ఆ రావడం రావడం సరాసరి విజయవాడ కనకదుర్గమ్మ ఆలయానికి వచ్చాడు సర్వమంగళం. కృష్ణానదిలో స్నానంచేసి అమ్మవారి సమక్షంలో కూర్చుని బాల అష్టోత్తరాన్ని 108 సార్లు చేశాడు.

"అష్టత్రింశత్త్యై, సుషుమ్నే చారుమధ్యమే..." అంటూంటే అప్పుడు ఎదురుగా ప్రత్యక్షమయ్యారు పుల్లి పరమేశ్వర శర్మగారు. దీపశిఖలాగ వెలిగిపోతున్న కుర్రాడు ఆయన్ని నిలబెట్టేశాడు. అమ్మవారికి ప్రదోషకాల అర్చన ఆయన నియమం. దుర్గగుడి మెట్లపక్కనే వారి నివాసం.

"ఎవర్రా అబ్బాయి?" అన్నారు అటు వెళ్తూ ఆగి. సర్వమంగళం కళ్లు విప్పాడు. ఎదురుచూసిన మూర్తి సమక్షంలో ప్రత్యక్షమైనట్టనిపించింది.

''నేను అమ్మవారికోసం ఇక్కడ కూర్చోలేదు. ప్రదోషకాలానికి ఎదురుచూస్తున్నాను–మీరు వస్తారని" అన్నాడు. ఆశ్చర్యపోయారు శర్మగారు. "అదేమిటి?" అన్నారు.

ఆదరించే ఆశ్రయాన్ని వెతుక్కుని వెళ్లడం ఒక పద్ధతి. ఆ ఆశ్రయాన్ని ఆకర్షించడం మరొక పద్ధతి.

"గురువుగారి దగ్గరికి వచ్చినప్పుడు తమర్ని చూశాను. సాంసారికమైన బాధ్యతల కారణంగా–విద్యని వ్యావహారిక జీవనానికి అన్వయించుకున్న మహానుభావులు మీరు. నేను కర్రా వేంకట శ్రీనివాస పెదచయనులుగారి శిష్యుడిని" అంటూ ప్రవర చెప్పి ఆయనకి సాంష్టాంగప్రణామం చేసాడు.

చయనులుగారి పేరు వినగానే శర్మగారి ముఖం వెల్లివిరిసింది.

"పువ్వులు పూసి, కాయలు కాసే మహావృక్షాన్ని వదులుకుని కలుపుమొక్కకోసం ఇంత దూరం వచ్చావా?" అని నొచ్చుకున్నారు పక్కనున్న గట్టుమీద కూర్చుంటూ.

పుల్లి పరమేశ్వర శర్మగారి గురించి గురువుగారింట్లో తరుచు ప్రసక్తి వచ్చేది. కలుపుమొక్కగా తనని తాను పేర్కొన్న శర్మగారు చయనులుగారి దగ్గర ఋగ్వేదం చెప్పుకుని, రామచంద్రుని కోటీశ్వరావధాన్లుగారి దగ్గర తర్కం చదువుకుని, తండ్రిగారి వీపుమీద రాచపుండు అయితే–తండ్రిగారిని చూడడానికి పెడనకి కాక సరాసరి వారణాశి వెళ్ళి గిరిరాజ మిశ్రాగారి దగ్గర మంత్రశాస్త్రంలో రాచపుండు చికిత్సకి అనుపానులు మాత్రం వంటపట్టించుకుని–18 నెలల తర్వాత ఇంటిముందు బండి దిగారు.

తండ్రిని చూస్తే అర్థమైంది–ఆయన అవసానం మలుపులో ఉన్నాడని. అయితే ఏం? కర్మ పరిపాకాన్ని కడిగేసుకుని కొత్త వలువలకోసం మరో జన్మకి సన్నద్ధులవుతున్నారు. ఈ జన్మాంతరంలో చిన్న విముక్తి–ఆయనకి కాదు–పితృఋణం తీర్చుకునే తనకి.

రాచపుండుని మంత్రశాస్త్రంతో ఛేదించారు.

తండ్రి కళ్ళిప్పి "చిన్నా, వచ్చావా? నీ కోసమే చూస్తున్నాను" అన్నారు. ఆ జీవితానికిదే ఆఖరి మాట, చూపు. తదాదిగా గంపెడు సంసారం బాధ్యత మీద పడింది. ఈదుకుని వస్తున్నారు.

"ఏదీ? కృష్ణయజుర్వేదంలో అరణ్యకంలో నారాయణ ఉపనిషత్తులో 'అపోవా ఇదగ్ం...' చెప్పు" అంటూ చతికిలబడ్డారు. శంఖాన్ని పూరించిన సర్వమంగళంతో తనూ గొంతు కలిపారు. ఆలయంలోకి వస్తున్న భక్తులకు అమ్మవారు ఎటువైపు ఉన్నదో అర్థం కాలేదు. ఇటు విద్యాస్వరూపిణి, అటు మూలవిరాట్టు. అందరూ–దొరికిన ఆసనాలు పుచ్చుకుని చతికిలబడిపోయారు అమ్మవారికి అభిముఖంగా.

అరగంట తర్వాత–ఉదయంనుంచీ పచ్చిమంచినీళ్లు కూడా తాగని సర్వమంగళం తృతీయ సవనంలో మంత్రాన్ని వర్లిస్తూ సొమ్మసిల్లిపోయాడు.

తనతో వచ్చిన శిష్యులు మోసుకురాగా గుడిమెట్లు దిగారు శర్మగారు.

❖ ❖ ❖

సర్వమంగళం ఏం చెయ్యాలనుకున్నాడో అతనికి మొదటినుంచీ ఒక ప్రణాళిక ఉంది.

ముక్కామల నుంచి విజయవాడ రావడంలో అతని లక్ష్యం విద్య కాదు. ఉపాధి. ఇదేమిటి? సురక్షితంగా విద్యని ఉపాసించే వేదపండితునిలో ఈ అపశృతి? ఇది అపశృతి కాదు. విద్యని జీవనానికి అన్వయించుకోవడం. అందుకు తమ గురువుగారి దగ్గర విద్యని అభ్యసించిన పుల్లి పరమేశ్వర శర్మగారే మంచి ఉదాహరణ.

సరస్సులో ఏ మూలనో పడిన రాయి సరస్సునంతా రెపరెపలాడిస్తుంది. ఆనాటి కాలువగట్టున సంఘటనకి ఇది మరొక ప్రకంపన. ఆ సంఘటన ఓ కుర్రాడిని అచేతనుడిని చేసింది. మరొకరిని జీవితంవైపు తరిమేసింది. ఈ రెంటికీ ఏమైనా ముడి ఉందా? ఉంటే అది ప్రస్తుతం సర్వమంగళం మనస్సులో ఉంది. విద్యకి విలువకట్టే ప్రక్రియని చేబడితే దాని రాణింపు అనూహ్యం. మన దేశపు అరాచకమే అందుకు మంచి ఉదాహరణ. అచిరకాలంలో సర్వమంగళం పట్టణమంతా అల్లుకున్నాడు.

పాతూరివారూ, కొమ్మినేనివారూ, పాలూరివారూ, అనిశెట్టివారూ వార్షీకాలిచ్చారు. అగ్నిశిఖలాగ వెలిగిపోతున్న ఋత్విక్కు పురోహితుడైతే విశ్వాసం పునాదులు బలపడతాయి. సంప్రదాయం వేళ్ళు తన్నుకుంటుంది. కాగా, సర్వమంగళం మూలాలు ధనార్జనలో లేవు. కర్తవ్య నిర్వహణలో ఉన్నాయి. సిగరెట్టు కాల్చడం వ్యసనమున్నవాడు సిగరెట్టు ప్యాకెట్టుకోసం అర్రులు జాచడు. కేవలం ఒక సిగరెట్టు ఆ క్షణానికి చాలు. అతని లక్ష్యం అతని వృత్తిని అపూర్వమూ, అనితరమూ చేసింది. రెండు సంవత్సరాలలో సర్వమంగళం సామ్రాజ్యం విస్తరించింది. వక్కలపాడు జమీందారు వీరేశ్వరరావు కూతురుకి ఉబ్బసం ముదిరితే మండలంపాటు సువర్చలా హోమం చేయించాడు. సువర్చలని ఎందుకు? రుగ్మత వాయుసంబంధం. ఊపిరితిత్తులకు సంబంధించినది. సువర్చల సూర్యపుత్రిక. సకల మనోరథపూరణి. ఆమె ఆరోగ్యం క్రమంగా కుదుటబడింది. వీరేశ్వరరావుగారు ఆనందపులకితులై 50 మంగళసూత్రాలు చేయించి పెళ్ళి చేసుకుంటున్న ప్రతీ కన్యకూ అమ్మాయిచేత ఇప్పించారు. ఆరోజుల్లో సర్వమంగళానికి 16 రూపాయలు వార్షీకం ఇచ్చారు. రూపాయల్ని మొదటిసారి చేత్తో ముట్టుకున్నాడు సర్వమంగళం.

మంత్రానికీ, వితరణకీ లొంగిన కథ చుట్టుపక్కలంతా పరిమళించగా వీరేశ్వరరావుగారమ్మాయిని పెళ్లి చేసుకోడానికి గుజరాత్‌లో వ్యాపారం చేస్తున్న కుర్రాడు ముందుకు వచ్చాడు.

వీరేశ్వరరావుగారు ఆనందంతో కరిగి నీరైపోయారు. కన్యాదానానికి అల్లుడు

కాళ్లు కడిగేముందు సర్వమంగళం కాళ్లు కడిగి మొగల్రాజపురం గుహదగ్గర పన్నెండు సెంట్ల భూమిని కానుకగా ఇచ్చి మరీ పీటలమీద కూర్చున్నారు. విద్య విలువైనది. విశ్వాసం మరీ ఖరీదైనది. ప్రతిఫలాక్ష లేని విద్వత్తు సత్ఫలాలను ఆశించని కారణంగా ఒలకబోస్తుంది. 'ఒలకబోత' సరైన మాట.

క్రమంగా సర్వమంగళం సామ్రాజ్యంలో పాలుపంచుకోవడానికి–సహాయకులు కావలసివచ్చారు. స్మార్తాన్ని మాత్రం చెప్పుకుని గురువుగారి అడుగుజాడల్లో నడిచే ఎనిమిదిమంది సమకూరారు. మొగల్రాజపురంలో సిమెంటు గోడలతో రెల్లు పరిచిన ఇల్లు సిద్ధమైంది. శర్మగారిచేత పుణ్యాహవాచన చేయించి ఓ మంచిరోజు గృహప్రవేశం చేశాడు. ఇంతమందికి వంట చెయ్యడానికి మేనత్త బుచ్చిరాముడు ఊరునుంచి వచ్చింది. ఆమె చంకలో బట్టలమూట, వెంట వయస్సొచ్చిన కూతురు పేరిందేవి. బొత్తిగా పొట్టి. సత్తెకాలపు మనిషి. మాటలు ముద్దగా మాట్లాడుతుంది. నాలుగు మాటలు మాట్లాడితే నోటి కుడివైపు చొంగ కారుతుంది. ప్రతీ చిన్న విషయాన్నీ మనస్ఫూర్తిగా నమ్మే మనిషి.

"ఇవాళ సూర్యుడు పడమటన ఉదయించబోతున్నాడు" అంటే "అయ్యో, మరి సంధ్యావందనం ఎప్పుడు చేసుకుంటారు?" అంటుంది.

అయితే రోడ్డుపక్క కళ్లిప్పిన గడ్డిపువ్వులోనూ భగవంతుడు తనదైన ముద్రని నిలుపుతాడు. ఆమె చేతివంట అమృతం. బుచ్చిరాముడు వంట సంతర్పణ వంట. పేరిందేవి ఆత్మీయంగా పచనాన్ని చేస్తుంది. మరొక గొప్ప సౌందర్యం–ఆమె కళ్లు. ఆ కళ్లల్లో ప్రత్యేకత ఏ కల్మషమూలేని నిజాయితీ. అతివిచిత్రమైన ఉత్కర్ష. అమాయకమైన ప్రశ్న.

సర్వమంగళమూ, అతని అనుచరులూ ఏకగ్రీవంగా పేరిందేవి చేతివంట మరిగారు. బుచ్చిరాముడు కూరలు ఉడికించి, కావలసిన సరుకులన్నీ సమకూర్చి ఉంచుతుంది. అతితేలికగా, యథాలాభంగా పేరిందేవి తాళింపు వేస్తుంది. అంతే. వంట అమృతమైపోతుంది. బ్రాహ్మణుల విస్తర్లు షడ్రుచులతో గుబాళిస్తాయి.

పుల్లాబెల్లం వేసి కాకరకాయ కూర చేసిపెట్టిననాడు సర్వమంగళం మురిసిపోయి, మరో వాయి ఎక్కువ కలుపుకుని "దేవీ! ఇవాళ నీ వంట మరీ గుబాళించింది. ఏం కావాలో చెప్పు" అన్నాడు తృప్తిగా తేనుస్తూ.

"మా అమ్మ" అంది పేరిందేవి, తన తల్లి కొంగు వెనుక ముఖాన్ని దాచుకుంటూ.

ఆ క్షణంలో పేరిందేవి ఆకాశంనుంచి దిగివచ్చిన అప్సరసలాగ కనిపించింది. అందం అంటే ఏమిటో సర్వమంగళానికి తెలీదు–గుడిలో అమ్మ తప్ప. అతనికి ఆత్మీయత

అంటే అబ్బుశాస్త్రి. ఆర్ద్రత అంటే గురుపత్ని-సోమిదేవమ్మ. ఆకర్షణ-ముందుకాలపు ఆదర్శానికి తాను ఏర్పరచుకున్న ప్రణాళిక. సర్వమంగళం-జీవితం-ఏకోస్మిఖం. గజిబిజి లేదు. కానీ ఆషాఢమాసంలో ఒక రాత్రి ఒక విచిత్రమైన సంఘటన జరిగింది.

మూడోర్ఘామున కుండపోతవర్షం కురుస్తూ మధ్యమధ్య పిడుగులతో ఆకాశం బద్దలైంది. మొగల్రాజపురం కొండమీద ఒక పిడుగు పెటిల్లున పడింది. సర్వమంగళం ఓ రాత్రి తుళ్లిపడి లేచాడు. వసారాలో వేసుకున్న నులకమంచంమీద-తన పక్కనే ఏదో కదిలినట్టయితే తుళ్లిపడ్డాడు. కాశీనుంచి తెచ్చుకున్న ధావళీ కింద ఎవరో కదిలినట్టయింది. గుడ్డిదీపం వెలుగులో ధావళిని తొలగించాడు. ముద్దలాగ ముడుచుకుపోయి తనమీద ఎడంచెయ్యి చుట్టుకుని పేరిందేవి పడుకుని ఉంది ఒణికిపోతూ. చటుక్కున లేచాడు.

"పేరిందేవీ!" అని లేపాడు. "భయమేస్తోంది" అంటూ పొయ్యిలో వెచ్చదనాన్ని ఆహ్వానించే పిల్లిలాగ ముడుచుకుపోయింది పేరిందేవి.

"ఏమిటి? ఇక్కడ? ఇలాగ?"

మూడు ప్రశ్నలూ పూర్తయేలోపున గుర్రుపెడుతోంది. అతని చుట్టూ ఉన్న చెయ్యి ఆసరాకి అల్లుకున్న తీగెలాగ మరీ బిగుసుకుంది.

ఆ చేతిలో దురుద్దేశం లేదు. ఆలోచన లేదు. మనిషిలో భయానికి ప్రాథమికమైన స్పందన అది.

సర్వమంగళానికీ ఆ స్పర్శకి అర్థం తెలీదు. ఆ ఆలోచనలు అతనికి అలవాటులేనివి. ప్రచోదన లేని రెండు స్తబ్ధ ప్రవృత్తుల మధ్య మొదటిసారిగా శృంగారం వీగిపోయింది. సర్వమంగళానికి ఈ సంఘటన ఇబ్బందిగా ఉంది. పేరిందేవికి ఈ సంఘటన ధైర్యాన్నిచ్చింది. శృంగారానికి ఆ రెండూ ఉపాధులు కావు! వేదాన్ని చెప్పుకున్న పండితుడు, కొన్ని వందల పెళ్ళిళ్లు చేయించిన పురోహితుడు "ఆవాభ్యాం కర్మాణి కర్తవ్యాని ప్రజాశ్చోత్పాదయితవ్యాః" అని గుర్తించి, ధర్మార్థ కామరూపాలైన పురుషార్థాల సాధనకే వివాహమని భావించాడు. విచిత్రంగా ఆ దశకి గుర్తుగా అతనిలో ఒక నేరాన్ని చేస్తున్న భావన మేల్కొంది. వెంటనే దానికి పరిష్కారాన్ని నిర్ణయించుకున్నాడు.

పొద్దున్నే లేచి ప్రాయశ్చిత్తంగా గాయత్రిని 1008 సార్లు జపంచేసి-ఒక సంవత్సరానికి సరిపోయే గ్రాసాన్ని, డబ్బునీ ఇచ్చి-ఒక మనిషిని సాయం ఇచ్చి బుచ్చిరాముడినీ, పేరిందేవినీ జేగురుపాడు పంపించేశాడు. పేరిందేవికి సంబంధం కుదిరితే తను స్వయంగా వచ్చి పెళ్లి జరిపిస్తానని బుచ్చిరాముడుకి మాట ఇచ్చాడు.

## 8

వర్షం కుండపోతగా కురిసిన తెల్లవారుఝామున–పెరట్లోకి వెళ్లబోయి వసారాలో జారిపడ్డాడు చయనులుగారు. పెటిల్లున ఆయన మోకాలి ఎముక విరగడం–ఇంటిల్లిపాదికీ తెలిసింది. అంతా పరుగున వచ్చారు.

ఆయన కట్టుకున్న పంచె తడిసి ముద్దయ్యింది. పెద్ద శరీరం. పైగా గురువుగారు. అందరూ అవాక్కయి నిలబడిపోయారు. అనుకోకుండా అందరినీ తోసుకు ముందుకు వచ్చాడు అబ్బుశాస్త్రి. ఆరేళ్ల పసిపాపని ఎత్తుకున్నట్టు చయనులుగారి చేతిని తన భుజం చుట్టూ తిప్పుకుని రెండు చేతుల్లోకీ శరీరాన్ని ఇముడ్చుకున్నాడు. కొడుకు చేతుల్లో తండ్రి పసివాడైపోయాడు. ఆ సపర్యకే చయనులుగారి శరీరానికి అనూహ్యమైన ఉపశమనం లభించింది.

సోమిదేవమ్మ బట్ట మార్చింది. సాయంకాలానిక పుత్తూరు వైద్యుడు వచ్చి రెండు వెదురుకర్రలతో కట్టుకట్టి ఆరు వారాల్లో ఎముకలు అతుక్కుంటాయని ధైర్యం చెప్పి వెళ్ళిపోయాడు. తదాదిగా అందరికీ ఒకే ఒక ఇక్కట్టు గుర్తుకొచ్చింది.

చయనులుగారికి సకాల సంధ్యావందనం వ్రతం. ఏ రోజు ఏ ఘడియకి సూర్యోదయం అవుతుందో ఆ క్షణాన మొలలోతు నీళ్ళలో నిలిచి అర్ఘ్యప్రదానం ఇస్తారు. అది వారి దైనందిన చర్య. కాలు విరగడంకాక, తన దినచర్య చెడినందుకు వికవికలాడిపోయారు చయనులుగారు.

కాగా, భాద్రపద మాసం ప్రవేశించినప్పటినుంచి బెంగ ఎక్కువైంది. రానున్నది మహాలయ అమావాస్య. పితృదేవతలకు తర్పణాలు వదలాలి. మాసశివరాత్రి కూడా గడిచింది. ముందురోజు రాత్రి చయనులుగారికి నిద్రపట్టలేదు. తెల్లవారుఝామున ఎవరో లేపినట్టయి కళ్లిప్పారు.

అబ్బు ఆయన్ని పొదివి పట్టుకుని భుజాన వేసుకున్నాడు. కాలవగట్టుకు అలా ఎత్తుకునే మోసుకుపోయాడు.

చయనులుగారు పరవశించిపోయారు. ఆశ్చర్యమేముంది? తల్లి సౌకర్యానికి నదిని ఆమె కాళ్ల దగ్గరికి తెచ్చిన ఆదిశంకరుల వారసత్వం ఈ జాతిది. తండ్రి వ్రతనిష్ఠని నిలపడానికి కొడుకు తండ్రినే భుజాన్న వేసుకుని ధర్మనిరతిని కాపాడిన సంస్కృతి ఈ జాతిది.

ఊరంతా ఈ చర్యని కథలాగ చెప్పుకున్నారు. ఆ తండ్రిది ఏమదృష్టం? అని పొంగిపోయారు. అబ్బు ముఖంలో ఏ కవళికలూ లేవు. ఓ బాధ్యత ఆ బరువుని మోయించింది. ప్రతిరోజూ ఆ తండ్రీ కొడుకులు కాలవగట్టుకి రావడాన్ని గుర్తుగా

పెట్టుకుని సూర్యుడు ఉదయించాడు. సత్కర్మ నిర్మాతి నూత్నసమయం.

ఆ ఊళ్ళో ఆ దృశ్యం దైనందినం.

ఓ రోజు దారిలో కాలవ పక్కన గుడిసెలో ఉంటున్న కల్లు ఈతగాడు ఉప్పర పెదతాతయ్యలుని పెళ్లాం లేపబోయింది. "లేవరాఅయ్యా. ఇవాళ కమ్మ దింపాల" అంటూ. "ఉండవే గంజికావిడి పంతులింకా రానేదు" అని విసుక్కుని అటు పొర్లాడు.

అబ్బు జన్మమూలాలు తెలిసిన పండితులు ఆర్ద్రతతో మంచుముద్దలయ్యారు. "ఎక్కడ ఎవరికి పుట్టాడో, సంస్కారం కులానిది, జాతిది కాదు. వ్యవస్థది. పెరిగిన వాతావరణానిది. పెంచుకున్న విలువలది. పెంపకానిది".

❖ ❖ ❖

వీరేశ్వరరావుగారి కూతురు వర్ధని పెళ్లి కాగానే ఆయన గుండె గుఱ్ఱమెక్కి దోసకాయలపల్లి వెళ్లిపోయింది. కారణం–అల్లుడికి అక్కడ మామిడితోటలూ, కొబ్బరితోటలూ, జామతోటలూ ఉన్నాయి.

వీరేశ్వరరావుగారి అయిదు ప్రాణాలకూ జమిలిగా ఒకే అడ్రసు–ఆయన కూతురు. కాగా, విశ్వాసం అంటుకట్టిన మొక్కలాంటిది. ఆధారం దొరకగానే ఏపుగా విజృంభించింది. సర్వమంగళం సువర్చలా హోమంతో వీరేశ్వరరావుగారు తేల్చుకున్న విషయాలు రెండు. ఒకటి : జీవితంలో చాలా రుగ్మతలకి ఆర్షధర్మంలో సమాధానాలున్నాయని. రెండు : ఆ సమాధానాల గుత్తాధికారి సర్వమంగళం అని. తత్కారణంగా విజయవాడనుంచి సర్వమంగళం మకాంని రాజమండ్రికి మార్పించడానికి శతధా ప్రయత్నించాడు. అప్పటికే వృత్తిలో నిలదొక్కుకున్న సర్వమంగళం అందుకు సిద్ధంగా లేడు. అప్పుడొక రాజీని కుదుర్చుకున్నాడు వీరేశ్వరరావు. కూతురు పూనుకున్న ప్రతీ పూజకీ, వ్రతానికీ, హోమానికీ అతనే సారథ్యం వహించాలని.

సర్వమంగళం తరచు రాజమండ్రి వెళ్ళిరావడానికి అంగీకరించాడు. కాని అతనికి తెలియని విషయం ఏమిటంటే–సువర్చల హోమంతో బాగుపడిన ఊపిరితిత్తులు వర్ధనివి. విశ్వాసానికి అక్కడ పెద్దపీట. ఆవిడ ఏడాది పొడుగునా ఏ పూజా, వ్రతమూ, నోమూ, ఆరాధన–పర్వ ఏకాదశి, సంకటహర చతుర్ధి, వరలక్ష్మి వ్రతాలు, కార్తీకమాసంలో నత్తాలు, క్షీరాబ్ది ద్వాదశి, ధనుర్మాస పూజ–ఇలా వేటినీ వదిలిపెట్టకుండా పూనుకుంది. విజయవాడ, రాజమండ్రి మధ్య సర్వమంగళం ప్రయాణాలు భరించలేనంత తరుచుగా జరుగగా–వీరేశ్వరరావుగారు ఒక పరిష్కారాన్ని సూచించారు. రాజమండ్రిలో ఒక ఇంటిని ఏర్పాటుచేసి అక్కడ ఉండే సౌకర్యం. నిస్సహాయంగా సర్వమంగళం అంగీకరించాడు.

వెంటనే దానవాయిపేటలో ఇల్లు కుదిరింది.

వసతులన్నింటితో స్వయంగా వీరేశ్వరరావుగారే సర్వమంగళాన్ని గృహప్రవేశం చేయించారు. ప్రతి పూజకీ సర్వమంగళానికి దోసకాయలపల్లి నుంచి గుర్రబ్బండీ వస్తుంది. పైగా రాజమండ్రిలో ఉన్న కారణాన అప్పుడప్పుడు గురువుగారినీ, అబ్బునీ చూసి రాగల అవకాశం కలిసివచ్చింది. అంతకంటే సర్వమంగళం జీవితంలో పెద్ద మలుపుకి రాజమండ్రిలో ఉనికి కారణమైంది. అది ముందు కథ.

❖ ❖ ❖

రాజమండ్రిలో కోటితీర్థాల రేవుగట్టున కూర్చున్న మనిషిని రోజూ చూస్తున్నాడు సర్వమంగళం. అతన్నే రోజూ చూడడానికి కారణముంది. ఆ సమయంలో–బ్రహ్మ ముహూర్తాన–తనుకాక అతనొక్కడే ఉంటాడు కనుక. అతన్ని గమనించడానికి మరొక కారణం కూడా ఉంది. ప్రతీరోజూ అంగవస్త్రం, గావంచాతో వచ్చి స్నానం చేస్తున్నాడు సర్వమంగళం. ప్రతిరోజూ గళ్లలుంగీ, బనీనుతో వచ్చి కూర్చుంటాడు ఆయన. తను సంధ్యావందనం చేసుకుని, సమకపారాయణ ముగించి రేవుగట్టునే అంగవస్త్రాన్ని ఆరేసుకుని, ఆరేదాకా పరాయితాన్ని వల్లెవేసుకుంటాడు. అతను కాలుమీద కాలేసుకుని పక్కనే ఉన్న చిన్న ట్రాన్సిస్టర్ రేడియోలో పాటలు వింటూంటాడు. తనది సంప్రదాయ పాలన. అతనిది బొత్తిగా సంప్రదాయ విరుద్ధం. మరి ఇంతోటి పనికి బ్రహ్మముహూర్తం ఎందుకు? రాత్రి నిద్దరపట్టకా?

సంప్రదాయాన్ని ధిక్కరించే ధోరణిలోను ఎక్కడో చిన్న క్రమశిక్షణ ఉంది. ఏ రోజూ వేళ తప్పడు. ఏ రోజూ కార్యక్రమంలో మార్పు లేదు. ఏ రోజూ తనని పట్టించుకోలేదు. నెలరోజుల తర్వాత ఉండబట్టలేక తనే కల్పించుకుని పలకరించాడు.

"తమ పేరు?" సమాధానం సర్వమంగళాన్ని నిశ్చేష్టుడ్ని చేసింది.

"నాకు మూడు పేర్లున్నాయి. ఏ పేరు చెప్పమంటారు?"

అర్థం కాలేదు.

"మొదటిది చెప్పండి"

"పెద్దలు పెట్టిన పేరు ఆశ. తర్వాత ఏర్పడిన పేరు దురాశ. చివరికి నిలిచిన పేరు దూరాశ"

నిర్ఘాంతపోయాడు సర్వమంగళం. పైపంచె ఆరుతోంది. గట్టుమీద కూలబడ్డాడు. మనిషిని కదిపితే మనల్ని కదలకుండా నిలిపే శక్తి ఏదో ఈ మనిషిలో ఉంది– అనిపించింది.

"అదేమిటి?" అన్నాడు.

కొత్త సిగరెట్టు తీసి, పాత పీకతో అంటించి పొగ వదిలాడు. "పసుపుకొమ్ముతో బియ్యంలో రాసిన పేరు ఆంజనేయ శర్మ. ఆ విధంగా 'ఆశ' అయ్యాను. నేను పుట్టాక, మా నాన్న రామకోటి రాయడం ప్రారంభించి, రెండుసార్లు రామకోటి రాసి– ఉపనయనంనాడు మళ్ళీ బారసాల చేసి నన్ను రామశర్మని చేశాడు. ఇంటిపేరు దుగ్గిరాల. ఆ విధంగా 'దురాశ' అయ్యాను. నవ్వాడు. నవ్వినప్పుడు స్పష్టంగా తెలిసింది– ముందువరసలో ఒక పన్ను లేదు. ఆశ్చర్యంగా – పన్ను లేకపోవడం ఆ ముఖానికి సహజంగానే కనిపించింది.

అన్నీ తెలిసిన, లేదా తెలుసుకోవాలన్న విజ్ఞతో, అవగాహనో ఆయనలో ఉన్నదని సూచించే తృప్తికరమైన నవ్వు అది. "మరో ప్రశ్న మిగిలిపోయింది కదూ?"

సర్వమంగళం మాట్లాడలేదు.

"మూడోసారి రామకోటి రాస్తూ – భద్రాచలంలో రాములవారి దర్శనం చేసుకుని–జియ్యరుస్వామి ఆశ్రమంలో భోజనంచేసి ఆ రాత్రి శ్రీరామ కవచాన్ని పఠిస్తూ ప్రాణం వదిలేశారు. మా అమ్మనీ, నన్నూ నా మేనమామ తన ఇంటికి తీసుకెళ్ళి సాకారు. పిల్లల్లేని ఆయన నన్ను దత్తత తీసుకున్నారు. ఆయన దుర్వాసుల విభీషణశాస్త్రి. ఆ విధంగా నా 'దురాశ'ని 'దూరాశ'ని చేశారు–పగలబడి నవ్వాడు. దత్తత కారణంగా నాకు బోలెడు ఆస్తి కలిసొచ్చింది. చదవడానికి చార్టెర్డు అకౌంటెన్సీ చదివినా దాని ఉపయోగం బొత్తిగా లేని తీరుబాటు జీవితంలో ఏర్పడింది. "ఇంత చిన్నవయస్సులోనే–నాకు 46–మూడు అనర్థాలను జతచేశాడు భగవంతుడు'' తూర్పు తెల్లవారుతోంది. ఆశ్చర్యంనుంచి తేరుకోలేదు సర్వమంగళం.

"అంత సనాతన కుటుంబంనుంచి వచ్చిన మీరు–ఈ అవతారమేమిటి?"

"ఆ కుటుంబం కారణంగానే బ్రహ్మముహూర్తానికి మీలాగే ఇక్కడికి స్నానానికి వస్తున్నాను. మీకంటే పది నిముషాల ముందే నా స్నానం ముగుస్తుంది. ఇక ఈ వికారం. ఇది ఈ శరీరం కోరుకున్న లేదా అలవాటుపడిన వ్యసనం. నా జీన్స్‌లో మీ తరాలు ప్రోదుచేసిన విశ్వాసాలున్నాయి. అయితే మా తరం కెలికిన ఆలోచనలూ ఉన్నాయి. ఈ రెంటికీ పొంతన కుదరడంలేదు. మిమ్మల్ని చూస్తే–ఆలోచనకి అందనివారికి చాదస్తుల్లాగ కనిపిస్తారు. ఇంకా కుండబద్దలుకొట్టేవారికి మూర్ఖత్వం అనిపిస్తుంది. మరికొందరు–చాదస్తాన్ని 'మతం' చేసి వ్యాపారం చేసుకునేవారు మీ పరిస్థితిని బొత్తిగా చెడగొట్టారు. కాని ఇన్ని తరాలవారూ మూర్ఖులు కారే! ఇదీ నా విచికిత్స. అంకెల్ని అనుకూలంగా సర్దే పని చార్టర్డ్ అకౌంటెన్సీ. ఆ శాస్త్రం సహాయంతో తమకనుకూలంగా

సర్దేసిన సంప్రదాయానికి కారణాలు వెదికే ప్రయత్నం చేస్తున్నాను. చదువు తిరిగబడితే నా వ్యాపకం అవుతుంది. నేను లెక్కల మనిషిని. కనుక చాదస్తాన్ని దాటి విశ్వాసాల వెనుక ఆలోచనల మూలాలను పట్టుకోడానికి ప్రయత్నిస్తున్నాను. ఆశ్చర్యమైన విషయం చెప్పమంటారా? మీరు చేసే ప్రతీ పని వెనుకా అద్భుతమైన అన్వయం ఉంది. లాజిక్ ఉంది. అయితే మీరు చెప్పే ప్రతీ మాట వెనుకా ప్రస్తుతం మీ విశ్వాసమే ఉంది. అందుకే మీ 'ఆచరణ'లో సత్యం ఉన్నా మీ ప్రపంచంలో దానికి తూకం లేదు"

సర్వమంగళం ఆశ్చర్యపోయాడు. ఇతని మనస్సులో ఈ ఆధునిక స్వరూపం వెనుక విశ్వాసాలకు మూలాలను వెదికే భారతీయుడు ఉన్నాడు–అనుకున్నాడు. "మీరింకా నా ప్రశ్నకు సమాధానం చెప్పలేదు"

దూరాశ నవ్వాడు. "ఇంత చెప్పాక మీకు ఇంకా ప్రశ్న గుర్తుండడం విశేషం. మీరు స్నానం ఎందుకు చేస్తారు? శరీరాన్ని పరిశుభ్రంగా ఉంచడానికి. నేనూ అందుకే చేస్తున్నాను. మీరు బ్రహ్మముహూర్తంలో ఎందుకు చేస్తున్నారు? సూర్యుని తొలి కిరణాలలో శరీరానికి అవసరమైన ఉపకారం ఉంది కనుక. నేనూ ఆ ఉపకారాన్ని అందుకుంటున్నాను. మతాలను పక్కనపెడితే–పరిశుభ్రంగా చలవబట్టలు వేసుకుని చర్చికి వెళ్లే క్రైస్తవుడూ, మనసా వాచా మోకాళ్ళమీద మోకరిల్లి ప్రార్థనచేసే మహమ్మదీయుడూ ఆ పనే చేస్తున్నారు. హిందువుగా మీకు కలిసివచ్చేవి సూర్యకిరణాలు. మిగతా ఇద్దరూ దీన్ని నష్టపోతున్నారు. పరవాలేదు. కానీ ఉద్దేశంలో లోపం లేదు"

"ఇంకా సమాధానం"

"చెప్తాను. మడిబట్ట పేరిట చివికి కంపుగొట్టేదాకా తడిబట్టని ధరించడంలో పవిత్రత ఉన్నదని ఏ మతమూ చెప్పదు. ఇది చాదస్తం. అనూచానంగా వస్తున్న సంప్రదాయం–అంటే అలవాటు–మీకా సత్యాన్ని చెప్పింది. కానీ మీ లక్ష్యం మడిబట్ట కాదు. 'మడి' అపరిశుభ్రత నుంచి మిమ్మలని మీరు కాపాడుకోవడం. అంతవరకే. పోతే, మీకో అపశృతి ఉంది. నాకు మరొకటి ఉంది. మీది ముక్కుపొడుం. నాది సిగరెట్టు"

సర్వమంగళానికి నవ్వొచ్చింది. ఈ 'దురాశ'ది 'దూరాశే'ననుకున్నాడు. అనుకొని ఇంటికి బయలుదేరాడు. కాని ప్రతి ఉదయం అతని ఉనికి పలకరిస్తోంది. "నమస్కారం పంతులుగారూ!" అంటున్నాడు దూరాశ ఇప్పుడిప్పుడు.

మనకి జాతకాలమీద నమ్మకం ఉండదు. కాని చెప్పేవాడు కనిపించాడు. ఏదో ప్రశ్న అడగాలనుకోవడం–చిన్న చిలిపితనం. "ఈ చింతచెట్టుకి కాయలు ఎప్పుడు కాస్తాయంటారు?"

'నా తుమ్ములు గురువు ధనుస్సులో ప్రవేశించేనాటికి ఆగుతాయంటారా?'

"మా తమ్ముడికి ఎప్పుడు పెళ్లవుతుంది?" ఇది నమ్మకం చాలని అన్వేషణపట్ల చిన్నచూపుకి నిదర్శనం.

కాని విచిత్రంగా ప్రతీ సమాధానంలోనూ దూరాశ తనని తనవైపుకి లాక్కొంటున్నాడు. క్రమంగా రోజూ ఓ చిలిపి ప్రశ్న–కాదు–అర్థం ఏనాడూ వెదకని ప్రశ్నని సిద్ధంచేసుకుంటున్నాడు సర్వమంగళం.

"పొలమారినప్పుడు దేవుడి పేరు చెప్పమంటారే–ఇందులో మతం ప్రమేయం ఉందంటారా?"

నవ్వాడు దూరాశ. "మొదట మీ ప్రశ్నలో కొన్ని తప్పుల్ని సవరించాలి" అన్నాడు గొలుసు సిగరెట్టు వెలిగిస్తూ. "అది పొలమారడం కాదు–పొరమారడం. గొంతులో రెండు నాళాలున్నాయి. ముక్కుతో పీల్చే గాలిని ఊపిరితిత్తులకు చేర్చేది. తినే అన్నాన్ని ఉదరకోశానికి చేర్చేది. అన్నం వాయునాళంలోకి వెళ్తే మనిషి చచ్చిపోతాడు. సందేహం లేదు. అలా చచ్చిపోయిన మనిషిని నాకు తెలుసు. ఆరోజుల్లో మనకి ఎలక్ట్రిక్ దీపాలు లేవు. పల్లెల్లో ఆముదం ప్రమిదల్లో పోసి ఒత్తిని వెలిగించేవారు. తర్వాత కిరసనాయిలు దీపాలు వచ్చాయి. అన్నం పొరమారితే ముందు శరీరమే ఎదురుతిరుగుతుంది. వాయునాళంలో ఒత్తిడి దాన్ని బయటికి తోయాలని ప్రయత్నిస్తుంది. పూర్తిగా తోసిందా? ఇతను ఆపదనుంచి బయటపడినట్టేనా? మిణుకుమనే దీపాల వెలుగులో తేల్చుకునేదెలా? నోటిలోంచి మాట రావాలంటే గొంతులో గాలి కదలాలి. కదలుతోందా? మాట్లాడే మనిషికి ఆలోచనా, అవయవం–రెండూ సరిగా పనిచేస్తున్నట్లేనా? స్పష్టంగా తెలియడానికి నిత్యజీవనంలో కదపగానే ఎవరైనా చెప్పగలిగే మొదటి ప్రశ్న.

"దేవుడు పేరు చెప్పు?" చెప్పాడనుకోండి. తర్వాత చిన్న స్పృహనిచ్చే ప్రశ్న : "నీ పేరు?" చెప్పాడనుకోండి.

"ఒక పువ్వు పేరు చెప్పు" చెప్పగలిగితే మూడు జరిగినట్టు. ఒకటి : అనర్థం జరగలేదు. రెండు : ఆలోచన కలిసివచ్చింది. మూడు : విచక్షణ వచ్చింది. వాయునాళం చక్కబడి, మాటకి వాయువు తోడై శరీరావయవంతో పనిలేని ఆలోచన చక్కబడింది. అంతే. మళ్ళీ భోజనానికి ఉపక్రమించవచ్చు. న్యాయంగా మీరడగాల్సిన ప్రశ్న అది కాదు. కాని మీరెందుకు అడిగారంటే "పిచ్చి ముండాకొడుకుల్లారా! పొలమారడానికీ, దేవుడికీ లంకె ఎందుకురా?" అని కొందరి మనస్సుల్లో అనిపిస్తుంది కనుక. ఒకటే సమాధానం. ఆనాటివారికి దేవుడు బొత్తిగా అంటరానివాడైపోతాడని ఊహించి ఉండరు. కనుక, ఇప్పటి పరిభాషలో–"మీ పార్టీ పేరు చెప్పు" లేదా "మీ జెండా రంగు చెప్పు" అని అడగండి. గొంతునాళానికి మతం లేదు"

సర్వమంగళం నిర్ఘాంతపోయాడు. పొలమారడానికి ఇంత అర్థాన్నీ, అన్వయాన్నీ తానెప్పుడూ వినలేదు. ఇదొక క్రాస్ వర్డ్ పజిలులాంటిది. మొదటినుంచీ సర్వమంగళం కొన్ని విశ్వాసాలను నమ్ముతున్నాడు.

"ఆకాశంలో దేవుడున్నాడు"–సముద్రంలో ఎందుకు లేడు? ఉన్నాడు బాబూ అక్కడా ఉన్నాడు. చీమలో, బ్రహ్మలో ఉన్నాడు. అసలు విశ్వాసానికి కాళ్లూ, చేతులూ లేవు. విశ్వాసం సూర్యబింబం. వెలుగునిస్తుంది. ఎప్పుడు ఇస్తుంది? ఎంత ఇస్తుంది? ఎందుకు ఇస్తుంది? దాని ప్రమేయం కాదు. శాస్త్రం ఎందుకో చెప్తుంది. ఈ ప్రశ్నలకు సమాధానాలు ఎవరో ఎప్పుడో ఆలోచించే ఉంటారు కదా? అదీ రామశర్మ మీమాంస.

ఓనాడు అతి వివాదాస్పదమైన ఏనాడూ ఆలోచించని ప్రశ్నని సంధించాడు సర్వమంగళం.

"మనం ఏటేటా పితృదేవతలకి పితృయజ్ఞం చేస్తాం. తద్దినం పెడతాం. పితృదేవతలు రాబోయే తరాలను ఆశీర్వదిస్తారని మంత్రం చెప్తారు. దీన్నెలా సమర్థిస్తారు?"

రామశర్మ చటుక్కున లేచి పద్మాసనం వేసుకుని కూచున్నాడు "చాలా పెద్ద ప్రశ్న వేశారు" అంటూ.

"సమాధానాన్ని హెచ్చరికతో ప్రారంభిస్తాను. హిందూ ధర్మాన్నీ, శాస్త్రాన్నీ, అందులో శతాబ్దాలుగా మన పూర్వీకులు మనకిచ్చిపోయిన సత్యాలనూ నూటికి నూరుపాళ్లూ నమ్ముతున్నాను. వాటిని సహేతుకంగా అర్థం చేసుకోవడం–మరో విధంగా చెప్పాలంటే అవి 'హేతువు'కి లొంగే నిజాలా అని ప్రశ్నించడం, అన్వయం చేసుకోవడమే నా ప్రయత్నం. మీకూ నాకూ తేడా లేదు. చేత్తో ఓ పండుని పట్టుకుని మీరు 'ఇది దానిమ్మపండు' అంటున్నారు. నేను పండుని విప్పి 'దానిమ్మపండు అంటే ఇది' అనడానికి ప్రయత్నిస్తున్నాను".

సర్వమంగళం నవ్వుకున్నాడు. ఇది గడుసువాడి సాకు అయినా కావాలి. తెలివైనవాడు–ముందుగా తెరిచి ఉంచుకున్న పలాయనమార్గమైనా కావాలి.

ఏమైనా సమాధానం–ఈ చదువుకున్న వ్యక్తి–శతాబ్దాల ఆచారానికి ఇవ్వగల అన్వయం ఏమిటి?

"విషయాన్ని అతి స్థూలంగా చెప్తాను. దేవతలకు చేరాల్సిన ఏ పదార్థాన్నైనా అగ్నిహోత్రుడు చేరుస్తాడని వేదం చెప్తోంది. ఎవరా దేవతలు? వాళ్లేం చేస్తారు? మానవాళి శ్రేయస్సుని కాపాడుతారు. వాళ్ల అవసరాల్ని తీరుస్తారు. అలా తీర్చేవారే దేవతలు. మన వృక్షసంపదా, మన గనులూ, వర్షం పడడానికి కారణమైన మేఘాలూ, పంటలూ–అన్నీ, అందరూ మన శ్రేయస్సుని కాపాడే దేవతలే. మనకి వృక్షం దేవత, సస్యలక్ష్మి దేవత.

వీటిని మనం కాపాడుకోవాలి. ఆరాధించాలి. అవి ఇచ్చే ఫలాన్ని కృతజ్ఞతతో స్వీకరించాలి. దీనికి పురోహితుడు ఎవడు? బ్రాహ్మణుడు. బ్రాహ్మణుడు నిత్యకర్మ చెయ్యాలి. అనుష్ఠానం చెయ్యాలి. నిత్య ఔపాసన జరగాలి. ఈ కర్మకాండల్లో అగ్నిహోత్రం ద్వారా భూమికి చేరవేసే నెయ్యి, బియ్యం, చేనువ్వులు, దర్భలూ, కట్టెలు–ఇవన్నీ కొన్ని లక్షల కోట్ల సంవత్సరాలు recycle అవుతున్నాయి. ఇదొక వలయం.

ఒకపక్క యజ్ఞం అనే పేరిట మానవుడు సృష్టిలో మూలపదార్థాలను భూమికి అగ్నిహోత్రం ద్వారా అందజేస్తున్నాడు. మరోపక్క వృక్షాలూ, గనులూ లక్షల సంవత్సరాలు వీటిని మానవ వినియోగ వస్తువులుగా మలిచి ఖనిజ సంపదగా మనకి అందజేస్తున్నాయి. ఇదే దేవతలు చేసే, చెయ్యగల పని. అయితే బ్రాహ్మణుడే ఎందుకు చెయ్యాలి? ఈ వలయాన్ని గుర్తించాడు గనక. అందుకే మిగతా వర్ణాలు అతన్ని పోషిస్తాయి. అతను ఈ నిరంతర వలయానికి అవగాహన గల custodian. ఇప్పుడు ఆ పని బ్రాహ్మణుడు చేయడంలేదు. మిగతా వర్ణాలు చేసే పనినే చేస్తున్నాడు. ఇది బాధ్యతాభ్రష్టత్వం. ఇదే బ్రాహ్మణుడు చేసే అనర్థమని ఒకానొక ప్రసంగంలో చంద్రశేఖరేంద్ర సరస్వతీస్వామి పేర్కొన్నారు". *

శతాబ్దాలుగా మానవుడు కేవలం విశ్వాసం పెట్టుబడిగా ఈ వలయాన్ని కాపాడుకుంటూ భూమికి అనుబంధమైన దేవతల ఆశీర్వాదాన్ని పొందుతున్నాడు. రాబోయే తరాలన్నీ ఆ వరాలను పంచుకున్నాయి. ఇవాళ మనం దురాశతో కొన్ని వందల సంవత్సరాలు కాపాడగలిగిన ముడిపదార్థాలను–అది నూనెగానీ, ఖనిజంగానీ, బొగ్గుకానీ–తోడేస్తున్నాం. మరోపక్క ప్రకృతికి చేర్చవలసిన 'అర్పణ'ని చేర్చడంలేదు. అందువల్ల పర్యావరణంలో అరాచకం ప్రబలింది. సృష్టిలో సమతుల్యం దెబ్బతింది. త్సునామీలూ, భూకంపాలూ మొదలైన ప్రకృతి వైపరీత్యాలు మానవాళిని కబలిస్తున్నాయి" కాస్సేపు ఆగి–

---

*** "బ్రాహ్మణుడు తన బాధ్యతలను పూర్తిగా విస్మరించాడు. తన పూర్వీకులు ఆచరించిన జీవన విధానాలను ఇతరులకు బోధించడానికి సైతం అర్హతను కోల్పోయాడు. క్షత్రియ, వైశ్య, శూద్ర జాతులకూ, బ్రాహ్మణ జాతికీ భేదం అంతరించింది. అట్టి స్థితిలో బ్రాహ్మణేతరులు బ్రాహ్మణుని "నీ ఆధిపత్యమేమిటి?" అని ప్రశ్నించడానికి ఆటంకమేమున్నది?**

**- కంచి పరమాచార్య చంద్రశేఖరేంద్ర సరస్వతీ మహాస్వామి,**

**"నడిచే దేవుడు" పేజీ 190**

"విషయాన్ని దాటుతున్నానని అనుకోకండి. ఇప్పటికీ పితృకర్మలో బ్రాహ్మణుడు నిత్యం చెయ్యవలసిన, చెయ్యకుండా మానుకున్న ఔపాసనా యజ్ఞాన్ని జరిపించి, ప్రాయశ్చిత్తం జరిపి, విచ్ఛిన్న ఔపాసనా హోమం జరిపిస్తాడు పురోహితుడు. ప్రాయశ్చిత్తం చెయ్యాల్సింది నిస్సహాయంగా పొరపాటు జరిగినదానికి. తెలిసి మానుకున్నదానికి కాదు. "హోమం" అవసరాన్నే తెలీక, అగ్నిహోత్రం అవసరమే అర్థంకాక, 'ప్రాయశ్చిత్తం' నిత్యకర్మగా మారిపోయిన తరం మనది. ప్రత్యామ్నాయం ఆచారమై, మినహాయింపు సమర్థించుకోడానికి సాకుగా మారిన రోజులివి. ఇప్పుడు మీ ప్రశ్న. ఓ పెద్దాయన చనిపోయాడు. ఆయన్ని పితృదేవత అన్నాం. ఖగోళమానం ప్రకారం సంవత్సర కాలాన్ని ఒక రోజుగా గుర్తిస్తే – ప్రతిరోజూ పితృదేవతల్ని తలుచుకుని 'హోమం' చేస్తున్నాం. హోమం ముఖ్యం. అదీ దేవతలకి అగ్నిహోత్రం ద్వారా ప్రకృతి మూలాల సమర్పణ. ఇది జరిపే బాధ్యత నిజానికి అన్ని వర్గాలవారికీ ఉన్నది.

కాని ఎవరూ చేయడంలేదు. ఎందుకని? అందులో పరమార్థం తెలీక. రెండు : మరేవో దేశాల్లో రకరకాలైన వృత్తుల్లో మునిగితేలడంవల్ల. ఒకపక్క–అత్యంత శ్రద్ధగా ఈ ప్రాథమిక శక్తుల్ని–దేవతల్ని దృష్టిలో పెట్టుకుని నివేదించగలిగితే–లక్షలాది సంవత్సరాల వలయం నిక్షిప్తమౌతుంది. రాబోయే తరాలు–గమనించాలి–ముందు తరాల్ని పితృదేవతలు ఆశీర్వదిస్తారంటే ఫలానా వెంకయ్య కుటుంబమే కాదు. ఈ సంస్కృతి concept వసుధైక కుటుంబకమ్. యావత్ మానవాళికీ కొన్ని లక్షల తరాలుగా జరుగుతున్న కృషి ఫలితం ఇప్పుడు మనం అనుభవిస్తున్నాం. ఇది వలయం. దీన్ని భగ్నపరచకుండా కాపాడి ముందు తరాలకు అందించవలసిన బాధ్యత చాలా గొప్పది. ముఖ్యమైనది. కాని 'తద్దినం' ఇప్పుడెవడిక్కావాలి? 'ఎందుకీ అక్కర్లేని తద్దినం?' అనేదాకా మన తెలివితేటలు పెరిగాయి. మరీ ఛాందసులు పక్కగుడిలో 'స్వయంపాకం' ఇచ్చి చేతులు దులుపుకుంటున్నారు. అసలు ఉద్దేశం అది కాదు. ఈ వలయానికి సంధాతలైన ఇద్దరు భోక్తల్ని సత్కరించి, అగ్నిహోత్రం అనే medium ద్వారా ప్రకృతి శక్తుల్ని నిక్షిప్తంచేసి, రేపటి తరంపట్ల మన బాధ్యతని సభక్తికంగా నిర్వర్తించుకోవడం–పితృదేవతలను–అంటే శతాబ్దాలుగా మన శ్రేయస్సును భగ్నం చేయకుండా మనకు దక్కవలసిన ప్రకృతి నిధులను మనకు మిగిల్చినందుకు కృతజ్ఞతలు చెప్పుకోవడం"

"ఇదీ నేను అర్థం చేసుకున్న కర్మకాండ. మతం, దేవుడు, కర్మ, ధర్మం–వీటిని నమ్మిన జాతికి చక్కని రేపర్లలో చుట్టి insulate చేసిన జీనియస్ మన పూర్వీకులదని

నేను నమ్ముతాను. *

మనం ప్రస్తుతం మన అరకొర తెలివితేటలతో విశ్వాసాన్ని నిలదీసి ఓ గొప్ప కృషిని అటకెక్కించేశాం. "ఇప్పటికి మీకో విషయం అర్థమై ఉండాలి. ప్రకృతిని మొదటినుంచీ దేవతలాగ పూజించి, రక్షించుకుని తన అవసరాలను తీర్చుకుంటూ సహజీవనం చేసిన సంస్కృతి మనది. తమ అవసరాలకు ప్రకృతిని కొల్లగొట్టి తమ

---

*** ఇప్పటి ప్రసక్తి పితృకర్మ. ప్రకృతిలో మానవుడి సయోధ్యను గుర్తించి బాధ్యతగా మన సంప్రదాయంలో పాటించిన దాఖలాలు కోకొల్లలు.**

**16వ శతాబ్దపు కవి పింగళి సూరన తన ప్రబంధం "పద్మావతీ ప్రద్యుమ్నం"లో ఒక ఘట్టం. ఇంద్రుడు ద్వారకకి శ్రీకృష్ణ దర్శనానికి వస్తున్నాడు. అతని రథాన్ని నడిపే మాతలి ద్వారకా నగరాన్ని వర్ణిస్తున్నాడు.**

**అక్కడ బ్రాహ్మణుల ఇళ్లన్నీ నల్లగా మసిబారి ఉన్నాయట. ఎందుకు? ప్రతిదినం వారు చేసే హోమాలతో మసిబారి. ద్వారకానగరంమీద మబ్బుతెరలాగ ఈ ధూపధూమములు వ్యాపించి ఉన్నాయట.**

**"చూశావా స్వామీ! అవి మేఘలాధూపమా అన్నట్టు నిండిపోయిన ఈ నగర సంస్కృతి?" అన్నాడు.**

**"కాలాగరు ధూపధూమతతులో యభ్రంబులో..." అని కవి మాట.**

**"దోహద ధూపధూమములతో కనుపట్టెడు తత్ పరీవనవ్యూహమున్ చూచితే..." ఇది సంప్రదాయాన్ని మాత్రమే సూచించే మాట కాదు. ప్రకృతితో సయోధ్యను ఎరిగిన ఒక సంస్కృతి పరిణతికి నిదర్శనం.**

**ఇంకా వెనక్కివెళ్తే-విశ్వసాహిత్యంలోనే వర్ణనా వైశద్యంలో అనితరసాధ్యమైన సృష్టి చేసిన ఋషి వాల్మీకి మాట-రామాయణం నుంచి :**

**"నవమాస ధ్రుతం గర్భం, భాస్కరస్య గభస్తిభిః**
**పీత్వా రసం సముద్రాణాం, ద్యౌః ప్రసూతే రసాయనమ్"**

**ఆకాశం అనే తల్లి సూర్యకిరణాలతో సముద్రరసాన్ని (ఉప్పనీటిని) పీల్చి (తనలో) తొమ్మిది నెలలు మోసి (తల్లిలాగ), రసాయనంగా (తీయని నీరుగా) మూడు నెలలు వర్షిస్తున్నది.**

**మానవునితో ప్రకృతి సయోధ్య, ప్రకృతిపట్ల తన కర్తవ్యాన్ని నిర్వర్తించడానికి ఆనాటి సంప్రదాయం నిర్దేశించిన బాధ్యతాయుతమైన ఆచారాలు-రెంటికి గుర్తు.**

**ఒకటి : అపూర్వమైన మానవ అవగాహనకి, రెండు : పాటించిన నియతికి.**

పబ్బం గడుపుతున్న సంస్కృతి పాశ్చాత్య నాగరికతది. ధృవాలలో ఉష్ణోగ్రత పెరుగుదల, అడవుల నిర్మూలన కారణంగా అనర్థాలు–త్సునామీలు, భూకంపాలూ–ఇలాంటివి లోగడ మన దేశం ఎరుగదు. వృక్షాన్ని దేవత అంటే అమెరికా విజ్ఞాని నవ్వుతాడు. దేవతకి కన్ను, ముక్కు, గుండెకాయ, కాళ్లూ, చేతులూ ఉండాలని అతని ఉద్దేశం. దేవత లక్ష్యం రక్షణ. మన అన్నం, బట్ట, పుస్తకం, రంగు, వైద్యం అన్నిటికీ చెట్టే కారణం–ఇంతకన్న ప్రకృతిలో నోరున్న దేవత కనిపించదు. ఇంత evolved culture మరే సంస్కృతిలోనైనా ఉందా? ఈ సంస్కృతి సాంద్రత కారణంగానే ఇన్ని కొత్త వెర్రితలలు, వెక్కిరింతలు ఎదురౌతున్నా శతాబ్దాలుగా ఈ సంస్కృతి తన ప్రత్యేకతను నిలుపుకోగలిగింది"

మాట్లాడడం ముగించాడు రామశర్మ. అప్రయత్నంగా లేచి అతని పాదాలకు నమస్కరించాడు సర్వమంగళం. తుళ్లిపడ్డాడు రామశర్మ.

"అయ్యా, ఇది అన్యాయం. వస్తువులో సరుకుని కాపాడుతున్నవారు మీరు. నేను కేవలం రేపరుని విప్పిన వాడిని. లోపల డొల్ల లేకుండా తరాల తరబడి కాపాడుతున్న మీకు దక్కాలి ఈ గౌరవం" అంటూ సర్వమంగళానికి ప్రతినమస్కారం చేశాడు రామశర్మ.

ఆ రాత్రి మూడో ఝామున తుళ్లిపడి లేచి కూర్చున్నాడు సర్వమంగళం. అతని మనస్సులో సంవత్సరాలుగా కరుడుగట్టుకుపోయిన సమస్య చటుక్కున స్ఫురణకు వచ్చింది. అలనాడు ముక్కామల కాలవగట్టున యాక్సిడెంటు చూసింది లగాయతు అబ్బు శాస్త్రి వర్ణిస్తున్న రెండు శ్లోకాలకు అర్థం–ఆ రెండింటి వెనుకా ఉన్న పరమార్థం ఈ రామశర్మ విప్పగలడేమో! ఆలోచన వచ్చిందే తడవుగా సర్వమంగళానికి నిద్ర తేలిపోయింది.

ఒక వస్తువును కేవలం వస్తువులాగే చూసే వ్యక్తికి దాని వెనుకనున్న అన్వయంవైపు దృష్టి పోదు. శతాబ్దాల విశ్వాసాల వెనుక గల అంతరార్థంవేపు దృష్టిని సారిస్తున్న రామశర్మ తాము ఇంతకాలం చూడడం మరిచిపోయిన కోణాన్ని చూడగలడేమో!

బ్రహ్మ ముహూర్తానికి ఒక గంట ముందే కోటితీర్థాల రేవుకి వచ్చి చేరుకున్నాడు సర్వమంగళం.

రామశర్మని చూస్తూనే అతనిమీదకి దూకేశాడు. చీకట్లోంచి దూసుకువచ్చిన సర్వమంగళాన్ని చూసి బిత్తరపోయాడు రామశర్మ.

"పంతులుగారూ! ఇవాళ మీ వాచీ పప్పులో కాలేసింది" అన్నాడు నవ్వుతూ. ఇద్దరూ కలిసి గోదావరిలో స్నానం చేస్తుండగా జరిగిన కథంతా పూస గుచ్చినట్టు చెప్పాడు సర్వమంగళం. అత్యాసక్తితో విన్నాడు రామశర్మ.

అంతా విని నిట్టూర్చాడు. "చాలా దురదృష్టం. కాని ఇందులో స్పష్టంగా అర్థమౌతున్న

విషయం ఒకటుంది. ఒక దుర్ఘటన జరిగింది. మనం తుళ్లిపడతాం. దాని పర్యవసానం మనమీదే పడితే అనుభవిస్తాం. అంతవరకే. కాని అబ్బు శాస్త్రి ఆ సంఘటన తర్వాత ఇన్ని సంవత్సరాలు కోలుకోలేకపోయాడంటే మన కంటికి కనిపించే కారణం మాత్రమే ఉండి ఉండదు. ఆ సంఘటనకీ, అతనికీ బలమైన ముడి ఏదో ఉండి ఉండాలి. అది పరిష్కారమయ్యేవరకూ–అతని మనస్సులో guilt తొలగదు. అంతవరకూ అతను మనిషి కాలేడు. ఒక్కొక్కప్పుడు ఆ 'ముడి' విడకపోతే జీవితాంతం ఇలాగే ఉండిపోయినా ఆశ్చర్యం లేదు. ప్రముఖ గజల్ గాయకుడు జగజిత్ సింగ్ ఒక్కగానొక్క కొడుకు యాక్సిడెంటులో పోయాడు. అతని తల్లి మనస్సులో ఓ బలమైన బంధం తెగిపోయింది. ఆమె అపస్మారంలో పడిపోయింది. ఇక ఎన్నటికీ తేరుకోలేదు"

"మా అబ్బు శాస్త్రి మళ్లీ ఏనాటికైనా మామూలు మనిషి అవుతాడంటారా?" అనడిగాడు సర్వమంగళం. "రేపు మీ ఊరు వెళ్దాం" అన్నాడు రామశర్మ.

రేపు అంటే మరో 24 గంటలు. అంటే మరో 24 యుగాలు ఆ సందిగ్ధంలోనే గడపాలి.

ఆ ఆలోచనతో కొత్త నరకాన్ని కొని తెచ్చుకున్నాడు సర్వమంగళం.

## 9

చయనులుగారిని చూసి పులకరించిపోయాడు రామశర్మ. "ఇటువంటి మహానుభావుల్ని దర్శించినప్పుడు నా ఆలోచనల అవసరంలేదు అనిపిస్తుంది. ఎందుకంటే వారు భారతీయ సంస్కృతికి మూర్తీభవించిన సమాధానంలాగ దర్శనమిస్తారు. సూర్యరశ్మి 'వెలుగు' అని చెప్పడానికి రెండు కళ్లు చాలు" అన్నాడు రామశర్మ.

గురువుగారిని చూసుకుని పొంగిపోయాడు సర్వమంగళం.

ఇప్పుడు చూశాడు–అబ్బుశాస్త్రి ఒడిలో తలపెట్టుకుని పడుకున్న సోమిదేవమ్మని. అతి నిబ్బరంగా, ప్రశాంతంగా తల్లి ఒడిలో సేదదీర్చుకుంటున్న పసిబిడ్డలాగ కనిపించింది ఆ ముత్తయిదువ.

"నాలుగు రోజులనుంచీ దానికి నలతగా ఉంది" అని అన్నారు చయనులుగారు.

"సిద్ధాంతిగారిని పిలిపించారా?" అన్నాడు సర్వమంగళం.

నవ్వారు చయనులుగారు.

"దానికి అబ్బు ఒడి చెయ్యగలిగిన వైద్యం ఎవరూ చెయ్యలేరు. కోలుకుంటుంది" అన్నారు.

అబ్బుశాస్త్రి ఇంకా పరాకుగానే ఉన్నాడు. ఒడిలో సరుకుని ఒలకబోసుకుని దాని విలువ తెలుసుకోలేని దైవోపహతుడిలాగ ఉన్నాడు.

"ఇతనే" అన్నట్టు సంజ్ఞ చేశాడు సర్వమంగళం. ప్రయత్నం చేసినా చెయ్యకపోయినా అలవోకగా సంవత్సరాల తరబడి అబ్బుశాస్త్రి చేసే, చెయ్యగల పని ఒకటుంది. ఆ రెండు మంత్రాలూ చదవడం.

సర్వమంగళం అబ్బు సమక్షానికి వచ్చి అమ్మగారి పాదాల్ని కళ్లకి అద్దుకున్నాడు. నీరసంగా దూరమైన కొడుకుని చూసి నవ్వి "ఎందుకు వెళ్లిపోయావురా మంగళా?" అంది సోమిదేవమ్మ. ఆమె గొంతులో ఆర్తిని గుర్తుపట్టి విలవిలలాడిపోయాడు సర్వమంగళం.

"దగ్గర కావడానికే దూరం వెళ్లానమ్మా–వీడికోసం. ఒకరోజు అబ్బుని మామూలు మనిషిని చేసి తీసుకొస్తాను'' అంటూండగానే రామశర్మ ఆమె పాదాలకు సాష్టాంగపడిపోయాడు.

అయ్యవారిపట్ల భక్తి, అమ్మవారిపట్ల ఆర్తి. అమ్మ ఎప్పుడూ ఒక అడుగు దగ్గరే. ఎన్నో తరాలుగా తెలిసినట్టు ఆమె పాదాల దగ్గర కూర్చున్నాడు. ఎదురుగా–దగ్గరగా అబ్బుశాస్త్రి కనిపిస్తున్నాడు. అతని కళ్లు రెండూ నిప్పురవ్వల్లాగ ఉన్నాయి. అవి నుసికట్టిన మసిబొగ్గులు కావు. మరిగే కాంతిని ప్రజ్వరిల్లే జ్యోతులు. ఏమిటీ కుర్రాడి సమస్య?

సర్వమంగళం అబ్బుశాస్త్రి పక్కన కూర్చుని మంత్రం మొదలెట్టాడు.

"సమిధాయజతి వసంతం ఏవర్తూ నా మవరుంధే"

మొదటి పాదం పూర్తి కాలేదు.

మరో శంఖం అందరూ తుళ్ళిపడేటట్టు పూరించుకుంది :

"తనూనపాతం యజతి గ్రీష్మమేనా అవరుంధే'' ఆ తీవ్రతకీ, ఉద్ధతికీ నివ్వెరపోయాడు రామశర్మ.

అబ్బుశాస్త్రి కేవలం మంత్రం చదవలేదు. మనస్సులో ఏదో ఆవేదననీ, ఆలోచనకి అందని ఆవేశాన్నీ పూరిస్తున్నాడు. అతని గొంతులో నిస్సహాయత, నిర్విణ్ణత, కోపం తెలుస్తోంది.

యజ్ఞం చేసినా వర్షించని మేఘంమీద కసిలాంటిదది. ఏళ్ల పర్యంతం బిగుసుకున్న ఉద్విగ్నత.

రెండో మంత్రానికి సర్వమంగళం ప్రయత్నం చెయ్యలేదు. అలవోకగా జాలువారింది. ఇది కాస్త సంయమనంతో–తొలకరి తరువాత అంతటా పరుచుకున్న వర్షపుజల్లులాగ, తొలికిరణాల తర్వాత వ్యాపించిన ఉదయపు వెలుగులాగ.

మొదటి మంత్రానికి రెండో మంత్రం సమాధానమనిపించింది.

అశ్మన్నూర్జం పర్వతే శిశ్రియాణాం వాతే పర్జన్యే వరుణస్య సుష్మే

అభ్య ఓషధీభ్యో వనస్పతిభ్యో అధి సమ్భృతానాం పయః

నిజానికి ఈ రెండు మంత్రాలూ రామశర్మ ఎప్పుడూ వినలేదు. వినే అవకాశమూ లేదు. కనుక–వాటి అర్థం వెంటనే స్ఫురణకి రాలేదు. వైద్యమంటే ఏమిటో తెలీని వ్యక్తిని వైద్యానికి తీసుకువచ్చాడు సర్వమంగళం.

అయితే ఈ మంత్రాలకూ, వాటి అర్థానికీ ప్రమేయం లేని కోణమేమైనా ఉందా ఈ విచికిత్సలో? శతాబ్దాల విశ్వాసాలకు దగ్గరతోవ వెదుకుతున్న ఈ 'సాహసి'కి ఈ చిన్న ముడిని విప్పే దారి ఏదైనా గోచరిస్తుందా?

"ఈ శ్లోకాల గురించి చెప్పండి" అన్నాడు రామశర్మ.

చయనులుగారు నవ్వారు.

"వీటిని శ్లోకాలనరు. ఇవి వేదంలో భాగం. మంత్రాలంటారు"

సర్వమంగళం తాను విన్న వివరణను విన్నవించాడు.

"కృష్ణయజుర్వేద సంహితలో మంత్రాలివి. మొదటి మంత్రం యాగాలు ఏయే ఋతువుల్లో చేస్తే ఏయే ఫలితాలు వస్తాయో వివరిస్తుంది"

ఆలోచనలో పడ్డాడు రామశర్మ. "ఈ కుర్రాడు ఊహించని సంఘటనని చూశాడు. రెండు శవాలు కళ్లముందున్నాయి. జీవశక్తిని పునరుద్ధరించే యాగం స్ఫురణకు వచ్చింది. బహుశా అతని మనస్సు జరిగినదానికి విరుగుడుని ఆలోచిస్తోందేమో!"

చయనులుగారు నవ్వారు. "అప్పటికి అంత విస్తృతమైన ఆలోచన చేసే వయస్సు కాదు వాడిది"

"రెండో మంత్రం. దాదాపు మొదటి దానికి వివరణలాంటిది. యాగాలను చేయడంవల్ల వర్షాలు పడతాయి. నీరు, ఓషధులు, జీవరాసులు–ఇన్ని వర్ధిల్లుతాయి–అని అర్థం" అన్నాడు సర్వమంగళం.

"ఇంకా స్పష్టంగా చెప్పగలరా?" అనడిగాడు రామశర్మ చయనులుగారిని. చయనులుగారిలో ఉత్సాహం లేదు. సంవత్సరాల తరబడి లొంగని ఈ మీమాంస ఈ క్షణంలో విడుతుందని నమ్మకం లేదు.

ఈ మంత్రాన్ని వందలసార్లు శిష్యులకి పాఠం చెప్పారు. అసంకల్పితంగానే అర్థాన్ని వివరించారు.

"సూర్యుడు జలాశయాలు, వనస్పతుల నుంచి రసాన్ని గ్రహిస్తాడు. ఆకాశంలో మేఘమండలం ఏర్పడుతుంది. వర్షం వస్తుంది. తద్వారా పంటలు పండుతాయి. చెట్లు పుష్పిస్తాయి. ఫలాలు విచ్చుకుంటాయి. అన్నం మానవుడికి లభ్యమవుతుంది. అతని ఆకలి తీరుతుంది. శక్తి పెరుగుతుంది. దుష్టనాశనానికీ, సజ్జనుల శోకనివృత్తికీ ఆ బలం ఉపయోగపడుతుంది. ఇది ప్రకృతి మానవునితో చేసుకున్న పరస్పర ఒప్పందం లాంటిది. సహ జీవనం"

మరింత గందరగోళంలో పడ్డాడు రామశర్మ. ఈ ఆలోచన నిరాసక్తంగా, తీరుబాటుగా, సరళంగా, స్థిమితంగా చేయవలసింది. ఒక పెద్ద యాక్సిడెంటుని చూసి విచలితుడైన యువకుడు ఆదరాబాదరాగా ప్రకృతిలో సహజీవన ప్రేరణ గురించి ఎందుకు ఆలోచించాడు? అందుకు అక్షరాలా ఛిన్నమైన విలయం తన కళ్ల ముందు సాక్షాత్కరించినందుకా? ఇలాంటి వ్యవస్థ ఒకటి ఉండగా-తన కళ్ల ముందు దుర్మార్గమైన అవ్యవస్థ జరిగిపోయినందుకా? ఎవరు జరిపారు? ఉద్దేశం ఏమిటి? అది నిజంగా ప్రమాదమా? ఎవరైనా ప్రయత్నించి చేసినదా? ఇప్పుడు తెలుసుకునే అవకాశం లేదు. తెలియజెప్పే స్థితిలో లేడు అబ్బుశాస్త్రి.

రామశర్మకి ఏ మార్గమూ కనిపించలేదు. తను ఇన్నాళ్లూ ఒడిసి పట్టుకోవాలని ప్రయత్నిస్తున్న 'లాజిక్' ఈ ముడిని విప్పలేకపోతోంది.

కృష్ణయజుర్వేద మంత్రాల్నీ, వాటి అర్థాల్నీ తెలిసిన వ్యక్తి మంత్రాలను చదవడానికి కారణాన్ని పట్టుకోలేకపోవచ్చు. కారణం-కేవలం వాటి అర్థాల లోతుల్ని పరిశీలిస్తూ ఆ బురదలోనే కూరుకుపోతాడు కనుక.

గట్టున నిలబడినవారు స్థూలంగా ఆలోచించగలరు. కాని రామశర్మ ఆ ప్రయత్నంలో వీగిపోయాడు. ఒక్కటి మాత్రం అర్థమవుతోంది. అబ్బు మనస్సు కారణం దొరకని ఏదో చిన్న మెలికలో ఇరుక్కుంది. ఆ మెలికను విప్పగలిగితే-అతను స్వస్థుడే కాదు, మరింత ఉత్సాహాన్ని పుణికి పుచ్చుకుని కొత్త మనిషి అవుతాడని అతని కళ్లు చెప్తున్నాయి. వాటిలో ఓటమి లేదు. పరాజయాన్ని అంగీకరించని ఉదాసీనత ఉంది.

రెండు మంత్రాలూ ప్రకృతి జీవలక్షణానికి సోపానాలు. వేదం నిర్దేశించిన మార్గాలు. మన చుట్టూ వ్యాపించే జీవశక్తిని...

వాట్ నాన్సెన్స్! ఈ కుర్రాడు ఇంత ఆలోచించలేదు. ఇంత ఆలోచించలేడు. మరి ఈ రెండు మంత్రాలే ఎందుకు? దారి తోచడంలేదు.

"ఆలోచనకు లొంగడంలేదు. అబ్బుశాస్త్రికి ఉపకారం చెయ్యాలని ఉంది. ఉద్దేశం తప్ప అదేమిటో అందడంలేదు" అంటూ లేచాడు రామశర్మ. నీరసంగా

నవ్వుకున్నారు చయనులుగారు. చీకట్లోకి విసిరిన రాళ్లలో ఇది నూరవది.

రామశర్మ, సర్వమంగళం టాక్సీ ఎక్కారు. రామశర్మ మనస్సులో ఇదమిత్థమని రూపుదాల్చని ఆలోచనలేవో మసలుతున్నాయి... సర్వమంగళం మాట్లాడుతున్నాడు.

కలిసి పెరిగిన ప్రాణిమిత్రుడి నిస్సహాయత అతని గొంతులో గాద్గదికమౌతోంది. ఆ మాటలు రామశర్మ చెవుల్లోకి వెళ్ళడం లేదు.

"ఆరోజు లగాయితు ఈ రెండు మంత్రాలు తప్ప మరో ప్రపంచం లేదు వాడికి. రెండూ ఒకదానితో నొకటి సంబంధం లేని మంత్రాలు"

తుళ్ళిపడ్డాడు రామశర్మ.

"ఏమిటన్నారు?"

"రెండు మంత్రాలూ ఒక వరుసలోవి కావు. ఒక విషయాన్ని వివరించేవి కావు. నిజానికి ఒక కాండలోవీ కావు"

టాక్సీని అపమన్నాడు రామశర్మ. చూడడానికి యాక్సిడెంటుని చూశాడు కుర్రాడు. అప్రయత్నంగా ఒకదానితో నొకటి పొంతనలేని రెండు మంత్రాలు చెప్పాడు. చెప్తూనే ఉన్నాడు.

రెండు పక్షులు కొమ్మమీదున్నాయి. ఒక పక్షిని కూల్చాడు కిరాతకుడు. ఒకాయన పశ్చాత్తాపపడ్డాడు. పక్షికీ, కిరాతకుడికీ సంబంధం లేదు. అది జీవుని వేదన. స్పందన అంతే.

ఆకాశంలో పెద్ద మెరుపు మెరిసింది. చిన్ననాడు తన కళ్లముందే కాలిపోయిన తల్లి గుర్తుకొచ్చింది. వేసవికాలంలో నిప్పంటుకుని దగ్ధమైపోయిన వరిమేటు గుర్తుకొచ్చింది. రెండూ రెండు వేర్వేరు images.

"కారు వెనక్కి తిప్పు" అని అరిచాడు రామశర్మ. సర్వమంగళానికి అర్థం కాలేదు. రామశర్మ తిరుగుప్రయాణం 40 నిముషాలూ ఉలకలేదు పలకలేదు. కృష్ణయజుర్వేదానికీ, మంత్రాలకూ, వాటి అర్థాలకూ బొత్తిగా సంబంధంలేని ఆలోచనలవేపు అతని మనస్సు పరుగులు తీస్తోంది.

వెళ్లిపోయిన కారు మళ్ళీ ఇంటిముందు ఆగినందుకు ఆశ్చర్యపోయాడు చయనులుగారు. అంత నీరసంలో కూడా సోమిదేవమ్మ ముఖంలో కాస్తపాటి ఆశ్చర్యం ద్యోతకమైంది.

అబ్బు అలాగే తటస్థంగా ఉన్నాడు. మళ్లీ కనిపించిన మిత్రుడిని చూసి ముఖం మాత్రం ప్రసన్నమైంది.

మళ్లీ రెండు మంత్రాలు.

సమిధాయజతి వసంతం... అశ్మిన్నూర్జతే సర్వతే శిశ్రియాణాం...

"ఇవి ఎక్కడి మంత్రాలు ఘనాపాఠిగారూ?" అడిగాడు రామశర్మ.

ఎప్పుడూ ఎవరూ ఈ ప్రశ్న వెయ్యలేదు–ఆ ప్రశ్న అవసరం, ప్రమేయం లేదు కనుక. పిచ్చివాడు పేలాపన చేస్తాడు. వాటిలో అర్థాన్ని వెదకబోవడం–అనవసరం. ఆ మాటే అన్నారు.

రామశర్మ గట్టిగా సమాధానం చెప్పాడు. "అబ్బుశాస్త్రి పిచ్చివాడు కాదు. ఆ మంత్రాలు అసంకల్పితంగా చెప్పలేదు. అతను చెప్పడంలో అతని మనస్సు చేసిన సంకల్పం సంవత్సరాలుగా మనకి చేరలేదు. చెప్పగలిగే స్థిమితం అతని మనస్సుకి లేదు కనుక.

ఆ సంఘటన–షాక్–ఆ స్థిమితాన్ని చెదరగొట్టింది. చెదరగొట్టకముందు–ఆ రెండు మంత్రాలూ ఒక నిర్దిష్టమైన ప్రణాళికతోనే అతని నోటినుంచి వెలువడ్డాయి"

"ఏమిటా ప్రేరణ?"

"అదే... అదే... థౌజండ్ డాలర్ క్వశ్చన్. ఆ మంత్రాలు ఎక్కడివి? రెండు మంత్రాలకూ ఎంత దూరం?"

ఏమిటీ ప్రశ్న! అమ్మ బలవన్మరణానికీ, పల్లెలో గడ్డిమేటు దహనానికీ పొంతన–ఆకాశంలో మెరుపు.

చయనులుగారు లెక్కలు కడుతున్నారు. "మొదటి మంత్రం కృష్ణయజుర్వేదంలో–2వ కాండలో–14వ పన్నం"

"రెండోది?"

"కృష్ణయజుర్వేద సంహితలో–4వ కాండలో–25వ పన్నం"

అబ్బుశాస్త్రిలో చిన్న చలనం కనిపించింది. కాని అది ఎవరూ గమనించలేదు.

"14వ పన్నం–25వ పన్నం. ఎంత దూరం! పద్నాలుగు ఇరవై ఐదు. పద్నాలుగు ఎక్కడ? ఇరవై అయిదు ఎక్కడ?–పద్నాలుగు ఇరవై ఐదు" రామశర్మ మాట పూర్తికాలేదు. అబ్బుశాస్త్రి పిచ్చికేక పెట్టాడు.

"పద్నాలుగు ఇరవై ఐదు"

ఇంటిల్లిపాదీ ఆ కేకకి తుళ్లిపడ్డారు. సంవత్సరాల తర్వాత–రెండు మంత్రాలు కాక–అబ్బుశాస్త్రి మాట్లాడిన మొదటి మాట ఇది.

సోమిదేవమ్మ లేచి కూర్చుంది. చయనులుగారు నిర్ఘాంతపోయారు. రామశర్మ, సర్వమంగళం నిశ్చేష్టులైపోయారు. మరొక్కసారి–అంతే ఆవేశంగా అన్నాడు అబ్బుశాస్త్రి.

"పద్నాలుగు ఇరవై ఐదు"

పదహారు సంవత్సరాల తర్వాత అబ్బుశాస్త్రిలో ఆసక్తికరమైన చైతన్యమిది!!

## 10

వంటింట్లో ఇల్లాలు వంట చేస్తోంది. పనిమనిషికి 24 రూపాయలు ఇవ్వాలి అని చెప్పి భర్త ఆఫీసుకి వెళ్లాడు. పనిపాటలతో ఉన్న ఆ ఇల్లాలు 24 అంకెని ఎలా గుర్తుంచుకుంటుంది? రెండు పచ్చిమిరపకాయలు, నాలుగు చిక్కుడుగింజలు వేరుగా ఉంచుతుంది. అంకెను గుర్తుంచుకోవడానికి ఆమె చేతిలో పరికరాలు అవి. కారుషెడ్డులో మెకానిక్ పని చేస్తున్నాడు. రిపేరుకి 83 రూపాయలు పుచ్చుకోమని చెప్పి యజమాని బయటికి వెళ్లాడు. మెకానిక్ చేతినిండా ఆయిల్ ఉంది. ఏం చేస్తాడు? పక్కనే ఉన్న కారు కిటికీ అద్దంమీద నూనె వేలితో ఎనిమిదీ మూడూ రాస్తాడు. ఇది ఎవరైనా తన వృత్తిలోంచి తనకి ఊతాన్ని ఎంచుకునే చర్య–అసంకల్పితంగా.

అబ్బుశాస్త్రి తన పనిలో–వేదాధ్యయనంలో తలమునకలైన విద్యార్థి. అలనాడు కారుమీద చెట్టుకొమ్మ పడిన మరుక్షణంలో అతని కళ్లముందు నిలిచిన దృశ్యం ఒక కారు దారి తప్పడం. ఏ కారు? ఆ క్షణంలో అతని మనస్సు గుర్తుపట్టి జాగ్రత్తచేసిన జ్ఞాపకం–కారు నెంబరు. ఆ తర్వాత యాక్సిడెంటు. విపత్తు–అనుకోని చావులు. తద్వారా షాక్. దాని దుష్ఫలితం. కారు నెంబరుని తనకి తెలిసిన గుర్తుల్లో మెదడు నిక్షిప్తం చేసింది. ఎలా? రోజూ వల్లెవేస్తున్న పాఠంలోని మంత్రాలుగా. కృష్ణయజుర్వేద సంహిత రెండో కాండలో పద్నాలుగో పన్నంలో మొదటి అనువాకం.

'సమిధా యజతి వసంతం..."

కృష్ణయజుర్వేదంలోని నాలుగో కాండలో 25వ పన్నంలో మొదటి అనువాకం...

'అశ్మన్నూర్జం పర్వతే...'

ఈ అసంకల్పిత చర్య నిప్పులాగ మెరిసేదే. కాని వెంటనే కళ్ళముందు జరిగిన విపత్తు–రెండు శవాలు–అతని జ్ఞాపకం ముందు తెరలు దించాయి. పెద్ద దెబ్బ తగిలినప్పుడు శరీరంలో ఆ భాగం తిమ్మిరెక్కుతుంది. క్రమంగా కండరాలు సడలి నొప్పి తెలుస్తుంది. ఈ తిమ్మిరి కేవలం 16 ఏళ్ళది! సుప్తచైతన్యం ఒకవిధంగా నిరాసక్తమే. కాని ఒకప్పుడు అది చివ్వున మేల్కొంటే! "ఆ కారు నెంబరు 1425" అన్నాడు అబ్బుశాస్త్రి. సందర్భోచితమైన, సందర్భశుద్ధిగల మాటని అబ్బు శాస్త్రి మాట్లాడి 16 ఏళ్లయింది.

అక్కడున్న అందరి మనస్సుల్లో పుష్పవృష్టి కురిసింది. ఆ గొంతు అశరీరవాణిలాగ వినిపించింది. కాదు. మాట్లాడేది అబ్బుశాస్త్రే.

"అమ్మాయి–ఆరేళ్ల అమ్మాయి–కారులోంచి దిగి నడిచిపోయింది"

అందరి నెత్తినా పిడుగు పడింది. ఇంతవరకూ ఈ విషయం అక్కడున్న వారికీ, ఆ మాటకివస్తే ఆ ఊరి వారికీ, ఆనాటి పోలీసులకీ తెలీదు.

మొదట మాట్లాడింది రామశర్మ "ఎవరా అమ్మాయి?"

అబ్బు ముఖంలో సమాధానానికి గుంజాటన లేదు. "కారులో ఉంది. కారులోంచే దిగింది"

అబ్బు చెప్పిన విషయాన్ని గురించి ఆలోచిస్తున్నాడు రామశర్మ. అబ్బు చెప్పడాన్నే గమనించి పొంగిపోతున్నారు–సోమిదేవమ్మ, చయనులుగారు, సర్వమంగళం, మిగతా శిష్యులూ. "అబ్బూ! ఎన్నాళ్లకి నీ నోటమాట విన్నానురా" అతని చెంపలు పుణికిపుచ్చుకుని భోరుమన్నారు చయనులుగారు. ఆనాడు చయనులుగారు చేసే పనిని సోమిదేవమ్మ చేసింది. ఈనాడు సోమిదేవమ్మ చేసే పనిని చయనులుగారు చేశారు. సోమిదేవమ్మ కొడుకు తల నిమిరి "ఏదో ఒకనాడు నువ్వు మాట్లాడుతావని నాకు తెలుసు" అంది గంభీరంగా.

"ఎలా?" ఈ సమాధానానికి తరతరాలుగా మాటలు దొరకవు :

"నేను తల్లిని కనుక"

సోమిదేవమ్మ శరీరంలోని నలతని ఆ క్షణంలో కాకి ఎత్తుకుపోయింది.

అయితే ఇంతోటి సమాచారానికి అబ్బు ఎందుకు? పోలీసు రిపోర్టు తెరిస్తే తెలిసేది కదా? అయితే శరీరానికి కేన్సర్ వచ్చిందన్న రిపోర్టు వైద్యులది. శరీరంలోనే బయటపడ్డ రిపోర్టు ఇది. అబ్బు మనస్సులో కమ్ముకున్న మబ్బులు విడిపోతున్నాయనడానికి–అతను వెల్లడించిన కొత్త సమాచారం–కారులోంచి దిగిన అమ్మాయి.

ఆ అమ్మాయి ఇప్పుడెక్కడ ఉంది? ఎలా ఉంది? అసలు ఆ కారు ఎక్కడుంది? అన్ని సంవత్సరాల కిందట భయంకరమైన యాక్సిడెంటులో ఇరుక్కున్న కారు ఇప్పటికీ గుర్తుపట్టేదిగా ఉంటుందా? చీమలపుట్ట కదిలింది. ఏ ఆలోచనలూ లేక స్తబ్ధమైన అబ్బుశాస్త్రి మనస్సు కొత్త ఆలోచనల్ని కూడదీసుకొంటోంది. ఈ 'ముడి' విడిపోవడం అతని స్తబ్ధతనుంచి విముక్తి. అతని జ్ఞాపకాలనుంచి కాదు. అనెస్థీషియా మత్తు శరీరాన్ని విడిచిపెట్టింది. శరీరంలో సొంత ఆలోచనలు కోలుకున్నాయి.

అబ్బు జాగృతి ఒక అధ్యాయానికి ముగింపు. మరో ముఖ్యమైన అధ్యాయానికి ప్రారంభం.

❖ ❖ ❖

రోడ్డుమీద ఒకడు నడిచిపోతుంటాడు. అతనికి సంబంధంలేని సన్నివేశమేదో రోడ్డుమీద జరిగింది.

ఆ సన్నివేశానికి అతడు కేవలం ప్రేక్షకుడు మాత్రం. అయినా కర్మపరిపాకం ఒక్కొక్కప్పుడు అసంకల్పితంగా అటువేపు లాక్కుపోతుంది.

ఆనాడు–వర్షంపడిన మర్నాడు–చెట్టుకొమ్మ కారుమీద జారిపడకపోతే అబ్బుశాస్త్రి సర్వమంగళంలాగే వేదపండితుడయ్యేవాడు. జీవితానికి 16 సంవత్సరాల గ్రహణం పట్టేదికాదు. మరో విచిత్రం. శతాబ్దాల సంప్రదాయ వైభవానికి దారులు వెదుకుతున్న ఓ చదువుకున్న మేధావికి–కోటి తీర్థాల దగ్గర సర్వమంగళం తటస్థపడకపోతే–అంతకుమించి 16 ఏళ్ళ తాటస్థ్యాన్ని సడలించి ఉండకపోతే–ఈ ఊబిలోకి దిగేవాడు కాదు. ఇది 'ఊబి' ఎందుకు? ఇక్కడ ఎన్నో అర్థంకాని ప్రశ్నలు. అర్థంలేని ప్రశ్నలు. అతను కోరుకున్నదీ కాదు. ఎదురుచూసిందీ కాదు. ఊబిలోకి దిగిన ఒక వ్యక్తిని చెయ్యి పుచ్చుకు లాగడానికి–మరొక వ్యక్తి ఊబిని ఆహ్వానించాడు.

రామశర్మ దరిమిలాను పదిహేను రోజులు ముక్కామలలోనే ఉండిపోయాడు. అబ్బు శాస్త్రి మనస్సులో మిగిలిపోయిన రకరకాల ప్రశ్నలకు సమాధానాల్ని వెదుకుతున్నాడు రామశర్మ. ఆ విధంగా అబ్బు జీవన పరిణామానికి ఆ క్షణంనుంచీ పనిముట్టు అయ్యాడు. 1425 నెంబరు కారు ఇప్పుడెక్కడ ఉంది? అసలు యాక్సిడెంటు కేసు నమోదైన రికార్డులు ఎక్కడున్నాయి? ఎక్కడా లేవు. ఆ వివరాలు ఎవరికీ గుర్తులేవు.

ఆ రికార్డులు ఎనిమిదేళ్ల కిందట కాలువ పొంగినప్పుడు కొట్టుకుపోయాయి–అన్నారు పోలీసులు. పోలీసులు తలుచుకుంటే నిన్నటి రికార్డులు కొట్టుకుపోడానికీ వరదలొస్తాయి. రాజకీయరంగంలో జరిగే అనర్థాలన్నీ 'పేరాశ'కి సంబంధించినవి మాత్రమే కావు. అధికారం, అహంకారం–అన్నిటికీ మించి అలసత్వానికి సంబంధించినవి.

అబ్బుశాస్త్రి రామశర్మతో కాలువగట్టుకి వచ్చాడు. ఆనాటి సంఘటనని పూస గుచ్చినట్టు చెప్పాడు. వేదం చదువుకుంటున్న విద్యార్థి ఒక్క పొల్లు తేడా రాకుండా మనస్సులో అంతకాలం మరుగునబడ్డ దృశ్యాలను ఆ క్షణం జరిగినట్టు ఆవిష్కరించాడు. ఆనాడు–కాలువగట్టున–అతని కళ్లముందు స్పష్టంగా కారులోంచి దిగి దూరంగా నడిచి వెళ్ళిపోయిన ఆరేళ్ల పసిపాప నిలిచింది. అప్రయత్నంగా కళ్లనీళ్లు తిరిగాయి. ఆనాడు ఆ యాక్సిడెంటు జరిగి ఉండకపోతే ఆ పిల్ల తల్లిదండ్రుల ఆలనలో ఉండేది. ఇప్పుడు ఎక్కడ ఉందో? ఏం చేస్తోందో? ఆమె ఏకాకితనానికి పరోక్షంగా తన బాధ్యత ఉంది.

పరాకుగా ఉన్న అబ్బుశాస్త్రిని రామశర్మ పలకరించాడు. "నీకు ఆనాటి కారు

నెంబరు తెలిసింది. కనీసం అది కారు నెంబరని తెలిసింది. నీ మనస్సు అసంకల్పితంగా ఆ నెంబరుని రికార్డు చేసింది. ఇప్పుడేం చేస్తావు?"

"ఆ అమ్మాయి ఎక్కడ ఉంది?"

"తెలిస్తే ఏం చేస్తావు?"

అంతవరకూ ఆ ఆలోచన రాలేదు అబ్బుశాస్త్రికి. అనుకోకుండా దుఃఖం తోసుకొచ్చింది. భోరుమన్నాడు. రామశర్మ అతన్ని పొదివిపట్టుకున్నాడు.

ఒక అపస్మారం నుంచి తేరుకుని మరో రకమైన అపస్మారంలోకి ప్రవేశిస్తున్నాడా? సమాధానం వెదుక్కునే స్థితి ఇంకా అతనికి రాలేదు. న్యాయంగా ఇది గమ్యంలేని ముగింపు. ఒక వ్యక్తి షాక్‌నుంచి తేరుకుని బయటపడిన క్షణం. అక్కడ ఆ కథకి తలుపులు మూసేయవచ్చా?

"ఆ అమ్మాయి ఎక్కడుంది?" రామశర్మకి అతని ఆలోచనాధోరణి అర్థమౌతోంది. ఆనాటి యాక్సిడెంటుకి బాధ్యత తనదేనన్న ఆలోచన ఇతని మనస్సులో గట్టిపడుతోంది. లోకానికి ఇంతవరకూ తెలియనిదీ, అబ్బుశాస్త్రి ఒక్కడికే తెలిసినదీ–ఆనాటి విపత్తు కారణంగా ఓ పసిపిల్ల అనాథ అయిందని. అతని మనస్సులో నేరం చేశానన్న భావం రూపుదిద్దుకుంటోంది. Guilt. అబ్బుశాస్త్రి అందులోంచి బయటపడాలి.

అబ్బుశాస్త్రి ఆలోచనాధోరణిని పూసగుచ్చాడు రామశర్మ.

ఇది ఒక మీమాంసకు ముగింపు కాదు. ఒక భయంకరమైన కార్యాచరణకు ప్రారంభం. ఇప్పుడు–ఇప్పుడు–ఎటువేపు ప్రయాణం చెయ్యాలి?

❖ ❖ ❖

ఆ క్షణంనుంచీ రామశర్మ అబ్బుశాస్త్రి అయిపోయాడు. అబ్బు ఆలోచనలకు కాళ్లూ చేతులూ వస్తే?–రామశర్మ అవుతాడు.

కారణం–ఈ వ్యక్తిలో ఏదో 'విపర్యయం' అతన్ని ఆకర్షించింది.

అన్ని సంవత్సరాల తర్వాత ఆనాడే కాలవలోంచి బయటికి తీసిన కారు ఇప్పుడు ఏ స్థితిలో ఉంది? దాన్ని ఎవరు తీసుకెళ్లారు? ఇప్పుడు ఎక్కడ ఉంది? అసలు ఆనాటి సంఘటనని చూసిన, గుర్తుంచుకున్న మనుషులెవరైనా ఉన్నారా? అప్పటి కానిస్టేబుల్ పోలయ్యనాయుడు–ఒక దొమ్మీకేసులో కాలు విరగ్గా అర్థాంతరంగా రిటైరై రాజమండ్రి ఇన్నీసుపేటలో మామగారు వదిలిపోయిన చిన్న పెంకుటింట్లో స్థిరపడ్డాడు. అతనికి ఇద్దరు పిల్లలు. ఇద్దరికీ చదువు చెప్పించాక–ఇద్దరూ మంచి ఉద్యోగాలు చూసుకుని వెళ్ళిపోయారు. ఓ కుర్రాడు జబల్పూరులో ఉన్నాడు. ఉత్తరాలు రాయడు. మరొకడు

శ్రీలంకలో ఉన్నాడు. ఉత్తరాలు మాత్రమే రాస్తాడు.

"కొడుకు లంజకొడుకుల్ని మేపి పెంచకూడదు బాబూ. ఆళ్లు పెద్దోళ్లయి మనకి రంకుమొగుళ్ళవుతారు" ఇదీ రామశర్మ కలిసిన రెండు నిముషాల్లో పోలయ్యనాయుడు వెళ్లగక్కిన ఆక్రోశం.

అసలీ కథంతా ఎందుకు? పోలయ్యనాయుడిని కలవడానికి వెళ్లబోయిన రామశర్మకి అతన్ని తెలిసినవాళ్లు చెప్పిన మొదటి పాఠం-మొదటి అరగంటసేపూ అతను చెప్పిన సొదని వినడం అలవాటు చేసుకోవాలని.

పోలీసు బుద్ధులు సర్వీసంతా ప్రబలిన, చెల్లించుకున్న మనిషి పోలయ్యనాయుడు. చెప్పడమేగాని, చెప్పించుకోవడం అలవాటులేని జులుంని వెలగబెట్టినవాడు. అలాగని చెడ్డవాడు కాదు. చెడినవాడు. ఈ వృద్ధాప్యంలో అతని బాధల్లా-కొడుకుల చేతుల్లో నష్టపోయాననే.

"నీకు పెళ్లయిందా పంతులూ?" అనడిగాడు 20 నిముషాలు అయ్యాక. లేదన్నాడు రామశర్మ.

"బతికిపోయావు. చేసుకోకు. చేసుకున్నా ఎదవలంజకొడుకుల్ని కనకు. ఆళ్లు బతికుండగానే నీకు నిప్పెట్టేస్తారు" అరగంటయ్యాక, పోలయ్యనాయుడి ఆవిరి చల్లారింది.

"నువ్వెవరు బాబూ. ఎందుకు వచ్చావు?" అన్నాడు దగ్గుతూ.

కథ చెప్పాడు రామశర్మ.

"ఆ కేసా? మాగొప్ప పితలాటకం కేసు. నా సర్వీసులో అలాంటి కేసు చూడనేదు. ఉత్తపున్నానికి పెళ్లాంతోపాటు సచ్చిపోనాడు ఆ మారాజు. ఎవరో తెలీదు. చెప్పేవాళ్లు లేరు. కారు నెంబరుతో పట్టుకుందాం అనుకుంటే రాజమండ్రి నుంచి వచ్చిందని తెలిసింది. శవాన్ని 36 గంటలు నా టేసన్లో ఉంచాం-40 కేజీల ఐసు వేయించి. ఎవరూ రాలేదు. ఓపక్క శవాలు కుళ్లిపోతున్నాయి. న్యాయంగా పదిహేను రోజులు మార్చురీలో ఉంచాల. కాని మార్చురీలో బెర్త్స్ లేవన్నారు రాజమండ్రి జనరల్ ఆసుపత్రివాళ్లు. సర్కిల్‌గారికి చెప్పి, పంచనామా చేయించి-కొబ్బరితోటల అవతల బుగ్గిచేసేశాం" అని రామశాస్త్రిని చూసి"ఆరు నీకేమైనా అవుతారా బాబూ" అన్నాడు.

ఆ కారులో మరో పిల్ల ఉన్న సంగతి ఇతనికి చెప్పాలా వద్దా అని ఆలోచించాడు రామశాస్త్రి. చెప్పినా, అతనికికాని, అతనివల్ల కేసుకికాని ఉపయోగం లేదు. లేచాడు. గుమ్మందాకా వచ్చి "ఆ కారు ఏమైంది?" అనడిగాడు.

"ఆ కారు ఓనరు దొంగనాకొడుకు బాబూ. ఎంత ఇరగదీసినా 'నాకేం తెలీదు'

అని ఒకటే పాట. నిజానికో దుర్మార్గం ఉంది బాబూ. అది దెబ్బకి జడుస్తుంది. గాని ఆణ్ణి అడ్డంగా నరికినా ఆ పాటే పాడాడు. 'కేసెట్టైత్తాను కంత్రీనాకొడుకా' అని బెదిరిస్తే-కారులో ఇంజనూ, పార్టులూ ఇప్పుకుని పారిపోయాడు. దాన్ని గంటి పెదపూడి కొబ్బరితోటల యెనక్కి లాగేసి వదిలేశాం" వెళ్లబోతున్న రామశర్మని కెవ్వుమని కేకేసి ఆపాడు పోలయ్యనాయుడు.

"బాబూ! కొప్పుల మందయ్యని మా దగ్గర సిల్లరపనులు సేసే కుఱ్ఱ నంజికొడుకొకడుండేవాడు. ఈ యాక్సిడెంటయ్యాక ఆడు చిన్న దుకాణమెట్టాడని ఇన్నాను. ఆడు దొరికితే మరిన్ని ఇసయాలు తెలుత్తాయి. కారులో వస్తువులేటన్నా ఆడు నొక్కేసేడని నాకనుమానం" అన్నాడు.

ఇక్కడికి రావడం వృథా కాలేదనుకున్నాడు రామశర్మ. సమాచారం సన్నని అల్లిక-సుతారంగా విప్పుకుంటూ పోవాలి. మెట్లు దిగుతూంటే-వస్తున్న వెద్ద దగ్గుని ఆపుకుంటూ-

"పెళ్లి సేసుకున్నా కుఱ్ఱ నంజికొడుకుల్ని కనకు పంతులూ" అని అరిచాడు పోలయ్యనాయుడు.

ప్రతి వ్యక్తి జీవితంలోనూ వారి వారి అనుభవాల మేరకు వారు సిద్ధం చేసుకున్న రంగు కళ్లద్దాలుంటాయి. దశరథ మహారాజు, జిజీబాయి, మోతీలాల్ నెహ్రూ ఆ మాటనగలరా?

❖ ❖ ❖

"ఆ గుంటనక్కగాడి దగ్గరికి వెళ్లారా సారూ" అని నవ్వాడు కొప్పుల మందయ్య.

పెద్ద బొజ్జ, పెద్ద మీసాలూ, పెద్ద చేతులూ-రెండు చేతుల వేళ్లకీ నాలుగు ఉంగరాలూ, టెర్రీకాటన్ షర్టూ-వ్యాపారంలో చూసిన మంచిరోజులన్నీ అతని శరీరంమీదే కనిపిస్తున్నాయి. దగ్గరకు రాగానే చెమటకంపు గుప్పుమంది. కొందరి ఖరీదైన జీవితాలు కూడా కంపుగొడతాయి.

"ఆడు జిత్తులోడండి. నా దగ్గరికి ఎల్లమని ఆడే చెప్పి ఉంటాడు" అన్నాడు. రెండు తోపుడుబళ్లను కలిపి-కొబ్బరిబొండాల దగ్గర్నుంచి, పాలకోవాదాకా-సమస్తమూ పరిచాడు మందయ్య. అదే అతని జీవితం, వ్యాపారం, నిధి, పెన్నిధి, "నా సంగతి ఆడు కనిపెట్టాడని నాకు తెలుసు బాబూ" అన్నాడు నవ్వుతూ.

రామశర్మ కూర్చోడానికి ప్లాస్టిక్ బల్లని జరిపాడు.

పెద్ద శరీరంతో, బోలెడు అందంతో, నల్లచింతపిక్కలాగ ఉన్న భార్య గ్లాసులో టీ తెచ్చింది.

“ఆ శవాలకి 36 గంటలు కాపు కాశానండి. ‘ఒరేయ్! బేపినాకొడకా! శవాలు కుళ్లు చూపితే నరికేస్తాను’ అని కొట్టిన దెబ్బ కొట్టకుండా కొట్టీ వాడండి–కొట్టినప్పుడల్లా పది రూపాయలు ఇచ్చేవాడండి” పగలబడి నవ్వి–

“ఆడెప్పుడు కొడతాడా అని ఎదురుచూసేవాడ్నండి. ఓసారి ఆకలి దంచేస్తోంది. దగ్గర డబ్బుల్లేవు. కసి పెరిగి ‘ఏటి బాసూ! ఇయాల ఒక్కటీ పీకలేదు’ అని కోపం తెచ్చుకున్నాను. పోలయ్యనాయుడు ఆ రోజంతా నవ్వాడండి. జీవితంలో మొదటిసారిగా కొట్టకుండా 20 రూపాయలిచ్చాడండి” అన్నాడు.

ఉపోద్ఘాతాన్ని వింటూంటే ఏదో విలువైన సమాచారానికి ఇది సూచికలాగ కనిపించింది.

“ఆరి వూసు మీకెందుకు బాబూ. మీరు పంతులుగార్లా ఉన్నారు. ఆరు నాయుడుగారు” అన్నాడు.

“కారణం ఏమీ లేదు. ఇప్పుడు తెలిసే విషయాల్లోంచి కారణాన్ని పట్టుకోవాలి”

ఆ మాటలు అర్థం కాలేదు మందయ్యకి. అది అతని లెవెల్ కాదు. ఈ అన్వేషణకి ఇదమిత్థమనే లక్ష్యం ఏర్పడలేదు ఇంకా. అంత చెప్పాల్సిన నేపథ్యమూ లేదు. అగత్యమూ లేదు.

“ఆ రెండు శవాలూ లంకెలబిందెలు బాబూ. ఆరిద్దరూ చచ్చిపోయారు కాని ఆరు సచ్చి నా బతుక్కి నిచ్చెనేశారు” అన్నాడు మందయ్య.

నవ్వుకున్నాడు రామశర్మ. ఆ ఇద్దరి కారణంగా ఒక జీవితం పదహారు ఏళ్లు స్తబ్ధమైంది. మరొకరి జీవితం ఆకాశానికి ఎగసింది. ఒకరి అదృష్టం మరొకరి అనర్థం.

“ఏం జరిగింది?”

“అప్పుడు నేను కుర్రోణ్ణి బాబూ. పన్నెండేళ్ళు. సదువూ సట్టుబండలూ లేదు. పోలీసు టేసన్ని నమ్ముకుని–ఆరు పెట్టే తిండి తింటూ, ఆరు కొట్టే దెబ్బల్ని పడుతూ రోజులు గడిపేవోడిని. అంతే. ఉన్నట్టుండి–ఈ రెండు శవాలూ దేవుళ్లాగ దొరికాయి”

రామశర్మకి ఇప్పుడు అనుమానం వచ్చింది పోలయ్యనాయుడు చెప్పినట్టు ఏ మనీపర్సో కొట్టేశాడేమోనని.

నవ్వాడు మందయ్య.

"మీరు ఏటనుకుంటున్నారో నాకర్థమౌతోంది బాబూ. ఈ దొంగనాకొడుకు ఏదో చెయ్యివాటం చేశాడనుకుంటున్నారు కదూ? నేను సత్తెపెమాణికంగా దొంగని కాను బాబూ"

"ఇసయం చెప్పరా నాన్చక" అని పొడిచింది నల్లచింతపిక్క.

కితకితలు పెట్టినట్టు నవ్వాడు. ఆ క్షణంలో వాడి పక్క మార్లిన్ మన్రో, బెట్టీ డేవిస్ ఉన్నా అంత ఆనందించేవాడు కాదు.

"ఇది నా పెళ్ళాం బాబూ. ఆరోజుల్లోనే ఇది నాకు దొరికింది. దీని పేరు సాయిలమ్మ. ఇది దొరకడానికో పెద్ద కథుంది" మళ్ళీ పొడిచింది.

"మొగుణ్ణి 'ఒరే' అనకూడదని–పెద్దోరు–మీరైనా చెప్పండి సారూ" అన్నాడు మందయ్య.

అంతే. వీపు చెళ్ళుమంది. కోపం తెచ్చుకోలేదు మందయ్య. స్టీలు గరిటెతో దాని నెత్తిన ఒక్కటిచ్చాడు.

"బాబూ. సచ్చిపోయిన బాబు–నా అదృష్టం–పెద్ద శరీరపోడు. కారు చెట్టుకు గుద్దేయడంతో ఆ బాబు మొఖం కారు చక్రానికి గుద్దుకుపోయి నుగ్గయిపోయింది. శవాల్ని దింపి–ఇసుమీద పండబెట్టి 36 గంటలు సేవ చేశాను. తగలెట్టడానికి ఆటిని తీసుకెళ్లాక–పోలీసు టేసను ఎనక గదిని తుడుస్తున్నాను. అప్పుడు–అప్పుడు–నా అదృష్టం నన్ను వెదుక్కొంటూ వచ్చింది బాబూ"

చదువుకుని బాగుపడి ఉండే వీడు గొప్ప సినీ డైరెక్టరయ్యేవాడు–అనుకున్నాడు రామశర్మ.

అయితే ఒక జీవితాన్నే మార్చివేసిన అపూర్వమైన విషయాన్ని–ఓ సాయంకాలం అనుభవంలాగ తేల్చేయడం ఎవరికీ ఇష్టం ఉండదు. దొంగకాని, నీతిమంతుడైన పన్నెండేళ్ల కుర్రాడి జీవితాన్ని మార్చివేసే అదృష్టం ఏమిటయి ఉంటుంది? ఇది నిజమైన సస్పెన్స్. మందయ్య చెప్తున్నాడు.

"దీపం వెలుగులో ఆ మూల జిగేల్‌మంది బాబూ. తుళ్లిపడ్డాను. ముందు దీపం పురుగనుకున్నాను. పురుగైతే సచ్చాక ఏం మెరుత్తాది? దగ్గరికెళ్లాను. ఏటనుకున్నారు?"

"చెప్పరా దొంగసచ్చినోడా!" పెళ్ళాం పొడిచింది.

"ఆ నాయుడు బాబుగోరి బంగారప్పన్ను బాబూ!" అంటూ గర్వంగా నవ్వాడు మందయ్య.

# 11

"నాయుడు బాబుగారిది పెద్ద శరీరం బాబూ. జారిపోయింది లోపలి పన్ను. ముందు పన్నయితే పీలగా ఉండేది. లోపలి పన్ను కనుక దిట్టంగా ఉంది. దాన్ని సేతులోకి తీసుకుని–బంగారప్పన్నని గుర్తుపట్టాను. కిర్రెక్కిపోయాను బాబూ. నా అదృష్టం. ఆ టైముకి టేషనులో ఎవరూ లేరు. లటుక్కున జేబులో ఏసుకుని జేగురుపాడు–మా దోస్తు ఇంటికి పారిపోయాను బాబూ. నక్కజిత్తులోడు నాకోసం ఎతికించాడంట. ఏం చెయ్యాలా అని ఆలోచించి–మా దోస్తుకి చెప్పకుండా–ఆడి పెరట్లో కాకరపాదు కింద చిన్న పొడుం డబ్బీలో పాతిపెట్టి–ఎనక్కి వచ్చాను. "ఎక్కడికెళ్లావురా నంజికొడకా!" అని ఓ టెంకిజెల్ల ఇచ్చుకున్నాడు పోలయ్య బాబు. ఇప్పుడు హెడ్డు కొట్టినా తిట్టినా భయం నేదు. బంగారప్పన్ను ఆ చుట్టుపక్కల అమ్మితే పోలయ్యకి తెలిసిపోతుంది. ఆడు సీమకుక్కలాంటోడు. అందుకని ఆరు నెలలు ఊరుకున్నాను. అప్పుడు నాయుడు సర్కిలై బదిలీ అయ్యాక–పొడుం డబ్బీకోసం జేగురుపాడు ఎల్లాను బాబూ. అంతే. కొంప మునిగిపోయింది".

"ఏమయింది?" అన్నాడు రామశర్మ.

"కాకరపాదు పంట అయిపోయి తీసేశారు బాబు. ఇప్పుడు దొండ ఏశారు. కాకరపాదు మొదలు ఎక్కడుందో దొరకలేదు. మూడు రాత్తిర్లు ఎతికాను బాబూ. చెమటలుపోశాయి. ఏడుపొచ్చింది. ఆఖరికి–నా తల్లి మాలచ్మి బాబూ–దొరికేసింది. దాన్నట్టుకుని–దూరంగా–ఇక్కడికి దూరంగా–నిజామాబాదు ఎల్లిపోయాను బాబూ. అప్పుడే ఈ చక్కరకేళీ నా కళ్లబడింది. ఇప్పుడు నూనె పీపాలాగ అయిపోయింది కాని–శానా సక్కగా ఉండేది బాబూ. ఏపుగా పైరుకొచ్చిన మొక్కజొన్న కండెలాగ ఉండేది. పెద్దోరు–తమకి సెప్పకూడదు–ఆరోజుల్లోనే దీనితో ఎంగిలిపడ్డాను బాబూ"

సాయిలమ్మ సిగ్గుతో ముగ్గుబుట్ట అయిపోయింది. మందయ్య భుజాన్ని పొడిచింది.

"ఇంతకీ పన్ను ఏం చేశావు?'

"ఏం చేస్తాను బాబూ–ఉల్లాకు వేయించాను. సచ్చిన బాబుది రాచపుట్టుక. పన్ను మేలిమి బంగారం బాబూ–రెండు వేల తొమ్మిది వందలు వచ్చింది. దీన్ని పక్కలో ఏసుకుని మూడు రేత్తిర్లూ మూడు పగళ్ళూ తాగాను. తర్వాత పలివెల వచ్చి కొబ్బరిబొండాల బండీ ఎట్టాను బాబూ. ఆ యాపారం పాలపొంగులాగ పొంగింది. కోవా ఎట్టాను. మొక్కజొన్న యెట్టాను. ఏ సీజనుకి ఆ సీజను పళ్లు ఎడతాను బాబూ. ఈ సాయిలమ్మ నా తాయెత్తు. అది పట్టిందల్లా బంగారమైపోతుంది"

లాభంలేదు. ఈ సమాచారానికి తోక లేదు. "ఆ కారులో ఉన్నదెవరో తెలిసిందా?"

"మనకేటి తెలుత్తాది బాబూ. పెద్ద పెద్ద పోలీసోళ్లకే తెలీలేదు. నాయుడు బాబు గొప్ప మారాజు. ఏదో పనిమీదొచ్చాడు. ఇక్కడ దిక్కుమాలిన సావు సచ్చాడు"

"ఆ కారెక్కడ ఉంది?"

"ఎన్ని సంవత్సరాల కిందట మాట బాబూ. అదిప్పుడెలా ఉందో–అసలుందో లేదో ఎవరికెరుక బాబూ. పోలయ్యనాయుడూ ఆ కారు ఓనరూ ఏం లాలూచీ పడ్డారో తెలీదుకాని, కారులో సరుకంతా లాగేసి, డొక్కు కారుని గంటి పెదపూడి కొబ్బరితోట యెనక్కి లాంగిచేసారు. దాని పక్కనే స్మశానం. అడిగినోడు లేడు. సేసింది హెడ్డు"

"నాకా కారు చూపిస్తావా?" అంటూ జేబులోంచి వంద రూపాయలు తీశాడు రామశర్మ.

"ఇయాల బొండాలు దిగుతున్నాయి బాబూ–రేపెల్దారి. డబ్బులొద్దులెండి. ఆ నాయుడు బాబు సొమ్ము శానా తిన్నాను" అన్నాడు మందయ్య.

కారుని మొదటిసారి చూసింది అబ్బుశాస్త్రి. ఇన్ని సంవత్సరాలు కారు అబ్బు మనస్సులో నిలిచింది.

"వాళ్లెవరో తెలిసిందా?" అని ఆతృతగా అడిగాడు.

"ఇప్పటికి గొప్ప విషయమేమిటంటే–ఆనాటి సంఘటనకి సంబంధించిన ఇద్దరు మనుషులు దొరికారు. ఇద్దరి మనస్సుల్లోనూ ఆ జ్ఞాపకాలు స్పష్టంగా ఉన్నాయి. రేపు కారుని చూస్తాను" అన్నాడు రామశర్మ. "నేనూ వస్తాను" అన్నాడు అబ్బుశాస్త్రి.

అవును. కారుని నిజానికి చూడాల్సింది అబ్బు. ఇద్దరూ బయలుదేరారు. కోరా ఖద్దరు అడ్డపంచె కట్టుకుని, వీబూది పెట్టుకుని, పిలకతో వెలిగిపోతున్న అబ్బుని చూసి ఆశ్చర్యపోయాడు మందయ్య.

"ఆరోజు–యాక్సిడెంటు జరిగినప్పుడు అక్కడ ఉన్నారీయన" అని వివరించాడు రామశర్మ.

గంటి పెదపూడిలో కారుని తోసేసిన స్థలం–పెద్ద పల్లం. కారులో సగభాగం భూమిలోకి వెళ్లిపోయింది. మిగతా సగం మీదా మట్టి పేరుకుంది. రకరకాల పిచ్చిమొక్కలు గుబురుగా పెరిగాయి.

ప్రత్యేకంగా చూస్తేతప్ప–వీటన్నిటి కిందా గచ్చకాయరంగు కారు అస్థిపంజరం ఉన్నట్టు తెలీదు.

బలిసిన ఓ మధ్యవయస్కుడు, ఓ పట్నం మనిషీ, ఓ సనాతన బ్రాహ్మణుడూ–స్మశానం పక్కన–ఆ చెట్ల గుబురు దగ్గరకి రావడాన్ని అటు పోయేవాళ్ళంతా

ఆశ్చర్యంగా చూస్తున్నారు. "దాన్నేం చూస్తారు బాబూ. సగం మట్టిలోకి ఎల్లిపోయింది" అన్నాడు మందయ్య.

కారుని చూస్తున్నకొద్దీ అబ్బులో ఏదో ఆవేశం తోసుకొచ్చింది. కళ్లముందు గతం తెరలుగా పరుచుకుంది. "కారుని పూర్తిగా చూడాల్సిందే" అని అన్నాడు. ఆ మాటకంటే, ఆ మాట అన్న తీరు, గొంతులో నిర్ధారణ–ఇద్దరినీ ఆశ్చర్యపరిచింది.

ఊళ్లోంచి నలుగుర్ని పిలిపించి–పిచ్చిమొక్కలు తీసి, కారు ఎడమ భాగాన పరుచుకున్న నీళ్లని తోడించారు మందయ్య, రామశర్మ. మొక్కలు తీయగానే పది అడుగుల త్రాచు బద్ధకంగా కారులోంచి బయటికి పాకింది. అందరూ గతుక్కుమన్నారు.

అబ్బు దండం పెట్టాడు. "ఇది మంచి శుభసూచకం. కానివ్వండి" అన్నాడు.

అబ్బు అపస్మారం నుంచి తేరుకోవడం చూశాడు రామశర్మ. కార్యోన్ముఖుడు కావడాన్ని ఇప్పుడు చూస్తున్నాడు. అతని మనస్సులో ఏదో ప్రణాళిక రూపుదిద్దుకుంటోంది. అబ్బు అగ్నిహోత్రం. అది ఇప్పుడిప్పుడే రాజుకుంటోందని అర్థమైంది.

మధ్యాహ్నానికి గునపాలూ, పారలతో–మిగిలిన కారుని ఓ దశకి పెల్లగించారు. ఇన్ని సంవత్సరాలు భూమిలో అణిగి ఉన్న భాగమంతా దాదాపు శిథిలమైపోయింది. పైకి ఉన్న భాగంలో చిన్న చిన్న ఆనవాళ్లు మిగిలాయి.

కాలానికి ఓ దుర్మార్గం ఉంది. ఎలాంటి 'విలువ'నైనా శిథిలం చెయ్యగల శక్తి ఉంది. ఎలాంటి జ్ఞాపకాలనైనా లుప్తం చెయ్యగలదు–అది దుఃఖమైనా, ఆనందమైనా, అదే మానవాళి అదృష్టం. అనుభూతి, ఆర్ద్రత, విషాదం, ఆనందం మనస్సుల్లో మెరుపుల్లాగ మెరిసి మాయమవ్వాలి. వాటి జ్ఞాపకాలదే రుచి. తాజ్‌మహల్‌లో 50 రోజులు ఉన్నవాడు బోర్ అవుతాడు. మార్లిన్ మన్రోని, బెట్టీ డేవిస్‌నీ ప్రతిరోజూ చూస్తే మొహం మొత్తుతుంది.

వెనుకసీటుకీ–ముందుసీటు వెనుక భాగానికీ మధ్య–చివికిపోయిన ఆడ చెప్పులు కనిపించాయి. అవి కర్రతో కదపగానే ముక్కలుగా చివికి విడిపోయాయి. పురుగులూ, చెత్తా నిండిన దుర్గంధమూ పుష్కలంగా లేచింది. దేనికోసం వెదుకుతున్నారో అబ్బుకీ తెలీదు. రామశర్మకీ తెలీదు. అసలీ పిచ్చివాళ్ళెవరో ఊరివాళ్ళకీ అర్థంకాలేదు. అబ్బు చేతిలో ఉన్న కర్రకి ఉన్నట్టుండి–ముందుసీటు కింద ఏదో ఏడ్డుగా తగిలింది. కదిపినా కదలలేదు. శల్యమైపోయిన ముందుసీటుని గునపంతో అలవోకగా పెల్లగించాడు కూలీ.

అబ్బు చేతిలో కర్రకి అడ్డుపడిన వస్తువు–మట్టితో, పురుగులతో–దాదాపు శిథిలమైన సీనారేకుపెట్టె. ఒకపక్క విడిపోయింది. కర్రతో కదిపితే–పెట్టెలోంచి రెండు మూడు గాజులు బయటికి దొర్లాయి. అవి గాజులని గుర్తుపట్టడానికి రుజువులు–గుండ్రంగా ఎర్రమట్టి పేరుకుని–రింగుల్లాగ కనిపించడం. వాటిమీద నీళ్ళు గుమ్మరించాడు మందయ్య.

మసకబారిన ఎర్ర పూసలు– వాటిని గూచ్చి పట్టుకున్న నల్లటి వైరు. ఒకప్పుడు అందమైనవి అయి వుంటాయి. అవి పూసలు, బంగారం కావు. అవి పూసల గాజులు.

అబ్బుకంటే ముందు రామశర్మ వాటిని చేతిలోకి తీసుకున్నాడు. పూసలు తీర్చిన వైరుకింద–వాటిని అతికిన base ఉంది. ఒకప్పుడు బంగారంలాగ మెరిసేదేమో! ఇన్ని సంవత్సరాలు మట్టిలో ఉన్నా–విచిత్రంగా ఎర్రగా ఉందే తప్ప నల్లబడలేదు. బహుశా ఆనాడు చాలా గొప్పగా మెరిసే అల్యూమినియమో, మరే లోహమో అయివుండాలి.

అబ్బు ఆశ్చర్యంగా చూస్తున్నాడు. చుట్టూ ఉన్న వాళ్ళంతా విసుగ్గా చూస్తున్నారు. లోహానికి–అంటే గాజుల బేస్ కింద ఎర్రమట్టి పేరుకుని ఉంది. బలంగా గోటితో పెకలించబోయాడు అబ్బు. చేతిలో ఉన్న లోహపు వలయం మూడు ముక్కలైంది. మూడు ముక్కల్నీ అలాగే వదలకుండా పట్టుకుని–వాటిమీద గ్లాసుతో నీళ్ళు పోయమన్నాడు అబ్బు. నీరు ఆ లోహం వెనుకభాగాన్ని శుభ్రం చేసింది. ఇప్పుడు ఇంగ్లీషు అక్షరాలు తెలిశాయి. రామశర్మ ముందుకు దూకాడు. అబ్బు శాస్త్రి మెడలో ఉన్న తెల్లటి కండువామీద–మూడు ముక్కల్నీ చేర్చి, పేర్చి ఉంచాడు.

ఇప్పుడు అక్షరాలు స్పష్టంగా తెలుస్తున్నాయి. లోహంలో శక్తి నశించింది కాని–దానిమీద చెక్కిన అక్షరాలని వదులుకోలేదు.

ఇది సజ్జనుడి సౌజన్యం లాంటిది. మనిషి పోయినా చివరంటా తెలిసే మంచితనం లాంటిది. ప్రకృతి స్వభావం కాదు. ప్రకృతిలో వైలక్షణ్యం.

అక్షరాలు చదివాడు – TEUKU, RAUTS, ANDHERI

❖ ❖ ❖

"నేను బొంబాయి వెళ్తాను. వెళ్లి తీరాలి" అన్నాడు అబ్బుశాస్త్రి. సోమిదేవమ్మ భోరుమంది.

రామశర్మ అతని గొంతులో conviction కి ఆశ్చర్యపోయాడు.

"మళ్లీ మనిషివై బాగుపడ్డావని కొండంత ఆనందంతో ఉన్నాను. నిన్ను బాగుచేసి నాకప్పగించమని పట్టిసం వీరభద్రుడికి మొక్కులు పెట్టుకున్నాను. జరిగిందేదో జరిగిపోయింది. ఇప్పుడు బొంబాయి వెళ్లి ఏం సాధిస్తావు?" అంది సోమిదేవమ్మ ప్రాధేయపూర్వకంగా.

అబ్బు ఇప్పుడు చిన్నపిల్లాడు కాదు. పిట్టలాగ ఉన్న తల్లిని పొదివి పట్టుకున్నాడు. కొడుకు చేతుల్లో ఆ తల్లి ఆకులాగ విలవిల్లాడింది.

"వెళ్లాలమ్మా. నేనేం చెయ్యాలో నాకిప్పుడిప్పుడు తెలుస్తోంది. నా కారణంగా ఆనాడు ఇద్దరు చచ్చిపోయారు. ఆ దుర్ఘటనలో నాకూ వాటా ఉంది. ఆనాటి సంఘటన కారణంగా ఓ ఆరేళ్ల పిల్ల అనాథ అయింది. ఆ అమ్మాయి ఎక్కడ ఉంది? ఎలా ఉంది? తల్లిదండ్రుల నీడలేని ఆడపిల్ల పరిస్థితి ఏమిటి? తెలుసుకుంటాను"

"తెలుసుకుని?" రామశర్మ ప్రశ్న.

అబ్బుశాస్త్రి మనస్సులో మేఘాలు విడిపోతున్నాయి. అతని ఆలోచనలు పూర్తిగా వికసించిన పుష్పాల్లాగ పవిత్రంగా ఉన్నాయి.

"ఆ అమ్మాయి ఆనందంగా ఉంటే–కాళ్లమీద పడి నావల్ల జరిగిన అన్యాయానికి క్షమాపణ చెప్పుకుని వస్తాను. ఆ అమ్మాయి నిస్సహాయంగా ఉంటే–నా కారణంగా అన్యాయమైన ఆ జీవితాన్ని ఆదుకుంటాను"

"ఇది పిచ్చితనం. ముక్కూ మొహం తెలియని ఆడపిల్ల ఇప్పుడెక్కడుంది? ఎలా తెలుసుకుంటావు?"

అబ్బు నవ్వాడు. "మాయమైన సీతమ్మ తల్లిని వెదకడానికి ఒక వానరసైన్యం తోడై నిలిచింది. ఇవాళ ఆ అమ్మాయి ఎవరో తెలీదు. కాని ఎక్కడ ఉండవచ్చునో చూచాయగా తెలిసింది. ఆమె తల్లిదండ్రులు చచ్చిపోయేనాటికి ఆ పిల్లకి ఎక్కడికి వెళ్లాలో తెలీదు. ఎక్కడికి వెళ్లింది? ఎవరు తీసుకువెళ్లారు? ఏమైంది?"

వేద విద్య నిర్దుష్టమైన ఆలోచనాసరళిని ప్రసాదించింది. సనాతన సంప్రదాయం వ్యక్తి శీలాన్ని నిర్దేశించింది. అబ్బు మనస్తత్వం అతని దృఢనిశ్చయానికి పునాది వేసింది.

"వాడిని వెళ్లనీ అమ్మీ! మనిషి కర్మల్ని మనం నిర్దేశించలేం. ఉద్దాలకుడి మాటతో నచికేతుడు యముడి దగ్గరికి వెళ్లాడు. వెళ్లమని ఆకాశవాణి ప్రోత్సహించింది.

"తగుం హస్మోత్థితం వాగభివదతి! గౌతమ కుమారమితి! సహోవాచ!
పరేహి మృత్యోర్గృహాన్ మృత్యవే వైత్వాదామితి"

చయనులుగారి తీర్పు అక్కడున్న అందరి నోరూ కట్టించింది. అబ్బుశాస్త్రి చయనులుగారికి సాష్టాంగప్రణామం చేశాడు. వస్తున్న దుఃఖాన్ని ఆపుకోలేక నోట్లో కొంగుని కుక్కుకుంది సోమిదేవమ్మ.

"ఒక్కడవేనా? ఈ ప్రయాణానికి డబ్బు?" అడగలేక అడగలేక అడిగింది. అప్పుడు తన అంగవస్త్రం చివరముడిని చూపించాడు అబ్బు. "వెళ్తూ వెళ్తూ సర్వమంగళం ఈ ముడి వేశాడు. ఇందులో వాడి సహాయం ఉంది"

'అదేమిటి? అందులో ఏముంది?' ఎవరూ అడగలేదు. అడగలేకపోయారు.

అందరినీ మించి అవాక్కయి ఈ దృశ్యాన్ని చూస్తున్న వ్యక్తి మరొకరున్నారు. రామశర్మ.

ఓ సంచీలో పంచె, మరో కండువానీ పెట్టుకుని రామశర్మ ముందు ఆగాడు అబ్బుశాస్త్రి.

"పదండి సార్!" అన్నాడు.

అన్నాడేకాని రామశర్మ వెంట అబ్బుశాస్త్రి నడవలేదు. అబ్బు వెంట రామశర్మ నడిచాడు. కారణం–అబ్బు కర్తవ్యం. రామశర్మ–కేవలం–కారణం.

అంతవరకూ మౌనంగా చూస్తున్న శిష్యులందరూ ఏకమై తృతీయ సవనంలో ఆకాశాన్నంటేలాగ శాకున మంత్రాన్ని గానం చేశారు :

"ఉద్గాతేన శకునే సామగాయనీ బ్రహ్మపుత్ర ఇవ సవనేషు శగుంససి స్వస్తినః శకునే అస్తు ప్రతినః సుమనా భవ"

## 12

బస్సు ఎక్కాక తన అంగవస్త్రం చివర ఉన్న ముడిని విప్పాడు అబ్బుశాస్త్రి. సర్వమంగళం ఆ ముడి వేశాడు. వంకరటింకర అక్షరాలతో రాశాడు : "అవసరమైనప్పుడు నా దగ్గరికి రా. దానవాయిపేట, పోలీసు స్టేషన్ పక్క వీధి, ఆఖరి ఇల్లు" విచిత్రంగా–ఏ అమ్మాయి అన్వేషణకి బయలుదేరుతున్నాడో, ఆ అమ్మాయి 16 సంవత్సరాల కిందట–దాదాపు ఈ ప్రాంతంనుంచే ప్రయాణం ప్రారంభించింది!

"ఎవరో ముక్కూ, మొహం తెలీని అమ్మాయికోసం జీవితాన్ని ఎందుకు అస్తవ్యస్తం చేసుకుంటావు" అన్నాడు రామశర్మ–బస్సులో. అతను చేసే పని గొప్పదని తెలిసినా–అతని మాటల్లో ఉద్దేశాన్ని రాబట్టాలని ప్రయత్నం.

"వేదం లోక కళ్యాణాన్ని చెప్తుంది. ప్రజాహితాన్ని ఘోషిస్తుంది. లోకాస్సమస్తాస్సుఖినోభవంతు–అంటుంది. ఇది జాతికంతటికీ వర్తించే ఆదర్శం. నేనో తప్పు చేశాను. అది నాకు తెలుసు. అది కోరి, తెలిసి చేసింది కాదు. ఐనా తప్పే. అందువల్ల జరగకూడని అపచారం జరిగిపోయింది. రెండు ప్రాణాలు బలి అయ్యాయి. అక్కడే ఆ అనర్థం ఆగితే–చేసుకోవలసింది ప్రాయశ్చిత్తం–ఆ పాపాన్ని పోగొట్టినా పోగొట్టకపోయినా. కాని అందువల్ల మరో ప్రాణి ఒంటరయింది. ఆమెకి అభం శుభం తెలియదు. జరిగిన తప్పుకి పరిష్కారం ఆ పిల్లకి చేయూతనివ్వడం"

"చేయూత అవసరమని నీకేం తెలుసు?"

"తెలుసుకోవాలనే ఈ ప్రయత్నం–ఈ ప్రయాణం"

సర్వమంగళం దగ్గర వదిలిపెట్టాడు రామశర్మ. “నేను నీతోపాటు బొంబాయి రాలేకపోవచ్చు. కాని అక్కడ నాకు తెలిసిన మిత్రుడు ఉన్నాడు. అతనికి ఉత్తరం రాస్తాను. సమాధానం వచ్చాక నువ్వు బయలుదేరవచ్చు. నీకా భాష తెలీదు. నగరం తెలీదు. ఎక్కడికి, ఎలా వెళ్ళాలో తెలీదు. ఇంకా చెప్పాలంటే ఎందుకు వెళ్లాలో తెలీదు. నీది చీకటిలో ప్రయాణం. రేపు కోటిలింగాలరేవు దగ్గర కలుద్దాం” అని వెళ్ళిపోయాడు.

తన సహచరుడిని, పుట్టినప్పటినుంచీ కలిసివున్న మిత్రుడినీ సర్వమంగళం పొదివిపట్టుకున్నాడు. “నువ్వు వస్తావని తెలుసు” అన్నాడు.

“ఎలా?”

“నిన్ను చిన్నప్పట్నుంచీ చూస్తున్నాను కనుక. నీవల్ల ఏదైనా అపకారం జరిగితే–నీ దృష్టి పర్యవసానం మీదకి పోతుంది. గోదావరి పుష్కరాలకి గురువుగారు అందరినీ కోటిపల్లి తీసుకెళ్లారు. మంత్రం చెప్పుకుని స్నానం చేయిస్తున్నారు. భొట్లు తెచ్చుకున్న సున్నిపిండిని నదిలో జారవేశాడు. నువ్వు కోపంగా చేతిలో ఉన్న ఉద్ధరిణా, చెంబుని వాడిమీదకి విసిరావు. వాడి తలకు తగిలి బొప్పికట్టింది. నువ్వు ఊహించిన పరిణామం కాదు. గురువుగారు కసిరారు–ఇద్దరినీ. భొట్లు ఏడ్చాడు. తదాదిగా భొట్లుకి 22 రోజులు సపర్య చేశావు. వాడి వీపు రుద్దావు. వాడు రుద్దుకోగలడు. పిండి కట్టుకట్టి, వాడి తల దువ్వి పిలకని ముడివేసి, వాడి నీడనే ఉన్నావు. అప్పుడు నువ్వు చేసింది సేవ కాదు. నీ తప్పుకి ప్రాయశ్చిత్తం”

నవ్వాడు అబ్బు. “దానికీ దీనికీ సంబంధం ఏమిటి?”

“చేసిన తప్పుకి నిన్ను నువ్వు శిక్షించుకోవడం నీ స్వభావం. ఆనాడు దారుణం జరిగింది. అందులోని నీ పాత్ర ఏమిటో నాకు తెలియదు. కాని తెలిసిన నాడు నువ్వు అక్కడ ఉండవని తెలుసు. మరి ఎక్కడ ఉండాలి? ఉండడానికి చోటు ఏది? అందుకనే నేను వేదం పాఠం వదులుకుని స్మార్తంలో దూకాను. అర్ధాంతరంగా ముగించుకుని ఇక్కడ తేలాను”

“నాకోసమా?”

వేడి వేడి ఉప్పుపిండి పళ్లెం చేతిలో పెడుతూ నూనెమాగాయి వడ్డించాడు సర్వమంగళం.

“ఈ మాగాయి పెట్టినావిడ పేరు అనసూయ. తొండారం వెంపరాల అమ్మన్న శాస్త్రిగారి ఆరో అమ్మాయి. ఆయనకి 18 మంది సంతానం. ఏనాడూ ఎవరిదగ్గరా చెయ్యి జాచి ఎరగరు. మీమాంసలో దిట్ట. ఆయన సంగతి ఎరిగి–ఆయనకి పాదపూజ

చేద్దామని కోయంబత్తూరు నుంచి స్వామినాథ పిళ్లై అనే ఆయన వచ్చి 108 బంగారు పుష్పాలు సమర్పించుకున్నారు. ఆయనా అటు వెళ్లగానే 108 పుష్పాలూ ఊళ్లో పండితులకి పంచిపెట్టారు. ఆయన కడుపున పుట్టిన పుణ్యానికి 18 మందీ ఆనందంగా పేదరికాన్ని పంచుకున్నారు. అనసూయ అంటే ఆయనకి ప్రాణం. కారణం–కుడికాలు వంకర. చిన్నతనంలో గుండెలమీద పడుకోబెట్టుకుని భవభూతి ఉత్తర రామాయణం చెప్పేవారట. ఆయన వెళ్లిపోతూ ఈ పాపని పిలిచి "నీకు పెళ్లి చేయలేకపోయాను. విచారం లేదు. నీకు చెప్పిన పాఠంలోనే భవభూతి చెప్పిన మాట ఉంది.

"సతాం సద్భిః సంగః కథమపిహి పుణ్యేన భవతి" సజ్జనులకు సజ్జనులతో సావాసం మిక్కిలి పుణ్యంచేతనే లభిస్తుంది. నీ మొగుడు నిన్ను వెదుక్కుంటూ వస్తాడు" అని కళ్లు మూశారు. ఈ కథకీ, ఈ నూనెమాగాయికీ తనకు చెప్పడానికీ ఏం సంబంధమో అర్థంకాలేదు అబ్బుశాస్త్రికి. సర్వమంగళం చెప్పాడు :

"అనసూయ కోటిలింగాల ఆలయంలో స్వామివారికి సేవలుచేస్తూ అక్కడే ఉంటుంది. తద్దినాలకు వంటలు చేస్తుంది. నాలుగైదు ఆబ్దీకాలకు నాకు తారసపడింది. అది లగాయితు నేను వెళ్లే పితృ కార్యాలన్నింటికీ ఆమెనే పురమాయిస్తాను. చూడడానికి మల్లెపువ్వు. మడిసార కట్టుకుని వండి అమృతాన్ని వడ్డిస్తుంది. నడిస్తే కాలుకుంటి. నిలుచుంటే అలమేలుమంగ"

"ఇదంతా నాకెందుకు చెప్తున్నావు?"

"నేను ఆ అమ్మాయిని పెళ్లి చేసుకోబోతున్నాను. ఈ ఆషాఢం వెళ్లాక ఆ అమ్మాయిని తీసుకువెళ్లి గురువుగారి సమక్షంలో తాళి కడతాను. నాకు స్వర్గం గురువుగారి సమక్షం. వారి ఆశీర్వాదం నాకు సర్వస్వం. కాని ఒక్కటే ఆ భగవంతుడిని కోరుకునేవాడిని"

"ఏమిటది?"

"నా పెళ్లి కాకుండా అబ్బుశాస్త్రిని ఇక్కడికి తీసుకురాకు–అని"

"అదేమిటి?"

"నువ్వు నా దగ్గరికి వచ్చిననాడు–నిన్ను మనసారా ఓ ఇంటివాడుగా ఆహ్వానించి, ఆదరించాలని అనసూయతో చెప్పేవాడిని. నా పెళ్లికి ముఖ్యోద్దేశం–16 ఏళ్ళు నష్టపోయిన నా మిత్రుడి ఆనందం" అబ్బుశాస్త్రి కళ్లు నిండిపోయాయి. "ఎందుకు నామీద నీకంత ఆపేక్ష?"

"ఇద్దరం ఒక తల్లి పెట్టిన తరవాణీ అన్నం తిన్నాం. ఇద్దరం ఒకే చాపమీద పడుకున్నాం. ఇద్దరం ఒకే గురువు ముఖతః విద్యని నేర్చుకున్నాం. నువ్వు

అంతర్ముఖుడివైపోయావు. నేను ఒంటరినైపోయాను. నువ్వు మళ్లీ బయటికి వచ్చే రోజుకోసం ఎదురుచూశాను. ఆరోజుని అమోఘంగా అలంకరించాలని ఆశపడ్డాను. నా ఆశ సగమే ఫలించింది. ఈ ఉప్పుపిండి నాది. ఈ మాగాయి అనసూయది" సర్వమంగళం భుజంమీద తల ఆనించి భోరుమన్నాడు అబ్బుశాస్త్రి.

"ఉదయం అమ్మని వదిలి వస్తున్నందుకు కడుపులో కలచివేసింది. కాని ఆమె అంశ ఇంకా నా వెంటే ఉంది–నీ రూపంలో"

"నువ్వు నా ఇంటికి రావడానికి తొందరపడ్డావు. ఈసారి వచ్చేసరికి ఈ ఇంట్లో ఇల్లాలు ఉంటుంది. తిను" అన్నాడు సర్వమంగళం.

"రేపే నేను అనసూయని చూడాలి" అన్నాడు అబ్బుశాస్త్రి.

కోటిలింగాల ఆలయ ప్రాంగణంలో అవతరించిన దేవకన్యలాగ ఉంది అనసూయ. అడుగు వెయ్యకపోతే ఆమె అప్సరస. ఎర్రటి ముదర కుంకం రంగు తడి చీరె, తలకి తెల్లటి వస్త్రం వాసెన, చేతిలో బియ్యంపిండి–ఆలయ ప్రాంగణంలోకి నక్షత్రమాలని దింపుతోంది.

"అనూ!" అని ఆప్యాయంగా పిలిచాడు సర్వమంగళం. గోదావరిలో స్నానంచేసి వచ్చిన ఇద్దరినీ చూసి–చీరె కొంగు భుజం చుట్టూ తిప్పుకుంది. చేతిలో పిండి గిన్నె పక్కన పెట్టి సరాసరి వచ్చి అబ్బుశాస్త్రికి నమస్కారం చేసింది. "మీరు అబ్బుశాస్త్రి" అంటూ.

అబ్బు చటుక్కున కాలు వెనక్కి తీసుకోబోయాడు. జీవితంలో మొదటిసారి తనకి పాదాభివందనం చేసిన వ్యక్తి ఈమె. "అయ్యో, ఇదేమిటి?" అన్నాడు. అనసూయ నవ్వింది.

"మీరు భాద్రపద బహుళ త్రయోదశినాడు శైవనక్తంలో మాస శివరాత్రినాడు సాయంకాలం 6 గంటల 51 నిముషాలకు పుట్టారు. నేను మరో ఐదు ఘడియలు ఆలస్యంగా పుట్టాను. కనుక మీరు నాకంటే పెద్దవారే" అంది.

అబ్బు ఆశ్చర్యపోయి సర్వమంగళంవేపు చూశాడు. "అవును. ఆమెకి నీ గురించి తెలియంది లేదు"

"నా అదృష్టవశాత్తూ మీరు మగాళ్ళయిపోయారు. లేకపోతే ఈయన నాకు మిగిలేవారు కాదు. మీ మెడలో తాళి కట్టేసేవారు" స్వామి దర్శనం చేసుకు వచ్చాక–ఆలయం మంటపంమీద చిన్న బాదం ఆకులు పరిచి వేడి వేడి కొబ్బరిఅన్నం వడ్డించింది.

అమృతప్రాయంగా ఉన్న ప్రసాదాన్ని సేవిస్తూ "మా సర్వమంగళం అదృష్టవంతుడు" అన్నాడు అబ్బు.

అనసూయ ఒక శ్లోకం చదివింది. "శతాం ఖేనాః కార్యేణ లోకస్వారాధనమ్ వ్రతం" అన్నాడు భవభూతి. సత్పురుషులు ఏదో మార్గంలో లోకానికి హితాన్ని చేకూరుస్తూనే ఉంటారు. అది వారి వ్రతం. అలాంటి వారిని ఇద్దరిని చూస్తున్నానివాళ"

"నేను వస్తానని నీకు తెలుసా?"–

"ఏదో రోజు వస్తారని, రావాలని, రాక తప్పదని తెలుసు. ఇంత త్వరగా అనుకోలేదు. అది ఇప్పటికి నా పుణ్యం–ఇంకా ఆయన ఇల్లాలిని కాలేదు కనుక. ఈమాటు వస్తే అది 'మా' పుణ్యమౌతుంది"

"నేను జీవితంలో దైవోపహతుడిని. ఇదంతా ఓ ప్రాణమిత్రుడి సౌహార్దం. కాబోయే ఆయన ఇల్లాలి సౌజన్యం" అన్నాడు అబ్బుశాస్త్రి.

సర్వమంగళం నవ్వాడు. "నీకంటే దైవోపహతులు సృష్టిలో చాలామంది ఉన్నారు. మహాభారతంలో కర్ణుడికంటే దైవోపహతుడు మరొకడు కనిపించడు. పాండవాగ్రజుడిగా పుట్టి, శూద్రుడిగా పెరిగి, స్నేహితుడి అండతో రాజై, దుర్మార్గుడికి తోడై, గురువు కోపాన్ని జుగ్రుకుని, యుద్ధప్రావీణ్యం కలిసిరాక–కురుక్షేత్రంలో నిస్సహాయంగా నేలకొరిగిన యోధుడు కర్ణుడు. విశేషమేమిటంటే అతను అలా అనుకోలేదు. అదీ పాఠం"

"కురుక్షేత్రంలో భూమిలో క్రుంగిన రథచక్రాన్ని పెకలిస్తున్నప్పుడు శ్రీకృష్ణుడు ఎగతాళి చేశాడు.

"ఏమయ్యా, పెద్ద బీరాలు పలికావు. ఆఖరికి ఇలా అయిపోయావా?" అని.

కర్ణుడు నవ్వాడు. "విప్రహస్తే ధనం దత్తం...' అపాత్రదానం చెయ్యలేదు. 'స్వభార్యాయాంచ యౌవనం...' నా యౌవనం నా భార్యతోనే గడిచింది. 'స్వామికార్యే హత ప్రాణః...' నేను నమ్మిన, సేవించిన స్వామికోసమే ప్రాణాలు అర్పిస్తున్నాను. 'మాధవాశ్చాత్ర వర్తతే...' నా అవసాన దశలో సాక్షాత్తూ శ్రీకృష్ణ భగవానుడే నా కళ్లముందున్నాడు. నాకంటే అదృష్టవంతుడెవరుంటారు?" అన్నాడు.

"దురదృష్టానిది కాదు దృక్పథానిది దుర్మార్గం" అన్నాడు సర్వమంగళం.

"పదండి. ఈ ముగ్గు పూర్తయ్యాక వచ్చి ఇద్దరు బ్రాహ్మణులకి వండి పెడతాను. భవభూతి ఉద్బోదించిన పరోపకారం ఇవాళే ప్రారంభమౌతుంది" అంది అనసూయ.

❖ ❖ ❖

అబ్బుశాస్త్రిని చూసినప్పటినుంచీ రామశర్మని ఓ మీమాంస ఇబ్బందిపెడుతోంది. అంగవస్త్రం, పైపంచె, వీబూది, బొట్టుతో వెలిగిపోతున్న అబ్బుశాస్త్రి లౌకిక ప్రపంచంలో ఎలా నెగ్గుకురాగలడా అని.

వెయ్యిమందిలో భిన్నంగా, కొత్తవాడైనట్టుగా ఆధునిక పోకడలకీ, ధోరణికీ దూరంగా కనిపిస్తున్నాడు అబ్బుశాస్త్రి. కాగా, ఇప్పుడతను వెళ్లాల్సింది బొంబాయి. బొంబాయిలో ఇలాంటివారు జంతుప్రదర్శనశాలలోంచి తప్పించుకు వచ్చిన శాల్తీల్లాగ కనిపిస్తారు. ఈ అవతారంతో తన పనిలో నెగ్గుకురాలేడన్నది స్పష్టం. కారణం-అతను వెళ్లబోయేది, అన్వేషించబోయే నేపథ్యం ఏ విధంగానూ ఇంతవరకూ ఉన్నది కాదు. కాని ఈ విషయాన్ని అతనికి ఎలా చెప్పడం? చెప్పి ఎలా ఒప్పించడం? ఈ ప్రశ్నలకు సమాధానాలు వెదుకుతూ-నోటిదాకా వచ్చిన మాటని బయటపెట్టలేక కొన్నాళ్లు దాటేశాడు రామశర్మ-దాదాపు రోజు అబ్బుశాస్త్రినీ, సర్వమంగళాన్నీ కలుస్తున్నా.

ముక్కామల జూ నుంచి వస్తూనే - బొంబాయిలో మిత్రుడికి ఉత్తరం రాశాడు. అతను నారిమన్ పాయింట్‌లో తాజ్‌మహల్ హోటల్లో స్టోర్స్ క్లర్క్. ఈ ఉత్తరం చేరడానికీ, సమాధానం రావడానికీ ఎంతలేదన్నా పది పదిహేను రోజులు పడుతుంది. ఒకరోజు ఇద్దర్నీ-కోటితీర్థాలరేవు గట్టుమీదే కూర్చోపెట్టాడు రామశర్మ.

“నేనిప్పుడు చెప్పేది మీకు అభ్యంతరకరంగా కనిపించవచ్చు. కాని ఎలా చెప్పాలా అని నాలో నేనే నన్ను తర్ఫీదు చేసుకుంటున్నాను” అంటూ ప్రారంభించాడు.

“నా నమ్మకాలూ, మీ నమ్మకాలూ ఒకటే. మీ విశ్వాసాలతో నాకు ఎట్టి పరిస్థితుల్లోనూ తగాదా లేదు. వాటి వెనుక ఆంతర్యాన్ని నా ధోరణిలో అన్వేషిస్తున్నాను. ప్రాథమికంగా-ఇతను ఈ తర్వాత చెయ్యబోయే పనికి-మీ ఆచారాలూ, అలవాట్లూ, కట్టూబొట్టూ అవసరంలేదని నేను నమ్ముతున్నాను. కాగా, ఎంతోకొంత అడ్డంకు కూడా. రాజమండ్రిలో చన్నీటి స్నానం విధాయకం. చికాగో రామాలయంలో చలికాలంలో చన్నీటి స్నానం-విషాదకరం. సన్నిపాత జ్వరం వచ్చి మనిషి ప్రాణానికే హాని కలగవచ్చు. రాజమండ్రి హిందువుకీ, చికాగో హిందువుకీ విశ్వాసాలలో అంతరం లేదు. విధాయకాలలో దేశకాల పరిస్థితుల్నిబట్టి తప్పనిసరిగా అంతరం ఉంది. వాటిని విధిగా పాటించాలి. అది తప్పటడుగు కాదు. కొత్త పరిస్థితికి మనల్ని మనం అన్వయించుకోవడం” ఆగి ప్రశ్నార్థకంగా ఉన్న వారిద్దరి ముఖాలనూ చూసి నవ్వాడు.

“ఈ ఉపోద్ఘాతం దేనికా అని మీకు అనిపిస్తోంది. అబ్బుశాస్త్రి-మంచికో చెడుకో

గురువుల దగ్గర ఆశ్రయాన్ని కోరి వదులుకుని కొత్త ప్రపంచంలోకి వచ్చాడు. ఈ కొత్త ప్రపంచంలో ఆ ధర్మాన్ని పాటించడం ఎబ్బెట్టుగా, ఇబ్బందిగా ఉంటుంది. బొంబాయి నారిమన్ పాయింట్‌లో అంగవస్త్రంతో నిలబడిన సద్బ్రాహ్మణుడు విడ్డూరంగా కనిపిస్తాడు. ఇతను బొంబాయి వెళ్లే కారణానికి ఈ అవతారమే మొదటి ఆటంకం. నేను చెప్పదలుచుకున్నది చెప్పేశాను. మీకు..."

మాట పూర్తికాకుండా అబ్బుశాస్త్రి అందుకున్నాడు. "మీరు చెప్పింది సబబే. నేను మారతాను. ఈ అంగవస్త్రాన్నీ, విబూదినీ, పిలకనీ వదులుకుంటాను. ఏం చెయ్యాలో చెప్పండి"

ఈసారి సర్వమంగళం, రామశర్మ ఇద్దరూ నిర్ఘాంతపోయారు. సర్వమంగళం ఆశ్చర్యంగా మిత్రుడిని చూశాడు.

"అవును. తలంటుకోడానికి గావంచాను కట్టుకుంటాం. అనుష్ఠానానికి పట్టుపంచెను కట్టుకుంటాం. బజారుకెళ్లడానికి పైపంచె వేసుకుంటాం. బొంబాయి వెళ్లడానికి సిద్ధపడ్డాను. నాగరిక ప్రపంచం అంగీకరించే మనిషిగానే వెళ్తాను. నేను చెయ్యబోయేది నాలాంటివాడు చేసే పని కాదని నాకు తెలుసు. ఆ పనికి అభ్యంతరం అనిపించే దాన్ని నేను విసర్జించడానికి సిద్ధంగా ఉన్నాను" రామశర్మని చూసి నవ్వి "నేను చికాగోలో హిందువును కావడానికి సిద్ధం" అన్నాడు.

శభాష్. ఎంత సనాతనమైనా ఈ వ్యక్తిలో విచక్షణ రామశర్మని ఆశ్చర్యపర్చింది. చట్టుక్కున లేచాడు. "ఇంక నా సందేహం తీరిపోయింది. రేపు ఉదయం పది గంటలకి ముహూర్తం" అన్నాడు.

మర్నాడు ఉదయం అబ్బుశాస్త్రి పరకాయప్రవేశం చేసిన కొత్త మనిషి అయిపోయాడు. తను చెయ్యబోయే పనికి పిలకని త్యాగం చేశాడు.

రెడీమేడ్ షాపులో పైజామా, లాల్చీని తొడిగించాడు రామశర్మ. నుదుటిమీద విబూది లేకపోయినా చిన్న బొట్టుని అలంకరింపజేశాడు. ఇప్పుడు అబ్బుశాస్త్రి కుబుసం విప్పిన త్రాచులాగ ఉన్నాడు. సంచితం చేసిన వైభవాన్ని పక్కనపెట్టి కొత్త జీవితానికి తలుపులు తెరిచిన work-force లాగ ఉన్నాడు. వెరసి–రూపందాల్చిన కర్తవ్యంలాగ ఉన్నాడు. లక్ష్యం స్వరూపానికి కొత్త అంగీని తొడిగింది. కాని స్వభావం ఆ అంగీని ధిక్కరించి ఆ మూర్తిలో దీపశిఖలాగ వెలిగింది. ఇప్పుడితను మిస్టర్ అబ్బు.

# 13

దాదర్ ఎక్స్‌ప్రెస్ దిగిన అబ్బుశాస్త్రిని రామశర్మ మిత్రుడు వందమందిలో ఒకడిగా తేలికగా గుర్తుపట్టాడు. "మీరే అబ్బుశాస్త్రి" అని చెయ్యి పట్టుకున్నాడు.

మనిషి కారునలుపు. నవ్వితే పళ్ళు వెన్నెల వికసించినట్టు వెలుగుతాయి. స్నేహానికి డేనియల్‌కి ఆ నవ్వే పెట్టుబడి. "ఇక్కడినుంచి ఇల్లు గంటన్నర ప్రయాణం. లోకల్లో వెళ్ళాలి. మీకిదంతా కొత్త అని రామశర్మ చెప్పాడు" అంటూ అతని చేతిలో సంచీని అందుకున్నాడు. ఒకప్పుడు ఆ సంచీలో మరో అంగవస్త్రం, విబూది ఉండేది. ఇప్పుడు ఓ జత బట్టలూ, ఓ టూత్‌పేస్టూ, బ్రష్ ఉన్నాయి. ఇది పరకాయప్రవేశం రెండో దశ.

ఇద్దరూ ఓవర్ బ్రిడ్జి దాటి చర్చి గేటుకి రైలెక్కారు. విపరీతమైన రద్దీ. కాని చుట్టూ ఎవరూ మనుషులు లేనట్టు ఎవరికి వారు రిలాక్స్ అవుతూ ప్రయాణం చెయ్యడం అక్కడివారి దైనందిన జీవితం.

"మీ గురించి అంతా చెప్పాడు రామశర్మ. అతనికి సగంమంది నచ్చరు. అతనంటే సగమంమందికి నచ్చదు. ఓ పెక్యూలియర్ మనిషిని నీ దగ్గరికి పంపిస్తున్నాను. 'భక్తి'గా–ఇదీ మాట–'భక్తి'గా అతనికి సహాయం చెయ్యి" అని రాశాడు. ఆశ్చర్యమే..." చర్చి గేట్ స్టేషన్‌లో తోసుకు పరిగెత్తుతున్న మనుషుల మధ్య జారిపోకుండా అబ్బుని పట్టుకున్నాడు డేనియల్.

"మాది నూజివీడు. మా నాన్న ఆ రోజుల్లో పెసరట్టు అద్భుతంగా వేసేవాడు. ఆ ఒక్క కారణానికే తాజ్‌లో ఓ తెలుగాయన–18 ఏళ్ల కిందట బొంబాయి తీసుకొచ్చాడు. ఎంత ప్రయత్నించినా నాకు పెసరట్టు వంటబట్టలేదు. పెసరట్టుకి కావలసిన వంట సామగ్రిని చూసే ఉద్యోగంలో చేరాను. పెళ్లి చేసుకోవాలని ప్రయత్నించాను కాని–ఓ మహారాష్ట్ర అమ్మాయి నన్ను మోసంచేసి ఎమరాల్డ్స్‌లో దోశెని పెళ్లి చేసుకుంది" నవ్వి–

"ఇక్కడ పెద్ద పెద్ద హోటళ్లలో వేర్వేరు స్పెషాలిటీస్‌కి వేర్వేరు 'షెఫ్'లు ఉంటారు. నా పేరు డేనియల్. 'డేన్' అంటే చాలు" అంటూ సిటీ బస్సు ఎక్కించాడు.

ఓ పెద్ద అపార్ట్‌మెంట్ సెల్లార్‌లో ఓ మూల చిన్న గది డేనియల్ ఉండేది.

"ఈ నగరంలో పెద్ద సమస్య–ఉండే స్థలం. ఈ గది, ఆనుకొని ఉన్న బాత్‌రూమ్ కష్టపడి సంపాదించాను. నాకు చేతనైనంతగా మీకు అసౌకర్యం లేకుండా చూస్తాను. ఇబ్బందైతే నన్ను క్షమించండి" అన్నాడు డేనియల్.

"ఇక్కడి భాష మీకు రాదు. ఈ నగరం మీకు కొత్త. డ్యూటీలో తప్ప వీలైనంతగా

మీతోనే ఉంటాను. ఒకవేళ–మీరు ఒంటరైతే మీకు రెండు కావాలి" అంటూ జేబులోంచి 20 రూపాయలూ, ఇంటి అడ్రసు రాసిన కాగితం తీశాడు.

మరో కాగితంమీద రోడ్ మాప్ వేశాడు. "ఇక్కడ లోకల్ ఆగుతుంది. ఇక్కడ బస్సు ఎక్కాలి. రిషీ నాయక్ పార్క్ అని చెప్పాలి. మీరిక్కడ దిగుతారు. రోడ్డుమీద ఈ మూలకి కనిపించే గుడి–గణపతి ఆలయం. ఇది మీ బస్ స్టాప్ గుర్తు. ఇంటికి వస్తే–బయట ఈ గోడవారన తాళం ఉంటుంది. నా ఫోన్ నెంబర్ ఇది. ఫోన్ ఓ అమ్మాయి ఎత్తి పలకరిస్తుంది. "డేనియల్ స్టాక్ హాండ్ 2" అని చెప్పండి చాలు. ఓ తాగుబోతు గొంతు పలకరిస్తుంది. అతను తాగుబోతు కాదు. కాని గొంతు అలాంటిది. 'బ్లాకీ' అనండి. నన్ను పిలుస్తాడు"

అబ్బు నిస్సహాయంగా చూశాడు. డేనియల్ నవ్వాడు "నాకు తెలుసు. ముక్కామల నుంచి సరాసరి బొంబాయి నడిబొడ్డుకి వచ్చారు. భయపడకండి. మిమ్మల్ని ఇబ్బందిపెట్టను. ఇదంతా ఒకవేళ తప్పనిసరైతే..."

"అవదు. నేను మీతోనే ఉంటాను" అన్నాడు అబ్బుశాస్త్రి.

మళ్ళీ డేనియల్ నవ్వాడు. "కాని నేను మీతో ఉండను. ఉండలేను. ఇప్పుడు రెండు అయింది. మరో అరగంటలో నేను బయలుదేరుతాను. రేపు మధ్యాహ్నందాకా రాను. నాకివాళ నైట్ డ్యూటీ. రాత్రి మీరు తినడానికి రొట్టె ఉంది. యెగర్ట్–అదే–పెరుగు ఉంది. వండుకోవాలనిపిస్తే కొంచెం బియ్యం ఉన్నాయి. గేటు దాటితే–ఐదు గంటలకి–ఎదురుగా దుకాణంలో పాలమనిషి ఉంటాడు. ఒక ప్యాకెట్ కొనుక్కోవచ్చు. ఫోన్ కూడా ఆ దుకాణంలోనే ఉంటుంది. ఇక్కడ మిమ్మల్నెవరూ పలకరించరు. మీకు కాఫీలూ, టీలూ అలవాటు ఉండవని నాకు తెలుసు. రెండు పాల ప్యాకెట్లు మీకిచ్చిపొమ్మని జానీకి చెప్తాను. అదే–జానీ అంటే ఆ దుకాణంలో పనిచేసే మనిషి"

చుట్టూ చూశాడు అబ్బు. అతి చిన్న గది. అందులోనే అతని జీవితం సమస్తమూ ఉంది. అబ్బు ముఖంలో కాస్తపాటి ఇబ్బందిని గమనించి "మీకోసం మంచి తువాలు. ఒక బెడ్‌షీట్ కొన్నాను. అంతకన్నా నా దగ్గర డబ్బుల్లేవు" అన్నాడు డేనియల్.

"మీకు రామశర్మని ఎలా తెలుసు? అదే రామశర్మకి మిమ్మల్ని ఎలా తెలుసు?"

"మా తాత రామశర్మగారి తండ్రి బట్టలు ఉతికేవాడు" అక్కడ సంభాషణ ఆగింది. అబ్బు చిన్న బల్లమీద కూచుని ఉండగానే–డేనియల్ అర్జంటుగా స్నానంచేసి బట్టలు మార్చుకున్నాడు.

"నేను వెళ్లొస్తాను" అని గుమ్మందాకా వెళ్లి–ఏమనుకున్నాడో ఏమో వెనక్కి వచ్చి అబ్బు కాళ్లకి నమస్కారంచేసి గుమ్మంలో మాయమయ్యాడు.

ఒక్క క్షణం కదిలిపోయాడు అబ్బు. ఎక్కడ గురువుగారి దేవాలయం? ఎక్కడ మిత్రుడి పర్ణశాల? ఎక్కడ ఈ అంతు తెలియని నగరంలో ఈ ముక్కూ, మొహం తెలీని వ్యక్తి మారుమూల గది? డేనియల్ జీన్స్‌లో ఎక్కడో సంస్కారపు పొరలున్నాయి. ఉపాధి కర్తవ్యాన్ని నిర్దేశించి–మనస్సు అట్టడుగున మూలిగే ఆలోచనా ప్రవంతిని జోకొట్టింది.

అబ్బుశాస్త్రి వంటి వ్యక్తి సమక్షం డేనియల్‌కి కొత్త. అతన్ని గౌరవించడానికి, అతని ఉనికిని సుఖవంతం చేయడానికి చాలా ఆలోచనలు చేశాడు. చాలా ఖర్చుపెట్టాడు. చాలా ప్రయత్నాలు చేశాడు. అవేవీ చాలవని అబ్బుని చూసి గ్రహించాడు. ఈ పరిస్థితి 'కుంజరయూథం దోమ గొంతులో జొరబడడం' ఏం చెయ్యాలి? ఆయన పాదాలకు నమస్కరించి మాయమయ్యాడు.

❖ ❖ ❖

డేనియల్ వెళ్లాక స్నానంచేసి–అంగవస్త్రంతో అదే బల్లమీద కూర్చుని గాయత్రీ పారాయణ సాగించాడు. సాయంకాలం–గది బయట హిందీ పాట విజిల్–తలుపు చప్పుడు వినిపించి లేచాడు. బయట ఎర్ర బనీనూ, పొట్టి లాగూతో ఉన్న కుర్ర జానీ "దూ...ద్" అని గావుకేకపెట్టి అబ్బుని చూసి ఆశ్చర్యంతో నీరుకారిపోయాడు. ఇతను తమ కోవకు చెందిన మనిషి కాదు. నిజానికి ఆ కోవకి చెందిన మనిషిని జానీ చూడలేదు. మాటలు తడుపుకొని ఏం చెప్పాలో తెలీక "సలామ్–పండిట్‌జీ" అంటూ వెనక్కి వెనక్కి నడిచి మాయమయ్యాడు. ఆ రాత్రికి గ్లాసు పాలు తాగి నేలమీద పడుకున్నాడు.

ఉదయమే మరో గ్లాసు పాలు తాగి, స్నానంచేసి మళ్లీ గాయత్రి పారాయణ కొనసాగించాడు.

మధ్యాహ్నం రెండున్నరకి హడావుడిగా వచ్చాడు డేనియల్. చేతిలో అరటిపళ్లు, యాపిళ్లు, దానిమ్మపళ్లు ఉన్నాయి. బట్టర్ నాన్, మిక్స్‌డ్ వెజిటబుల్ కర్రీ వేర్వేరుగా పార్శిలు చేయించి అబ్బు ముందుంచాడు.

"ఇవన్నీ నాకక్కర్లేదు. ఇవి చాలు" అని పళ్లు తీసుకున్నాడు అబ్బు.

"బాగా నిద్రపోయారా? జానీ పాలు తెచ్చాడా? నీళ్లు వచ్చాయా? ఉదయం ఆరుదాకే నీళ్లొస్తాయని చెప్పడం మరిచిపోయాను"

"అయిదుకే స్నానం ముగించుకున్నాను" అన్నాడు అబ్బు.

"రాత్రి రామశర్మ ట్రంక్‌కాల్ చేశారు. మరెవరో సర్వ..."

"సర్వమంగళం"

"ఆ. ఆయన మాట్లాడారు. మీరు వెళ్లదలచిన జువెలరీ కంపెనీ ఒకప్పుడు

అంథేరీలో ఉండేది. అది ఒకప్పుడు సాల్సెట్టా ద్వీపం. ఆ మాటకొస్తే ఈ బొంబాయంతా అలా కలిసిన చిన్న చిన్న ద్వీపాలే. అంథేరీ మధ్యగా రైల్వే లైను వెళ్తుంది. అందువల్ల అంథేరీ రెండు ముక్కలైపోయింది. అంథేరీ అంటే ఇక్కడివాళ్ళకి సినిమా స్టూడియోలే. షేరే పంజాబ్ హౌసింగ్ సొసైటీ పెద్ద కాంప్లెక్స్. మీరు చెప్పిన కంపెనీ న్యాయంగా అక్కడ ఉండాలి. దానిగురించి ఎవరూ చెప్పలేకపోయారు. మా మిత్రులు ఒకరిద్దరికి చెప్పాను. అడ్రసు తెలీకుండా తిరగాలంటే వారం పది రోజులు పడుతుంది. మావాళ్ళు సమాచారం చెప్పాక వెళ్దాం. "ఈలోగా మహంకాళీ గుహలు చూస్తానంటే..."

"నేనేమీ చూడను. ఇక్కడే ఉంటాను. నాకోసం మీరేం ఇబ్బందిపడొద్దు. నాకు మీరు గొప్ప ఉపకారం చేస్తున్నారు. ఇది చాలు. మీ దగ్గర ఏది ఉంటే అది పెట్టండి. నా దగ్గర ఈ రెండు వందలు ఉన్నాయి. వీటిని ఉపయోగించండి" ఇవ్వబోయాడు అబ్బుశాస్త్రి.

"వద్దు పండిట్జీ వద్దు. ఈ ట్రిప్పులో మీరు కోరుకున్న పని జరిగితే అంతే చాలు" అని బట్టలు మార్చుకుని "ఒక్క మాట చెప్పండి. ఆ అమ్మాయెవరో కనిపిస్తే పెళ్లి చేసుకుంటారా?" అనడిగాడు డేనియల్.

జీవితంలో–బహుశా మొదటిసారిగా–పగలబడి నవ్వాడు అబ్బుశాస్త్రి. ఆ నవ్వు పవిత్రంగా, కొత్తగా, గొప్పగా కనిపించింది డేనియల్‌కి. "ఆమెని ఆరేళ్ల వయస్సులో చూశాను. ఇప్పుడెలా ఉందో. ఆమె నాకు లంకలో మాయమైన సీతమ్మలాంటిది"

లంక, సీత–ఇవన్నీ డేనియల్‌కి కొరుకుడుపడని విషయాలు. అయినా–అతనికా ఆలోచన లేనట్టు అర్థమైంది. నిరుత్సాహపడిపోయాడు. హిందీ సినిమాలు మరిగిన డేనియల్, తప్పిపోయిన అమ్మాయిని వెదికి పట్టుకుని ఒకాయన పెళ్ళి చేసుకోవడంలాంటి గొప్ప రొమాంటిక్ కథ వృథా అయిపోయినందుకు బాధపడ్డాడు.

హోటల్లో బసోటా డిన్నర్లు ఉన్నాయంటూ దాదాపు రెండు రాత్రులు డేనియల్ ఇంటికి రాలేదు. అబ్బు ఆ గదికి అలవాటుపడ్డాడు. జానీ పండిట్జీకి అలవాటుపడ్డాడు.

❖ ❖ ❖

అప్పుడప్పుడు పళ్ళు కొని ఇవ్వమని పురమాయించాడు. గుమ్మం దగ్గర పెట్టి వెళ్తున్నాడు జానీ.. రోజులు గడుస్తున్నాయి. అయినా అబ్బులో స్థిమితం చెక్కుచెదరలేదు. కాలాన్ని అంతర్ముఖుడై వెళ్లదీస్తున్నాడు.

నాలుగు రోజుల తర్వాత దూకుడుగా వచ్చాడు డేనియల్. "బయుదేరండి పండిట్జీ. చిన్న ఆధారం దొరికింది" అన్నాడు. అబ్బుశాస్త్రి కళ్లు మెరిశాయి. లేచాడు ఒక్క ఉదుటున.

బస్సులో చెప్పుకొచ్చాడు డేనియల్. దాదాపు పదిహేనేళ్ల కిందట 'రౌత్స్' వ్యాపారం మూతబడింది. కారణం–ఆ వ్యాపారాన్ని ప్రారంభించిన నెథానియల్ రౌత్ కొడుకు రావత్ కారు యాక్సిడెంట్‌లో చచ్చిపోయాడు. ఒకరకమైన నిర్వీర్యతకు లోనై పెద్ద రౌత్ వ్యాపారాన్ని మూసేశాడు. ఆ స్థలంలో 12 వ్యాపారాల మల్టీప్లెక్స్ భవనం లేచింది. బర్లింగ్టన్ టెక్స్‌టైల్స్ షాపు, ఒక చిన్న డిపార్ట్‌మెంటల్ స్టోర్, నట్స్ అండ్ కేక్స్ షాపు, హెయిర్ కటింగ్ సెలూన్–ఇలా రకరకాల వ్యాపారాలు ప్రారంభమయ్యాయి.

"ఈ రౌత్ ఎక్కడ ఉన్నాడు?"

నవ్వాడు డేనియల్. పరవాలేదు. ఈ పంతులుగారికి ఆలోచనలో ఒక ధోరణి ఉంది. "ఆయన ఇంటిని పట్టుకున్నాను. ఇప్పుడు మనం అక్కడికే వెళ్తున్నాం" అన్నాడు.

వెర్సోవాలో కాస్త ఎడంగా ఉన్న పాత బంగళా దగ్గరికి వచ్చారిద్దరూ. ఒకప్పటి వైభవం–ప్రస్తుతం వెలిసిపోయిన బంగళాలో తెలుస్తోంది. ఒకప్పుడు గేటు దగ్గర గూర్ఖా ఉండేవాడు. ఒకప్పుడు గేటు దాటగానే కుక్క ఉండేది. ఆ ఇద్దరి గదులూ ఇప్పుడు బీటలువారి ఉన్నాయి. యూదులు టోపీ ధరించిన కుర్రాడు వసారాలో కనిపించాడు.

మహారాష్ట్ర భాషలో వచ్చిన పని చెప్పాడు డేనియల్. కుర్రాడి ముఖంలో విముఖత కనిపించలేదు.

మరో పది నిముషాల తర్వాత లోపలికి తీసుకెళ్లాడు. ముందుహాలులో ఒక పక్కకి మెత్తటి వాలుకుర్చీలో కూర్చున్నాడు నెథానియల్ రౌత్. తేలికగా 85 సంవత్సరాలు దాటిన వయస్సు. తీసుకువచ్చిన కుర్రాడు డేనియల్ చెవిలో ఏదో చెప్పాడు. డేనియల్ అబ్బుకి వివరించాడు. ఈ ముసలాయనకి చెముడు. ముఖం చూసి మాటని అర్థం చేసుకుంటాడు. అయితే అతనికి అర్థమయ్యే మాట అబ్బుశాస్త్రికి రాదు. ఆ పనికి డేనియల్ పూనుకున్నాడు. ఆనాటి యాక్సిడెంటూ, ఇటీవల కారులో దొరికిన గాజులు–ఇవన్నీ వివరించాక అబ్బుశాస్త్రి జేబులోంచి ఆనాడు కారులోంచి తీసిన గాజుల అవశేషాలున్న సంచీని ఆయన ముందు బల్లమీద పెట్టాడు.

ముసలాయన సంచీని అందుకోలేదు. కుర్రాడిని పిలిచి తెల్లని గాజుపలక తెప్పించాడు. కుర్చీ పక్కనే ఉన్న దీపాన్ని పుల్లీతో కిందకి లాగాడు. ఇప్పుడు గాజుపలక ధగధగ మెరుస్తోంది. ఇప్పుడు అబ్బుశాస్త్రి ఉంచిన సంచీని గాజుపలకమీద ఒంపాడు. తెగి విడివడిన ఎర్రటి పూసలు, వాటిని ఒకప్పుడు గుచ్చి పట్టుకున్న నల్లటి తీగె, ముక్కలు ముక్కలైన బేస్ లోహం–అన్నీ పడ్డాయి.

బేస్ ముక్కల వెనుక స్పష్టంగా తెలుస్తున్న 'రౌత్' అక్షరాల్ని చూసి గర్వంగా నవ్వాడు వృద్ధుడు–"ఇది మా దగ్గర తయారైందే!" అంటూ.

"సెలంగోర్ దారుల్ ఎహ్సాన్‌లో ఫోకెంగ్ జువెలరీ–సలావుద్దీన్ భాయ్ బీడ్స్ ఇవి" అంటూ మెత్తటి షామ్వాయ్ తోలుముక్కతో పూసల్ని మెరుగుపెడుతూ మురిసిపోయాడు రౌత్. అన్ని పూసల్నీ ధగధగా మెరిసేదాకా శుభ్రం చేశాడు. దీపం వెలుగులో ఇప్పుడు కెంపుల్లాగ మెరుస్తున్నాయి. డేనియల్, అబ్బుశాస్త్రి ఆశ్చర్యంగా చూస్తున్నారు. "ఇవి లీలా థాంపే నగలు" అన్నాడు రౌత్ గర్వంగా.

"ఆరోజుల్లో ఆమె స్వయంగా మలేషియాలో జలక్ ఇంచి మార్కెట్‌లో సలావుద్దీన్ షాపులో ఖరీదుచేసి తెచ్చింది. కంపెనీ పేరు 'తియూకూ'. నగ తయారీకి నా పేరుని సూచించాడు సలావుద్దీన్. మరెవరిదగ్గరికీ వెళ్లొద్దని హెచ్చరించాడు. లీలా థాంపే మహారాణీ. నా దగ్గరికి రాలేదు. నన్నే తన దగ్గరికి పిలిపించుకుంది" అంటూ గలగలా నవ్వాడు.

నోటిలో మిగిలిన గారపట్టిన నాలుగైదు పళ్లు బయటపడ్డాయి.

"ఆరోజుల్లో ఈ రెండు గాజులు ఖరీదు ఎంతలేదన్నా నాలుగైదు లక్షలు. నేను చెప్పేది 48 సంవత్సరాల కిందటి మాట. ఈ బేస్‌ని ప్లాటినమ్‌తో తయారుచేశాం. ఇది అరుదైన, అందమైన నగ. గర్వంగా మా పేరు, TEUKU పేరు వేసుకున్నాం. దాదాపు 20 సంవత్సరాల కిందట లీలా థాంపే కోడలు ఈ నగల్ని తెచ్చారు. ప్లాటినమ్ బేస్ తీసేసి చిన్నపిల్లకి గాజుల జత చేయాలన్నారు. నేను కళ్ళనీళ్ళు పెట్టుకున్నాను. బతిమాలాను. నగ విలువ దెబ్బతింటుందన్నాను. పూసలకట్టులో అందం తగ్గిపోతుందని మొరపెట్టాను. అన్నీ విని ఆమె ఒకటే మాట అన్నారు. "ఈ నగని పూర్తిగా అమ్మెయ్యాల్సిన పరిస్థితి. కాని మా అమ్మాయికి పూసల గాజులుంచి, ప్లాటినమ్‌ని సొమ్ముచేసుకోక తప్పదు" అన్నారు. అర్థమైంది. తప్పనిసరిగా అల్యూమినియం మీద ప్లాటినమ్ కోట్ వేశాం. ఇది నిజమైన ప్లాటినమ్ అయితే మరో పదేళ్లుభూమిలో ఉన్నా చెక్కుచెదిరేది కాదు. కాని ఈ బీడ్స్–ఇవి ఖరీదైనవి. మరో విషయం–ఈ తీగె మేలిమి బంగారం–సందేహం లేదు"

అబ్బుశాస్త్రి, డేనియల్ ఆశ్చర్యపోయారు. "అవును. ఆరోజుల్లో బంగారాన్ని ఆనాటి ఫాషన్ ప్రకారం iodize చేశాం. ఎంత లేదన్నా ఇప్పుడీ నగలు రెండూ నాలుగు లక్షల ఖరీదుంటుంది" అన్నాడు రౌత్.

అనుకోకుండా సీటు కిందకి జారిపోయి–ఈ నగ మాత్రం మిగిలింది.

ఆత్రుత పట్టలేక తెలుగులో అడిగాడు అబ్బుశాస్త్రి.

"లీలా థాంపే ఇంటికి వెళ్ళేనన్నారు కదా? ఆ ఇల్లెక్కడ?"

డేనియల్ మహారాష్ట్రలో ఆ ప్రశ్నని తర్జుమా చేశాడు.

"ఒక్క నిముషం" అంటూ రౌత్ కుర్రాడిని పిలిచి–చర్మంతో బైండు చేసిన పాత

పుస్తకాన్ని తెప్పించాడు. నాలుగైదు పేజీలు తిప్పాడు. గర్వంగా ఆనాటి నగల ఫోటోని పేజీల్లో చూపించాడు. "ఇదుగో. అప్పటి ఈ నగ ఫోటో" అంటూ అడ్రసు చదివాడు. 132 ఏ/48, కుందన్ బాగ్, బోరివిలీ వెస్ట్, పోవై. ఇద్దరూ లేచారు. అబ్బుశాస్త్రి ముఖంలో ఎక్కడలేని ఆనందం తొణికిసలాడింది.

ఈ సమస్య–ఇంత సులువుగా, ఇంత స్పష్టంగా, ఇంత త్వరగా పరిష్కారమౌతుందని ఊహించలేదు.

"ఆయనకి నా తరఫున ధన్యవాదాలు చెప్పండి" అన్నాడు అబ్బుశాస్త్రి పూసలు, గాజుల సంచీని అందుకుంటూ.

ఇప్పుడు అడిగాడు రౌత్ "ఎవరీయన?" అని. డేనియల్ చెప్పడానికి ఉపక్రమించి, ఎలా ప్రారంభించాలో తెలీక, ఎలా చెప్పాలో తెలీక కంగారుపడి ఆగిపోయాడు.

"అవి మ్యూజియం పీసెస్, జాగ్రత్తగా ఉంచమని చెప్పండి. అవి చాలా విలువైనవి" అన్నాడు రౌత్ హాలు దాటుతున్న ఇద్దరితో.

## 14

రౌత్ బంగళాలోంచి బయటికి వస్తూనే అతను చెప్పిన అడ్రసుకి వెళ్దామన్నాడు అబ్బు. ఆ అడ్రసుకి వెళ్లాలంటే కనీసం రెండు బస్సులు మారాలి. అప్పటికే చీకటి పడుతోంది.

అయినా 16 ఏళ్ల కిందటి ఆరేళ్ల అమ్మాయి ఇప్పుడు ఏం చేస్తోంది? ఎలా ఉంది? ఆ అడ్రసులోనే ఉంటోందా? అక్కడ ఎవరున్నారు? ఇన్ని ప్రశ్నలకు సమాధానం రెండు బస్సులు మారే ప్రయాణం. అయితే మొదటి బస్సు యాత్ర పూర్తికాకుండానే మొరాయించింది. రోడ్డు మధ్య యాక్సిల్ విరిగి బస్సు చదికిలపడింది. ప్రయాణికులందరూ దిగిపోయారు. అక్కడినుంచి రెండో బస్సుని అందుకోవాలంటే ఎంతలేదన్నా రద్దీగా ఉన్న రోడ్లమీద అయిదారు కిలోమీటర్ల ప్రయాణం చేయాలి.

సాయంకాలం బొంబాయి రోడ్లు నెలలు నిండిన చూలాలులాగ ఉంటాయి. ఇద్దరూ రెండో బస్సుని అందుకోడానికి నడకని ప్రారంభించారు.

16 సంవత్సరాల నిరీక్షణకి మరో ఎనభై నిముషాల ఆలస్యం చేరింది.

బోరివిలీ అడ్రసు చేరేసరికి రాత్రి తొమ్మిదిన్నర అయింది. ఇద్దరూ రౌత్ చెప్పిన అపార్టుమెంటు ముందు నిలబడ్డారు. అది 18 అంతస్థుల భవనం. తీరా ఈ సమయంలో ఓ ఆడపిల్లకోసం ఆ అపార్టుమెంటు తలుపు కొట్టడం సబబా కాదా అన్న మీమాంస వచ్చింది. డేనియల్ తటపటాయించాడు. కాని అబ్బు శాస్త్రి మనస్సు ఉరకలు వేస్తోంది.

సంవత్సరాలుగా పోగైన ఉత్కర్ష ఈ చిన్ని అనౌచిత్యాన్ని జయించింది. "ఇంటి ముందున్నాం. చూసే వెళ్దాం" అన్నాడు అబ్బుశాస్త్రి.

కాని అపార్టుమెంటు వాచ్‌మేన్ అడ్డంపడ్డాడు. ముక్కూ మొహం తెలియనివాళ్ళని, ముఖ్యంగా ఆ అపార్టుమెంటులో ఉన్నవాళ్ళు గుర్తుపట్టలేనివాళ్ళని పంపడానికి ససేమిరా అన్నాడు. డేనియల్ లోకల్ మనిషి. ఇలాంటి పరిస్థితుల్ని అధిగమించడం అతనికి కొట్టిన పిండి.

ఆర్డరిచ్చిన ఆరో దోశ మొదటి దోశె కావాలంటే టిప్పు 20 రూపాయలు పెరుగుతుంది. అంతే. అబ్బుశాస్త్రి అమాయకంగా లాల్చీ జేబులో చెయ్యిపెట్టి చచ్చిపోయిన ఆ అమ్మాయి తల్లిదండ్రులు వదిలిపోయిన నగల సంచీ తీశాడు.

"మేం వస్తున్నట్టు ఆవిడకి తెలీదు. ఇంత విలువైన ఆస్తి ఉన్నదనీ ఆవిడకి తెలీదు. ఈయన ఆస్తిని కేవలం ఆమెకి అప్పగించడానికి వచ్చాడు. నువ్వు పంపకపోతే ఆవిడ లక్షలూ, నువ్వు వందా నష్టపోతావు. తర్వాత నీ ఇష్టం" అన్నాడు డేనియల్–నూరు రూపాయల నోటు బయటికి తీసి.

మరో క్షణంలో గేటు తెరుచుకుంది. అప్పటికి పది గంటలు దాటి పది నిముషాలయింది.

"నాలుగో ఫ్లోర్. 48 అపార్టుమెంటు. నేను పంపానని చెప్పకండి" అంటూ ముఖం తిప్పుకున్నాడు వాచ్‌మేన్.

ఒకప్పుడు వైభవోపేతంగా ఉన్న అపార్టుమెంటు. సాదాసీదా మనుషుల అంతస్థుకి అందేది కాదు. అయితే ఆనాటి నెథానియల్ రౌత్‌లాగ అపార్టుమెంటు కూడా పాతబడింది. అక్కడక్కడ పాడుబడింది.

బొంబాయిలో ఓ విశేషముంది. బిల్డింగులో ఉండే ఏ వ్యక్తికీ మరో వ్యక్తితో పొంతన ఉండదు. ఎవరూ బిల్డింగు బయటి రూపాన్ని పట్టించుకోరు. కాని తమ ఫ్లోర్ తలుపులు తెరిస్తే ఇంద్రభవనం చేసుకుంటారు. ఆ కారణానికే బొంబాయిలో అన్నీ–లేదా–చాలా అపార్టుమెంట్లు వెలిసిన చీరె కట్టుకున్న 'ఊర్వశి'లాగ ఉంటాయి. లిఫ్టు కీచుమని మొరబెట్టింది. తలుపు తెరుస్తూనే లిఫ్టులో దీపం ఆరిపోయింది. చీకట్లో ఫ్లోర్ నెంబర్లు కనిపించడంలేదు. డేనియల్ బయటికి వచ్చి మరో 15 నిముషాలకు అగ్గిపెట్టె కొని తెచ్చాడు. ఇప్పుడు లిఫ్టులో దీపం వెలిగింది. అమ్మయ్య, ఎదురుచూసే అద్భుతమైన క్షణానికి అది ఆఖరి మజలీ–అనుకున్నాడు అబ్బుశాస్త్రి.

శ్రీరామరక్షా మంత్రాన్ని పెదాలు మననం చేస్తున్నాయి.

నాలుగో ఫ్లోర్ దగ్గర లిఫ్టు ఆగింది. ఇద్దరూ బయటికి అడుగుపెట్టారు. ఆ క్షణాన ఇద్దరూ తుళ్లిపడే సంఘటన జరిగింది. లిఫ్టుకి దూరంగా ఉన్న ఏదో అపార్టుమెంటు తలుపు భళ్లున తెరుచుకుంది. భయంకరమైన హిందీ పాట, భయంకరమైన శబ్దంతో కారిడార్‌లోకి దూకింది. పాటలోనే ఓ వ్యక్తి పెద్ద అరుపు కలిసిపోయింది. పాట టీవీదని తెలుస్తోంది. అంతకుమించి అరుపు మనిషిదని స్పష్టంగా తెలుస్తోంది. ఇద్దరూ కొయ్యబారిపోయారు. ఆ క్షణంలో తెరిచిన అపార్టుమెంటులోంచి దూసుకుని నల్లటి సెల్వార్ కమీజ్‌తో జుట్టు వదులుగా విరబూసిఉన్న ఓ అమ్మాయి బయటికి దూసుకువచ్చింది. పరుగుపరుగున లిఫ్టువేపు రాబోయి–నాలుగు అడుగుల్లోనే లిఫ్టు దగ్గర ఉన్న ఇద్దరు మనుషుల్ని చూసి ఆగిపోయింది. ఒక్క లిప్త. అంతే. చివ్వున వెనక్కి తిరిగి ఆ ఫ్లోర్‌కి అటు చివర ఉన్న మెట్లవేపు పరుగెత్తింది. మరో క్షణంలో మాయమయింది.

అబ్బుశాస్త్రి, డేనియల్ నిశ్చేష్టులైపోయారు. ఆ అపార్టుమెంటులో ఏదో జరిగింది–ఎవరో ఏడుస్తున్నారు. మెల్లగా–భయం భయంగా అడుగులు వేసుకుంటూ అపార్టుమెంటు తలుపులమీది నెంబర్లు చూస్తున్నారు. తెరిచిన తలుపుమీదే 48 ఉంది! గదిలోంచి ఇంకా భయంకరమైన సినిమా పాట, నిస్సహాయమైన మూలుగులాంటి ఏడుపూ వినిపిస్తోంది. ఏం చెయ్యాలో ఇద్దరికీ పాలుపోలేదు. ఇద్దరూ–సందేహిస్తూనే అపార్టుమెంటులో కాలుపెట్టారు.

సోఫాలో దాదాపు నగ్నంగా ఉన్న మనిషి బాధతో విలవిలలాడుతున్నాడు. అతని చాతీమీదా, తొడలమీదా, రెండు కాళ్ళ మధ్య అంగంమీదా రక్తం తెలుస్తోంది. వచ్చిన వ్యక్తుల్ని పట్టించుకునే స్థితిలో లేడు.

ఇద్దరూ ఒణికిపోయారు. అబ్బుశాస్త్రికి కాళ్లూ చేతులూ ఆడలేదు. కాని డేనియల్ వెంటనే కార్యోన్ముఖుడయ్యాడు. ఈ తర్వాత ఏం జరుగుతుందో అతనికి తెలుసు.

అపార్టుమెంటులో దీపాలు వెలుగుతాయి. వెలిగాయి. చాలామంది ఇటువేపు పరుగులుతీస్తారు. తీస్తున్నారు. అక్కడ ఉంటే మొదట తామిద్దరూ ఇరుక్కుంటారు. అబ్బుశాస్త్రి భుజం పట్టుకుని బయటికి లాక్కొచ్చాడు. అప్పటికే లిఫ్టు తెరుచుకుని నలుగురైదుగురు పరిగెత్తుకు వస్తున్నారు. మెట్లు ఎక్కి వాచ్‌మేన్ పరుగున వచ్చాడు. ఎవరూ ఎవరినీ పట్టించుకోలేదు. పారిపోయిన అమ్మాయి అపార్టుమెంటుకి మెట్లు ఎటువేపు ఉన్నాయో చెప్పక చెప్పింది. ఇద్దరూ అటు పరుగుతీశారు.

48 అపార్టుమెంటులోకి అడుగుపెట్టి పక్కవాటా స్త్రీ కేకపెట్టింది.

రకరకాల భాషల్లో రకరకాల గొంతులు ఆశ్చర్యాన్నీ, షాక్‌నీ వ్యక్తం చేస్తున్నాయి. రెండేసి మెట్లు దూకుతూ–అబ్బు శాస్త్రి చెయ్యి పట్టుకుని డేనియల్ పరుగుతీశాడు.

అపార్టుమెంటు గేటు దాటిన 20 నిముషాల వరకూ ఆ పరుగు ఆపలేదు. అప్పటికి ఇద్దరూ షాక్‌తో, పరుగుతో అలసిపోయారు. ఇద్దరూ రోడ్డుపక్కన ఉన్న బస్ స్టాండ్ బెంచీమీద కూలబడ్డారు. అబ్బుశాస్త్రి ఆలోచనల్ని కూడదీసుకోడానికి ప్రయత్నించాడు. తమకి కనీసం 30 గజాల దూరంలో ఆగిన అమ్మాయి ముఖాన్ని స్ఫురణకి తెచ్చుకోడానికి ప్రయత్నించాడు.

ఆమె ముఖం విచిత్రంగా ఉంది. ఆ క్షణంలోనే తోచిన ఆలోచన అది. ఏమిటా విచిత్రం? హఠాత్తుగా స్ఫురణకు వచ్చింది. ఆమె ముఖంమీద రక్తం చిమ్మి ఉంది. పదహారు సంవత్సరాల కిందటా, ఇప్పుడూ ఆమె ముఖం అతనికి సరిగ్గా తెలియలేదు! తర్వాత–ఆమె ముఖాన్ని చూడడానికి మరో నాలుగు సంవత్సరాలు పట్టింది.

## 15

అబ్బుశాస్త్రి రాజమండ్రి స్టేషన్లో రైలు ఆగగానే చెయ్యి పట్టుకున్నాడు సర్వమంగళం. పక్కనే అనసూయ. అమ్మాయి గురించి అడగడానికి వచ్చారనుకున్నాడు అబ్బు.

కాని "కారు సిద్ధంగా ఉంది, రా" అంటూ లాక్కుపోయి కారులో కూలేశాడు. "మొన్న రాత్రి అమ్మగారికి గుండెపోటు వచ్చింది. ఆమె ఒక్కరి గురించే కలవరిస్తోంది. నువ్వు. 'అబ్బు ఎక్కడ?' అని గురువుగారు పదేపదే అడుగుతున్నారు. నీకెలా ఈ కబురందించాలో తెలీక బొంబాయివేపు నుంచి వచ్చే అన్ని రైళ్ళనీ వెదుకుతున్నాను. ఆ డేనియల్ ఎవరో రామశాస్త్రి ఫోన్‌చేసినా దొరకలేదు"

కారు ముక్కామలవేపు దూసుకువెళ్తోంది. మృత్యుంజయస్తోత్రం చదువుకుంటున్నాడు అబ్బుశాస్త్రి.

"స్వామీ! అమ్మ ఆయుర్దాయాన్ని–నేను–కాదు–నన్ను చూసేదాకా పొడిగించు" అని మనస్సులో వేడుకున్నాడు.

గుమ్మంలో కారు ఆగగానే సంజీవ పర్వతాన్ని తీసుకువచ్చిన హనుమంతుని చూసినట్టు శిష్యబృందం పొంగిపోయింది. గోడకు చేరబడి నిస్త్రాణగా కూర్చున్న చయనులుగారి కళ్ళు చెరువులయ్యాయి.

సోమిదేవమ్మని దర్భలు పరిచిన దుప్పటిమీదకి దించేశారు. అపస్మారంలో ఉంది. పెదాలు 'అబ్బూ' అంటున్నాయి. ఎక్కడలేని దుఃఖం తోసుకొచ్చింది అబ్బుకి. 'అమ్మా' అంటూ ఆమెని పొదివిపట్టుకున్నాడు.

"అమ్మని నన్ను చూడనివ్వకపోతే మృత్యువుని క్షమించను" అన్నాడు ఆవేశంగా.

అది శాసనం. ఇతనెవరు చెప్పడానికి? దేవుడా? దైవాంశసంభూతుడా? కాదు. కొడుకు.

మృత్యువు ఆ శాసనాన్ని విన్నది. చేతులు కట్టుకుని తల వొంచుకుని దూరంగా నిలబడ్డది. సోమిదేవమ్మ కళ్లు విప్పింది. కొడుకుని గుర్తుపట్టింది. "అబ్బా" అన్నాయి పెదాలు.

"అది వెళ్లిపోతోంది. తల నీ ఒళ్లో పెట్టుకో" అన్నారు చయనులుగారు.

కాశీన్మరణాన్ముక్తిః అథవా పుత్ర సన్నిధౌ. మృత్యువుకి శలవిచ్చాడు అబ్బుశాస్త్రి. సోమిదేవమ్మ అబ్బుని చూస్తూనే ఉంది. కళ్లు అతనిమీద నిలిచిపోయాయి. ఆఖరిక్షణంలో ఆఖరి లిప్త కూడా కొడుక్కి దూరంగా ఉండడానికి ఆ తల్లి మనస్సు ఒప్పుకోలేదు. మృత్యువు తన దారి తాను వెదుక్కోక తప్పలేదు.

ఆకాశమంత బొట్టుపెట్టి, ఒళ్లంతా పసుపు రాసి, కొత్త చీరె సంతరించి అగ్రహారమంతా వెంటరాగా సోమిదేవమ్మ తన ప్రయాణాన్ని ప్రారంభించింది.

ఎంతమందికి ఈ భోగం? ఒక శరీరంలోంచి మరొక శరీరంలోకి – ఇంత హుందాగా, ఇంత గర్వంగా, ఇంత తృప్తిగా...

❖ ❖ ❖

అస్థికల్ని కోటిపల్లి రేవులో సంచయనంచేసి–18 ఆబ్దీకాలూ–ఊన ఆబ్దీకాలతో సహా–భక్తిగా, శ్రద్ధగా పితృయజ్ఞం జరిపాడు అబ్బు–ఇల్లు కదలకుండా. సంవత్సరీకం వరకూ అబ్బుశాస్త్రి ప్రపంచం కేవలం ఆ కర్మకాండకే పరిమితమైపోయింది. పితృయజ్ఞం యోగం, విధాయకం.

సాంవత్సరీకంనాడు చుట్టుపక్కల గ్రామాల వేదపండితులందర్నీ పిలిపించి వేదపరిషత్తు జరిపించారు చయనులుగారు–తోత్తరముండి యజ్ఞేశ్వర శర్మగారు అధ్యక్షత వహించగా, ఆకొండి చినభాస్కరావధాన్లు, దూసి మాణిక్యావధాన్లు, నాగాభట్ల పేరయ్యశాస్త్రి, వాడపల్లి పురుషోత్తమ శర్మ–ఆ చుట్టుపక్కల ఘనాపాఠులందరూ ఆనాడు అక్కడ సభ తీర్చారు.

సంవత్సరం తిరిగేసరికి మళ్లీ పిలక, అంగవస్త్రంతో అందరి వెనుక కూర్చున్నాడు అబ్బుశాస్త్రి. ఆనాడు అర్థమైన విషయం–మంత్రం చదవబోతే అక్షరాలు కష్టంగా దొర్లాయి. నాలిక మొరాయించింది. ఎప్పుడో దాటవేసిన 'నత్తి' మళ్లీ అడ్డుపడింది. ధర్మభ్రష్టత్వం శరీరాన్ని కూడా నిర్ద్వంద్వంగా, నిర్దుష్టంగా లొంగదీస్తుంది. మనం గుర్తుపట్టినా పట్టకపోయినా పర్యావరణలోని అపశ్రుతులకీ, మనలోని అపశ్రుతులకీ, జాతి ధర్మానికీ దగ్గరతోవ ఉంది. (ధర్మమంటే బాబోయ్ మతం కాదు!) కార్యకారణ సంబంధాన్ని వెక్కిరించే

హేతువాదులకి ఇది పుక్కిట పురాణంలాగ కనిపించవచ్చు. ఆల్బర్ట్ ఐన్‌స్టీన్ ఏకాగ్రతకీ, బిథోవెన్ అంతర్మథనానికీ, అంజాద్ ఆలీ ఖాన్ సాధనకీ, ఋషి చేసే తపస్సుకీ వెదికితే పోలికలు కనిపిస్తాయి.

బ్రాహ్మణ్యం అంటే జంధ్యప్పోచ, గుండూ, పిలకా కాదు.

నిజానికి మాక్స్ ముల్లర్ నూటికి నూరుపాళ్లూ బ్రాహ్మణుడు.

❖ ❖ ❖

పితృయజ్ఞం ముగిశాక పుణ్యాహవాచనం చేయించి ఇంట్లో ఏదో శుభకార్యం జరిపించాలి. అది ఆచారం. ఏ సత్యన్నారాయణ వ్రతమో, వేంకటేశ్వర దీపారాధనో, మృత్యుంజయ హోమమో–ఏదో ఒకటి.

పదమూడో రోజే–ఈ ఇంట్లో–కాదు ఆ ఊళ్లో–ఓ గొప్ప శుభకార్యానికి నాందీ జరిగింది.

ఉదయమే సర్వమంగళం రిక్షా దిగి గురువుగారి సమక్షానికి వచ్చి సాష్టాంగపడ్డాడు. "మంగళా! వైకుంఠ సమారాధనకీ, పరిషత్తుకీ రాలేదేం?" అన్నారు చయనులుగారు. ఆప్యాయత గొంతులో గాద్గదికం కాగా.

"చిన్న పని ఉండిపోయింది గురువుగారూ. అది పూర్తిచేసుకు రావడానికి సృష్టి విపర్యయం అడ్డుపడింది"

ప్రశ్నార్థకంగా చూశారు.

ఇప్పుడు సర్వమంగళం నీడలోంచి అనసూయ ముందుకొచ్చింది.

"ఈవిడ అనసూయ. నిన్ననే ఋతుస్నానం అయింది. తొండారం వెంపరాల అమ్మన్న శాస్త్రిగారమ్మాయి"

చయనులుగారి ముఖం వెలిగింది.

"నా జట్టే. ఇద్దరం ఇరుసుమండలో ద్వాదశి ఉపేంద్ర శర్మగారి దగ్గర ఘన చెప్పుకున్నాం. పెద్ద బ్రాహ్మణం, పితృమేధం చెప్తూంటే గురువుగారికి పక్షవాతం వచ్చి పాఠం ఆగిపోయింది"

అనసూయ ముఖం వెయ్యిదీపాలయింది. గురువుగారి పాదాల్ని స్పృశించకుండా సాష్టాంగపడింది.

"దీర్ఘసుమంగళీభవ!" అంటూనే చయనులుగారు సర్వమంగళాన్ని ప్రశ్నార్థకంగా చూశారు.

"అస్తు. మీ ఆశీర్వాదం 24 గంటలు ముందుగా దక్కింది ఆమెకి. ధర్మసంపన్నులు. మీది ఆశీర్వాదం కాదు. శాసనం. రేపే పెళ్లి. శ్రావణ శుద్ధ సప్తమీ శుక్రవారం స్వాతి నక్షత్రయుక్త వృషభ లగ్నంలో ఇద్దరు దేవుళ్ల సమక్షంలో–గర్భగుడిలో బాలా త్రిపురసుందరీ సమేత రాఘవేంద్రస్వామివారు, సమక్షంలో మా గురువులు"

"ఈ పిల్లని చేసుకుంటున్నావా? ఎంత బాగుందిరా"

"ముహూర్తం నేనే పెట్టుకువచ్చాను గురువుగారూ. వ్యవధి లేదు"

ఇంకేం మాటలు సాగలేదు.

బ్రహ్మకి కబురంపించి అప్పటికప్పుడు మంగళసూత్రం, నల్లపూసలు, మట్టెలూ పురమాయించారు చయనులుగారు.

ఊరు ఊరంతా పెళ్లి పెద్దలైపోయారు. వటువుగా ఆ ఊరొచ్చి తమ కళ్ళముందే పెరిగిన సర్వమంగళం తమ కళ్ళముందే ఓ ఇంటివాడు కాబోతున్నాడు. బాలా త్రిపురసుందరీ సమేత రాఘవేశ్వరస్వామి ఆ సాయంకాలం సభతీర్చాడు. వేదపండితులు బారులుతీర్చారు. గురువుగారు అధ్యక్షత వహించగా 12–20 నిముషాలకు అనసూయ మెడలో తాళి కట్టాడు సర్వమంగళం. ఆ క్షణం గురువుగారు సర్వాన్నీ మరిచిపోయారు. అలాంటి శుభ తరుణం అబ్బుశాస్త్రికి వస్తుందా? చూసి ఆనందించే తల్లి వెళ్లిపోయింది. ఆనందంగా అనసూయమీద అక్షింతలు వేశాడు అబ్బు. సర్వమంగళం తనకన్న ఎనిమిదేళ్లు పెద్ద.

పెళ్లయిన మూడో రోజున "వస్తాను గురువుగారూ–ఆజ్ఞ ఇవ్వండి" అన్నాడు సర్వమంగళం–పాలికల్ని నెమ్మదిగా గోడవారకి సర్దుతూ.

"మరి అమ్మాయి?"

"అది ఈ ఇంటి కోడలు. మీకు సేవచేయడానికే ఈ పెళ్లి. అనసూయగా ఈ ఇంటికి వస్తే సహాయం. నా భార్యగా ఇంటికి వస్తే విధాయకం. మా తల్లి ఆలనలో దేవాలయంగా ఈ ఇల్లు వెలిగిపోవడం మేం చూశాం. ఆ తల్లి చేతివంటని తిని వేదం చెప్పుకున్నాం. ఆమె లేని కొరత అనసూయ తీర్చలేదు. కాని ఆడదిక్కు లేని కొరత ఏ కాస్తో తీర్చగలదు"

"అదేమిటి? పెళ్లయిన పిల్లని ఇలా వదిలి వెళ్ళడం తప్పు" అన్నారు చయనులుగారు.

"పెద్దలకు సేవ చేసుకోవడం దాని అదృష్టం. ఈ పెళ్లి పరమావధి అదే"–మరో మాటకి తావివ్వకుండా మాయమయ్యాడు సర్వమంగళం.

కాలవ వంతెన దాటి బస్సుదాకా నడిచాడు అబ్బు. "ఏంటి మాట్లాడవు?" అన్నాడు

సర్వమంగళం.

"నిన్ను ఒక్కసారి కావలించుకోవాలని ఉంది" అన్నాడు అబ్బుశాస్త్రి. అతని కళ్లు అతను చెప్పే మాటలు వినడంలేదు.

బస్సు వెళ్లిపోయింది. అనసూయ ఆ ఊళ్లో ఆ ఇంట్లో సరిగా 3 సంవత్సరాల 348 రోజులు ఉంది. ఆ తర్వాత ఎందుకు ఉండలేదు? చయనులుగారు ఈ లోకంలో లేరు కనుక.

## 16

132 ఏ/48, కుందన్ బాగ్, బోరివిలీ వెస్ట్, పోవై–నాలుగో అంతస్థులో 48వ అపార్టుమెంటు నుంచి ఎవరూ చూడకుండా మెట్లమీదనుంచి డేనియల్, అబ్బు దాటేశామనుకున్నారు గాని–అది తప్పు.

అపార్టుమెంటు ఆవరణలోకి ప్రవేశించింది లగాయతు–మెట్లమీదనుంచి జారుకుని మెయిన్ గేట్ దాటేవరకూ వాళ్ళని స్పష్టంగా కనిపెడుతున్న వ్యక్తి–కాదు సంస్థ–ఒకటుంది. ఆ సంస్థ పేరు హాక్ డిటెక్టివ్ ఏజెన్సీ–వ్యక్తి పేరు మెకార్డీ.

మెకార్డీ వేల్స్‌లో పుట్టి–లండన్లో పెరిగి–షిప్పు కళాసీగా ఇండియాకి వచ్చి–ఆరోజుల్లో స్వతహాగా ఇంగ్లీషువాడు కనుక–ఆమాత్రం ఈమాత్రం చదువు చదివి–ఏం చెయ్యాలో తెలీక ఇండియాలోనూ కళాసీ అయ్యాడు. మెకార్డీకి అబ్బిన విద్య పక్కవాడి లోపాలను కనిపెట్టడం. ఆ పనిలో ఆరితేరి–అలాంటి పనిచేసే వృత్తి ఒకటున్నదని తెలుసుకున్నాడు. పరాయివాడి లోపాల్ని కనుక్కునే ఏజెన్సీ ప్రారంభించాడు. పక్కవాడి పేగులు లెక్కపెట్టడం సరదాఅయిన పని. పరాయివాడు మంచివాడైతే సులువైన పని. హాక్ అంటే గెద్ద. అదీ కంపెనీ పేరు.

''ఇద్దరూ తప్పించుకున్నారు'' అనే సమాధానం–అబ్బుశాస్త్రి, డేనియల్ తప్పించుకున్న అరగంటకి రాజమండ్రికి ఇరవై ఆరు మైళ్ల దూరంలో ఉన్న ర్యాలీకి చేరింది.

పేద్ద బంగళా వసారాలో పేద్ద కర్రవాలుకుర్చీమీద పేద్ద బుడ్డని ముందున్న చిన్న బల్లమీద పెట్టుకుని–పేద్ద చుట్టని కాలుస్తున్న పేద్ద శరీరం ఉన్న మనిషికి చేరింది. ఆయన పేరు నాలుగో ఆయన. అసలు పేరు మంగళగిరి శ్రీనివాసరామయ్య. ఆయన స్వస్థలం–రొంకిలి. కాని ఆయన అందరికీ నాలుగో ఆయన.

"ఒక్క వాచ్‌మేన్‌కి మాత్రమే వారిద్దరూ అపార్టుమెంటుకి వచ్చిన విషయం తెలుసు. వందరూపాయలు ఇస్తే వాళ్లిద్దర్నీ లోపలికి వదిలాడు" అప్పటికే కారులో రెండో పెగ్గులో

ఉన్న మెకార్ధీ తన కార్యసాధనకు ఆనందంతో పొంగిపోతూ చెప్పాడు.

"మంచిది. మంచిదిరా మగడా!" అన్నారు నాలుగో ఆయన.

"ఆ రాక్షసుడికేమైంది?"

పగలబడి నవ్వాడు మెకార్ధీ. ఆ అమ్మాయి కత్తితో పొడిచి పారిపోతే నవ్వుతాడేంటి? చాలాసేపటివరకూ నవ్వు ఆపుకోలేకపోయాడు. చివరికి అన్నాడు.

"ఆ లంజకొడుకు చావలేదు. చావడు. వాడి అంగాన్ని కోసిపారేసింది దట్ వండ్రఫుల్ గర్ల్. దాన్ని పట్టుకోడానికి చాలా తంటాలు పడినట్టుంది–తొడ నిండా కత్తిగాట్లున్నాయి" మెకార్ధీ ఇంకా నవ్వు ఆపలేదు.

"అసలు ఆ అమ్మాయి అక్కడికెందుకొచ్చింది?"

"ఆమెనీ, ఆమె డబ్బునీ ఆ బాస్టర్డ్ చాలా వాడుకున్నాడు. అర్జంటుగా డబ్బు కావలసివచ్చింది. తన హక్కుగా అడగడానికి వచ్చింది. మనవాడు మందులో ఉన్నాడు. లీలని చూసి మురిసిపోయాడు. భుజంమీద చెయ్యేసి సోఫామీదకి లాగాడు. పెనుగులాడింది. కొట్టింది. రక్కింది. బల్లమీద ఉన్న పళ్లు కోసే కత్తి అందింది. జీవితంలో మరెవరినీ వేదించని రీతిగా శస్త్రచికిత్స చేసింది. ఇది అనుకొని చేసిన పని కాదు. అనుకొన్నా చెయ్యలేని పని" అన్నాడు. తన కెరీర్‌లో ఇంతగా కసి తీర్చుకున్న అమ్మాయిని చూడలేదు మెకార్ధీ.

"ఇంతకీ అమ్మాయిని ఎవరైనా చూశారా?"

"చూసే చాన్సా అమ్మాయి ఇవ్వలేదు. షీ ఈజ్ టూ స్మార్ట్!"

"ఇప్పుడెక్కడుంది ఆ అమ్మాయి?"

మెకార్ధీ సీరియస్ అయ్యాడు. "లుక్. ఇది మరో కొత్త పని. కొత్త చార్జీలుంటాయి"

నాలుగో ఆయన తెప్పరిల్లాడు. గత పది సంవత్సరాలుగా ఆ ఇంటిని అదేపనిగా కనిపెట్టుకు ఉండడానికి నెల జీతం పుచ్చుకుంటున్నాడు మెకార్ధీ. సంవత్సరాల తరబడి కనుక కొంత రిబేటు ఇచ్చాడు. కాని నాలుగో ఆయన చాదస్తుడో, సత్తెకాలపు మనిషో–రెండూనో అని సరిపెట్టుకున్నాడు మెకార్ధీ.

ఈ ఇంటినే ఎందుకు? ఇది ఆనాటి శ్రీరాములునాయుడు ఇల్లు కనుక. ఆ పిల్ల శ్రీరాములునాయుడు మనుమరాలు కనుక. ఎప్పుడైనా, ఎప్పటికైనా ఆమె అక్కడికి రాక తప్పదు కనుక. ఆ ఇంటి అడ్రసు పట్టుకోడానికి ఆరు సంవత్సరాలు పట్టింది.

ఆ అమ్మాయి అక్కడికి రావడానికి–కనీసం వచ్చిందని నాలుగో ఆయనకి తెలియడానికి (హాక్ డిటెక్టివ్ ఏజెన్సీ సరిగ్గా పని చేస్తోందా!) ఇన్ని సంవత్సరాలు పట్టింది

మెకార్డీకి. నాలుగో ఆయన తొలి అవతారం-కోనసీమలో కొబ్బరిచెట్టుకి కాయలుండగానే చెట్టుకింద నిలబడే వాటిని లెక్కకట్టి చెప్పే ఉద్యోగం. ఆ పనిలో ఆనాడు మంగళగిరి శ్రీనివాసరామయ్య ఉరఫ్ నాలుగో ఆయనకంటే ఘనులు ఆ ప్రాంతాల్లో మరొకరు లేరు. మొదటి ముగ్గురు అన్నదమ్ములూ ఆ పనే చేస్తారు. కాని అందరికీ నాలుగో ఆయనే కావాలి. కారణం-అతని లెక్క తూకం. ఎన్నడూ అంకె బెసకదు. అందుకని ఆ ప్రాంతాల్లో ఆయన అందరికీ నాలుగో ఆయన అయిపోయాడు. ఇది చాలా సంవత్సరాల కిందటి మాట.

శ్రీరాములునాయుడి సామ్రాజ్యం మూడు పువ్వులూ ఆరు కాయలుగా విస్తరిస్తున్న రోజుల్లో నాలుగో ఆయన ఆయన కుడిభుజమయ్యాడు. నాలుగో ఆయనలో స్వామిభక్తి, నిజాయితీ శ్రీరాములునాయుడిని ఆకట్టుకున్నాయి. ఎప్పుడూ విదేశాలకు తిరిగే శ్రీరాములునాయుడు నాలుగో ఆయనమీద విశ్వాసం ఎంతవరకూ ఏర్పర్చుకున్నాడంటే-తన ఆస్తిపాస్తుల వ్యవహారాలన్నీ ఆయనకే వదిలేశాడు. అంతా సవ్యంగా సాగుతున్న తరుణంలో లీలా థాంపే మలేషియా వెళ్లడం, కొడుకుని ప్రసవించి తిరిగి రాకపోవడం-శ్రీరాములునాయుడు అందరికీ, అన్నిటికీ దూరమై బిడ్డకి తల్లీ తండ్రీ అయి పెంచడం, కేన్సర్, శ్రీరాములునాయుడి మరణం-అన్నీ తోసుకువచ్చేశాయి.

లీలా థాంపే అన్న రతన్ థాంపే హడావుడిగా వచ్చి-ఉన్న వ్యవహారాలను ఓ కొలిక్కి తెచ్చి మేనల్లుడిని తీసుకువెళ్లిపోయాడు. అప్పుడు నాలుగో ఆయన తిరుపతి, శ్రీకాళహస్తి తీర్థయాత్రలు చేస్తున్నాడు. తీరా రతన్ థాంపేకి తెలుగు రాదు. కాగా, ఇక్కడి వ్యవహారాలు తెలీవు. తెలిసిన మనిషి లేడు. చెప్పినవాళ్లు చెప్పినట్టు విని వ్యవహారాలన్నీ ముగించుకుని వెళ్లిపోయాడు హడావుడిగా. నాలుగో ఆయన తిరిగివచ్చేసరికి ఈ పనులన్నీ జరిగిపోయాయి. రతన్ థాంపేని ఎలా పట్టుకోవాలో నాలుగో ఆయనకి తెలియలేదు. మలేషియాలో ఆయన ఫోన్ నెంబర్ మారింది. అడ్రసు మారింది. ఈ బదిలీల్లో పుల్లేటికుర్రులో పదెకరాల చెక్కా నాలుగో ఆయన హయాంలో మిగిలిపోయింది.

మొదట-నీటికంద, పాటికంద వేశాడు. బంగారం పండింది. ఆ చుట్టుపక్కల కందపంట లేనిదెవరు?

సరుకుని మధ్యప్రదేశ్‌కి-బాలా ఘాట్, బేతూర్‌లకు పంపడం ప్రారంభించాడు. ఆ మార్కెట్లు కొనుగోలు చెయ్యగలిగినంత సరుకుని క్రమంగా పంపలేకపోయాడు. లారీల్లో సరుకును పంపడంకంటే లారీలు నడిపే వ్యాపారం లాయకీ అని గ్రహించాడు. ఇటు మహారాష్ట్ర, అటు మధ్యప్రదేశ్ పొలిమేరలు-చత్తర్‌పూర్, సత్నా, తికమ్‌ఘర్‌దాకా-సరుకులు రవాణాచేసే లారీల సంఖ్య క్రమంగా పెరిగింది. వ్యాపారం పడగెత్తింది.

నాలుగో ఆయన నిజాయితీపరుడు. స్వామిభక్తి పరాయణుడు. కాగా పాపభీతి గల వైశ్యుడు.

చైనా 'లాఫింగ్ బుద్ధ'కి తెలుగు వెర్షన్‌లాగ ఉంటాడు. జుట్టులేని నున్నటి గుండు, బాగా పెరిగిన బొజ్జ, దూరదూరంగా పళ్ళు, ఎప్పుడూ నవ్వుతూ ఉండే ముఖం. ఫెంగ్ షూయ్ శాస్త్రం ప్రకారం లాఫింగ్ బుద్ధ అదృష్టానికీ, అభివృద్ధికీ సంకేతం. నాలుగో ఆయనా అంతే. ఆయన చెయ్యని దానం, చెయ్యని ఉపకారం లేదు. ర్యాలీలో జగన్మోహిని ఆయనకి ఆరాధ్యదైవం. వారానికి కనీసం రెండు మూడుసార్లు వెళ్లి మండపంలో తీరికగా కూర్చుని రావడం కార్యక్రమం. వయసు మీదపడి, వరిబీజం పెరిగి, తరచు వెళ్లలేని స్థితికి వచ్చినప్పుడు–వ్యాపారాన్ని కొడుకు చిన జగ్గుబాబుకి అప్పగించి, భార్య తంబళ్లమ్మని పైపనులు చూసుకోమని పురమాయించి, ర్యాలీలోనే పెద్ద బంగళా బేరంచేసి స్థిరపడిపోయాడు.

ఎర్రటి కావిపంచె, ఎప్పుడూ ఉత్తరీయం తప్ప పైన మరేమీ వేసుకోడు–వయస్సు మళ్లినప్పటినుంచి. రెండు చేతులకీ ఎంతలేదన్నా అయిదారు తులాల బంగారం కంకణాలు.

డబ్బా నిండా చిల్లర పోసుకుని కూర్చుంటాడు. శుక్రవారం ఉదయాల్లో బంగళా తలుపు తోసుకుని రానివాడిదే పాపం. వసారా స్తంభానికి–పెద్ద సైజు ఫోటో శ్రీరాములునాయుడిదీ, లీలా థాంపేదీ పెట్టుకున్నాడు. ఇప్పటికీ వారి ఉప్పు తింటున్నవాడిగా, తనకి కొత్త జన్మనిచ్చిన దేవుళ్లుగా, లేచినప్పుడల్లా ఒక ఊదొత్తితో వారిద్దరికీ హారతిస్తాడు. అయితే 17 సంవత్సరాల క్రితం జీవితం మరో మలుపు తిరిగింది. నాలుగో ఆయన లారీ సర్వీసుని తెలిసిన ఒక మహారాష్ట్ర ఓనరు ఫోన్ చేశాడు. ఎవరో శ్రీరాములునాయుడు ఆంధ్రాలో పుల్లేటికుర్రు గురించి వాకబుచేశాడని. అంతకంటే ఆ చెప్పిన ఆసామికి వివరాలు తెలీవు.

నాలుగో ఆయన తుళ్లిపడ్డాడు. శ్రీరాములునాయుడు అనగానే మనసులో దీపం వెలిగింది. ఈ నాయుడు పెద్దనాయుడి మనుమడే.

సందేహం లేదు. పుల్లేటికుర్రులో పదెకరాలూ ఆయనవే. ఫోన్‌చేసి, పలకరించి కాళ్ళకి నమస్కారం చేసి వెండికంచంలో పదెకరాల దస్తావేజులూ ఆయనకి అప్పగించాలి. ఈ శ్రీరాములునాయుడు అజా పజా కనుక్కోడానికి హడావుడిపడిపోయాడు. కాని కాలానుగుణంగా డబ్బు రుచిమరిగి, అందుకు అంగీకరించనివారు ఇద్దరే ఇద్దరు–తంబళ్లమ్మ, చిన జగ్గుబాబు.

"మంచికో చెడుకో అది మన చేతుల్లో మిగిలిపోయింది. కోరి దక్కించుకున్నది కాదు. కోరి చేసిన మోసం కాదు. ఈ ఆస్తివల్ల వ్యాపారం కలిసివచ్చింది. ఇప్పుడు

అర్ధాంతరంగా ముక్కూ, మొహం తెలీని మనిషికి వెదుక్కునిమరీ ధారపోయడం ఎందుకు? ఏం వెర్రిబాగులతనం? తంబళ్లమ్మ, చిన జగ్గుబాబు చెడ్డవాళ్లు కాదు. కాని బతకనేర్చిన వాళ్లు.

నాలుగో ఆయన ఆ ఆలోచనకే ఆగ్గిమీద గుగ్గిలం అయిపోయాడు. ఇద్దరిమీదా పడి కరిచినంత పనిచేశాడు. ఆరు నూరైనా, అటున్న సూర్యుడు ఇటు పొడిచినా ఆస్తి చిన శ్రీరాములునాయుడుగారికి అందజేయవలసిందే. గట్టిగా అరిస్తే ముందు ఈయన ఆరోగ్యం దెబ్బతింటుందేమోనని తల్లీ కొడుకూ ఊరుకున్నారు అప్పటికి.

ఈలోగా శ్రీరాములునాయుడు ఆంధ్రాకు బయలుదేరిన విషయాన్ని మహారాష్ట్ర మిత్రుడే నాలుగో ఆయనకి చెప్పాడు. ముఖ్యంగా ఆరేళ్ల పసిపాప ఆ దంపతులతో ఉన్నట్టు చెప్పాడు.

చిన జగ్గుబాబుకీ ఈ విషయం తెలిసింది. కంగారుపడ్డాడు. ఈ తర్వాత తండ్రి ఏం చేస్తాడో తెలుసు. రథం కదిలింది.

“చినబాబు వస్తున్నాడు విన్నావా?” అన్నాడు నాలుగో ఆయన కొడుకుతో. “వచ్చినప్పుడు చూద్దాంలే” అని దాటవేశాడు చిన జగ్గుబాబు.

ఏమిటి వీడి ధైర్యం? “వస్తున్నాడు” అని చెప్తే “వచ్చినప్పుడు” అంటాడేం? కొడుకు మనస్సులో ఏదో పథకం ఉన్నదని నాలుగో ఆయనకి అర్థమైంది. ఏమిటది? ప్రస్తుతం కంపెనీ వ్యవహారాలు చూస్తున్న వ్యాఘ్రేశ్వరరావుని పిలిపించాడు చిన జగ్గుబాబు.

వ్యాఘ్రేశ్వరరావు తలలు మార్చే రకం. తిమ్మిని బెమ్మిని చెయ్యగల సామర్థ్యం ఉన్నవాడు. ఇద్దరి మధ్యా మందు ప్రవహించింది. అంతా విని “ఇంతకీ ఆయన రావాలి కదా?” అని చిరునవ్వు నవ్వాడు వ్యాఘ్రేశ్వరరావు. తర్వాత రెండు బుర్రలూ కలిసి కొన్ని నిర్ణయాలు చేశారు.

మూడో రోజు ముక్కామల దగ్గర రెండు శవాలు బయటపడడం విన్నాడు నాలుగో ఆయన.

ఆ వార్త వినీవినగానే రక్తపుపోటు ఎక్కువై స్పృహ తప్పి పడిపోయాడు.

❖ ❖ ❖

నాలుగో ఆయన మనస్సులో ఎటువంటి సందేహమూ లేదు. ఈ పనికి మూలకారకుడు తన కొడుకు, వ్యాఘ్రేశ్వరుడేనని. వ్యాఘ్రేశ్వరుడిని ఎందుకు అనుమానించాడు? కొడుకు దౌర్భాగ్యపు పనులన్నింటికి వ్యాఘ్రేశ్వరుడి దన్ను ఉండడం

తన అనుభవం కనుక. కడుపు చించుకుంటే కాళ్లమీద పడుతుంది. తీరా నిలదీస్తే–అవునంటే?

ఆ చుట్టుపక్కలవారంతా యాక్సిడెంటు కథని విడ్డూరంగా చెప్పుకున్నారు కాని, అందుకు కుమిలిపోయి–ఎన్నో రాత్రులు రహస్యంగా ఏడ్చింది నాలుగో ఆయన ఒక్కడే. అంతకుముందు–పెద్ద నాయుడిగారి ఆస్తి తన చేతుల్లో మిగిలిపోవడం దైవికం. ఇప్పటి చర్య నీచం. కాని రెండు విషయాలు నాలుగో ఆయనకి అర్థం కాలేదు. చిన్నపిల్ల ఏమైంది? ఈ అబ్బుశాస్త్రి ఎవరు? యాక్సిడెంటుకీ, అతనికీ ఏమిటి సంబంధం? ఈ ప్రశ్నలకు సమాధానాలు ఎవరు చెప్తారు?

ఈ తర్వాత ఏం ఉపకారం జరిగినా ఆ పిల్లకి జరగాలి. నిజానికి రెండు తరాలపాటు వారి ఆస్తిని అనుభవించిన పాపానికి కనీసపు ప్రాయశ్చిత్తం–ఆ పిల్లకి ఈ ఆస్తిని చేర్చడం. అయితే ఆ పిల్ల ఎక్కడుంది?

ఎట్టి పరిస్థితులలోనూ, ఎప్పుడూ ఆ యాక్సిడెంటు ప్రసక్తి తన కొడుకు ముందు తీసుకురాలేదు నాలుగో ఆయన. ఇక నిలదీసి పదెకరాలూ అడిగే మనిషి ఎవరూ లేరు. అనుమానం లేదు. ఇది తన కొడుకు లంజకొడుకు కుట్రే. ఈ వ్యవహారమంతటిలో నిమ్మకు నీరెత్తినట్టున్నా మనిషి ఒక్కడే–చిన జగ్గుబాబు. ముసిముసి నవ్వులు నవ్వుకున్న మరో మనిషి వ్యాఘ్రేశ్వరుడు.

నాలుగో రోజు–జేగురుపాడు సమీపంలో చిరిగిపోయిన బట్టల్తో తిరుగుతున్న అమ్మాయిని గుర్తుపట్టాడు పెరుమాళ్లు అనే మనిషి. ఆ పిల్ల ఎవరో ఆ ప్రాంతాల్లో ఇద్దరికే తెలుసు. నాలుగో ఆయనకి, ఆయన ద్వారా సమాచారం విన్న చిన జగ్గుబాబుకి. ఆ పిల్లని ఏం చెయ్యాలి? నలుగురికి తెలిసేలోగా అక్కడినుంచి దాటించెయ్యాలి. చేతికి మట్టి అంటకుండా స్వామికార్యం, స్వకార్యం జరిగిపోవాలి. బొంబాయి మిత్రుడి ద్వారా ఈ శ్రీరాములునాయుడి బావమరిది, భార్య ముత్తేలమ్మ తోబుట్టువు రాజశేఖరం ఫోన్ నెంబర్ పట్టుకున్నారు. అర్ధరాత్రి రాజశేఖరానికి ఫోన్ వెళ్లింది. పిల్లని ముందు కోనసీమ దాటించి, చెయ్యాల్సిన పనిని శ్రీమన్నారాయణ శ్రేష్టికి పురమాయించారు. అతని మనిషి పోలిశెట్టి అమ్మాయిని చక్కగా స్నానం చేయించి, కొత్తబట్టలు కట్టించి క్షేమంగా రాజశేఖర్‌కి అప్పగించారు. ఆవిధంగా యాక్సిడెంటుకి సంబంధించిన ఆఖరి సాక్ష్యం ఆంధ్ర దేశం దాటిపోయింది. కథని పాము చావకుండా, కర్ర విరగకుండా ముగించేశారు చిన జగ్గుబాబు, వ్యాఘ్రేశ్వరరావులు... యాక్సిడెంటులో రావలసిన ఇద్దరూ పోయారు. వారసురాలిని గుట్టుచప్పుడుకాకుండా ఎవరు పంపిస్తున్నారో తెలియకుండా బొంబాయి రైలు ఎక్కించేశారు. ఈ రహస్యం తెలిసిన తంబళ్లమ్మ కొడుక్కి దిష్టితీసి ర్యాలీ జగన్మోహినికి

వంద కొబ్బరికాయలు కొట్టించింది.

నాలుగో ఆయన మాత్రం విలవిలలాడిపోయాడు. ఈ దశలో పోయిన వ్యక్తుల సమాచారాన్ని బయటపెట్టినా, చిన్నపిల్ల గురించి బయటపెట్టినా, వాళ్లు కోనసీమకి వచ్చిన కారణాన్ని బయటపెట్టినా ఈ దుర్మార్గానికి కారణమైన తన కొడుకు దగ్గర ఈ కథ ఆగుతుంది. చిన జగ్గుబాబు జైలుకి వెళ్తాడు. కోనసీమ అంతా భగ్గుమంటుంది. నాలుగో ఆయన ఎంత పాపభీతి కలవాడైనా, తన్ను మాలిన ధర్మాన్ని పాటించలేకపోయాడు. పేగు సంబంధం పాపభీతి పీక నొక్కేసింది. అయితే ఆ పర్యవసానం అంతటితో ఆగలేదు. మూడోనాడు నాలుగో ఆయనకి తీవ్రమైన గుండెపోటు వచ్చింది. ఆవిధంగా రహస్యం మరో ఆరు నెలలు చెడిన గుండెలో మరుగునపడిపోయింది.

❖ ❖ ❖

అయితే నాలుగో ఆయన అనుమానానికి బొత్తిగా కాళ్లూ చేతులూ లేకపోలేదు. ఆనాటి ముక్కామల యాక్సిడెంటులో చిన జగ్గుబాబు, వ్యాఘ్రేశ్వరరావుల ప్రమేయం లేకపోలేదు. శ్రీరాములునాయుడు కోనసీమ వస్తున్నాడని విన్నప్పటినుంచీ చిన జగ్గుబాబుకి కంటిమీద కునుకు లేదు. అతను రావడమంటూ జరిగితే ముసలాయన పుల్లేటికుర్రు పొలం దస్తావేజులు పువ్వుల్లోపెట్టి అప్పగిస్తాడు. ఇప్పుడున్న వ్యాపార సామ్రాజ్యంలో ఆ పదెకరాలూ పెద్ద నష్టం కాకపోవచ్చు కాని–ఆరోజుల్లోనే–ఆనాటి ప్రమాణాలతో–ఆ పదెకరాల్లో రెండు సినిమా థియేటర్లూ, ఒక రైసు మిల్లూ, ఒక ఐసు గొడౌను కట్టే ఆలోచనలో ఉన్నాడు చిన జగ్గుబాబు.

కాగా నాలుగో ఆయన పశ్చాత్తాపానికీ–కోట్లు చెయ్యి దాటిపోడానికి ఎంత ప్రయత్నించినా మనస్సులో రాజీ కుదరలేదు. దీనికంతటికీ ఒకే ఒక మార్గం. శ్రీరాములునాయుడు కోనసీమ రాకుండా చూడడం. ఆయన రహస్యంగా కారుని పురమాయించిన సమాచారం చిన జగ్గుబాబుకీ, వ్యాఘ్రేశ్వరుడికీ తెలిసింది. "రహస్యం" దుర్మార్గానికి పెట్టుబడి. శ్రీరాములునాయుడు వస్తే తమమీద విరుచుకుపడతాడు. ఉన్నదంతా ఊడ్చుకుపోవచ్చు. చేతికి మట్టి అంటకుండా శ్రీరాములునాయుడి కారు ఊరిలోకి రాకుండా ఆపే మార్గం ఏమిటి? తీసుకువచ్చే కారుని గల్లంతు చెయ్యడం.

ఆరోజుల్లో రెండు వేలు చేతులు మారాయి. అది బోలెడు సొమ్ము. కారు యాక్సిల్ దగ్గర స్క్రూ వదులౌతుంది. కారు నడుస్తూంటే క్రమంగా వదిలేస్తుంది. కాదు చతికిలబడుతుంది. కారులో ఉన్నవాళ్లకి దెబ్బలు తగులుతాయి.

అయితే అందువల్ల వాళ్ల రాక వాయిదా పడుతుందేమోకాని పూర్తిగా ఆగిపోదు

కదా? దుర్మార్గానికి దూరాలోచన ఉండదు. నందోరాజా భవిష్యతి. కాని విధినిరంకుశ చక్రవర్తి.

యాక్సిల్ చెడగొట్టాల్సిన పొన్నుసామి చేతికొచ్చిన రెండువేలతో ముందురోజు నందంపూడి రత్తి ఇంట్లో గడిపాడు.

ఓ రాత్రికి రత్తి కౌగిట్లో తుళ్లిపడిలేచి, చెయ్యాల్సిన పని ఆలస్యంగా గుర్తుకొచ్చి ఆదరాబాదరాగా యాక్సిల్ దగ్గర స్క్రూ కదిపాడు. మొదటి ప్లాన్ ప్రకారం ఉచ్చులిదగ్గర కారు చతికిలబడాలి. కాని పొన్నుసామి బ్రాందీ స్క్రూని మరికొంత దూరం అదిమిపట్టుకుంది. ఎంత దూరం? జరగబోయే దురంతం ఒక జీవితకాలం మరొకరి ఖాతాకు–అబ్బుశాస్త్రి ఖాతాకు బదిలీ అయ్యేవరకూ! ఏతావాతా ఆనాటి ముక్కామల యాక్సిడెంటులో రెండు వర్గాల ప్రమేయం ఉంది.

హత్య ఆలోచనేలేని, కేవలం ప్రయాణాన్ని ఆపుజెయ్యాలని పన్నాగం పన్నిన చిన జగ్గుబాబుది ఒక వర్గం.

రాత్రి వర్షానికి తెగి వేలాడే కొమ్మ కారణంగా కారు అదుపుతప్పి–రెండు దుర్మరణాలకు కారణమైన అబ్బు శాస్త్రిది మరొక వర్గం.

ఒక నేరం–ఒక జీవితకాలంపాటు మరొకరి ఖాతాలో చేరిన అతి విచిత్రమైన సందర్భమిది. అయితే–చిన జగ్గుబాబుకి సంబంధించినంతవరకు ఈ యాక్సిడెంటుకి కారణం తన ప్రణాళికేనని నమ్మకం. నాలుగో ఆయనకి సంబంధించినంతవరకూ ఈ యాక్సిడెంటుకి కారణం తన కొడుకేనని విశ్వాసం. ఒకే సంఘటన మూడు జీవితాల్ని విచిత్రంగా ఒక ముడిగా బిగించింది.

రెండు జీవితాలు–అబ్బుశాస్త్రి, అమ్మాయి–విడదీయలేని ఉచ్చులో ఇరుక్కున్నారు. తీరా అబ్బుశాస్త్రి అపస్మార స్థితినుంచి తేరుకుని తప్పించుకున్న పిల్ల గురించి నోరు విప్పితే తమ ఆస్తికి వారసత్వం, తన నేరానికి రుజువు బయటపడుతుంది కదా?

అందుకని చిన జగ్గుబాబు తల్లి తంబళ్లమ్మని చయనులుగారింటికి అబ్బు మానసిక స్థితిని కనుక్కోడానికి పంపాడు. శ్రీమన్నారాయణ శ్రేష్టికి తంబళ్లమ్మ ఫోన్‌చేసిననాడు చిన జగ్గుబాబు, వ్యాఘ్రేశ్వరుడు పండగ చేసుకున్నారు.

పిల్ల ఆచూకీ కనుక్కునే ప్రయత్నం నాలుగో ఆయన ప్రారంభించడానికి మరికొంతకాలం పట్టింది. కాలానికి ఓ దుర్మార్గం ఉంది. నిజంమీద నివురు కప్పి–guiltకి ప్రాణం పోస్తుంది.

అలాంటి ఇబ్బందిలో పడ్డ ముగ్గురు వ్యక్తులు–అబ్బుశాస్త్రి, చిన జగ్గుబాబు, నాలుగో ఆయన.

# 17

వారం తిరగకుండానే రాజమండ్రి వచ్చేశాడు అబ్బు.

"అమ్మ లేని ఇల్లు దేవత లేని గుడిలాగ ఉంది. అయ్య కాలుకాలిన పిల్లిలాగ ఇల్లంతా తిరుగుతున్నారు.

శిష్యులకి అన్నం వంటబట్టడంలేదు. తరవాణీ అన్నంలో పులుసు వడ్డించే ఆత్మీయత అక్కడ కొరవడింది. అక్కడ ఉండలేక పారిపోయొచ్చాను" అని కంటతడి పెట్టుకున్నాడు అబ్బుశాస్త్రి.

❖ ❖ ❖

వంటింట్లో వంటచేస్తున్న అనసూయకి పెరటి వసారాలో ఏదో కాలుతున్న వాసన గుప్పుమంది. హోమానికి అన్ని ద్రవ్యాలూ ఇందాకనే సమకూర్చి వచ్చింది. ఇంతలో...

పొయ్యిమీద అన్నం పాత్రలో నీళ్లు మరుగుతున్నాయి. వాసన అక్కడిది కాదు. వెనుక వసారాలో అనుష్ఠానం చేస్తున్న గురువుగారి దగ్గరికి పరిగెత్తింది. ఆమె కళ్లకి కనిపించిన దృశ్యాన్ని చూసి కొయ్యిబారిపోయింది.

చయనులుగారు అగ్నిహోత్రం ముందు పద్మాసనం వేసుకుని కూర్చుని ఉన్నారు కళ్లు మూసుకుని. కొలకుల్లోంచి నీరు ధారాపాతంగా వర్షిస్తోంది. ఎదురుగా అగ్నిహోత్రంలో చయనులుగారు కాశీ పట్టుపంచెని ముక్కలుముక్కలుగా చించి హోమం చేస్తున్నారు. పట్టు కాలిన వాసన. ఇది యాదృచ్ఛికంగా అంటుకున్నది కాదు. గిన్నెడు నెయ్యిని పంచెమీద గుమ్మరించి అగ్నిహోత్రానికి ఆహుతి చేశారు చయనులుగారు.

"గుర్తుందా అమ్మీ! పెళ్ళయిన మొదటి సంక్రాంతికి మీ నాన్నగారు కాశీనుంచి స్వయంగా తెప్పించి ఇచ్చిన బహుమతి ఇది. దీని అవసరం అయిపోయింది" అంటున్నారు అక్కడ లేని భార్యతో.

అనసూయకి ఏం చెయ్యాలో అర్థం కాలేదు. కాలవలో స్నానంచేస్తున్న విద్యార్థులకు కబురెట్టింది.

అంతా పరుగున వచ్చారు. ఆయన్ని లేవదీసే ధైర్యం ఎవరికి? అందరూ ఒక్కసారిగా పద్మాసనంలో ఉన్న గురువుగారిని యథాలాపంగా ఎత్తుకుని మంచంమీదకి చేర్చారు.

అపరాహ్ణం వరకూ చయనులుగారు పద్మాసనంలోనే అపస్మారంలో ఉన్నారు. భోజనానికి ఆపోశనపట్టి "అగ్నిహోత్రుడికి నామీద కోపంగా ఉందమ్మా. బతిమాలుకొంటున్నాను" అన్నారు.

ఆయన గొంతులో ఆర్ద్రత అనసూయని కదిలించింది. ఒక జీవితకాలం ఆయన అనుష్ఠానానికి భార్య పక్కన నిలబడింది.

ఆమె లేని ఏకాకితనం ఆయన్ని అవిటివాడిని చేసింది. "అది లేకపోతే నా ఇంట్లో నేనే పరాయివాడిననిపిస్తోందమ్మా" అన్నారు చయనులుగారు.

ద్విజుడైనప్పటినుంచీ వేదాన్ని కలలోనైనా అటునుంచి ఇటు వల్లెవేయగల ఘనపాఠికి ఇది అనారోగ్యం.

❖ ❖ ❖

కోటిలింగాలరేవు గట్టుమీద కూర్చుని ప్రాణాయామం చేస్తున్న సర్వమంగళాన్ని చూసి నవ్వాడు రామశర్మ.

"నవ్వుతున్నారేం?" అన్నాడు సర్వమంగళం.

"మీ ప్రాణాయామంలో దేవుడిమీద స్పృహ ఎక్కువ ఉందా? శరీరంమీదా? మీ ప్రాణాయామం దైవారాధనా? లేక కేవలం వ్యాయామమా?"

అబ్బు శాస్త్రి స్నానం ముగించుకుని గట్టుమీదకి వచ్చాడు. "ఏం? రెండూ కాకూడదా?"

"రెండూ కానక్కర్లేదు. ఒకటి ఉంటే రెండోది ఉన్నట్టే"

"ఏది ఉంటే?"

"ఆరోగ్యకరమైన శరీరం ఉంటే, ఆనందదాయకమైన పరమాత్మమీద భక్తికి వేదిక ఉన్నట్టే. వ్యాయామానికి ఆరోగ్యం మూలసూత్రం. భక్తి ఆనుషంగికం"

"అర్థంకాలేదు"

"మీకేమిటి? ఈ దేశానికే అర్థంకాలేదు. అర్థంకాని వారంతా వారికి తోచిన పెడర్థాలను తీసి కావలసినన్ని అనర్థాలను తెచ్చిపెడుతున్నారు. అజ్ఞానం లోపం కాదు. తమది అజ్ఞానమని తెలియకపోవడం, తెలిసినా ఒప్పుకోకపోవడం లోపం. తెలుసుకునే ప్రయత్నం చెయ్యకపోవడం లోపం"

సూర్యోదయం అయింది. ముగ్గురూ పద్మాసనం వేసుకు కూర్చున్నారు.

రామశర్మ చేతిలో వేళ్ల మధ్య సిగరెట్టు వెలుగుతోంది.

"మన దేశంలో ఎన్నో శతాబ్దాల కిందటే రూపుదిద్దుకున్న యోగశాస్త్రం పాశ్చాత్య దేశాలనుంచి వచ్చిందని నమ్మే ప్రబుద్ధులు, చెప్పే పెద్దలు ఈ దేశంలో చాలామంది ఉన్నారు. అసలు 'యోగ' అన్న పదమే అది నిజం కాదని చెప్తుంది. వస్తే గిస్తే–అతి

పురాతనమైన సంస్కృతులైన చైనా నుంచో అటుతర్వాత పుంజుకున్న జపాన్, థాయ్‌లాండ్‌ల నుంచో వచ్చిందంటే 'కాస్త' బుకాయించడానికి వీలు ఉంటుంది" అంటూ ఆగి–

"మన జాతి వైభవాన్ని బేషరతుగా విశ్వసిస్తూ, ఆ విశ్వాసాలను నమ్మే ప్రయత్నాలను నేను చేస్తున్నానని నమ్మితే–నా మాటలమీద మీకు కోపం రాదు. కనీసం అలసత్వం రాదు". తపస్సు, ధ్యానం, సమాధి వంటి దశలు–నిజానికి పాశ్చాత్య సంస్కృతికే కొత్త. అదొక ప్లేన్. ఆ ప్లేన్‌లో విద్యని 'అభ్యసించడం' కాక కేవలం జ్ఞానాన్ని 'దర్శించిన' మహానుభావుల దాఖలాలు మన సంస్కృతిలో ఉన్నాయి. మూక కవి, కాళిదాసు మనం వింటున్న ఉదాహరణలు. వారు విద్యని అభ్యసించలేదు. విద్య వారిని పొందింది. Knowledge for them was a vision. Supra-mental plane లో మన ఆలోచన స్థాయిని దాటి విజ్ఞానం మనస్సులో తళుక్కుమంటుంది. మనమూ అరుదైన సందర్భాలలో అంటూంటాం. "నాకెలా తట్టిందో ఇప్పటికీ అర్థంకాలేదండీ" అని. ఆ ప్లేన్‌ని స్పృశించిన స్పృహ అది. కారణం మన ఆలోచన స్థాయికి అందదు. ఆధారం దొరకదు. అదీ 'యోగం'. మనకి ఒక దశలో 'అబ్బడం'. యోగం అనే మాటని ఆలోచన స్థాయి దాటిన 'ఫలితం'గానే వాడుతున్నాను".

"ఇక మన యోగశాస్త్రం. ఎక్కడో హిమాలయాల్లో, పర్వత గుహల్లో, జన సంచారానికి దూరంగా, వారి ఏకాగ్రతకి భగ్నం కలగకుండా రోజులు, వారాలు, నెలలు, సంవత్సరాలు స్థాణువులుగా శరీరాన్ని ఒకే స్థితిలో నిమగ్నం చేసిన ఋషులు–అప్పుడప్పుడు స్తబ్ధత కారణంగా శరీరానికి కలిగే రుగ్మతల నుంచి బయటపడడానికి–శతాబ్దాల కిందట వైద్యుల్ని సంప్రదించలేదు. సంప్రదించలేరు. ఆరోజుల్లో ఎక్స్‌రేలు లేవు. సమాచార సాంద్రత లేదు. ఇదమిత్థమనే చికిత్స లేదు. చికిత్సను పొందే ఆస్కారమూ వారికి లేదు. కనుక ఆయా రుగ్మతలకి–వారి వారి శరీరాలతోనే, శరీరాలలోనే చికిత్సల్ని రూపొందించుకున్నారు. ఇది అనూహ్యమైన evolved empirical science. ఇది పరిశీలనతో తమకి తాముగా నిర్ధారించుకుని పరస్పరం పంచుకున్న 'సుళువులు'. నిద్దర్లో మెడ నరం పట్టింది. "నిద్దర్లోనే సర్దుకుంటుంది" అంటుంది అమ్మమ్మ. నిద్దర్లో సర్దుకోవడం ఏమిటి? ఏదో చికిత్స కావాలి కదా? మందు అవసరం కదా? డాక్టరు కావాలి కదా? వీలైతే ఎక్స్‌రే తీయాలి కదా? కాని అమ్మమ్మ చికిత్స విడ్డూరం. నిద్దర్లో ఒకే పార్శ్వంలో చాలాసేపు నిద్రించడంవల్ల, శరీరం అపస్మార దశలో ఉండకూడని పద్ధతిలో ఎక్కువసేపు ఉండిపోవడంవల్ల నరాలు నొప్పిచేశాయి. దానికి చికిత్స – ఆ పద్ధతిలో కాక, మరొక పద్ధతిలో శరీరాన్ని నిలపగలిగితే ఆ నొప్పి సర్దుకుంటుంది. అమ్మమ్మకి అంతే తెలుసు. యోగ శాస్త్రానికి ఏ పద్ధతిలో శరీరాన్ని నిలపడంవల్ల, ఎంతసేపు నిలపడంవల్ల నొప్పి సర్దుకుంటుందో తెలుసు. ఏమిటా

పద్ధతి? ఇది అమ్మమ్మకి తెలీదు. కాని నిద్రకి తెలుసు. ఇది అమ్మమ్మ స్థాయి 'యోగా' చికిత్స.

ఋషులు జన సంచారానికి దూరంగా-శరీరానికి సంభవించిన అస్వస్థతని-కందమూలాలు, ఆకులు, గాలిని సేవించి బతుకుతున్నారు కనుక-లొంగదీసుకోవాలంటే చికిత్సని ఎక్కడో వెదకడం కాదు-శరీరంలోనే, శరీరం ద్వారానే, శరీరాన్ని తర్ఫీదు చేసుకున్న కారణంగానే సాధించుకున్నారు. ఈ గుహలో ఋషి తన అనుభవాన్ని పక్కగుహలో ఋషికి పంచాడు. అది తమకు తాము-అవసరం, పరిమితుల దృష్ట్యా సాధించుకున్న ఫలితాలు. మరొక్కసారి - ఇది కేవలం empirical science. తపస్సు, సమాధివంటి మానసిక స్థాయిలను సాధించిన ఒక సంస్కృతి తనకి తాను నియంత్రించుకున్న శాస్త్రం. ఇది ఫలించకుండా ఉండే అవకాశం లేదు. ఎందుకంటే ఫలితాన్నిబట్టే నిర్ధారించుకున్న పద్ధతి కనుక. పద్ధతినిబట్టి ఫలితాన్ని వెదుక్కునే వైద్యం కాదు. దీనికి లేహ్యాలూ, చూర్ణాలూ, ఔషధాలూ, పానీయాలూ లేవు. ఆలంబన కేవలం శరీరమే. కష్టం శరీరానికి, చికిత్స శరీరానికి. ఫలితం శరీరానికి.

గమనించాలి. ఈ దశలో దేవుడు లేడు. నిద్రలో మెడనరం పట్టుకుంటే దేవుడేం చేస్తాడు? మతం లేదు. నిజానికి ఆ గొడవే లేదు. అజీర్ణం ప్రబలింది. అల్లాతో పనేమిటి? కృష్ణభగవానుడి అవసరం ఏమిటి? దొరికితే ఆయుర్వేద వైద్యుడు కావాలి. యునానీ వైద్యుడు, ఇంకా అల్లోపతీ వైద్యుడు కావాలి. హిమాలయాల్లో, నర్మదా నదీ సానువుల్లో ఋషులకి ఆ అవసరమూ లేదు. అగత్యమూ లేదు. పెన్సిలిన్‌లాగ శరీరంలో రుగ్మతకి శరీరాన్నే సాధనగా వాడుకున్నారు. కాదు. కనుగొన్నారు. అది వారి అవసరం. ఇందులో దేవుడు, మతం-కనీసం-ఈ దశలో లేని కారణంగానే అంతర్జాతీయంగా అందరినీ ఆకర్షించింది. కేవలం శరీరమూ-దాని ఆరోగ్యాన్ని దృష్టిలో పెట్టుకున్న మనిషికి ఈ విషయం ఎవరూ చెప్పనవసరం లేకుండానే అర్థమౌతుంది.

అయితే ఈ మతం ఎక్కడినుంచి వచ్చింది? ఈ అద్భుతమైన, అనూహ్యమైన 'వైద్యం'లో దేవుడు ఎలా దూరాడు? బాబూ, ఈ వ్యాయామం చేస్తున్నది ఋషులు. వారు చేస్తున్నది తపస్సు. వారు సాధన ద్వారా వెళ్ళే ప్లేన్-సమాధి. వారి మనస్సుల నిండా నిండినది-అపూర్వమైన నిశ్శబ్దం. అనూహ్యమైన ఏకాగ్రత. దైవచింతన. ఉదాహరణకి ఫలానా రుగ్మత పద్మాసనం వేయడంవల్ల తొలగుతుంది. ఆ వ్యవధిలో అతనేం చెయ్యాలి? ఋషి ఏం చేస్తాడు? అతని లక్ష్యం ఏదైతే ఉందో అదే చేస్తాడు. దైవచింతనే చేస్తాడు.

ఇందుకు రెండు పరమార్థాలున్నాయి :

1. తన సాధన లక్ష్యం ఫలానా రుగ్మత నుంచి విముక్తి.

2. తన మననం లేదా దైవచింతన కొనసాగింపు.

అతని మూలసూత్రం–లక్ష్యం–ఆ దశలో అతని దృష్టి రుగ్మత నుంచి విముక్తిపైనే. అతనికి ఏకాగ్రతనిచ్చే విషయంమీద ఉంటుంది. ఉండాలి. అది అవసరం కాదు–అలవాటు. నిర్దేశన కాదు. నియమం. అతను ఏర్పర్చుకున్న ప్రాథమిక స్వభావం. అంతవరకే.

సూర్యనమస్కారంవల్ల లాభం ఉంది. సూర్యుడు నా దేవుడు. కాదు మానెయ్. ఐశ్వర్యారాయ్‌ని తలుచుకో. అర్నాబ్‌గోస్వామిని తిట్టుకో. కాని ఏది చేసినా ఏకాగ్రతతో చెయ్యి. ఫలానా పద్ధతిలో యోగాసనం వేస్తున్నావు. ఎంతసేపు? అరగంట. ఈ అరగంట ఏం చెయ్యాలి? నీకు చాలా ఆనందాన్నిచ్చే నీ తల్లిని తలుచుకో. స్మరించుకో. లేదా నీకు తృప్తినిచ్చే నీ ప్రేయసిని తలుచుకో. బార్‌లో జానీవాకర్ విస్కీని తలుచుకో. కాని తలుచుకోక తప్పదు. ఎందుకు? అది మనస్సు వ్యాసంగం కనుక. ఋషి ఆ తలుచుకోడానికి ఆంక్షలు పెట్టలేదు. ఆ దశలో అతనికి అవసరం లేదు కనుక. నిజానికి ఆ చికిత్స అతనిది. ఆ దశలో అతనికి ఈ దిశానిర్దేశం అవసరమూ లేదు. మీమాంసా కాదు. అతని సాధనని–పట్నానికి తీసుకువచ్చి–మతంతో గజిబిజి అయిన కుహనా మతస్థుల మధ్య నలిగి యోగాసనాల అసలైన పరమార్థాన్ని–అసలు దాన్ని అవలంబించిన ఋషుల లక్ష్యాన్ని మరిచి–మనస్సులోనో, మాటలోనో తలుచుకోవలసిన సూర్యుడు గురించి కొట్టుకు చచ్చేవాళ్ళకి–ఆ వైద్యమూ, చికిత్సా ఏం ఫలిస్తుంది?

యోగా గురువు జగ్గీ వాసుదేవ్ ఓ మాట అన్నారు :

If Yoga is Hindu

Gravity is Christian అని.

ఇది అద్భుతమైన మాట. విజ్ఞానం మతానిది కాదు. మానవుడిది. యోగా శరీరాన్ని సంస్కరించుకోదలచిన ఏ దేశస్థుడికైనా కొంగుబంగారం.

కాని మతం పేరిట ఎల్లల్ని ఏర్పర్చుకోవడం–దురదృష్టం. స్వీయపరిశోధనలతో, స్వకీయ ప్రయోజనానికి ప్రయోగం చేస్తూ, ఎప్పటికప్పుడు కొత్త ఫలితాల్ని రాబడుతూ కొండల్లో ఏకాంతవాసంలో పంచుకుంటున్న ఒక అద్భుతమైన విజ్ఞానాన్ని, కొన్ని శతాబ్దాల అనుభవం, రుజువులు సమర్థించే శాస్త్రంగా రూపుదిద్దుకోవడాన్ని జనావళికి అందజేయాలని మరొక ఋషి సంకల్పించాడు (గమనించాలి: హిమాలయాల్లో తపస్సు చేసే ఋషి సంకల్పం జాతి శ్రేయస్సు) ఆయన పతంజలి మహర్షి. క్రీస్తు పూర్వం రెండవ శతాబ్దంవాడు. అప్పటి శతాబ్దాల, తరాల ప్రయోగాలతో నిగ్గుతేలిన ఈ విజ్ఞానానికి తప్పనిసరిగా దేవుడి,

ధ్యానాన్ని జత చేశాడు. అది ప్రమాదమని, ఓ గొప్ప శాస్త్రానికి ఆ ప్రయత్నం అర్థంలేని ఎల్లల్ని నిర్ణయిస్తుందని ఆయన భావించలేదు. ఎందుకని? జాతిని ఉద్ధరించే, జాతిని ఏకీకృతంచేసే, జాతి అనునిత్యం ఆరాధించే దేవుడు ఈ శాస్త్రానికి బలమైన insultation కాగలదని ఆనాడు ఋషి భావించాడు.

పతంజలి రాజయోగానికి అద్భుతమైన భాష్యం చెప్పిన మరొక మహనీయుడు– స్వామి వివేకానంద కూడా అలాగే భావించారు.*

ఎందరో ఆచార్యులు, ఎందరో ప్రవక్తలు, ఎందరో సిద్ధులు, ఎందరో ఋషులు, మరెందరో గురువులు–పరమాత్మ ఒక్కడే అని చెప్పి జాతిని సమైక్యం చెయ్యాలనే కృషిని చేస్తూనే ఉన్నారు. ఈ పనిని ఋషి చేశాడు. జీసస్ చేశాడు. మహమ్మద్ ప్రవక్త చేశాడు. గురునానక్ చేశాడు–కాని వారి కృషికి ప్రత్యేకమైన గుర్తులుపెట్టి 'మతం' పేరిట తెరలు దించుతారని వారు ఊహించలేదు. మతం ప్రయోజనం జాతి సంక్షేమమైతే ఈ అభ్యంతరాలు రానే రావు. మతం ప్రయోజనం–నా వర్గం, నా కులం, నా రాష్ట్రం, నా ఓటు అయినప్పుడే పట్టింది ఈ దరిద్రం.

పతంజలి రాజయోగంలో ప్రయోజనాన్ని అనుభవిస్తూనే దేవుడిని దూరంచేసి ఎండగట్టే వర్గం బయలుదేరింది. ఆసనానికి దైవచింతన ఆనుషంగికమే కాని, అనివార్యం కాదనే ఆలోచన మూలపడి–అసలు విషయం మరుగునపడి–యోగశాస్త్రం కేవలం వ్యాయామంగా మిగిలిపోయింది.

విషయాంతరమైనా–మరో పిట్ట కథ. తలమీద సోరియాసిస్ పోవాలంటే చర్మవైద్యుడు మందు ఇస్తాడు. మాత్రలు ఇస్తాడు. ఇస్తూనే–రోజూ నువ్వులనూనె ఒంటి నిండా రాసుకొని

---

* Surface scientists, unable to explain the various extra-ordinary mental phenomena, strive to ignore their very existence.

They are, therefore, more culpable than those who think that their prayers are answered by a being, or beings, above the clouds, or than those who believe that their petitions will make such beings change the course of the universe.

The latter have the excuse of ignorance, or atleast of a false system of education which has taught them to depend upon such beings for help, and this dependence has now become a part of their degenerate nature. The former have no such excuse. (Raja Yoga-Introduction by Swami Vivekananda).

ఎండలో నిలబడి తర్వాత స్నానం చెయ్యమంటాడు. ఎంతసేపు? 20 నిముషాలసేపు. చర్మవ్యాధి నిపుణుడు అమెరికాలో చదువుకు వచ్చాడు కాని మా నాయనమ్మ చిన్నప్పుడు ఆ మాటే చెప్పేది. సూర్యుడి కిరణాలలో చర్మవ్యాధుల్ని మాన్పించే శక్తి ఉంది. ఈ సూర్యుడు దేవుడంది మా నాయనమ్మ. డాక్టర్ తంబయ్య అనే చర్మవ్యాధి నిపుణుడు ఒప్పుకోడు. ఎందుకని? సూర్యుడు ఓ గ్రహమని ఆయన నమ్ముతున్నాడు కనుక. ఆరోజు నా కడుపు నిండడానికి పది రూపాయలు ఇచ్చినవాడిని మనం 'దేవుడులాంటి మనిషి' అంటున్నామే! సూర్యుడు దేవుడంటే మన సొమ్మేం పోయింది. అమ్మో, రాజకీయ నాయకుడికి అతని మత ప్రాధాన్యం పోతుంది. ఒప్పుకుంటే తన వర్గం ఓట్లు పోతాయి.

సరే. ఈ 20 నిముషాల మాటేమిటి? ఎండలో నిలబడి ఏం చెయ్యాలి? హిందూ పేపరు చదువుకో. మదన కామరాజు కథ చదువుకో. పక్కనే ఉంటే పెళ్ళాంతో మాట్లాడు. ఇష్టంలేకపోతే పోట్లాడు. 'మతం' ఈ జాతికి తిరుగులేని ఔషధం అని భావించిన పెద్దలు ఈ 20 నిముషాలూ ఏం చెయ్యాలో నిర్దేశించారు. 'ఆదిత్య హృదయం' చదువుకో. ఏముంది అందులో? *

నీకూ నాకూ కొన్ని తరాలుగా తెలీదు–మనం సంస్కృతం చదువుకోలేదు కనుక.

సంస్కృతం హిందూ మతానికి సంబంధించిన భాష కనుక. ఆ విజ్ఞానం జోలికి పోలేదు కనుక. ఆదిత్య హృదయానికీ, సూర్యుడికీ, సోరియాసిస్‌కీ సంబంధం ఏమిటి? ఉంది బాబూ ఉంది. నీ రుగ్మత పోవాలని భావించి, సూర్యుడు పోగొడతాడని మనసారా నమ్మి, పోగొట్టాలని ఆశిస్తూ ఆ 20 నిముషాలూ నీకు కావలసిన ఉపశమనాన్ని భావిస్తూ ఆ ఉపశమనాన్ని ఇచ్చే శక్తిని తలుచుకుంటూ 20 నిముషాలు గడుపుతున్నావు. ఇదే చికిత్స. ఒక రోగ నివారణపట్ల ఏకాగ్రత. నీ లోపాన్ని నివృత్తిచేసే ప్రక్రియమీద గురి నీ ప్రయత్నాన్ని సానబెడుతుంది.

---

*** నిజంగా 'ఆదిత్య హృదయం' హృదయాన్ని తెలుసుకోవాలంటే-అది కేవలం ఊకదంపుడు కాదని-సూర్యోపాసకులు చెప్పగలరు. ఈ సృష్టి వికాసానికి ప్రాథమికమైన శక్తిగా భావించే సూర్యుని ప్రాముఖ్యాన్ని వివరించే విజ్ఞాన నిక్షిప్తం ఆదిత్య హృదయం. కాగా, ఛందోమయ వాక్కు శ్వాసను regulate చేసి ప్రాణశక్తిని ఇనుమడింపచేస్తుందని సశాస్త్రీయంగా నిరూపణమైంది. ఇది కేవలం మన ఆర్ష సంస్కృతికి సంబంధించినది మాత్రమే కాదు. ఒకటవ శతాబ్దంలో రోమ్‌లో 'మిత్రారాధన' జరిగిన దాఖలాలు ఉన్నాయి. 'లోక మిత్రుడు' అని సూర్యునికి పేరు. అయితే విజ్ఞానాన్ని విశ్వాసం స్థాయిలోనే వదిలేసి పెదవి విరిచే వారికి ఈనాటి చర్మవ్యాధి నిపుణుడి పాశ్చాత్య విజ్ఞానం సరిపోతుంది.**

కుంతి అనూరుడు, ఏడు గుర్రాలు, కర్మసాక్షి – ఇదంతా ఓ మతం యొక్క muse అని సరిపెట్టుకున్నా. చికిత్స ఎంత పకడ్బందీగా ఉంది?*

---

*** ఆదిత్య హృదయం సూర్యోపాసన. ఆ చైతన్య శక్తి రహస్యాలను ఎరిగిన ఆర్ష సంప్రదాయపు ఋషులు-కేవలం 'విశ్వాసం'గా మాత్రమేకాక, నిర్దిష్టమైన, సహేతుకమైన పరిశోధనలతో ఆశక్తి ఉపాసనని నిర్ధారించారు.**

**ఇప్పటి మన తెలివితేటలన్నీ విదేశాల నుంచి దిగుమతి అయినవే కనుక-ఒక విదేశీయుని పరిశోధనని ఇక్కడ ఉటంకిస్తే కొందరికైనా ఉపశమనం కలుగుతుందని ఆశ. అది వారు నమ్మిన 'శంఖం' కనుక.**

**సూర్యుని నుంచి వచ్చే సౌరశక్తిని మన పెద్దలు శతాబ్దాలకిందే గుర్తుపట్టడమే కాదు వాటికి చెరిగిపోని గుర్తులు పెట్టారు. అమెరికాలోని కొలరాడో విశ్వవిద్యాలయం (బోల్టర్) ప్రొఫెసర్ జాన్ మెక్కిమ్ మెల్విల్ అనే అంతరిక్ష భౌతిక విజ్ఞాన శాస్త్రజ్ఞుడు** (Astro Physicist) **ఈ విషయమై సమగ్రమైన పరిశోధనలు జరిపాడు. వైశ్విక చైతన్య శాస్త్రం** (Cosmology) **లో యుగాల క్రితమే అద్భుతమైన విజ్ఞానం భారతీయులకున్నదని గుర్తించాడు. కాశీ క్షేత్రానికి సంబంధించి పురాణాల్లో వర్ణించిన ప్రకారంగా,** geometrical**గా ఒక పఠాన్ని తయారుచేసుకున్నాడు. ఇది 1994లో జరిగింది. నిజానికి కాశీ ఖండంలో విశ్వనాథ జ్యోతిర్లింగానికి ఆగ్నేయంగా ఏముంది? ఈశాన్యంగా ఏముంది? నైరుతిగా ఏముంది? వాయువ్యంగా ఏముంది? ఏ ఆవరణలో ఏముంది?-అన్న విషయాన్ని దిక్కులతో సహా వర్ణించారు.**

**ఈ ప్రొఫెసర్‌గారు తాను తయారుచేసుకున్న పఠాన్ని,** cosmic**ని కొలగవలిగే రాడార్స్‌నీ,** Global Position System**నీ పట్టుకుని వారణాశి వచ్చి బెనారస్ విశ్వవిద్యాలయంలో పనిచేస్తున్న రాణా పి.బి.సింగ్ అనే** Cosmology **ప్రొఫెసర్‌ని కలిశారు.**

**"నేను ఈ దేశానికి కొత్త. నా పరిశోధనకు మీ సహాయం కావాలి" అని కోరాడు. ఆ ప్రొఫెసర్‌గారు తెచ్చిన పరికరాలతో ఇద్దరూ కాశీ, చిత్రకూటపర్వత ప్రాంతాలను పరిశీలిస్తూ తిరిగారు. మొత్తం పన్నెండు ఆదిత్య క్షేత్రాలను కనుగొన్నారు.**

**ఈ** Pro. Malville **రాసిన వాక్యాలు :** Each of the 12 Sun Temples were located in such a way that it indicated the movement, speed and the intensity of light during the apparent movement of the Sun across the 12 signs of Zodiac. **సూర్యుడు రాశి చక్రంలో సంచరించేటప్పుడు**

పోనీ ఈ 20 నిముషాలూ చదవమని ఈ అమెరికా డాక్టరు బరాక్ ఒబామా దండకాన్ని నీ చేతిలో పెడితే చదువుతావా? చదువుతావు. ఎందుకని? తలమీద సోరియాసిస్ పోవాలి కనుక. మరి సూర్యుడితో నీకు తగాదా ఎందుకు? అవసరమైతే, అవసరమనిపిస్తే సూర్యునికి నీ మతాన్నివ్వు.

శతాబ్దాల ఒరిపిడిలో శారీరకమైన నివృత్తికీ, మతానికీ దూరం లేకుండా ఏకీకృతం కావడాన్ని పతంజలి ఒక శాస్త్రంగా జాతికి అందిస్తే మతాన్ని వేరుచేసి దాన్ని సశాస్త్రీయమైన చికిత్సగానే హఠయోగం, క్రియాయోగం వంటి ధోరణులను అన్వయింపజేశాయి–మానవ కళ్యాణమే ఈ శాస్త్ర ప్రయోజనం కనుక.

---

**మేషరాశి మొదలు ఒక్కొక్క నెల ఒక్కొక్క రాశిలో ఉన్నప్పుడు ఆ సమయంలో సూర్యని నుంచి వచ్చే కాంతి యొక్క తీవ్రత, వేగం, గమనం-ఒక్కొక్క ఆలయంమీద పడుతున్నాయని గ్రహించారు! ఆ శక్తిని ఆ కేంద్రం గుంజుతోంది. దాని తర్వాత ఆయన తాను తెచ్చిన యంత్రాలతో సౌరశక్తిని కొలుస్తూ 56 గణపతి ఆలయాలను పరిశీలించాడు. ఆయనంటాడు :** It is a mystery how the ancient Indians had fixed the sights for these temples **అని. ఆ క్షేత్రాలు ఆ సౌరశక్తి పడే కేంద్రాలు. ఆలయాన్ని దర్శించే ప్రతీ వ్యక్తీ ఆ సౌరశక్తి ప్రభావాన్ని పొందుతున్నాడు. మన ఆలయాల పరమార్థం కేవలం కొబ్బరికాయ, పడపప్పు కాదు.**

**సశాస్త్రీయమైన ప్రయోజనాన్ని నిక్షిప్తంచేసిన నిధులు. వైశ్విక చైతన్యశక్తి కేంద్రాల్లో ఆ ఆలయాలు ఉన్నాయి.** By mathematics, mathematical calculations, or through intuition and meditation **వల్ల మాత్రమే ఇది సాధ్యమని ఆయన అన్నారు.**

Intuition **అంటే ప్రజ్ఞ.** Meditation **అంటే తపస్సు. ధ్యానము ద్వారా వికసించిన ప్రజ్ఞ. నిరంతర సాధనవల్ల, తపశ్శక్తివల్ల రుతంబర ప్రజ్ఞ అనే ప్రజ్ఞ మేల్కొంటుంది. ఆ ప్రజ్ఞకి అతీంద్రియ జ్ఞానం దర్శనమిస్తుంది. ఆ జ్ఞానం సమృద్ధిగా సాధించిన పూర్వీకులు ఇలాంటి ఆలయాలను నిర్దేశించారు-అని ఒక పాశ్చాత్యుడు పేర్కొన్నాడు.**

**ప్రొఫెసర్ రాణా పి.బి.సింగ్‌గారు దరిమిలాను** COSMIC ORDER AND CULTURAL ASTRONOMY, SACRED CITIES OF INDIA **అనే గ్రంథాన్ని ప్రొఫెసర్ మెల్విల్ ముందుమాటతో రాసి ప్రచురించారు.** (http://www.cambridgesscholars.com/download/sample/58357).

**ఈ విషయాన్ని మిత్రులు సామవేదం షణ్ముఖ శర్మగారు తన ప్రవచనంలో సోదాహరణంగా పేర్కొన్నారు.**

వారిలో ప్రముఖులు పరమహంస యోగానంద, నిన్నమొన్నటి బి.కె.ఎస్.అయ్యంగార్.

అబ్బుశాస్త్రి, సర్వమంగళం నిర్ఘాంతపోయి వింటున్నారు. ఈ ఉపన్యాసాన్ని, తను నమ్మిన సత్యాన్ని, తను చేసుకున్న అన్వయాల్ని లేదా తను ఊహించిన తరతరాల విశ్వాసాల వెనుకనున్న మూలకారణాల్ని సమగ్రంగా ఒడిసి పట్టుకున్న ప్రయత్నం అతని మాటల్లో ధ్వనించింది. ఆలోచన అన్వేషణ, ఆధారం శాస్త్రం. సత్యం–సర్వకాలీనం.

## 18

అతని పేరు అమావాస్య రాజు. ఈ విచిత్రమైన పేరు వెనుక బోలెడు కథ ఉంది. నిజానికి ఆయన కెవరూ పేరు పెట్టలేదు. వాడుకలో స్థిరపడిన పేరది. కారణం–అతను పుట్టిన అరగంటలో అతని మేనమామ మతి స్థిమితంలేక చచ్చిపోయాడు. పుట్టడానికి అతి ఇబ్బందికరమైన, విషాదకరమైన ముహూర్తాన్ని ఎంపిక చేసుకున్నాడు అమావాస్య రాజు. కాన్పుకి ఆసుపత్రిలో చేరిన అతని తల్లికి ఆమె తమ్ముడు పోయిన విషయం తెలీదు. బిడ్డ పుట్టేటప్పుడు శరీరంలో రక్తం తక్కువై ఆమె కోమాలోకి వెళ్ళిపోయింది. తనవారంటూ ఎవరూ ఆమె పక్క లేరు–అంతా శవం దగ్గర ఉన్నారు. పుట్టిన బిడ్డని పది గంటలపాటు చూడలేదు. కన్నవారు రెండురోజుల వరకూ కనిపించలేదు. ఆమెని చూస్తే కొడుకు పోయిన దుఃఖం తోసుకువస్తుందేమోనని తల్లి రావడానికి భయపడింది. ఎవరూ కనిపించరేం? అన్న ఆలోచన ఆమెకి రావడానికి అయిదు రోజులు పట్టింది.

పన్నెండో రోజు పెద్దఖర్మనాడు ఆమెకి గారె తినిపించింది తల్లి. ఇప్పుడెందుకు చేశారు? పురిటాలు ప్రశ్న. నోటిలో గుడ్డ కుక్కుకుంది తల్లి. తీరా చచ్చి బతికి ఇంటికి వచ్చాక తమ్ముడి చావు తెలిసి కుప్పకూలిపోయింది. అతన్ని సమాధి చేసిన చోటికి వెళ్లి చతికిలబడి భోరుమంది. ఆ దుఃఖం నుంచి ఆ కుటుంబం ఏనాడూ తేరుకోలేదు. పెరుగుతున్న పసివాడికి బారసాల చెయ్యాలన్న ఆలోచన కూడా ఎవరికీ రాలేదు. వచ్చినా దానికి కార్యరూపాన్ని ఇచ్చే మనస్సు లేదు ఎవరికీ. కుర్రాడు అమావాస్యనాడు పుట్టాడు. అంతే. ఎవరూ పేరు పెట్టని కారణాన కుర్రాడు అందరికీ అమావాస్య రాజు అయ్యాడు. ప్రతీ సంవత్సరం అతని పుట్టినరోజు తల్లికి తీరని దుఃఖాన్ని గుర్తుచేసే దినం. అతని పుట్టినరోజు ఏ యేడూ ఎవరూ జరపలేదు. పెరిగి పెద్దవాడై అతని కాళ్ళమీద నిలిచి తన ఆదాయాన్న ఏర్పర్చుకున్నాక ఆయన ప్రతీ పుట్టినరోజు పదిమందికి 'పెట్టిన' రోజు చేసుకున్నాడు అమావాస్య రాజు. ప్రతీ పుట్టినరోజూ తల్లి సమక్షంలో నిలబడి "నేను పుట్టడంలో నా తప్పు లేదు" అని చెప్పాలనుకున్నాడు. ఎలా చెప్పాలో తెలీక మానుకున్నాడు.

పెద్ద కష్టంతో నష్టజాతకుడు అనిపించుకుని పుట్టిన అమావాస్య రాజు పూనుకున్న వ్రతం–ఎదుటివాడి జీవితంలో ఆ నష్టాన్ని వీలైతే భర్తీ చెయ్యడం. పెద్ద చదువు అబ్బలేదు. చిన్నతనం నుంచీ ఆత్మన్యూనతాభావాన్ని తట్టుకుని జీవించే అలవాటుని చేసుకున్నాడు. తను ఎవరికంటే అందగాడు కాదు. తను ఎవరికంటే తెలివైనవాడు కాదు. తను ఎవరికంటే గొప్పవాడు కాదు. ఇది సుఖవంతమైన గుహ. అందులోనే జీవించాడు. మూడో ఫారందాకా చదివి చదువు తనకి లాయకీ కాదని మానుకున్నాడు. అతని పద్దెనిమిదో యేట–ముద్దరాలైన పదిహేడేళ్ళ తన కూతురికి ఇల్లరికం భర్త కావాలని కష్టపడి వెదికిన కొవ్వూరు పెరుమాళ్ల రాజుకి ఇతను కంటబడ్డాడు. తన ఒక్కగానొక్క కూతుర్నీ, తను ప్రారంభించిన ట్రెడిల్ ప్రింటింగ్ ప్రెస్‌ని కట్నంగా ఇచ్చి అల్లుణ్ణి ఇంటికి తెచ్చుకున్నాడు. అప్పటికి అమావాస్య రాజుకి తన జీవితంలో ఒడుపు ఏమిటో తెలిసివచ్చింది.

నలుగురు వర్కర్లతోపాటు తనూ ఒకడై స్టిక్కు చేత్తో పట్టుకుని అక్షరాలు కూర్చడం ఎలాగో నేర్చుకున్నాడు. క్రమంగా ఆ చుట్టుపక్కల ఎక్కాల పుస్తకాలు, చిన్న క్లాసుల వాచకాలు, పిల్లీ కుక్కా బొమ్మల కథలూ, కేలండర్లూ–ఒకటేమిటి? అన్నీ ప్రింటింగు చేసేవాడు. క్రమంగా పని ఎక్కువయింది. ప్రెస్సూ పెద్దదయింది. క్రమంగా వ్యాపారం కలిసివచ్చింది. అమావాస్య రాజు స్వభావం ఎవరినీ డబ్బు అడక్కపోవడం. పని చెయ్యాలని ఎవరు వచ్చినా ముందు బాకీ తమకు తామే చెల్లించిమరీ పనిని పురమాయించేవారు.

అమావాస్య రాజు తప్ప మరెవరూ చెయ్యలేనంత వేగంగా, కరెక్టుగా, నీటుగా పని చేసేవాడు. బాకీ ఎగ్గొట్టి డబ్బు మిగుల్చుకోవాలనుకున్నవాళ్లూ అతని పనిని దృష్టిలో పెట్టుకుని పాత బాకీ తీర్చి కొత్త పనికి వచ్చేవారు. మరి రెండో పని లేనివారు? ఎగ్గొట్టి మాయమయ్యేవారు. అయితే వారి శాతం బహు తక్కువ. అమావాస్యరాజు ఆ ఊళ్లో జరిగే అన్ని మంచి పనులకీ తలలో నాలుక. గణపతి నవరాత్రులకి ఉచితంగా గణపతి పూజ పుస్తకాలు పంచేవాడు. శ్రీరామనవమికి 'హరేరామ హరేరామ' శ్లోకం అట్టలు పంచేవాడు. స్వాతంత్ర్య దినోత్సవానికి చొక్కాలను పెట్టే జెండాలు పంచేవాడు. చిన్న ఊరిలో పెద్ద మనసుతో అందరి తలలో నాలికై పనిచేసే నిజాయితీపరుడి పరపతి అచిరకాలంలో ఎల్లలు దాటింది.

ఎంతవరకూ వ్యాపించింది? ఉత్తరప్రదేశ్‌లో గోరఖ్‌పూర్ వరకూ వ్యాపించింది. గోరఖ్‌పూర్‌లో ఏముంది? గీతా ప్రెస్ ఉంది. దానికి తొంభైరెండు సంవత్సరాల చరిత్ర ఉంది. అలనాడు జయదయాళ్ గోయాండ్కా అనే మార్వాడీ సనాతనధర్మ ప్రచారానికి ప్రారంభించిన ఉద్యమం 'ఇంతింతై వటుడింతై' అన్నట్టు పెరిగి–చిలవలూ పలవలూ అయి–పెద్ద ఉద్యమమై ఆనాడు 600 రూపాయలతో కొన్న ప్రింటింగ్ మిషన్

విశ్వరూపందాల్చి ఇప్పటికి 4.1 కోట్ల భగవద్గీత కాపీల్ని, 7 కోట్ల రామ చరిత మానస్ కాపీలను ప్రింటుచేసి సరసమైన ధరలకు అందిస్తోంది. సంస్కృతం, హిందీ, మరాఠీ, ఇంగ్లీషు, కన్నడ, తమిళం, గుజరాతీ, బెంగాలీ, ఒరియా, తెలుగులో పుస్తకాలను ప్రచురించింది.

తెలుగుకీ అమావాస్య రాజుకీ ముడి ఉంది. అదొక మహోద్యమం.

అయితే గోరఖ్‌పూర్‌కి అమావాస్య రాజుకీ లంకె ఎలా వచ్చింది? ముందు రామశర్మకీ అమావాస్య రాజుకీ లంకె ఉంది. అమావాస్య రాజు రామశర్మ భక్తుడు. నానాటికీ పెరిగిపోతున్న అంధ విశ్వాసాలను ఖండిస్తూ వాటి నిజానిజాల్ని ఎరుకపరిచి మన ధర్మంలో ఉన్న వైభవాన్ని తెలియపర్చవలసిన బాధ్యత ఈ తరానికి ఉన్నదని అమావాస్య రాజు నమ్మిక. రామశర్మ మాటలు విన్నప్పుడల్లా–ఆ విషయాల్ని ఓ పుస్తకంగా రాయాలని ఒత్తిడి చేస్తూంటాడు. అది సశాస్త్రీయమైన పరిశోధన కాదని, చర్చకు నిలవకపోవచ్చునని, కాగా, రాసే శక్తి తనకు లేదని రామశర్మ తప్పించుకుంటూంటాడు.

ఈ సమయంలో గోరఖ్‌పూర్ నుంచి ఓ సమాచారం అమావాస్య రాజుకి అందింది. తమ తెలుగు విభాగంలో ప్రూఫ్ రీడర్‌గా పనిచేసే త్ర్యంబక శర్మ 37 సంవత్సరాల తర్వాత వృద్ధాప్యం కారణంగా పదవీ విరమణ చేశాడు. కనుక సమర్థుడైన, ముఖ్యంగా ఇలాంటి పనిమీద కమిట్‌మెంట్ ఉన్న మనిషి ఉద్యోగానికి కావాలి. ముమ్మరంగా, నమ్మకంగా ప్రింటింగు చేసే అమావాస్య రాజు కృషి గోరఖ్‌పూర్‌కి అందింది. అలాంటి మనిషి ఇంకెవరు? రామశర్మ! నవ్వాడు రామశర్మ. గంటల పంచాంగం చదవగలిగిన వాళ్లంతా సిద్ధాంతులు కాలేరు. కాగా, తనది కడుపు నిండిన వ్యవహారం. అంతకుమించి డబ్బు కారణంగా కొత్త బాధ్యతని కొనితెచ్చుకోవడం తనకి ఇష్టం లేదు. పోనీ, ఓ మనిషి దొరికేవరకూ తమ ప్రూఫులు చూడగలిగే మనిషిని ఎవరినైనా పంపగలరా?

గోరఖ్‌పూర్ వెళ్ళి స్థిరపడే తెలుగువాడు, అక్కడ దొరికే జీతంతో జీవనంచేసే తెలుగు పండితుడు ఎవరుంటారు? ప్రెస్సులో కూర్చున్న రామశర్మ చెవిలో ఈ వార్త పడింది. వెంటనే మరిచిపోయాడు.

కాని వారంరోజుల తర్వాత కోటితీర్థాల రేవులో స్నానంచేసి బయటికి వస్తున్న అబ్బుశాస్త్రిని చూసినప్పుడు అతనికి సమాధానం చటుక్కున దొరికింది. మెట్లు దిగి అతనికి ఎదురు వెళ్లాడు : "మీకో ఉద్యోగం చూశాను" అన్నాడు.

అబ్బుశాస్త్రి నవ్వాడు. సర్వమంగళం ఆశ్చర్యపోయాడు. వేదం నేర్చుకునే పని దాదాపు మధ్యలోనే ఆగిపోయింది. మరే చదువుకూ ప్రయత్నం చెయ్యలేదు. కాగా, ఏదో ఉద్యోగం చెయ్యాలనే ఆలోచన రాలేదు. కారణం–తన చదువుకి ఉద్యోగం ఒకటి

దొరకగలదని ఆలోచనకు అందకపోవడమే. అయితే ఇప్పుడిప్పుడే జీవించడానికి ఏదో రకమైన ఉపాధి కావాలన్న ఆలోచన లీలగా మనస్సులో కదులుతోంది. ఎల్లకాలం పరాన్నభుక్కుగా ఉండడం సరికాదు. విద్యని తన ఇంట్లోనే ఉంచుకుని శిష్యులకి బోధచేసే వ్యవస్థ మాయమౌతోంది. విద్య వ్యాపారమౌతోంది. విద్య వృత్తి అవుతోంది. విద్య ఆదాయమౌతోంది. విద్య పోటీ అవుతోంది. వెరసి–విద్యకి దక్కవలసిన సాంద్రత, గాంభీర్యం మట్టిగలిసిపోయింది. గొప్ప ఘనాపాఠి. ఆయనవల్ల జాతికి ఉపయోగమేమిటి? జాతి శ్రేయస్సుని కోరతాడు. విజ్ఞానాన్ని పంచుతాడు. ఇస్తే పుచ్చుకుంటాడు. ఉన్నదాంతో సంతృప్తిపడతాడు. లేకపోతే పస్తులుంటాడు. మరొకాయన ఎమ్.టెక్. అమెరికాలో లక్షల జీతం తీసుకుంటాడు. తనకి సంబంధంలేని, మరెవరికో ఉపయోగపడే చాకిరీ చేస్తాడు. దాన్ని ఉద్యోగమంటారు.

విద్య లక్ష్యం సమాజహితం అంటే నవ్వే రోజులొచ్చాయి. పరీక్షలు, ర్యాంకులు, మార్కులు, డిగ్రీలు, కళాశాలలు, కాపీ కొట్టడాలు, లక్షల పెట్టుబడులు, ప్రకటనలు, ఫోటోలు–ఇవన్నీ చయనులు వంటివారికి తెలీదు. అబ్బు లాంటి వారికి అర్థం కాదు. విద్యవల్ల ఏమిటి ఉపయోగం? వినయం అని సుమతీశతకకారుడు చెప్పాడు. ఇతనెవడో బొత్తిగా సత్తెకాలపు మనిషి. ఉదాత్తత అలవడుతుంది. విజ్ఞానం పెరుగుతుంది. విజ్ఞానంవల్ల శ్రేయస్సు కలుగుతుంది. ఏమిటా శ్రేయస్సు?

రాబోయే సంవత్సరాలలో ప్రపంచ జనాభా ఊహించలేనంత విశ్వరూపం దాల్చబోతోంది. ఇప్పుడు మన జనాభా 700 కోట్లు అనుకుంటే–ఈ శతాబ్దం చివరికి 1000 కోట్లు. తక్కువ స్థలంలో ఎక్కువ ఆహారం ఎక్కువమందికి కావాలి. తక్కువ స్థలం ఎక్కువమందికి నివాసయోగ్యం కావాలి. ఎక్కువమంది తక్కువ సమయంలో ఉపాధిని సాధించగలగాలి. మనం ఈ భూమి వనర్లని 40 శాతం మాత్రమే వాడుకుంటున్నాం. మిగతా శాతాన్ని వినియోగించుకోగలగాలి. ఇంతమందికి ప్రాణవాయువు. నీరు, ఇంధనం–వీటన్నిటికీ పెట్టుబడి–విజ్ఞానం.

విద్యకి రెండు పార్శ్వాలు. వ్యక్తిగతమైన సంస్కారం. సమాజగతమైన శ్రేయస్సు. ఈ రెంటినీ శతాబ్దాల తరబడి విద్య ఇచ్చింది. ఇప్పుడు మనం సమాజ ధర్మాన్ని మార్చుకున్నాం. మార్పు వనర్లను దుర్వినియోగం చేస్తున్నదా? ఆరోజుల్లో త్సునామీలు లేవు. ఇంత పర్యావరణ కాలుష్యం లేదు. ధృవాలలో ఉష్ణోగ్రతలు పెరగలేదు. కారణం? మానవ ధర్మాన్ని ఒక నియతితో పాటిస్తున్నామా? ఈ ప్రశ్నకి పెట్టుబడి విద్య మాత్రమే కాదు. సంస్కారం. అంటే విద్య ద్వారా సంక్రమించవలసినది. ఇది చంక్రమణం. ఒక చెట్టుని నరికితే పూజ చెయ్యాలి. దానికి ప్రత్యామ్నాయాన్ని నిర్దేశించాలి. నువ్వు

చెయ్యకూడని పనిని చేస్తున్నానన్న స్పృహ కలగాలి. ఆ జ్ఞానాన్ని విద్య ఇస్తుంది. (ఇదివరకు విశ్వాసం ఇచ్చేది) చెట్టు నీకు ఆహారాన్ని ఇస్తుంది. ఔషధాన్ని ఇస్తుంది. బట్టనిస్తుంది. ఇంధనాన్ని ఇస్తుంది. వసతిని ఇస్తుంది. నీడని ఇస్తుంది. చెట్టు కల్పతరువు అని అందుకూ అన్నారు. ఇది కేవలం చిన్న ఉదాహరణ.

ఇప్పుడు రామశర్మ ఉద్యోగ ప్రసక్తిని తెచ్చాక–ఉద్యోగం అవసరమన్న విషయం అబ్బుకి అర్థమైంది. అబ్బు అటు త్ర్యంబకశాస్త్రికీ, రామశర్మ మధ్య సంధికాలంలో ఉన్నాడు. బ్రతకాలంటే ఆధారం అవసరం కదా?

"గోరఖ్‌పూర్‌లో తెలుగు పుస్తకాల ప్రూఫ్‌లు చూసే మనిషి రిటైరయ్యాడు. వారికి మనిషి కావాలి. మీరు అక్కడికి వెళ్ళనక్కర్లేదు. ఇదేం అర్జంటు పని కాదు. మనకి గేలీలు అక్కడినుంచి వస్తాయి. మీరు ప్రూఫులు చూసి, తప్పులుంటే సవరించి పంపడమే. నెలాఖరున చెక్కు వస్తుంది"

"నాకు ప్రూఫులు చూడడం రాదే!"

"దాన్ని చెప్పే మనిషి ఒకాయన ఉన్నాడు. ఆయనకిక్కడ ఓ ప్రెస్సు ఉంది. ఆయన పేరు అమావాస్యరాజు" ఆ పేరు విని ఆశ్చర్యంగా చూశారిద్దరూ. రామశర్మ నవ్వాడు.

"అవును. ఆయనకి పెద్దలు పేరు పెట్టలేదు. ఇది అన్వర్థ నామం"

ఆవిధంగా ఆలోచనలోనికైనా రాని ఒక నిర్దేశన అబ్బు శాస్త్రి జీవితంలో జరిగింది. వేదాన్ని, విధిని, దేవుడిని నమ్ముకున్న ఆ మిత్రులిద్దరూ ఇది దైవనిర్ణయం–అని సరిపెట్టుకున్నారు.

ఇప్పుడు అబ్బుశాస్త్రి మంత్రం పలకడం లేదు. నత్తి స్పష్టంగా తెలుస్తోంది. మానసిక వ్యవస్థ గజిబిజి కావడమే ఇందుకు కారణం. అయినా సర్వమంగళం ఏ సదస్యానికో, పండితపరిషత్తుకో వెళ్ళినప్పుడు అందరితోపాటు అబ్బునీ తీసుకువెళుతున్నాడు. అందరితోపాటు అతనికీ సంభాణని ఇప్పిస్తున్నాడు.

"ఇది అన్యాయం. ఈ సంభావనకి నాకు అర్హత లేదు" అని ఎదురు తిరిగాడు అబ్బు. సజావైన కారణానికి అర్హతని కోల్పోయిన వ్యక్తిలో శక్తి సన్నగిల్లడం లోపం కాదు. ఇది స్వయంకృతాపరాధం కాదు. నువ్వు మంత్రం చెప్పలేవని వాళ్ళకి చెప్తున్నాను" అన్నాడు సర్వమంగళం.

చయనులుగారి సకాలసంధ్యావందనం యథావిధిగా సాగుతోంది. కాని ఒకనాడు సూర్యోదయాత్పూర్వం కాలవగట్టుకి బయలుదేరిన చయనులుగారు ఎండ పొద్దెక్కినా

తిరిగిరాలేదు. తరవాణి అన్నం తిని పాతానికి చాపలు పరుచుకు కర్చున్నారు శిష్యులు. గురువుగారు వస్తారని ఎదురుచూస్తున్నారు. ఆరోజు తనతో వస్తానన్న శిష్యుడిని రానక్కర్లేదని ఆపేశారు చయనులుగారు. అందరూ బిక్కమొహంవేసి అనసూయమ్మకి మొరపెట్టుకున్నారు. ఆమె గుండెల్లో రాయి పడింది. ఈమధ్య చయనులుగారికి పరాకు ఎక్కువైంది. చెయ్యకూడని పనులు చేస్తున్నారు. అందరూ కలిసి కాలవగట్టుకి పరిగెత్తారు. అప్పటికే ఊళ్లో పదిమంది అక్కడ పోగై ఉన్నారు. అందరి మధ్యా చయనులుగారు స్పృహతప్పి పడి ఉన్నారు.

అర్ఘ్యం ఇవ్వడానికి నీటిలో దిగారట. ఎంతకీ కదలకపోయేసరికి అవతలి ఒడ్డున తాడు పేనుతున్న దాసరి కోటయ్య మొదట ఆశ్చర్యపడ్డాడు. తర్వాత భయపడ్డాడు. క్రమంగా చయనులుగారి శరీరం కొయ్యబారిపోయింది. కాలవలోకి దూకి ఒడ్డుకు తీసుకురాగలడు కాని ఆయన్ని ముట్టుకునే ధైర్యం యెయ్యలేకపోయాడు. ఊళ్లోకి పరుగున వచ్చి ఈత వచ్చే బ్రాహ్మణ కుర్రాళ్లని తీసుకువచ్చాడు. అంతా కలిసి చయనులుగారిని ఒడ్డుకు చేర్చారు.

అర్ఘ్యం ఇస్తూ అలాగే అపస్మారంలోకి వెళ్లిపోయారు చయనులుగారు. ఒడ్డుకు రావాలన్న స్పృహ పోయింది. క్రమంగా కాళ్లు సళ్లిచ్చాయి. కుర్రాళ్లు సమయానికి రాకపోతే క్రమంగా శరీరం నీటిలో క్రుంగిపోయేది. చేతులూ, కాళ్లూ బ్రాహ్మణ కుర్రాళ్లు మర్దన చెయ్యగా చయనులుగారు కళ్లిప్పారు. సూర్యుడు వెనుక కళ్లు మిరుమిట్లుగొలుపుతూండగా అనసూయ కనిపించింది. కాని ఆయన సోమిదేవమ్మనే చూస్తున్నారు.

“అమ్మీ! నీకు మళ్ళీ దేవుడు ప్రాణం పోస్తాడు. కట్టెను వెదుక్కోమన్నాడు” అన్నారు.

అపూర్వమైన బాంధవ్యాన్ని, అరవైయ్యేళ్లు పైగా పెంచుకున్న స్నేహబంధాన్ని తుంచేశాడన్న కోపంతో భగవంతుడితో నిశ్శబ్దపోరాటాన్ని సాగిస్తున్నారాయన. ఇది దేవుడి పట్ల righteous indignation–పవిత్రమైన ఉదాసీనత.

## 19

బొంబాయి కుందన్ బాగ్ అపార్టుమెంటులోంచి మాయమైన అమ్మాయి ఎక్కడికి వెళ్లింది? ఇంతకీ ఆ అమ్మాయి పేరేమిటి? ఆమెకోసం ఎక్కడ వెదకాలి? ఆమె ఆచూకీ తెలుసుకోడానికి సంవత్సరాల తర్వాత దొరికిన ఒక్క ఆధారానికీ అసంకల్పితంగా తెరపడింది. ఆ అమ్మాయికి స్నేహితులున్నారా? చేతిలో సమృద్ధిగా ఉబ్బు ఉందా? పోలీసులనుంచీ, చట్టంనుంచీ తప్పించుకునే శక్తి సామర్థ్యాలున్నాయా? ఆమె స్వభావం, చదువు, సంస్కారం, ఆలోచనాసరళి, సమీప సమాజం–ఇన్ని ఆచూకీలు తెలిస్తేకాని ఈ

ప్రశ్నలకు సమాధానం దొరకదు.

ఇటుతర్వాత–ఆమెకోసం అన్వేషణ చీకట్లోకి విసిరిన రాయి. ఒక వ్యక్తి–కేవలం guilt తో ఆమెకి జరిగిన అన్యాయానికి ప్రతిక్రియ చెయ్యాలనుకుంటున్నాడని ఆమెకి తెలీదు. అసలు అలాంటి మనిషి ఒకరున్నారని కూడా ఆమెకి తెలీదు! ఆమె అందుకు ఎదురుచూడడంలేదు. ఆమె ఎవరు? ఇన్నేళ్ల ఒంటరిజీవితం ఆమె వ్యక్తిత్వాన్ని ఎలా మలిచింది? ఇప్పుడేం చేస్తోంది? ఇవన్నీ సమాధానం దొరకని ప్రశ్నలు.

❖ ❖ ❖

భార్యాభర్తల దాంపత్య జీవితంలో కాలం కొన్ని సవరణలను చేస్తుంది. కొన్ని స్వభావాలను క్రోడీకరిస్తుంది. భర్తని ఆశ్రయించుకుని ఆరాధిస్తూ భార్య గడపాలన్న ఆర్ష ధర్మంలో తెలియకుండానే కొన్ని సమీకరణలు జరిగిపోయాయి. తనని అంటిపెట్టుకుని ఉండే భార్య చుట్టూ భర్త తెలియకుండానే తన జీవితాన్ని అల్లుకుంటాడు.

ఈ కొనసాగింపులో చిట్టచివరికి ఆమెకి parasite అయిపోతాడు. భార్య తానుగా, స్వేచ్ఛగా ఏర్పర్చుకున్న అనుబంధం భర్తతోడిది. ఆ అనుబంధాన్ని క్రమంగా అమ్మగా, అమ్మమ్మగా, నాన్నమ్మగా, అవ్వగా–విస్తరించుకుంటూ పోతుంది. అందులో భర్తపట్ల ప్రేమ పోనుపోను కేవలం–ఒక వాటా అయిపోతుంది. అతను వెళ్ళిపోయాక ఆ ప్రేమ విస్తరణ ఆమెకు వెసులుబాటుని ఇస్తుంది. ఒక ventilation. దాంపత్యజీవనంలో–ఆదశలో ఒక భాగం సడలిపోయినా–జీవనంలో ఎన్నో ప్రేమ వలయాలు ఆమె చుట్టూ పరిభ్రమిస్తూ ఉంటాయి. అది ఆమె రక్షణ. ఆ విస్తృతి ఆమెకి ఊరట. ఈ అదృష్టం–'సాధారణంగా'–భర్తకి లేదు. మరొక్కసారి–'సాధారణంగా'.

ఇందుకు ఎన్నో ఉదాహరణలు ఉన్నాయి. త్రిమూర్తులుగా భాసించే కర్ణాటక సంగీత వాగ్గేయకారులలో ఒకరైన శ్యామశాస్త్రికి భార్యా వియోగం సంభవించాక ఆయన కేవలం ఆరు రోజులే జీవించారు.

ప్రముఖ సినీ రచయిత, దర్శకుడు సముద్రాల రాఘవాచార్యులకు 1967లో భార్యా వియోగం సంభవించింది. ఆయన ప్రాణానికి ప్రాణంగా చూసుకునే రత్నవల్లీ తాయారు వెళ్లిపోయింది. సరిగ్గా 12 నెలల్లో ఆయనా భార్యని అనుసరించారు.

❖ ❖ ❖

ఉదయం కాలవలో స్నానం, సూర్యనమస్కారం నిలిచిపోయింది. చయనులుగారు నిత్యాగ్నిహోత్రాన్ని మానుకున్నారు. ఇది చయనులుగారి వంటి నిష్ఠాపరులకు

ప్రాయోపవేశం వంటిది. చయనులుగారి జీవితం గాడి తప్పింది. ఇది ఆయన విషయంలో జీవన్మరణం.

ఓ తెల్లవారుజామున ఆయన మంచంమీద కనిపించకపోతే అంతా కంగారుపడిపోయారు. శిష్యులంతా తలో దిక్కుకీ పరుగులుతీశారు. ఆయన బాలాత్రిపురసుందరీసమేత రాఘవేశ్వరస్వామి ఆలయం అరుగుమీద–మగతగా పడుకుని ఉన్నారు.

అనసూయ కాళ్లు పట్టుకు లేపింది. ఆమె కళ్ళు వర్షిస్తున్నాయి. కాని చయనులుగారి ముఖం ఆనందపరవశంతో వికసించి ఉంది. "బాబుగారూ!" అంది అనసూయ.

"ఇష్!" అని ముక్కున వేలు వేసుకుని ఆపారు. "ఇవాళ స్కంధ పంచమి. ఐదు నత్తాలు చేస్తానని అయ్యవారికి మొక్కుకుంది మీ అమ్మగారు. రాఘవేంద్రుడికీ, స్కంధుడికీ బాంధవ్యాన్ని పట్టుకున్న పుణ్యాత్మురాలు. విస్తళ్లు వెయ్యి. లోపల పూజ అయిపోతోంది. మంగళహారతి ఇవ్వగానే తీసుకువచ్చేస్తాను"

అనసూయకి దుఃఖం ఆగలేదు. రాత్రంతా నిద్రలేకుండా నీరసపడిన చయనులుగారిని ఊరి పెద్దలంతా ఊరేగింపులాగ ఇంటికి తీసుకొచ్చారు. ఆ ఉదయం ముక్కామల అంతా శోకసముద్రమైపోయింది.

అబ్బుశాస్త్రికీ, సర్వమంగళానికి కబురు వెళ్లింది. ఇద్దరూ పరుగున వచ్చారు. వస్తూనే తన మొదటి సంపాదనతో కొన్న కాశ్మీరు శాలువాని చయనులుగారి భుజం చుట్టూ కప్పాడు అబ్బుశాస్త్రి. అబ్బుని చూడగానే చయనులుగారి కళ్లు మెరిశాయి.

బుగ్గలు పుణికి నవ్వి– "ఉద్యోగం చేస్తున్నావా?" అని వెక్కిరించారు ఎంతో ఆప్యాయంగా. శాలువాని తడివి చూసుకుని పక్కకి చూసి "మరి అమ్మకేదీ?" అన్నారు.

చయనులుగారి ముఖం ఆర్ద్రత నుంచి, అనునయం నుంచి, ఆగ్రహం వరకూ ప్రయాణం చెయ్యడం ఆశ్చర్యంగా గమనించాడు అబ్బుశాస్త్రి.

"అమ్మని మరిచిపోయి నాకు కానుక తెచ్చావా? సగం శరీరాన్ని కాదంటే ఈ సగం శరీరానికి అర్థం లేదురా కుంకా!" అంటూ భుజంమీద ఉన్న శాలువాని ముక్కలుముక్కలుగా చించేశారు.

అందరూ నిరుత్తరులయ్యారు. అబ్బుశాస్త్రి తండ్రి కాళ్లమీద తల పెట్టి భోరుమన్నాడు. నిర్దాక్షిణ్యంగా చయనులుగారు కాళ్ళను వెనక్కు తీసుకున్నారు. ఆ ఉదాసీతన అంతరాత్మతో అభేదమైన భర్తది. తనది కాకుండా పోయిన ఇల్లాలి సమక్షాన్ని నష్టపోయిన ఉద్విగ్నతది.

❖ ❖ ❖

ధన్వంతరి మందులిచ్చాడు. అనుపానాలు చెప్పారు. "ఏకాకి అయిన మగాడిని ఒంటరితనం పెట్టే యాతనకి మందు లేదయ్యా. ధర్మ నిర్వహణకి భార్యాభర్తలు అభేదం. సోమిదేవమ్మగారితోనే ఆయనా వెళ్లిపోయారు. ఈ కట్టెకి ఈ వైద్యం పనిచెయ్యదు" అన్నారు ప్రభల చిట్టీలుగారు. ప్రతీ సాయంకాలం చీకటిపడేవేళకి కండువా తలమీద వేసుకుని గడప గడపకీ వెళ్లేవారు చయనులుగారు–

"మీ అమ్మ ఇక్కడికొచ్చిందా? దీపం పెట్టే వేళయింది" అంటూ.

ప్రతీ గుమ్మం కంటతడి పెట్టేది.

ఓ కార్తీక సోమవారం నక్షత్రం పొడిచే వేళకి దెందుకూరి నారాయణ దీక్షితులు అరుగుమీద కూర్చున్నారు. "నక్షత్రం పొడిచింది. మీ అత్తని రమ్మని చెప్పరా దీక్షితులూ. ఆకలేస్తోంది" అన్నారు, మెట్టుమీద కూర్చుని చయనులుగారు. చటుక్కున లేచి నిలబడ్డాడు దీక్షితులు.

ఉపవాసాలు, నత్తాలు, అపరాహ్న భోజనాలు సర్వసామాన్యమైపోయే జీవితాల్లో 'ఆకలి' అనే మాట 'ఎంగిలి'లాగ వినిపిస్తుంది–దాని గురించి ఎవరూ తలుచుకోరు కనుక. జరగాల్సిన తంతు, చివర పంక్తి భోజనం–అదే ధ్యాస.

ఆకలి కేవలం మనిషి అవసరానికి సంకేతం. వాటిని నరుక్కుంటూ పోయేదే బ్రాహ్మణ్యం. చయనులుగారు జీవితంలో బహుశా పసితనంలోనూ 'ఆకలి'ని తలుచుకుని ఉండరేమో! ఆయన జీవితాంతంలో పదవీచ్యుతికి అది నిదర్శనం.

ఆ తర్వాత ఆయన ఎక్కువ కాలం బతకలేదు. శ్రీరామచంద్రుని నక్షత్రం పునర్వసు. త్రయోదశినాడు–ఆనాడు మాస శివరాత్రి–కాలవగట్టుకి నడిచి వెళ్ళారు. తనతో అబ్బుని తీసుకువెళ్ళారు. ఇద్దరి మధ్యా మాటల్లేవు. అపర భీష్ములాయన. ఉత్తరాయణంకోసం ఎదురుచూశారు. "నీకోసం ఆగానురా. రా. ఇలా కూర్చో" అన్నారు అబ్బుతో. ఎప్పుడూ కోరి తన తలని అబ్బు ఒడిలో పెట్టుకోలేదు.

మహానారాయణోపనిషత్తులో మంత్రాన్ని చెప్తూ అబ్బుని తనతో గొంతు కలపమన్నారు. కృష్ణయజుర్వేదంలో ఆరణ్యకంలో ఆ మంత్రం అబ్బుకి గుర్తే.

"ఆపోవా ఇదగ్ సర్వం విశ్వా భూతాన్యాపః ప్రాణవా ఆపః" విచిత్రం.

ఆ క్షణంలో నత్తి అతనికి అడ్డుపడలేదు. కారణం–ఆ క్షణంలో అతను పితృ ఋణాన్ని తీర్చుకుంటున్నాడు. మంత్రం ఆఖరి పదాలకు రెండు గొంతులు కదలలేదు. ఒక గొంతే మిగిలింది. కారణం–చయనులుగారు శలవు తీసుకున్నారు–ధైర్యంగా, గర్వంగా, తృప్తిగా తన ఇల్లాలి దగ్గరికి.

# 20

పితృయజ్ఞాన్ని అత్యంత శ్రద్ధతో, నిష్ఠతో నిర్వహించాడు అబ్బుశాస్త్రి. నిర్వహింపజేశాడు సర్వమంగళం. నిర్వహణకు పూనుకున్నాడు రామశర్మ. చేయూతనిచ్చాడు అమావాస్య రాజు.

పన్నెండో రోజు ఊరంతా ఏకమై, పందిళ్ళు వేసి పండగ చేశారు. అమావాస్యరాజు పూనుకుని హయగ్రీవ స్తోత్రం, భీష్మకృత భగవత్ స్తుతి, శ్రీ శివాపరాధ క్షమాపణ స్తోత్రం, కనకధారా స్తోత్రం, భగవద్గీత కలిపి కాలికో బైండు చేయించి పారాయణ గ్రంథంగా అందరికీ పంచిపెట్టారు.

రామశర్మ వెంటరాగా అబ్బుశాస్త్రి, సర్వమంగళం కాశీ, ప్రయాగ, గయ వెళ్ళి పిండప్రదానాలు చేశాడు. గయలో ఔదంబర (మేడి) వృక్షం కింద జామపండు, పనసపొట్టు, కోపాన్ని వదులుకున్నాడు అబ్బు.

ఆత్మీయులైనవారు నిష్క్రమించినప్పుడు మనకు సంక్రమించే విధినిర్వహణలో 'సంయమనం' ప్రధాన పాత్ర వహిస్తుంది. పెరట్లో జామచెట్టుకు దోరగా పండిన పండు కనిపిస్తే సోమిదేవమ్మ కోసి కొంగున కట్టుకునేది. అబ్బుని ఒంటరిగా పిలిచి చేతిలో పెట్టేది. కొడుకు ఇష్టాన్ని తీర్చడానికి ఆమె చూపే అరుదైన పక్షపాతమిది. దాన్ని ఆరోజు గయలో వదులుకున్నాడు.

శిష్యులందరిలో పనసకాయ తరగడంలో అబ్బుకి నాలుగు మార్కులు ఎక్కువ పడేవి. వడ్డనలో మొదటి విస్తరి దగ్గర కూర్చున్న చయనులుగారు నవ్వి "ఈ పనసపొట్టు రుచికి ముఖ్యమైన వాటా అబ్బుది. వాడికో గరిటె ఎక్కువ వెయ్యి" అనేవారు. కాని ఆమె చేతిలో గరిటె బంతిలో కూర్చున్న ఏ కొడుకు పట్లా పక్షపాతం చూపేది కాదు. అది మనస్సులో కదిలి చయనులుగారు పంక్తిలో తనపట్ల చూపే పక్షపాతానికి ఆరోజు విడాకులిచ్చాడు.

శిష్యులందరినీ చుట్టూ కూర్చోపెట్టుకుని సోమిదేవమ్మ తరవాణి అన్నంలో పులుసు వడ్డించేటప్పుడు–

ఆఖరిముద్దకు అల్లరిచేసే శిష్యుడూ, కొడుకూ అబ్బు.

"పంక్తి బోజనంలో కొసర కూడదు. నీ కోపానికి అర్థం లేదు భడవా!" అంటూ గిన్నెలో ఆఖరిపురిషెడు పులుసు వాడి చేతిలో వేసేది. ఆరోజు గయలో తన కోపాన్ని వదులుకున్నాడు. తనని పెంచి వ్యక్తుడిని చేసిన తల్లిదండ్రుల ఋణం తీరిపోతుందా? కర్తవ్యనిర్వహణ విధి. జ్ఞాపకాలు పీటముళ్లు. జీవితాంతం ఉంటూనే ఉంటాయి.

వెంటాడుతూనే ఉంటాయి. ఈ లోకానికీ, మనుషులకీ లంకె కేవలం వ్యక్తులతోనే కాదు. ఇంటిముందు రోజూ వాలే కుంటి కాకి, ఇంటి వెనుక నిశ్శబ్దంగా గొడుగుపట్టే పునాస మామిడిచెట్టు, అనునిత్యం తనని పవిత్రంచేసే తుల్యభాగ, ప్రతి సూర్యోదయం, కర్మ తనని కట్టిపడేస్తూండగా అనునిత్యం దారం ఉండనుంచి విడివడే దారంలాగ–విడిపోయే కాలమూ–ఇవన్నీ లంకెలే.

అపూర్వమైన, అతి తియ్యని, వదులుకోలేని అతి క్రూరమైన లంకెలు. కట్టుబడితే జడభరతుడి లేడిపిల్లలాగ వచ్చేజన్మకు వెంటాడి తోసుకువచ్చే లంకెలు. అబ్బుశాస్త్రి బాంధవ్యాల నుంచి ఋణవిముక్తుడయ్యాడు. ఋణం తీర్చుకున్న కారణానికే విముక్తికి బందీ అయ్యాడు.

❖ ❖ ❖

వీలైనప్పుడల్లా రామశాస్త్రి దూరాలోచనల్లోకి దూరడం, తన అన్వయానికి అందని ఆలోచనకి మనస్ఫూర్తిగా నవ్వుకోవడం సర్వమంగళానికి అలవాటైన చర్య.

ఎప్పుడైనా కదిపినప్పుడు "మీకు నా మాటలమీద అంత నమ్మకం కలగదు కదూ?" అంటాడు రామశర్మ.

సర్వమంగళం నవ్వుతాడు. "మనిద్దరం రెండు ధృవాల్లో ఉన్నాం. అనూచానంగా వస్తున్న శ్రుతిని యథాతథంగా అనుసరించే సంప్రదాయానికి నేను బద్ధుడిని. దానికి కారణాన్ని వెదికే కొత్త తరానికి ప్రతినిధి మీరు. మేము మా ప్రయాణంలో మార్గసూచి (compass)ని పారేసుకున్నాం. అయితే మేం ప్రయాణిస్తున్న మార్గం సరైనదేనని మీరు నిరూపించినప్పుడల్లా నాలాంటివారికి కొండంత బలం వస్తుంది. అయితే అప్పుడప్పుడు మీ మాటలు విన్నప్పుడు నవ్వొస్తుంది కాని నవ్వబోయేలోగానే మీరు వెదికే 'హేతువు' నన్ను ఆశ్చర్యపరుస్తుంది. సంతోషించే విషయం ఏమిటంటే ఈ సంప్రదాయాన్ని వస్తుతః మీరూ అభిమానిస్తున్నారు. అంగీకరిస్తున్నారు. అనుసరిస్తున్నారు. ఆచరించాలంటున్నారు. మరొకపక్క అందుకు కారణాలు వెదుకుతున్నారు. అంతే తేడా"

రామశాస్త్రి నవ్వాడు. "మీరు గడుసుగా చెప్పారు. కుండ బద్దలుకొట్టాలంటే–మీకు నా పట్ల సానుభూతి ఉంది. "అయ్యో పాపం, ఎందుకీ శ్రమ?" అన్న చిన్న జాలి ఉంది. పరవాలేదు. ఆ సానుభూతి–నా దారిని మీరు అర్థంచేసుకునేటట్టు చెయ్యడానికి నిలవనీడని ఇస్తుంది. చేతులు శుభ్రంచేసుకోడానికి మా ముత్తవ్వ చేతిలో సున్నిపిండి వేసేది. మా నాన్న లైఫ్‌బాయ్ సబ్బు ఇచ్చేవాడు. ఇప్పుడు 'జెల్' వాడుతున్నారు. సాధన లక్ష్యం ఒకటే. ఉద్దేశం ఒకటే. ఈ మూడింటికీ పొంతన ఉంది. కాలగతిలో శాస్త్రీయమైన కొత్త

సాధనం పాతదాన్ని అటకెక్కించింది" బాగా ఆలోచనల్లో కూరుకుపోయినకొద్దీ రామశర్మ సిగరెట్లు ఎక్కువ కాలుస్తాడు.

"ధర్మాన్ని, దేవుడినీ, ఆచరణనీ దైనందిన ప్రయోజనాల్నీ పడుగు పేకల్లాగ అల్లుకుంటూపోయిన సంస్కృతి మనది. బహుశా దేవుడు, సామాజిక విలువలు, మనిషి నైతిక జీవనం–ఈ మూడింటినీ ఇంత అద్భుతంగా–విడదీయలేనంత పకడ్బందీగా అల్లిన మరొక సంస్కృతి లేదు. లేదు. లేదు. అందుకే ఈ సంస్కృతిని అణగదొక్కే ఎన్ని మతాలు మనమీద పడినా ఏమీ చేయలేకపోతున్నాయి. మన ఋషులు చేసిన పనిలో 10వ శాతం చేసినా ఏ మతమైనా కొన్ని దశాబ్దాలు తేలికగా, బేషరతుగా బతకగలదు. Because this is scientifically integrated admixture of better living with the best muse called GOD. మనిషి జీవన విధానాన్ని ఒక చక్కని ధోరణిలో నిర్దేశించడానికి శతాబ్దాల కిందే మన పెద్దలు రకరకాల museని ఛేధించడానికి వీలులేనంత బలంగా అల్లారు. ఇందులో సమాజహితం ప్రధాన లక్ష్యం. మరి అల్లికకి అర్థం లేదా? అల్లిక కేవలం ఆలోచనకు బలాన్ని ఇవ్వడమే లక్ష్యం. పువ్వుల్ని గుచ్చే దారానికి ఒకటే లక్ష్యం. వాటిని సమీకరించి అందంగా మాలని చెయ్యడం. కొందరు దారాన్ని పట్టుకుని–నాలిక చప్పరించి అసలు ప్రయోజనాన్ని గాలికి వదిలేశారు. ఆలోచనాస్రవంతి–విశ్వాసానికి మెరుగులు దిద్దే కల్పనల చాకచక్యం–ఈ ముసుగుకి కారణం. మన దేశంలోనే ఎందరో మేధావులు, రచయితలు–చెలం, కొడవటిగంటి, త్రిపురనేని గోపీచంద్, జ్యేష్ట వంటివారు కొత్త దారుల్లో ప్రయాణంచేసి, మళ్లీ పదిమందీ నడిచిన దారికి మళ్లారు"

"ఉదాహరణకి–మొన్న పెద్దాయన–చయనులుగారు–కాశీ మరణాన్ముక్తిః అథవా పుత్ర సన్నిధౌ–అంటూ అబ్బు శాస్త్రి ఒడిలో తల ఉంచుకు వెళ్లిపోయారు. "అపుత్రయ్య గతిర్నాస్తి" అని పెద్దలు అన్నారు. ఈ నానుడిని అర్థం చేసుకునేముందు మొదట దేవుడిని ఆట ఎక్కించేద్దాం. పుణ్యం, పున్నామ నరకం పక్కన పెడదాం. ఈ మాటలు అంటున్నప్పుడు నేను నాస్తికుడ్ని కాను–అని మీరు గుర్తించుకోవాలి. సమాజంలో ఓ మనిషి కన్ను మూయగానే ప్రేతానికి అంత్య సంస్కారం జరగకపోతే అనర్థం. ఎవరికి? బతికున్న సమాజానికి. ఇప్పటికీ ఆ వీధిలో ఎవరైనా పోతే శవాన్ని తీసేవరకూ ఎవరూ అన్నపానాదులను ముట్టరు. మర్యాద, ధర్మం వదిలేస్తే–అది ఆ చుట్టుపక్కల సమాజం తమ శ్రేయస్సుకి ఇప్పటికీ తీసుకునే చర్య. ఎంత ఆస్తి, ఎంత వైభవం ఉన్నా–తను పోయాక–తన చుట్టుపక్కల వాతావరణానికి కాలుష్యం కాగలిగిన ప్రేత సంస్కారాన్ని తాను చేసుకోలేడు. ఇది సాంఘిక బాధ్యత. మరి ఈ పనిని ఎవరు చేస్తారు? ఎవరు

చెయ్యాలి? పురుషాధిక్యత గల ఆనాటి సమాజంలో తన కడుపున పుట్టిన కొడుకు చెయ్యగలడు. చెయ్యాలి. చెయ్యడంవల్ల–ఇప్పుడూ ముడులు–అతనికి పున్నామ నరకం నుంచి విముక్తి. పితృ యజ్ఞం, యోగం–ఇవన్నీ ముడులు. ఒక పేటలో శవం ఉండరాదు. దానికి ఆరోగ్యకరమైన, హుందాగా సంస్కారాన్ని జరిపే బాధ్యత కొడుకుది. కొడుకు లేకపోతే? పెద్ద కూతురు పెద్ద కొడుకుది. అతనూ లేకపోతే? అల్లుడిది. అతనూ లేకపోతే? కూతురుది. ఆమె లేకపోతే? సమాజానిది. లేకపోతే శవం ఆ ప్రాంతానికి అనర్థం. కాలుష్యం. అంతేకాదు. గొప్పగా లేదా ప్రశాంతంగా బతికిన ఓ మనిషి ప్రేత సంస్కారం సామాజిక బాధ్యత. పున్నామ నరకం–చీమూ, నెత్తురూ ఉన్న నదిలో జీవుడి ప్రయాణం–నా దృష్టిలో పెద్ద 'అల్లిక' అంటాను. ప్రముఖ రచయిత, విమర్శకులు శ్రీపాద గోపాలకృష్ణమూర్తిగారు కన్నుమూస్తే ఆయన పార్థివదేహానికి జిల్లెలమూడి అమ్మ సమక్షంలో ఆయన ఒకే ఒక్క కుమార్తె శ్రీమతి గాయత్రి అంత్యక్రియలు జరిపారు. విశాఖలో ఎన్నో అనాథ ప్రేతాలకు ప్రేమ సమాజం ఆ పనిని నిర్వహిస్తుంది. కాశీలో ఎవరైనా కన్నుమూస్తే–ఎవరైనా–అది తమ ధర్మంగా భావించి–ఆ శవాన్ని హరిశ్చంద్ర ఘాట్‌కి చేరుస్తారు. అది తమ అదృష్టంగా, అవకాశంగా భావిస్తారు. కారణం–అక్కడ పోయిన ప్రతీ వ్యక్తీ కైలాసానికి పోతాడని వారు నమ్ముతున్నారు కనుక. ఒక 'నమ్మకానికి' ఇంత అద్భుతమైన సామాజిక ప్రయోజనాన్ని కల్పించిన సందర్భం మరెక్కడా కనిపించదు. కాశీలో చావు ఎందుకు అభిలషణీయమో చెప్పడానికి ఈ ఒక్క ఉదాహరణ చాలు. చచ్చిపోయాక ప్రేతానికి జరగవలసిన, అత్యవసరమైన సంస్కారాన్ని, సమాజ బాధ్యతని (న్యాయంగా దీనికీ దేవుడికీ సంబంధం లేదు–కనీసం ఇంతవరకూ) చాలా బలంగా, హెచ్చరికగా మన విశ్వాసాలతో బిగించారు పెద్దలు.

"ఇంత తేలికైన కారణం కాదయ్యా–దీని వెనుక ఋషులు, శాస్త్రాలూ, పురాణాలూ, పూర్వజన్మలూ, పున్నామ నరకాలూ ఉన్నాయంటే–అంటారు నాకు తెలుసు–ఏమైనా ప్రాథమికమైన సామాజిక బాధ్యతని, విధాయకం చేసిన evolved మతంగా హిందూ మతంలో నేనూ ఒక భాగమైనందుకు గర్వపడాలనిపిస్తుంది. మన దారిలోనే ఉన్నాడు కదా? వాడి పిచ్చి వాడిని అనుభవించనీ–అని నన్ను క్షమించేవారూ ఉంటారు–మీతో సహా" అని నవ్వాడు రామశాస్త్రి.

కాని సర్వమంగళం అలా క్షమించలేదు. కాని శాస్త్రానికీ, వాస్తవానికీ చిన్న పొంతన చూచాయగా కనిపించింది.

❖ ❖ ❖

శ్రీరాములునాయుడు కారు యాక్సిడెంటు చేయడానికి ఆనాడు చిన జగ్గుబాబు నుంచి బయానా పుచ్చుకున్న పొన్నుసామి సగం సగం పనిచేసి యాక్సిడెంటు అబ్బుశాస్త్రి ఖాతాలో పడడానికి కారణమయ్యాడు. అయితే తను చెయ్యాలనుకున్న నేరం తన చెయ్యి దాటిపోయిందని తెలియగానే హాయిగా ఊపిరి పీల్చుకున్నాడు చిన జగ్గుబాబు. అతను కారు యాక్సిడెంటు చెయ్యడానికి పూనుకున్నాడని బయటపెట్టే అవకాశం లేకపోయింది సామికి. కారణం–అనుకోకుండా జరిగిపోయిన యాక్సిడెంటులో ఇద్దరి దుర్మరణం. చిన జగ్గుబాబు ఇరుక్కోవడం మాట అటుంచి ఈ నేరంలో తన వాటా బయటపడితే ముందు తను అరెస్టు అవుతాడు. చిన జగ్గుబాబు అనుయాయుడు వ్యాఘ్రేశ్వరుడు సామితో ముందు ఏర్పర్చుకున్న ఒప్పందం ప్రకారం రెండో విడత పైకాన్ని నొక్కేసి–నోరెత్తితే జైలుకెళ్తావని బెదిరించి ఆ కథకి శాశ్వతంగా తెర దించాడు.

సామి తాగుడు, విచ్చలవిడి జీవితం క్రమంగా అతని ఆరోగ్యాన్ని బలితీసుకుంది. ఆ దురదృష్టానికి మొదటి ఫలితాన్ని అనుభవించింది భార్య కుప్పమ్మ. సామికి ఇద్దరు పిల్లలు. సామి ఆరోగ్యం చెడి, ఆదాయం తగ్గి, ఏ పనీ చెయ్యలేక మంచంపట్టిన రోజుల్లో కుప్పమ్మ తప్పనిసరిగా ఊడ్పులకు వెళ్ళి ఏ కాస్తో తెచ్చి కుటుంబాన్ని సాకేది. పిల్లలు పెద్దవాళ్లయ్యారు. చదువుల ఖర్చు మీద పడింది. సామి ఆరోగ్యం పూర్తిగా దెబ్బతింది. కొడుకు కాలేజీ చదువుకి డబ్బు కావాలి. మాటల మధ్యలో–"ఆనాడు కారు యాక్సిడెంటు తాము అనుకున్నట్టు సరిగ్గా అయి–అక్కడ ఆగివుంటే మరో ఐదు వేలు కిట్టేవి. ఆ దగుల్బాజీ వ్యాఘ్రేశ్వరరావు ఎగ్గొట్టాడు" అన్నాడు సామి.

నిజానికి చిన జగ్గుబాబు ఎగ్గొట్టలేదు. ఆయన ఖాతాలో పూర్తి డబ్బు జమ అయిపోయింది. కాని మధ్యవర్తి జేబులోకి వెళ్లిపోయింది.

కుప్పమ్మ తుళ్లిపడింది. "ఎవరు?"

"ఇంకెవరు? ఇవ్వాల్సింది నాలుగో ఆయన కొడుకు చిన జగ్గుబాబు. కాని..." కుప్పమ్మ చివ్వున లేచి నిలబడింది. చిన్నప్పట్నుంచీ కుప్పమ్మది దిక్కుమాలిన లిటిగేషన్ బుర్ర. సామి చిన జగ్గుబాబు పేరొక్కటే చెప్పిఉంటే ఇలా 'చివ్వున' లేచేది కాదు. నాలుగో ఆయన పేరు ఆమెకి ఎక్కడలేని ఉత్సాహాన్ని ఇచ్చింది. ఆ చుట్టుపక్కల ఊళ్లల్లో నాలుగో ఆయనకి గొప్ప పేరుంది–ధర్మప్రభువని. దైవభక్తుడిగా, తన పనివారిని ఆదుకునే యజమానిగా, పాపభీతి గల మంచి మనిషిగా–చుట్టుపక్కల ఎవరికి ఏ అవసరం వచ్చినా ఆదుకునే పెద్దదిక్కుగా ఆయన్ని చెప్పుకుంటారు.

సామికి కూడా చెప్పకుండా ఉన్న బట్టల్లో శుభ్రంగా ఉన్న నేతచీరె చుట్టుకుని, రూపాయంత బొట్టు పెట్టుకుని నాలుగో ఆయన దగ్గరికి బయలుదేరింది. ఆయన చుట్టూ

ఎప్పుడూ మనుషులుంటారు. ఎవరూ లేనప్పుడు అనంగాచారిని పిలిపించుకుని భాగవతం చెప్పించుకుంటారు నాలుగో ఆయన. వీళ్లెవరూ లేని సమయంలో ఆయన ముందు నిలవాలి. ఐదు రోజులు పట్టింది ఆ అవకాశానికి. సాయంకాలం గడిచి మసకచీకటి అలుముకుంటోంది. వసారా స్తంభం దగ్గర నిలబడిన కుప్పమ్మని సరిగ్గా గుర్తుపట్టలేకపోయాడు నాలుగో ఆయన. "ఎవరూ?"

"నన్ను తమకు తెలీదు బాబూ. తమ ముందుకు నేనెప్పుడూ రాలేదు. వచ్చే ధైర్యం లేదు. కాని ఒకప్పుడు మన కంపెనీలో చాలా ఏళ్ల కిందట పనిచేసిన పొన్నుసామి పెళ్లాన్ని"

నిజానికి పొన్నుసామి నాలుగో ఆయనకి గుర్తురాలేదు.

"ఏం ఇలా వచ్చావు?" అప్పుడు ఆయన కాళ్లదగ్గర పడిపోయింది. అసలు భాగోతం విప్పింది. అలనాడు శ్రీరాములనాయుడు కారుని యాక్సిడెంటుచేసే ప్రయత్నం తన కొడుకు చేశాడని వినగానే పాము కాటేసినట్టు తుళ్లిపడ్డాడు నాలుగో ఆయన.

ఇన్నాళ్లూ మాటల్లో చెప్పకపోయినా, మనస్సులో ఉన్న అనుమానం నిజమేనన్నమాట! మరింత దగ్గరగా జరగమన్నారు కుప్పమ్మని.

కుప్పమ్మకి ఎక్కడలేని ధైర్యం వచ్చింది. నిజానికి ఆ కుట్రకీ నాలుగో ఆయనకీ ఏమీ సంబంధం లేదు. రెండో విడతగా ఇచ్చిన డబ్బు పొన్నుసామికి చేరకపోవడానికీ నాలుగో ఆయనకి ఏమీ సంబంధం లేదు. కాని నాలుగో ఆయన కుట్ర జరిపిన పెద్దమనిషి తండ్రి. ఏనాడైనా ఆ నేరం బయటపడితే తమ పరువు పోతుందని, కొడుకు జైలుకి వెళ్ళక తప్పదన్న భయమే ఈ రాయబారానికి పెట్టుబడి. అన్నిటికీమించి నాలుగో ఆయన పెద్దమనిషి. తండ్రి. పాపభీతి గల పిరికివాడు.

పది నిముషాల్లో పదివేల రూపాయల కట్ట కుప్పమ్మ చేతుల్లోకి వచ్చింది. ఇంటిదగ్గర మంచంపట్టిన భర్తమీద చాలా సంవత్సరాల తర్వాత కృతజ్ఞతాభావం కలిగింది కుప్పమ్మకి. ఆ రూపాయలకట్ట నిండా కొడుకు చదువు పరుచుకుని కనిపించింది. నాలుగో ఆయన రెండు కాళ్లమీదా తల మోపి దండం పెట్టింది.

"ఈ మాట ఎవరికీ చెప్పకు. కుర్రాడి చదువు నేను చూసుకుంటాను. మళ్లీ అవసరమైతే వచ్చి కనిపించు" అన్నారు నాలుగో ఆయన. రహస్యాన్ని దాచాలన్న దుర్మార్గపు సాకుతో కాదు–నిజమైన ఔదార్యంతోనే. కుప్పమ్మ మాయమైంది.

❖ ❖ ❖

రాత్రి–అంతా నిద్రపోయాక కొడుకుని గదిలోకి పిలిచారు నాలుగో ఆయన. భార్య తంబళ్లమ్మ ఆయన కాళ్లని మర్దనా చేస్తోంది.

ఎప్పుడూ ఆ సమయంలో తండ్రి పిలిచింది లేదు. చిన జగ్గుబాబు ఆశ్చర్యపడుతూనే తండ్రి గదిలోకి అడుగుపెట్టాడు. నాలుగో ఆయన కళ్లు మూసుకుని వాలుకుర్చీలో కూర్చునే ఉన్నారు. "ఆ తలుపేసి రా" అన్నారు కొడుకుని చూడకుండానే. ఇంకా ఆశ్చర్యపడ్డాడు చిన జగ్గుబాబు. వేసి వచ్చాడు. నాలుగో ఆయన అంత భారీ శరీరాన్ని, బుడ్డనీ ఎత్తుకుని కుర్చీలోంచి లేచి చేతికున్న బంగారు కంకణం చెంపని ఒరుసుకునేలాగ పెడీల్మని కొట్టాడు కొడుకుని. గింగుర్లు తిరిగుతూ చిన జగ్గుబాబు శరీరం గాలిలోకి లేచి తలుపుకు కొట్టుకు పడిపోయింది. తంబళ్లమ్మ గావుకేకపెట్టింది. ఇల్లంతా ఆ శబ్దానికి ప్రతిధ్వనించింది. చిన జగ్గుబాబు భార్య, పనివాళ్లు అందరూ గది బయటికి చేరారు. కాని ఎవరికీ తలుపుని ముట్టుకునే ధైర్యంకాని, తెరిచే ధైర్యంకాని లేకపోయింది. చిన జగ్గుబాబు పెదవులు చిట్లి రక్తం జివ్వుమంది. రెండు పళ్లు పునాదుల్లో కదిలాయి.

"70 ఏళ్ళు కష్టపడి సంపాదించుకున్నానురా పుణ్యాన్ని. వంద సంవత్సరాలు నిలిచే మంచిపేరుకి లక్షల పెట్టుబడి పెట్టాను. నాది కాని పాపానికి ప్రాయశ్చిత్తం చేసుకోలేకపోయానని పాతికేళ్లుగా కుమిలిపోతున్నాను. మనకి అన్నం పెట్టిన ఆ పుణ్యాత్ముడి కుటుంబాన్ని మట్టుబెట్టాలనుకున్నావురా కంతిరీనాకొడుకా!" కొట్టిన చేతిని బంగారు కంకణం అదిమి రక్తం చిమ్మింది.

"చేసుకున్న పాపాన్ని అనుభవించడానికి మరో జన్మ అక్కర్లేదురా. ఈ జన్మలోనే కట్టికుడుపుతుంది. నిక్షేపంలాంటి కుటుంబాన్ని నాశనం చెయ్యాలని పూనుకున్నావు. నీ పక్కనే ఉన్న తల్లిని చూడు. దానికి కుష్టురోగం వచ్చి ఐదేళ్లయింది. కొడుకు పాపం తల్లిని చుట్టుకుంటుంది. తండ్రి పాపం మనుమడిని నాశనం చేస్తుంది. ఇది దేవుడి శాపం కాదురా దగుల్బాజీ. మనకి మనం చేసుకున్న పాపం" అంటూ కుర్చీలో కూలబడి పసిపిల్లాడిలాగ భోరుమన్నాడు. నాలుగో ఆయన కళ్లు నీళ్లతో, జగ్గు బాబు పెదాలూ, నాలుగో ఆయన చెయ్యీ రక్తంతో తడిసి ముద్దయ్యాయి.

## 21

పాలు మాగిపోయిన వాసన ఇల్లంతా గుప్పుమంది. బయట అరుగుమీద పడుకున్న అబ్బు తుళ్లిపడి లేచాడు. చయనులుగారి సంవత్సరీకాలు అయిపోయాక సర్వమంగళం బలవంతంగా అబ్బుని పట్నం తీసుకొచ్చేశాడు. కారణం– అక్కడ అమ్మా నాన్నా లేరు.

గురువు లేరు. ఆ జ్ఞాపకాలు మరింత కృంగదీస్తాయి. స్తబ్ద జీవితాన్ని దశాబ్దాలు గడిపినవాడు అబ్బుశాస్త్రి. ఇప్పుడు చయనులుగారిల్లు పాఠశాల అయింది.

భార్యతో ఉన్న శిష్యుడు పుల్లి యజ్ఞేశ్వరశర్మ–ఆ ఇంటిని గురుకులం చేసుకున్నాడు.

ఊరిలో విద్యకీ, పట్నంలో తన లక్ష్యసాధనకీ గండిపడింది అబ్బుకి. ఆరోజు దూరంగా పరిగెత్తిపోయిన అమ్మాయి పేరేమిటో, ఎక్కడ ఉంటుందో, ఎలా వెదకాలో దారీతెన్నూ తెలీదు. కాగా బొంబాయి మరో ప్రపంచం. పేరూ, ఊరూ తెలీని మనిషిని అంత మహానగరంలో ఎలా పట్టుకోవడం? భవిష్యత్తు దారులన్నీ మూసుకుపోగా నిర్విణ్ణుడై సర్వమంగళం పంచన చేరాడు. రోజులు నిరర్థకంగా, దిశారహితంగా, నిస్తేజంగా సాగుతున్నాయి. ఉదయాన్నే నదీస్నానం, రామశర్మతో చర్చలూ, కొవ్వూరు అడపాతడపా వెళ్లి అమావాస్య రాజుగారి గీతా ప్రెస్సుపని, అనసూయ చేతి ప్రసాదం సేవింపూ– సాయంకాలాల్లో రామశర్మతో గోదావరి వంతెనమీద విహారాలు. సగంలో ఆగిపోయిన ఆ కాస్త విద్యార్థితనీ తోసుకువచ్చిన నత్తి కొల్లగొట్టింది. రామశర్మ ధర్మమాఅని అమావాస్య రాజు ఉదారంగా చేసిన పనికి డబ్బు ముట్టచెప్తున్నాడు. దాన్ని ఏం చేసుకోను? డబ్బు అవసరం ఎప్పుడు. ఎలా కలుగుతుందో ఎవరు చెప్పగలరు? బ్యాంకులో అకౌంటు తెరిపించాడు రామశర్మ. రెండు రోజులు కూర్చోపెట్టి సంతకం చేయడాన్ని నేర్పించాడు. వేదపండితుడు కావలసిన మనిషి ప్రెస్సులో గుమాస్తా అయ్యాడు. వేదపరిషత్తుల్లో సంభావనలు గ్రహించి, ఆశీర్వదించవలసిన మనిషి ఉద్యోగంచేసి అక్కర్లేని డబ్బుని కూడబెట్టుకుంటున్నాడు. తన పోషణకి సర్వమంగళానికి డబ్బు ఇస్తానన్నాడు అబ్బు. సర్వమంగళం నవ్వి అనసూయని పిలిచాడు.

"అబ్బుకి సమాధానం నువ్వు చెప్తావా నన్ను చెప్పమన్నావా?" అనడిగాడు. అనసూయ నవ్వింది.

"ఆయన నాకు పుట్టించినుంచి వచ్చిన అరణం. పెద్దదిక్కు. అపురూపంగా నేను సంపాదించుకున్న పెద్దదిక్కు" అంటూ అబ్బుశాస్త్రివేపు తిరిగి "మీరు ఇవ్వాల్సింది చాలా ఉంది. ఇంత సులువుగా తప్పించుకోకండి" అంది నవ్వుతూ.

సర్వమంగళం భార్యని చూసి గర్వపడ్డాడు. అబ్బుశాస్త్రి ఇద్దరినీ చూసి ఆర్ద్రతతో కరిగి ముద్దయ్యాడు.

❖ ❖ ❖

ఇప్పుడు–

పాలు మాగి మీగడ కాలుతున్న వాసన ఇల్లంతా గుప్పుమంది. బయట అరుగుమీద మేనువాల్చిన అబ్బు తుళ్లిపడి లేచాడు. వంటగదిలో కట్టెలపొయ్యి మండుతోంది. దానిమీద ఉంచిన పాలగిన్నెలో పాలు మరిగి, పొంగి, మాగి, కాలి, మసిఅయ్యి సన్నని రేకులు గాలిలోకి ఎగురుతున్నాయి. చెట్టంత మనిషి–అనసూయ గదికి అడ్డంగా స్పృహతప్పి పడిపోయి ఉంది.

"అమ్మా!" అని గావుకేకపెట్టాడు.

సర్వమంగళం కాటవరంలో మాస శివరాత్రికి రుద్రాభిషేకం చేయించడానికి తెల్లారకముందే వెళ్లిపోయాడు.

అనసూయమ్మ ఊపిరి ఆడుతోంది. కాళ్లూ, చేతులూ చల్లబడ్డాయి. ఏం చెయ్యాలో తోచక, ఎవరైనా సాయం చేయడానికి కనిపిస్తారా అని అటూ ఇటూ–ఇంట్లోకి బయటకీ పరుగులుతీశాడు. ఎవరూ కనిపించలేదు. అనసూయమ్మని ఉన్నపాటునీ చేతుల్లోకి ఎత్తుకుని మంచంమీదకి తీసుకొచ్చి పడుకోబెట్టాడు. ఎర్రగా కాలిన స్టీలుగిన్నెని కిందకి దించి, పొయ్యి ఆర్పి పరుగున వచ్చాడు. అనసూయకి స్పృహ లేదు. చేతిలోకి ఆముదాన్ని తీసుకుని నేలమీద కూర్చుని ఆమె అరికాళ్ళు మర్దనా చేశాడు అబ్బుశాస్త్రి–వస్తున్న దుఃఖాన్ని ఆపుకుంటూ.

అనసూయ నవనవలాడే మావిచిగురు. తేలికైన శరీరం. కాలికి రాసుకున్న పసుపు చేతులకు వ్యాపించింది. ఆమె ముఖంమీద పట్టిన చెమటబిందువులు క్రమంగా ఆమె శరీరంలో వేడి పెరుగుతోందని సూచించాయి. అలా ఎంతసేపు చేతులూ, కాళ్ళూ మర్దనాచేస్తూ కూర్చున్నాడో అబ్బుశాస్త్రికే తెలీదు. రేవుకి రాని అబ్బుని తలుచుకుని, రానందుకు ఆశ్చర్యపడి కాస్త పొద్దెక్కుతూండగా రామశర్మ ఇంటికి వచ్చాడు. నట్టింట్లో అచేతనంగా మంచంమీదనున్న అనసూయ, కాళ్లు మర్దనాచేస్తున్న అబ్బుశాస్త్రిని చూసి నిర్ఘాంతపోయాడు.

నిస్సహాయత కూడా ఒక్కొక్కప్పుడు విచిత్రమైన ధైర్యాన్నిస్తుంది. తెలియకుండానే కార్యోన్ముఖుల్ని చేస్తుంది. అది నిజానికి శక్తి కాదు. నిస్సహాయత పూరించిన సంకల్పబలం. ఘోరమైన విపత్తులో ఒక్క వ్యక్తిని కర్తవ్యం దక్షతతో నిలుపుతుంది. ఇది శరీరానికీ, ఆలోచనకీ అందని ఏదో అపూర్వమైన సంకల్పబలం. ఆ పని జరిగిందన్న మరుక్షణం–అంతవరకూ అతన్ని నిలిపిన బలం ఒక్కసారి లుప్తమైపోతుంది. ఎలా వచ్చిందో అలాగే మాయమైపోతుంది. ఇది సృష్టి వైచిత్రి. దేశపు పొలిమేరల్లో గాయపడిన సోదర సైనికుడిని ఫర్లాంగుల దూరం మోసుకువచ్చి క్షేమంగా స్థావరానికి చేర్చిన తర్వాత

కూలి కన్ను మూసిన సైనికుల కథలు కోకొల్లలు. అంతవరకూ అనసూయమ్మకి ప్రథమ చికిత్సని అందిస్తున్న అబ్బుశాస్త్రి రామశర్మ చూడగానే ఒక్కసారి భోరుమన్నాడు. భోరుమంటూనే అలాగే నేలమీద కూలిపోయి స్పృహ తప్పిపోయాడు అబ్బుశాస్త్రి. ఇప్పుడు రామశర్మ కళ్లముందు స్పృహలో లేని రెండు శరీరాలు. రామశర్మ వాళ్లని చూడలేదు. ఊళ్లోకి పరుగుపరుగున వెళ్లి డాక్టర్ని పిలుచుకొచ్చాడు. మనిషినిచ్చి అమావాస్య రాజుకి కబురు పంపించాడు.

ఏకాదశ రుద్రాన్ని చేయించి నమకాన్ని, చమకాన్ని పారాయణచేసి యజమాని అభీష్టాన్ని తీర్చమని పరమేశ్వరుడిని మనసారా వేడుకుని, సేవించి చీకటిపడే వేళకి ఇంటికి వచ్చాడు సర్వమంగళం. పొరుగింటివారు జరిగింది చెప్పి ఆసుపత్రి అడ్రసు ఇచ్చారు. సర్వమంగళం పెదాలు మరోసారి చమకాన్ని పారాయణ చేస్తున్నాయి. రిక్షా ఎక్కాడు. "నాకున్న రెండు కళ్లనీ దూరం చేస్తావా స్వామీ" అనుకుంటూ ఆసుపత్రి ముందు దిగాడు.

ఆశ్చర్యంగా అమావాస్యరాజు, రామశర్మ నవ్వుతూ ఆసుపత్రి వరండాలో కనిపించారు. అదేమిటి? తాను విన్నది నిజమే అయితే వీళ్లు నవ్వుతున్నారేం?

"మొదట గొప్ప శుభవార్త చెప్పమంటారా? గొప్ప జోక్ చెప్పమంటారా?" అన్నాడు రామశర్మ.

అర్థంకాక వెర్రిచూపులు చూశాడు సర్వమంగళం.

"మీ ఆవిడ నీళ్లు పోసుకుంది. అది మొదటి శుభవార్త"

"మరి... మరి..."

అమావాస్య రాజు నవ్వుతున్నాడు. "మీ ఆవిడ కోలుకోడానికి సేవలుచేసిన అబ్బుశాస్త్రి ఇంకా కోలుకోలేదు. అతనికేం భయం లేదు. వాస్తవంకంటే షాక్‌ది పెద్ద చెయ్యి"

ముగ్గురూ గదిలోకి వచ్చారు. సరిగ్గా ఉదయం అబ్బుశాస్త్రి చేసిన పని అనసూయమ్మ అబ్బుకి చేస్తోంది. అరికాళ్లని ఒళ్లో పెట్టుకుని మర్దనా చేస్తోంది. అతని చేతికి సెలైన్, డెక్ట్రోజ్ ఎక్కుతోంది.

"అవసరం లేదమ్మా. అతను కోలుకుంటాడు. నీది అనారోగ్యం. అతనిది షాక్" అన్నారు డాక్టర్ యాజులుగారు. ఇంకాస్సేపటికి కళ్లు విప్పాడు అబ్బు. సర్వమంగళం, అమావాస్య రాజు, రామశర్మని చూసి తుళ్లిపడ్డాడు.

"అనసూయ ఎలా ఉంది?" అన్నాడు ఆత్రుతగా. ముగ్గురూ అతని కాళ్లని

చూపించారు. ఇప్పుడు కాళ్లు మర్దనాచేస్తున్న అనసూయని చూశాడు. "ఎలా ఉన్నావమ్మా?" అన్నాడు.

అనసూయ నవ్వింది. "నీకేమైనా అయితే నేను ఎక్కడికీ వెళ్ళేదాన్ని కాదు. ఈయన నమ్ముకున్న ఆ పరమేశ్వరుడిని నిలదీసేదాన్ని" అంది. ఆ నవ్వులో గర్వం ఉంది. తృప్తి ఉంది. కాని భరించలేనంత నీరసం ఉంది.

అందర్నీ కూర్చోపెట్టి యాజులుగారు చెప్పారు. "రోజూ చన్నీళ్ల స్నానాలూ, పూజలూ, పునస్కారాలూ, ఏకభుక్తాలూ-అన్నీ మంచివే. వైద్యుడికీ, దేవుడికీ తగాదా లేదుకానీ, వైద్యుడికీ, భక్తికీ తగాదా ఉంది. వైద్యుడికీ, ఆచారాలకీ తగాదా ఉంది. ఈయన (అబ్బు)కి మరే ఢోకా లేదు. తనకి ప్రాణప్రదమైన మనిషి కష్టాన్ని తట్టుకోలేకపోయాడు. వైద్యం శరీరాన్ని స్వస్థపరిచింది. కాని జాగ్రత్తగా వినండి. ఈ అమ్మాయి ఊహించలేనంత ఎనిమిక్‌గా ఉంది. శరీరంలో రక్తం బొత్తిగా తక్కువగా ఉంది. రక్తంలో బలం తక్కువ. ఈ రామశర్మగారు మీ కథంతా చెప్పారు. కారణం శరీరానిది కాదు. ఆమె అవలంబిస్తున్న జీవన విధానానిది-ఇప్పుడు ప్రత్యేకంగా ఆమెకి సంక్రమించిన ప్రమాదం ఆమెకి నెల తప్పడం. 'ప్రమాదం' అంటున్నాను గమనించండి. ఇకనుంచీ ఆ శరీరం రెండు ప్రాణాల్ని పోషించాలి. ఒక్క ప్రాణానికే సరైన అవకాశం ఇవ్వలేదు ఆవిడ. ఈ తర్వాత-ఆమె ప్రత్యేకమైన శ్రద్ధ తీసుకోకపోతే-కాదు-ఆమె గురించి మీరు ప్రత్యేకమైన శ్రద్ధ తీసుకోకపోతే ఆమె గర్భకోశంలో ఫీటస్ నిలవకపోవచ్చు. అందువల్ల ఈవిడ మరింత నీరసపడిపోవచ్చు. శరీరానికి వాతం కమ్మవచ్చు. అప్పుడు పెద్దప్రాణానికే ముప్పు రావచ్చు. నేను మందు రాస్తాను. అంతవరకే నేను చెయ్యగలిగింది. ఇకనుంచీ-ఈమెని పసిబిడ్డకంటే జాగ్రత్తగా చూసుకోవాలి. శరీరం ఎంతమాత్రం అలసిపోకూడదు. ఇలా ఆమెకి రెండోసారి స్పృహ తప్పితే తేలికగా ఆమె కోమాలోకి వెళ్లిపోతుంది. ఆమెని రక్షించే మందుల్ని తట్టుకునే శక్తి ప్రస్తుతం ఆమె శరీరానికి లేదు. అది చాలా పెద్ద సమస్య. ఇంతకన్న నేను గట్టిగా హెచ్చరించలేను"

సర్వమంగళం నిట్టూర్చాడు. రామశర్మ, అమావాస్య రాజు కంగారుపడ్డారు. అనసూయ నవ్వుకుంది. "రోజూ చేసే పనులన్నీ ఆడది మానుకున్నాక-బిడ్డ ఎందుకు?" అంది నీరసంగా.

అప్పుడే తేరుకున్న అబ్బుశాస్త్రి శరీరానికి లొంగనంత ధైర్యంగా అన్నాడు. "మా ఇంటి బిడ్డ గురించి నీకు అలా అనే హక్కు లేదు. నా మేనల్లుడు నా చేతుల్లో పడేవరకూ ఈ తల్లిని పువ్వులాగ కాపాడుకొంటాం డాక్టరుగారూ" అన్నాడు.

సర్వమంగళం కళ్ళు కల్హార పుష్పాలయ్యాయి. అనసూయ అబ్బు కాళ్ళని తాకబోయి

తూలింది. తోబుట్టువుని పట్టుకున్నట్టు అబ్బుశాస్త్రి ఆమెని పొదివిపట్టుకున్నాడు. యాజులుగారు ఆ దృశ్యాన్ని ఆశ్చర్యంగా, ఎక్కువ ఆనందంగా గమనించారు.

"నాకిప్పుడు నమ్మకం కలుగుతోందయ్యా! నా మందుకన్నా ఈ అన్నయ్య పరిచర్య–ఈ పిల్లనీ, ముఖ్యంగా కడుపులో ఉన్న పసిగుడ్డునీ కాపాడుతుందయ్యా" అన్నారు యాజులుగారు నమ్మకంగా.

"ఈ ప్రపంచంలో వైద్యాన్ని మనిషి తెలివితేటలు కనిపెట్టాయి. కాని దాని ప్రభావానికి కారణమైన మానవ స్వభావానికి పునాదులేమిటో ఈ సృష్టిలో ఎవరికీ తెలీదు. నేను పురాణాలు చదవలేదు. కాని వాటిలో ఇలాంటి ఫన్నీ క్యారెక్టర్స్ వైద్యాన్ని తలదన్నే ఫలితాన్ని సాధించారని విన్నాను"

"పుట్టేవాడు పరీక్షిత్తు సార్! నేను అతన్ని కాపాడే విష్ణుచక్రాన్ని" అన్నాడు అబ్బుశాస్త్రి.

## 22

తర్వాత అనసూయ ఎనిమిది నెలలపాటు నేలమీద నడవలేదు. అబ్బుశాస్త్రి అరచేతులమీద నడిచింది. చిన్నతనం నుంచీ సోమిదేవమ్మ కొంగు పట్టుకుని చూసిందంతా తను స్వయంగా చేసి వడ్డించాడామెకు. బజారుకి వెళ్లి లేత సొరకాయలూ, బీరకాయలూ, పొట్లకాయలూ, తోటకూర, దోసకాయలూ, పొన్నగంటికూర–అన్నీ స్వయంగా ఏరుకు తెచ్చాడు. కత్తిపీటముందు కూర్చుని కూరలు తరిగి పచనం చేసి కంచంలో వడ్డించి, మొదటిసారి వేవిళ్లతో బాధపడే అనసూయని బతిమాలి తినిపించాడు. ముద్దముద్దకీ పేర్లు పెట్టాడు.

"ఇది వెంపరాల అమ్మన్నశాస్త్రిగారి ముద్ద. ఇది అమ్మ కనకమహాలక్ష్మమ్మ ముద్ద. ఇది పెద్దన్న గుండాలశాస్త్రిది. ఇది మొదటి గురువు పూర్ణయ్య సిద్ధాంతిగారిది".

ఆ మహామహుల జ్ఞాపకాలు ఆహారానికి కొత్త రుచుల్ని సంతరించగా రక్తం పంచుకోని అబ్బు చేతివేళ్లకు అనసూయ లొంగిపోయేది. ఆహారానికి రెండు అనుపానాలు. స్వతహాగా ఇవ్వగల శక్తి. ఆప్యాయత పూరించిన ఆత్మీయత. రెండోది ముందు దాన్ని జయించగా రెండూ పోటీపడి ఆమె శరీరానికి చికిత్స చేశాయి.

అనసూయ నవ్వింది. "ఆయన్ని పెళ్లి చేసుకుంటానన్నప్పుడు ఆయన చెప్పిన మొదటి కారణం–ఈ ఇంట్లో ఆడదిక్కు ఉంటే అబ్బుకి వంటజేసి పెడుతుందని. కాని ఇప్పుడు జరిగింది నువ్వు నాకు చేసిపెట్టడం. నాకు ఏ జన్మలోనో నువ్వు ఋణపడిపోయావన్నయ్యా"

"కాదమ్మా. నీ కడుపులో ఉన్నవాడి ఋణం పెంచుకుంటున్నానమ్మా. రేపు వాడూ నేనూ లెక్కలు చూసుకుంటాం"

మూడో నెలలో అనసూయని చూసి ఆశ్చర్యపోయారు యాజులుగారు. "ఆ అమ్మాయికి ఏం చేశావయ్యా. నాకింత వైద్యం వచ్చునని నాకే తెలీదు. ఈ పిల్ల నీరుపట్టిన పొట్లపాదులాగ ఉంది. ఇంటికి తీసుకెళ్లి దిష్టితీయండి" అన్నారు. ఆ మాటకి అబ్బు శాస్త్రి గర్వపడిపోయాడు. "కడుపులో ఆ నలుసు సంగతి చెప్పండి"

నవ్వారు యాజులుగారు. "వాడెవడో పెట్టిపుట్టబోతున్నాడయ్యా. వాడి పేరేంటన్నావ్?"

"పరీక్షిత్తు"

"ఆс. వాడికిక నా పరీక్ష ఏమీ అక్కర్లేదు" అంటూ నవ్వి "వైద్యంకంటే కలిసివచ్చే గొప్ప చికిత్స ఒకటి ఉందయ్యా"

"ఏమిటి సార్"

"మనస్సుకి కొండంత తృప్తి. రుగ్మతలో ఉన్న శరీరానికి మేం చికిత్స చేస్తాం. కాని చేతనైతే మనస్సుకీ చికిత్స జరగాలి. అది నువ్వ చేశావు. ఈమెకి ఆ రెండు చికిత్సలూ జరుగుతున్నాయి" అన్నారు యాజులుగారు తృప్తిగా.

❖ ❖ ❖

ఎనిమిది నెలలూ అబ్బుశాస్త్రి ఇల్లు ఊడ్చాడు. వంటసామాన్లు తోమి శుభ్రంచేశాడు. అనసూయమ్మకి మందులూ, పళ్ళరసాలూ పట్టాడు. ఆమెని కూర్చోపెట్టి సుందరకాండ చదివాడు. నారద భక్తిసూత్రాలు వివరించి చెప్పాడు. అమావాస్య రాజు మనిషినిచ్చి పంపిన గీతా ప్రెస్ గేలీల్ని చూశాడు. డబ్బు ఇంటికే వస్తోంది. రామశర్మతో చర్చలు ఇంటి అరుగుమీదే జరుగుతున్నాయి. ఎనిమిది నెలలపాటు నిర్విరామంగా జరిగిన ఉద్యమం రెండు ప్రాణాలకు ఊపిరి పోసింది. ఆసుపత్రిలో కేరుమన్న బిడ్డ ఏడుపు వినిపించినప్పుడు సర్వమంగళం పుట్టిన బిడ్డని చూడడానికి పరిగెత్తలేదు. వసారా చివర ధ్యానంలో ఉన్న అబ్బు శాస్త్రి దగ్గరికి పరిగెత్తాడు. కళ్లనీళ్లతో అబ్బు కాళ్లకి నమస్కారం చేశాడు. అబ్బు మిత్రుడిని లేవనెత్తాడు. "ఇది తప్పు. నువ్వు నాకంటె పెద్దవాడివి. నాకు ఆయుక్షీణం".

"ఐనా–ఇది నేను నీకు చేస్తున్న ఉపకారం కాదురా. నా మేనల్లుడిని దక్కించుకునే ఉద్యమం. పద. పరీక్షిత్తుని చూద్దాం" అన్నాడు.

బాలసారె పీటలమీద పళ్లెంలో బియ్యం పోసి–పసుపుకొమ్ము పట్టుకుని పసివాడి లౌకిక నామాన్ని 'పరీక్షిత్తు శాస్త్రి' అని రాశాడు సర్వమంగళం. అబ్బు గర్వంగా వాడినెత్తుకుని 'ఇది నా తృప్తి' అన్నాడు. అనసూయ ముఖం వికసించిన అవిసెపువ్వయిపోయింది. వాళ్ళ ముగ్గుర్నీ చూస్తూ 'ఆప్యాయతల్లో ఇంత వైభవం ఉండగా లౌకికులు ఇంకా డబ్బుకోసం వెంపర్లాడుతారేం?' అనుకున్నాడు రామశర్మ.

పసివాడికి బంగారు మురుగులు తొడిగాడు అమావాస్య రాజు.

"ఇప్పుడు కాదమ్మా. ఆరు నెలలనాడు సరిపోతాయి. జాగ్రత్త చెయ్యి" అంటూ. అబ్బు పరీక్షిత్తు అవకపోతే గురువుగారి పేరు పెట్టుకుందామనుకున్నాడు సర్వమంగళం. కాని నిర్ణయించడానికి తనెవరు? 'ఆత్మావైపుత్రనామాసి'. గురువుగారు కొడుకు రూపంలో తన కొడుక్కి ప్రాణం పోశారు. అది ఆయన ప్రసాదం. పేరూ ఆయన నిర్ణయించినదే–పుత్రుని రూపంలో.

❖ ❖ ❖

సంవత్సరాలు దొర్లిపోతున్నాయి. అబ్బు లక్ష్యానికి కాలం, పరిస్థితులూ కళ్లెం వేశాయి. అవసరంలేని డబ్బు బ్యాంకులో జమ అవుతోంది. అర్థరహితంగా ఉదయాలు గడిచిపోతున్నాయి. సాయంకాలాలు తోసుకు వస్తున్నాయి. ఆనాడు అపార్టుమెంటులోంచి పారిపోయిన అమ్మాయి ఇప్పుడెక్కడ ఉంది? ఎలా వెదకడం? ఈ ప్రశ్న తనది కాదు. అన్ని విషయాలకూ సహేతుకమైన దారులు వెదికే రామశర్మది. నవ్వాడు అబ్బుశాస్త్రి.

"ఆ విషయాన్ని మరిచిపోలేదు. కాని తప్పించుకోలేని వర్తమానం గతంమీద తెరని కప్పింది. కాగా, అన్వేషించడం అంటే కాలికి బలపాలు కట్టుకుని తిరగడం కాదు" అంటూ చయనులుగారు అబ్బురంగా అప్పుడప్పుడు వివరించే వాస్తవ ఇతివృత్తాన్ని ఉటంకించాడు.

పేరూరు అంతా ద్రావిడుల పుట్ట. గంటి, నూకల, నేమాని, అయ్యల సోమయాజుల, తాతా, పేరి, అమ్ముు, మంథా, కర్రా–ఇలాగ. వేదం వారికి వారసత్వం. పల్లపు వీధి, పెద్ద వీధి, మెరక వీధి, సీతమ్మ చెరువు వీధి, మొండి వీధుల్లో అడుగులు వేస్తూంటే ఇప్పటికీ ఆ వైభవం ద్యోతకమౌతూనే ఉంటుంది. ఒక అపూర్వమైన సంఘటన. నేమాని సోమనాథ చయలుగారు తపస్సంపన్నులు. నరసింహ ఉపాసకులు, అంతర్వేదిలో లక్ష్మీనృసింహ స్వామి ఆలయంలో మాఘ శుద్ధ పౌర్ణమినాడు చక్రస్నానం జరుగుతోంది. ఆనాడు ఋత్విక్కులు సముద్రంలో చక్రస్నానం చేయిస్తూండగా చక్రం సముద్రంలోకి జారిపోయింది. ఎంత వెదికినా దొరకలేదు. కారణం అఖండ గోదావరి ఉరకలువేస్తూ

సముద్రంలో లీనమయ్యే స్థలమది. ఎదురువెళ్లే నదీప్రవాహం. ఆహ్వానించే సముద్ర తరంగాలూ–అదొక అపూర్వమైన సంగమం. దీన్ని ప్రజలంతా అపశకునంలాగ భావించారు. అక్కడి వారందరికీ ఆనాటి సంఘటన పెద్ద మనస్తాపాన్ని మిగిల్చింది.

మొగల్తూరు రాజు రాజా బహద్దూర్‌వారు ఆ చుట్టుపక్కల గ్రామాలలో టముకు వేయించారు. తమ ప్రయత్నంతో సముద్రగామి అయిన చక్రాన్ని బయటికి తీయగలిగినవారికి కోరిన సత్కారం చేస్తామని సమాచారం.

ఎవరో సోమనాథ చయనులుగారికి ఈ విషయం చెప్పారు. సత్కారం మాట అటుండగా, స్వామివారి చక్రాన్ని వెలికితీయడం పవిత్రమైన కర్తవ్యం. తాను తీస్తానన్నారు. రాజావారు బంగారు పల్లకీ పంపించారు. ఈ కథ చెప్పే కారణం ఇది. చక్రాన్ని మనుషుల్ని పెట్టి వెదికించలేదు సోమనాథ చయనులుగారు. గజఈతగాళ్ళని పురమాయించలేదు. నిజానికి ఎవరి సహాయం కూడా అర్థించలేదు. సముద్రతీరంలో నీటిలోనే నిలిచి–ఏడు రోజులపాటు ఒంటికాలిమీద తపస్సు చేశారు. పైన సూర్యుని ఎండ తగలకుండా అంగవస్త్రాన్ని నిలిపారు. సూర్యుడు ఎటు తిరిగితే వస్త్రం అటు తిరిగిందట. ఏడో రోజు సముద్ర కెరటం చక్రాన్ని ఆయన సమక్షంలోకి తోసింది. ఊరంతా పొంగిపోయింది. ఆనందంతో రెచ్చిపోయింది. భక్తులు కేకలుపెట్టారు. మళ్లీ వేలాది ప్రజల సమక్షంలో స్వామివారి చక్రప్రతిష్ఠ జరిగింది.

రాజావారు సోమనాథ చయనులుగారికి పాదాభివందనం చేసి “ఏం కావాలో కోరుకోండి” అన్నారు. వేల ఎకరాలా? బంగారమా? సంపదా? చయనులుగారు నవ్వి ఊరుకున్నారు. రాజావారు 300 గడప ఉన్న పేరూరు గ్రామాన్ని వారికి సంక్రమింపజేశారు. ఆనాటినుంచీ స్వామివారి కళ్యాణానికి నేమానివారు మగపెళ్లివారి లాంఛనాలతో తరలివచ్చేవారు. ధ్వజారోహణం, కళ్యాణం, వేదస్వస్తి 9 రోజులూ పేరూరివారే చేసేవారు. ఇప్పటికీ ఈ ఉత్సవాలకి పేరూరివారు ఉంటారు. సదస్యం, మంగళాశీర్వాదం ఘనంగా జరిపిస్తారు. ఒకానొక చక్రస్నాన ఉత్సవంలో జరిగిన అపశృతికి పారలౌకికమైన పరమార్థాన్ని ఊరికి తెచ్చిపెట్టిన ఘనత నేమాని సోమనాథ చయనులుగారిది.

రామశర్మ ఆశ్చర్యపోయాడు. ఈ కాలంవారికి ఇలాంటి కథ మంత్రాలకి చింతకాయలు రాలడంలాంటిది. మరి ఈ సంప్రదాయానికి దాఖలాలు ఇప్పటికీ అక్కడ కనిపిస్తున్నాయి కదా? ఓ పవిత్రమైన లక్ష్యానికి సముద్రాన్ని కలయ వెదకనక్కర్లేని అద్భుతమైన క్షణాలవి.

ఇలాంటి సంఘటనలమీద అబ్బు శాస్త్రి పెట్టుకున్న అకుంఠితమైన విశ్వాసం రామశాస్త్రి నిర్ఘాంతపోయేటట్టు చేసింది. మనం ఏ కాలంలో ఉన్నాం? ఎలాంటి

నమ్మకాలను పెంచుకుంటున్నాం? ఎలాంటి విశ్వాసాలను వెక్కిరిస్తున్నాం?

ఒక్క క్షణం అతి ప్రాథమికమైన మూఢవిశ్వాసాలకు అమ్ముడుపోయిన ఆ కాలపు అవశేషంలాగ కనిపించాడు అబ్బు శాస్త్రి. కాని అతని మాటల్ని పూర్తిగా తోసిపుచ్చవచ్చునా? ఇది వాస్తవిక సంఘటనే అయితే ఎప్పుడో ఒకప్పుడు జరిగే ఉండాలి కదా?

పేరూరు ఇప్పటికీ ఉంది. మాఘ శుద్ధ పూర్ణిమనాడు చక్రస్నానం ఇప్పటికీ జరుగుతోంది. ఇప్పటికీ పేరూరివారు ఆ ఉత్సవాలకు హాజరౌతున్నారు. పిల్లలు ఇంగ్లీషు చదువులు చదివి ఉద్యోగాలకు ఊరొదిలి వెళ్లిపోయారు. కాని పేరూరులో ఏ శుభకార్యానికైనా–మేళతాళాలను సహా బ్రాహ్మణ్యమే నిర్వహిస్తుంది. ఊరంతా కలిసి భోజనం చేస్తుంది. ఆడవాళ్లు కలిసి వంట చేస్తారు. ఊరంతటికీ మగవాళ్లు ఎర్రకావి పంచెలు పైకెత్తి కట్టుకుని వడ్డనలు చేస్తారు. కుల, మత ప్రసక్తి లేకుండా అందరూ భోజనాలు చేస్తారు.

❖ ❖ ❖

తాటిచెట్టుకీ తాత పిలకకీ సంబంధం ఉన్నదని రుజువైన అరుదైన సందర్భమిది. మేనమామ దూర్వాసుల లక్ష్మణశాస్త్రికి దత్తతపోయాక–పేరు దూరాశ కావడంతోపాటు, గంగల కుర్రులో నాలుగెకరాల కొబ్బరితోట, రెండెకరాల పల్లపు భూమీ ఆస్తులయ్యాయి. కోనసీమలో ఆ వారసత్వం బంగారం. తదాదిగా రామశర్మ డబ్బుకి లోటు లేదు కాని, డబ్బున్న కారణంగానే జీవితంలో స్తంభన ఏర్పడకుండా ఆలోచనల్లో కొత్త లక్ష్యాన్ని ప్రోదిచేసుకున్నాడు.

చార్టర్డ్ అకౌంటెన్సీ చదువుకున్న రామశర్మకి చదువు కారణంగానే కొత్త ఆలోచనలు ముసురుకున్నాయి. కారణం లేకపోలేదు. తాను పుట్టి పెరిగిన వాతావరణం–సంప్రదాయాలకీ, సదాచారాలకీ, వేదానికీ పుట్టినిల్లు. తన చదువు సంకోచానికీ, సందేహానికీ, వివేచనకీ, విచక్షణకీ పునాది. కాగా, ఉపాధి సమకూర్చుకోవాలన్న బెంగ లేదు. తెల్లారి లేస్తే కడుపు నింపుకోడానికి నౌఖరీ చేసేవాడికి ఆలోచనల్లో వీరవిహారం చేసే ఆస్కారం లేదు. రామశర్మది కడుపు నిండిన వ్యవహారం. మొదటినుంచీ ఆలోచనకి అడ్డంపడడం అలవాటైన స్వభావం. ఆనాటికి కోనసీమ కాలువల్లో చుక్కాని పడవలే కాని మోటారు పడవలు ఎందుకు నడవడం లేదు? నడిపితే ఎలా ఉంటుంది? వాటి ప్రయాణానికి కావలసినంత వెసులుబాటు, అవసరం ఉన్నదా? ఇసుక రవాణా, మిగతా వస్తువుల రవాణా పడవల్లో జరుగుతోంది. వాటికి మోటార్లు చేరిస్తే ప్రయాణం వేగవంతమౌతుంది కదా? చేర్చడమంటూ జరిగితే ఎంత ఖర్చుతో

జరగాలి? ఎలాంటి మోటార్లు కావాలి? ఏది లాభసాటి? ఈ ప్రశ్నలకి సమాధానాలు కావాలని బొంబాయిలో మజగాం పోర్టులో పనిచేస్తున్న ఇంజనీరింగు మిత్రుడు గంగాధరానికి ఉత్తరం రాశాడు. చాలా ఏళ్ల తర్వాత పలకరించిన మిత్రుడి ఉత్తరం చూసి పొంగిపోయాడు గంగాధరం. పెళ్లయినా ఇల్లు కారణంగా కాపురం పెట్టడానికి వసతి ఊహించలేనంత ఖరీదైన నగరంలో–కొలాబాలోనే–తన ఉద్యోగానికి రెండు బస్సు స్టాపుల దూరంలో ఉన్న మేడమీద బాత్‌రూమ్ అంత గదిలో ఉంటున్నాడు గంగాధరం.

రామశర్మని ఆనాటి స్నేహితులు 'దత్తుడు' అని పిలుస్తారు. వెంటనే బయలుదేరి రమ్మని ఉత్తరం రాశాడు దత్తుడికి. ఇదేమిటి? తన ప్రశ్నకు సమాధానానికి ఎదురుచూస్తుంటే తననే రమ్మని ఆహ్వానం వచ్చింది? ఆసక్తి తీరక రైలెక్కాడు రామశర్మ అనే దత్తుడు. కొలాబా పోర్చుగీసువారి కాలంలో చిన్న ద్వీపం. ఆ మాటకు వస్తే బొంబాయే ఎన్నో ద్వీపాల సమ్మేళనం. జనాభా, అవసరాలకొద్దీ అస్తవ్యస్తంగా పెరిగిన అఖండమైన వాణిజ్య నగరం బొంబాయి.

సెస్సూన్ డాక్స్ దగ్గర దిగి ఆ ఇంటిని వెదుక్కుంటూ వెళ్ళాడు రామశర్మ. తీరా అది ఇల్లు కాదని ఓ పెద్ద ఇనుప సామాన్ల ఫ్యాక్టరీకి ఆనుకుని ఉన్న ఔట్ హౌస్ మేడమీద ఉన్న చిన్న గది అని అర్థం చేసుకోడానికి సగంరోజు పట్టింది. మొబైల్ ఫోన్లు, టెలిఫోన్లు పెద్దగా లేని రోజులవి. మిత్రుడు రాలేదనుకుని ఆఫీసుకి వెళ్ళిపోయాడు గంగాధరం. రాత్రి ఇంటికి వచ్చేసరికి మెట్లమీద పడుకున్న దత్తుడు కనిపించాడు. కాలేజీ రోజుల్నాటి మిత్రుడిని చూసి కళ్లనీళ్ల పర్యంతమయ్యాడు గంగాధరం. తనతో, తన భాషలో మాట్లాడే తన ఊరివాడు కనిపించడం అపురూపం. రెండు రోజులుపాటు మిత్రుడికి నగరాన్ని చూపిస్తూ బలాదూరుగా తిప్పాడు.

"అదేంట్రా. ఇంత ఊరులో తెలుగువారు లేరా?" అన్నాడు దత్తుడు ఉన్నట్టుండి. "ఉండే వుంటారు. ఇంతవరకూ వాళ్ల గురించి వెదకాలన్న ఆలోచన నాకు రాలేదు. ఇది తీరిక బ్రెయిన్ సోమరితనం" అని నవ్వాడు. రేపు సమాచారాన్ని తెస్తానన్నాడు. మర్నాడు చచ్చేంత సమాచారంతో వచ్చాడు గంగాధరం. దాదర్ ఈస్టులో బోంబే ఆంధ్ర మహాసభ అండ్ జింఖానా అని ఉంది. ప్రహ్లాదరావు అనే ఒకాయన మాట్లాడాడు. "రేపు వెళ్దాం" అన్నాడు.

ఆవిధంగా బొంబాయి ఆంధ్రుల మధ్య పడ్డాడు రామశర్మ. సంప్రదాయపు కట్టుబాట్లమీదా, మూఢవిశ్వాసాలమీదా తన ఆలోచనలు సమీకరించుకుంటున్న వయస్సది. ఒంట్లో వేడి అప్పుడే రగులుతున్న దశ. అతని ఆలోచనలూ, మాటలూ విని చాలామంది ఆశ్చర్యపోయారు. మరీ చాందసులు "నీకిదేం పోయేకాలం? చేతనైతే పెద్దలు చెప్పే

మార్గంలో నడువు. లేకపోతే నోరు మూసుకో. మతాన్ని విశ్వసిస్తూనే మౌఢ్యానికి కారణాలు వేదికే పని కత్తిమీద సాము. ఈ పిచ్చి ఆలోచనల్ని పోగుచెయ్యమని ఎవడేడ్చాడు?" అన్నారు. కుర్రతనం. వారి ఉదాసీనత తన భావాల్లో ఎంతో కొంత నిజం ఉండడానికి కారణమని భావించిమరీ రెచ్చిపోయాడు. సనాతన విశ్వాసాలను నమ్మి, వాటిని పెట్టుబడిగా రాజకీయ పార్టీ రూపునిదిద్దిన శివసేన సభ్యుల్ని తెలిసిన ఓ తెలుగు వ్యక్తి–ఓ సాయంకాలం మహారాష్ట్రుల సభను ఏర్పాటు చేశాడు. రామశర్మ ప్రసంగాన్ని వచ్చీరాని ఇంగ్లీషులో ఆ సభలో అనువదించి చెప్పాడు. ఈ అవకాశం తన ఆలోచనలకు దక్కిన sanctionగా భావించాడు రామశర్మ. ఆ రాత్రి గంగాధరానికి గర్వంగా చెప్పాడు.

"ఎందుకీ అనవసరమైన హంగామా? ముక్కూ, మొహం తెలీని నగరంలో మనకు తెలీని భాషేతరులతో అక్కర్లేని తలనొప్పి కొనుక్కోకు" అని హితవు చెప్పాడు గంగాధరం. కాని వినే స్థితిలో లేడు రామశర్మ.

మొదటి సమావేశం అదిరిపోయింది. సభకి వచ్చిన శివసేన సభ్యులు చెవులు రిక్కించి విన్నారు. రామశర్మ చెప్పిన ఆలోచనలు గొప్పగా ఉండి కాదు. తమ విశ్వాసాలకు పూట్లు బిగిస్తున్నందుకు కృతజ్ఞతతో. వారి శ్రద్ధ తన అన్వయాలకు సమర్థనగా సరిపెట్టుకున్నాడు రామశర్మ. రామశర్మ మాట్లాడిన మూడు సభలకీ వచ్చిన మహారాష్ట్ర బ్రాహ్మణుడు వామన్‌రావ్ దేశ్‌పాండే ఉన్నాడు. ఆయన వీర శివసేన కార్యకర్త. అభిప్రాయభేదాన్ని మాటలతోకాక చేతలతో ఎదుర్కోవాలని నమ్మిన సదాచార పరాయణుడు. రామశర్మ మాటల్ని–తన భాషలో తర్జుమా చేయించుకుమరీ విన్నాడు. హిందూ మతానికి ఇలాంటి చీడపురుగుల ద్వారా కీడు జరుగుతుందని నిర్ధారించుకున్నాడు. నిర్ధారించుకున్న వెంటనే కార్యరంగంలోకి దూకాడు.

సెస్సూన్ డాక్స్ మలుపుతిరిగితే–పగలే జనసంచారం తక్కువగా ఉంటుంది. రాత్రి ఓ వీధి మలుపు చీకటి గుయ్యారంలాగ ఉంటుంది. ఒంటరిగా ఇంటికి వస్తున్న దత్తుడిని ఎవరో పేరుపెట్టి పిలిచారు–'దత్తుడుగారూ' అని. పేరు తనదే కాని పిలుపు కొత్తగా అనిపించింది. తెలుగు భాషని కొత్తగా మాట్లాడుతున్న తెలుగు కాని వాడి పిలుపు అది. ఆశ్చర్యపోయి, ఆగి వెనక్కి తిరిగి చూశాడు. అంతే. నలుగురు మనుషులు మీద పడి కాస్సేపు అతని శరీరంతో ఫుట్‌బాల్ ఆడుకున్నారు. ఓ కాలు నోటికి సూటిగా తగిలి పెదవి చిట్లింది. ముందుపన్ను ఊడి గొంతులోకి పోయినట్టు తనకే తెలుస్తోంది. ఎందుకు? ఎవరు? అని తెలిసేలోగా మొదటి విడత దెబ్బలు పూర్తయిపోయాయి. మనిషీ దూరంగా పడ్డాడు. ఇప్పుడు దీపం నీడలోంచి వాళ్ళ లీడర్ బయటికి వచ్చాడు.

అప్పుడు హాక్ డిటెక్టివ్ కంపెనీ మెకార్ధీని చూశాడు రామశర్మ. "సో. నువ్వేనా

దేవుడూ, మతం అంతా బంకమ్ అని ఉపన్యాసాలిచ్చే మొనగాడివి" అన్నాడు. మెకార్థీ కింద పడిన రామశర్మని లేవనెత్తుతూ.

అంత బాధలోనూ అతని మాటలోని పొరపాటుని సవరించాడు రామశర్మ. "నేను దేవుడు లేదనడంలేదు. మతం పేరిట పెట్టిన గుర్తులకి అర్థం అవి కాదంటున్నాను. ఐనా అది పళ్ళు రాలగొట్టాల్సినంత నేరం కాదు"

మెకార్థీ నవ్వాడు. "కొట్టడం కాంట్రాక్ట్ గురూ. కాని పళ్ళు రాలడం యాక్సిడెంటు. సారీ" మాట పూర్తి కాకుండానే మెకార్థీ మనుషులు రెండో విడత వాయింపుకి ముందుకు వచ్చారు. కాని మెకార్థీ వాళ్లని ఆపాడు.

"హిందూ దేవుళ్లనీ, సంప్రదాయాన్నీ భ్రష్టుపట్టిస్తున్నావని చెప్పారు"

"పట్టించానే అనుకో. కొట్టడానికి నువ్వెవరు?"

"నేను నిన్ను కొట్టడానికి రోజుకూలీని" అన్నాడు మెకార్థీ.

"ఎంత ముట్టజెప్పారు?"

"నీకెందుకు?"

"దానికి మరింత కలిపి ఇద్దామని–కొట్టించినవాడి నోటిలో గడ్డి పెట్టడానికి"

"దానివల్ల నీకేం లాభం?"

"నాక్కాదు. నీకు కాంట్రాక్టు ఇచ్చినవాడికి. వెళ్లి ఆయనకి చెప్పు. తన మతాన్ని, దాని గొప్పతనాన్ని కాపాడడానికి అతనెంత పెట్టుబడి పెట్టాడో అది గొప్పదని చెప్పడానికి నేనూ అంత పెట్టుబడి పెట్టగలను. కాని–అది కొట్టి, కొట్టించి తేల్చుకోవలసిన విషయం కాదు" అని చుట్టూ నిలబడిన నలుగురినీ చూసి "మీ పని పూర్తిచేస్తారా? సగం పనికి రేటు కడితే మిగతా సగం నేనిస్తాను"

మెకార్థీ ఆశ్చర్యపోయాడు. అంతకుమించి నవ్వుకున్నాడు. ఎందుకనో ఇతని ఆలోచనలు తనకి తెలియకపోయినా అవి కొట్టి పరిష్కరించేంత ప్రమాదకరమైనవి కావనిపించింది. వామన్‌రావ్ దేశ్ పాండే అనవసరమైన సరుకుమీద అక్కర్లేని పెట్టుబడిని పెట్టాడు. మీద పడబోయిన ముగ్గుర్నీ ఆపాడు మెకార్థీ. రామశర్మ భుజంమీద చెయ్యేసి నడిచాడు.

"చూడు గురూ. నువ్వేం చేశావో నాకు తెలీదు. కాని నేనేం చెయ్యాలో నాకు తెలుసు. ఇప్పటికి చేసింది చాలు. నేను క్రైస్తవుణ్ణి. ఈ దేశంలో మనకి నచ్చని పనిచేస్తే కొందరు తిట్టుకుంటారు. కొందరు తల బద్దలుకొడతారు. రెండో రకంవాళ్ళు ఎక్కువగా

ఉన్న నగరం ఇది. ఇంతకన్నా నిన్ను హింసించాలని నాకే అనిపించడంలేదు. ఓ చిన్న సలహా. చేతనైతే ఈ మహారాష్ట్ర గ్రూపులలోకి వెళ్ళకు. దూరంగా ఉండు. ఇంకా చేతనైతే ఈ నగరానికే దూరంగా ఉండు. ఈ మాటని నీకు కొట్టి చెప్పాలని నా కాంట్రాక్టు. సగం కొట్టి, సగం మాట చెప్తే చాలునని నాకనిపించింది. కాని పేమెంట్ ఫుల్‌గా తీసుకుంటాను. మనం మళ్లీ కలుసుకోం. ఐయాం సారీ. నా పేరు మెకార్డీ" అని చెయ్యిచ్చాడు.

చెయ్యి అందుకున్నాడు రామశర్మ. "నా పేరు చెప్పనక్కర్లేదు. ముందుపన్ను లేని మనిషి ఈ వయస్సులో లక్షమందిలో ఒకడుంటాడు. ఐ హోప్ అండ్ విష్ దట్ వుయ్ విల్ నెవర్ మీట్" అన్నాడు రామశర్మ.

ఇద్దరూ రెండు వైపులకు వెళ్లిపోయారు. మోటారు బోట్లు, కోనసీమ కాలువల్లో రవాణా సౌకర్యాల వంటి ఆలోచనలను అటకెక్కించి ఆ మర్నాడు మధ్యాహ్నమే బొంబాయి నుంచి ఇంటికి బయలుదేరాడు రామశర్మ.

❖ ❖ ❖

కాని విచిత్రంగా 13 సంవత్సరాల తర్వాత రాజమండ్రి గోదావరి పుష్కరాల్లో పుష్కర ఘాట్ దగ్గర 5 వేల మంది జనం మధ్య దూరంగా నిలబడిన మెకార్డీని గుర్తుపట్టాడు రామశర్మ. గుర్తుపట్టి నిర్ఘాంతపోయాడు.

దగ్గరకు వచ్చి 'హల్లో' అన్నాడు. మెకార్డీ తుళ్లిపడ్డాడు. తను చేసే వ్యాపారంలో తనని గుర్తుపట్టే మనిషి శత్రువు. అనుమానంగా చూశాడు రామశర్మని.

"నేను గుర్తున్నానా?" అంటూ ఊడిపోయి ముందు పన్ను ఖాళీని చూపించాడు రామశర్మ. మొదట మెకార్డీ ఆశ్చర్యపోయాడు.

"సెస్సూన్ డాక్స్. వామన్‌రావ్ దేశ్ పాండే కేసు! హల్లో" అని చెయ్యి అందించాడు మెకార్డీ.

మొదటిసారి రామశర్మని చావగొట్టడానికి మెకార్డీ కలిశాడు. రెండోసారి ఇద్దరూ చిరకాల మిత్రుల్లాగ కబుర్లు చెప్పుకున్నారు.

"ఇప్పటికీ ఆ పిచ్చి సిద్ధాంతాలు చేస్తున్నారా?" అన్నాడు మెకార్డీ.

"ఇంకా 31 పళ్లు ఉన్నాయి. మరిచిపోయారా?"

"ఐ యాం సారీ ఫర్ దట్ డే"

"చేస్తున్నాను. కాని విశ్వాసం లేనివారికి దూరంగా ఉంటున్నాను"

నవ్వాడు మెకార్డీ.

"ఏమిటీ మీరిక్కడ...?"

"వృత్తికి సంబంధించిన వివరాలు చెప్పకూడదు. ఓ బొంబాయి తెలుగు కుటుంబం పనిమీద వచ్చాను" అంటూ ఆగి "ఒక్క విషయం. రాజమండ్రి అనగానే నాకు ర్యాలీ గుర్తొస్తుంది. ఇక్కడికి ఎంత దూరం?" అడిగాడు.

"దగ్గరే. ముప్పై ఏడు కిలోమీటర్లు. ఏం? ఎందుకు?"

మెకార్డీ ముక్కుమీద వేలేసుకున్నాడు. "రహస్యం. రహస్యం నా మొదటి షరతు"

ఇద్దరూ మాటల్లోపడ్డారు. హఠాత్తుగా రామశర్మ అన్నాడు "సంవత్సరాల తర్వాత బొంబాయి మనిషి రాజమండ్రి వచ్చాడు. ఈమధ్యనే రాజమండ్రి మనిషి బొంబాయి వెళ్లాడు"

"ఎందుకు?" అని వెంటనే సర్దుకున్నాడు మెకార్డీ. "సారీ, వద్దనుకుంటే మీరు చెప్పనక్కర్లేదు"

నవ్వాడు రామశర్మ. "నాకా పట్టింపు లేదు. నేను డిటెక్టివ్‌ని కాను. కుందన్ బాగ్, బోరివిలీ వెస్ట్‌లో..."

కాఫీ చప్పరిస్తున్న మెకార్డీ తుళ్ళిపడి కాఫీని ఒంటిమీద ఒంపుకున్నాడు. అతని ముఖంలో షాక్ కొట్టవచ్చినట్టు కనిపించింది.

"132 ఏ/48, కుందన్ బాగ్, బోరివిలీ వెస్ట్, పోవై" అన్నాడు మెకార్డీ అసంకల్పితంగా. ఈసారి నిర్ఘాంతపోవడం రామశర్మ వంతైంది. ఇదే తాటిచెట్టుకీ తాత పిలకకీ ముడి.

❖ ❖ ❖

ఉదయం మెడలోతు నీళ్లలో మునిగి స్నానం చేస్తున్న అబ్బుశాస్త్రి, సర్వమంగళం దగ్గరికి వచ్చాడు రామశర్మ. అతని ముఖం ఆనందంతో వెలిగిపోతోంది.

"అబ్బూ, మీరు వెదుకుతున్న అమ్మాయి పేరు లీల. ప్రస్తుతం హైదరాబాదులో ఉంది. కాని హైదరాబాదులో ఎక్కడ ఉందో తెలీదు" అన్నాడు.

అబ్బుశాస్త్రి పెదాలు ఉచ్చరిస్తున్న ఆదిత్యహృదయాన్ని మరిచిపోయాయి. ఒక్క క్షణం కరుడుగట్టిపోయాడు. సూర్యుని తేజస్సు రెట్టింపు అయినట్లు కళ్లు మిరుమిట్లుగొలిపాయి. ఆదిత్యహృదయం కొనసాగింది.

## 23

మరో ఆలోచన లేకుండా సర్వమంగళం కుటుంబం అబ్బుతోసహా హైదరాబాదు తరలిపోయింది.

నల్లకుంటలో కోరంటీ పక్క వీధిలో మకాం. మొదట కొన్ని వారాలు శంకరమఠంలో ఒకపక్క కూర్చుని వేదపఠనం చేస్తూ గడిపాడు సర్వమంగళం. ఎవరినుంచీ ఏమీ ఆశించకుండా తన మానాన తాను కూర్చుని వెళ్లే సర్వమంగళం అలా చేస్తున్న కారణానికే చాలామందిని ఆకర్షించాడు. క్రమంగా కొన్ని కుటుంబాలకు పౌరోహిత్యం దొరికింది. అమావాస్య రాజు స్వయంగా వచ్చి గీతా ప్రెస్ పనిని అబ్బుశాస్త్రికి స్వయంగా అప్పగించి వెళ్లాడు. ఊహించని రీతిలో, ఊహించని నగరంలో, ఊహించని విధంగా కొత్త జీవితం అందరికీ ప్రారంభమైంది. అందరిలోకీ ఒక్క అనసూయ మాత్రం కోటిలింగేశ్వరుడిని నష్టపోయింది.

సరే. హైదరాబాదు రావడం తన చేతిలోని పని. కాని ఇంత మహానగరంలో లీల ఎక్కడుంది? సర్వమంగళం ప్రశ్నకి అబ్బు చిరునవ్వే సమాధానం. ఇన్నేళ్ల తర్వాత ఆ అమ్మాయి జాడ ఎలా తెలిసింది? అలాగే ఇదీ తెలుస్తుంది. విశ్వాసం కాళ్లూ, చేతులూ లేని, అక్కర్లేని ఓ విచిత్రమైన శక్తి. దాన్ని ప్రశ్నిస్తే గుడ్డిది. ఆచరిస్తే ఆయుధం. దాని మానాన దాన్ని వదిలేస్తే మత్తుమందు. చాలామంది ప్రశ్నించరు. చాలామందికి ప్రశ్నించాలని తెలీదు. చాలామందికి ఎందుకు ప్రశ్నించాలో తెలీదు. "ఎప్పటినుంచీ నీ అన్వేషణ?" అడిగాడు సర్వమంగళం.

అబ్బు నవ్వాడు. "అప్పుడే మొదలెట్టాను".

అనసూయ కూడా ఆశ్చర్యపోయింది. "ఎప్పుడు? ఎలా?" కళ్లు మూసుకుని "ఇలా" అన్నాడు.

సర్వమంగళం, అనసూయ–ఇద్దరూ ఒకరి ముఖం ఒకరు చూసుకున్నారు. లౌకిక ప్రపంచంలో ఆలోచనకు అందని ఏదో కల కంటున్నాడు అబ్బుశాస్త్రి. ఆ మాటే అన్నారు. "ఇందుక్కాదు మనం ఇంత దూరం వచ్చింది. ఇలాగే నువ్వు వెదకాలనుకుంటే రాజమండ్రిలోనే ఉండేవాళ్లం కదా?"

"వెదకడానికి రాజమండ్రి చాలు. కాని కళ్లబడడానికి హైదరాబాదు కావాలి. తపస్సంపన్నులు నేమాని సోమనాథ చయనులుగారు పేరూరులోనే తపస్సు కొనసాగించవచ్చు. కాని పోయినచోటే వెదకాలి. ప్రయత్నం లక్ష్యానికి దగ్గరగా సాగాలి"

బొత్తిగా ఆ వివరణ నచ్చలేదు సర్వమంగళానికి. కాని అబ్బుశాస్త్రి ముఖంలో,

మాటలో ఎటువంటి సందేహమూ కనిపించలేదు.

చెప్పుకుపోయాడు అబ్బు. సీతాదేవిని అన్వేషించడానికి లంకలో ప్రవేశించాడు హనుమంతుడు. అన్నిచోట్లా వెదికాడు. ఎక్కడా అమ్మ కనిపించలేదు. ఆలోచనామగ్నుడయ్యాడు.

రెండు చేతులూ జోడించి–

"తదున్నసం పాండుర దంతమవ్రణం
శుచిస్మితం పద్మ పలాశ లోచనమ్
ద్రక్ష్యే తదార్యా వదనం కదాన్వహం
ప్రసన్న తారాధిపతుల్య దర్శనమ్" అని జపించాడు.

అందమైన నాసికతోనూ, స్వచ్ఛమైన పలువరుసతోనూ, చక్కని నిర్మలమైన చిరునవ్వుతోనూ, తామర రేకులవంటి కన్నులతోనూ శోభిల్లే పూర్ణచంద్రునివంటి ప్రసన్నమైన, పూజ్యురాలైన సీతమ్మ వదనాన్ని చూసే భాగ్యం నాకెప్పుడు కలుగుతుందో కదా?

సర్వమంగళం నిర్ఘాంతపోయాడు. తన మిత్రుడు మరో రకమైన మిథ్యాప్రపంచంలోకి జారుకుంటున్నాడని భయపడ్డాడు.

అబ్బు చెప్పుకుపోతున్నాడు. "నిజానికి హనుమ సీతమ్మని చూడలేదు. మరి ఆమె ముఖాన్ని ఎలా వర్ణించాడు? ఇది వర్ణన కాదు. మంత్రం కనుక. జగన్మాత వదన ధ్యానం. సుందరకాండలో సీత పరాశక్తి. ఆమెను హనుమ దర్శించాడు అనేకన్నా అమ్మ హనుమకు దర్శనం ఇచ్చింది అనడం సబబు"

సర్వమంగళం మిత్రుడి పక్కకి వచ్చి కూర్చున్నాడు. "నీ వివరణ ప్రకారమే ఆలోచిద్దాం. ఆ అన్వేషణ జరిపింది హనుమ. అన్వేషించింది పరాశక్తిని. అది ఉపాసన. ఆ శ్లోకం ఒక మంత్రం. అది ధ్యానశ్లోకం కాదు. అంతఃకరణను ఏకాగ్రతతో సంధించిన ఉపాసన"

మళ్లీ అబ్బు నవ్వాడు. ఆ మంత్రానికి అమ్మవారిని సాక్షాత్కరింపజేసే శక్తి ఉంటే నాలాంటి మానవమాత్రుడు కోరుకునే ఈ చిన్న పనికి ఆ మంత్రం ఉపకరించదా?"

సర్వమంగళం నవ్వాడు. "చూడు సోదరా. నువ్వు అణ్వస్త్రాన్ని కాలిలో ముల్లు తీయడానికి సంధిస్తున్నావు"

"అది అణ్వస్త్రమని నువ్వు నమ్మితే ముల్లు తీసుకునేపాటి శక్తిని నాకిస్తుంది" ఇంకేదో అనబోతే అనసూయ భర్తని ఆపింది : "ఆయన విశ్వాసాన్ని కాదనడానికి

మీరెవరు? ఆ ధ్యానశ్లోకంతో దేవుడిని కళ్ల ముందుకు తెచ్చుకోవాలనుకోవడం లేదాయన. లక్ష రూపాయలు పెట్టుబడి పెట్టి నాలుగు రూపాయల వస్తువు కావాలనుకుంటున్నారు"

ఈ ఇంట్లో ఇద్దరు పిచ్చివాళ్లున్నారని నిర్ధారణి చేసుకుని అక్కడినుంచి లేచిపోయాడు సర్వమంగళం.

తదాదిగా ఆరు నెలలపాటు ఉపాసన సాగింది. మధ్యాహ్నం ప్రెస్సు పని చూస్తున్నాడు. సాయంకాలం వేళల్లో శంకరమఠానికి వెళ్లి కూర్చుంటాడు. ఒళ్లో పరీక్షిత్తుని కూర్చోబెట్టుకుంటాడు. అక్కడా కళ్లు విప్పి నలుగురినీ పరికించడు అబ్బుశాస్త్రి.

ఒకసారి రామశర్మ వచ్చాడు. అబ్బుశాస్త్రి ప్రయత్నాన్ని సర్వమంగళం చెప్పగా విని ఆశ్చర్యపోయాడు. పోనీ మెకార్ధీకి చెప్పి ఆ అమ్మాయి ఎక్కడుందో తెలుసుకోమంటే? అక్కర్లేదన్నాడు అబ్బుశాస్త్రి. తన మంత్రం చేస్తుంది ఆ పని. 'ఇది వెర్రి చింతకాయ' అనుకున్నాడు రామశర్మ.

❖ ❖ ❖

మహా శివరాత్రికి తార్నాకలో నర్సింగ్ గౌడ్‌గారి ఇంట్లో రాత్రంతా రుద్రాభిషేకం జరుగుతుంది. కనీసం నలభై కుటుంబాలు ఆ ఇంట్లో పోగవుతారు.

ఇంటి ముందున్న ఖాళీ స్థలంలో పందిళ్లు వేయించి ఘనంగా ఏర్పాట్లు చేస్తాడు నర్సింగ్ గౌడ్. సుల్తాన్ బజార్‌లో స్టీలు వ్యాపారం అతనిది. పరమ శివభక్తుడు. ఆనాటి తంతుకి తనతోపాటు అబ్బుశాస్త్రిని కూడా వెంటబెట్టుకు వెళ్లాడు సర్వమంగళం. అద్భుతంగా సాగుతున్న అభిషేకాన్ని మూడో ఝాముటవరకూ ఒకపక్క కూర్చుని గమనించాడు అబ్బుశాస్త్రి. వచ్చినవాళ్లంతా తాదాత్మ్యంతో, ప్రత్యేకంగా ఏర్పాటుచేసిన శివలింగంమీద క్షీరాభిషేకం చేస్తున్నారు. ఒక తన్మయత్వంతో, సామూహిక శివనామస్మరణతో అత్యంత వైభవంగా తంతు సాగిపోతోంది.

రాత్రి రెండు గంటలు దాటాక అక్కడ కూర్చోవాలనిపించలేదు అబ్బుశాస్త్రికి. ఇది చాలా ఆశ్చర్యకరమైన పరిణామం. ఎందుకని? ఓ పెద్ద మలుపుకి ఆ క్షణంలో అబ్బు ఆలోచన నాంది కాబోతోంది కనుక.

ఒక్కొక్కప్పుడు–జీవితం విచిత్రమైన మలుపులు తిరిగేటప్పుడు– గమనించగలిగితే–గుర్తుపట్టగలిగితే–మనస్సు ఉద్బోధ ముందుగా సూచనని ఇవ్వగలదు. సాధారణంగా ఆ promptingని మనం గుర్తుపట్టం లేదా ఉద్బోధని అణగదొక్కుతాం. చాలా ప్రముఖమైన సంఘటనల మలుపులో ఇలాంటి మానసిక స్పందనలు గుర్తుపట్టగలిగితే మార్గదర్శకాలవుతాయి.

అబ్బుశాస్త్రి నర్సింగ్ గౌడ్ ఇంట్లోంచి బయటకు వచ్చేశాడు. ఉస్మానియా యూనివర్సిటీ రోడ్డువేపు నడుస్తున్నాడు. పెదాలు ధ్యానశ్లోకాన్ని పఠిస్తున్నాయి. తార్నాక నుంచి నల్లకుంటకి నడవడం అసాధ్యం కాదు. రోడ్డుమీద తను ఒంటరి. అడుగులు పడుతున్నాయి. యూనివర్సిటీ రోడ్డు జంక్షన్ దగ్గర తిన్నగా వెళ్లకుండా సీతాఫల్‌మండీవేపు నడిచాడు. ఎందుకు? సరాసరి యూనివర్సిటీ రోడ్డులో వెళ్తే నల్లకుంటకి దగ్గర మార్గం కదా! పెదాలమీద హనుమద్ధ్యాన శ్లోకం ఉంది. నమ్మినవాడికి నమ్మినంత.

రామ్‌నగర్ గుండు ప్రాంతాలకు వచ్చేసరికి తల తిరగడం ప్రారంభించింది. అప్పటికి దాదాపు మూడు గంటలయింది. ఇక అడుగులు పడడంలేదు. తల విసురుతోంది. పడిపోతానేమోనన్న అనుమానం కలిగింది. ఎక్కడైనా కూలబడితే బాగుండునన్న ఆలోచన వచ్చింది. ఆ క్షణంలో కుడివేపు రోడ్డులోంచి ఓ ఆటో తోసుకువచ్చింది. ఆ సమయంలో ఆటో రోడ్డు మొగిలో ఆగింది. మరో ఆలోచన లేకుండా ఆటోవేపు నడిచాడు. విచిత్రంగా ఒకే సమయంలో రోడ్డుకి అటువేపునుంచి అదాటుగా ఎవరో ఆటో ఎక్కారు. ఆటో డ్రైవరు ఊహించని విధంగా ఇటువేపునుంచి అబ్బుశాస్త్రి ఎక్కాడు.

ఆ సంఘటనకి ముగ్గురూ ఆశ్చర్యపోయారు. అటునుంచి ఎక్కిన వ్యక్తి ఒక స్త్రీ. ఇటునుంచి ఎక్కిన వ్యక్తి అబ్బుశాస్త్రి. ముందు కూర్చున్నది డ్రైవరు. ఒక్క క్షణం ఈ అసంకల్పిత ఘటనకి అబ్బు కూడా ఆశ్చర్యపడ్డాడు. ఆటో ఖాళీగా ఉన్నదనుకొని తను ఎక్కాడు. అర్థాంతరంగా ఎక్కిన ఈ వ్యక్తి ఎవరు? అదే ఆ వ్యక్తి ఆలోచన కూడా. ఆ సమయంలో ఆటో ప్రత్యేకంగా తనకోసం ఎదురుచూస్తోంది. హఠాత్తుగా ఎక్కిన ఇతనెవరు?

తెల్లవారుఝూమున నిర్మానుష్యంగా ఉన్న రోడ్డుమీద లారీ ఎదురుగా వచ్చింది. లారీ వెలుగులో ఆటోలో రెండు ముఖాలూ భగ్గుమన్నాయి. ఆ వ్యక్తి–స్త్రీ ముఖంమీద రక్తం ఉంది.

అబ్బు కళ్లనిండా ఆశ్చర్యం ఉంది. ఒక్క క్షణం–అతని మనస్సు వాయువేగ మనోవేగాల్లో గతాన్ని వెదికింది. అవును. ఇదే ముఖం!–దూరంగా–కాస్త దూరంగా–తాను ఆనాడు చూశాడు.

సంవత్సరాల కిందటి జ్ఞాపకం–తెరమీది దృశ్యంలాగ, భూతద్దంలో చూసినట్టు మెరిసింది. అవును. సందేహం లేదు. అదే రక్తపు చార. ఆ రక్తపు చార లేకపోతే బహుశా ఆ ముఖాన్ని గుర్తుపట్టలేకపోయేవాడేమో!

గొంతుని ప్రయత్నంతో పెకలించుకుని "నువ్వు నువ్వు–లీల–కదూ?" అన్నాడు.

ఆ వ్యక్తి తుళ్లిపడింది. మరో లారీ లైట్లు. ఆ ముఖంలో ఆశ్చర్యం, కాస్త భయం, అంతలో కోపం. అక్షరాలా ఈ మూడూ కలిసిన ముఖాన్నే ఆనాడు తాను చూశాడు.

అతని జ్ఞాపకం మరింత స్పష్టమైంది. గదిలో జరిగిన సంఘటన కారణంగా కోపం, కొత్తదారి వెదుక్కోవాలనే భయం.

"అవును. నువ్వు లీలవే!!" ఇప్పుడు ఆటో డ్రైవరు సీటులోంచి దిగాడు. అతను తాగిన వాసన గుప్పుమంది. "అరె! కౌన్ హైరే!–చల్!!" అని అబ్బు భుజం పట్టుకుని బయటికి లాగాడు. రోడ్డుకి అడ్డంగా పడ్డాడు అబ్బు. అదృష్టవశాత్తూ మరో లారీ రాలేదు. ఆటో ముందుకు దూసుకుపోయింది.

అది మహా శివరాత్రి. రుద్రావతారమైన హనుమద్ధ్యాన శ్లోకం ఇంకా పెదాలమీద ఉంది. అశోకవనం లేదు. సీత లేదు. కళ్ళముందు మాయమయ్యే ఆటోలో లీల ఉంది.

చిన్నప్పుడు చేసిన తప్పు ఈసారి అబ్బు చెయ్యలేదు. ఆ మసకవెలుగులో ఆటో నెంబరుని స్పష్టంగా చూశాడు. నిర్దుష్టంగా గుర్తుపెట్టుకున్నాడు.

ఏపీ 09 బి 5667.

## 24

జరిగింది విని సర్వమంగళం, అనసూయ కొయ్యబారిపోయారు. అబ్బు ప్రమాదంనుంచి తప్పించుకున్నందుకు కాదు. లీల కనిపించినందుకు కాదు. మహా శివరాత్రినాడు ఈ సంఘటన జరిగినందుకు కాదు. సుందరకాండలో కేవలం ధ్యానశ్లోకంతో అబ్బు తన లక్ష్యాన్ని సాధించినందుకు. శివరాత్రి అభిషేకానికి వెళ్ళిన అబ్బు–అర్థాంతరంగా ఇంటికి వెళ్ళాలని ఎందుకు అనుకోవాలి? సర్వమంగళానికి మాటైనా చెప్పకుండా ఎందుకు బయలుదేరాలి? ఎప్పుడూ లేనిది అబ్బుకి తల తిరగడమేమిటి? అప్పుడే ఆటో కనిపించడమేమిటి? ఆ ఆటో మరొకరికి ఉద్దేశించినది కావడం ఏమిటి? అందులో ఎక్కిన వ్యక్తి లీల కావడం ఏమిటి?

రామశర్మ మర్నాడే పరుగున రాజమండ్రి నుంచి వచ్చాడు. జరిగిందంతా విని ఆశ్చర్యపోయాడు. ఆటో వివరాల్ని పట్టుకోవడం అసాధ్యం కాదు–నెంబరు ఉంది కనుక. కాని పొరపాటు. ఆ వివరాల్ని కనుక్కోవడం అంత సులభం కాలేదు. కారణాలు బోలెడు. ఆటో జమాలుద్దిన్‌ది. నెరిసిన గెడ్డం, తెల్ల టోపీ, అతి నెమ్మదిగా మాట్లాడే మనిషి. వయస్సు దాదాపు 60. అత్యంత దైవభక్తుడు. రోజుకి అయిదుసార్లూ నమాజు చేస్తాడు. ఆటో అతని సొంతం. ఆరుగురు పిల్లలు. ఓపికలేక రాత్రిళ్ళు ఆటో నడపడు. ఆ రాత్రి తను చూసింది గెడ్డం ఉన్న మనిషిని కాదని అబ్బుశాస్త్రి స్పష్టంగా చెప్పాడు. రాత్రివేళల్లో నడవని ఆటోని సొంతదారుడు కాకుండా గెడ్డంలేని మరో డ్రైవరు ఎవరు నడుపుతాడు?

మొదట జమాలుద్దిన్ మాటలకి లొంగలేదు. మాట తప్పించాడు. ఇందులో ఏదో

లొసుగు ఉంది. రామశర్మ రెట్టించాడు.

"జమాల్! నువ్వు దైవభక్తుడివి. మరో దైవభక్తుడికి అన్యాయం జరిగింది. సంవత్సరాల తరబడి ఆ వ్యక్తికోసం వెదుకుతున్నాడు. ఆ మనిషి నీ ఆటోలో కనిపించింది. నీ ఆటోని నువ్వు కాకుండా వేరే ఎవరు నడుపుతారు?"

జమాల్ చాలాసేపటికి బెసిగాడు. రాత్రివేళల్లో అప్పుడప్పుడు నడపడానికి ఒక మనిషి వస్తాడు. రాత్రికి అద్దె 12 వందలు ఇస్తాడు. ఇది బోలెడు డబ్బు. ఏ రాత్రికో ఆటోని తన ఇంటిముందు వదిలేసి వెళ్ళిపోతాడు.

"అతని పేరు?"

"విచిత్రమైన పేరు సాబ్. నేనెప్పుడూ వినలేదు. అతను–ఆ నరిసిపండు" చెప్పాడు జమాల్.

అమ్మయ్య. ఇంగ్లీషు నానుడి ప్రకారం పిల్లి సంచీలోంచి బయటికి వచ్చింది. "అయితే ఈ నరిసిపండు ఎక్కడ ఉంటాడు?"

"తెలియదు"

"తెలుసుకోకుండా ఆటోని అతని చేతికి ఇస్తున్నావా?"

వెర్రిమొహం వేశాడు జమాల్.

"క్రితంసారి ఎప్పుడు వచ్చాడు?"

"నాలుగు రోజుల కిందట"–అంటే–అబ్బు ఆటో ఎక్కిన రాత్రి.

"మళ్ళీ ఎప్పుడు వస్తాడు?"

"తెలీదు"

మరో మబ్బుతెర. ఐతే ఇది కష్టమైన మజిలీ కాదు. జమాలుద్దిన్ ఆటో అవసరమున్న మనిషి. రాత్రివేళ మాత్రమే అవసరమున్న మనిషి. రోజూ అవసరంలేని మనిషి. మామూలుగా ఇచ్చేదానికంటే ఎక్కువ డబ్బు ఇచ్చే మనిషి. ఇవ్వగలిగిన మనిషి. ఏమిటా పని? ఎవరా మనిషి? దొరుకుతాడు. ఏదో ఒకరోజు దొరుకుతాడు–అన్నాడు రామశర్మ. రోజూ జమాల్ ఆటో నిలిపే స్టాండు దగ్గరికి–ఆర్టీసీ క్రాస్‌రోడ్స్ దాటాక ముషీరాబాద్–బోయిగుడా జంక్షన్ దగ్గర తిష్టవేశాడు రామశర్మ.

అతని పక్కనే అబ్బుశాస్త్రి. ఆటో స్టాండుకి ఎదురుగా బస్సు స్టాండు. పక్కనే ఇరానీ హోటల్.

జమాల్ రామశర్మని గుర్తుపట్టాడు. "రోజూ ఎందుకు సాబ్. ఈసారి ఆ మనిషి

కనిపిస్తే చెప్తాను" అన్నాడు.

అబ్బుశాస్త్రి నవ్వాడు. "నువ్వు చెప్పడానికి ఆ మనిషి అవకాశం ఇవ్వడు"

రామశర్మ అతని మాటని సవరించాడు. "చెప్పేదాకా టైమ్ వృథా చెయ్యదలుచుకోలేదు. ఆటో నడిపే వ్యక్తికీ, ఆటో ఎక్కే మనిషికీ ఏమీ సంబంధం లేకపోవచ్చు. లేక ఉందా?"

ఆ క్షణంలో "భాయీ జాన్!" అని జమాల్ వీపు చరిచి అతని జేబులో బీడీని తీసుకు వెలిగించే మనిషిని చూసి జమాల్ తుళ్లిపడ్డాడు.

"నరిసిపండూ!" అన్నాడు వాళ్లకి వినిపించేలాగ. రామశర్మ, అబ్బుశాస్త్రి–ఇద్దరూ ఎలక్ట్రిక్ షాక్ తగిలినట్టు తుళ్లిపడ్డారు. అబ్బు దాదాపు అరిచినంత పని చేశాడు. "అవును. ఇతనే!" అని.

ఈ వ్యవధిలో ఆరోజు రాత్రి తాను చూసిన, ఆటోలోంచి బయటికి తోసిన ముఖాన్ని గుర్తుపట్టాడు నరిసిపండు. ఆ రాత్రి భుజబలం చూపేవాడేకాని తర్వాత అల్లరవుతుందని భయపడకపోలేదు. ఇప్పుడు వీళ్లని చూడగానే అల్లరి అవబోతోందని గ్రహించాడు. వీళ్లు తప్పనిసరిగా పోలీసు కంప్లయింటు ఇచ్చి ఉంటారు. మరుక్షణంలో రోడ్డుకి అడ్డంగా పరిగెత్తాడు.

మధ్యాహ్నం ట్రాఫిక్ ఎక్కువగానే ఉంది. రామశర్మ అతనికి చాన్స్ ఇవ్వలేదు. అతన్ని వెంబడించి ఎన్టీఆర్ ఎస్టేట్ పొలిమేరల్లో మెడ దగ్గర చొక్కా పట్టుకున్నాడు. నరిసిపండు బతిమాలాడు.

"ఆ రాత్రి లాగాలని లాగలేదు గురూ. నీ తోడు. నన్ను వదిలెయ్" అని కాళ్లు పట్టుకోబోయాడు. అప్పటికి అబ్బు వాళ్ల దగ్గరికి చేరాడు.

"నువ్వు చెప్పు గురూ. నీకేం దెబ్బలు తగల్లేదు కద?" అన్నాడు నరిసిపండు ప్రాధేయపడుతూ.

వీడు పిరికి మొద్దు అని తేలింది. పిరికివాడిని బెదిరించడం సుళువు. చేతిలో చొక్కాని వదలకుండా పక్కనే టైపు మిషన్ పెట్టుకుని జాబ్ టైపు చేసుకుంటున్న షాపు ముందున్న బల్లమీద కూలేశాడు. అది చిన్న దుకాణం. ముగ్గురు మనుషులు నిలవలేనంత చిన్న గది. ఎదురుగా ఉన్న టీ కొట్టులోంచి టీ తెచ్చుకోడానికి వెళ్లింది ముస్లిం అమ్మాయి. గుమ్మానికి అడ్డంగా నిలబడ్డాడు రామశర్మ. నరిసిపండుకి జారిపోయే అవకాశం లేదు.

రామశర్మకి తట్టిన మొట్టమొదటి అబద్ధం–తన ఊడిన పన్ను.

దాన్ని వాడాడు. "నువ్వు బయటికి లాగినప్పుడు మావాడికి రెండు పళ్లు

విరిగాయిబే. అర్జంటుగా కట్టించుకున్నాడు. అర్ధరాత్రి బేరానికి అంత దూకుడు పనికిరాదు. ఆ రాత్రి పాసింజరు తీసుకుని ఎక్కడికి వెళ్లావు? చెప్పు" ముఖంమీద ముఖం పెట్టి అడిగాడు.

అలనాడు బొంబాయి గూండాలు తనకి మార్గదర్శకులు.

పక్కనే నిలబడిన వెర్రి బ్రాహ్మడు ఓ వెర్రిప్రశ్న వేశాడు "ఇంతకీ ఆ ఆటోలో ఉన్న మనిషి ఎవరు?"

నరిసిపండు అఖండమైన తెలివితేటలు కలవాడు. ఇద్దరిలో ఒకాయన బేరం గురించి అడుగుతున్నాడు. రెండో ఆయన మనిషి గురించి అడుగుతున్నాడు. అంటే–ఈ ఇద్దరూ తనని నిలదీయడానికి కారణం తనని కొట్టడానికి కాదు. మనస్సులోనే నిట్టూర్చి–ఉన్నట్టుండి– ప్రపంచంలో ప్రతీ నేరస్తుడూ వాడే అతి చవకబారు ట్రిక్‌ని వాడాడు–"అరే, భాషామియా" అంటూ.

ఎదుటి వ్యక్తికి అది instinct. ఇద్దరూ అటు చూశారు. నరిసిపండు దూకేశాడు. దూకేస్తాడని రామశర్మ గ్రహించడానికి ఐదు సెకెన్లే ఆలస్యమైంది. వదిలేసిన చొక్కాని అందుకోబోయాడు. కాని చొక్కా జారి నరిసిపండు జేబు చిరిగి జేబులోంచి రెండు కాగితాలు చేతిలో మిగిలాయి.

ఒకటి నరిసిపండు రేషన్ కార్డ్. అనుకోకుండా రొట్టె విరిగింది. కాని ఊహించకుండానే నేతిలో పడింది. రామశర్మ, అబ్బుశాస్త్రి–ఇద్దరూ నవ్వుకున్నారు.

❖ ❖ ❖

ఏకుత్‌పురా లోకల్ రైల్వే పట్టాల పక్కన–ఇరుకు సందులో–దాదాపు ఒకదానిమీద ఒకటి పేర్చినట్టున్న ఇరుకు గదుల ఇళ్ళలో ఒక చిన్న వాటా నరిసిపండుది.

హైదరాబాదులో ఇంటి అడ్రసు పట్టుకుని ఇల్లు వెదకడం కష్టం. అడ్రసు పట్టుకుని బయలుదేరితే–కనీసం 20 మందికైనా–ఇల్లు వెదుకుతున్న మనిషి కథ తెలుస్తుంది–ఇల్లు తెలియకపోయినా.

"నీ ఇంటికోసం ఎవరో వెదుకుతున్నారు" అని పక్కింటి ఫాన్సీ వస్తువులమ్మే రియాజ్ భార్య నరిసిపండు భార్య సోయితాతో చెప్పింది. సోయితాది పెద్ద శరీరం. అయినా ఒద్దికైన శరీరం. మనసూ అంతటిదే. అరకు సమీపంలో పాడేరు నుంచి గంజాయి దొంగరవాణా చేసే కుటుంబంలో పుట్టింది. గంజాయితోపాటు కోటబొమ్మాళి వచ్చి నరిసిపండుకి అతుక్కుపోయింది. నరిసిపండు అందగాడు. చాకులాంటి తెలివితేటలున్నవాడు. సోయితా తండ్రినీ, అన్ననీ పోలీసుల్నుంచి తప్పించిన కారణానికే

సోయితాని బహుమతిగా దక్కించుకున్నాడు.

దొంగరవాణా కేసుల్లో చిన్న దుర్మార్గం ఉంది. ఎప్పుడూ సరుకుతో మధ్యవర్తి దొరుకుతాడు. వాడిని కుళ్ళబొడిచి, కోసేసినా అసలు మనిషి పేరు చెప్పడు. జైలు, శిక్ష వాళ్లని బాధపెట్టే విషయాలు కావు. జైలుకి వెళ్లడం వాళ్లని ఇబ్బందిపెట్టే విషయం కాదు. కొండజాతివారిది జంతు ప్రవృత్తి. రుజువులు దొరకని కేసుల్లో ఏ రెండు మూడేళ్లో శిక్ష పడుతుంది. జైలులో ఆకలి తీరుతుంది. వాళ్లని శిక్షించే విషయం–ఆకలి. సోయితా గొప్ప ప్రతిభని సాధించింది. అపురూపంగా వంటలు చేస్తుంది. ఇప్పటికీ ఆ కుటుంబాల్లో పచ్చిమాంసాన్ని తినేవారున్నారు. ఐనా సోయితాకి అబ్బిన ఈ ప్రత్యేకత కారణంగా ఆమె పెద్దన్న పాడేరు రోడ్డుమీద చిన్న గుడిసె దుకాణాన్ని తెరిచాడు. అప్పుడప్పుడు వచ్చే పర్యాటకులకు సోయితా వంట చాలా పాపులర్. ఆ ప్రాంతంలో స్వేచ్ఛగా తిరిగే అన్నలకు దాని వంట మృష్టాన్న భోజనం. అప్పుడప్పుడు–పెద్దన్న ముప్ఫై నలభైమందిని గుర్తుపట్టలేని అడవి లోపలికి తీసుకెళ్లి అన్నల ఉదారమైన బహుమతులు పుచ్చుకుంటాడు. తీరా గంజాయి రవాణా, పోలీసులు అరెస్టుచేయడం, పెళ్లి–సోయితాను స్వస్థలానికి దూరం చేశాయి. నరిసిపండు జీవితం మజిలీలమీద–చాలా గమ్యాలను దాటి ప్రస్తుతం సికింద్రాబాదు చేరింది.

ఇప్పుడీ పక్కింటావిడ తమ ఇంటిని ఎవరో వెదుకుతున్నారని చెప్పగానే తండ్రి, అన్నల గంజాయి రవాణాయే కారణమని అనుకుంది. కాని మూడో రోజున పైజామా, లాల్చీతో, నుదుటిన కుంకుమబొట్టుతో గుమ్మంలో నిలబడిన అబ్బుశాస్త్రిని చూసి నిర్ఘాంతపోయింది. ఏవిధంగా చూసినా, కలలోనైనా అలాంటి మనిషి తన ఇంటికి రావడానికి కారణం కనిపించదు.

"ఎవరు దొరా!" అంది మంచం దిగి కొంగు తిప్పుకుని బుద్ధిగా.

"ఇది నరిసిపండు ఇల్లేనా?"

"ఆడు నా మడిసి బాబూ. ఏదైనా ఎదవ పని చేశాడా బాబూ–మకిడీ పిల్లాడు?"

చిన్న సంచీలో తీసుకొచ్చిన డజను అరటిపళ్ళను మంచంమీద పెట్టాడు అబ్బుశాస్త్రి.

వచ్చింది పోలీసు మనిషేమోనన్న భయం ఇప్పటికి పోయింది సోయితాకి. ఆయన కూర్చోడానికి గడ్డిమోడాని ముందుకు తోసింది.

జరిగిన కథంతా చెప్పి : "నాకు నరిసిపండుమీద కోపం లేదు. ఆరోజు ఆటోని ఎక్కడికి తీసుకెళ్లాడో తెలుసుకోవాలి"

"రేత్తిరిదాకా రాడు దోరా. నేను కనుక్కొని చెప్తాను"

"ఇంట్లో ఎప్పుడు ఉంటాడో చెప్పు. అప్పుడు వస్తాను"

"ఆడెప్పుడొస్తాడో ఆడికే తెలీదు బాబూ. పది గంటలకి లేస్తాడు. ఏరోజూ పగలు ఇంట్లో భోజనం చెయ్యడు" అని నవ్వి "రేత్తిరి ఇల్లు వదలడు బాబూ. ఇద్దరికీ బుడ్డీ తెత్తాడు. నా సేతి వంటంటే పడిచస్తాడు. ఎప్పుడేనా రేత్తిరి డ్యూటీలకు ఎళ్తాడు. బోలెడు డబ్బుతో వస్తాడు. ఏం చెస్తున్నావురా పింజారీ–అంటాను. నన్ను జుత్తు పట్టుకు బాది 'నీకెందుకే నంజా!' అంటాడు" తాగిన మాట, కొట్టిన మాట గిలిగింతలు పెట్టినట్టు నవ్వుకుంటూనే చెప్పింది సోయితా. నరిసిపండు ప్రవర్తనమీద అది ఆరోపణ కాదు. సాధారణంగా ఇంట్లో జరిగే ముచ్చట. అబ్బుశాస్త్రికీ నవ్వొచ్చింది. లేచాడు.

"నన్ను మీ ఆయన చూశాడు గాని నేనెవరో తెలీదు. నాకు ఆనాడు ఆటోలో ఉన్న అమ్మాయి ఎక్కడుందో తెలియాలి" అని బయటికి వచ్చేశాడ.

ఆ రాత్రి ఇద్దరూ సీసా మందు బైఠాయించినప్పుడు ఎంత ప్రయత్నించినా, సోయితా నిలదీసినా నరిసిపండు ఆ కథ చెప్పలేదు. ఆ మనిషీ ఎవరో చెప్పలేదు. సోయితా అడిగినకొద్దీ రెచ్చిపోయి తాగాడు. తాగినకొద్దీ సోయితాని కొట్టాడు. కొట్టినకొద్దీ కితకితలు పెట్టినట్టు ఉమ్మ్మ తిరిగిపోయింది సోయితా.

❖ ❖ ❖

అబ్బుశాస్త్రి వచ్చినప్పుడల్లా సమృద్ధిగా పళ్లు తెస్తున్నాడు. కావలసిన సమాచారం తెలియనందుకు విసిగిపోలేదు. ఒకరోజు కావాలనే చీకటిపడ్డాక వచ్చాడు. చీకట్లో ఆ సందు నిద్రపోతున్న జాగిలంలాగ ఉంది. చిన్న గదుల్లాంటి ఇళ్లల్లో సంగీతం, మనుషుల గొంతులూ పెచ్చురేగిపోతున్నాయి. రాత్రివేళ ఆ సందు మేల్కొన్న పగలులాగ ఉంది. ఆవేశాలకూ, కోరికలకూ అగ్నిగుండంలాగ ఉంది.

నరిసిపండు గుక్క మందు తాగి, కబాబు ముక్క కొరికి తలెత్తేసరికి అబ్బుశాస్త్రి కనిపించాడు. సోయితా కూడా అదే పని చేస్తోంది. పగటివేళ తనపట్ల చూపిన పెద్దరికం గొంతులో మందు పడగానే సెలవు తీసుకుంది.

"ఏంటి పూజారయ్యా, ఈయేలప్పుడొచ్చావ్. ఓ గ్లాసు పీకుతావా?" అంది గలగలా నవ్వుతూ.

పెడీల్మని కొట్టాడు నరిసిపండు. ఆ వూపుకి కిందపడి పెదవి కొరుక్కుంది. వెచ్చటి రక్తాన్ని చప్పరిస్తూ చక్కిలిగింత పెట్టినట్టు నవ్వింది సోయితా. అది సజావైన ఆలోచనకి లొంగని అరాచకం. పరాచికం.

అక్కడ నిలవాలనిపించలేదు. వెనక్కి తిరిగిన అబ్బుని చూసి నరిసిపండుకి

జాలేసింది. సందులోకి నడిచివచ్చాడు. వెళ్తున్న అబ్బుని పలకరించాడు. "వద్దు బాబూ. నిప్పులో చెయ్యి పెట్టకు. నా మాటిని ఆ సంగతి మరిచిపో"

వాసనని లెక్కచెయ్యకుండా అతని ముఖంలో ముఖం పెట్టి నిలదీసే గొంతుతో అన్నాడు "ఆ అమ్మాయి ఎక్కడుంది?" అని.

ఒక్క క్షణం బిత్తరపోయాడు నరిసిపండు. "బాబుగారూ. ఆ అమ్మగారు దేవతలాంటోరు. ఆరోజు జరిగిందానికి తప్పు ఆ అమ్మది కాదు. ఆ దొంగనాకొడుకుది. ఆయమ్మ ఎప్పుడూ అలా కోపం తెచ్చుకోవడం నేను చూడలేదు. ఇంతకీ ఆ నంజికొడుకు సావలేదు. సంపడం ఆయమ్మ ఉద్దేశం కాదు. చెయ్యి కోసి పారిపోయొచ్చింది"

విషయం అర్థమైంది. "ఆవిడెక్కడ ఉంది?"

"పోలీసు కేసు అవుతుందేమోనని నేనే ఇల్లు ఖాళీ చేయించాను. ఇప్పుడు-ఇప్పుడు-ఐనా ఆవిడ ఊసు మీకెందుకు బాబూ?"

"చూడు. ఆవిడ ఆరోజు ఏం చేసిందో నాకు అనవసరం"

"ఐతే తమరు ఆ పార్టీ మనిషి కారా!" అన్నాడు నరిసిపండు.

"కాను. నాకావిడ ఎక్కడుందో తెలియాలి. ఆవిడకోసం సంవత్సరాలనుంచీ వెదుకుతున్నాను"

"ఎందుకు?"

"ఎందుకో చెప్పలేను. నేనావిడని చూడాలి. ఆవిడతో మాట్లాడాలి" నరిసిపండు రెండు చేతులూ పట్టుకున్నాడు. అబ్బుశాస్త్రి నోట్లోంచి మాట రాలేదు కాస్సేపు. గొంతు బొంగురుపోయింది. దుఃఖం తోసుకువచ్చింది ఎన్ని సంవత్సరాల అన్వేషణ ఇది!

ఈ క్షణాన-ఈ సమయంలో-ఒక తాగుబోతుకి తన అన్వేషణకి కారణాన్ని వివరించాలి. ఎలా? ఆ అవసరం లేకపోయింది. అతని మాటలు చెప్పలేని కథని అతని ముఖం చెప్పింది. అతని దుఃఖం చెప్పింది. ఇలాంటి మనిషిని నరిసిపండు ఎన్నడూ చూడలేదు. చూడలేడు. అతని మందు పూర్తిగా దిగిపోయింది. ఆ క్షణాన అతనెన్నడూ ప్రయత్నపూర్వకంగా చెయ్యని పనిని చేశాడు. ఆమె ఇంటి అడ్రసు చెప్పాడు.

❖ ❖ ❖

సర్వమంగళం, అనసూయ, రామశర్మ, అబ్బు సభ తీర్చారు. ఇది సంవత్సరాల తరబడి ఎదురుచూస్తున్న ముహూర్తం. ఆరేళ్ళ అమ్మాయి దూరమయాక-మొదటిసారిగా ఆమెకు ఎదురు నిలిచి మాట్లాడే సందర్భం.

ఆమె జీవితం ఇన్ని సంవత్సరాలలో ఏ మలుపులు తిరిగింది? ఎన్ని మలుపులు తిరిగింది? అసలు తను భావిస్తున్నట్టు తన అవసరం ఆమెకు ఉన్నదా? ఎవరి ప్రమేయం అవసరంలేని చక్కని జీవితాన్ని గడుపుతోందా? సంవత్సరాల తర్వాత–దూరంగా తారసపడినా రెండుసార్లూ ముఖంమీద రక్తం చిమ్మిన దృశ్యం ఏదో వైపరీత్యాన్ని సూచిస్తోంది. నరిసిపండు మాటల్నిబట్టి ఆమె చెయ్యరాని పనులు చేస్తున్నట్టు అర్థమౌతోంది. ఏమిటవి? ఆమెకి ఎదురు నిలిచి ఏం మాట్లాడాలి? తనలాంటి మనిషి ఒకరున్నారని ఆమెకి తెలీదు. కలలో కూడా ఊహించి ఉండదు. నిజానికి తను–నేరభావంతో ఈ ప్రయత్నాన్ని, ఈ అన్వేషణనీ చెయ్యకపోతే–జీవితంలో ఒకరికొకరు తారసపడే అవసరం ఉండేదికాదు.

ఎన్నో యాక్సిడెంట్లు జరుగుతాయి. ఎందరో నష్టపోతారు. అందరికీ ఉపశమనం ఇచ్చే వ్యక్తి దొరకరు. కొందరికి అవసరమూ ఉండదు. రాజీవ్ గాంధీ మారణహోమంలో అన్యాయంగా, తాము చెయ్యని నేరానికి ప్రాణాలు కోల్పోయిన పద్దెనిమిదిమంది గురించి ఎందరికి తెలుసు? ఆ చావు కారణంగా పద్దెనిమిది కుటుంబాల చరిత్ర ఎలా అల్లకల్లోలమైంది? ఆ బీభత్సం నుంచి ఆ కుటుంబాలు తేరుకున్నాయా? ఒక్క కుటుంబానికైనా 'నేరభావం'తో ఆదుకోవాలని తాపత్రయపడే అబ్బు దొరికాడా? ఇవి సమాధానాలు దొరకని ప్రశ్నలు–ఎవరూ పట్టించుకోలేదు కనుక.

"నేను మీతో వచ్చేదా?" అన్నాడు రామశర్మ.

అబ్బుకి ఏ ఆలోచనా పోవడంలేదు. ఒక్క క్షణం ఆగి అన్నాడు "వద్దు"

ఎప్పుడు వెళ్లాలి? తలుపు తట్టాక తలుపుని ఎవరు తీస్తారు? ఎప్పుడూ చూడని కొత్త మనిషిని చూసి ఆమె ఎలా స్పందిస్తుంది? తన చెప్పవలసిన మొదటిమాట ఏమిటి? చీకటిపడ్డాక ఆమె ఇంటికి వెళ్ళాలనుకున్నాడు. అది మొదటి నిర్ణయం. చీకటి చుట్టుపక్కల ప్రపంచంమీద ముసుగు వేస్తుంది. తెలియని ఏకాంతాన్ని కల్పిస్తుంది. కాని మరీ పొద్దుపోకూడదు.

ఎలా వెళ్లాలి? నలుగురూ సుదీర్ఘంగా చర్చించారు. అతి సామాన్యంగా పైజామా లాల్చీతో, నుదుటిమీద బొట్టు లేకుండా. అబ్బు, సర్వమంగళం వ్యతిరేకించారు. అసాధారణమైన సమావేశానికి బొత్తిగా సంప్రదాయానికి విడాకులివ్వనక్కర్లేదు. చిన్న బొట్టు ఉంచుకోవాలి. అది వ్యక్తి అస్తిత్వం. అతని వ్యక్తిత్వానికి దర్పణం.

❖ ❖ ❖

ఒక పెద్ద బిల్డింగ్‌లో గేటు తీసుకుని లోపలికి రాగానే గుబురుగా ఉన్న చెట్ల మధ్య కింద పోర్షనంతటిలో ఆవిడ ఉంటున్నది. మేడమీద రెండు పోర్షన్లు. సాయంకాలం ఏడున్నరకి ఆమె తలుపు తట్టాడు అబ్బు. లోపల ఏమీ అలికిడి వినిపించలేదు. ఈసారి కాలింగ్ బెల్‌ని వెదికి పట్టుకుని అదిమాడు. లోపల శబ్దం భయంకరంగా ఉరిమింది. తనే ఆ శబ్దానికి తుళ్ళిపడ్డాడు. వీధిదీపం లీలగా తలుపుమీద పడుతోంది. లోపలిగదిలో దీపం వెలిగింది. కాలినడక వినిపించింది. తలుపు తెరుచుకుంది. ఆ క్షణంలో అబ్బు కళ్లముందు జిగేలుమని ఒక మెరుపు మెరిసింది. తన ఎదురుగా–స్పష్టంగా–నిర్దుష్టంగా కనిపించిన లీలని చూసి నిశ్చేష్టుడయ్యాడు అబ్బు.

ఆమె వంగపండు నైటీలో ఉంది. ఆమె మెరుపుతీగెలాగ ఉంది. ప్రతీ అవయవం పోతపోసినట్టుంది. కాని–కాని కాలం తాకిడికి అరిగిపోయి, మసిబారిన తాజ్‌మహల్‌లాగ ఉంది. ఆ శరీరంలో, ముఖంలో విపరీతమైన రాజసం ఉంది. ఆ శరీరం ఒకప్పుడు దివ్యంగా ఉండేది. ఇప్పుడు ఒకప్పటి భయాల్ని గుర్తుచేసేదిగా ఉంది. ఒకప్పుడు ఆ కళ్లల్లో తేజస్సు ఉండేది. ఇప్పుడు నుసికట్టిన మసిబొగ్గుల్లాగ ఉన్నాయి. ఇప్పుడు శరీరంలో అలసట తెలుస్తోంది. ఐనా ఇప్పుడూ అందంగానే ఉంది. కాని ఇప్పుడు ఒకప్పటి అందానికి కేవలం జ్ఞాపికలాగ ఉంది. శరీరంలో ప్రతి అవయవంలోనూ సెక్సూ, పొగరూ, వ్యక్తిత్వం, ప్రత్యేకత–రెచ్చగొట్టేంత గొప్పగా ఉన్నాయి. చూడగానే మతి పోగొట్టే సౌందర్యం అది. అనుభవించడానికి అవినీతిని ప్రోత్సహించే సౌందర్యం. కొందరి అందాన్ని చూసినప్పుడు చేతులెత్తి నమస్కారం చెయ్యాలనిపిస్తుంది. కొందరిని పలకరించి పరిచయం చేసుకోవాలనిపిస్తుంది. కొందరిని దగ్గరికి తీసుకుని ముద్దుపెట్టుకోవాలనిపిస్తుంది. ఆఖరి కోవకి చెందిన రెచ్చగొట్టే సౌందర్యం అది. కాని ఆమెలో భయపెట్టే, తిరగబడే, ఎదురుతిరిగే స్వభావం–ఆ వ్యక్తిత్వానిది కానిది–ఆ వ్యక్తిత్వానికి మప్పినది–కొట్టవచ్చినట్టు తెలుస్తోంది. పండకాసిన జామతోటకి వేసిన కంచెలాంటిదది.

పైజామా లాల్చీతో, ఎర్రని బొట్టుతో దాదాపు గుండులాగే ఉన్న పల్చని జుత్తుతో సగం వెలుగులో నిలబడిన ఆ కొత్త ముఖాన్ని చూసి నివ్వెరపోయింది లీల. "ఎస్!" అంది. అదీ మొదటి మాట.

అబ్బుకి మాట రావడంలేదు. లీల ఇప్పుడు కాస్త కదిలింది–రెండో రెక్క తలుపు తెరిచి. ఇప్పుడు హాలులో వెలుగు స్పష్టంగా అతని ముఖంమీద పడుతోంది. ఎవరితను? అడ్రసు గల్లంతై తప్పుచోటుకి వచ్చాడా?

"ఎవరు?" కాస్త చురుకుగా అడిగింది లీల.

కాని తను మాట్లాడాలన్న విషయం మరిచిపోయాడు. మాట్లాడడం అవసరమన్న

విషయం మరిచిపోయాడు. సంవత్సరాల తరబడి ఓ అమూల్యమైన అనుభవంకోసం ఎదురుచూస్తాం. ఆ అనుభవం అనుభవంలోకి వచ్చినప్పుడు–ఆ అనుభవం రుచికాక–ఆ అరుదైన అనుభవం దాన్ని దూరంగా నిలిపి ప్రశ్నిస్తుంది. అది రుచించదు. ఎందుకంటే అనుభవించే క్షణం కాదిది. సంవత్సరాల తరబడి తన ఆలోచనల్ని పరీక్షకు పెట్టిన క్షణం. అనుభవాన్ని భద్రంగా దాచుకోవలసిన క్షణం.

తను కనీసం మూడు నాలుగు నిముషాలు మాట్లాడలేదని అబ్బు శాస్త్రికే తెలియదు. ఆమె మాట్లాడడానికి పెదవులు విప్పినప్పుడు బయటికి వ్యాపిస్తున్న ఖరీదైన స్కాచ్ పరిమళం అతనికి కొత్త.

తనకోసం వచ్చి, అర్హతలేని, అర్థంలేని, సభ్యత కూడా తెలీని, అసమర్థుడైన, తన సమయాన్ని చెడగొట్టే... తనమీద తెచ్చిపెట్టుకున్న సంస్కారపు బురఖా జారిపోయి, కుసంస్కారం ఆమెలో పడగ విప్పింది.

"ఎవడ్రా నువ్వు లంజకొడకా!" అని తలుపు భళ్లున మూసింది.

## 25

ఖరీదైన వస్తువులు కొనుగోలు చేసేవారికి డబ్బు ఎక్కువైనా అందంగా అలంకరించిన షోరూములు కావాలి. ఖరీదైన సుఖాలు కొనుగోలు చేసే ఆడవారికి ఎక్కువైనా ఏకాంతానిచ్చే రూమ్‌లు కావాలి. ఆ వేదికని కల్పించాడు రాజశేఖరం. అతని ఇంటి అడ్రసు చాలామందికి పరిచయం అయింది. గౌరవప్రదమైన అపార్టుమెంటులో భద్రతకూ, ఏకాంతానికీ లోటు లేదు. ఈ వాతావరణంలోకి ఆరేళ్ల లీలని తీసుకువచ్చాడు.

మొదటిసారి లీలని చూసినప్పుడు షాక్ అయాడు రాజేశేఖరం. పదిహేనేళ్ల ఆడపిల్లలో ఉండాల్సిన బిగువైన యవ్వనపు ఛాయలు అప్పటికే ఆ పిల్లలో పొటమరిస్తున్నాయి. అపూర్వమైన అందం మొగ్గస్థాయినుంచి పువ్వుస్థాయికి చేరడానికి అప్పుడే పరవళ్లు తొక్కుతోంది. లీలలో మాటలకందని స్థైర్యం ఉంది. గాంభీర్యం ఉంది. ఆ వయస్సులో చాలామందిలో కనిపించే బెరుకుతనం లేదు. చాపల్యం లేదు. పసితనంనుంచి రెండు అంగలు దాటి ముందుకు దూకేసిన నిబ్బరం కనిపించింది. శరీరంలో పుష్పించిన అందానికి ఈ వ్యక్తిత్వం మరింత అందాన్నీ, ఆకర్షణనీ, బలాన్నీ సమకూర్చింది.

లీల మనస్సులో తనదైన చిన్న ప్రపంచం ఉంది. అందులోకి ఎవరినీ జొరబడనీయని పట్టుదల ఉంది.

బొంబాయి వచ్చిన కొత్తలోనే చీకటిపడేవేళకి ముసురుకునే ఒకరిద్దరు పెద్దింటి

స్త్రీలూ, మందు పార్టీలూ, ఉన్నట్టుండి లీలని చూసి బలంగా బుగ్గలు పిసికే సుందరీమణుల్ని చూసింది. అతి క్రూరంగా, జుగుప్సతో వాళ్ళను విదిలించుకుంది. వాళ్లనుంచి తప్పించుకునేందుకు తన గదిలోకి పోయి తలుపు వేసుకునేది. ఓ రాత్రప్పుడు నవ్వులు వినిపిస్తే తలుపు సందులోంచి బట్టల్లేని స్త్రీలూ, రాజశేఖరం కనిపించేవారు. అసహ్యంతో అదృశ్యానికి దూరంగా పారిపోవాలని, పారిపోలేక తలగడని తలమీద నొక్కుకునేది. క్రమంగా రాజశేఖరంమీద లీలకి గౌరవం సడలిపోయింది. కాని ఏం చెయ్యాలో తెలీని వయస్సు. తనకి నచ్చనిదాన్ని తిరస్కరించే అర్హత, అవకాశం లేని జీవితం.

"నేనిక్కడ ఉండను" అంది రాజశేఖరంతో ఒకరోజు.

మొదట రాజశేఖరం ఆశ్చర్యపోయాడు. బిగుసుకున్న ఆమె పెదాల్ని చూసి నవ్వాడు.

"నేనిక్కడే ఉంటాను. కనుక నువ్విక్కడే ఉండాలి" అంటూ ఆమె పెదాలమీద ముద్దు పెట్టుకున్నాడు.

అప్పటికి ఆమెకి ఏడు.

పెదాలు అప్పుడే చెట్టునుండి దిగిన లేత తాటిముంజెల్లాగ మెత్తగా రుచిగా ఉన్నాయి. ఒక్క క్షణం గుతుక్కుమన్నాడు. ఆమె శరీరం వయస్సుతో ప్రమేయం లేకుండా వికసించడాన్ని గుర్తించాడు రాజశేఖరం.

ఆరోజే ఆమె గదిలో లోపలిగడియ చెడిపోయింది. ఆమె బాత్‌రూమ్ గడియ ముట్టుకోగానే విడిపోయింది.

అరిగిపోయిన శరీరాన్ని స్కాచ్‌తో మచ్చిక చేసుకునే రొటీను నుంచి ఈ శరీరం పెద్ద రిలీఫ్‌లాగ కనిపించింది రాజశేఖరానికి.

మర్నాడు బట్టల్లేకుండా స్నానం చేస్తున్న తన బాత్‌రూమ్‌లోకి రాజశేఖరం రాగలగడం లీలని ఆశ్చర్యపర్చింది. షాక్ అయింది. ఆమె చిన్నపిల్లే కావచ్చు. చిన్నతనంనుంచీ జంతువులను వేటాడే పులి జీవలక్షణాన్ని పుణికిపుచ్చుకున్న జీవలక్షణం ఉన్న పిల్ల లీల. రాజశేఖరం నవ్వు ఆమెని భయపెట్టలేదు. కోపం తెప్పించింది. తన దగ్గరికి వేసే అడుగులు తనని నిస్సహాయురాలుని చెయ్యలేదు. కేవలం instinctతో చేతిలోని షవర్ హెడ్‌ని ఆయుధంలాగ పట్టుకుంది. దగ్గరికి వచ్చిన రాజశేఖరం తలమీద పెడీల్మని కొట్టింది. రాజశేఖరం ఆ తిరుగుబాటుని ఊహించలేదు.

తలమీద చర్మం చిట్లింది. వెచ్చటి రక్తం తలవెంట్రుకల మధ్యనుంచి జారి, చిక్కనై నుదుటిమీదకి పాకింది.

కోరికతో రెచ్చిపోయిన పశుప్రవృత్తికి ఎదిరింపు కొత్త ఊతం. తలకెక్కిన మందు

అదనపు ప్రోత్సాహం. సెక్స్ సంఘర్షణ ఆ దశలో ఎప్పుడైనా పశుప్రవృత్తే. పశువులో ఆ ప్రవృత్తికి మరికాస్త బలం దొరుకుతుంది. వాష్ టబ్‌లో ఉన్న ఏడేళ్ల తడసిన శరీరాన్ని అలాగే చేతుల్లోకి ఎత్తుకున్నాడు.

ఏడేళ్ల అమ్మాయి తిరుగుబాటు ఒక ఆవేశం మాత్రం. రాజశేఖరాన్ని ఆ దశలో ఆపగలిగే శక్తి దానికి చాలదు. ఐనా గింజుకుంది. ఏడవలేదు. రాజశేఖరం చేతిని కరిచింది.

పశువు మరింత రెచ్చింది. విచిత్రం. రాజశేఖరమూ కేకపెట్టలేదు. బట్టల్లేని–పరువానికి వచ్చిన శరీరాన్ని మంచంమీద కుదేశాడు.

కోపమూ, బాధా, కోరికా, కసీ–అన్నీ ఒక్కసారి పూరించిన పశువు ఆ శరీరాన్ని ఆక్రమించుకుంది.

❖ ❖ ❖

అది కేవలం ప్రారంభం. ఆకలిగొన్న పులి మనిషి రుచిని మరిగినట్టు రాజశేఖరం అలవాటుగా, క్రమం తప్పకుండా ఆ పసిశరీరాన్ని వేటాడేడు. లీల అతనినుంచి తప్పించుకోడానికి వీలైనన్ని రకాలుగా ప్రయత్నించింది, అతనికి దొరకకుండా, దాగుకునే ప్రయత్నాలు చేసింది. ఇంట్లోంచి పారిపోయే ప్రయత్నం చెయ్యబోయింది. ఇంట్లో అన్ని తలుపులకీ గడియలు ఊడిపోయాయి. అపార్టుమెంటు బయట ఇద్దరు గూండాల పహరా ఏర్పాటయింది. వీధి తలుపుల బలం రెట్టింపయింది.

ప్రతిసారీ ఆ పిల్ల బీరువాలోనో, మంచం కిందో, సామాన్ల గదిలోనో, అటకమీదో దాక్కొనేది. ఆమెని పట్టుకోడానికి చిన్న సస్పెన్స్ అతన్ని మరింత రెచ్చగొట్టేది. ప్రతిసారీ పట్టుకున్నప్పుడూ విజయగర్వంతో ఆమెని రెట్టింపు ఉత్సాహంతో ఆక్రమించుకునేవాడు.

రాత్రివేళల్లో వచ్చే ఆడవాళ్లు తమ పట్ల అతనికి 'రుచి' తగ్గిన విషయాన్ని గుర్తుపట్టారు. క్రమంగా అందుకు కారణాన్ని గ్రహించారు. ఎంత ప్రయత్నించినా చీకటి వెలుగు సూర్యోదయంతో పోటీపడలేదు.

లీలది విజృంభించే యవ్వనం. వారిది అలసిపోయే వయస్సు.

లీల అతన్ని కొరికింది. అతనిమీద ఉమ్మింది. తిట్టింది. కొట్టింది. ఇవన్నీ రాజశేఖరానికి కొత్త అనుపానాలు.

క్రమంగా మరో సుళువు కనిపెట్టాడు. ఆమె తాగే డ్రింక్‌లో వాసన తెలియనంత విస్కీని కలిపేవాడు. మొదట వెగటుకి కక్కింది. అసహ్యించుకుంది. గ్లాస్ పగలగొట్టింది. తప్పించుకోడానికి మార్గంలేని ఆ పసివయస్సులో జరిగే దుర్మార్గాన్ని మరిపించి శరీరాన్ని మభ్యపెట్టే మత్తుని క్రమంగా ఆహ్వానించింది. ప్రయత్నంలో ఎదిరించి వీగిపోవడంకన్నా

ప్రయత్నం అక్కరలేకుండా మీదపడే అపస్మారం–నిస్సహాయమైన విముక్తిగా ఆ పసిహృదయం భావించింది. లొంగిపోయిన శరీరంమీద ఔదార్యం పెరిగింది రాజశేఖరానికి.

ఆడదానిలో ప్రాథమికమైన తెలివితేటలే కాక, కాస్త అవగాహన, చదువుతో వచ్చే సెక్స్ మరింత రుచిగా ఉంటుందని అక్కడికి రెగ్యులర్‌గా వచ్చే చదువుకున్న వ్యభిచారి సూచించింది.

రాజశేఖరానికి పోయేదేముంది? ఆ విధంగా ఎవరికీ అక్కర్లేని చదువు లీల నెత్తిన పడింది. ఐతే చదువు ఆమె జీవితంలో ఒయాసిస్సు. ఆవురావురుమని అందుకుని తక్కువ కాలంలో ఎక్కువ చదువుని ఆపోశన పట్టేసింది.

తన కష్టాన్ని మరొకరికి చెప్పుకుని భోరుమనే మనస్తత్వం కాదు లీలది. ఒక విచిత్రమైన వెళుసుదనం, దుర్భేద్యమైన తెంపరితనం ఆమెలో చోటు చేసుకున్నాయి. ఆశ్చర్యం కలిగించే విషయం–ఈ వైశాచికమైన నేపథ్యంలో చదువొక్కటే ఆమెకి ఆఃవిడుపయింది. ఆమె తెలివితేటలనీ, చూపే శ్రద్ధనీ, ఎన్నో దశలు దాటి అలవోకగా అందుకునే సహజమైన నేర్పరితనానికి ఆశ్చర్యపోయింది టీచర్.

తెలివితేటలు లీలకి కొత్త విముక్తికి మార్గాన్ని చూపాయి. ఒకరోజు గుప్పెడు గార్డినాల్ మాత్రలు మింగింది. మూడోనాడు ఆసుపత్రి మంచంమీద కళ్లిప్పింది. ఆసుపత్రి మంచం సేదతీర్చే తల్లిలాగ కనిపించింది. కాని అది తాత్కాలికం. మళ్లీ ఇల్లు. మళ్లీ అదే నరకం. అదే రొటీను.

ఒకపక్క ఆ చిన్న శరీరంలో మనస్సు క్రోధంతో రగులుతోంది. శరీరంలో నాజూకుతనం నానాటికీ చిద్రమవౌతోంది. మెదడు పురివిప్పిన తాచులాగ కొత్త విముక్తికోసం అర్రులు జాస్తోంది. ఇది సంవత్సరాల తరబడి ఆ చిన్న ప్రపంచాన్ని విఛ్ఛిన్నం చేసిన అగ్నిపర్వతం.

క్రమంగా ఎదిరించగల సామర్థ్యం పెరుగుతోంది. ఎందుకు ఎదిరించలేదు? ఆ పిల్ల మనస్సులో తెలియని ఉదాసీనత నానాటికీ పెరుగుతోంది. శరీరానికి స్కాచ్ అలవాటైంది.

తిరగబడి ఏం చేయాలి? ఎక్కడికి పోవాలి? ఈ నాలుగు గోడల బయట ఏముంది? ఆనాటి తిరుగుబాటు ఒక instinct. ఈనాటి ఒదుగుదల ఒక నల్లమందు.

క్రమంగా ఆమె జీవితంలోకి కొత్త మనుషుల్ని ప్రవేశపెట్టాడు రాజశేఖరం. ఎదిరించే మనస్తత్వం సడలింది కనుక–కొత్త మనుషులు ప్రవేశించారు. వారిలో జాన్ మనోజ్ ఒకడు. వారానికి ఒకరోజు. ఒకేరోజు–పనులన్నీ పూర్తి చేసుకుని ఈ అపార్టుమెంటులోకి

వస్తాడు. అతను వస్తూనే గ్లెన్ ఫిడిక్ సింగిల్ మాల్ట్ స్కాచ్ విస్కీ సీసాని, ఓ నోట్లకట్టనీ రాజశేఖరానికి అందిస్తాడు. మరో క్షణంలో రాజశేఖరం మాయమైపోతాడు.

క్రమంగా మానవత్వంమీదా, మంచితనంమీదా, మగవాడి సద్బుద్ధిమీదా, ప్రవర్తనమీదా లీలకి నమ్మకాలు సడలిపోయాయి. ఒక ఏహ్యత, నిర్వీర్యత ఆమెలో చోటుచేసుకున్నాయి. లీల మాట్లాడడం మరిచిపోయి చాలా రోజులైంది.

జాన్ మనోజ్ తన పని పూర్తిచేసుకు వచ్చేవరకూ హాలులో తివాచీమీద డ్రైవర్ నరసిపండు నిద్రపోతాడు. కాస్సేపటికి గదిలో పెద్దమనిషీ పడుకుంటాడు.

లీల మేడమెట్లమీద నిస్తేజంగా, నిశ్శబ్దంగా కూర్చుంటుంది ఒక్కొక్కప్పుడు. ఆ పెద్దమనిషి బయటికి వచ్చి కాలితో నిద్రపోతున్న డ్రైవరుని తన్ని లేపుతాడు. అతను వెళ్లిన తరువాత లీల నిద్రవస్తే పడుకుంటుంది. లేకపోతే తెల్లారేవరకూ అలాగే కూర్చుంటుంది. మరునాడు ఏ మధ్యాహ్నానికో రాజశేఖరం వస్తే వస్తాడు. అంతవరకూ వీధి తలుపు బయటనుంచి తాళంవేసి ఉంటుంది.

ఆమె అజాపజా కనుక్కొనేవాడుకానీ, కాఫీ ఇచ్చేవాడుకానీ, ఆకలిని తీర్చేవాడుకానీ, ఆ అవసరాల్ని అడిగేవారుకాని ఎవరూ కనిపించరు. ఎంతో రద్దీగా ఉన్న జీవితంలో అతి క్రూరమైన ఏకాంతం లీలది.

ఒకసారి ఎన్నో వారాలు, రాత్రులలాగే ఆనాటి రాత్రి కూడా సాగుతున్నప్పుడు ముందుగా తెలివొచ్చిన జాన్ మనోజ్ డ్రైవరు నరసిపండు లీలని పలకరించాడు–ఏం చెయ్యాలో తెలీక.

“బయటికెళ్లి కాఫీ తెచ్చేదా మేడమ్?” అన్నాడు.

తనకి కాఫీ కావాలని ఎవరో అనుకున్న విషయం ఆమెని ఆశ్చర్యపర్చింది. అతన్ని నిర్లిప్తంగా చూసింది. ఏం మాట్లాడలేదు. తన అవసరాల్ని కనుక్కునే మనిషి. తనని ‘మేడమ్’ అని పలకరించే మనిషి లీలకి కొత్త.

కిందమెట్టుమీద కూర్చున్నాడు.

“ఈ లంజకొడుకుల మధ్య ఇక్కడే ఎందుకు ఉంటున్నావు?” అనడిగాడు.

లీల సూటిగా అతన్ని చూసింది “ఏ లంజకొడుకుల మధ్య ఎక్కడ ఉండాలి?” అంది.

నవ్వొచ్చింది నరసిపండుకి.

“బయట ఇంతకంటే సుఖంగా బతకొచ్చు”

“ఏ బయట?”

వీధిని చూపించాడు.

"నాకేం రాదు"

"నీకు శరీరం ఉంది"

లీల నవ్వింది. "ఆ పనేగా ఇక్కడ చేస్తున్నాను" అంది.

"ఇక్కడ వాళ్లు చెప్పేది చేస్తున్నావు. అక్కడ నువ్వు కోరుకున్నప్పుడు చేస్తావు. కావాలనుకుంటే నరకంలో కూడా చిన్న స్వేచ్ఛ ఉంది"

ఆ తర్వాత–మూడు నెలలకి నరిసిపండు సహాయంతో లీల ఆ ఇంట్లోంచి మాయమైంది.

## 26

ఈ కథ ఎంతవరకూ నిజమో తెలియదు. విన్నది. 1960 జనవరి 15.

భారత రాయబారి సర్వేపల్లి రాధాకృష్ణన్ ప్రపంచాన్ని గడగడలాడిస్తున్న నియంత స్టాలిన్‌ని కలిశారు. సంభాషణ సాగింది. ముక్తసరిగా సిగరెట్టు కాలుస్తూ స్టాలిన్ ప్రసంగించారు. సంభాషణ ముగిసింది. ఇద్దరూ లేచారు. రాధాకృష్ణన్ నాలుగడుగులు ముందుకు వేసి వెనక్కి వచ్చి "మీ ఆరోగ్యాన్ని జాగ్రత్తగా చూసుకోండి" అని వెళ్లిపోయారు.

ఇంతటి నియంత ఆ మాటలకి బిత్తరపోయి, కరిగిపోయారట. అలవికాని క్రౌర్యంతో బండబారిన మనస్సును కరిగించేది ఒక్కటే–మాట కాదు. ఓదార్పు కాదు. సముదాయింపు కాదు–కరుణ. కారుణ్యం పర్వతాలను కరిగిస్తుంది.

హైందవంలో ఓ రాక్షసుడిని మట్టుబెట్టడానికి దేవుడు దాల్చిన ఉగ్రావతారం–నరసింహావతారం. ఆ అవతారం మూలధర్మం–కరుణ. పసివాడైన భక్తుని పట్ల వాత్సల్యం. ఆర్ద్రతతో కోరికలు తీర్చే కరుణామూర్తి ఉగ్రనరసింహుడు. దానికి సాక్ష్యమే ఆ అవతారం. లక్ష్మీనృసింహ మమదేహి కరావలంబం.

లీల సమక్షంలో నిలిచిన తరువాత చాలా నెలలపాటు అబ్బుశాస్త్రి ఆమెను కలుసుకోలేదు. కలుసుకోవాలని ప్రయత్నించలేదు. ఆమె ముందు నిలిచిన క్షణంలోనే ఇన్ని సంవత్సరాల నిరీక్షణ సహేతుకమైనదేనని అర్థమైంది. తల్లిదండ్రుల చాటున గారాబంగా, క్షేమంగా, ఆప్యాయతలను పంచుకుంటూ పెరగవలసిన అమ్మాయి భయాన్ని పెంచుకుంది. అభద్రతను పెంచుకుంది. కోపాన్ని పెంచుకుంది. అనుమానాన్ని పెంచుకుంది. అవసరమైతే రక్తాన్ని కళ్లజూసే అసహనాన్ని పెంచుకుంది. సాటి మనిషిలో మంచితనానికి ఎదురుచూడడం మరిచిపోయింది. ఇది మానసిక అనారోగ్యం. ఆమెకి చికిత్స కావాలి. ఆ బాధ్యత తనది. ఆమె అలా కావడానికి కారణం–తనది కనుక.

అలనాడు గురువైన తండ్రి సమక్షంలో గాయత్రీ మంత్రాన్ని చెప్పడానికి పవిత్రంగా ఉద్యుక్తుడైన వటువు ఏకాగ్రతని మనస్సులో ప్రోదిచేసుకున్నాడు. ఒక సమగ్రమైన ప్రణాళికని మనస్సులో రూపుదిద్దుకున్నాడు. ఇప్పుడిక తికమకలు లేవు. తను ఏం చెయ్యాలో తనకు తెలుసు. ఎలా చెయ్యాలో కాలం నిర్ణయిస్తుంది. గాయత్రిని పఠించిన వటువు ఏం చెయ్యాలి? ఏమో. అది తరువాతి మాట. మనస్సు, సంకల్పం, శరీరం–అన్నీ ఏకీకృతమయ్యాయి. విచిత్రంగా ఇప్పుడు జన్మతః వచ్చిన నత్తి మళ్లీ సెలవు తీసుకుంది. ఇదేమిటి? గర్భాన ఎనిమిదో యేట యజ్ఞోపవీత ధారణకి పీటలమీద కూర్చుని ద్విజుడు కావడానికి మొదటి గురువు తలమీద కొత్త పంచె కప్పి మొదటి పాఠం–గాయత్రీ మంత్రాన్ని ఉపదేశించినప్పటి ఏకాగ్రతకీ–సంవత్సరాల తరబడి తప్పుతోవపట్టి, పతనమైన ఒక స్త్రీ జీవనసరళిని–బ్రాహ్మణ్యం ప్రసక్తి లేని ఒక బ్రాహ్మణేతర స్త్రీ జీవనసరళిని–సంస్కరించే అనితరసాధ్యమైన ఏకాగ్రతకీ పొంతన ఎక్కడ? ఉంది. అవధులు లేని, ఏ కల్మషమూ అంటని, నిష్కాపట్యమైన ఉద్యమం–అది మనస్సు లోతుల్లోంచి బయటికి ఉరికితే–అది నిస్సందేహంగా అపూర్వమైన పరాకాష్టను సాధిస్తుంది. చిన్ననాటి ఏకాగ్రతకీ, ఇప్పటి సంకల్పశుద్ధికీ ఇసమంత తేడా కూడా లేదు. ఆనాడు అబ్బు శాస్త్రి నిష్ఠాగరిష్ఠుడైన వటువు. ఈనాడు అబ్బుశాస్త్రి అంతే నిష్ఠాగరిష్ఠుడైన కర్మిష్ఠి. ఇది మరో యజ్ఞం. మరో రకమైన యజ్ఞం.

ఎటువంటి మకిలి ఆలోచనా, ఎటువంటి పొరపొచ్చాలూ, తన లక్ష్యానికి అంటకుండా కొత్త యజ్ఞానికి ఉద్యుక్తుడయ్యాడు. అబ్బుశాస్త్రి ముఖం ఆనందంతో వెలిగిపోతోంది. పండిత గోష్టిలో శంఖంలాంటి అబ్బుశాస్త్రి గొంతు తృతీయ సవనంలో ఆకాశాన్ని తాకుతోంది.

సర్వమంగళం ఆశ్చర్యపోయాడు. మిగతా ఋత్విక్కులూ అవాక్కయారు. ఏమైంది అబ్బుకి? అదే ప్రశ్న అడిగాడు సర్వమంగళం పరిషత్తు ముగిశాక.

అబ్బు శాస్త్రి నవ్వాడు. “నా దారి నాకు దొరికింది” అన్నాడు క్లుప్తంగా.

“ఆ అమ్మాయితో మాట్లాడావా?”

“ఆమే నాతో మాట్లాడింది”

“ఏమని?”

అబ్బు శాస్త్రి నవ్వాడు. “లంజకొడకా అని”

షాక్ అయ్యాడు సర్వమంగళం.

మిత్రుడి భుజం తట్టి చెప్పాడు “ఆ అమ్మాయిని పూర్తిగా చదివాను. ఆమెను

సంస్కరించవలసిన అవసరం ఉంది. ఆ అవసరం నాది. దాన్ని ఇప్పటినుంచీ నా అవకాశం చేసుకుంటాను"

ఇంకా ఏదో అడగబోయాడు. అనసూయ ఆపింది. "వంట అద్భుతంగా చేసే మనిషిని అనుపానం గురించి అడగడం అన్యాయం. వండి వడ్డించిన తర్వాత రుచి చూడడమే. ఆయన చెయ్యగలిగిందేదో 'రేపు' చెపుతుంది. చెయ్యగలరని ఆయన ముఖం చెప్తోంది. ఇక ఊరుకోండి"

ఆప్యాయంగా అనసూయ బుగ్గలు పుణికి నవ్వుకున్నాడు అబ్బుశాస్త్రి.

ప్రపంచంలో అపూర్వమైన, అనూహ్యమైన మాట్రిక్స్ వేదం. వేల సంవత్సరాలపాటు మనుషుల నోళ్ళలో అక్షరం పొల్లు పోకుండా, స్వరం తప్పకుండా నిలిచిన గొప్ప శిల్పం అది. 'వేదం'లో విషయాన్ని గురించి కాదు ఈ ప్రసక్తి. వేదం ప్రణాళికని గురించి. ఆ ప్రణాళికని ఆపోశనపట్టే పనిని గర్భానా ఎనిమిదో యేటినుంచీ వంటబట్టించుకున్నవాడు అబ్బు. కార్యోన్ముఖుడైన, లక్ష్యశుద్ధి గల వేదపండితుడు కంప్యూటర్ ఇంజనీర్‌కి తీసిపోడు.

సంవత్సరాల తరబడి లీల మనస్సు చుట్టూ బిగుసుకున్న ఉక్కు కవచాన్ని ఛేదించడానికి అతి సునిశితమైన ప్రణాళిక కావాలి. ఆ ప్రణాళికలో మొదటి అంగ–ఆమెకి అన్నివిధాలా సహకరించి, చేయూతగా నిలిచే నరిసిపండుని రంగంనుంచి తప్పించాడు.

"నువ్వు బొంబాయి నుంచి వచ్చి చాలా రోజులైంది. నీ పాత స్నేహితుల్ని చూసిరా" అని రెండు వేలు ఇచ్చాడు.

"నేను లేకపోతే అమ్మగారు...?" అన్నాడు నరిసిపండు.

"ఆవిడ అవసరాలేవో నాకు తెలుసు. ఆదుకునేవారు అందుబాటులో ఉన్నప్పుడు కొన్ని అవసరాలలాగ కనిపించవు. అనిపించవు. అవి అవసరాలని గుర్తుపట్టడానికి ఆమెకి వ్యవధి కావాలి. ఆమె ప్రయత్నం చెయ్యాలి. నష్టపోవాలి. కష్టపడాలి"

నరిసిపండుకి అర్థంకాలేదు. కాని ఈ పంతులుని చిన్నచూపు చూడడానికి వీలులేదని ఎప్పుడో గ్రహించాడు. కొంపదీసి పంతులు లీలమ్మ ప్రేమలో పడుతున్నాడా?

ఏమైనా అబ్బు ఎప్పుడూ అంతసేపు మాట్లాడలేదు. మాట్లాడగలడని అనుకోలేదు. ఏమైనా లీలమ్మకి ఈ పంతులు విషమివ్వడు. ఐనా లీల విషం తాగే రకం కాదు.

"నువ్వెక్కడికి వెళుతున్నావో సోయితాకి చెప్పకు"

నరిసిపండు మాయమయ్యాడు. సోయితా మొగుడుని తిట్టుకుంది. చీకటిపడితే సోయితాకి మందు కావాలి. సరదాకైనా భర్త చేతుల్లో తన్నులు కావాలి. పక్కమీద తన మడిసి కావాలి.

"ఎక్కడికి పోయినావురో మకిడీ!" అని కేకలుపెట్టింది. చివరికి అలసిపోయి నిద్రపోయింది.

❖ ❖ ❖

అక్కడ–అపార్టుమెంటులో అలవాటుగా వచ్చే నరిసిపండు రాలేదు. చేతికి అందుబాటు దూరంలో ఉండే మందుసీసా లీలకి అందలేదు. ముందు ఆశ్చర్యపోయింది. విసుక్కుంది. నరిసిపండుని తిట్టుకుంది. సీసాలో మిగిలిన నాలుగు చుక్కలతో గొంతు తడుపుకుంది. ఓ రాత్రికి తుళ్లిపడి లేచింది. కాలింగ్‌బెల్ మోగుతోంది. గడియారం చూసింది. రాత్రి పన్నెండు. కోపంతో ఒళ్లు మరిచిపోయి బిరబిరా నడుచుకుంటూ వెళ్లి తలుపు తీసింది. బయట వసారాలో లైటు వేసి ఉంది. గుమ్మందగ్గర వెలుగులో టీచర్స్ స్కాచ్ వెలిగిపోతోంది.

ఆమె నిర్ఘాంతపోయింది. అపార్టుమెంటు కారిడార్‌లో పిట్టమనిషి లేడు. కాలింగ్‌బెల్ నొక్కిన మనిషి సీసాని అక్కడ ఉంచి మాయమయ్యాడు.

లీలకి అనుమానం లేదు. ఈ లోకంలో తన అవసరం తెలిసిన మనిషి నరిసిపండు ఒక్కడే. ఏదో చెయ్యరాని పనిచేసి తన ముందుకు రావడానికి ముఖం చెల్లక–సీసాని అక్కడ ఉంచి మాయమయ్యాడు.

"రేపు రానీ. వాడి సంగతి చూస్తాను" అనుకొంటూ అపురూపమైన స్కాచ్‌ని పసిబిడ్డలాగ ఎత్తుకుని లోపలికి వెళ్లి తలుపేసుకుంది.

స్కాచ్ గుక్క దిగుతూంటే గొంతులో అమృతం దిగితున్నట్టనిపించింది. ఎంత పని ఉన్నా తన సంగతి మరిచిపోని నరిసిపండుమీద గుక్క గుక్కకీ ఆమెకు సానుభూతి పెరిగింది. సగం సీసా పూర్తయ్యేసరికి అతన్ని క్షమించేసింది.

అబ్బుకి ఆ రాత్రికి సుఖంగా నిద్రపట్టింది. ఎందుకీ పని చేశాడు? తన దురలవాటుని బ్రాందీ షాపు పోషిస్తే–అది వ్యాపారం. నౌఖరు పోషిస్తే–అది ఉద్యోగం. మిత్రుడు పోషిస్తే–అది సౌజన్యం. అవసరంలేని ఓ పెద్దమనిషి పోషిస్తే–అది వెక్కిరింత. దురలవాటు జోలికైనా పోని పవిత్రమైన వ్యక్తి పోషిస్తే–అది తిట్టు. ఆమె అలవాటుమీద విమర్శ. మూర్ఖపు బింకానికి మొదటి వైద్యం షాక్. హఠాత్తుగా తగిలిన షాక్ అంత హఠాత్తుగానే నరాలను సడలిస్తుంది. షాక్‌వల్ల మనిషిలో కలిగే స్పందన instinct తెలిసి చేసేది కాదు. అసంకల్పితంగా జరిగేది. 'బింకం' క్రమంగా కూడదీసుకున్న అహంకారపు ఆఖరి మెట్టు. కాగా, స్కాచ్‌లో మరొక దుర్మార్గం ఉంది. అది రక్తాన్ని వేడెక్కించి, పరుగులెత్తించి, నరాల్ని సడలిస్తుంది. ఆలోచనలు గుర్రాలమీద స్వారీ చేస్తాయి.

ఈ పదిరోజులూ సరిగ్గా అర్ధరాత్రి ఆ అపార్టుమెంటు కాలింగ్‌బెల్ మోగుతుంది. గుమ్మం ముందు టీచర్స్ స్కాచ్ దర్శనమిస్తుంది. పదకొండో రోజూ అలాగే బెల్ మోగింది. అబ్బు ఆనందం–స్కాచ్ తాగినంత మత్తుగా ఉంది.

బెల్ మోగిన 20 సెకెన్లే తనకి వ్యవధి–కారిడార్ దాటి మాయమవడానికి. ఆమె గదిలోంచి తలుపు దగ్గరికి నడిచి రావడానికి. కాని ఆరోజు పది సెకెన్లకే తలుపు తెరుచుకుంది. ఆబ్బుశాస్త్రి తప్పించుకోడానికి అవకాశం దొరకలేదు. లీల అతని భుజం పట్టుకుని బలంగా లోపలికి లాగింది. స్విచ్ నొక్కింది.

పవిత్రంగా పైజామా, లాల్చీ, నుదుటికి కుంకుమబొట్టుతో అప్పుడే నదిలో స్నానంచేసి వచ్చినంత స్వచ్ఛంగా కనిపించాడు ఆబ్బుశాస్త్రి.

అతణ్ణి గుర్తుపట్టింది. ఆరోజు...

"నువ్వు...!"

"అవును. నేనే" అన్నాడు అబ్బు. ఇప్పుడు మాట్లాడే శక్తిని పుంజుకున్నాడు ఆబ్బుశాస్త్రి.

"ఎవరు నువ్వు?"

అబ్బు సూటిగా ఆమె ముఖంలోకి చూశాడు. "పేరు చెప్పమన్నావా...? ప్రవర చెప్పమన్నావా? ఇక్కడికి వచ్చిన కారణం చెప్పమన్నావా? నీ అలవాట్లను ఎలా కనుక్కొన్నానో చెప్పమన్నావా? ఎందుకు కనుక్కున్నానో చెప్పమన్నావా?"

లీలకి అంత తెలుగు రాదు. "డోంట్ ట్రై టూ బి క్లెవర్ యూ ఇడియట్!" అంది కోపంగా.

కాని అబ్బుకి కోపం రాలేదు. నవ్వొచ్చింది. ఆమె కోపానికి ఎదురు నిలవడం ఇది రెండోసారి.

నవ్వాడు. "కోపంలో నువ్వు మరీ చురుకుగా కనిపిస్తావు. నీలో కోపానికి అర్థం నిస్సహాయత. నిస్సహాయతకి నీ జీవితం చాలా సంవత్సరాలుగా పెట్టుబడి పెట్టింది. ఒంటరితనం, దెబ్బతిన్న అహంకారం, నీ స్వేచ్ఛని అణగదొక్కిన స్వార్థం, అన్నిటినీ తట్టుకుని ఏమీ చెయ్యలేని నిస్సహాయత"

"షటప్. ఎందుకు ఈ పని చేస్తున్నావ్. నీలాంటివాళ్లని చాలామందిని చూశాను"

"పొరపాటు. నాలాంటివాళ్ళని చూసి వుండవు. నీ శరీరానికి ఎగబడినవాళ్లని చూసి వుంటావు. నిన్ను వాడుకున్న వాళ్లని చూసి వుంటావు..." అన్నాడు ఆబ్బుశాస్త్రి అంతే క్రూరంగా, సూటిగా.

ఆమె అహంకారం దెబ్బతింది. తనని ఎదిరించినవాళ్లు ఇంతవరకూ లేరు. ఎదిరించి జయించినవాళ్లు అంతకంటే లేరు. ఆమె జీవితంలో ఆడి ఓడించిన 'పావు' ఒకటుంది – అందం.

"నీలా కబుర్లు చెప్పిన చాలామందిని చూశానురా బేవకూఫ్! ఏం కావాల్రా నీకు? ఈ శరీరమా? సెక్సా? మేల్ చావనిస్ట్ పిగ్!!" అంటూ ఒంటిమీద ఉన్న నైటీని రెండు చేతులతో పట్టుకుని అడ్డంగా చింపింది. పల్చటి నైటీ మధ్యకి చీరుకుపోయి–బలిసిన స్తనాలు ప్రిదిలి బయటికి దూకాయి.

ఒక్కక్షణం నిర్విణ్ణుడయాడు అబ్బు. అతని జీవితంలోనే అలాంటి క్షణం కొత్త. స్త్రీపట్ల కోరికకి సంబంధించిన 'అర' అతని జీవితంలో తెరుచుకోలేదు. కాగా, తన మాటని నెగ్గించుకోడానికి, లేదా తన చీదరింపుని ప్రకటించుకోడానికి అతి సులువుగా నగ్నత్వాన్ని ఆయుధాన్ని చేయగల ఆమె సాహసం అతన్ని ఆశ్చర్యపర్చింది. ఉద్విగ్నపర్చింది. ఉద్రేకపర్చింది–నరాల్ని కాదు, మనస్సుని.

అతను కోపాన్ని గయలో విడిచిపెట్టి చాలా సంవత్సరాలైంది. కాని కోపాన్ని ప్రదర్శించే చర్యకి నిషిద్ధం లేదు. అతనికి తెలియకుండానే జీవితంలో ఎన్నడూ చెయ్యని పని ఒకటి చేశాడు. గుండె నిండా ఊపిరిని పూరించుకుని, ఎడంచేత్తో బలంగా ఆమె చెంప ఛెళ్లుమనిపించాడు. ఆ విసురుకి లీల కుర్చీమీదకి తూలిపోయింది. ఇటు తిరిగేసరికి అబ్బు అక్కడినుంచి మాయమయ్యాడు.

టీచర్స్ స్కాచ్ సీసా అతని కాలి దూకుడుకి విరిగింది. గాజుముక్కలు అతని కాలిలోకి దూసుకున్నాయి. రక్తంతో తడిసిన కాలిగుర్తులు గుమ్మం దాటుతూ కనిపించాయి.

## 27

ఆబ్బుశాస్త్రి వేదం చెప్పుకున్నాడు. శ్రీ సూక్తంలో–

కర్దమేన ప్రజాభూతా మయిసమ్భవ కర్దమ

తర్వాత

శ్రియం వాసయ మేకులే మాతరం పద్మమాలినీమ్

వస్తుందని మాత్రమే కాదు, ఎందుకు వస్తుందో కూడా తెలుసు. అది సంవత్సరాలపాటు మనస్సు చేసిన సాధన. ఏర్పర్చుకున్న క్రమశిక్షణ.

తన చెంప పగులగొట్టాక–లీల అహంకారం ఛిద్రం కావడానికి ఎంత వ్యవధి కావాలో అతను ఊహించడమేకాదు–తు.చ. తప్పకుండా లెక్కవేశాడు. తర్వాత ఏడు

రోజులపాటు గుమ్మం ముందు ఉంచిన స్కాచ్ సీసాల్ని కసిగా పగులగొట్టింది లీల. ఏడో రోజు ఆచరణకు ఉద్రేకం సల్లిచ్చింది. అవసరం మనసుని పీకింది. ఆవేశంగా ఎత్తిన సీసాని చెయ్యి మెల్లగా దువ్వింది. ఎవడో ఛాందసుడు చేసిన చర్యకు ప్రతీకారం ఏకాంతంలో తను ఎందుకు తీర్చుకోవాలి? మనస్సు వ్యసనంతో రాజీపడింది. వ్యసనం పశుప్రవృత్తి. దానికి విచక్షణ కలిసిరాదు. సంవత్సరాల తరబడి-దాదాపు పసితనం నుంచీ మనస్సుతో ప్రమేయం లేకుండా అలవాటు చేసిన మత్తు ఆనాడు సీసాని అంది పుచ్చుకుంది.

మనిషి అహంకారాన్ని జయించే ప్రాథమిక శక్తి మరొకటి ఉంది-అవసరం. దాన్ని రెచ్చగొట్టే మరొక శక్తి ఉంది-ఆకలి.

అబ్బు ఆలోచనల్లో తూకం చెడలేదు. లీల అవసరాలు తెలుసు. తెల్సుకున్నాడు. ఆమెకి వంట రాదు. బజారుకి వెళ్ళి కొనుక్కోడమా రాదు. అంతవరకూ ఆమె తినే తిండి కేవలం ఆకలిని జోకొట్టే ప్రయత్నం మాత్రమే. ఏడో రోజు సీసా పగలకపోవడం అబ్బు విజయం. ఆనాడు పగిలిన స్కాచ్ సీసా ముక్కలు బయటికి రాలేదు. నవ్వుకున్నాడు. ఇతి ప్రథమోధ్యాయః

తరువాత ఏం చెయ్యాలో, ఎలా చెయ్యాలో ముందే తెలుసుకున్నాడు. అంతకుముందే మరొక కొత్త నిర్ణయం తీసుకున్నాడు అబ్బు. సర్వమంగళం, అనసూయకి చెప్పి కొత్త ఇంటిని అద్దెకి తీసుకున్నాడు. ఒంటరిగా ఉండడానికి అర్థాంతరంగా కొత్త ఇల్లు ఎందుకు? ఇద్దరూ దాదాపు మీదపడి ఆగం చేశారు. ససేమిరా వీల్లేదన్నారు. అబ్బు ఒక్కమాట చెప్పాడు.

"ఆమె ఎప్పుడో ఒకప్పుడు నా దగ్గరకు వస్తుంది. వచ్చితీరాలి. ఆమె వ్యక్తిత్వంలో మార్పు ప్రదర్శన కాకూడదు. ఆమెలో వచ్చే మార్పుని మరికొందరు గమనిస్తున్నారని ఆమె గుర్తుపడితే అది ఓటమిలాగ ఆమెకి అనిపించవచ్చు. చిన్నబుచ్చుకుంటుంది. ఓడిపోయేవాడి ఆత్మాభిమానమూ బలహీనతే. దానికి దూరంగా ఉండాలంటే ఏకాంతం కావాలి"

ఆగి "ఈ తరువాత నేను చేసే పనులు మీరెవరూ ఊహించలేనివి. సహించలేనివి. నాది తిరుగులేని ఉద్యమం. నాకు నేనుగా ఏర్పర్చుకున్న సంకెల. ఇల్లు దూరమౌతుందే కాని మనస్సులు కావు. నా ప్రాణం-పరీక్షిత్తు-ఇక్కడే ఉంటాడని మరిచిపోకండి" అన్నాడు.

సర్వమంగళానికి సగం అర్థమైంది. అనసూయకు పూర్తిగా అర్థమైంది. అభ్యంతరం చెప్పబోయిన భర్త భుజంమీద చెయ్యి వేసి ఆపింది.

ఇప్పుడు అమావాస్య రాజు, రామశాస్త్రి ధర్మమా అని తనకి అవసరమైనంత పైకం ఉంది. ఎక్కువ జనసమ్మర్దంలేని-చిన్న, ప్రత్యేకమైన ఇంటిని అద్దెకి తీసుకున్నాడు.

ఇంటి వెనుక స్కూలు, ఆట మైదానం. ముందు నీళ్లులేని చెరువు-ఆరుబయలు. పక్కల కాస్త దూరంగా ఇళ్ళు. నిజానికి ఇది కాస్త పాడుపడిన ఇల్లు. యజమాని కూల్చి కొత్త ఇల్లు కట్టుకొందామనుకొంటుండగా బేరం తగిలింది. ఇది ఇప్పుడు అబ్బుశాస్త్రి ఏర్పర్చుకున్న కోట.

ఒకపక్క చికిత్స ప్రారంభమైంది. ఆలస్యం చెయ్యకుండా రెండోదశలోకి ఉద్యమించాడు.

❖ ❖ ❖

బాగా చీకటి పడనిచ్చి-ఖోడేస్ రమ్ సీసా పట్టుకుని నరిసిపండు ఇంటి తలుపు తట్టాడు అబ్బు. తలుపు భడాల్న తెరుచుకుంది.

సోయితా ఒక్కరికోసమే ఎదురుచూస్తోంది. ఒకదానికోసమే ఎదురుచూస్తోంది. తలుపు తియ్యగానే ఆ ఒక్కరూ కనిపించలేదు సోయితాకి. కాని ఆ ఒక్కటీ కనిపించింది. అబ్బు చేతిలో రమ్. సోయితా కళ్లు మెరిసే గాజుగోళాలయ్యాయి

"నాకోసం తెచ్చావా మహారాజా" అంటూ సీసాని అందుకుంది.

తెచ్చిన వ్యక్తినీ, ఆ వేళప్పుడు వచ్చిన కారణాన్నీ మరిచిపోయింది. ఇంట్లో కనిపించిన మొదటి లోటాలో రమ్ ఒంపుకుని గటగటా పోసుకుంది.

ఆమెకి తాగుడు వ్యసనం కాదు. నరిసిపండుతో తాగడం వ్యసనం. అది లేకపోతే చచ్చిపోదు. ఉంటే రెచ్చిపోదు. ఆమె కొండజాతి స్త్రీ. ఆ జాతి విశ్వాసాలూ, నమ్మకాలూ ఆమెలో సడలని, నిర్దిష్టమైన స్థాయిల్లో పీట వేసుకు కూర్చున్నాయి. కొండజాతి ఆడపిల్లమీద చెయ్యివేస్తే పీక కోసి తప్పించుకున్న దాఖలాలు కోకొల్లలు. కడుపులో పడిన రమ్ స్థిరపడ్డాక, నరాలు జివ్వుమన్నాక-ఒక్క అడుగు కూడా ఇంట్లోకి వేయకుండా నిలబడిన అబ్బుని గమనించింది సోయితా. మనస్ఫూర్తిగా నమస్కారం పెట్టింది.

"రా దొరా..." అంటూ గడ్డి మోడాను ముందుకు తోసింది కూర్చోమంటూ.

"ఎక్కడికంపినావు నా మడిసిని?"

అబ్బు అన్నాడు. "వస్తాడు-త్వరలోనే. నీతో పని ఉండి వచ్చాను"

"మీరు పెద్దోళ్లు. సదువుకున్నోళ్లు. నాతో ఏం పని ఉంటుంది దొరా?" అంది సోయితా.

అబ్బు నవ్వాడు. జేబులోంచి పల్లీలపొట్లాం, మూడు ఉల్లిపాయలూ పచ్చిమిరపకాయలూ అందించాడు. లొట్టలువేసుకుంటూ గుప్పెడు పల్లీలను నోట్లోకి

గిరాటేసి, ఉల్లిపాయని కసిక్కున కొరికి, పచ్చిమిరపకాయని ఉన్నపాటున నోట్లోకి విసిరింది.

"నీకు తెలిసిన చాలా విషయాలు నాకు తెలియవు. నీకు తెలిసినట్టు తెలియవు" అన్నాడు అబ్బు.

సోయితాకి అర్థంకాలేదు. అర్థంకాని స్థితికి రమ్ ఇంకా తలకెక్కలేదు.

"నాకేం తెలుసు?"

"మాంసం కూరలు వండడం"

ఒక్కక్షణం తన చెవుల్ని తానే నమ్మలేక–అంతలో కితకితలు పెట్టినట్లు–పొరుగు ఇళ్లకు వినిపించేలాగ పగలబడి నవ్వింది. నవ్వి నవ్వి అలసిపోయింది సోయితా.

"నువ్వు బేపనోడివి కదా. మాంసం తింటావా దొరా?"

ఆబ్బుశాస్త్రి మళ్ళీ నవ్వాడు. "నేను తినను. కాని తినిపిస్తాను"

సోయితా నిటారుగా కూర్చుంది. "సూడు బాబూ. మాంసాన్ని సూస్తే నా సేతులు సురసురలాడుతాయి. బుర్ర పదునెక్కుతుంది. పాడేరులో మా అన్న గుడిసె ఆ సుట్టుపక్కల పది ఆమడల వరకూ అందరికీ మతిపోగొట్టేది. అన్నలూ, పోలీసులూ మా గుడిసెలోనే కబుర్లాడుకునేవారు. లారీల డ్రైవర్లూ, కళాసీలు సోయితా వంటకోసం పడిచచ్చీవోరు. కోడి ఇగురు, పాయా, దుప్పి ఎముకల పులుసు, అడివిపందివార ఇగురు–సేస్తే మతిపోగొడతా. కాని నువ్వు బాపనోడివైపోయావు. నువ్వు తినాలేవు. తలుసుకున్నా ఆ వంటలు సెయ్యాలేవు. ఓ పని సెయ్యి. నాకు డబ్బులియ్యి. పెద్దమడిసివి. నీకు వండిత్తాను" ఈసారి ఉదారంగా రమ్ పీకింది.

అబ్బు నవ్వాడు. "నీ హస్తవాసి గురించి నరిసిపండు చాలాసార్లు చెప్పాడు. మందు తలకెక్కితే–ఇత్తడిచెంబుతో వాడి తల పగలగొట్టావట చాలాసార్లు. కాని ఘుమఘుమలాడే వంట చేసి ఆ నొప్పిని మరిపించేదానివట"

కిస్సుమని నవ్వింది సోయితా. "ఆ కబుర్లు సెప్పాడా సిగ్గులేనోడు? ఆడు మంచోడు బాబూ. నేనే గుడిసేటిదాన్ని" సీసా చూపించి "ఇది దగుల్బాజీది. కోపం వస్తే సెయ్యి ఇసురుతాను. ఆడికి దెబ్బ తగిల్తే విలవిల్లాడిపోతాను. నాల్రోజులపాటు జుర్రుకొంటూ తినేలాగ వంట జేసిపెట్టి–ఆడి సేతుల్లో గువ్వపిట్టనైపోతాను" అంది మనస్సులో గతాన్ని కెలుకుతూ.

"మొగుణ్ణి కొట్టి, మెప్పించి, మరిపించే వంటలేవో నాకు నేర్పు" అన్నాడు ఆబ్బుశాస్త్రి.

"నువ్వు సెయ్యలేవు మగడా. నేను సేసి ఇస్తాను. డబ్బులియ్యి"

సోయితాకి అర్థంకాని మాటలు, ఎంత ప్రయత్నించినా అర్థాన్ని వివరించలేని మాటలు–అప్పుడు చెప్పాడు–

"ఈ పని నాకు ఋణవిముక్తి. నేను చేసిన పాపానికి ప్రాయశ్చిత్తం. నీ పనితో నా ఋణం తీరదు. ఇది డబ్బు ఇచ్చి తీర్చుకునే ఋణం కాదు. చేసిన పనికి కర్మని అనుభవించాలి. ఇది ఓ మనిషి ఆకలిని తీర్చే ప్రయత్నం మాత్రమే కాదు. ఆ ఆకలికి నా ప్రాయశ్చిత్తం మార్గం కావాలి. ఫలితంకన్నా మార్గం ముఖ్యం"

మందు ఇప్పటికి తలకెక్కుతోందని గ్రహించింది సోయితా. అతని మాట ఒక్కటీ అర్థంకాలేదు. అర్థంకాని మరికొన్ని మాటల్ని వల్లించి ఆమె తాగే మందు రుచిని చెడగొట్టాడు అబ్బు. ఒక్కటి అర్థమైంది సోయితాకి. తన ఎదుట కూర్చున్న పెద్దమనిషి పిచ్చోడు. అతని దగ్గర తనకి 'మందు'ని అందించే శక్తి ఉంది. అది చాలు.

సోయితా వంటి మనిషిలో సంస్కారం ఆవగింజంత. ఎప్పుడైతే తనకి తెలిసిన విషయానికి ఈ మనిషి పెద్దపీట వేశాడో–ఆ క్షణంనుంచే విర్రవీగిపోయింది. కాగా, మందు ఆమె తలకెక్కి–ఉన్న ఆమె కాస్త సంస్కారాన్నీ అధఃపాతాళానికి తొక్కేసింది. క్రమంగా ఆమె బుర్రలోంచి 'దొర, మహారాజా'లాంటి మర్యాదలు అటకెక్కిపోయాయి. మందు ఆమె ప్రాథమిక సంస్కారానికి దన్నుగా నిలిచింది. మంచంమీద తలగడని నిలువుగా తిప్పి–మంచానికి అడ్డంగా ఒరిగి–చీరెని సగం మీదకెత్తింది.

"నీకు చాలా యిసయాలు సెప్తాకాని పంతులూ! రోజంతా మినుములు దంచుతున్నా. కాళ్లు నొస్తున్నాయి. కాళ్లు ఒత్తు" అంది.

ఆబ్బుశాస్త్రి ఒక్కసారి కళ్లు మూసుకున్నాడు. బ్రహ్మవైవర్త పురాణంలో గణేశుని పూజను శిష్యులకి భాద్రపద శుద్ధ చవితినాడు ప్రదోషకాలంలో వివరిస్తూ–

"నార్చితోహి గణాధ్యక్ష యజ్ఞాదౌయత్సురోత్తమా" అంటూ అతి మధురమైన కంఠంతో ప్రవచనం చెప్తూ–అరుగుమీద వత్తిగిలే గురువుగారికి–చయనులుగారికి–ఆరాధనాభావంతో, తన్మయత్వంతో–ఆయన కోరకుండానే కాళ్ళదగ్గరకు చేరి కాళ్ళని ఒడిలోకి తీసుకుని–భక్తితత్పరతతో వాటిని ఒత్తే క్షణాలు మనస్సులో కదిలాయి.

ఆ అపూర్వమైన అవకాశానికి శిష్యులందరూ పోటీపడేవారు. శ్లోకాన్ని వల్లిస్తూనే గురువుగారు కాస్సేపు నిద్రలోకి జారుకునేవారు. సోమిదేవమ్మ విఘ్నేశ్వరుడి ప్రదోషకాల పూజకి అన్నీ సిద్ధంచేసి–శరీరసుఖంతో తన్మయులైన గురువుగారినీ, సేవాసుఖంలో

తన్మయులైన శిష్యుల్ని లేపి పూజామందిరంలో కూర్చోపెట్టేది. అది రాజభోగం.

కల్లిప్పాడు. మాంసాన్ని వండే విధానాన్ని నేర్పడానికి ఓ వేదపండితుడి సమక్షంలో మందు తాగి మత్తెక్కిన కొండజాతి స్త్రీ బానలాంటి పొట్ట ఎగిరిపడుతూండగా కాళ్లు జాపి–చీరె పైకి లాగి కాళ్లు ఒత్తమంటోంది.

ఇది కర్తవ్యం. మరొక శుశ్రూష. మరొక స్థాయిలో సేవ.

మారుమాట్లాడకుండా–అతి భక్తితత్పరతతో ఆమె పాదాలు ఒత్తడాన్ని ప్రారంభించాడు ఆబ్బుశాస్త్రి. ఆమె మెల్లగా నిద్రలోకి జారుకుంది.

ఆమె స్థానంలో చయనులుగారిని ఊహించుకుని ఆబ్బుశాస్త్రి కనుకొలకులు అవిశ్రాంతంగా వర్షించాయి.

## 28

ఇది ఐతిహ్యం. వేదంలో వివిధ విషయాలమీద ఆదిశంకరులకీ, మండనమిశ్రునికీ వివాదం జరిగింది. ఆదిశంకరులు సన్యాసి. మండనమిశ్రుడు గృహస్థు. భార్య ఉభయభారతి సాక్షాత్తూ సరస్వతీ స్వరూపమని చెప్తారు.

వాగ్వాదంలో గెలిచినవారు ఎదుటివారి ఆశ్రమాన్ని స్వీకరించాలి. అంటే ఆదిశంకరులు గృహస్థు కావాలి. మండనమిశ్రుడు సన్యాసి కావాలి. ఉభయభారతే వారి వాగ్వివాదానికి న్యాయనిర్ణేత. మండనమిశ్రుడు ఓడిపోతున్నాడు. ఉభయభారతి కల్పించుకుంది. ఎంత పరిణతి ఉన్నా ఆదిశంకరుల విజ్ఞానం సమగ్రం కాదని ఆయనకు కామసూత్ర జ్ఞానం లేదని ఆక్షేపించింది. కామశాస్త్ర అధ్యయనానికి శంకరులు నెలరోజులు గడువు కోరారు.

ఈలోగా ఆ దేశపు రాజు అమరకుడు మరణించాడు. శిష్యులకు తన శరీరాన్ని కాపాడమని ఆదేశించి–శంకరులు అమరకుని శరీరంలోకి పరకాయప్రవేశం చేశారు. రాణుల సంపర్కంతో కామశాస్త్ర రహస్యాల్ని తెల్సుకున్నారు. రాణులలో ఒకావిడ మాయాదేవి. ఆమెది బౌద్ధం. ఆర్ష సంప్రదాయానికి వ్యతిరేకం. రాజు ప్రవర్తనలో తేడా కనిపెట్టింది. చారుల సహాయంతో అతను సన్యాసి అని గ్రహించింది. అతని శరీరాన్ని పదిలంగా కాపాడుతున్నారని తెలుసుకుంది. ఆ శరీరాన్ని దహనం చెయ్యమని భటులను ఆదేశించింది. భటులు శరీరానికి నిప్పంటించారు. శిష్యులు పరుగున వెళ్లి అమరకుని శరీరంలో ఉన్న శంకరులకు ఈ విషయాన్ని విన్నవించారు. శంకరులు మళ్లీ తన శరీరంలోకి పరకాయప్రవేశం చేసి కాలుతున్న శరీరాన్ని కాపాడమని లక్ష్మీనృసింహ కరావలంబ స్తోత్రం చేశారు. స్వామి దయ కలిగింది. చితినుండి శంకరులు

బయటపడ్డారు. ఇప్పుడు శంకరులు ఉభయభారతిని ఎదుర్కొన్నారు. నిస్సందేహంగా మండనమిశ్రుడు పోటీలో ఓడిపోయాడు. అనుకొన్న షరతు ప్రకారం మండనమిశ్రుడు శంకరుల శిష్యుడయారు. శంకరులు శృంగేరీలో సర్వస్వతీదేవిని ఉభయభారతిగా ప్రతిష్ఠించి, సన్యాస స్వీకారంతో సురేశ్వరాచార్యులుగా మారిన మండనమిశ్రులకు ఆ పీఠానికి ఆధిపత్యాన్ని ఇచ్చారు.

ఐతే ఇందులో పాఠాంతరాలున్నాయి. అమరకుడి శరీరంలో ఉన్న శంకరులు కేవలం శరీరసుఖాన్ని పొందడం కాక, ధనంజయ వాయువుతో ఆ ప్రక్రియని దాటారంటారు. అసలు ఇది కథే కాదని, శంకరులు పక్షి రూపాన్ని ఆశ్రయించి విషయగ్రహణం చేశారన్న కథ కూడా ఉంది. తనకి తెలియని, తెల్సుకోదలచిన జ్ఞాన సముపార్జనకు ఆశ్రమధర్మాన్నే మార్చుకున్న ఆర్షధర్మాన్ని సూచించే ఐతిహ్యమిది.

ఏతావాతా అబ్బుశాస్త్రి చేయతలపెట్టిన ప్రయత్నం ధర్మవిరుద్ధం కాదు.

ఏమైనా సోయితా బయటికి కనిపించేంత సాదాసీదా మనిషి కాదు. తనకి తెలిసిన ప్రాభవాన్ని కారణాలు, లక్ష్యాలతోసహా ఒడిసిపట్టుకుంది.

"చూడు పంతులూ–చేపలు రెండు రకాలు. సముద్రపు చేపలు, ఏటి చేపలు. సముద్రపు చేపకి శక్తి ఎక్కువ. ఏటి చేపలకి రుసి ఎక్కువ. వంజరం, కోనం, పండుగప్ప, చందువా, నెత్తళ్లు సముద్రపు చేపలు. బొమ్మిడాయిలు, బొచ్చె, శీలావతి, కొరమీను, మట్టగుడెసె, పక్కీలు చెరువు చేపలు.

మరో గుక్క రమ్ మింగి నవ్వుకుంది. "నా మడిసి రోజంతా పనిసేసి అలసిపోయి వచ్చాడనుకో. సందువా వేపుడు సేసి ఆడి నోటికందిత్తా. ఆడి నోట్లో ముళ్లు కూడా కరిగిపోతాయి. నోట్లో పడితే సందువా కొబ్బరిముక్కైపోతాది" అప్పుడే తిన్నట్టు మురిసిపోతూ చెప్పింది.

"నువ్వు మగోడివి. ఐనా అడిగావు కనుక సెప్తున్నా. ఆడు దగ్గరికి రాడానికి మొరాయిత్తే నా దగ్గర బోలెడన్ని మందులున్నాయి. బజారుకెళ్లి మేక, పొట్టేలు, మేకపోతు, గొర్రెపోతు–ఏది దొరికితే అది తెస్తా. మేక మాంసం సాగుతాది. పొట్టేలు మాంసం పీచులాగ–పనసకాయలో పనసముక్కలాగ పంటికింద నలుగుతాది. నాయాల–ధనియాల పొడి, అల్లం, ఉల్లిపాయ, వెల్లుల్లి, కారం, పసుపు, ఉప్పు దట్టించి–సిన్న ముక్కలు తరిగి–ఇగురు సేసి నోటికందిత్తే మూడో ఝాముకి లేచి కూచుని నా కాళ్ళట్టుకుంటాడు. అన్నట్టు దాల్చినచెక్క, లవంగాలు, యాలకులు బాగా దట్టించు–నా సామిరంగా–ఆ తర్వాత తెల్లారినట్టే తెలీదు"

అబ్బు తలలో వివరాలు–బారులుతీర్చి విషయాన్ని పొదుగుతున్నాయి.

"మావోడు సరదాగా ఉన్నప్పుడు-ఆడిమీద జాలేత్తాది. ఎంతైనా మొగుడు కదా. అప్పుడు రొయ్యల ఇగురు సేత్తా. రొయ్య తల, తోకా సీసేశాక-మరిచిపోక" లేచి కూచుని-

"ఏదీ, నీ చెయ్యి చూపించు" అని అబ్బు చెయ్యి పట్టుకుని "ఇదుగో-ఈ వేలుతోగానీ, పిన్నీసుతోగానీ-దాని మధ్యనున్న నరం తీసెయ్యాలి. లేకపోతే మాంసం చేదెక్కిపోతాది. బజారులో కొంటే ఆల్లే చేసి ఇత్తారనుకో. చేపకైతే పొలుసు తీసి ఇసిక, ఉప్పు రాసి రాయిమీద తోమాలి. మట్టెగుడిసెని తోమితే-నీ యవ్వ-బూడిద రంగు దిగుతుంది. దాన్ని పులుసు చేస్తే తిన్నోడు కిందపడి కొట్టుకుంటాడు"

ఉన్నపాటునా లేచి కూచుంది. "పంతులూ. పెతీ పనికీ ఒడుపుంటాది. నువ్వు చేపని వండినా, వేటని వండినా-ఒకటి మాత్రం మరిచిపోక-దాని లోపల కాయంమీద ఆకుపచ్చగా వేపగింజంత బొడిపె ఉంటాది. దాన్ని చేనుకట్ట అంటారు. నెల్లూరులో అయితే 'పిచ్చు' అంటారని మా అయ్య సెప్పేవాడు. ఆడు మిలట్రీలో పని చేశాడు. అదే ఇసిత్రం పంతులూ. జాగ్రత్తగా పిచ్చు తియ్యకపోతే మాంసమంతా చేదు విషమైపోతాది. 'ఒలే సోయితా నంజా! బతికున్నప్పుడు ఈ బుగ్గ ఆ జంతువుని కాపాడుతాది. సచ్చాక దాన్ని తీసెయ్యకపోతే మన నోటిదగ్గర కూడు సెడిపోతాది. అది సేపైనా, మాంసమైనా అంతేనే అనీవోడు"

"మా అయ్యకి నామీద పేమ పుట్టినప్పుడల్లా-'ఒయిలే సోయీ! సేపల పులుసెడతావే?' అని బతిమాలేవోడు. నాల్రోజులు బతిమాలించుకని రంగంలోకి దూకేదాన్ని. బొచ్చె, శీలావతి, బొమ్మిడాయిలు, మట్టగుడిసె-ఏద్దైనా తీసుకో. సింతసిగురూ, పచ్చిమామిడికాయ దబ్బలూ పక్కనెట్టుకో. బాగా గేపకమెట్టుకో పంతులూ! సేపకి కడుపు రుచి. ఆవాలు, మెంతులూ, ఇంగువ, టొమేటో, పచ్చిమిర్చి, కారప్పొడి, ఉల్లిపాయ కలిపి-ఇంత నూనె ఏసి-దొరికితే ఆవనూనె ఎయ్యి-పాడేరొచ్చే వొడ్డి మనుషులు నాలికమీద తగిల్తే కిర్రెక్కిపోతారు. సేపముక్కల్ని సన్నటి సెగమీదెట్టాలి. సేపని ఈ ముద్దలో దొర్లించాక-అటికలో ఏసి-బొగ్గులపొయ్యిమీద ఎడితే-రసం ముక్కకి పట్టి-మెల్లగా నీరు ఆర్చుకుపోతాది"

విషయమంతా కథలాగ చెప్పలేదు సోయితా. ఆ వంటని గుర్తుచేసుకుంటూ అనుభవిస్తూ-అంత ప్రతిభ తనకి వంటబట్టినందుకు పొంగిపోతూ, ఈ విషయం ఏమాత్రం తెలీని-ఓ వెర్రి బ్రాహ్మడు అబ్బురంతో చూసే చూపుని ఆకళించుకుంటూ-వల్లించింది.

"గుర్తుంచుకో పంతులూ! సేప పులుసు ఎప్పుడూ ఓ నిద్దర సెయ్యాల. అప్పటికి ముక్కకి రుసిపడుతుంది. సేరువాకి పొగరొత్తుంది. మర్నాడు పొద్దున్నే మినపట్టు, ఇడ్లీని పొర్లించి నోటికందిత్తే శత్రువు కూడా కాళ్లమీద పడిపోయి పేణాలిచ్చేత్తాడు. గేపకముంచుకో.

పులుసు సిక్కపడాలి. సేరువా నాలికమీద పడితే ఆరు నెలలు మాటల్లేని మొగుడు కూడా గువ్వపిట్టలాగ సంకలోకి దూరిపోతాడు. వంజరం కిలోల్లెక్కన దొరుకుతాది. అందుకని మా పెద్దోళ్లు ముక్కలు తరిగి ఎండబెట్టేవోళ్లు. కావలిసినప్పుడు సింతసిగురు పులుసులో బాగా నానబెట్టు. వంకాయ, సింతకాయ, సింతసిగురు, దోసకాయ–నీ ఇష్టం. 'ఎందు సేప ఏపుడు ఊరు మారితే రుసి మారుతాదే దొంగనంజా' అనీవోడు మా మామ. ఆడు అరవ్వోళ్ళతో మిలట్రీలో పని సేశాడు. ఆళ్లు దీన్ని 'కరువోడు' అంటారని సెప్పీవోడు. సూడు పంతులూ. మనిషి ఎక్కడోడైనా నోటికి రుసే ముఖ్యం. అన్నట్టు–పీతలు మరిసిపోయానయ్యో. గుడ్డుపీతలు, మండపీత, సుక్కపీత. పీతని కొనేముందే కొండెలు కట్టీమని సెప్పు. బతికున్న పీతలైతే వంటకొచ్చేసరికి గుమగుమలాడిపోతాయి. ఇందాక సెప్పిన గరంమసాలా దట్టించి ఆ గుజ్జులో పీతల్ని ఏసెయ్. దాకని బొగ్గులపొయ్యిమీదెట్టి మరిసిపో. మెల్లిగా పీత ఆ రసాన్ని లాక్కొంటుంది. పళ్లెంలో ఎట్టుకుని రెక్క కసక్కని కొరికితే ఆడదాని పెదాలు కొరికినట్టు గుండె గుబగుబలాడిపోతాది. గుజ్జు నోట్లోకి తంతాది. గేపకముంచుకో. పీత కంతిరీనంజె. బతికున్నంతసేపూ వేళ్లకి గుచ్చుకుంటాది. పరాగ్గా ఉన్నావంటే నీలాటోడికి వేలు తెగిపోతాది" ముందుకు వొంగి "మరిసిపోక. పీత వీపుమీద పెచ్చు తీసెయ్యాల. నేను నీల్లోసుకున్నప్పుడు మా అయ్య పొట్టేలు మాంసం వొండి కూర్సునిమరీ తినిపించీవోడు. 'కోడి ముట్టుకోకే నా కుయ్యా. ఏడి సేత్తాది' అనీవోడు"

"మాంసంలో సచ్చు తిండి ఒకటుందయ్యా–కోడి పలావు. గతి లేనోళ్లు, బొత్తిగా పొగరు లేనేళ్లు తినే తిండి. మీసాలున్న మగాడు శీలావతిని తెచ్చుకుంటాడు–అనేది మాయమ్మ. బస్మతీ బియ్యం ఉడికించి పక్కనెట్టు. వెల్లుల్లి, అల్లం, ఉల్లి, సిన్న నేతిసుక్క వేసి బొగ్గులపొయ్యిమీద దాకని ఎట్టు. మంచి అటికైతే వంటకి రుసి వత్తాది. కట్టెలపొయ్యిమీద వండితే దాని రుసే వేరు. ఉడికాక–దానిలో కొత్తిమీర వెయ్యి. కంచంలో ఎట్టి–పక్కనే పెరుగు, పచ్చిమిర్చి, కొత్తిమీర, అల్లం, ఉప్పు, ఉల్లిపాయలు కలిపిన పెరుగు ఎట్టావనుకో–ఆడిముందు బట్టలిప్పి రంబని నిలబెట్టినా ఆ నంజయేపు సూడడు. సచ్చేదాకా అలా సత్తానే ఉంటాడు–వేళ్లు నాకుతూ"

"నా మడిసి నన్ను కట్టుకున్నప్పుడు మా పిన్నమ్మ సెప్పింది. 'ఒలే సోయా! నీకు పళ్లూడిపోయినా, ఓ సెయ్యి కాలూ పనిసెయ్యకపోయినా–ఒళ్లు జారిపోయినా–మగాణ్ణి నీ సుట్టూ తిప్పుకోవాలంటే వంటదగ్గిరికి ఆణ్ణి రానియ్యకు. బట్టలిప్పితే ఆడు మగోడు. సేతిలో దాక ఉంటే నువ్వేనే రాణీవి–అది మర్సిపోక. పండుగప్పని, కోనం మాంసాన్ని మరిగినోడు వెయ్యి జన్మలైనా ఆడదాన్ని వొదిలిపెట్టడు"

నాలుగు రాత్రిళ్లు మూడో జాము వరకూ ఈ పాఠం సాగింది. మధ్యలో సీసా ఖాళీ అయితే మళ్లీ అబ్బుని బజారుకి పంపించింది.

“ఇక్కడ అప్పుడప్పుడు దొరుకుతాయిగాని పులససేప రుసే వేరు. నదిలో పుట్టి, నదిలో పెరిగి, నదితోపాటు సముద్రంలోకెళ్లి ఏటికి ఎదురొచ్చే చేప. దాని జన్మ గొప్పది. గోదావరి నదిలో, కృష్ణా నదిలో దొరుకుతాయి. ఈమధ్య అడ్డమైన నాకొడుకులకీ పార్టీ టోపీలెట్టినట్టు పెతీ ఎదవ సేపనీ ‘పులస’ అంటారు. పులసకి ముల్లెక్కువ. వొలుసుకు తింటే సొర్గానికి బెత్తెడు దూరంలో ఉంటావు. గేపకముంచుకో బాబూ. వండడానికి కష్టపెట్టేవన్నీ తినడానికి గొప్ప రుసిగా ఉంటాయి. ఎప్పుడో దొరికే సేప కదా? పులస బజారుకొచ్చిందంటే సినీ స్టారు ఊళ్లోకి వచ్చినట్టు. అమ్మేవాళ్లు రేటు పెంచేస్తారు. కాని రుసి మరిగినోళ్లు వొదులుకోలేరు. ఓ మాట సెప్తాదయ్యా మా అయ్య–‘గోదావరి పులస మరిగినోళ్లు పుస్తెలమ్ముకొనైనా పులసని తినాలి’ అని.

“నా మొగోడు సొర అంటే పేణం ఇచ్చేత్తాదయ్యా. నేను నీళ్లోసుకున్నా–కడుపు నిలవలేదు కాని–సిన్న సొర దొరికినప్పుడు ‘పిట్టు’ సేసుకు ఎట్టా కోయే! పిల్ల నేలమీద పడ్డాక బాలింతలకు ఇక్కడ–పాలుపడతాయి” అంటూ అతి మర్యాదగానే స్తనాలను చూపించింది–సిగ్గుపడుతూ.

“సొరముళ్లు తీసి, తోలు తీసి, మాంసాన్ని ఇడ్లీలాగ ఉడకబెట్టు. ఉడికినకొద్దీ పొడిపొడిగా అయిపోతాది. ఉప్పూ, గరంమసాలా, పచ్చిమిరపా ఏసుకో. అన్నంలో కలిపితే–మెతుకుల్ని ఏరి దూరమెడతావు సొరకోసం పిట్టునే పట్టుపడతావు”

చెప్తున్నప్పుడు అబ్బు ముఖం చూడడంలేదు సోయితా. మందు బాగా ఎక్కి ఆరోజు అలసిపోయింది.

ఆమె చెప్పిన ప్రతీ అక్షరాన్నీ ఆపోశనపడుతున్నాడు అబ్బు. ఉన్నట్టుండి ఆమె ధార ఆగిపోయింది. దూరంగా గడ్డిమోడామీద కూర్చున్న అబ్బుశాస్త్రి కళ్లిప్పాడు. సోయితా తదేకంగా అతన్నే చూస్తోంది. వెలిగిపోతున్న ముఖంతో నుదుటిన గంధం, కుంకంబొట్టుతో పూజకు సిద్ధమైన పువ్వులాగ ఉన్నాడు అబ్బు. ఎంతోసేపు తాగేసే చూపులు చూసి “నన్నొక్కసారి ముద్దెట్టుకో పంతులూ!” అంది సోయితా.

అది తాగుడు ఇచ్చిన చొరవ. సద్బ్రాహ్మణుడు మాంసం వండడం కర్మపరిపాకమని సరిపెట్టుకున్నాడు. కాని పరాయి స్త్రీ స్పర్శ అశ్లీలమని విలవిలలాడాడు.

అపరకర్మలో ప్రేతానికి కర్మలు చేయిస్తూ ముఖ్యంగా రెండు దోషాల నివృత్తికి ప్రాయశ్చిత్తం చేయిస్తారు. పరస్త్రీ సంభాషణ, పరస్త్రీ దర్శన. సమక్షంలో పరాయి స్త్రీ ఉంటే–సూటిగా ఆమెనికాక–పక్కన ఉన్న ఏ వస్తువునో చూస్తూ మాట్లాడడం–తరాల

కింద మరిచిపోయిన ఆచారం. పరస్త్రీ దర్శనానికి–వాల్మీకంలోనే ఋషి గొప్ప ఉదాహరణని చెప్పారు. అమ్మవారి ముఖాన్ని లక్ష్మణుడు ఏరోజూ చూడలేదు. అరణ్యకాండలో ఆమె పాదాలకు ఉండే మంజీరాలు, మట్టెల్నే గుర్తుపట్టాడు. ఇది ఆనాటి సంస్కృతీ వైభవం. ఇప్పుడు చెప్తే బూతుమాట.

సోయితా మంచం దిగి అతని ముందుకొచ్చింది. అబ్బుకి కళ్లనిండా నీళ్లు నిండాయి. "నువ్వు నా గురువువమ్మా" అన్నాడు. ఆ మాట, ఆ భావానికి అర్థం ఆమెకి తెలీదు. ఆమె శరీరంలో ప్రస్తుతం విశృంఖలత్వాన్ని రెచ్చగొట్టే మత్తు ఉంది. ఆ మత్తుకి ఆమె ఇప్పుడు బానిస.

కాని... కాని... కాని...

అబ్బు దగ్గరికి వస్తున్నకొద్దీ కోరికని రెచ్చగొట్టే ధమనులలోని రక్తం సడలింపు ఇచ్చింది. అతని ముఖం అగ్నిహోత్రంలాగ ఉంది. దాన్ని తన పెదాలతో తాకే ప్రయత్నం సాధించలేనని ఓ గిరిజన స్త్రీకి మెదడులో ఏదో ఆలోచన మడత విప్పింది.

అబ్బు కళ్లు మూసుకున్నాడు–జరగబోయే గొప్ప అరాచకం నుంచి తనకి విముక్తి లేదని సిద్ధపడ్తూ. ఎంతకీ ఆమె పెదాలు ఆయనదగ్గరికి రాలేదు. కాస్సేపటికి కళ్లిప్పాడు. సోయితా అతని కాళ్లదగ్గర కుప్పలా కూలి నిద్రపోయింది.

నిట్టూర్చి, మంచంమీద ఉన్న తలగడ ఆమె తల కిందకి చేర్చి, దుప్పటి కప్పి మెల్లగా బయటికి నడిచాడు.

## 29

గోల్కొండ క్రాస్‌రోడ్స్ దగ్గర్లో గల జమిస్తాన్‌పూర్‌లో చేపల బజారు. తెల్లవారేసరికి చేపలు, రొయ్యలు, సముద్రం చేపలూ (కలకత్తా నుంచి) దిగుతాయి. అంబర్‌పేట దగ్గర్లో గోల్‌నాకా మాంసం బజారు.

మాంసం బజారుకి శివకోవెలకి వచ్చిన భక్తుడిలాగ తెల్లటి బట్టలూ, నుదుట బొట్టూ–దాదాపు గుండులాగే ఉన్న జుత్తుతో వచ్చాడు అబ్బుశాస్త్రి. స్పష్టంగా ఆ వాతావరణానికి చెందిన మనిషి కాదని చూడగానే తెలుస్తోంది. అతన్ని చూసి బజారులో ఉన్నవారు ఆబోతులున్న బందిలదొడ్డిలోకి మేకపిల్ల వచ్చినట్టు వింతగా చూశారు.

"అరే పండిట్‌జీ! దారితప్పి వచ్చారా? ఇక్డ మీదీ సర్కు దొరకదు సాబ్" అన్నాడు బజారులోకల్లా పెద్ద దుకాణదారు ఖాజా. దుకాణంముందు కర్రమొద్దుమీద మొండాలు తెగుతున్నాయి. అబ్బుశాస్త్రి చలించలేదు. ఈ దృశ్యం, ఈ వాతావరణం, ఈ వెక్కిరింత, ఈ కొనుగోలు అంతా కొత్త అబ్బుశాస్త్రికి.

"వంజరం కావాలి" అన్నాడు ఖాజా దుకాణం ముందు నిలబడి.

కొనుగోలు చేసేవాళ్లూ ఆగిపోయి విడ్డూరాన్ని చూస్తున్నారు. అసలు ఆ పేరు చెప్పినందుకే ముఖాముఖాలు చూసుకున్నారు. ఖాజా కావాలనే చిన్న అల్లరి చేశాడు. వెనక వెదురుబుట్టలో ఉన్న రకరకాల చేపల్ని చూపిస్తూ "మీకు కావలసిన సరుకేదో చెప్పండి పండిట్‌జీ!" అన్నాడు. ఇన్ని రకాల చేపల మధ్య ఈ పండిట్‌జీ వంజరాన్ని గుర్తుపట్టగలడా?

స్పష్టంగా వంజరాన్ని తీశాడు అబ్బుశాస్త్రి. ఖాజా ఆశ్చర్యపోయాడు.

బుట్టలోంచి తీసిన చేపని ఏమాత్రం వెగటు లేకుండా రెండు చేతుల్తో పట్టుకుని మొప్పల్ని ఎత్తి చూశాడు. చేప కళ్ళు కదిపాడు. ఎరుపు తగ్గింది. కళ్లు పాలిపోయి ఉన్నాయి.

"ఇది నిలవ చేప. ఇవాళ వచ్చింది కావాలి" అన్నాడు అబ్బు.

తెల్లబోయాడు ఖాజా. ఖాతాదార్లు ముఖాలు చూసుకున్నారు. దూరంగా ఉంచిన బుట్టలోంచి సరుకుని తీయబోయాడు ఖాజా. ''నేను ఎంచుకుంటాను'' అని ముందుకొచ్చాడు అబ్బు. కొరమీను పొట్టని నొక్కిచూసిమరీ అయిదింటిని ఎంపికచేశాడు.

"వీటితో ఏం చేస్తారు పండిట్‌జీ?" అన్నాడు ఖాజా.

"కొరమీను ఇగురు చేస్తాను. నిప్పుసెగమీద గరంమసాలా, చింతపండు పులుసు–చేప శరీరంతో నీటితో కలిసి, గట్టిపడి ఆకుమీద వేస్తే పాయసం జారినట్టు చిక్కగా సేరువా జారుతుంది"

నిర్ఘాంతపోయాడు ఖాజా.

గోల్‌నాకాలోనూ అదే పరిస్థితి.

వ్యాపారంలో కాకలుతీరిన యాద్గిరి తన జీవితంలో కనీవినీ ఎరగని కొనుగోలుదారుడు, కనీవినీ ఎరగని సమాచారంతో కొనుగోలు చెయ్యడం చూసి బిత్తరపోయాడు.

మగపొట్టేలు రుచి ఎక్కువ. ఆడదానికి రుచి, శక్తి తగ్గుతుంది. పొట్టేలు మాంసం నాణ్యతకి కొలమానం ఆయాలు (వరిబీజాలు). వేలాడగట్టిన మాంసానికి వరిబీజాలు అతికించి నాసిరకానికి గిరాకీని కల్పిస్తారు–నాణ్యత తెలీనివారి కళ్లు గప్పడానికి. మేకమాంసంకంటే పొట్టేలు మాంసం రుచి ఎక్కువ. మాంసం మెత్తబడడానికి అప్పుడప్పుడు పచ్చిబొప్పాయి కాని, పచ్చికొబ్బరిముక్క కాని వేసి–నాణ్యత తగ్గిన సరుకుని సరిపెట్టుకుని వండుకుంటారు. ఇవన్నీ అనుభవంతో అర్థమయ్యే విషయాలు.

ఆరోజు గోల్‌నాకాలో అబ్బుశాస్త్రి ఒక ప్రదర్శన. అతని వెనుక కనీసం అరడజనుమంది నడిచి–సరుకుని ఎంపికచేయడంలో, బేరం చేయడంలో, నాణ్యత కనుక్కోవడంలో–సంవత్సరాలతరబడి తమకి అందని ఎన్నో విషయాల్ని తెలుసుకున్నారు.

ఆ వాతావరణంతో ఏ విధమైన పొంతనా లేని ఓ విచిత్రమైన వ్యక్తి–అనూహ్యమైన అలజడిని సృష్టించి–బజారునుంచి బయటకు వచ్చే సమయానికి వతనుగా వచ్చేవారి అందరి మన్ననల్నీ–ఆ కాస్త వ్యవధిలోనే సంపాదించుకున్నాడు.

❖ ❖ ❖

మాంసాహారులకి కూడా వండే ప్రక్రియ రుచించదు. ఎవరో అన్నారు–లొట్టలువేస్తూ టేబిలుముందు కూర్చుని చికెన్ 65 తినేవాడికి ఒక్కసారి వంటగదిలోకి తీసుకెళ్లి కోడిపీక నులిమి చంపి, ఈకలు పీకి, మాంసం కోసి వండడాన్ని చూపిస్తే–దాన్ని తినడం మానుకుంటాడని. నోటికందే రుచిని దృష్టిలో పెట్టుకుని కృత్యాద్యవస్థని దాటడం చాలామందికి సాధ్యంకాని పని.

అబ్బుశాస్త్రికి ఏనాడూ తాను తెల్సుకున్న కూరల రుచి ఎలా వుంటుందో తెలీదు–తాను తినలేదు కనుక.

సోయితా పుణ్యమా అని ఎలా ఉంటే ఎలా రుచిస్తుందో తెలిసివచ్చింది. చెయ్యని ఇంజనీరుగారు కారు తయారీకి ఉపక్రమిస్తే ఎలా ఉంటుంది? అదీ అబ్బు పరిస్థితి. ఇది చాలా కష్టమైన పని మాత్రమే కాదు. ఏమాత్రం అదుపు తప్పినా నోటిదాకా వెళ్లని పరిస్థితి. ఐనా–నిశ్చలమైన ఏకాగ్రతతో వంట సాగించాడు. మంచి వంటలన్నీ కన్నుల్నీ నింపాలి. కడుపునీ నింపాలి. శాఖాహారులు–సాధారణంగా వంట చేసేటప్పుడు అనుపానాలన్నీ సరిగ్గా ఉన్నాయో లేదో అరచేతిలో వేసుకుని రుచి చూడ్డం రివాజు. కాని ఉపవాసం చేసేవారు–ఆ ఒక్కసారీ–ఆ పని చెయ్యరు. ఐతే సంవత్సరాల తరబడి కొనసాగిస్తున్న ఆ కృషి వారి చేతికి ఆ సౌలభ్యాన్ని కల్పిస్తుంది. అబ్బుశాస్త్రికి ఆ అవకాశం లేదు. లొట్టలువేస్తూ వంట ఎలా చెయ్యాలో చెప్పిన సోయితా అనుభవమూ, నోట్లో వేసుకుని కమ్మగా తయారైందో లేదో నిర్ధారించే అవకాశమూ లేదు.

❖ ❖ ❖

ఉనిషత్తుల్లో పరమాత్మని దర్శించిన ఋషులు మాటలకందని ఆ అనిర్వచనీయమైన అనుభవాన్ని పరిమితమైన మాటల చట్రంలో పొదిగే ప్రయత్నం చేశారు. ఆ స్థాయిలో–ఏమాత్రమైనా 'ఋషి హృదయంలో లేదా ఋషి మాటల్లో, సంకేతమాత్రంగా సూచించిన అనుభూతి అందుతుంది. ఇది అంకెల్లోనో, మోతాదుల్లోనో గుణించేది కాదు.

అపరిమితమైన దివ్యత్వాన్ని పరిమితమైన భావజాలంతో అందుకోవడానికి ప్రయత్నించిన శతాబ్దాల సాధన కొనసాగింపు. అదీ ప్రాథమిక స్థాయిలో అబ్బు చేస్తున్న పని.

ఈ ఇచ్చిపుచ్చుకోవడాలకు అలవాటుపడిన, అభ్యాసం చేసుకున్న అబ్బుకి-ఏకాగ్రతతో కృషికి పూనుకొని సోయితా మనస్సులోకి, అనుభవంలోకి, ఆమె మాటల్లో సూచితమైన రుచిని అందుకునే ప్రయత్నం చేశాడు.

ఈసారి సీసాతోపాటు పెద్ద కేరేజీని చూసింది లీల. ఆశ్చర్యపోయింది. చాలా రోజులుగా పొడి పొడి ఆహారంతో గడుపుతున్న ఆమెకు మూతలు తీయగానే గుప్పుమన్న సువాసనలు మత్తెక్కించాయి. ఆ క్షణంలో మరే ఆలోచనా మనస్సుకు రాలేదు.

సృష్టి అంతటిలో మన వశంలోలేని, మన పరిధులకు లొంగని, వదులుకోలేని అతి బలమైన ఆకర్షణ ఏది? స్త్రీ సంభోగం, మత్తు, పదవి, సౌందర్యం-ఏదీ కాదు. కేవలం నాలిక రుచి. ఇది ప్రాథమికమైన, సమస్త ప్రాణికోటినీ లొంగదీసుకునే ఆకర్షణ.

అందుకే త్యాగరాజస్వామి శ్రీరాముని చూడగా, చూడగా "నా మనసు పరవశిస్తుందయ్యా" అనలేదు. "నా ఆత్మ పరిపూర్ణానందంతో ఓలలాడుతుందయ్యా" అనలేదు. "నిర్వికల్ప సమాధిలోకి పోతుందయ్యా" అనలేదు. ఇవన్నీ అందరికీ అందని, ఎంతోమందికి ఊహల్లోకైనా రాని అనుభవాలు. కాని సర్వజన సమ్మతమూ, చివ్వున మనస్సుకి తాకేదీ, ప్రతీ వ్యక్తి అనుభవంలోకీ వచ్చేదీ ఒకటుంది. ఏమిటది? రుచి.

త్యాగరాజస్వామి అంటాడు- "చూసినకొద్దీ నీ రూపం 'రుచి'గా ఉంటుంది స్వామీ"-అని.

"కన కన రుచి నీ రూపము"

ఎంత గొప్ప సైకో ఎనలిస్టు త్యాగరాజస్వామి! ఎంత గొప్పగా జీవితాన్ని చదివినవాడు! ఎంత గొప్పగా పామరునికీ, పరమాత్మకీ సయోధ్యని ఏర్పర్చగలిగాడు! అందుకే త్యాగరాజస్వామి ఋషి. ప్రతి వ్యక్తి అనుభవంలోకి వచ్చే, తప్పించుకోలేని ఆకర్షణ-రుచి.

కంచి పరమాచార్య చంద్రశేఖరేంద్ర సరస్వతీ మహాస్వామి ఓరోజు భోజనం చేస్తూ-"ఈ తోటకూర వంటకం బాగుంది" అని మెచ్చుకున్నారట అసంకల్పితంగా. అక్కడినుంచీ ఆయన 'రుచి' దావానలంలాగ వ్యాపించింది. ఎక్కడికి వెళ్ళినా తోటకూర వడ్డిస్తున్నారు. కారణం ఏమిటి? తాము నోరు జారు జిహ్వా చాపల్యాన్ని మాటల్లో వెల్లడించడంవల్ల. వెంటనే పొరపాటు తెలుసుకుని తనని తాను శిక్షించుకుని ప్రాయశ్చిత్తం చేసుకున్నారట. ఆయన నడిచే దేవుడు. ఆయనకది చెల్లింది.

లీల తనమీద కప్పుకున్న అహంకారమనే ముసుగుని ఏమాత్రం మిగల్చకుండా తునాతునకలు చేసింది అబ్బు పంపిన కేరేజీ. వాటి రుచి ఎలా ఉంటుందో కూడా తెలియని సద్బ్రాహ్మణుడు–ఎలా ఉంటే రంజకంగా ఉంటుందో నిర్దేశించిన కృషి ఆమెను తల్లకిందులు చేసింది.

ఏమాత్రం పొంతన లేని రెండు విభిన్నమైన రంగాలివి. రెండు విభిన్నమైన ప్రవృత్తులు. రెండు విభిన్నమైన మనస్తత్వాలు. కాని విచిత్రమైన పరిస్థితుల్లో విధి నిర్దేశించిన క్రీడలో – ఒకరు చర్యకు పూనుకున్నారు. మరొకరు ప్రతిఫలాన్ని అందుకున్నారు. ఇదొక మహా యజ్ఞం. ఇది పరాకాష్ఠకు చేరే సమయానికి – అంటే అబ్బుశాస్త్రి చేతి మహాత్మ్యానికి ఆమె 'బానిస' అయ్యే సమయానికి – నరిసిపండు తిరిగివచ్చేశాడు.

## 30

మనసుల మధ్య జరిగే ప్రచ్ఛన్నయుద్ధంలో రెండు వర్గాలవారూ ధీమంతులైతే, స్వాభిమానపరులైతే–పోరాటం రసవంతమౌతుంది. పోరాటం సాగించడానికి స్థైర్యం కావాలి. ఓటమిని అంగీకరించడానికి పెద్ద మనసూ కావాలి. ఆత్మావలోకనం కావాలి. వినయం కావాలి. ఇంకో మెట్టుమీదకి వెళ్లి చెప్పాలంటే విజ్ఞత కావాలి.

నరిసిపండు లేని సమయంలో తప్పనిసరిగా అబ్బుశాస్త్రిమీద ఆధారపడాల్సిన లీల ఎదిరించింది. ఎదిరించి గెలిచాననుకుంది. అబ్బుశాస్త్రి ఆదరణకి ఓడిపోయింది. కాని ఓడిపోయి తల వొంచడానికి సుతరామూ ఒప్పుకోలేదు. అర్ధాంతరంగా తనని వదిలిపెట్టిపోయిన నరిసిపండుని చెడామడా తిట్టింది. తను లేని సమయంలో ఇటు అమ్మగారికి అండగా నిలిచి, అటు సోయితా దగ్గర పాఠాలు చెప్పించుకుని లీలని కంటికి రెప్పలాగ చూసుకున్న అబ్బుశాస్త్రి మీద గౌరవం పెంచుకోవడానికి బదులు తనని సాధిస్తుందేం?

అసలు ఈ అబ్బు ఎవరు? ఎందుకీ ప్రయోజనంలేని సేవ చేస్తున్నాడు? లీల అడగలేదు. అక్కడికీ నరిసిపండు ఓసారి కదిపాడు.

అబ్బు నవ్వి "సమయం వచ్చినప్పుడు చెప్తాను" అన్నాడు. అదెప్పుడు వస్తుంది? నరిసిపండు అడగలేదు.

అకారణంగా జరిగే ఉపకారం వెనుక సహేతుకంగా జరిగే కీడుకన్నా పెద్ద కథ ఉండాలని ఇద్దరూ గుర్తుపట్టలేదు. కారణం–ఒకరికి అహంకారం, మరొకరికి అజ్ఞానం అడ్డుపడింది.

అన్నిటికీమించి తన అవసరాలను ఆసరా చేసుకుని అబ్బు సాధించిన విజయం-అదాటుగా దొంగదెబ్బతీసినట్టు భావించింది లీల. ఐనా ఈ అబ్బు ఎవడు? అతనికి నేనెందుకు కృతజ్ఞత చెప్పుకోవాలి?

కాని ఆమెకి అర్థంకాని విషయం-ప్రహ్లాదుడి మనస్సులో శ్రీమన్నారాయణుడు ఎంతగా సుప్రతిష్ఠమయ్యాడో తన శత్రువునుంచి తన కొడుకుని కాపాడుకోవాలనుకొని అనునిత్యం తాపత్రయపడే హిరణ్యకశిపుడి మనస్సులోనూ శ్రీమన్నారాయణుడు అంతగా సుప్రతిష్ఠమయాడు. ఆమెకు తెలియకుండా ఆమె మనస్సులో అబ్బు నిలిచిపోయాడు. ఇది అబ్బు చికిత్స మొదటి భాగం. చక్కని ఉద్యానవనాన్ని ఏర్పర్చాలంటే ముందు అస్తవ్యస్తంగా పెరిగిన కలుపుమొక్కల్ని ఏరి పారెయ్యాలి. లీల పుట్టినప్పట్నుంచీ-పోనీ తల్లిదండ్రులు పోయినప్పట్నుంచీ-ఆమె జీవితాన్ని ఆక్రమించుకున్నవి కలుపుమొక్కలే. అబ్బు నవ్వుకున్నాడు. అటుతర్వాత జమిస్తాన్‌పూర్‌లో ఖాజా, గోల్‌నాకాలో యాద్గిరి అబ్బు రానందుకు ఆశ్చర్యపోయారు. రోగం తగ్గుముఖం పట్టాక మందు అవసరం ఉండదని వాళ్లకి తెలీదు.

మందు 'వంట' కాదు. 'వండడం'. లీల విషయంలో ఇప్పుడు రోగం మరో కొత్తదారి పట్టింది.

❖ ❖ ❖

ఆ ఫోన్‌కాల్ మాట్లాడాక అక్కిరెడ్డి ఆశ్చర్యపోయాడు. లీలనుంచి ఫోన్ వస్తుందనీ, అందులోనూ తనతో హోటల్‌కి రావాలని కోరుకుంటుందనీ అక్కిరెడ్డి కలలో కూడా ఊహించలేదు.

అక్కిరెడ్డి స్టీలు ఫ్యాబ్రికేషన్ చేసే ఫ్యాక్టరీ యజమాని. ఎంతసేపూ కొలిమిలో పని. భయంకరమైన శబ్దాలూ, ఇనుమును కాల్చి, వొంచి, మోది, అతికించి, రకరకాల రూపులుదిద్దే మొరటు పరిశ్రమకి యజమాని. రెడ్డి కూడా అన్నివిధాలా మొరటుతేలిన మనిషి. అక్కిరెడ్డి రోజంతా ఒక్క అగ్గిపుల్లతోనే సిగరెట్లు కాలుస్తాడు. మొదటి సిగరెట్టు వెలిగించాక, రెండో సిగరెట్టుని మొదటి సిగరెట్టే వెలిగిస్తుంది. పెదాలు నికోటిన్‌తో నల్లబారిపోయాయి. ఎవరినైనా తిట్టాలంటే నోరిప్పడు. సిగరెట్టుతో కాలుస్తాడు. అతని దగ్గర ఎవరూ రెండు నెలలకంటే ఎక్కువ పని చెయ్యరు. రెండు మూడు సిగరెట్టు మచ్చల్తోకాని ఉద్యోగం వదిలిపోరు.

అతని ప్రవృత్తికి మొదట లీల నివ్వెరపోయింది. అతని సరసన కూర్చున్న ప్రతీక్షణం ఆమెని ముట్టుకోకుండా-ఆమె శరీరంమీద ఏదో ఒకటి సవరించకుండా ఉండలేదు

అక్కిరెడ్డి. బుగ్గమీద చిటికవేస్తాడు. ముందుకు జారిన జుత్తుని లాగుతాడు. చెవి గిల్లుతాడు. వీపు చరుస్తాడు. చేతివేలిని కొరుకుతాడు. తొడమీద దువ్వుతాడు. అవకాశం ఇస్తే సిగరెట్టుతో కాలుస్తాడు. హింస అతని ప్రవృత్తి. లీల అతనికంటే నాలుగు ఆకులు ఎక్కువ చదివింది. మంచంమీద శరీరందాకా వచ్చే సిగరెట్టుని అతని చేత్తోనే ఒడిసిపట్టుకుని అతని తొడమీదే రెండు వాతలు పెట్టింది. చర్మం కాలి, విచ్చుకుని, మాంసం బయటపడింది. అక్కిరెడ్డి గావుకేకపెట్టాడు. ఆ సాయంకాలం ఎక్కిన మందు దిగిపోయింది. ఆ తర్వాత అక్కిరెడ్డి ఆమెని కలుసుకోలేదు. తప్పు. అక్కిరెడ్డిని తనని కలుసుకోనివ్వలేదు లీల. అక్కిరెడ్డి తొడలమీద రెండు మచ్చల్ని చూసినప్పుడల్లా కోపంతో మరిగిపోతాడు. ఆనాడు–కాలిన బాధతో–ప్యాంటు తొడుక్కుని వెళ్లబోయే అక్కిరెడ్డి కాలర్ పట్టుకుని ఆపి–తనకి రావలసిన నోట్ల బొత్తిని అందుకునిమరీ విడిచిపెట్టింది.

ఇప్పుడు తన చుట్టూ తిరిగే అబ్బు సెన్సిటివిటీని దెబ్బతీయాలంటే అక్కిరెడ్డి గుర్తుకొచ్చాడు. దానివల్ల ఏం రుజువవుతుంది? అతని సేవలకి తాను లొంగిపోలేదని తెలియజెప్పాలి. అతని మనస్సుని గాయపరచాలి. తన జీవితంలోంచి తొలగిపొమ్మని చెప్పాలి. సూటిగా తన వ్యవహారంలో వేలు పెడితే తనే ఆ పని చెయ్యగలదు. కాని అతను తనకి ఆ అవకాశం ఇవ్వడంలేదు. దూరంగా ఉంటూ తన అహంకారాన్ని దెబ్బతీస్తున్నాడు. ఈ యుద్ధం ఆగాలి. అందుకే ఆమె అక్కిరెడ్డిని ఎంచుకుంది. అక్కిరెడ్డివల్ల ఏమౌతుంది? అక్కిరెడ్డి చాపల్యం–ఆ చాపల్యానికి లొంగే తన ఒదుగుదలా పెద్ద దృశ్యం. అబ్బుకి తన వ్యవహారంలో స్థానం లేదని నిరూపిస్తుంది. ఇదేం పోరాటం? అసలు ఈ పోరాటం చేయమని ఎవరు కాలు దువ్వారు? ఇది కృత్రిమమైన అహంకారం. అహంకారి అర్థంలేని తిరుగుబాటు. ఇందులో బోలెడంత కుసంస్కారం ఉంది. False dignity వుంది. Perversion వుంది. అయితే అది అప్పటి లీల స్థాయి.

రాత్రి ఎనిమిది గంటల తర్వాత ఎరిక్సన్ హోటల్ 'పీకాక్' హాలులో–రోడ్డు, రోడ్డుమీద జనాలు, వాహనాలు కనిపించే చోట కోరి టేబులుని ఎంపికచేసింది లీల. తను చూసినప్పటికంటే అందంగా కనిపిస్తున్న లీలని చూసి రెచ్చిపోయాడు అక్కిరెడ్డి. కేవలం తన శాడిజం కారణంగా ఆరోజు తాను ఆమెతో సుఖాన్ని నష్టపోయాడు. ఈరోజు ఆ పొరపాటు చెయ్యకూడదు.

రోడ్డుమీద రద్దీ పెరిగింది. గాలి వాలు మారింది. ఆకాశంలో మేఘాలు వాతావరణానికి గొడుగుపట్టాయి. ఉన్నట్టుండి ఎదుటి పేవ్‌మెంట్‌మీద ఎలక్ట్రిక్ స్తంభం కింద అబ్బు కనిపించాడు. కనిపించాలనే ఎదురుచూసింది. కనిపిస్తాడని ఆమెకి తెలుసు. ఎలా తెలుసు? అబ్బుశాస్త్రికి తనే లోకమని ఈపాటికి గుర్తించింది కనుక. ఇది మరెవరినైనా,

మరో ఆరోగ్యకరమైన కారణానికి ఆనందపరచాలి. కాని ఆనాడు తప్పుడు కారణానికి లీలకి ఆనందం కలిగింది. ఆనందం ఎందుకు? అతన్ని హింసించే ప్రణాళికకి వేదిక స్పష్టంగా కుదిరింది కనుక.

అక్కిరెడ్డికి ఒకటే దృష్టి. ఆరేళ్ళ పసిపాపకి రంగుల రబ్బరుబొమ్మ దొరికినట్టు–అతని చేతులు ఆమె జుత్తును సవరించాయి. లీల ఆనందంగా సవరించనిచ్చింది. కారణం–ఆ సవరించడం రోడ్డుమీద ఎలక్ట్రిక్‌స్తంభం వరకూ తెలుస్తోంది. ఛాన్స్ తీసుకోకూడదు. అక్కిరెడ్డిని తన పక్కకి రమ్మంది. రెడ్డి రెచ్చిపోయాడు. ఈరోజు తనదే. అబ్బుశాస్త్రి చూడడంకోసం లీల అక్కిరెడ్డిని రెచ్చిపోనిచ్చింది. లీల ఇచ్చిన స్వేచ్ఛ తనకి అవకాశం అనుకుని అక్కిరెడ్డి రెచ్చిపోయాడు. ఇది ముక్కోణపు దృశ్యం. ఎవరి ప్రయోజనాల్ని వారు సాధించుకునే ప్రయత్నంలో ఉన్నారు. అక్కిరెడ్డికి అది అవకాశం. లీలకి ప్రదర్శన. అబ్బుకి పర్యవేక్షణ.

స్థితప్రజ్ఞుడిలాగ తటస్థంగా ఈ కార్యక్రమంలో పాల్గొంటున్న వ్యక్తి ఒక్కరే. అబ్బుశాస్త్రి. లీల ప్రవర్తనమీద కాని, అక్కిరెడ్డి చొరవమీదకాని తనకి ఏ విధమైన అధికారం లేదు. వైద్యుడు పేషెంటు స్వభావాన్ని మార్చడు. మార్చలేడు. ఆ స్వభావంవల్ల వచ్చేటటువంటి పర్యవసానానికి మాత్రమే చికిత్స చేస్తాడు.

“నీ కాలేయం పాడవుతుందయ్యా. మందు తాగకు” అనే హితవుని పాటించే దశని పేషెంటు దాటిపోతే చెప్పడు. చేతనైతే కాలేయాన్ని బాగుచేస్తాడు. బాగుపరచలేకపోతే పరోక్షంగా ప్రేక్షకుడౌతాడు–అంతకన్నా చెయ్యగలిగిందేమీ లేదుకనుక.

ఉన్నట్టుండి ఆకాశం బద్దలైంది. ధారాపాతంగా వర్షం ప్రారంభమైంది. పీకాక్ చూరునుంచి వర్షం ధారకట్టింది. ఐనా అబ్బుశాస్త్రి తడుస్తూనే ఉన్నాడు. అక్కిరెడ్డికి మందు తలకెక్కుతున్నకొద్దీ లీల శరీరంమీద చొరవని తీసుకుంటూనే ఉన్నాడు. ఆమె పెదాల్ని లేత కొబ్బరిముక్కలు గిల్లినట్టు గిల్లాడు. లీలకి పెదాలు జివ్వుమన్నాయి. కాని దూరంగా అబ్బుశాస్త్రి గుండె ఝల్లుమనాలని ఆమె ఉద్దేశం. నొప్పిని భరించింది. అక్కిరెడ్డి శంఖంలాంటి ఆమె మెడని తన చేతుల్తో నిమిరాడు. చెంపలకి తన చెంపలు జతచేసి వందల సిగరెట్ల వాసనతో విషమెక్కిన శ్వాసని ఆమెవేపు ప్రసరించాడు. చెవి గిల్లాడు. అన్నిటినీ చిరునవ్వుతో లీల అంగీకరిస్తున్నకొద్దీ మరింత తొందరపడ్డాడు.

టాయ్‌లెట్‌కి లేచి అక్కిరెడ్డి జీడిమెట్లలో తన గెస్ట్ హౌస్ ఇన్‌చార్జ్ పోలుపిల్లిని లేపాడు. “బెడ్‌రూమ్‌ని సిద్ధంచేసి ఉంచు. గంటలో వస్తున్నాను” అన్నాడు. భోజనం వచ్చింది. హడావుడిగా ఇద్దరూ ముగించారు. అక్కిరెడ్డికి తొందరగా ఉంది. లీల మనస్సు మార్చుకోకూడదు. నాలుగు కస్టర్డ్ పుడ్డింగ్స్ ఆర్డరిచ్చి ప్యాక్ చేయించాడు. ఇద్దరూ లేచారు.

అబ్బు కదిలాడు. నాటకమైపోయింది. లీల నడుం చుట్టూ అక్కిరెడ్డి చెయ్యివేసి నడిచాడు. ఇప్పుడు ఆ చేతులు పీతకొండెల్లాగ ఉన్నాయి–ఎదురుగా అబ్బు లేడు కనుక. చేతుల్ని విదిలించుకుని దూరంగా నడిచింది. లీల జాకెట్టుకీ, చీరెకీ మధ్య మిగిలిన వీపుని నిమిరి దగ్గరికి లాక్కొన్నాడు. చేతులు లాగాలని ప్రయత్నించాయి. కాని లీల శరీరం మొరాయించింది. నాటకం అయిపోయింది. ఇంక ఇంటికి పోవాలనుకుంది లీల.

కారుని అక్కిరెడ్డి నడుపుతున్నాడు. బయట వర్షం హోరువల్ల కారు వైపర్ల సహకారాన్ని తిరస్కరిస్తున్నాయి. కారు రోడ్డు మలుపు తిరిగింది.

"ఇటెక్కడికి!" అంది లీల హఠాత్తుగా. అక్కిరెడ్డి నవ్వాడు.

"జీడిమెట్లలో నా ద్రాక్షతోటకి. ద్రాక్షతోట మధ్య ఉన్న గెస్ట్ హౌస్‌కి. డోంట్ వర్రీ. అక్కడా మందుంది"

లీల నవ్వలేదు. "కారు తిప్పు. నన్ను ఇంటిదగ్గర దింపు" అంది.

అక్కిరెడ్డి నవ్వాడు. "ఇంత మంచి సాయంకాలం–ఇంత సుళువుగా వృథా చేస్తావా? నో. ఇవాళ నా సిగరెట్టుని దగ్గరికి రానివ్వను. ప్రామిస్" మొదటి అగ్గిపుల్లతో వెలిగించిన ఆఖరి సిగరెట్టుని కారు అద్దం దించి బయట పారేశాడు. అప్పటికే సిగరెట్టు పొగతో కారులో దుర్భరంగా ఉంది. ఉక్కిరిబిక్కిరిగా ఉంది.

లీలకి కోపంవస్తే ఏం చెయ్యగలదో అక్కిరెడ్డికి తెలుసు. కాని మందు తలకెక్కిన అక్కిరెడ్డికి తెలీదు.

"ఏయ్! బ్రూట్–చెప్పేది నీక్కాదూ? కారు తిప్పు" అని స్టీరింగుమీద చెయ్యేసింది. వర్షం తాకిడికి రోడ్డుమీద జనసమ్మర్దం బొత్తిగా లేదు. స్టీరింగుమీద ఇద్దరి చేతులూ పెనుగులాడుతున్నాయి. కారు వంకర్లు తిరిగింది. ఇద్దరూ కారుని పట్టించుకోలేదు. కాని కారు పట్టించుకుంది. సికింద్రాబాదు లీ పాలెస్ దాటి, ఎడమవేపు చర్రున తిరిగి–వర్షంలో అటూ ఇటూ డ్యాన్స్ చేస్తూ–ఎయిర్‌పోర్ట్ గోడదాకా–అంటే తేలికగా మూడు ఫర్లాంగులు ప్రయాణంచేసి గోడకి కొట్టుకుంది. కొట్టుకోవడం అక్కిరెడ్డికి తెలుస్తోంది. బలంగా బ్రేక్ నొక్కాడు.

కారు ముందుభాగం గోడని పగులగొట్టి, తను పగిలి లొత్తపోయింది. డాష్‌బోర్డుమీద ఉన్న జపాన్ అందగత్తె స్టీలుబొమ్మ లీల నుదుటికి గుచ్చుకుని రక్తం చిమ్మింది.

ఒక్క క్షణం ఇద్దరూ కూడా డేజ్ అయ్యారు. వైపర్ల గడబిడ ఇప్పుడు మరింత స్పష్టంగా తెలుస్తోంది. నొక్కుకుపోయిన ఆక్సిలేటర్ కారుని ముందుకు లాగలేక ఏడుస్తోంది.

లీల చటుక్కున కారు దిగింది.

"యూ బిచ్!" అని అక్కిరెడ్డి కేకపెట్టాడు. ఇంజను ఆగిపోలేదు.

కారుని వెనక్కి నడిపి ముందుకి లాగాడు. "కారెక్కు!" అని అరిచాడు.

ఆమె వినిపించుకోలేదు. వచ్చినవేపు వెనక్కు నడిచింది. కారు మళ్లీ అటు వెళ్ళాలంటే రివర్స్ చేయాలి. అరిచి అరిచి వీగి జీడిమెట్లవేపు దూసుకుపోయాడు అక్కిరెడ్డి.

కుండపోతగా కురుస్తున్న వర్షంలో ఒంటరిగా నిలబడింది లీల. జరిగిన రాద్ధాంతం, నుదుటిమీద గాయం, మీద కుండపోత, శరీరంలో మత్తు, ఒంటరితనం–ఇన్ని ఏకం కాగా కళ్లవెంట కారే నీటిని వర్షమే తుడుస్తూండగా మెల్లగా నడవడం ప్రారంభించింది. ఎటు? నగరంవేపు.

చీరె, జాకెట్టు తనకి కొత్త. ఆనాడు అబ్బుని మభ్యపెట్టడానికి వేసుకున్న వేషం. అబ్బుని ఏ విధంగా మభ్యపెడుతుంది తన వేషం? కోరుకుంటే మన సంప్రదాయాన్ని పాటించగల తెలుగింటి ఆడపిల్ల–కోరుకోవడంలేదని తెలియజెప్పాలని. ఇది బొత్తిగా బలహీనమైన కారణం. లీల ఉదాసీతనకి కేవలం ఆమె మనసు ఏర్పర్చిన ముసుగు అది. వర్షంలో చీరె బరువెక్కింది. అనవసరమైన నాటకాన్ని కోరి నెత్తిన వేసుకున్న ప్రలోభం అడుగులు బరువెక్కినకొద్దీ ఆమెను వెక్కిరించింది. క్రమంగా నడిచే శక్తి సన్నగిల్లింది. ఇప్పుడెలా? మనస్సు ప్రశ్నలు వేస్తోంది. కాని శరీరం సహకరించలేదు. నడుస్తూ నడుస్తూ నడుస్తూ అలాగే వర్షంలో రోడ్డు మధ్య కుప్పలా కూలిపోయింది. కాని ఆశ్చర్యం, శరీరం నేలమీద పడలేదు.

అంత నిర్మానుష్యపు వర్షపురాత్రిలో రెండు చేతులు ఆమెని ఆదుకున్నాయి. పొత్తిళ్లలో పసిబిడ్డలాగ ఎత్తుకున్నాయి. ఆమె కళ్ళు అపస్మారంలో కొద్దిగా తెరుచుకున్నాయి. మసకవెలుగులో ఆ కళ్లు అబ్బుశాస్త్రిని గుర్తుపట్టలేదు. ఆ తర్వాత ఏం జరిగిందో లీలకి తెలీదు.

## 31

లీల కళ్లు విప్పేసరికి మధ్యాహ్నమైంది. మంచిగంధం పరిమళం గది అంతా వ్యాపిస్తోంది. చిన్న గది. అతి నిరాడంబరంగా ఉంది. కట్టుకునే పంచెలు పరిచిన నులకమంచం మెత్తగా, ఉయ్యాలలాగ ఉంది.

కారణం–అది పాతబడిన నులకమంచం. ఆమె మీద ఉతికి ఆరేసిన గోధుమరంగు పంచె కప్పి ఉంది. దూలానికి కట్టిన గుడ్డ ఉయ్యాలలో నిద్రపోయిన పసిబిడ్డలాగ గంటలకొద్దీ నిద్రపోయి, సేదదీరి స్వచ్ఛంగా కళ్లు విప్పింది. విప్పుతూనే ఈ కొత్త

వాతావరణాన్ని చూసి తుళ్లిపడి లేవబోయింది. కాని వెంటనే లేవలేకపోయింది. కారణం–మంచం ఊబి. తీరా లేచాక–ఒంటిమీద ఉన్న పంచె తొలగాక–తన ఒంటిమీద పైజామా, లాల్చీ ఉన్నట్టు గ్రహించింది. కిటికీలోనుంచి బయట కనిపించే దండెంమీద తన చీరె, బ్రా, జాకెట్టూ ఎండకి ఎండుతున్నాయి.

రాత్రి సంఘటనలు క్రమంగా ఆలోచనల్లో కమ్ముకున్నాయి. రోడ్డుమీద నడవడం గుర్తుంది. ఆ తర్వాత... ఆ తర్వాత? ఇప్పుడు గుమ్మం దగ్గర అబ్బుశాస్త్రి కనిపించాడు.

ఆమె నిర్ఘాంతపోయింది. ఒక్కసారి తన శరీరంమీది బట్టల్నీ, బయట ఆరే బట్టల్నీ చూసింది. ఏం జరిగిందో అర్థం కావడానికి ప్రత్యేకమైన ప్రయత్నం అక్కర్లేదు. శరీరంమీద ఈ బట్టలు తేళ్ళూ జెర్రులూ పాకినట్టు అనిపించాయి. కోపం తెచ్చుకోవడానికి ఓపిక లేదు. ఉద్విగ్నతను చూపడానికి తగుమాత్రం శక్తి మిగిలింది. అబ్బుశాస్త్రిని ఈసడింపుతో చూసింది.

"ఆరోజు జాకెట్ట చింపితే చెంప పగులగొట్టిన పెద్దమనిషివి. ఇవాళ నువ్వు చేసిన పని ఏమిటి? మర్యాదగా కనిపించే ప్రతీ మగాడూ అవకాశం దొరికితే రెండు కాళ్ల పశువే"

తన బట్టల్ని చూపుతూ "ఇదేనా నువ్వు చెయ్యాలనుకున్నది? ఇంకేమైనా చేశావా స్కౌండ్రల్!" అని అరిచింది. ఉదాసీనతతో నిస్సహాయత కలిసి గొంతు ఆవేశంతో గాద్గదికమైంది.

గోచీపోసి కట్టిన కావిపంచె, ఉత్తరీయంతో అప్పుడే అనుష్ఠానం ముగించుకొని వంటకి పూనుకున్నాడు అబ్బుశాస్త్రి. చేతిలో నిమ్మరసం కలిపిన గ్లాసు ఉంది. నెమ్మదిగా బల్లమీద ఉంచాడు. ఓ చిన్న బల్లని ఆమె దగ్గరికి లాక్కొన్నాడు. దగ్గరికి వస్తున్న అతన్ని తప్పించుకోవడానికి మంచంమీదనుంచి కాళ్లను దించి లేవబోయింది లీల. ఆమె చెయ్యి పట్టుకుని బలవంతంగా మంచంమీద కూలేశాడు. ఆ చేతి బలానికి ఆశ్చర్యపోయింది. నిస్సహాయతతో కూడిన అవమానభారంతో ఆమె శరీరంమీద బట్టలు చర్మాన్ని కాలుస్తున్నాయి. లీల ముఖం పక్కకి తిప్పుకుంది. అబ్బు ఆమె బుగ్గని పుణికిపుచ్చుకుని ఆమె ముఖాన్ని తనవేపు తిప్పుకున్నాడు. రాత్రి ఎక్కువైన స్కాచ్ వాసనలు అతి పవిత్రంగా సంధ్యావందనం చేసుకువచ్చిన అతని ముఖాన్ని వెక్కిరిస్తున్నట్టున్నాయి.

అతి నిలకడగా, అతి నిబ్బరంగా, అతి దృఢంగా, అతి నిక్కచ్చిగా మాట్లాడాడు అబ్బు. "నువ్వు చేసిన పనికి ఆనాడు నీ చెంప పగులుగొట్టడం నా మానసిక దౌర్బల్యం. ఈసారి అలాంటి పని చేసి నీ ప్రయత్నానికి లొంగను. హింసకి ప్రతిహింస పశుప్రవృత్తి. ఆరోజు నా మనస్సుమీద దెబ్బకొట్టాలనుకున్నావు. నేను నీ శరీరంమీద దెబ్బకొట్టాను.

కొట్టి నేనే ఓడిపోయాను. నువ్వే గెలిచావు”

“స్టాప్ దిస్ నాన్సెన్స్!” అని అరిచి మళ్ళీ లేవబోయింది లీల.

“షటప్! సిట్ డౌన్!” అని అంతే గట్టిగా అరిచాడు అబ్బు. ఆ భాష తనది కాదు. తన కోపం ఆమెకి అర్థం కావడానికి తెచ్చుకున్న ఊతం. ఆ ఆధిపత్యానికీ, పెద్దరికానికీ ఆశ్చర్యపోయింది. అంతకుమించి తెల్లబోయింది. అబ్బుశాస్త్రి మాట్లాడాడు.

“జాగ్రత్తగా విను. ఆలయంలో అర్చకుడు స్వామిని తన చేతుల్తో అలంకరిస్తాడు. అమ్మవారినీ ఆ చేతుల్తోనే అలంకరిస్తాడు. అయ్యవారి తరఫున అమ్మవారి మెడలో తాళి కడతాడు. అమ్మవారి తరఫున అయ్యమీద తలంబ్రాలు పోస్తాడు. ఒక మానవమాత్రుడు స్వామికి, అమ్మకి ఈ పరిచర్య చేయడం ఎంత సాహసం? కాదంటుంది వైఖానస ఆగమం. అర్చకుడు తనమీద మహావిష్ణువుని ఆవాహన చేసుకున్నతర్వాతే భగవదనుజ్ఞతో ‘స్వామీ, నీ శలవైతే నిన్ను సేవిస్తాను. నీ తరఫున అమ్మనీ సేవిస్తాను’ అంటూ ఆరాధన ప్రారంభిస్తాడు.

ఇది ఆత్మసూక్తం–

‘అర్చకస్య హరిస్సాక్షాత్ చరరూపీ నసంశయః’ అది ఆగమ వాక్యం. అందుకే దోషం లేదు.

తడిసి ముద్దై, స్పృహ లేక నీ మంచి చెడ్డలు నువ్వు చూసుకోలేని దశలో వణుకుతున్న నిన్ను ఈ గదికి తీసుకువచ్చాను నడుస్తూ. కారణం ఆటో ఎక్కించి నీ పరువు తీయడం ఇష్టంలేక. మందు వాసనతో స్పృహలో లేని నిన్ను బజారున పెట్టడం ఇష్టంలేక. స్పృహ లేకుండా మంచుముద్దలాగ ఉన్న నిన్ను చూసి–అమ్మవారి సమక్షంలో నిలబడినట్టు ఈ పవిత్రాన్ని కట్టుకున్నాను.

‘అపరాధ సహస్రాణి క్రియంతే అహర్నిశం మయా

దాసోహం ఇతి మామత్వాం క్షమస్వ పరమేశ్వరి’ అని చెప్పుకున్నాను.

నేను చెయ్యబోయే పనిలో ఏదైనా అపచారం, అపవిత్రత ఉంటే ఈ అపరాధాన్ని క్షమించమని వేడుకుంటున్నాను తల్లీ’ అని చెప్పుకుని–ఆలయంలో అమ్మకి సేవ చేసినట్టు నీ బట్టల్ని తొలగించి, ఈ బట్టలు తొడిగాను. తన పని తాను చేసుకోలేని ఏ ప్రాణి అయినా పసిబిడ్డే. ఆ బిడ్డకి సహకరించే మరే ప్రాణి అయినా కన్నతల్లే. నేను ఆ క్షణంలో నీ తల్లినయ్యాను. ఈ వివరణ నీకు తెలియడం అవసరం. నిస్సహాయమైన శరీరంతో కోరికని తీర్చుకోవడం పశువు చేసే పని. తన ఉచ్చనీచాలను తాను శుభ్రం చేసుకోలేని నిస్సహాయులకు అండగా నిలిచే పని–అమ్మ పని. ఆ పనే నీకు చేశాను. నీ చీరె ఆరింది.

కట్టుకోవచ్చు. ఇది నిమ్మరసం. నీకు తెలివొచ్చాక ఇవ్వాలని కలిపి ఉంచాను. తాగితే కాస్సేపటికి మత్తు దిగుతుంది. ఫ్లాస్కులో కాఫీ ఉంది. నీకు నచ్చిన, నువ్వు ఎదురుచూసే వంటకాలు క్యారేజీలో ఉన్నాయి. బయట ఆటో సిద్ధంగా ఉంది. నువ్వు లేస్తే తీసుకువెళ్ళడానికి నరిసిపండు బయట ఆటోతో వేచి వున్నాడు" అని రెండడుగులు గుమ్మంవేపు వేసి ఆగాడు అబ్బు.

"నన్ను హింసించడానికి నిన్ను నువ్వు హింసించుకోనక్కర్లేదు. నిన్నటి ఆ మృగం చేతుల్లో నాకోసం సమిథవి కావాలనుకున్నావని నేను గ్రహించగలను. నిన్ను చూస్తే నాకు కోపం లేదు. జాలేస్తోంది. ఎందుకో తెలుసా? కుసంస్కారి తిరగబడతాడు. సంస్కారి తల వొంచుకుంటాడు" అని వెళ్ళిపోయాడు.

తర్వాత ఆరు నెలలపాటు అబ్బు ఎవరికీ కనిపించలేదు.

## 32

రాత్రి తొమ్మిది గంటలకి హాల్లో టెలీఫోన్ మోగింది.

లీల ఆశ్చర్యపడింది. ఆ వేళకి సాధారణంగా ఎవరూ ఫోన్ చెయ్యరు. వచ్చి రిసీవర్ తీసింది. అటుపక్కనుంచి వినిపించిన గొంతు ఆమెని తుళ్ళిపడేటట్టు చేసింది. అబ్బుశాస్త్రి. దాదాపు ఆరు నెలలైంది అతన్ని మరిచిపోయి. ఈ మధ్యకాలంలో ఎప్పుడైనా లీలగా గుర్తువచ్చినా-ఆమెతో అతని ప్రమేయం బొత్తిగా లేదు.

ఉన్నట్టుండి ఇప్పుడీ ఫోన్‌కాల్. ఆమె నరాలు బిగుసుకున్నాయి. ఎందుకనో అబ్బుశాస్త్రిని ఇదివరకులాగ చులకనగా తీసిపారేయలేకపోతోంది. కారణం తనతో సంబంధించిన ప్రతి సంఘటనా, తన జీవితాన్ని ఏదో విధంగా ప్రభావితం చేసేదిగా, ఆక్షేపణారహితంగా ఉంటోంది. అతన్ని ఎదిరించే ప్రతి సందర్భంలోనూ అతనిదే పైచెయ్యి అవుతోంది. ఐనా తన జీవితంపట్ల అబ్బుశాస్త్రి ప్రమేయానికి కారణం కనిపించదు. అందువల్లనే, అతని ఏ చర్యా మనస్సుదాకా పోలేదు.

అబ్బు గొంతు గుర్తుపట్టగానే ఫోన్ పెట్టెయ్యాలన్న ప్రోద్బలం ఎక్కువైంది. కాని అందుకు అవకాశం ఇవ్వలేదు అబ్బుశాస్త్రి. అతని గొంతులో ఆతృత లేదు. సంయమనం ఉంది. ఆవేశం లేదు. తాటస్థ్యం ఉంది. హెచ్చరింపు లేదు. పరోక్షమైన ఓదార్పు ఉంది.

"నేను చెప్పేది జాగ్రత్తగా విను. అతి జాగ్రత్తగా విను"

ఆ హెచ్చరిక ఆమెని భయపెట్టింది. మనస్సుని కూడదీసుకోవడానికి కాస్త వ్యవధిని కల్పించాడు. ఏమిటా విషయం? ఆమె నరాలు బిగుసుకున్నాయి. ఇంకా ఏ మూలనో ఉన్న అహంకారమూ తిరగబడింది.

"నీ కొడుకు టెడ్డీ ఆరోగ్యం బొత్తిగా బాగులేదు. వెంటనే తీసుకొచ్చి అతన్ని డాక్టరికి చూపించడం మంచిది"

లీల నెత్తిమీద పిడుగు పడింది. రెండు కారణాలకి. టెడ్డీ గురించి అబ్బుకి తెలియడం, అతని ఆరోగ్యం. టెడ్డీ ఆరోగ్యం అబ్బుకి ఎలా తెలుసు? అసలు టెడ్డీ ఎలా తెలుసు? అతని మాటలు నెమరువేసుకుంటున్నకొద్దీ చెమటలు పట్టాయి. కాళ్లలో శక్తి నశించింది. తెలియకుండానే ఎప్పుడూ జరగని పని ఒకటి జరిగింది. ఆమె కళ్ల నిండా నీళ్లు నిండాయి. 'టెడ్డీ! మై గాడ్!!' అంటూ కుర్చీలో కూలబడిపోయింది.

❖ ❖ ❖

చెన్నై సెంట్రల్‌లో హైదరాబాద్ ఎక్స్‌ప్రెస్ బయలుదేరడానికి ఆఖరి బెల్ కొట్టేశారు. గార్డు జెండా ఊపాడు. ప్లాట్‌ఫారంమీదనుంచి ఆఖరి బోగీ కదిలింది. చుట్టూ వున్న జనసమ్మర్దాన్ని చీల్చుకుని–మిలటరీ యూనిఫారంలో ఉన్న ఒక యువకుడు భుజంమీద కిట్ బ్యాగ్‌ని మోసుకుంటూ–బయలుదేరిపోయిన రైలుని అందుకోడానికి పరుగులుతీశాడు. గార్డు పెట్టెకు ఇటు చివర జనరల్ కంపార్ట్‌మెంట్. అటుపక్క ఫస్ట్ క్లాస్ బోగీ.

"టికెట్టు కొనే టైము లేదు. సూళ్లూరుపేటలో టిక్కెట్టు తీసుకుంటాను" అని గార్డుకి చెప్తూ ఫస్ట్ క్లాస్ బోగీలోకి ఎగిరాడు. రైలు వేగం అందుకుంది. అలసటనుంచి తేరుకుని ఊపిరి పీల్చుకున్నాడు. మొదటి కేబిన్‌లో నలుగురు ప్రయాణీకులు ఉన్నారు. రెండో కేబిన్ తలుపు తెరిచాడు. ఒకే ఒక్క మహిళ–లీల ఉంది. ఒక్కక్షణం బిత్తరపోయాడు. గుమ్మం దగ్గర నిలబడే మిలటరీ సెల్యూట్ చేశాడు. "నమస్తే మేడమ్. నేనిక్కడ కూర్చోవచ్చా? నెక్స్ట్ స్టాప్‌లో దిగిపోతాను" అన్నాడు.

లీల చెయ్యి చూపింది. అతని మర్యాదకు ముచ్చటపడింది. కిట్ బ్యాగ్ భుజంమీంచి దింపుకుని "థ్యాంక్స్ మేడమ్. నా పేరు కొండల్రావ్. సెకెండ్ లెఫ్టినెంట్ 54 ఇన్ఫెంట్రీ బ్రిగేడ్, సికింద్రాబాద్. సెలవుమీద మిత్రుడిని చూడ్డానికి హుబ్లీ వెళ్లాను. నైస్ టు మీట్ యూ"

ప్రయాణాల్లో రకరకాల మనుషులు తారసపడుతూ ఉంటారు. కొందరు నోరు విప్పరు. కొందరు విప్పకుండా ఉండరు. చుట్టూ వున్న మనుషులను తనవాళ్లని చేసుకుంటే తప్ప వారికి తోచదు.

"ఈమధ్య రైల్లో ఫ్యాన్లు పనిచెయ్యడంలేదండీ"

"నాలుగు రోజులై ఎండలెక్కువయ్యాయి"

"ఈ పండుగకి చక్కెర కోటా ఇస్తారంటారా?"

"మా పెద్దబ్బాయికి ప్రమోషన్ వచ్చింది. సత్యనారాయణ వ్రతానికి నువ్వు రాకపోతే వీల్లేదని పట్టుబడితే వచ్చాను"

"ఈ నెలైనా పెట్రోలు ధర తగ్గిస్తుందంటారా గవర్నమెంటు?"

లోకమంతా వారి కరతలామలకం. మాట్లాడందే తోచదు. ఆ కోవకి చెందినవాడు కొండ్రావు. మిలటరీ అతని శ్రీరామరక్ష. పలకరించే ప్రతివారినీ గౌరవించే పాత్ర అది. కాగా, ఖంగుమనే గొంతు, మెరిసే కళ్లూ, టోపీకి అనువుగా దగ్గరగా అంటకత్తెర వేయించుకున్న జుత్తూ, మడతలు చెరగని లేత ఆకుపచ్చ యూనిఫారం-అతనిపట్ల గౌరవాన్నీ, అతని సభ్యతకి దన్నునీ కల్పిస్తున్నాయి.

ఎప్పుడూ ముక్తసరిగా ఉండే లీల కూడా అతని సమక్షంలో మాటలు కూడదీసుకుంది. "ఎన్నేళ్లుగా మిలటరీలో ఉంటున్నారు?"

అంతే. ఆనకట్ట తలుపులు తెరుచుకున్నాయి. "నా మానాన నన్ను వదిలేస్తే ఈ మిలటరీ జోలికి వచ్చేవాడిని కానండీ. చిన్నప్పుడే నాన్న పోయారు. మా అమ్మా, నేనూ మేనమామ ఇంటికి చేరాం. నాకు చదువు చెప్పించడమే ఉపకారంగా భావించాడు మా మామయ్య. ఒకటే కండిషన్. తన కూతురుని ఇచ్చి పెళ్ళి చెయ్యమనకూడదని మేనత్త షరతు పెట్టింది. ఆయనవి పెద్ద ఆలోచనలు. తండ్రిలేని, తనమీద ఆధారపడే వ్యక్తి అల్లుడు కావడం ఆయనకీ ఇష్టంలేదు. గొప్ప సంబంధం, డబ్బున్న సంబంధం చెయ్యాలని మా మేనత్త కోరిక. మేనమామకి ఒక్కతే కూతురు-మాళవిక. ఈ షరతులు దానికి తెలీవు. చిన్నప్పటినుంచీ కలిసి పెరిగాం. మాళవిక మనస్సులో కోరిక-నన్ను పెళ్లి చేసుకోవడం. నా మనస్సులో భద్రంగా కాపాడుకొంటూ వచ్చిన కోరిక-మాళవికను పెళ్లి చేసుకోకపోవడం. అదే మేనమామ ఉపకారానికి నేను చూపించగల కృతజ్ఞత"

లీల నవ్వింది. రైలు తడ దాటిపోయింది. ఇంకా మిలటరీ ఉద్యోగం విషయానికి రాలేదు. వచ్చేవాడే. కాని తప్పతాగి ఉన్న ఓ పాసింజరు తలుపు తీసుకుని లోపలికి వచ్చాడు. కాదు, దాదాపు వచ్చిపడ్డాడు. లీల, కొండ్రావూ తుళ్లిపడ్డారు. మందువాసన గుప్పుమంది. మందులో మర్యాద లేదు. దేశవాళీ వ్యవహారం.

"సారీ-ఇది నా బెర్త్" అన్నాడు. అంతవరకూ నవ్వుతూ మాట్లాడుతున్న కొండ్రావు బిగుసుకున్నాడు.

"లుక్ మిస్టర్! ఇది మీ బెర్త్ కావచ్చు. కాని అక్కడ ఉన్నది మీలాంటి బెర్తే ఉన్న ఓ మహిళ. మరొక బెర్త్ చూపించమని టీటీయీకి చెప్పండి. ప్లీజ్" అన్నాడు.

"నా బెర్త్ కాదనడానికి నువ్వెవరు? హూ ఆర్ యూ!" అన్నాడు పాసింజరు తడబడుతూ.

సరిగ్గా ఈ టైముకి టీటీయీ అక్కడికొచ్చాడు. అతని షర్టుమీద పేరు తెలుస్తోంది. మహమ్మద్ కాశీం.

"చూడండి. ఈయన బెర్త్ ఇదే కావచ్చు. కాని ఒంటరిగా ఓ లేడీ ఉన్న కేబిన్‌లో ఉండే అర్హత ప్రస్తుతం ఇతనికి లేదు" అన్నాడు.

వెంటనే "నువ్వున్నావుగా?" అన్నాడు తాగుబోతు.

"నేను టికెట్టు లేకుండా ఎక్కాను. ఆ విషయాన్ని గార్డుకి చెప్పిమరీ ఎక్కాను. సూళ్ళూరుపేటలో టికెట్టు తీసుకుని దిగిపోతాను. కనుక ఈ కేబిన్‌లో ఉండను"

"కానీ సార్!..." టీటీయీ కాశీం వివరించబోయాడు.

"మూడే మార్గాలు. ఈయనకి వేరే బెర్త్ ఇవ్వండి లేదా చైన్ లాగి రైలు ఆపుతాను. ఈయన తిరగబడితే ఏం చెయ్యాలో మిలటరీవాడిగా నాకు తెల్సు. మీరు ఈ పని చెయ్యకపోతే ఎవరికి కంప్లైంట్ చెయ్యాలో నాకు తెలుసు. మీకోసం పది అంకెలు లెక్కపెడతాను. ఏడో అంకె దగ్గర మీరూ, ఈ పాసింజరూ ఈ కేబిన్‌లోనో, ఈ బోగీలోనో, ఈ రైల్లోనో ఉండరు. ది కౌంట్ స్టార్ట్ నౌ. వన్... టూ... త్రీ... ఫోర్..."

అయిదు రాకుండానే ఇద్దరూ మాయమయ్యారు.

"దటీజ్ బెటర్" అని కేబిన్ తలుపు మూసి తలుపు కొక్కెం దించాడు.

"నేను వెళ్లిన తరువాత తలుపు మూసుకోండి. ఏమైనా గొడవ జరిగితే నేను ఈ రైల్లోనే ఉంటాను. చైను లాగండి. రైలు ఆగిందంటే మీరు ఆపారని నాకు తెలుస్తుంది. ఎందుకోకూడా తెలుస్తుంది. ఆ తరువాతి కథ నేను చూసుకుంటాను"

లీల ముఖంలో తృప్తికరమైన నవ్వు తొంగిచూసింది. ఒక స్త్రీ పట్ల అతను చూపిన మర్యాద, ఏమాత్రమూ తడబడని కార్యదక్షత, మిలటరీ సన్నద్ధత-అన్నీ ఆమెని ఆకర్షించాయి.

"థాంక్స్" అంది లీల.

ఆమె జీవితంలో అతి అరుదుగా మగాడిని అభినందించిన క్షణమది.

ఒక్కక్షణం ఆగాక లీల పూనుకుని అడిగింది. "మీ కథ ఆగిపోయింది"

కొండల్రావు ముఖం వికసించింది. "థాంక్స్. నాకు అవకాశముంటే ఆర్కిటెక్చర్ మాస్టర్స్ డిగ్రీ చెయ్యాలని ఉండేది. జపాన్ కాగితం కళ-ఓరిగామీ నాకు చాలా ఇష్టమైన కళ. సబ్జెక్ట్. కాని ఆ కల సగంలోనే నిలిచిపోయింది"

"ఏం?"

"మాళవిక నామీద ప్రేమని పెంచుకుంది" అన్నప్పుడు అతని ముఖంలో బాధ కనిపించింది. "మామయ్య–ఒకరోజు నన్ను హుస్సేన్ సాగర్ బల్లమీద కూర్చోపెట్టాడు.

'నిన్ను 18 ఏళ్లు సాకానురా. నాకో ఉపకారం చెయ్యి' అన్నాడు.

"ఏమిటి మామయ్యా?"

"నా కాపరాన్ని నిలబెట్టు. మీ అత్తయ్యకి మాళవికని నీకు ఇచ్చి చేయాలని లేదు" అన్నాడు మామయ్య.

"మరి నీకో?"

"ఉన్నా దాన్ని కాదనే శక్తి నాకు లేదు" అన్నాడు.

"మరి మాళవికకో?"

"అందుకే నిన్నక్కడికి పిలిచాను. నిన్ను బతిమాలడానికి"

"నన్నేం చెయ్యమంటావు మామయ్యా. 18 ఏళ్లు నాతోపాటే మాళవిక పెరిగింది. ఏరోజూ నేను పెళ్లి చేసుకుంటానన్న మాట అనలేదు. అమ్మ బతికున్నన్నాళ్లూ నన్ను హెచ్చరిస్తూనే ఉంది–"

"మీ అమ్మ...?" లీల అడిగింది.

"మూడేళ్ళ కిందట వెళ్లిపోయింది. ఆమె ఆఖరి కోరిక–మామయ్య మనసు నొప్పించవద్దని"

మామయ్య కళ్లల్లో నీళ్లు తిరిగాయి. "నువ్వు బుద్ధిమంతుడివిరా. తాటకిని ఏమీ చెయ్యలేక కృష్ణుడి కాలు పట్టుకుంటున్నాను"

నేను నవ్వి లేచి నిలబడ్డాను. మా మామయ్య కాళ్లకి–హుస్సేన్ సాగర్ దగ్గరే నమస్కారం చేశాను. "నీ ఉప్పు తిని పెరిగాను మామయ్యా. నేను నీకు వరమిస్తున్నాను. నేను మాళవికను పెళ్లి చేసుకోను. కాదు. మాళవికను నన్ను చేసుకోనివ్వను"

"ఇది దుర్మార్గం... మాళవికని..." అంది లీల కథలో లీనమై.

కొండల్రావు నవ్వాడు. "కృతజ్ఞత అప్పుడప్పుడు పేగు సంబంధాన్ని తెంపేస్తుంది మేడమ్. మాళవికతో నా దగ్గరతనం–నాకు ఊహ తెల్సిన 18 సంవత్సరాలు. కాని ఈ శరీరంలో రక్తం వయస్సు కనీసం పది తరాలు. దేవకీదేవి తనకి పుట్టిన దేవుడిని పరాయి తల్లి దగ్గరికి పంపడానికి మాతృత్వపు మమకారాన్ని ఎంతగా తొక్కిపెట్టి ఉండాలి? అది అవతారధర్మం. నేనెంతవాడిని? నాది కేవలం రక్త సంబంధం"

లీల ఆశ్చర్యపోయింది. "మరి మీ మామయ్యకి ఇచ్చిన మాటని ఎలా

నిలబెట్టుకున్నారు?" అని అడిగింది.

కొండ్రావు చటుక్కున లేచి నిలబడి సెల్యూట్ చేస్తూ-"ఎమ్.ఆర్. కొండ్రావ్, ఐసి నంబర్ 13589 ఎఫ్! 54, ఇన్ఫెంట్రీ బెటాలియన్, సికింద్రాబాద్. ఆర్మీలో చేరిపోయాను. ఆర్కిటెక్చర్నీ, ఓరిగామీనీ, మాళవిక ప్రేమనీ అటక ఎక్కించేశాను"

రైలు సూళ్ళూరుపేటలో ఆగింది.

## 33

రైలు గార్డు అతన్ని వెదుక్కుంటూ కంపార్టుమెంటు దగ్గరికి వచ్చాడు-"టికెట్టు కొనుక్కుంటారా?" అంటూ. కిట్ బ్యాగ్ పట్టుకుని హడావుడిగా రైలు దిగాడు కొండ్రావు.

గార్డు గేటుదాకా వచ్చి అతన్ని టికెట్ కౌంటర్ దగ్గరికి పంపమని టికెట్ కలెక్టర్కి చెప్పాడు. తీరా టికెట్టు కొనుక్కుని మళ్లీ రైల్లో దూకేపాటి వ్యవధి మాత్రమే ఉంది. ఈసారీ రైలు కదిలిపోయింది. ఈసారీ ఆఖరి బోగీలే అందాయి. ఈసారి కూడా అదే బోగీ ఎక్కాడు. ఈసారీ అదే కేబిన్లోకి వచ్చాడు. జీవితంలో కొన్ని సంఘటనలకి అర్థం మనకి వెంటనే స్ఫురించదు. వెనక్కి తిరిగి చూసుకున్నప్పుడు అందంగా రూపుదిద్దుకునే ముగ్గులోని చుక్కలన్నీ కలుస్తాయి.

వెళుతున్నట్టు కూడా చెప్పకుండా కొండ్రావు దూకేసినందుకు లీల బాధపడింది. మళ్లీ కంపార్టుమెంటులోకి వచ్చినందుకు ఆశ్చర్యపడింది. ఆనందపడింది. "ఈ స్టేషన్లో మిమ్మల్ని పలకరించలేకపోయినా పక్క స్టేషన్లో కలిసేవాడిని. మన ప్రయాణాలు ఒకేవేపు. ఒకే రైల్లో. కాని-మళ్లీ మీ దగ్గరికే వచ్చాను" అంటూ కూర్చున్నాడు.

ముందు స్టేషన్లో ఆగిపోయిన కథని మళ్లీ మొదలెట్టాడు.

"మామయ్య కోరికని తీర్చడానికి రెండే మార్గాలు. మిలటరీ, చావు. మిలటరీని ఎంచుకున్నాను. ఎవరికీ దక్కకుండా దూరంగా వెళ్ళిపోయే మార్గం" అన్నాడు. ఉన్నట్టుండి అన్నాడు "మీకో విషయం తెలుసా? మరో నలభై నిమిషాల్లో మీరు మా మామయ్యనీ, మాళవికనీ చూడబోతున్నారు. ఇద్దరూ కూడా గూడూరు స్టేషన్కి వస్తారు"

లీల తుళ్లిపడింది. "నిజంగా!"

అంతలోనే కొండ్రావు కళ్లు మెరిశాయి. ముందుకు వొంగి ఆమె రెండు చేతులూ పట్టుకున్నాడు. "మీరు సహకరిస్తే-ఈ అధ్యాయాన్ని చాలా రూఢిగా, శత్రుదుర్భేద్యంగా ముగిస్తాను. నేను మిలటరీవాడినని మరిచిపోకండి"

రెండు చేతులూ పట్టుకోవడంలో కుసంస్కారం లేదు. అసలు ఆ చర్యపట్ల ఆలోచన లేదు.

"ఏమిటి మీరనేది?"

"గూడూరులో రైలు ఏడు నిముషాలాగుతుంది. ఇందాక వచ్చినటువంటి తాగుబోతుకంటే దుర్మార్గంగా మిమ్మల్ని వాడుకుంటాను-మీరు అనుమతిస్తే"

"అంటే?"

చెప్పబోయి, అంతలోనే నవ్వుకుని ఆగాడు. "ఇప్పుడు చెప్పను. మీరు ఏం మాట్లాడనక్కర్లేదు. ప్రయత్నించి కూడా మాట్లాడకండి. నేను మిమ్మల్ని ఇబ్బందిపెట్టను. మీ నిశ్శబ్దమే నాకు మీరు చేసే సహకారం. అరగంటలో నా గతాన్ని పూర్తిగా త్రుంచేసే ఆఖరి సంఘటనలో మీరూ ఒక పాత్ర. తరువాత మీ జీవితంలో కనిపించను. ఐ ప్రామిస్"

మొదటిసారిగా లీల అతన్ని అనుమానంగా చూసింది. కొంపతీసి-ఇతనూ తానింతవరకూ భావించినట్టు పెద్దమనిషి కాడా?

"మాళవికలో గొప్పతనం ఏమిటో తెలుసాండీ? అది గొప్ప అందగత్తె కాదు. కాని మాటలరాక్షసి. మనం ఊహించని మాటల బాణాల్ని సంధిస్తుంది. మనం ఆదమరిచి ఉంటే వాటితో మనల్ని లొంగదీసుకుంటుంది. దాని ముందు నా మిలటరీ బుద్ధులేవీ పనిచెయ్యవు"

గూడూరు దగ్గరపడుతున్నకొద్దీ మాళవికను చూడాలనే కోరిక లీలలో పెరుగుతూవచ్చింది. ప్లాట్‌ఫారంమీద రైలు ఆగగానే కంపార్టుమెంటు తలుపుదగ్గరికి పరిగెత్తాడు. సరిగ్గా 30 సెకన్లలో మామయ్యనీ, మాళవికనీ తీసుకుని కేబిన్‌లోకి వచ్చాడు కొండ్రావు.

"ఈయన కాశీ మామయ్యండి. వాకాడులో తాసీల్దారుగా పనిచేసి రిటైరయ్యాడు. ఉద్యోగంలో ఆయన సంపాదించినవి రెండు. ఒకటి బట్టతల, రెండు ఈ రాక్షసి-మాళవిక"

"ఆవిడని పరిచయం చెయ్యి" అంది మాళవిక.

ఒక్కక్షణం తటపటాయించాడు. "ఎలా చెప్పాలో తెలియడంలేదు. ఈవిడ పేరు... (డామిట్! ఇంతవరకూ ఆమెని అడగనేలేదు! అయినా అప్పటికప్పుడు నిర్ణయించాడు) సింధు. చెన్నైలో చార్టెర్డ్ అకౌంటెంట్. కలిసి ఆరు నెలలు అయింది. కలిసి జీవించాలని నిర్ణయించుకుని..."

"వాట్!! అంది లీల షాకవుతూ.

దగ్గరికి వొంగి ఆమె చెవిలో అన్నాడు-"మీరేం మాట్లాడనక్కర్లేదు. Just five minutes! ప్లీజ్!"

కాశీ మామయ్య మొదటిసారి మాట్లాడాడు. "వీడు మణిపూసమ్మా. జాగ్రత్తగా

కాపాడుకో. నువ్వు చాలా సుఖపడతావు” అన్నాడు.

లీల మాట్లాడబోతూంటే–సంజ్ఞచేశాడు కొండ్రావ్. మాళవిక అంతా కనిపెడుతోంది. “కాబోయే భర్త కనుసన్నలలో మెలగడానికి ఇప్పట్నుంచే తర్ఫీదు కావడం మంచి శకునం–బెస్టాఫ్ లక్” అంది మాళవిక లీలతో. లీల ముఖం ఎర్రబడింది. ఐనా నాటకంలో స్థిరపడింది. హఠాత్తుగా మీదపడిన పాత్ర ఇబ్బందిగా ఉంది. ఐనా తను ఏమీ స్పందించనక్కర్లేదన్న ఆలోచన ఆమెకి కాస్త ఊరట నిచ్చింది. ఒక్కక్షణం నిశ్శబ్దం.

“నీ మాట నిలబెట్టాను మామయ్యా. నన్ను ఆశీర్వదించు” అని కాళ్లకు నమస్కారం చేశాడు కొండ్రావు.

“దీర్ఘాయుష్మాన్ భవ. మీ అత్తయ్యవల్లకాకపోతే నిన్ను నష్టపోయేవాడిని కాదురా” అన్నాడు చెవిలో–మిగతా ఇద్దరికీ వినిపించకుండా.

మాళవిక బోనులో సెగలు కక్కుతున్న సివంగిలాగ ఉంది. కావాలనే కొండ్రావుని చూడడంలేదు. కొండ్రావు తనని పెళ్ళి చేసుకోవడంలేదన్న సంగతి ముందురోజే వింది. ఇప్పుడు రుజువుతోసహా చూసింది. ఏవిధంగా చూసినా లీల తనకంటే అందగత్తె. అతని అడుగుల్లో మడుగులొత్తగలదని ఇప్పుడే అర్థమైంది. కాశీ మామయ్య, కొండ్రావు కాస్త జరిగి మాట్లాడుతూండగా–లీల పక్కనే కూర్చుంది మాళవిక. “మిసెస్ సింధూ కొండ్రావ్! మీరు చాలా అదృష్టవంతులు. అతన్ని వదులుకోకండి. కొండ కోహినూర్ వజ్రం. అతనిమీద నా ప్రేమ అధికారం అనుకున్నాను. నష్టపోయాను. అతనిమీద మీ ప్రేమని అవకాశం చెయ్యండి. మీకు స్వర్గాన్ని చూపిస్తాడు” అంటూ అసంకల్పితంగా లీల చెంపమీద ముద్దుపెట్టుకుంది మాళవిక. లీల బుగ్గలు ఎరుపెక్కాయి. కొంత ఇబ్బందిపడింది. మాళవిక ఆమె చెయ్యి గట్టిగా అదిమి పట్టుకుంది.

“ఎందుకీ పని చేశానో తెలుసా? ఈ చెంప అంటే నాకు ఈర్ష్య... జీవితం అంతా దీనికి పట్టబోతున్న అదృష్టాన్ని ఒక్కసారి రుచి చూడాలని”

గార్డు విజిల్ వేశాడు.

“రా. రైలు కదులుతుంది” అంటూ కాశీ మామయ్య రైల్లోంచి బయటికి పరుగుతీశాడు.

మాళవిక లేచి కేబిన్‌లోకి రాబోతున్న కొండ్రావు చెయ్యి పట్టుకుని బలంగా బయటి కారిడార్‌లోకి లాగింది.

“బావా! ఈ తర్వాత నిన్ను కలిస్తే నీమీద పగ తీర్చుకోడానికే. కాని కలవకుండా జాగ్రత్తపడతాను. కోరి అమెరికా అబ్బాయిని ఎంచుకుని–నువ్వున్న ఇండియాకి

తీసుకురాననే షరతుమీద పెళ్లి చేసుకుంటాను" అక్కసుతో, 18 సంవత్సరాల అభిమానాన్ని, ప్రేమని తొక్కిపెట్టిన ఆవేశంతో ఆపుకొందామన్నా ఆమె దుఃఖం ఆగడంలేదు.

"I hate you because I love you" అని రెండు చేతుల్తో-అతని ముఖాన్ని పట్టుకుని "ఒక్కసారి-ఒక్కసారి-ఆఖరుసారి-నాదికాని ఆస్తిని దోచుకుంటాను" అని అతని పెదాలమీద ముద్దుపెట్టుకుని మాయమైంది. రైలు కదిలిపోయింది.

లీల తల పట్టుకు కూర్చుంది. "చీ! చీ! ఏమిటి ఇలాంటి పని చేశారు?" అంది కేబిన్‌లోకి వస్తున్న కొండల్రావుని చూసి. కాని అతన్ని చూడగానే ఆమె స్థాణువైపోయింది.

కారణం-కొండల్రావు కళ్ళు రెండూ చింతనిప్పుల్లాగ ఉన్నాయి. ఏడవకూడదన్న స్పృహ, మిలటరీ సాహసం-ఆ రెండు కళ్ళనీ నిస్సహాయంగా శాసించబోయి ఓడిపోయాయి.

కొండల్రావు ఏడుస్తున్నాడు.

❖ ❖ ❖

నెల్లూరు వచ్చేవరకు కూడా ఇద్దరూ మాట్లాడలేదు. స్టేషన్లో రైలు ఆగగానే కిట్‌ని బెర్త్‌మీదనే ఉంచి రైలు దిగాడు కొండల్రావు. దాదాపు 20 ఏపిల్ పళ్ళు పెద్దసంచీతో కొని రైలెక్కాడు. ఆమె చేతుల్లో సంచీని ఉంచి "సారీ అండీ. పెంకితనంగా ఆడాలనుకున్న నాటకంలో ఇంత ఆవేశం, ఉద్రేకం ఉంటుందనుకోలేదు. నాదే పొరపాటు. మిమ్మల్ని అనవసరంగా ఇరికించి బాధపెట్టాను. నన్ను క్షమించండి" అని వెనక్కి తిరిగి చూకుండా కిట్‌బ్యాగ్ తీసుకు వెళ్లిపోయాడు.

మర్నాడు ఉదయం సికింద్రాబాద్ ప్లాట్‌ఫారంమీద కొండల్రావు కనిపిస్తాడనుకుంది లీల. నిజానికి ఎదురుచూసింది. కాని ఎక్కడా అతని జాడ లేదు. ఒకవిధంగా మనస్సు కలుక్కుమంది. ఓవిధంగా అవసరానికి తనని వాడుకుని-చెయ్యి తుడిచిపారేసిన నాప్‌కిన్‌లాగ అనిపించింది. ఆత్మాభిమానం కస్సుమంది. మనస్సులో వెదికినా దొరకని అరలో అతని జ్ఞాపకాన్ని గిరాటేసింది.

## 34

చాలా నెలల తర్వాత, అనుకోని పరిస్థితుల్లో, ఊహించలేని పరిస్థితుల్లో మళ్లీ ఇద్దరూ కలిశారు.

ఒకనాటి మధ్యాహ్నం సికింద్రాబాద్ డిపార్ట్‌మెంటల్ స్టోర్‌లో కొండల్రావు గ్రీటింగ్ కార్డ్స్ కొంటూండగా-వేలాడదీసిన కార్డుల స్టాండు మలుపు తిరిగింది లీల. ఇద్దరూ దాదాపు ఒకరినొకరు ఢీకొనేంత దగ్గరగా తటస్థపడ్డారు. ఒకరిని చూసి ఒకరు గుర్తుపట్టి తుళ్లిపడ్డారు.

"హల్లో" అన్నాడు కొండ్రావు. మిలటరీలో నలిగిన, అరిగిన చాయలు అతని ముఖంలో కనిపిస్తున్నాయి.

ఆమె అప్పుడే వికసించిన పువ్వులాగ స్వచ్ఛంగా, ఇంకా చెప్పాలిఅంటే పవిత్రంగా కనిపించింది లీల.

కొండ్రావు ఆమెని అంత దగ్గరగా గమనించలేదు. ఆమె అంతకత్తె అని అప్పుడు గుర్తుపట్టాడు.

"ఒక విచిత్రమైన విషయం చెప్పమంటారా? మీ పేరు ఇప్పటికీ నాకు తెలియదు. మీరు ఒకనాటి ప్రయాణంలో మరుపురాని జ్ఞాపకం..." అని నవ్వి "నాకు తెలుసు మీరేం ఆలోచిస్తున్నారో. ఆరోజు సికింద్రాబాద్ స్టేషన్లో మిమ్మల్ని నేను కలుసుకోకుండానే మాయమయ్యాను"

"కలుసుకోవాలని నేను ఎదురుచూడలేదు" అంది లీల ముక్తసరిగా. అది అబద్ధం. ఆ విషయం అతనికీ తెలుసు.

"అందుకు కారణం ఉంది"

ప్రపంచంలో ఏ కారణమూ అతని అనౌచిత్యాన్ని సమర్థించలేదు. కాని–విచిత్రంగా సమర్థించకతప్పని కారణం చెప్పాడు. "ఆరోజు నేను రైలు దిగలేదు. నన్ను దింపారు. రాత్రి నాకు ఆస్త్మా ఎటాక్ వచ్చింది. స్ట్రెచర్లో నన్ను సరాసరి మిలటరీ ఆసుపత్రికి తీసుకువెళ్లారు. విచిత్రం–నాకు ఆస్త్మా లేదు. అదే మొదటిసారి"

లీల స్థిమితపడింది. అతని కుసంస్కారంగా గుర్తుండిపోయిన ఆనాటి  అతని నిస్సహాయతగా అర్థమయ్యాక కుదుటపడింది.

"అది ఆస్త్మా కాదు. ఎమోషనల్ టర్బులెన్స్"

"మరిచిపోలేదు. ఆరోజు మీరు నన్ను పాత్రని చెయ్యడం క్రూయల్ జోక్"

"మళ్లీ సారీ"

లీల వెళ్లిపోయింది. ఈసారి కొండ్రావు హర్ట్ అయ్యాడు. మరో అరగంట తర్వాత కొండ్రావు బయటికి వచ్చి తన జీపు ఎక్కబోతూంటే–దగ్గర్లోనే అరుపులు వినిపించాయి. అది తనకి తెలిసిన కొంతు. జీపులోకి పెట్టిన కాలు కిందకి దించి, అటు చూశాడు. లీల చుట్టూ నలుగురైదుగురు మనుషులు నిలబడి ఉన్నారు. లీల కోపంతో రెచ్చిపోతోంది. ఒక్కక్షణం కూడా వృథాచెయ్యకుండా అటు నడిచాడు. యూనిఫారంలో ఉన్న మిలటరీ ఆఫీసర్ తనని తాను పరిచయం చేసుకోనక్కర్లేదు. శరీరంమీద ఉన్న యూనిఫారం, భుజంమీద ఉన్న తెల్ల గీతలు అతనెవరో చెప్తాయి. కొండ్రావుని చూడగానే లీలతో

మాట్లాడే ఐదుగురు సెల్యూట్‌చేసి ఒక్క అడుగు వెనక్కివేసి నిలబడ్డారు. ఆ బృందంలో మఫ్టీలో ఉన్న సర్కిల్ ఇన్‌స్పెక్టర్ ముందుకొచ్చాడు.

"నేను కుక్కుటేశ్వరరావు, సిఐ సార్. ఈవిడమీద కంప్లైంట్ బుక్ అయింది సార్. స్టేషన్‌కి తీసుకురమ్మని ఏసీపీ పంపారు సార్. రమ్మంటే గొడవ చేస్తున్నారు"

మరో పోలీసు కార్బన్ కాపీ ఆర్డర్‌ని కొండ్రావుకి ఇచ్చాడు. అప్పుడు మొదటిసారిగా ఆమె పేరు తెలిసింది–లీల. కంప్లైంట్ చదివి షాకయిపోయాడు. ఇమ్మోరల్ ట్రాఫిక్ నేరం (వ్యభిచార నేరం).

ఉద్యోగం తర్ఫీదు తన ఆశ్చర్యాన్ని ముఖంమీద దొరకనివ్వలేదు. కంప్లైంట్ ఇచ్చింది తవిటి నాయుడు, లోకల్ ఎమ్మెల్యేగారి తమ్ముడు.

తన సంగతి అర్థమైనందుకు లీల ముఖం ఎరుపెక్కింది. తిరగబడే ఆమె సహజగుణం–మొదటిసారిగా అతనిమీద కూడా తిరగబడేటట్టు చేసింది. "ఈ విషయంలో మీ జోక్యం అనవసరం" అంది.

అతని మిలటరీ అనుభవం కర్తవ్యాన్ని వెంటనే నిర్ణయించింది. లీల భుజం పట్టుకుని సాధికారికంగా పక్కకి తీసుకెళ్ళాడు.

"ఇలాంటి సందర్భాలలో మొదటి రూలు–ఎప్పుడూ అధికారాన్ని ఎదిరించకండి. అధికారం మొదటి బలహీనత అహంకారం. దాన్ని చాలామంది జయించలేరు. ఈ తవిటి నాయుడు చెప్పింది నిజమా కాదా?"

"ఈ విషయంలో..."

కొండ్రావు గొంతులో అధికారం ధ్వనించింది.

"అది కాదు సమాధానం"

"ఇది మీకనవసరం"

"నిజమా కాదా?"

లీల మాట్లాడలేదు. ఇక ప్రశ్నించలేదు కొండ్రావు. సిఐవేపు నడిచాడు.

"మీ ఆఫీసు ఎక్కడ?"

"యూసఫ్‌గూడా, ఫస్ట్ రైట్, ఇంటలిజెన్స్ వింగ్ సార్"

"ఈ కంప్లైంట్‌లో ఏదో లొసుగు ఉంది. నేను ఈవిడని మీ జీపు వెనుకే ఆఫీసుకి నా జీపులో తీసుకువస్తాను. పదండి" అన్నాడు సి.ఐ.

కొండ్రావు ర్యాంక్‌లో తనకంటే పెద్ద ఆఫీసరు. సీఐ అభ్యంతరం చెప్పలేదు.

జీపు ఎక్కాడు. కొండల్రావు లీల భుజంమీద చెయ్యివేసి జీపుని ఎక్కించాడు. ఆ చేతిలో అధికారం ఉంది. హుందాతనం వుంది. బాధ్యత ఉంది. గుర్తుపట్టగలిగితే అనునయం ఉంది. అన్నీ లీలకి అర్థమయ్యాయి.

జీపులో కొండల్రావు ఏమీ మాట్లాడలేదు. లీల మాట్లాడడానికి ప్రయత్నించలేదు. ఏసీపీ ఆఫీసులోకి లీలతో నడిచివచ్చి–సరాసరి ఏసీపీ గదిలోకి వచ్చాడు కొండల్రావు. పోలీస్ డిపార్ట్‌మెంట్‌లో ఏసీపీ ర్యాంకూ మిలటరీలో తన ర్యాంకూ దాదాపు ఒకటే.

ఒక వ్యక్తిమీద కంప్లైంట్ వచ్చింది. ప్రశ్నించడానికి ఆ వ్యక్తిని ఆఫీసుకి తీసుకురావాలనుకున్నారు... తాను తీసుకువచ్చాడు. ఇందులో అమర్యాద లేదు. నియమభంగం లేదు.

కుర్చీలో ఏసీపీ లేడు.

"సార్ వస్తారు సార్. ఫోన్ చేశాను. బయలుదేరిపోయారు" అన్నాడు సీఐ. రెండు అందమైన కప్పులతో కానిస్టేబుల్ టీ తెచ్చాడు.

టేబిల్‌మీద పెట్టిన కప్పుని లీల చేతికి అందించాడు కొండల్రావు. మాట్లాడకుండా అందుకుంది. కాసేపటికి ఏసీపీ పక్కనున్న తలుపు తెరుచుకొని లోపలికి వచ్చాడు. ఆరడుగుల భారీ శరీరం. బొద్దు మీసాలు. పెద్ద బొజ్జ. టేబిలుమీద కె.పెద్దిరాజు బోర్డు ఉంది.

కొండల్రావు లేచి నిలబడ్డాడు. ఇద్దరూ కరచాలనం చేసుకున్నారు. ఇద్దరూ ఒకే ర్యాంక్ ఆఫీసర్లు. దూరంగా ఇద్దరు కానిస్టేబుళ్లు నిలబడ్డారు. సీఐ పక్కకి వచ్చాడు.

"ఈవిడేనండి" పెద్దిరాజు ఆమెవేపు చూడలేదు.

"నిన్న ఎమ్మెల్యేగారి ఆఫీసు నుంచి ఫోన్ వచ్చిన తర్వాత–ఇవాళ సికింద్రాబాద్..." కొండల్రావు ఆపాడు.

"మిగతా విషయం నేను చెప్తాను. కేసు బుక్ చేశారా? ఇప్పుడు చెయ్యాలా?"

సమాధానం చెప్పాలా వద్దా అని తడబడ్డాడు సీఐ.

"ఆయనకి చెప్పు" అన్నాడు పెద్దిరాజు సీరియస్‌గా.

"ఇంకా లేదు సార్. పార్టీని ఇంటరాగేట్ చేశాక–సార్‌తో ఓ మాట చెప్పి–ఎమ్మెల్యేగారి పిఏ తనతో ఒక్కసారి సార్‌ని మాట్లాడించమన్నారు సార్"

వాతావరణం చాలా ఇబ్బందిగా, పెద్దిరాజు ప్రవర్తన చాలా పొగరుగా కనిపించింది. లీలలో అసహనం మోతాదు పెరిగిపోతోంది. కొండల్రావు కారణంగా ప్రయత్నంతో తన ఉద్రేకాన్ని తొక్కిపెడుతోంది. కాని తన పరిస్థితి, తన జీవితం, ఈ పోలీసు కేసు–ఇవన్నీ

తనని వీధిన పడేస్తాయని అర్థమౌతోంది. ఇప్పుడేం జరుగుతుంది?

సీఐ చేతుల్లో ఫైలుని పెద్దిరాజు అతనివేపు చూడకుండానే లాక్కొన్నాడు. వెళ్లమని చేత్తో సంజ్ఞ చేశాడు. దూరంగా నిలబడిన కానిస్టేబుళ్లనీ వెళ్లమన్నాడు.

"నాయుడూ! తలుపు వెయ్యి. ఎవరినీ కూడా లోపలికి రానియ్యకు" అన్నాడు సీరియస్‌గా.

కొండ్రావుకి ఈ పోజు చాలా చికాకుగా ఉంది. "లుక్ ఆఫీసర్. ఈ కేసు..." ఏదో చెప్పబోయిన కొండ్రావుని అతిక్రూరంగా మధ్యలో ఆపి కూర్చోమని సంజ్ఞ చేశాడు పెద్దిరాజు.

కొండ్రావుకి ఇదంతా పెద్ద నాటకంలాగ అనిపించింది. ఇప్పుడెలా స్పందించాలి? He is confused.

తలుపులు మూతబడ్డాయి.

పెద్దిరాజు అంత భారీ శరీరంతో సీట్లోంచి లేచాడు. తలమీద టోపీని టేబిలుమీదకి విసిరేశాడు. నడుంకి ఉన్న రివాల్వర్ బెల్టుని అంతే నిర్లక్ష్యంగా టేబులుమీదకి గిరాటేశాడు. అతని ప్రవర్తనలో హఠాత్తుగా చాలా మార్పు వచ్చింది. టేబులు చుట్టూ తిరిగి కొండ్రావు దగ్గరికి వచ్చాడు.

'ఒరే కొండా! నన్ను గుర్తుపట్టలేదురా దొంగనాయాల? నేనురా–చింతపల్లి ఆరెద్దుల వెంకునాయుడు కొడుకుని–పెద్దిరాజు కాదు. బొద్దురాజు... ఎద్దురాజు... గెద్దరాజు... ముద్దురాజు..." రకరకాల '...ద్దు'లు వెక్కిరింతగా కలిసి కొండ్రావుని అమాంతం లేవదీసి కావలించుకున్నాడు.

అక్కడ వాతావరణం పూర్తిగా మారిపోయింది. అతని అరుపుకి బయట తలుపు గడగడలాడింది. అంతవరకు కూడా అతి అధికారయుతంగా కనిపించిన సీఐ పాతికేళ్ల కిందటి పెద్ద అవుటపల్లి ప్రాథమిక పాఠశాల విద్యార్థయిపోయాడు.

'బొద్దురాజు' అన్నమాట చిన్ననాటి జ్ఞాపకాన్ని తవ్వి బయటికి తీసింది. "నువ్వు... నువ్వు... వెంకునాయుడు... సారాబట్టీలు... ఆంజనేయస్వామి మంటపం... అమ్మ బొద్దూ!!" అంటూ కొండ్రావు రెచ్చిపోయాడు. ఇద్దరు ఆఫీసర్లూ– ఒక్కసారి– తమ ఉద్యోగాల్నీ– ర్యాంకుల్నీ మరిచిపోయి చిన్ననాటి కుర్రాళ్లయిపోవడాన్ని చాలా ఆశ్చర్యంతో గమనించింది లీల.

పెద్దిరాజు అంటున్నాడు–"ఆ కర్టెన్ దాటి లోపలికి అడుగుపెట్టగానే నిన్ను గుర్తుపట్టానురా కొండా. నీ ముక్కు పట్టిచ్చింది. ఎన్నాళ్లయిందిరా నిన్ను చూసి!" అంటూ

పెద్ద గొంతుతో చేతులు విసురుతూ పెద్ద విన్యాసాలు చేశాడు పెద్దిరాజు.

బంధుత్వాలు బలంగా మనుషుల్ని సంధిస్తాయి. పరిస్థితులు వ్యక్తుల్ని ఆత్మీయుల్ని చేస్తాయి. జన్మబంధాలు ఒకరితో ఒకరిని ముడులు వేస్తాయి. కాని స్నేహం, అందునా పొరపొచ్చాలులేని చిన్ననాటి స్నేహం జననాంతర సౌహృదంలాంటిది. ఇంగ్లీషులో ఒక వాక్యం ఉంది.

God gave us relatives, but thank God, we can choose our friends.

ఇప్పుడు ఆ ఇద్దరి మిత్రుల మధ్య తెరలు చిరిగిపోయాయి. జ్ఞాపకాలు ముసురుకున్నాయి. పాతికేళ్ల జీవితాన్ని పక్కన పారేసి ఇద్దరూ పసివారైపోయారు. చాలాసేపటికికాని వారికి తెల్లబోయి చూస్తున్న లీల గుర్తురాలేదు. ఆమెని చూసి తమ జ్ఞాపకాల గుర్రాలు దిగి ఇద్దరూ వర్తమానంలోకి వచ్చారు. మళ్లీ పెద్దిరాజు ఏసీపీ అయిపోయాడు. అయితే ఇదివరకటి బింకం పోయింది.

"హూ ఈజ్ దిస్ బ్యూటిఫుల్ లేడీ!" అన్నాడు కుర్చీలో కూర్చొంటూ.

సమాధానాన్ని కొండల్రావు గంటన్నర ముందునుంచీ సిద్ధంచేసుకున్నాడు. లీల విషయంలో ఒక సమగ్రమైన పథకం అతని మనస్సు సిద్ధంచేసుకుంది.

"ఈమె లీల. నాకు కాబోయే భార్య" అన్నాడు కొండల్రావు.

పాముమీద కాలేసినట్టు కస్సుమంది లీల. "వ్వాట్!" అంటూ.

ఆమె చేతిని అదిమిపట్టి కూర్చోపెట్టాడు కొండల్రావు.

అలనాడు గూడూరు రైల్వే స్టేషన్లో ఫస్ట్ క్లాస్ బోగీలో–ఒకానొక కేబిన్‌లో ప్రారంభించిన నాటకాన్ని కొనసాగించడానికి ప్రత్యేకమైన ప్రయత్నం అక్కర్లేదు. ఆ నాటకానికి ఇది రెండో అంకం. ఆనాటి నాటకం తన వివాహానికి ఆనకట్ట వేసింది. ఈనాటి నాటకం ఓ పోలీసు కేసుకి అడ్డుకట్ట వెయ్యాలి.

"కంగ్రాచ్యులేషన్స్" అని హార్దికంగా నవ్వాడు పెద్దిరాజు. "నువ్వు చాలా అదృష్టవంతురాలివమ్మా. వీడు–ఈ కొండ ఆడపిల్ల అయివుంటే నేను నీకా చాన్స్ ఇచ్చేవాడిని కాదు. హీ ఈజ్ వన్ ఇన్ మిలియన్!"

ఇది మరో సందర్భంలో మరొకరు కొండల్రావుకి ఇచ్చిన కితాబు. మొదట చెప్పింది మాళవిక.

ఇప్పుడు ఫైలు తెరిచాడు.

"ఈ ఎమ్మెల్యే దరిద్రుడు. వాడి తమ్ముడిమీద ఇప్పటికే రెండు డ్రగ్ కేసులు ఉన్నాయి. మనిషిని కొట్టాలి అంటే వాడి గతాన్ని తవ్వాలి" అంటూ ముందుకు వంగి

"కాని బ్రదర్! ఈవిడ గురించి మావాళ్లు రాసింది–ఇమ్మోరల్–అదే నైట్ లైఫ్..."

కొండల్రావు అతని మాటని పూర్తిచెయ్యనివ్వలేదు. "నాకు తెలుసు... ఆమె జీవితంలో దెబ్బతింది. మీవాళ్లు సేకరించిన సమాచారం (నిజానికి అతనికి తెలీదు!) చాలామట్టుకు నిజం. ఆ కారణానికే నేను ఆమెని పెళ్లి చేసుకోబోతున్నాను"

లీల తల వొంచుకుని కూర్చుంది.

కొండల్రావు అంటున్నాడు "చూడు రాజూ. సమాజంలో అందరి జీవితాలూ వడ్డించిన విస్తరి కావు. కొందరి జీవితాలు వారి ప్రమేయం లేకుండానే మలుపులు తిరిగిపోతాయి. సుడిగుండాల్లో పడిపోతాయి. అయితే కింద పడిన ప్రతి వ్యక్తికీ లేచే హక్కు ఉంది. కింద పడిన ప్రతి వ్యక్తికీ చెయ్యి అందించి లేపాల్సిన బాధ్యతా సమాజానికి ఉంది. లీల ఈజ్ ఏన్ ఎగ్జాంపిల్. ఆమె సెన్సిటివిటీ ఆమెమీద ముసుగును కప్పింది. ఆ ముసుగును తొలగిస్తే ఆమె పసిపిల్ల. ఆమెకి మరో ఛాన్స్ ఇవ్వాలి. నేనా పని చెయ్యదలుచుకున్నాను"

లీల నిర్ఘాంతపోయి తలెత్తి కొండల్రావుని చూస్తోంది. పెద్దిరాజు నిర్విణ్ణుడై స్నేహితుడి మాటలు వింటున్నాడు. "సేమ్ ఓల్డ్ సోషల్ రిఫార్మర్!" అంటూ లీలవైపు తిరిగి–

"మేం చదువుకునే రోజుల్లో–మా అయ్య వీడికి పెద్ద పనసపండు ఇచ్చాడమ్మా. 'చినబాబూ! ఇది కజ్జా పనస. తీసుకువెళ్ళి మీ అమ్మకియ్యి. మీ ఇంట్లో పండు వుంటే పక్కవీధిలోకి తెలుస్తుంది' అన్నాడు. కాని వీడేం చేశాడో తెలుసా?" మా ఫారెస్టు దాటగానే బట్టల్లేని కొండజాతి పిల్లల్ని చూశాడు. వాళ్ళ కాలే కడుపుల్ని చూశాడు. వాళ్ల వెనకే నడుస్తున్న తల్లి చేతుల్లో ఆ పండు పెట్టేసి నడిచి వచ్చేశాడు. వీడు పెద్దయితే ఏ రామకృష్ణ ఆశ్రమంలోనో ఉంటాడనుకునేవాడని. కాని విచిత్రంగా మిలటరీలోకి వచ్చాడు. కాని ఆ పెద్ద మనసు పోలేదు"

ఫైలు మూసేస్తూ "పెళ్లి శుభలేఖ మర్చిపోకు గురూ. నా పెళ్లాంతో వచ్చి నాలుగు రోజులు ఉంటాను" అని చెయ్యి అందించాడు.

లీల స్తబ్ధురాలైపోయింది. నేరం ఆమె అభిమానాన్ని రెచ్చగొట్టింది. కాని కొండల్రావు ఔదార్యం ఆమె అహంకారాన్ని చిత్తుచేసింది. ఆమెని కాబోయే భర్త పట్టుకున్నట్టే పొదివిపట్టుకుని లేవదీశాడు కొండల్రావు.

"వన్ మినిట్" అని పెద్దిరాజు సీఐని పిలిచాడు. "మన స్టాఫ్ ఫోటోగ్రాఫర్‌ని బేగి రమ్మను"

ఫోటోగ్రాఫర్ వచ్చాక పోలరాయిడ్ కెమెరాతో వారిద్దరికీ ఫోటో తీసి అప్పటికప్పుడు

కొండ్రావుకి ఇచ్చాడు. వాళ్లిద్దరి పక్కనా నిలబడి పెద్దిరాజు ఒక ఫోటో తీయించుకున్నాడు.

తమ బాస్ ఎప్పుడూ అంత చలాకీగా, అంత సరదాగా ఉండడాన్ని సిబ్బంది చూడలేదు. మిలటరీ ఆఫీసరుతో నేరస్థురాలిగా వచ్చిన ఆడపిల్ల కలిసి గ్రూపు ఫోటో తీయించుకుని హుందాగా బయటికి నడవడం-ఆఫీసులో ఎవరికీ అంతబట్టలేదు.

బయటికి వస్తున్న లీలని చూసి "సారీ మేడమ్! కంగ్రాచ్యులేషన్స్!" అన్నాడు సీఐ అతి మర్యాదగా.

జీపులో లీల మాట్లాడలేదు. కొండ్రావు మాట్లాడించలేదు. ఆమె ఇంటిదగ్గర జీపు ఆగినప్పుడు ఇద్దరూ జీపు దిగారు.

"సారీ, మిమ్మల్ని కాపాడడానికి ఇంతకన్నా మరో మార్గం కనిపించలేదు. పాత నాటకంలో రెండో సీను ఇది" అంటూ చేతిలో ఉన్న ఇద్దరి ఫోటోను చించేసి జీపు ఎక్కాడు.

జీపు కదిలిపోయింది.

## 35

వాలంటీన్ డే నాడు సికింద్రాబాదు 54 ఇన్‌ఫెంట్రీ బెటాలియన్ ఆఫీసర్స్ మెస్‌లో ఆర్డర్లీ కొండ్రావుకోసం పేజర్ మెసేజ్ బోర్డ్ పట్టుకుని తిరిగాడు.

కొండ్రావు ఊహించని ఫోన్‌కాల్ అది. లీల చేసింది. ఆశ్చర్యపోయాడు. "ఏసీపీ పెద్దిరాజు వాలంటీన్ డే గ్రీటింగ్ పంపారు" అంది.

"నాకూ పంపాడు"

"గ్రీటింగ్‌తోపాటు పోలీస్ మెన్ క్లబ్బులో పార్టీకి ఆహ్వానం పంపారు"

కొండ్రావు నవ్వాడు. "పెద్దిరాజుకి ఆవేశం ఎక్కువ. ఆర్భాటమూ ఎక్కువే. ఇప్పటికి నేను ఆడిన నాటకం చాలు. ఇంకా మిమ్మల్ని బాధపెట్టదల్చుకోలేదు. నేను వాడికి ఏదో సర్దిచెపుతాలెండి" అన్నాడు.

లీల సమాధానం అతన్ని ఆశ్చర్యపర్చింది. "నేను పార్టీకి రావాలనుకుంటున్నాను"

"నో... నా మాట వినండి. పెద్దిరాజు హడావుడి చేస్తాడు. మీరు మరింత ఇబ్బందిపడతారు"

"ఇబ్బందిపడాలనుకుంటున్నాను" కొండ్రావు సాయంకాలం మిత్రుడి కారు అడిగి తీసుకుని లీల ఇంటికి వచ్చేసరికి-సినీతారలు కూడా ఆశ్చర్యపోయేటంత అద్భుతంగా లీల రెడీఅయి సిద్ధంగా ఉంది.

ఆమెను చూడగానే ఆ సాయంకాలం గడపడానికి ఆమె చాలా ప్రయత్నం చేసిన విషయం కొండ్రావుకి అర్థమైంది. వంగపండు రంగు ఎంబ్రాయిడరీ చీరె. స్లీవ్‌లెస్ బ్లౌజు, మెడలో ఒకే ఒక్క ముత్యాలహారం, చెవులకు మ్యాచింగ్ ముత్యాల లోలకులు–లీల చాలా అందగత్తె అన్న విషయం అప్పుడు ప్రత్యేకంగా గుర్తించాడు.

కొండ్రావుని అతని మనస్సు హెచ్చరించింది. "జాగ్రత్త. ఆమె మనస్సుని మరింత బాధపెట్టే హక్కు నీకు లేదు"

"మనం బయలుదేరేముందు మీరు గుర్తుంచుకోవలసిన నిజం ఒకటుంది. నాకీ పార్టీకి రావడం ఇష్టంలేదు"

లీల నవ్వింది. "మీరు గుర్తుంచుకోవలసిన నిజం ఒకటుంది. ఈ పార్టీకి నేను కావాలనే వస్తున్నాను"

ఆ సాయంకాలాన్ని ఉక్కిరిబిక్కిరి చేసేశాడు పెద్దిరాజు. కేవలం నాలుగంటే నాలుగే కుటుంబాల స్నేహితుల్ని పిలిచాడు. అందరూ భార్యాభర్తలు. భార్యాభర్తలు కానివారు–పెద్దిరాజు దృష్టిలో కావలసినవారూ–కొండ్రావు, లీల మాత్రమే. ఆ కారణానికే ఆ సాయంకాలం వారిద్దరూ ఫోకస్‌లో ఉన్నారు.

రెండు దండలు తెప్పించి అందరి సమక్షంలో దండలు మార్పించే ఏర్పాట్లు చేశాడు. మొదటిసారిగా కొండ్రావు కోపం తెచ్చుకున్నాడు. "దిస్ ఈజ్ టూమచ్!" అంటూ.

"వాలంటీన్ డేనాడు ఆత్మీయులైన స్నేహితులు భార్యాభర్తలు కావడం టూమచ్ కాదు" అని పోలీసు అధికారంతో గర్జించాడు పెద్దిరాజు. మిగతా కుటుంబాలు వంతపాడాయి. కొండ్రావు నిస్సహాయంగా చూశాడు లీలవేపు. ఇలాంటి పని ముందు రెండు సందర్భాలలో చెయ్యలేదు. కారణం–ఆ రెండూ ఆపద్ధర్మాలు. కాని ఇది వాస్తవం. అయితే–ముందు రెండు సందర్భాలలో అయినట్టుగా లీల షాక్ అవలేదు. పెద్దిరాజు భార్య అందించిన దండని తీసుకుని అతి మనస్ఫూర్తిగా అతని మెడలో వేసింది.

కొండ్రావు నిర్ఘాంతపోయాడు.

"ఇప్పుడైనా సిగ్గులేదూ? ఇంతకంటే ఏ ఆడది తన మనస్సు విప్పి చెప్తుంది? పైగా–మిలటరీవాడివి. గాలంట్రీ మీ సొత్తని పెద్ద కబుర్లు చెప్తారు. ఇదిగో దండ. బుద్ధిగా, నోరు మూసుకుని మెడలో వెయ్యి. ఇట్ ఈజ్ ఏన్ ఆర్డర్!" అన్నాడు బొద్దురాజు.

కొండ్రావు సందేహంగానే లీల మెడలో దండ వేశాడు. నాలుగు కుటుంబాలూ నలభై కుటుంబాలై చప్పట్లు కొట్టాయి. పెద్ద షాంపైన్ సీసా తెచ్చి కార్కుని ఆకాశంలోకి ఎగరగొట్టాడు పెద్దిరాజు. ఆ సాయంకాలమంతా లీల ఆనందంగా ఉంది.

రాత్రి పన్నెండున్నరకి ఆమె ఇంటిముందు కారు ఆపాడు కొండల్రావు. కారు దిగి నాలుగు అడుగులు వేసి కారుని వెనక్కి తిప్పుకునేలోగా అతని దగ్గరికి వచ్చింది.

"మొదటి రెండుసార్లూ మీరు నాటకం ఆడారు. ఒకసారి మీకోసం. ఒకసారి నాకోసం. కాని ఇవాళ నేను నాటకం ఆడలేదు. తెలిసి, కోరి దండ వేశాను. కావాలనుకుంటే మీరు దీన్ని నాటకమని మర్చిపోవచ్చు. రెండుసార్లూ మీరు చెప్పిన ముగింపు మాట 'సారీ'. ఇప్పుడు నా వంతు-'సారీ' అని లోపలికి వెళ్లిపోయింది.

చాలాసేపు కారు కదలలేదు. లీల తన అపార్టుమెంటులోకి వెళ్లి బట్టలు మార్చుకుని, నైటీ వేసుకుని యధాలాపంగా కిటికీలోంచి వీధిలోకి చూసి ఆశ్చర్యపోయింది. కారణం-కారు ఇంకా అక్కడే ఉంది... కొండల్రావు స్టీరింగుముందు కూర్చునే ఉన్నాడు. కారు కదిలేవరకూ కిటికీ దగ్గరే నిలబడాలనుకుంది.

మరో గంట గడిచినా కారు కదలలేదు. అక్కడే అలాగే ఉంది. అప్పుడు-బయట కాలింగ్‌బెల్ మోగింది. లీల తలుపు తెరిచింది. కొండల్రావు నిలబడ్డాడు. అతని చేతిలో సాయంకాలం పెద్దిరెడ్డి తగాదాపెట్టి వేయించిన దండ ఉంది. ఒక్కక్షణం నిశ్శబ్దంగా ఆమెని చూస్తూ నిలబడ్డాడు.

"ఇప్పుడు నేను సీరియస్‌గా అడుగుతున్నా. నన్ను పెళ్లి చేసుకుంటారా?"

"ఇప్పుడు సీరియస్‌గా చెప్తున్నాను. పెళ్ళి చేసుకుంటాను"

"సాయంకాలం ఈ దండ మీ మెడలో వేసినప్పుడు అది నాటకంలో మూడో అంకం అనుకున్నాను. అందుకే మళ్లీ తెచ్చాను. ఈసారి మనస్ఫూర్తిగా" అంటూ దండ వేశాడు.

లీల కళ్లు కన్నీళ్లు మర్చిపోయి చాలా ఏళ్లయింది. ఆ విషయం ఆ కళ్ళకి ఆ క్షణంలో గుర్తుకొచ్చింది. కొండల్రావు మరో పని చేశాడు. లీలని ఆప్యాయంగా దగ్గరికి తీసుకుని చెంపమీద ముద్దుపెట్టుకున్నాడు. లీలకి చాలా నెలల కిందట గూడూరు రైల్లో ఫస్ట్ క్లాస్ కేబిన్‌లో మాళవిక చెప్పిన మాటలు గుర్తుకొచ్చాయి. మాళవిక చెప్పింది నిజం. ఈ ఆనందం ఒక జీవితకాలం తనది. లీల కళ్లు మూసుకుంది-కలల్ని భద్రంగా మనస్సులో బిగించుకోవాలని.

❖ ❖ ❖

ఆ తరువాత వాళ్లిద్దరికీ రాత్రీ పగలూ తేడా తెలియలేదు. లీలకి సెక్స్ కొత్త కాదు. మగాడు కొత్త కాదు. మగడు కొత్త. ఆత్మీయత కొత్త. ఆప్యాయత కొత్త. ఆనందాన్ని పంచుకోవడంలోనూ పరస్పరం గౌరవం, హుందాతనం ఇచ్చి పుచ్చుకుంటారని తెలీదు.

పువ్వు సువాసనని అనుభవించాలంటే దానిని పూర్తిగా శిథిలం చెయ్యనక్కర్లేదని తెలీదు.

అతనికి ఆ ప్రపంచమే కొత్త. మాళవికలో అందంకంటే అభిమానానికి 'ప్రేమ' అని గుర్తుపెట్టుకున్నాడు. మాళవిక మొదట తనని సొంతం చేసుకుంటుంది. తర్వాత ఆనందం మాట. అంటే ఆప్యాయతని కాస్త ఎక్కువ పాలు పంచే స్త్రీ మొదట మాతృత్వపు చాయల్ని భర్తకి అందజేస్తుంది. కాని ప్రేమలో కోరిక కూడా ఒక భాగమని గుర్తుపట్టడానికి ఇంతకాలం పట్టింది. ఇంగ్లీషులో ఒక వాక్యం ఉంది. భార్యాభర్తల మధ్య శారీరక బాంధవ్యం గడిచాక–నిజమైన మానసిక బాంధవ్యం ప్రారంభమౌతుందని.

వాళ్లింకా భార్యాభర్తలు కాలేదు. కాని గంభీరమైన మానసిక బాంధవ్యాన్ని ఏర్పర్చుకున్నాకే శారీరకమైన సుఖానికి ఉద్యుక్తులయారు. గుడిలో దేవతని ప్రతిష్ఠించినాక పువ్వులు వెయ్యలేదు. పువ్వులను పరిచి వాటిమీద దేవతని ప్రతిష్ఠించాడు కొండ్రావు.

మొదటినుంచీ ఆ బాంధవ్యం అసాధారణంగా, అలౌకికంగా నిలిచింది. లీల జీవితంలో ఈ పార్శ్వం కొత్త. ఇలాంటి వ్యక్తి కొత్త. ఎన్నిసార్లు ఇలాంటి గొప్ప అనుభూతిని నష్టపోయిన మాళవిక ఆమె మనస్సులో కదిలిందో లెక్కలేదు. లీల జీవితంలో ఎన్నిక చేయదగిన గొప్ప దశ అది.

❖ ❖ ❖

కొండ్రావు అభిమాన కళ ఓరిగామీ. జపాన్‌లో ప్రముఖమైన హస్తకళ. రకరకాల కాగితాలతో కళ్లు మిరుమిట్లుగొలిపేటట్టు తీర్చిదిద్దే హస్తకళ. ఇళ్లల్లో అలంకరణలుగా, దీపాలకు షేడ్‌లుగా మరెన్నో మరెన్నో రకాలుగా విస్తరించిన కళ. జపాన్ భాషలో 'ఓరి' అంటే మడత. 'గామి' అంటే కాగితం. కాదితాన్ని రకరకాలుగా మడిచితీర్చే కళ. తగుమాత్రం ఖర్చుతో వినియోగపడే, సరళమైన, హృద్యమైన, సరసమైన ధరలతో–ముఖ్యంగా మహిళలు వంటబట్టించుకున్న కళ. దాదాపు 4 శతాబ్దాలుగా–జపాన్‌లో తరతరాల వారసత్వంగా నిలదొక్కుకుంటూ వస్తున్న కళ. మన దేశంలో కూడా కాగితాన్ని మడిచి పడవగా, స్టీమరుగా చేయడం ఆనవాయితీ. దాన్ని ఒక ప్రముఖమైన కళని చేసింది జపాన్. దాన్ని లీలకి నేర్పుతూవచ్చాడు కొండ్రావు.

"ఏనాడైనా ఈ ఉద్యోగంనుంచి విరమిస్తే, తాను పూనుకోదలచిన వ్యావృత్తి ఈ 'ఓరిగామీ' అనేవాడు. కాగా, ఇది కేవలం ఊసుపోని వ్యాపకం కాదు. జపాన్‌లో ఇళ్ళల్లో, ఆఫీసుల్లో ప్రత్యేకమైన వినియోగానికీ, అలంకారాలకీ ప్రామాణికమైన కళగా రూపుదిద్దుకుంటోంది.

నిజానికి ఈ పనిమీద లీలకి అంత శ్రద్ధ లేదు. మనస్సు లేదు. ఐతే అతను

ప్రేమించిన వ్యావృత్తిని, అతన్ని ప్రేమించే వ్యక్తిగా అందిపుచ్చుకుంది. విచిత్రంగా అతి తక్కువ కాలంలో కొండల్రావు కూడా ఆశ్చర్యపోయేటంతగా ఈ కళని ఒడిసిపట్టుకుంది. కొత్త ఆలోచనలను జతచేసింది.

అతని ముఖంలో ఆశ్చర్యం ఆమెకి బోనస్. ఇదొక కొత్త ప్రపంచం. లీల జీవితంలో కొండల్రావు కారణంగా, కొండల్రావుతో ప్రవేశించిన విచిత్రమైన కళ ఓరిగామీ. ఆ దశలో ఆమెకి అర్థంకాని విషయం భవిష్యత్తులో దాని విలువ, ప్రాధాన్యత, ప్రత్యేకత ఎన్నో రెట్లు పెరగడం.

వారిద్దరి సాంగత్యంలో కాలం ఘనీభవించింది. అదీ సరిగ్గా 4 నెలల 14 రోజులు. అప్పుడు–అంటే 1965 ఏప్రిల్ 8న జమ్మూలో ఆఖ్నూర్‌ని ఆక్రమించుకోవడానికి పొరుగుదేశం–పాకిస్తాన్ సేనలు తరలివచ్చాయి.

సేనలు మన దేశపు భూభాగంలోకే కాదు కొండల్రావు–లీల సహజీవనంలోకి చొచ్చుకువచ్చాయి. మూడోనాడే సరిహద్దులకు బయలుదేరమని సెకెండ్ లెఫ్టినెంట్ కొండల్రావుకి ఆర్డర్లు వచ్చాయి. తరలివెళ్లిన భారత సైన్యంలో కొండల్రావు వెళ్తున్నది దాదాపు ఆఖరి బృందం.

పొరుగుదేశం యుద్ధం ఇద్దరు ప్రేమికులను విడదీసింది. సికింద్రాబాదు స్టేషన్లో కొండల్రావు ఎక్కిన రైలు కదిలినప్పుడు లీల కంటతడి పెట్టలేదు. ఓ గొప్ప బాంధవ్యానికి తెర లేపినందుకు అతనికి కృతజ్ఞత చెప్పింది. దేశభద్రతను కాపాడడానికి వెళుతున్న సైనికుడిని చూసి గర్వపడింది.

రైలు మలుపు తిరిగేదాకా నాలుగు కళ్లూ పేనవేసుకున్నాయి.

తరువాత–వాళ్ళిద్దరి మధ్యా దూరం వారిని విడదీసింది.

❖ ❖ ❖

కొండల్రావు వెళ్లిన నెలరోజులకు లీలకి అర్థమైంది తాను నెల తప్పిందని. మొదటిసారిగా తల్లి కాబోతున్న భావన ఆమెని ఆకాశానికి ఎత్తేసింది.

కొండల్రావు వెళ్లిన తర్వాత వెంటనే రాసి, పోస్టు చేసిన ఉత్తరం–రకరకాల మజిలీలు చేసి–ఎక్కడినుంచి వచ్చిందో దాచిపెడుతూ–మరో కవరులో దాన్ని ఉంచి మిలటరీ హెడ్ క్వార్టర్స్ నుంచి బట్వాడా అయి తిరిగి వచ్చింది. తనకి సమాధానం రాసే అవకాశం లేదు. యుద్ధం ముమ్మరంగా సాగుతోంది. కొండల్రావుకి ఈ శుభవార్త చెప్పాలని మనస్సు ఉవ్విళ్లూరింది. కాని ఎలాగో తెలియలేదు.

దూరంగా ఉన్న మనిషిని దగ్గరగా నిలుపుకోవడంకోసం అతని మనసుకు దగ్గరగా ఉన్న అభిరుచికి మరింత కార్యరూపాన్ని ఇవ్వడాన్ని ప్రారంభించింది. కాబోయే భర్తనీ, రాబోయే బిడ్డనీ మురిపించడానికి రకరకాల ఓరిగామీ బొమ్మల్ని తయారుచేసింది. అయితే అవన్నీ కాగితం బొమ్మలు. ముట్టుకుంటే పిగిలిపోతాయి. ఆ ఆనందం కేవలం దృశ్యానిదే. ఆలోచనదే. బొమ్మ వాస్తవం కాదు. ఐనా చూపుని తృప్తిపరుస్తుంది. అసలైన ఆనందానికి ఇది కేవలం ప్రత్యామ్నాయం.

సెప్టెంబరు 17వ తేదీన హాలులో ఫోన్ మోగింది. కొండ్రావు జీవితంలో ప్రవేశించాక ఫోన్ మోగి చాలా వారాలు, నెలలూ అయింది. లీల పరిగెత్తింది. అది కొండ్రావే అయితే? తల్లి కాబోతున్న శుభవార్తని చెప్పాలి.

అవతల హిందీ మాట్లాడే గొంతు తడుపుకొంటూ ఇంగ్లీషు మాట్లాడుతోంది. 1965 ఏప్రిల్ 1న హాజీపీర్ కనుమ దగ్గర పాక్ సైన్యాలతో భారతసైన్యం హోరాహోరీ పోరాటాన్ని జరిపింది. రెండుపక్కల సైనికులూ చాలామంది పోయారు. ఆ పోయినవారిలో సెకెండ్ లెఫ్టినెంట్ ఐసి 13589 ఎఫ్ 54 కొండ్రావు కూడా ఉన్నాడు. ఎంత ప్రయత్నించినా శరీరం కూడా దొరకలేదు. ఆర్మీ హెడ్ క్వార్టర్స్ నుంచి ఫోన్.

లీల స్పృహ తప్పి పడిపోయింది.

❖ ❖ ❖

తరువాత నాలుగు నెలలపాటు మానసికమైన డిప్రెషన్‌తో ఆసుపత్రిలో వుంది లీల. ఆరోజులు ఆమెకంటే ఆమె బిడ్డ వైద్యులకి గడ్డు సమస్యగా మరిణమించింది. కారణం–కడుపులో శిశువు.

ఆమెకి ఇచ్చే, ఇవ్వాల్సిన మందులు శిశువు ఆరోగ్యంమీద ఎక్కువగా పనిచేస్తాయి. మందులు ఇవ్వకపోతే పెద్ద ప్రాణానికే ముప్పు. కనుక కీడు జరుగుతోందని తెలుస్తూనే పెద్ద ప్రాణాన్ని కాపాడడంకోసం ఎంతో కొంత పుట్టబోయే బిడ్డకి అన్యాయం చేశారు–తెలిసి తెలిసి. ఇది తప్పని పరిస్థితి. ఆమె మళ్ళీ మందుకి అలవాటుపడకుండా జాగ్రత్తపడ్డారు. డిప్రెషన్ నుంచి ఆమె పూర్తిగా కోలుకోలేదు. ఆమెకి తనవారంటూ ఎవరూ లేరు.

అప్పుడప్పుడు నరిసిపందు వచ్చేవాడు. ఆమె క్షేమసమాచారాలు చూడడానికి కాదు. తనకి డబ్బు అవసరమై. కాస్త స్పృహలో ఉన్నప్పుడు మెడలో ఉన్న గొలుసు తీసి ఇచ్చింది. చేతికి ఉన్న గాజు కూడా తీసి ఇచ్చింది. నరిసిపందు చాలా ఆనందపడ్డాడు. తర్వాత మరి కనిపించలేదు. నెలలు నిండి, ఆమె మగబిడ్డని ప్రసవించేనాటికి–సంతోషించడానికీ, సమాధానపర్చడానికీ ఎవరూ లేరు.

సంతోషించింది డాక్టర్లు–రెండు ప్రాణాల్నీ కాపాడగలిగినందుకు. లీల కూడా సంతోషించే స్థితిలో లేదు. కుర్రాడు పుట్టి–ఆనందాన్ని పంచుకోవలసిన వ్యక్తి దుర్మరణాన్ని గుర్తుచేశాడు.

మళ్ళీ ఆమె ఆరోగ్యం చెడింది. ఆసుపత్రిని వదిలేముందు ఆమె తేల్చవలసిన విషయం ఒకటుంది. ఆసుపత్రి రికార్డులలోనైనా చేర్చడానికి బిడ్డ పేరు. ఆమెకి ఊహ తెలిసినప్పటినుంచీ ఇష్టమైన స్నేహం టెడ్డీబేర్‌తో. అసలా ప్రక్రియమీద, తన కొడుక్కి పేరుపెట్టే చక్కని లాంఛనంమీద–ఆమె మనస్సు లేదు.

"అబ్బాయి పేరు...?" అడిగాడు గుమాస్తా.

"టెడ్డీ" అంది లీల.

## 36

ఆరోజుల్లో కొడైకొనాల్లో నాలుగే నాలుగు చెప్పుకోదగ్గ విద్యా సంస్థలు. ఇండియాలో వేడిని తట్టుకోలేని–ఒకనాటి బ్రిటిష్ తల్లిదండ్రులు–తరచూ తాము వచ్చే వేసవి విడిదుల్లో–పిల్లల చదువులకి విద్యా సంస్థల్ని ప్రోత్సహించారు. ప్రెజెంటేషన్ కాన్వెంట్, సెంట్ పీటర్స్ పబ్లిక్ స్కూల్ మొదలైనవి ప్రారంభమయాయి.

దేశానికి స్వాతంత్ర్యం వచ్చాక కూడా కొడైకెనాల్‌ని విహారంగా మరిగిన ఇండియన్ తల్లిదండ్రులు తమ పిల్లలను పంపడం ఫ్యాషన్‌కాగా ఏర్పడిన స్కూళ్లు చాలా ఉన్నాయి.

మోయర్ పాయింట్ దాటి, కొడై గోల్ఫ్ క్లబ్ నుంచి కుడివేపు తిరిగితే–కొడైకెనాల్‌లో ప్రముఖమైన స్థలం–కొడై సరస్సు. బ్రిటీష్‌కాలంలో అప్పటి మధుర జిల్లా కలెక్టరు సర్ హెన్రీ లెవెంగే ఈ సరస్సుని తవ్వించాడు. 60 ఎకరాలమేర నక్షత్రంలా పరుచుకున్న ఈ లేక్ చుట్టూ 5 కిలోమీటర్ల రోడ్డు, ఎవరెవరు ఏయే స్థలాలనుంచి వచ్చినా, ఎక్కడ ఉన్నా– సాయంకాలాల్లో ఆ లేక్ చుట్టూ ముసురుకొంటారు. గుర్రపుస్వారీలు, సైకిళ్ల విహారాలు, రకరకాల తినుబండారాలు, యాత్రికుల హడావుడి– కొడైకెనాల్‌కి జీవకేంద్రం కొడై లేక్. లేక్ దగ్గరనుంచి నాయుడుపురంవేపు మెరక ఎక్కుతూంటే కనిపిస్తుంది సెంట్ లూక్ పబ్లిక్ స్కూల్. లేక్ నుంచి 50 గజాల దూరం. ఒక కోణంలో చూస్తే స్కూలు ఆటమైదానం కనిపిస్తుంది. శని ఆది వారాలలో ముదురు ఎరుపురంగు దుస్తుల్లో–వికసించిన పువ్వుల్లాగ లేక్ చుట్టూ పరుచుకుంటారు సెంట్ లూక్ పిల్లలు. ఆ రెండు రోజులూ పబ్లిక్ స్కూలు సిబ్బందికీ, పిల్లలకీ ఆటవిడుపు. ఎంత అదుపులో పెట్టాలన్నా ఐదు కిలోమీటర్ల రోడ్డు పిల్లల్ని చెదరగొట్టే విహారస్థలం.

అబ్బుశాస్త్రి కొడైకెనాల్ రావడం అదే మొదటిసారి. లీలకి ఒక కొడుకు ఉన్నాడని

నరిసిపండు చెప్పినప్పుడు ఆశ్చర్యపోయాడు. ఆ కుర్రాడిని చూడాలని మనసు ఆత్రపడింది. ఎందుకు? ఆ ప్రశ్నకు సమాధానం లేదు. లీలని చూడాలని ఇన్ని సంవత్సరాలు ఎందుకు నిరీక్షించాడు? ఆ నిరీక్షణకు సమాధానంగా–సంస్కరించవలసిన అవసరం ఆమె జీవితానికి ఉన్నదని అర్థమైంది. ఈ కుర్రాడిని చూడాలనుకోవడమూ అలాంటిదే. ఐతే లీలకీ అది దైవసంకల్పం అయింది. వారి జీవితాలనే పూర్తిగా మార్చివేసింది.

సెంట్ లూక్ పబ్లిక్ స్కూల్‌కి 100 గజాల వరకూ ఎటువంటి చిల్లర దుకాణాలకూ తావులేదు. కాగా కొడైలో అతిఖరీదైన స్కూల్ అది. పిల్లల్ని చేర్చిన తల్లిదండ్రులు ఎవరికీ ఆ స్కూల్లో ప్రవేశించే అర్హత లేదు. పిల్లలతో సంబంధం లేని కొత్తవారు స్కూలు గేటు దాటి లోపల అడుగుపెట్టే ప్రసక్తి లేదు. స్కూలుకి కాస్త దూరంలో ముత్తులక్ష్మి అమ్మవారి చిన్న గుడి ఉంది. దానిముందు విశాలంగా పెరిగిన గానుగచెట్టు. దాని మొదట్లో చిన్న రాతి తిన్నె. అక్కడికి పడమరగా చూస్తే–సెంట్ లూక్ స్కూలంతా కనిపించదు కాని పిల్లలు ఆడుకునే మైదానం స్పష్టంగా తెలుస్తుంది. స్కూలు బస్సు దిగి–లోపలికి నడిచే పిల్లల దారి కనిపిస్తుంది.

అన్ని వందలమందిలో టెడ్డీ ఎవరు? లోనికి వెళ్లకుండా, ఎవరినీ వాకబు చెయ్యకుండా, ఆ కుర్రాడిని ఏనాడూ చూడని అబ్బుశాస్త్రి ఎలా కనుక్కుంటాడు? అసాధ్యమైనదాన్ని కరతలామలకం చేసుకోవడం ఈ సంస్కృతి మూల లక్షణం. ఈ సంస్కృతికి అంతశ్శుద్ధి, సాధన–తపస్సు.

రోజుల తరబడి గానుగచెట్టుకింద కూర్చున్నాడు అబ్బు. బెల్లు కొట్టగానే పువ్వుల్లాగ మైదానమంతా చెదిరిపోయే పిల్లల్ని చూస్తున్నాడు. ఈ ప్రయత్నం చీకటిలోకి విసిరిన రాయి.

ఒకరోజు 'టెడ్డీ' అనే పిలుపు మార్మోగింది. ఐదుమంది పిల్లల్లో ఓ ఎనిమిదేళ్ళ కుర్రాడు వెనక్కి తిరిగాడు. అంతే. అదే టెడ్డీని గుర్తుపట్టడానికి ప్రారంభం. టెడ్డీని నిజానికి గుర్తుపట్టడం కష్టంకాదు. లీల శరీరాన్ని కుదించి–చిన్న చొక్కా, లాగూ తొడిగి క్రాపింగు దిద్దితే టెడ్డీ. తల్లిలో ఉన్న ఠీవి, అందం, స్పష్టంగా కనిపించే హుందాతనం–అన్నీ పోతపోసినట్టు కుర్రాడిలో ఉన్నాయి. లీలలో లేని మరేదో కొత్తదనం, గొప్పదనం ఆ కుర్రాడిలో ఉంది. ఏమిటది? అబ్బుశాస్త్రి చూడని కొండ్రావుది. ఆరోజు అబ్బుకి పండగ. ఆ తర్వాత వందమందిలో ఒక్క టెడ్డీయే కనిపించేవాడు అబ్బుశాస్త్రికి. టెడ్డీని చూడాలనుకున్నాడు. చూశాడు. చూసి? ఆ కుర్రాడిని కలుసుకునే ప్రసక్తి ఎంతమాత్రం లేదు.

లీల జీవితంలో చాలా పోగొట్టుకున్నా చాలావాటిని భర్తీచేయగల మాతృత్వం

ఆమెకి దక్కినందుకు ఆనందపడ్డాడు అబ్బు శాస్త్రి. వచ్చిన పని అయిపోయింది. శుభం. ఇక తిరుగుప్రయాణానికి ఏర్పాట్లు చేసుకున్నాడు.

తెల్లారితే ప్రయాణం. ఆ సాయంకాలం ఉన్నట్టుండి అనుకోని దృశ్యం అబ్బుశాస్త్రిని తుళ్ళిపడేటట్లు చేసింది. వేదం శృతి. సంస్కృతం చాలా విస్తృతమైన భాష.

చిన్న హ్రస్వానికి, అతి చిన్న దీర్ఘానికి అర్థం మారిపోతుంది. ఉద్దేశం మారిపోతుంది. 200 సంవత్సరాల కిందట తమ దగ్గర నౌఖరీ చెయ్యడానికి పరాయి ప్రభుత్వం మనమీద రుద్దిన ఇంగ్లీషు భాష. ఆనాడు ఉపాధి కారణంగా ఆకర్షించింది. ఈనాడూ ఉపాధి కారణంగానే ఆకర్షిస్తోంది.

ఫోర్బ్స్ పత్రికలో వ్రాసిన వ్యాసంలో భాగమిది. "ప్రపంచంలో దాదాపు 98 శాతం భాషలకు సంస్కృతమే తల్లి. సంస్కృతం మాట్లాడడంవల్ల నోరు, గొంతు క్యాన్సర్‌లను నివారించవచ్చునని విదేశీయుల పరిశోధనలో తేలింది. ఆ కారణంచేతనే బ్రిటన్, జర్మనీ వంటి దేశాల్లోని ప్రపంచ ప్రఖ్యాత విశ్వవిద్యాలయాల్లో విద్యార్థులకు సంస్కృతాన్ని 'తప్పనిసరిగా' బోధిస్తున్నారు.

సంస్కృత వాఙ్మయంలో ప్రతి అక్షరానికీ ఒక అధిదేవత ఉంది. ఆ అధిదేవతను ఋషులు దర్శించారు. మొత్తం వర్ణమాలలోని 52 అక్షరాలకూ 52 మంది అధిదేవతలున్నారు. వారికి ఒక రూపం ఉంది. ఒక నామం ఉంది. వారికి శక్తి ఉంది. వారుకూడా శుభాల్ని చేకూరుస్తారు" ఈ మాటలు మన దేశంలో ఎవరు చెప్పినా వారు ఏదో పార్టీ ఛాందసులనే అవకాశం ఉంది. మరొక్కసారి ఇది చెప్పింది ఫోర్బ్స్ పత్రిక.

భాషలో చిన్న అపశ్రుతిని గుర్తించగల శక్తిని ఇనుమడింపజేసుకున్న, ఉపాసించిన అబ్బుశాస్త్రి–ఒక అపశ్రుతిని ఆనాడు టెడ్డీలో కనిపెట్టాడు.

పదిమంది పిల్లలు ఆనాడు మైదానంలో బంతాట ఆడుతున్నారు. అందులో తొమ్మిదిమంది అబ్బుశాస్త్రికి కనిపించటంలేదు. ఒక్క కుర్రాడే విశ్వరూపంతో కనిపిస్తున్నాడు– టెడ్డీ. ఆడుతూ ఆడుతూ టెడ్డీ అంతలో ఉన్నట్టుండి మైదానం పక్కనే ఉన్న సిమెంటు బెంచీమీద కూర్చుండిపోయాడు. అతని తల రెండు చేతుల్లో ఉంది. అతన్ని ఎవరూ గమనించలేదు. ఎవరి ఆటలో వారున్నారు. అబ్బు గమనించాడు. ఒక్క క్షణం తుళ్లిపడ్డాడు.

ఐదు నిముషాలు గడిచాయి. ఇప్పుడు మెల్లగా టెడ్డీ లేచాడు. నలుగురితో కలిసిపోయాడు. క్లాస్‌రూమ్‌వేపు పరిగెత్తాడు. ఇదేమిటి?

ఆ రాత్రి మర్నాటి రైలు టికెట్టు కాన్సిల్ చేసుకున్నాడు అబ్బు. తర్వాతి 15

రోజుల్లో–కనీసం మూడుసార్లు అందరినీ వదిలి టెడ్డీ అలా చతికిలబడడం గుర్తించాడు. ఒక్కసారి–ఒకే ఒక్కసారి పిల్లలందరూ వెళ్లిపోయారు. టెడ్డీ సిమెంటు బల్లమీద ఒంటరిగా మిగిలాడు. మరో పది నిముషాలకు ఓ ఆడపిల్ల బయటికి వచ్చి చుట్టూ చూసింది. టెడ్డీ కనిపించాడు. అతని దగ్గరికి పరుగున వచ్చింది. భుజంమీద చెయ్యి వేసింది. ఇప్పుడు టెడ్డీ లేచాడు. ఇద్దరూ చెట్టాపట్టాలు వేసుకుని స్కూలువేపు నడిచారు.

ఆ క్షణంలో–ఆ కుర్రాడి పక్కన అమ్మాయి గుర్తించనిది అబ్బుశాస్త్రి గుర్తుపట్టాడు. టెడ్డీ కనీసం ఇరవై నిముషాలు స్పృహ తప్పాడు. ఇప్పుడు ఏం చెయ్యాలి? అసలు సమస్య ఏమిటి? ఎవరు తెలుసుకోగలుగుతారు?

శని, ఆదివారాల్లో సెంట్ లూక్ పిల్లలు కొడై లేక్ చుట్టూ పరుగులుతీస్తారు. యాత్రికులకు మరింత దగ్గరగా కనిపిస్తారు. ఆరోజుల్లో అబ్బు గుర్తుపట్టిన విషయం–టెడ్డీ లీల అంత అందంగా ఉన్నాడు. లీలలాగే హుందాగా ఉన్నాడు. కాని లీల అంత ఆరోగ్యంగా లేడు. ముఖం పాలిపోయి ఉంది. శరీరంలో పసితనం ఇచ్చే ఉత్సాహం ఉంది. కాని స్ఫురణకి అందని ఏదో లోపం ఉంది. దానికి కారణం? ఎలా గుర్తుపట్టడం? ఆ ప్రశ్నకి సమాధానం మరో 11 రోజులకి దొరికింది అబ్బుశాస్త్రికి.

ఆనాడు కొడై మేఘావృతమై ఉంది. కొడైలో వర్షం అసాధారణం కాదు. కొడై అంటే తమిళంలో గొడుగు. బయటికి వచ్చిన మనిషిని కొడైలో 'కొడై' అత్యంత అవసరమని నానుడి. వారాంతంలో పిల్లలు యధాప్రకారంగా కొడైకెనాల్ లేక్ దగ్గర గెంతులువేస్తున్నారు... నీటిలో తడిసిన లేక్ అంచులు జారుడుగా ఉన్నాయి. యాత్రికుల ముమ్మరం ఎక్కువగా ఉంది. అబ్బుశాస్త్రి యధాప్రకారంగా టెడ్డీనే గమనిస్తున్నాడు.

టెడ్డీ వెనకే గెంతుతూ పరిగెత్తుకువస్తున్న పువ్వులాంటి అమ్మాయి–అలనాడు స్కూలు మైదానంలో టెడ్డీ భుజంమీద చెయ్యివేసి నడుపుకుపోయిన అమ్మాయి–గెంతి నేలమీద వేసిన అడుగు వర్షంలో తడిసిన మెత్తపడిన లేక్ అంచు మట్టిమీద వేసింది. మట్టి ఆ బరువుకి ప్రిదిలి నీటిలోకి జారిపోయింది. మట్టితోపాటు ఆమె కాలూ జారిపోయింది. లేక్‌లో పడిపోయింది. బయటపడాలని ఆ అమ్మాయి చేతులు టపటపలాడిస్తోంది. అలవాటులేని ఆ చేతుల విసురు ఆమెని లేక్ మధ్యకి లాక్కుపోతోంది. చుట్టూ ఉన్న తామరాకులు ఆమెని చుట్టేశాయి. మరోక్షణంలో మునిగే పిల్లని ఆ ఆకులు కప్పేసేవి–కనిపించకుండా. అబ్బుశాస్త్రి అది గమనించాడు. వెంటనే మెరుపులాగ లేచాడు. చిన్ననాడు ముక్కామల తుల్యభాగలో ఈతలుకొట్టిన కుర్రాడైపోయాడు. మరో ఆలోచన లేకుండా సరస్సులోకి దూకాడు. అబ్బు దబ్బున పడిన శబ్దం అందరినీ తుళ్లిపడేటట్లు చేసింది.

యాత్రికులు నివ్వెరపోయి ఆగిపోయారు. స్కూలు పిల్లలు గావుకేకలుపెట్టారు. టీచర్లు బిత్తరపోయి పిల్లల్ని వెదుక్కున్నారు. అప్పటికి వారికి అర్థమైంది. తమ స్టూడెంటే సరస్సులోకి జారిపోయిందని. టీచర్లు హాహాకారులు చేశారు. నీరు మింగి దాదాపు స్పృహ తప్పిపోయిన పిల్లని భుజంమీద వేసుకుని ఒడ్డుకి చేరాడు అబ్బు. యాత్రికులు ఆనందంతో చప్పట్లు కొట్టారు. అబ్బు భుజాన్ని ఎవరో అరవంలో మెచ్చుకుని తట్టారు. ఒకాయన కారు తీసుకువచ్చి ముందు నిలబెట్టాడు.

అబ్బు శాస్త్రి అమ్మాయితోనే కారు ఎక్కాడు. స్కూలు టీచర్లు వ్యాన్‌తో వెనుక బయలుదేరారు. 'వాన్ ఎలెన్ హాస్పిటల్' ఎమర్జెన్సీలో కారాగింది. అబ్బుశాస్త్రితో పాటు కారు ఓనరూ లోపలికి పరిగెత్తాడు–అమ్మాయిని తీసుకుని. చికిత్స ప్రారంభమైంది. ఈలోగా స్కూల్ వ్యాన్ వచ్చి ఆగింది. ప్రిన్సిపాల్, టీచర్‌లు–అందరూ దూసుకువచ్చారు.

మరో అరగంటకి అమ్మాయి తెప్పరిల్లింది. కళ్లిప్పింది. అందరి ముఖాలూ ఆనందంతో వెలిగిపోయాయి. పిల్లలు చప్పట్లు కొట్టారు. స్కూలు ప్రిన్సిపాల్, టీచర్లు అబ్బుశాస్త్రికి అర్థంకాని భాషలో కృతజ్ఞతలు ఒలకబోశారు.

"రొంబ థ్యాంక్స్"

"గాడ్ బ్లెస్ యూ"

"నీ పేరేమిటి?"

"ఏ వూరు?"

ఒకటే ప్రశ్న అడిగాడు అబ్బుశాస్త్రి. "ఆ పాప పేరేమిటి?"

"జాస్మిన్" అన్నాడు టెడ్డీ.

కుర్రాడి గొంతు అబ్బుకి మరింత సువాసనలు విరజిమ్మింది. ఎప్పుడూ దొరకని అవకాశం అబ్బుశాస్త్రికి దొరికింది. జాస్మిన్‌ని కాదు–టెడ్డీ బుగ్గ పుణికి తృప్తిగా ముద్దుపెట్టుకున్నాడు.

❖ ❖ ❖

చెట్టియార్ పార్క్ దాటాక–చిన్న గల్లీలో ఓ గదిని అద్దెకి తీసుకున్నాడు అబ్బుశాస్త్రి. ఆ సందులోకి సైకిలుతప్ప ఏ వాహనమూ రాదు. మర్నాడు ఉదయం పది గంటలకి ఓ మనిషి వచ్చి తలుపు తట్టాడు. ఇప్పటికి కాస్త తమిళం అర్థం చేసుకోవడం అలవాటుచేసుకున్నాడు అబ్బుశాస్త్రి. అతిమర్యాదగా నమస్కారం చేశాడు ఆ మనిషి.

"మీకోసం అయ్యగారొచ్చారయ్యా" అన్నాడు. ఎవరా అయ్యగారు? రోడ్డుమీద

పెద్ద ఓడలాంటి కారు ఆగి ఉంది. కారులోంచి భార్యాభర్తలు దిగారు. భార్య ఏడుస్తోంది. భర్త గంభీరంగా ఉన్నాడు. అబ్బు రెండు చేతులూ పట్టుకుని కృతజ్ఞతలు చెప్పాడు. భార్య అమాంతం అతని కాళ్ళమీద పడి నమస్కారం చేసింది.

ఆయన బొంబాయిలో పెద్ద జిప్ ఫాసనర్స్ పరిశ్రమను నడుపుతున్న వ్యాపారి. పేరు ముకుల్ శిశోదియా. ప్యాంటులకు, సంచులకు, పెట్టెలకు, పెద్దపెద్ద ప్లాస్టిక్ రేపర్లకీ, ఫ్రిడ్జిలకు–ఒకటేమిటి అన్నిటికీ అవసరమైన జిప్స్ హోల్‌సేల్ ఉత్పత్తిదారుడు ముకుల్ శిశోదియా. అతని ఒక్కగానొక్క కూతురు జాస్మిన్.

"మా పాపని కాపాడారు. మీకేం చేసినా రుణం తీరదు. చెప్పండి. మీకు ప్రాణం ఇమ్మన్నా ఇస్తాను" అన్నాడు శిశోదియా ఇప్పుడు కళ్ళనీళ్ళపర్యంతం అయి. బొంబాయిలో ఉన్న పారిశ్రామికవేత్త దక్షిణాదిన ఇంత దూరంలో ఉన్న పబ్లిక్ స్కూల్‌లో తన బిడ్డని ఎందుకు చేర్చాడు? ఈ స్కూలు స్థాపకులలో ఆయన తాతగారు ఒకరు కనుక. ఆ స్కూలు ఫౌండర్ చైర్మన్ పదవి అతని వారసత్వం.

ముకుల్ శిశోదియా మార్వాడీ. గొప్ప దైవభక్తుడు. అబ్బుశాస్త్రిని చూసి, అతను వేదపండితుడని అర్థం చేసుకుని ఇంకా మురిసిపోయాడు. ముకుల్ నుదుటిన గంధం, కుంకుమ, అక్షింతలు కలిసిన బొట్టు.

ఓడంత కారులో ముకుల్ శిశోదియాతో కలిసి అబ్బుశాస్త్రి 'వాన్ ఎలన్' ఆసుపత్రికి వచ్చాడు. జాస్మిన్ తల్లిదండ్రుల్ని చూసి లేడిపిల్లలాగ చెంగుచెంగున గెంతింది. మధురై విమానాశ్రయంలో దిగి కారులో సరాసరి వచ్చి–బిడ్డని చూడడానికెళ్ళలేదు శిశోదియా దంపతులు. బిడ్డని బతికించిన పుణ్యమూర్తికి కృతజ్ఞతలు చెప్పుకుని అతనితో వచ్చారు. ఇప్పుడు వాళ్లు మొదటిసారి కూతురిని చూస్తున్నారు. తల్లి ముఖం ఆనందంతో కలువపువ్వయిపోయింది. శిశోదియా బిడ్డని ఎత్తుకుని పసివాడైపోయాడు. అందరూ కలిసి కారులో సెంట్ లూక్ పబ్లిక్ స్కూల్‌కి వచ్చారు.

మొట్టమొదటిసారిగా స్కూలు ఆవరణలోకి అడుగుపెట్టాడు అబ్బుశాస్త్రి. "చెప్పండి పండిట్ జీ! నన్నేం చెయ్యమంటారో?" అనడిగాడు ముకుల్ శిశోదియా చైర్మన్ కుర్చీలో కూర్చొంటూ.

ఏం అడగాలో ముందే నిర్ణయించుకున్నాడు అబ్బు శాస్త్రి. స్కూలు పిల్లలందరికీ ప్రతినెలా వైద్యపరీక్షలు చేస్తారు. వారి ఆరోగ్య వివరాలు పొందుపరిచే రిపోర్టులుంటాయి. వాటిని ఆ పిల్లల తల్లిదండ్రులుతప్ప మరెవరికీ చూసే అవకాశం లేదు. చూసే హక్కు లేదు.

'టెడ్డీ మెడికల్ రిపోర్ట్‌లో ఏముందో తెలిపితే చాలు" అనడిగాడు అబ్బు.

ప్రిన్సిపాలు ఒక్కసారి తటపటాయించింది. స్కూల్ రూల్స్ ప్రకారం ఏ కుర్రాడి రిపోర్టులూ ఇంకొకరు చూసే హక్కు లేదు. కాని ఇది అసాధారణమైన సందర్భం. అడిగింది–ఒక బిడ్డ ప్రాణాన్ని రక్షించిన వ్యక్తి. అడిగింది స్కూలు యాజమాన్యాన్ని. ఐనా ప్రిన్సిపాల్ తొణకలేదు. టెడ్డీ మెడికల్ రిపోర్ట్ చూసి వచ్చి "కుర్రాడిలో రక్తం తక్కువగా ఉంది. ఎనిమిక్‌గా ఉన్నాడు" అంటూ రిపోర్టులో టానిక్ రాశారు" అని చెప్పింది.

అంతకన్నా అక్కడెవరూ ఆ కుర్రాడు ఆరోగ్యాన్ని లోతుగా పరిశీలించలేదు. ఆ విషయం అర్థమైంది. లేచాడు అబ్బు. తన హ్యాండ్‌బ్యాగ్ తీసి సందేహిస్తూనే పెద్ద నోట్లబొత్తి తీశాడు ముకుల్ శిశోదియా. అబ్బుశాస్త్రికి ఇవ్వబోయాడు. అబ్బు నవ్వి అక్కర్లేదని తలూపాడు. ఇప్పుడు పర్స్ తీసి తన విజిటింగ్ కార్డ్ తీశాడు ముకుల్ శిశోదియా.

"ఎప్పుడే అవసరంవచ్చినా ఫోన్ చెయ్యండి... నేను స్వయంగా వస్తాను" అన్నాడు.

అబ్బుశాస్త్రిని స్వయంగా కారెక్కించి–ఇంటిదగ్గర స్వయంగా దింపి వెళ్లాడు ముకుల్ శిశోదియా.

## 37

వ్యక్తి బలహీనమైతే రక్తంలోని రోగాలు తిరగబడతాయి. మనస్సు బలహీనమైతే మెదడులోని చీకటి కోణాలు తిరగబడతాయి. సంవత్సరాల తరబడి లైంగికమైన వ్యాపకంతో సతమతమైన తల్లి–ఓ భయంకరమైన విషాదంలో ఊహించని డిప్రెషన్‌లో పడిన శరీరంలో పెరిగిన పిండం–ఆ శరీరపు అవలక్షణాల్ని చాలావాటిని పుణికి పుచ్చుకొని ఉంటుంది. పోషణ, పెరుగుదల, నేపథ్యం ఎంతో కొంత వాటి చాయల్ని రూపుమాపగలిగినా–బలహీనతకు బలం కలిసివస్తే–నెమ్మదిగా ఆ రోగం నిలదొక్కుకుంటుంది. అది చూడగానే గుర్తుపట్టేది కాకపోవచ్చు. చూడకపోయినా విజృంభించకుండా ఆగేది కాదు.

టెడ్డీ చేసుకున్న అదృష్టం పేరు అబ్బు. ఆ కుర్రాడి శరీరంలో లీలగా కనిపించిన అపశృతిని హెచ్చరికగా గుర్తుపట్టాడు. విషయాన్ని ఫోన్‌లో విని రామశర్మ నవ్వేశాడు "1400 సంవత్సరాల కిందట ఈ దేశంలో ఈ రోగాన్ని గుర్తుపట్టాడు ఒకాయన. చికిత్సని స్పష్టంగా తేల్చిచెప్పేశాడు. ఆయన పేరు చరకుడు. మీరు వేదం చదువుకున్నారు. చరకసంహిత చదువుకున్నవారి కాళ్లు పట్టుకోండి"

"ఎక్కడ ఉంటారు ఆ మహానుభావులు?"

"నాకు తెలీదు. కాని తెలిసున్న ఓ మనిషి తెలుసు. అల్లోపతీలో గొప్ప వైద్యులు

డబ్బుకీ, పరపతికీ దొరుకుతారు. వాళ్లని తక్కువచేయడం ఉద్దేశం కాదు–ఆ వైద్యానికి ప్రస్తుతం ఉన్న వ్యాప్తి అది. కాని చరకసంహితని విప్పేవారు–వెదికి పట్టుకుని, సేవ చేస్తేకాని లొంగరు. ఒకరు వైద్యాన్ని అమ్ముతారు. మరొకరు వైద్యాన్ని నమ్మినవారికి మాత్రమే అందజేస్తారు. విజ్ఞానం కన్యాదానంకన్నా గొప్పది. నాకు తెలిసిన ఓ మిత్రుడు రేపు మీకు ఫోన్ చేస్తాడు" అని ఫోన్ పెట్టేశాడు రామశర్మ.

మరునాడు ఫోన్‌కోసం ఇరానీ హోటల్ దగ్గర కనిపెట్టుకుని ఉన్నాడు అబ్బుశాస్త్రి. ఫోన్ వచ్చింది. చేసిన వ్యక్తి శ్రీమత్తిరుమల నరసింహాచార్య. చరకసంహితని గురువుగారి పాదాల దగ్గర సాగిలబడి వృత్తిగాకాక ప్రవృత్తిగా ఒడిసిపట్టుకున్నాడు. అబ్బు శాస్త్రి చెప్పిందంతా విని అన్నాడు–

"ఈ రోగం చాయలు గుర్తుపట్టగలను. అప్పుడప్పుడు శరీరం వశం తప్పడం, ఒక్కోసారి కాసేపు స్పృహ తప్పడం–ఇవన్నీ ప్రాథమిక దశలో ఈ రోగం సూచనలు. ఇది రేపు ముదరబోయే రోగానికి ప్రాతిపదిక. చరకసంహితలో దీన్ని కామిల, కుంభకామిల అన్నారు (బహుశా పలుకుబడిలో నలిగి 'కామెర' అయిందేమో!) స్థూలంగా పాండురోగమంటారు. అల్లోపతీలో దీనికో పేరు ఉంది. విల్సన్ రోగం. ఆ రోగాన్ని కనిపెట్టిన డాక్టరు పేరు అది. ఈ దశలో చికిత్సను నేను చెప్పగలను. వాత, పిత్త, కఫములకు సంబంధించిన ఎన్నో రకాల కామిల రోగాలు ఉన్నాయి. ఐతే పరీక్షకు కుర్రాడిని తీసుకురాలేరంటున్నారు. కనుక–ఇప్పట్లో నేను చేయగలిగిందేమీ లేదు. కాకపోతే రోగిని చూడగానే రోగాన్ని నిర్ధారించగల కొన్ని లక్షణాలున్నాయి. చరకసంహితుడు ఒడిసిపట్టుకున్న మా గురువుగారిని ఆశ్రయించగలిగితే మీకు ఆపద్ధర్మాన్ని చెప్పగలరు..." అన్నారు.

"ఎక్కడ ఉంటారు, మీ గురువుగారు?"

"ఆయన కేరళలో కోజీకోడ్‌లో ఉంటారు. మావూళ్ల శశిపూర్ణనంబూద్రి పేరు. ఆయన గురువుగారు పదేళ్ల క్రితం సన్యసించారు. పూర్వాశ్రమంలో ఆయన భిషగ్రత్న ధనంజయ త్రిపాఠీ. ప్రస్తుతం హృషీకేశ్‌లో చాతుర్మాస్యదీక్షలో ఆయనాశ్రమంలో ఉన్నారు. మా గురువుగారు ఈ సమయంలో అక్కడే ఉండి తన గురువుగారి శుశ్రూషచేసి వస్తారు. చేతనైతే మీరు వెళ్లండి. మీ అదృష్టం బాగుంటే పని జరుగుతుంది" ఫోన్ పెట్టేస్తూ మరొక హెచ్చరిక చేశాడు నరసింహాచార్య.

"ఇప్పటి గవర్నమెంటు డిగ్రీల్లాగ విద్య హక్కు కాదు. మీ వినయంతో, సేవతో, శ్రద్ధతో, విశ్వాసాన్ని చూపించి, ఒప్పించి, మెప్పించి ఆర్జించుకోవాలి. ఇవి డబ్బు ఇచ్చి నేర్చుకునే చదువులు కావు. ఇంట్లో ఉంచుకుని, తన బిడ్డలాగ సాకి, అన్నం పెట్టి,

ఆదరించి తనంతటివాడిని చేసే చదువులు. జాగ్రత్త. ఒక్క తప్పటడుగు వేసినా పని జరగదు. మా గురువుగారు శశిపూర్ణనంబూద్రిగారు ముక్కోపి. నైష్ఠికుడు. విషయం రాబట్టగలిగితే పసివాడికి ప్రాణం పోసినట్టే. నాది గ్యారంటీ" ఫోన్ పెట్టేశాడు. రోగానికి మందు చెప్పమంటే సంజీవి పర్వతానికి అడ్రసు చెప్పాడు. ఐనా నిరుత్సాహపడలేదు అబ్బుశాస్త్రి.

❖ ❖ ❖

గంగానదికి ముఖద్వారమైన హరిద్వారానికి 25 కిలోమీటర్లు హృషీకేశ్. నరసింహాచార్య మాటలు మర్చిపోలేదు అబ్బుశాస్త్రి. హృషీకేశ్‌లో దిగేనాటికి గెడ్డం పెరిగింది. తల మాసింది. మళ్లీ చయనులుగారి గురుకులం నాటి అంగవస్త్రం, పైపంచె వేసుకున్నాడు. చలి విపరీతంగా ఉంది. కాని లోపల కుతకుతలాడుతున్న కర్తవ్యదీక్ష శరీరాన్ని సమతలంగా ఉంచుతోంది.

హృషీకేశ్ నిండా ఎన్నో ఆశ్రమాలు, ఎన్నో ధర్మశాలలు. పరమార్థ నికేతన్ ఆశ్రమం, స్వర్గ ఆశ్రమం, స్వామి నారాయణ్ ఆశ్రమం, గీతా ఆశ్రమం–ఇవన్నీ పేరున్న పెద్ద పెద్ద ఆశ్రమాలు. వయస్సు గడిచాక, సన్యాసాన్ని స్వీకరించి ఏకాంతంగా జీవనం గడుపుతూ గంగానది ఒడ్డునే తనువుచాలించాలనుకునే ముముక్షువులు కొల్లలు. వారు ఏదో ఆశ్రమం నీడన తనువు వెళ్లబుచ్చుతారు. ఎవరో పుణ్యాత్ముడు ఒక్కముద్ద అన్నం పెడతాడు. ఒక పేరు తెలియని యాత్రికుడు ఓ పండు చేతిలో పెట్టి నమస్కరిస్తాడు. దొరకనినాడు బాధపడడు. దొరికినప్పుడు భుజిస్తాడు.

❖ ❖ ❖

రామ్‌ఝూలా అద్దరికి–గంగ ఒడ్డున కొంత దూరం ప్రయాణం చేస్తే–ఉరకలు పరుగులుతీసే నదిని ఒరుసుకుంటూ అతని చిన్న ఆశ్రమం ఉంది. దానికి పేరు లేదు. ఆశ్రమవాసి పేరు చిలకల స్వామి. ఎప్పుడో అక్కడికి చేరి–తన స్వార్జితంతో చిన్న జాగాను కొనుగోలుచేసి–తన గుడిసె పోను ఐదారు జామచెట్లు నాటాడు. చిలకలకి ఆ ఆశ్రమం నెలవు. రోజులు, వారాల తరబడి హృషీకేశ్‌లో ఉన్నవారికి చిలకల స్వామి ఆశ్రమం–వందలాది చిలకలు–ఇంట్లో మనుషుల్లాగ–ఆ ఆశ్రమమంతా తిరుగుతూండడం గొప్ప దృశ్యం. వాటి అరుపుల్నీ, అవి తిని పడేసే పళ్లనీ, రెట్టల్నీ–రోజంతా శుభ్రంచేస్తారు స్వామి శిష్యులు. ఆయన ఒకప్పుడు ఉత్తర భారతదేశంలో పేరు ఉన్న భిషగర్వుడు. ఇప్పుడు కేవలం సన్యాసి. ఎవరికీ ఏమీ చెప్పడు. అక్కడికి వచ్చినవారు ఆయన్ని ఏమీ అడగరు. దేశం నలుమూలలనుంచీ ఆయన హస్తవాసికి బతికి బట్టకట్టిన, ఆయన

దగ్గర విద్య నేర్చుకున్న–ఇప్పటి గొప్ప వైద్యులూ వచ్చి–ఆయనకన్నా ఎక్కువగా చిలకలకి సేవచేసి వెళ్లారు. ఆయన ఆశ్రమం ప్రశాంతంగా ఉండదు. చిలకల అరుపుల్తో గగ్గోలుగా ఉంటుంది. ఇదేమిటి? ఇంత దూరం వచ్చి–ఈ దశలో–ఈ గోలని భరించడానికా? నవ్వుతారు స్వామి. "చిలుకలు నా సాధనకి పరీక్షలు. వాటి శబ్దాల్ని దాటి నిశ్శబ్దంలోకి వెళ్లగలిగితే–ఆ పరీక్షలో నేను నెగ్గినట్టే"

వందలాది చిలుకల మధ్య నిశ్శబ్దాన్ని అన్వేషించే ఏకాంత స్వామి ధనంజయ త్రిపాఠీ, భిషగ్ రత్న, రిటైర్డ్ ప్రిన్సిపాల్, ఆయుర్వేద మహా పరిషత్, జలంధర్ ఉరఫ్ చిలకల స్వామి.

చిలకల స్వామి ఆశ్రమాన్ని కనుక్కోవడం హృషీకేశ్‌లో పెద్ద కష్టం కాదు. నిజానికి అది చిన్న యాత్రా స్థలం. టూరిస్ట్ గైడ్‌లు కూడా అడుగుతూంటారు "పేరట్ స్వామి, కిలీ స్వామీ, తోతా స్వామిని చూస్తారా?" అంటూ.

చిన్న యాత్రికుల బృందంతో రామ్‌ఝూలా దాటి ఆశ్రమానికి నడిచాడు అబ్బుశాస్త్రి. ఇరవై గజాల ముందునుంచే ఆశ్రమం కోలాహలం తెలుస్తోంది. వచ్చిన యాత్రికులు కూడా ఆ పరిసరాల్ని శుభ్రంచేయడంలో పాల్గొంటారు. ఒక్క ధనంజయ త్రిపాఠీ వినా అందరూ మామూలు దుస్తులలోనే ఉన్నారు. ఆశ్రమానికి నియమావళి లేదు. కాషాయ వస్త్రాలు కట్టుకోవాలనే పట్టింపూ లేదు.

కనుక–వెంటనే శశిపూర్ణనంబూద్రిని గుర్తుపట్టడం కష్టమైంది. కాని తలమీద ఎడమవేపు కొప్పున్న స్వామి కాస్తలోనే దొరికిపోయాడు. చీపురుతో ఆ ప్రాంతాన్ని శుభ్రంచేస్తున్న అతని దారిలో నిలబడినందుకే చురచురలాడిపోయాడు.

నంబూద్రి సూటిగా అబ్బుశాస్త్రిని చూసి "కః?" (ఎవరు?) అన్నాడు సంస్కృత భాషలో.

అబ్బు రెండు చెవులూ పట్టుకుని, తల వొంచి ప్రవర చెప్పుకున్నాడు :

'చతుస్సాగర పర్యంతం గోబ్రాహ్మణేభ్యః శుభం భవతు కౌండిన్యస గోత్రః వాశిష్టమైత్రావరణ త్రయారుషేయ ప్రవరాన్వితా కౌండిన్యస గోత్రః ఆపస్థంభ సూత్రః కృష్ణయజుశ్శాఖాద్యాయీ అబ్బుశాస్త్రి అహంభో అభివాదయే'

ప్రవర విన్నాక కాస్త ఉపశమించాడు నంబూద్రి. కాని కోపం తగ్గలేదు.

"కిమర్థమత్ర ఆగతః అసు?" (ఇక్కడికి ఎందుకు వచ్చావు?) అన్నాడు శశిపూర్ణ నంబూద్రి.

నరసింహాచార్య మాటలు వెంటనే గుర్తుకొచ్చాయి. "భవతః సేవార్థం" (మీ సేవ

చేసుకుందామని).

నంబూద్రి మరో మాట లేకుండా చేతిలో ఉన్న చీపురుని అబ్బుశాస్త్రికి అందించాడు. తాను మరో చీపురు అందుకున్నాడు. ఆ పూటకి వాళ్ళిద్దరి మధ్యా అంతే సంభాషణ.

సాయంకాలం రామ్‌ఝూలా దాటి అఖిలాండేశ్వరి ఆలయాన్ని దర్శనం చేసుకుని-త్రైగుణ్యమఠంలో తాము రొట్టెలు తిని-రాలేని ఆశ్రమవాసులకూ, ధనంజయ త్రిపాఠీకి రొట్టెలు తెచ్చారు శిష్యులు.

ఉదయాన్నే గంగాస్నానం, గాయత్రి, అనుష్ఠానం. ఫలహారం ఏమీ ఉండదు. మంచుకొండల మధ్యనుంచి పారే అతి చల్లని గంగమ్మే ప్రాణధాతువు. మూలశక్తి. ఆ వాతావరణంలో ప్రాణవాయువు ప్రాణం పోసుకుంటుంది. అక్కడ గాలి తిని జీవనం సాగించవచ్చు. హృషీకేశ్‌లో ఆకలికి అర్థం పరాధీనత. ధర్మచింతన కారణంగానే వితరణ. కావలసినవారికి సమస్త సదుపాయాలూ గల ధర్మశాలలూ, హోటళ్ళూ ఉన్నాయి. గంగ అందరి లక్ష్యాన్నీ ఏకీకృతం చేస్తుంది. వ్యక్తి ఉనికికి అర్థాన్ని చెరిపేసి వ్యవస్థ ఔన్నత్యానికి అద్దంపడుతుంది. సంస్కృతీ వైభవానికి నిశ్శబ్ద భాష్యం హృషీకేశ్.

పది రోజులు పైగా తాను వచ్చిన పని మర్చిపోయాడు అబ్బుశాస్త్రి. నంబూద్రిని కంటికొసల్లో కనిపెడుతూ-ఆయన చెయ్యాలనుకున్న పనిని చేసేలోగానే అందుకున్నాడు. గంగాస్నానానికి వెళితే వెంట నడిచాడు. ఆ ప్రవాహవేగంలో మునగలేని నంబూద్రికి నీళ్ళు తెచ్చిపెట్టాడు. చిన్న మడుగుని ఆ ప్రాంతంలో పక్కకి తిప్పారు-తమ అవసరాలకి.

అక్కడి గంగ మన అవసరాలను ఎరిగి తీర్చే అమ్మ. పర్వత సానువులలోంచి మంచును కరిగించుకుని ఖనిజసంపదని సంతరించుకుని చల్లగా ప్రవహించే గంగమ్మ హోరు అల్లంత దూరానికి తెలుస్తుంది. శ్రద్ధగా చెవియొగ్గి వింటే వందమంది వటువుల వేదపారాయణంలాగ వినిపిస్తుంది. మనిషి తరించడానికి మర్మార్థాన్ని బోధిస్తున్నట్టుంటుంది. నేనున్నానని హామీ ఇస్తున్నట్టుంటుంది. లోకాన్ని ఉద్ధరించడానికి తొందరపడుతున్నట్టుంటుంది. అక్షరం అవసరంలేని ఆశీర్వాదంలాగ ఉంటుంది.

పదో రోజున బాదం ఆకులో రొట్టెను వడ్డిస్తూ నిలబడిన అబ్బుశాస్త్రిని మొదటిసారిగా అడిగాడు శశిపూర్ణ నంబూద్రి. "కుతః త్వం ఆగతః?" (ఏ ఊరు నుంచి వచ్చావు?)

ఎన్ని ఊర్లు చెప్పగలడు అబ్బు? రాజమండ్రి, కొవ్వూరు, హైదరాబాదు, కొడైకెనాల్. కాని తనని ద్విజుడిని చేసిన పవిత్ర క్షేత్రం ఒక్కటే-ముక్కామల. చెప్పాడు.

నంబూద్రి ముఖంలో ఆశ్చర్యమూ, ఆనందమూ పొటమరించింది. "కర్రా వేంకట శ్రీనివాస పెదచయనులు" అని ఆగిపోయాడు నంబూద్రి. అబ్బుశాస్త్రి కళ్ళవెంట ధారలు

కట్టాయి. తటాలున వంగి ఆయన పాదాలకు నమస్కరించాడు. "తే మను పితృపాదః" (వారు మా తండ్రిగారు) నంబూద్రి ముఖంలో వాత్సల్యం పొడచూపింది.

"వారు మా గురువుగారికి గురువు. తైత్తరీయం చెప్పారు" గతంలోకి దృష్టి సారించి "నువ్వు మా పెద్ద గురువుగారి కొడుకువన్నమాట" భుజం తట్టారు. "శుభం. విద్య నీ హక్కు" అంటూ చపటామీద వాలి నిద్రకి ఉపక్రమించారు. వేదవిద్యకి అన్నీ దగ్గరతోవలు. ఎటు వెళ్ళినా–ఆ వృక్షఛాయలు విస్తరించే ఉంటాయి. భారతదేశాన్ని ఏకీకృతంచేసిన రెండు గొప్ప వైభవాలు–విద్య, సంస్కారం. ఈ రెండూ కలిస్తే సంస్కృతి.

ఆరోజుల్లో అప్లికేషన్ పెట్టుకునేవారికి అమ్మేది కాదు విద్య. రాను రాను పాశ్చాత్య ప్రభావం పెరిగి–ఆర్ష వైభవంమీదా, శాస్త్రంమీదా గురి, భక్తి, విశ్వాసం సన్నిగిల్లి హేళన పెరిగిపోయింది. శిష్యుడిమీద పూర్తి నమ్మకం కలిగేదాకా పెదవి కదపడు గురువు. సారవంతమైన నేలలోనే విత్తు వేయాలి. వేసేముందు కలుపుమొక్కలు ఉంటే తొలగించాలి. మనస్సుని ఆకర్షించే అయస్కాంతంలాగ సానబెట్టాలి.

మరో రెండు రోజులకి అడిగారు నంబూద్రి "ఎందుకొచ్చావు?" అని.

సమాధానాన్ని పదిసార్లు మనస్సులోనే మననం చేసుకున్నాడు.

"చరకంలో కామిలవ్యాధి లక్షణాల్నీ, చికిత్సనీ తెలుసుకోవాలని"


నంబూద్రి ఆశ్చర్యపోయాడు. ఇతను శాస్త్రంకోసం రాలేదు. ఒక శాఖని పఠించడానికి రాలేదు. ఒక వ్యాధి గురించి తెలుసుకోడానికి వచ్చాడు. అక్కడితో అతని లక్ష్యం పూర్తవుతుంది.

"ఎందుకు?"

అబ్బు తన కథంతా చెప్పాడు. ఓ అనాథ స్త్రీ కొడుకుని కాపాడడానికి–ఈ మనిషి ఇంత దూరం ప్రయాణంచేసి వచ్చాడని విని పొంగిపోయాడు. అర్హతకోసం పెట్టిన పరీక్షలో 95 శాతం మార్కులు సంపాదించేశాడు అబ్బుశాస్త్రి. ఆ రాత్రినుంచే పాఠం మొదలెట్టాడు నంబూద్రి. ఆయన చెప్పిన వ్యాధి లక్షణాలను తన అనుభవంతో పోల్చుకుంటూ–అక్కర్లేని సమాచారాన్ని మనస్సులోనే అటకెక్కించేస్తున్నాడు అబ్బుశాస్త్రి.

కామిల లక్షణాలు–తను చూసిన, గుర్తుపట్టిన లక్షణాలు–సరితూగాయి. చికిత్సనీ సమగ్రంగా వివరించారు గురువు. మనస్సులోనే పఠం కట్టుకున్నాడు. వచ్చి 22 రోజులైంది. వచ్చిన పని ఒక దారికి వచ్చింది.

బయలుదేరడానికి సెలవు కోరాడు. అంతవరకూ ప్రతిరోజూ చూస్తున్న చిలకల స్వామి అబ్బుశాస్త్రిని పలకరించలేదు. శశిపూర్ణ నంబూద్రి అబ్బుని ఆయన సమక్షంలో



**కామిల వ్యాధి ఉన్న కన్ను**

నిలిపి చయనులుగారిని గుర్తుచేశాడు.

చిలకల స్వామి ముఖం ప్రసన్నమైంది. మనస్సులోనే గురువుకి అభివాదం చేసుకున్నాడు. ఎదుట నిలిచిన గురుపుత్రుని బుగ్గలు నిమిరారు.

"మనిద్దరం అన్నదమ్ములమ"న్నారు స్వామి. తన పక్క గొంగళీలోంచి ఒక రుద్రాక్షమాల తీసి అబ్బుశాస్త్రి మెడలో వేశారు. నంబూద్రి సవినయంగా గురువుగారిముందు మోకరిల్లాడు.

అబ్బు శాస్త్రి ఇద్దరు గురువులకూ సాష్టాంగపడ్డాడు. అబ్బుశాస్త్రితో రామ్‌ఝూలా వరకూ నడిచివచ్చాడు శశిపూర్ణ నంబూద్రి.

❖ ❖ ❖

సెలవుతీసుకుని ఝూలా సగం దాటిన అబ్బుని హడావుడిగా పిలిచాడు నంబూద్రి వెనక్కి రమ్మని. ఆశ్చర్యపోయాడు అబ్బుశాస్త్రి. నంబూద్రి అబ్బు భుజంమీద చెయ్యి వేసి చెప్పాడు.

"ముంచుకొచ్చే కామిల రోగాన్ని గుర్తుపట్టడానికి ఓ బండగుర్తు చెప్తాను. అది చరకసంహితలోది కాదు. అలోపతీలో అద్భుతమైన పరిశోధన. వ్యాధిగ్రస్తుడి కంటిలోకి జాగ్రత్తగా చూడగలిగితే నల్లగుడ్డు చుట్టూ బంగారు-ఊదారంగు చక్రాలు కనిపిస్తాయి. వాటిని కె.ఎఫ్.రింగ్స్ అంటారు. కామిలకు ఇంగ్లీషువైద్యంలో ఓ పేరు ఉంది. విల్సన్ వ్యాధి. అక్కడ చరకం చదివినవారు దొరక్కపోవచ్చు. కాని ఈ రెంటినీ ఎవరైనా గుర్తుపడతారు"

సందేహం లేదు. శాస్త్రాన్ని క్షుణ్ణంగా చదవనివాడికి ఇది బ్రహ్మాస్త్రం. ఇది ఒక్కటి చాలు రోగాన్ని గుర్తుపట్టి-పేషెంటుని నిపుణుడికి అప్పగించడానికి. ఆ రాత్రే హృషీకేశ్

నుంచి మొదట అనుకున్నట్టుగా హైదరాబాద్‌కి కాక కొడైకెనాల్‌కి బయలుదేరాడు. చివరి మాటని కొడైకెనాల్‌లో పేషెంటుని చూసి తేల్చుకోవాలి.

టెడ్డీ ఎదురుగానే నిలబడి అతి స్పష్టంగా బంగారురంగు చక్రాల్ని గుర్తుపట్టాడు. గురువు శశిపూర్ణ నంబూద్రికి మనసులోనే మరొక్కసారి ధన్యవాదాలు చెప్పుకున్నాడు. ఇక కొడైకెనాల్‌లో పని అయిపోయింది. ఈ తర్వాత ఏం చెయ్యాలో అబ్బుకి తెలుసు. కాదు. ఈ తర్వాత వైద్య నిపుణులు ఏం చెయ్యాలో తనకి తెలుసు. తనిప్పుడు వైద్యుడు కాడు. ఆపరేషన్ థియేటర్‌లో వైద్యుడి చేతిలో కత్తి.

ఏనాడైనా రోగం బైటపడుతుంది. కాని రోగం గుర్తింపు ధైర్యాన్ని ఇస్తుంది. చికిత్స ఉపశమనాన్నిస్తుంది. ఇప్పుడిక మరొకరి సహాయం కావాలి. అతనెవరో తనకి తెలుసు. ఆ రాత్రే హైదరాబాద్ బయలుదేరాడు అబ్బు.

## 38

టెడ్డీ ఆరోగ్యం బాగులేదని అబ్బు దగ్గర్నుంచి ఫోన్ వచ్చాక లీల కదిలిపోయింది. అప్పటికి రాత్రయింది. కొడుకు గురించే ఆలోచిస్తూ రాత్రంతా జాగారం చేసింది. ఉదయం స్కూల్ తెరిచే టైమ్‌కోసం క్షణాలు, నిముషాలు లెక్కపెట్టింది. సరిగా పది గంటలకి కొడైలో సెంట్ లూక్ స్కూల్లో ఫోన్ మోగింది.

ఆమె కలవరానికి ప్రిన్సిపాల్ ఆశ్చర్యపోయింది. "టెడ్డీ ఎలా ఉన్నాడు?" లీల ప్రశ్న. విషయమంతా విని ప్రిన్సిపాల్ అంది–"వెంటనే సమాధానం చెప్పలేము. ఈ ఫోన్ పెట్టగానే క్లాస్ టీచర్‌ని పిలిపిస్తాను. కుర్రాడి మెడికల్ రిపోర్ట్ తెప్పిస్తాను. పదిహేను నిముషాల్లో ఫోన్ చేస్తాను" అన్నారు.

కుర్రాడి ఆరోగ్యం అంత కలవరపరిచే స్థాయిలో ఉంటే వీళ్ళకి ఎందుకు తెలీదు? స్కూలు యాజమాన్యం తనకి  ఎందుకు ఫోన్ చెయ్యలేదు? ఊపిరి బిగబట్టి 15 నిముషాలు ఫోన్ పక్కనే కూర్చుంది. సరిగ్గా 15 నిముషాల తర్వాత ఫోన్ మోగింది. స్కూలు ప్రిన్సిపాల్, క్లాస్ టీచరు, టెడ్డీ ముగ్గురూ ఫోన్ దగ్గర ఉన్నారు. నెలనెలా జరిపే పరీక్షలలో కలవరపడాల్సిన విషయమేదీ లేదని డాక్టర్ మెడికల్ రిపోర్ట్. క్లాస్ టీచరూ ఆ మాటే చెప్పింది. టెడ్డీ హాయిగా తనతో మాట్లాడాడు. కుర్రాడు ఎనిమిక్‌గా ఉన్నాడని డాక్టర్ టానిక్కు రాసి ఇచ్చాడట. అంతకుమించి ఏ రుగ్మతా లేదు. లీల ఒక్కసారి స్థిమితంగా ఊపిరి పీల్చుకుంది. మరి ఈ అబ్బుశాస్త్రి ఫోన్‌కి అర్థమేమిటి?

ఉన్నపాటున పూనుకుని తన కొడుకు విషయం తెలుసుకుని, ఆరోగ్యం బాగులేదని

ఎలా ఫోన్ చేశాడు...? చెయ్యడంలో ఆంతర్యం? అబ్బుశాస్త్రిమీద ఎక్కడలేని కోపం తోసుకువచ్చింది. తన జీవితంలోనేకాక, తన కొడుకు విషయంలోనూ అనవసరంగా జోక్యం చేసుకుంటున్నందుకు–ఎదురుగా అబ్బుశాస్త్రి ఉంటే అతనిమీద పడి కసితీరా కొట్టేది.

ఏమైనా స్థిమితంగా హైదరాబాద్‌లో ఉండలేకపోయింది. ఒక్కసారి కొడైకెనాల్ వెళ్లి కొడుకుని చూసి రావాలని మనస్సు పీకింది.

మరో నాలుగు రోజుల తర్వాత రిజర్వేషన్ దొరికింది. కాని–ప్రయాణానికి ముందురోజే అనుకోని సంఘటన జరిగింది. కాలింగ్‌బెల్ మోగింది.

లీల తలుపు తెరిస్తే–ఎదురుగా అతిఖరీదైన సూటులో ఆమె ఏనాడూ చూడని ఓ పెద్దమనిషి. అతని చెయ్యి పుచ్చుకుని నిలబడిన టెడ్డీని చూసి నిర్ఘాంతపోయింది. వాళ్లిద్దరి వెనుకా కుర్రాడి క్లాస్ టీచర్ రోజ్‌మేరీ.

"మమ్మీ" అంటూ తల్లి కౌగిట్లోకి జారిపోయాడు టెడ్డీ.

ఎట్టి పరిస్థితులలోనూ పైవారికి స్కూలులోకి వెళ్లే అనుమతే లేదు. పిల్లల్ని బయటికి పంపే ప్రసక్తి లేదు. అలాంటిది చెప్పాచెయ్యకుండా తన కొడుకుని ఇంత హఠాత్తుగా ఈ ఊరు తీసుకువచ్చిన ఆ పెద్దమనిషిని చూసి కంగారుపడింది.

ఇద్దరూ లోపలికి నడిచారు. "నా పేరు ముకుల్ శిశోదియా. బొంబాయిలో ఇండస్ట్రియలిస్ట్‌ని. సెంట్ లూక్ స్కూల్ ఫౌండర్ ఛైర్మన్‌ని. మేనేజింగ్ ట్రస్టీని. మీ బాబుని వెంటనే డాక్టరుకి చూపించడం అవసరమని..."

"ఎవరు చెప్పారు? హూ ఈజ్ దట్ బాస్టర్ట్!" అంది లీల కోపంతో ఊగిపోతూనే. ఆమె ఆవేశానికి ఒక్కసారి ముకుల్ శిశోదియా, రోజ్‌మేరీ ముఖాముఖాలు చూసుకున్నారు.

"ఆ పెద్దమనిషి–మీ శ్రేయోభిలాషి–అబ్బుశాస్త్రి" రోజ్‌మేరీ అంది.

ఆ పేరు చెప్పగానే తోక తొక్కిన తాచులాగ లేచింది లీల. "చెప్పడానికి ఆయనెవరు? వినడానికి మీరెవరు? మీరు జరిపించే మెడికల్ రిపోర్ట్ సరిగ్గా ఉండగా, ఎవడో కోన్‌కిస్కాగాడి మాట పట్టుకుని–నాతో మాటమాత్రం చెప్పకుండా–నా పర్మిషన్ లేకుండా–నా కొడుకుని తీసుకువచ్చే అధికారం మీకు ఎవరిచ్చారు? ఇది స్కూల్ రూల్స్‌కే వ్యతిరేకం? నేను మీమీద కేసుపెడతాను" అరిచింది.

వచ్చిన ఇద్దర్నీ కూర్చోమని కూడా మర్యాద చెయ్యలేదు ఆమె. ఒక్కక్షణం ఇద్దరూ బిత్తరపోయారు. "దట్ మాన్–పండిట్ జీ–కోన్‌కిస్కా కాదు" అనబోయాడు ముకుల్ శిశోదియా.

"అతనెవడో నాకనవసరం. నా కుటుంబంతో సంబంధంలేని ఎవడో వర్త్‌లెస్

ఫెలో నా కొడుకు ఆరోగ్యాన్ని గురించి నిర్ణయిస్తాడా? వాట్ నాన్సెన్స్! ఇదా మీ స్కూలు నిర్వాకం? పిల్లల శ్రేయస్సునీ, క్షేమాన్నీ కాపాడవలసిన మీరు ఎవడో ముక్కూ మొహం తెలియని silly, stupid, worthless vagrant మాటల్ని పట్టుకుని..."

"ఆమె మాటలు పూర్తికాకుండానే "స్టాపిట్!" అని అరిచాడు ముకుల్ శిశోదయా.

లీల అతని అరుపుకి నిర్ఘాంతపోయింది. ఒక్కక్షణం తనని తాను సముదాయించుకుని మాట్లాడాడు ముకుల్. అతని మాటలో సంవత్సరాల తరబడి తర్ఫీదైన నిర్ధారణ, పరిణతి, బాధ్యతాయుతమైన అధికారం–అన్నిటికీమించి ఉదాసీనత ధ్వనించింది.

"మిసెస్ లీలా! అయాం సారీ. ఇలాంటి సీన్‌ని ఎదుర్కోవలసివస్తుందని నేను ఊహించలేదు. డాక్టర్లు, స్కూలు యాజమాన్యం గుర్తించని, గుర్తించలేని ఓ ఉపద్రవాన్ని– దేవుడులాంటి వ్యక్తి–ఆయన మీరనుకున్నట్టు silly, stupid, worthless vagrant కాదు– కనుక్కుంటే– కుర్రాడికి ఉపకారం జరుగుతుందని, జరగాలని భావించి–యాజమాన్యానికి, ఒక వ్యవస్థకీ అధిపతిగా, వ్రాతపూర్వకమైన హామీని ఇచ్చి, ఆ స్కూలు టీచర్‌ని, మీ అబ్బాయినీ స్వయంగా ప్లేన్‌లో తీసుకువచ్చాను. మీ దగ్గర కితాబుని పుచ్చుకోడానికి కాదు. కుర్రాడికి ఉపకారం జరగాలని–ఆ silly, stupid, worthless vagrant రుణం తీర్చుకోవాలని"

"ఏమిటండీ–డాక్టర్లకీ, యాజమాన్యానికీ తెలియనంత ఉపద్రవం? ఏమిటైంది నా కొడుక్కి? దాన్ని నిర్ణయించడానికి హూ ఈజ్ దట్ రాస్కెల్. అతని మాట పుచ్చుకుని నా పర్మిషన్ లేకుండా నా కొడుకుని తీసుకురావడం మీ బాధ్యతారాహిత్యం? అసలు మీరెవరు?

ఇలా బిడ్డని తీసుకువచ్చినందుకు తల్లినుంచి కృతజ్ఞతో, తృప్తో ఆశించిన ముకుల్ శిశోదియాకీ, రోజ్‌మేరీకి నోట మాట రాలేదు. "మీ బిడ్డ బాగుపడడం మీకిష్టంలేదా?" ముకుల్ ప్రశ్న.

"అసలు అతను పాడయిందేమిటి? బాగుచెయ్యమని చెప్పడానికి అతను ఎవరు? తీసుకురావడానికి మీరెవరు?" రోజ్‌మేరీ ఈ పరిస్థితిలో కల్పించుకోబోయింది. ముకుల్ శిశోదియా ఆమెని ఆపాడు.

"ఓ మనిషిని పాము కరిచింది. వైద్యసహాయంకోసం ఆత్రపడి ఒకాయన కారులో తీసుకునివెళ్ళాడు. కారులో ఎక్కించే హక్కు మీకెవరిచ్చారు అని అతని భార్య ఎదురుతిరిగింది. సమాధానం లేదు. ఉయార్ సారీ" ముకుల్ శిశోదియా వెనుదిరిగాడు.

"కరిచింది పామని మీకెలా తెల్సు? మీరెవరు నిర్ణయించడానికి?"

వెనక్కి తిరిగిన ముకుల్ శిశోదియా గొంతులో మొదటిసారిగా అధికారం, కమాండ్ తొణికిసలాడింది.

"మేం మనుషులం. బిడ్డకి ఉపకారం చెయ్యడంవల్ల మేలు జరుగుతుందని భావించిన మనుషులం. కరిచింది పామో, తేలో నిర్ణయించాల్సింది మేం కాదు. మీరూ కాదు. ఎల్లుండి–అంటే సెప్టెంబరు 14 ఉదయం పదిన్నరకి ఈ దేశంలోకల్లా పెద్ద నిపుణుడు గ్యాస్ట్రోయెంటరాలజిస్ట్ డాక్టర్ పి.మురళీకృష్ణ నిర్ణయిస్తారు. దటీజె ఎపాయింట్మెంట్. అది పాము కాకపోతే చాలా సంతోషం. గుడ్‌లక్. మరిచిపోకండి. సెప్టెంబరు 14, ఎమ్.వి.వి. చాంబర్స్, నియర్ కే.జీ.హెచ్. హాస్పిటల్ గేట్, విశాఖపట్నం. ఉదయం పదిన్నర. కమాన్ రోజ్‌మేరీ" అని వెనక్కి తిరిగాడు.

వీధితలుపు దగ్గర ఆగి మళ్లీ వెనక్కి తిరిగాడు ముకుల్. "బైదిబై. మీరు చెప్పిన silly, stupid, worthless vagrant కనుసన్న కదిపితే–అలాంటి పదిమంది డాక్టర్లతో ప్రత్యేకమైన హాస్పిటల్‌ని ఏర్పాటుచెయ్యగలను. ఆ silly, stupid, worthless vagrant వల్లకాకపోతే–మీరు నన్ను కలుసుకోడానికి నెలరోజులు పడుతుంది. ఇలాంటి అపార్టుమెంటులోకి నన్ను రప్పించడానికి మీ శక్తి చాలదు. నా అధికారాన్నీ, ఐశ్వర్యాన్నీ, అహంకారాన్నీ కొనడానికి కాదు–కొలవడానికి మీ దగ్గర తూకపురాళ్లు లేవు. ఫర్ యువర్ ఇన్ఫర్మేషన్–నీ కొడుకు ఇందాకనే చార్టర్డ్ విమానంలో ఇక్కడ దిగాడు. ఈ దేశంలో అలాంటి silly, stupid, worthless vagrant లు చాలామంది ఉండరు. నా జీవితంలో–నా అదృష్టంకొద్దీ ఒక్కరిని కలుసుకున్నాను. నా అంతటివాడు తన కాళ్లదగ్గర పడివుండడానికి ఆ silly, stupid, worthless vagrant దగ్గర ఉన్న ఆయుధం ఏమిటో తెలుసా? ఒక్కటి–ఒకే ఒక్కటి–kindness. మీ అబ్బాయి బాగుపడాలని, క్షేమంగా ఉండాలని మనసారా కోరుకుంటున్నాను. గుడ్‌లక్' అని తలుపు తీసుకుని బైటికి నడిచిపోయాడు ముకుల్ శిశోదియా. అతని వెనుకనే తల వొంచుకుని నిష్క్రమించింది రోజ్‌మేరీ.

❖ ❖ ❖

పదిన్నర సమయంలో ఎమ్.వి.వి.చాంబర్స్‌లో మొదటి ఫ్లోర్‌లో డాక్టర్ పి.మురళీకృష్ణ క్లినిక్ క్రిక్కిరిసి వుంది. ఇసుక వేస్తే రాలనంతమంది ఉన్నారు. కొందరు నిలబడి, కొందరు కూర్చుని, కొందరు బయటనే పడిగాపులు పడుతున్నారు.

లోపలికి ఎలా వెళ్లాలో, ఎవరిని అడగాలో తెలీక స్తబ్దుగా బయటనే నిలిచిపోయింది. లీల. యూనిఫారంలో ఉన్న కుర్రాడు పలకరించాడు.

"మేడమ్!", "నేను-నేను-నా పేరు-అదే-ఈ కుర్రాడి పేరు టెడ్డీ" పేరు వింటూనే కుర్రాడు పులైపోయాడు.

"ఓహ్! లీలా మేడమ్! మీ కోసమే డాక్టరుగారు ఎదురుచూస్తున్నారు. ముకుల్ శిశోదయాగారు గత 15 నిముషాలలో మూడుసార్లు ఫోన్ చేశారు"

లీల ఆశ్చర్యపోయింది. అంతమంది మధ్య తనకి లభించే గౌరవానికి కారణం-ఇప్పుడిప్పుడే అర్థమౌతోంది. కుర్రాడు తలుపు తెరిచి పట్టుకున్నాడు. లీల లోపలికి అడుగుపెట్టింది. ఎదుటి కుర్చీలో కూర్చున్న మురళీకృష్ణ లేచి నించొన్నాడు. "కె.లీల మేడమ్?"

లీల తల వూపింది.

డాక్టర్ మురళీకృష్ణ అతని టీమ్ అందరితో ఆమెకోసం ఎదురుచూస్తున్నాడు. ఆయనతో పనిచేసే రీసెర్చ్ స్కాలర్స్, కొలీగ్స్ డాక్టర్ కె.రవీంద్ర, లేఖ, చైతన్య, వరుణ్-అందరూ ఆమెని మహారాణీని చూసినట్టు చూస్తున్నారు. ఒక్క క్షణం బిత్తరపోయింది.

"నేను-నేను-"

"మీ గురించి అంతా తెల్సు మేడమ్. దిస్ యీజ్ టెడ్డీ" అని కుర్రాడి చెయ్యి పుచ్చుకున్నాడు మురళీకృష్ణ.

ఇంతవరకూ ఆమె ఒక ముఖ్యమైన విషయాన్ని మరిచిపోయింది.

కుర్రాడి అనారోగ్యానికి-ఆందోళన కలిగించే అనారోగ్యానికి కారణం ఏమిటి? రుజువులు ఏమిటి? పాత మెడికల్ రిపోర్టులు ఏమైనా ఉన్నాయా? బహుశా, రోజ్‌మేరీ తెచ్చిందేమో. అర్థాంతరంగా ఆవేశపడి వాళ్లని తరిమికొట్టింది. ఇప్పుడు-గ్యాస్ట్రో ఎంటరాలజీ నిపుణుడిని కలుసుకోడానికి-తను చెప్పగల, చూపించగల రుజువులేమిటి? అసలు కేసు ఏమిటి? ఏమీ తెలియదు. అద్భుతమైన సన్మానాన్ని పొందిన మహానటుడు-నిజానికి మహానటుడు కాక అతని కారు డ్రైవరేతే! అంత ప్రత్యేకతని, ఫోకస్‌ని పొందే ఈ పేషెంట్‌లో రోగలక్షణాలేమిటి?

లీలకి దాదాపు కళ్లనీళ్లు వచ్చినంత పనైంది. ఆ క్షణంలో ఆమెకి తట్టిన విషయం-ఈ సంఘటన అంతటిలో కుర్రాడికి ప్రత్యేకమైన చికిత్స కావాలని గుర్తించి, భావించి, అటు స్కూలు యాజమాన్యాన్ని, తల్లిని హెచ్చరించిన ఒకే ఒక వ్యక్తి ఉన్నాడు. అబ్బుశాస్త్రి. అతనొక్కడే ఈ పరిస్థితిలో ఈ సందర్భాన్ని సమర్థించగలడు. చెప్పగలడు.

మై గాడ్! అబ్బుశాస్త్రి ఎక్కడ?

ఆమె మనస్సులో ఈ ప్రశ్న తలెత్తే క్షణానికి భళ్ళున గదితలుపులు తెరుచుకున్నాయి.

హిరణ్యకశపుడి సవాలుని ఎదుర్కొని ప్రత్యక్షమైన నృసింహమూర్తిలాగ–అబ్బుశాస్త్రి లోపలికి వచ్చాడు. పైజామా, లాల్చీ, నుదుటిన కుంకం–వెలిగిపోతున్న నిప్పుదివ్వెలాగ ఉన్నాడు. అందరి ముఖాల్లో షాక్.

ఆ క్షణంలో లీల మనస్సు కృతజ్ఞతతో నిండిపోయింది. అందరి ముఖాల్లో ప్రశ్న "ఎవరు మీరు?"

"ఈ కుర్రాడి రోగం గురించి చెప్పడానికి వచ్చాను" అన్నాడు అబ్బుశాస్త్రి. చెప్పడం ప్రారంభించాడు–ధారాపాతంగా.

"He has symptoms of anaemia and fatigue due to intravascular haemolysis, absent seizures with no residual motor disability, frontal lobe disorder and sub-cortical dementia due to oxidative damage to brain cells, has golden brown Kayser-Fleischer Rings in Cornea and low serum ceruloplasmin an autosomal recessive genetic disorder, a hepto-lenticular degeneration with excessive accumulation of copper in liver, basal ganglia of brain and cornea of eye which may lead to hepatic encephalopathy, cirrhosis of liver and hepato-cellular carcinoma"

గదిలో అందరూ నిర్ఘాంతపోయి విన్నారు. చెప్పడం పూర్తయ్యాక–వచ్చినంత హఠాత్తుగానే అబ్బుశాస్త్రి మాయమయ్యాడు.

"ఎవరాయన?" ఎవరో అడిగారు.

నాలుగు రోజుల క్రితం ముకుల్ శిశోదయాతో తాను అన్న మాటలు లీలకి గుర్తుకొచ్చాయి.

"Silly, stupid, worthless vagrant"

❖ ❖ ❖

అబ్బుశాస్త్రి ఆ వాక్యాల్ని ఎలా చెప్పగలిగాడు? 5000 సంవత్సరాలు కేవలం వినడంద్వారా నేర్చుకున్న విద్యని ఆపోశనపట్టడం ఈ జాతి ప్రత్యేకత.

విన్నది మనస్సులో శతాబ్దాలుగా పదిలపర్చుకుని–వారసత్వం చెయ్యగల ధారణని వంటబట్టించుకున్న వేదపండితుడికి పది ఇంగ్లీషు వాక్యాలు వల్లించడం నల్లేరుమీద బండీ. కాగా, అబ్బుశాస్త్రి ఓ మహాయజ్ఞాన్ని నిర్వహిస్తున్న గొప్ప ఉద్యమకారుడు. అన్నిటికీమించి శక్తి–సంకల్పబలం.

## 39

మర్నాడు లీల ఇంటికి వచ్చాడు అబ్బుశాస్త్రి. ఆమె తలుపు తీయగానే–ఆమెని దాటి లోపలికి వచ్చాడు. లీలకి తల వొంచడం తెలీదు. క్షమాపణ చెప్పడం తెలీదు. తప్పును ఒప్పుకోవడం తెలీదు. పశ్చాత్తాపం ఎలా ప్రకటించాలో తెలీదు.

అతని చొరవకి ఆశ్చర్యపోయింది. అబ్బుశాస్త్రి ఆమె ముఖం చూడడంలేదు. కార్యోన్ముఖుడైన ఉద్యమకారుడి దృష్టి గమ్యంమీద ఉంటుందికాని, అడ్డంకులమీద ఉండదు. తను చేసే పనికి లీల అనుమతి అవసరంలేదు.

ఆమెని కలిశాక మొదటిసారిగా సంవత్సరాల కిందట ముక్కామల దగ్గర యాక్సిడెంటు, సంవత్సరాల తరబడి ఆమెకోసం ఎలా అన్వేషించినదీ, ఆమె పెడతోవ పట్టినట్టు గుర్తించినదీ, ఆమెను సంస్కరించే బాధ్యతను ఎలా నెత్తిన వేసుకున్నదీ క్లుప్తంగా చెప్పాడు. ఆమె నిర్ఘాంతపోయి విన్నది.

ఇంతవరకు అతనిపట్ల ఆమె మనసులో ఏర్పడిన విముఖత తుడిచిపెట్టుకుపోయింది.

ఇప్పుడు చిన్న మూటని సోఫాలో పెట్టాడు అబ్బుశాస్త్రి. మూట విప్పాడు. ఆనాడు కారులో దొరికిన–ఎర్రపూసలు, బంగారుతీగె–మిగతా సామగ్రి ముందు వున్న బల్లమీద పరిచాడు.

"కుర్రాడి వైద్యానికి చాలా డబ్బు ఖర్చవుతుంది. మురళీకృష్ణ పెద్ద బిల్లు ఇస్తాడు. ఈ నగలు ఎంతలేదన్నా నాలుగైదు లక్షలు చేస్తాయి"

లీల ఆశ్చర్యంగా చూసింది.

"ఇది నేను నీకు ఇవ్వడంలేదు. నీదే నీకిస్తున్నాను. ఇది నీకోసం మీ అమ్మ చేయించిన నగలు. నీకప్పుడు తెలిసే వయస్సు కాదు. ఆనాడు కారులో ఉండిపోయాయి. నీకు ఇప్పుడు అవసరానికి కలిసివస్తాయి. ఎన్నోసార్లు నీకివి ఇవ్వాలనుకున్నాను. కాని డబ్బుకంటే సంస్కరించవలసినవి చాలా ఉన్నాయని వీటిని వెనక్కి పెట్టాను. నల్లగా ఉన్న ఈ తీగె బంగారం. నిజానికి మీ నాయనమ్మ మీ అమ్మకిచ్చిన ఆస్తి ఇది"

లేచి గుమ్మందాకా వచ్చాడు. లీలకి ఇంకా మాటలు కలిసిరావడంలేదు.

"నీకు నా మీద కోపం ఉండొచ్చు. కాని మీ అబ్బాయి ముత్తవ్వకి మునిమనమడిని కాపాడుకునే హక్కుంది"

"కుర్రాడికేం భయం లేదని డాక్టరుగారు చెప్పారు. ఐతే జీవితాంతం మందులు

వాడాలి. కుర్రాడు చిరంజీవి. జీవితాంతం చాలా దూరం" వెళ్ళిపోయాడు.

❖ ❖ ❖

ఒకరోజు పొద్దున్నే అబ్బుశాస్త్రి ఇంటిముందు ఒక టాక్సీ ఆగింది. ఆశ్చర్యంగా బయటికొచ్చాడు అబ్బుశాస్త్రి. నాలుగో ఆయన్ని అబ్బు ఎన్నడూ చూడలేదు. కాని అబ్బు గురించి నాలుగో ఆయనకి చాలా కాలముగా తెలుసు. కాని ఆయనా అబ్బుని చూడలేదు. "బాబూ, నువ్వేనా అబ్బుశాస్త్రి"

తలూపాడు అబ్బు.

"నేను కాలు కదపలేను. చాలా గంటలు ప్రయాణంచేసి వచ్చాను. ఒక్కసారి దగ్గరికి రా"

అబ్బు టాక్సీ దగ్గరికి నడిచాడు. అంత పెద్ద శరీరంతోనూ నాలుగో ఆయన టాక్సీలోంచి అబ్బు కాళ్లకి అందినంతమేర వొంగి నమస్కారం చేశాడు. "రోజూ దేవుడికి మొక్కుకుంటాను–నా రుణం తీర్చుకోకుండా నన్ను తీసుకుపోవద్దని. ఒక్కసారి–ఒక్కసారైనా నీ కాళ్లకి నమస్కారం చేసే అదృష్టాన్ని ఇవ్వమని"

అబ్బుకి అర్థంకాలేదు. "మీరు..."

"నన్ను నాలుగో ఆయన అంటారు బాబూ. పెద్దలు పెట్టిన పేరు మంగళగిరి శ్రీనివాసరామయ్య. కాని నన్నెవరూ అలా పిలవరు. నీ చిన్నతనంలో నీ ఖాతాలో పడిన నేరం నిజానికి నా కొడుకు లంజకొడుకు చేయాలనుకున్నాడు. ఆ పిల్ల అదృష్టం–ఆ నేరం నీమీద పడింది. అదృష్టం అని ఎందుకంటున్నానో తెలుసా బాబూ. చేసిన తప్పుని దిద్దుకునే సంస్కారం నా కొడుక్కి లేదు. దిద్దుకునే సంస్కారం గల పెద్దమనసున్న పెద్దమనిషి–నువ్వు–ఆ పిల్లకి తోడయ్యావు. కాదు–ఆ బిడ్డ పాలిట దేవుడయ్యావు" అన్నాడు.

నాలుగో ఆయన కన్నీళ్లు తుడుచుకున్నాడు. ఎర్రకాని పంచె, బంగారు కడియాలు, నుదుటిన ఎర్రని సింధూర నామం–గంభీరమైన విగ్రహంలో ఆర్ద్రత మరింత పదునెక్కింది.

"ఆరోజు నా కొడుకు దుర్మార్గం చెల్లితే–లీల తల్లిదండ్రులు బతికివుండేవారేమో. కాని దేవుడు మరోలా నిర్ణయించాడు. నీ పొరపాటుకి పెద్ద అర్థాన్ని కల్పించాడు. పెద్ద ప్రాణాలు రెండూ వెళ్లిపోయాయి"

ఇంకా కథ అంతుపట్టడంలేదు అబ్బుశాస్త్రికి... "లోపలికి రాకూడదా?" అన్నాడు. "కారు దిగలేను బాబూ. పెద్ద బుడ్డ" అంటూ తన శరీరాన్ని, కూష్మాండాన్నీ చూపించాడు.

"ఎందుకిలా వచ్చారు?"

"జీవితమంతా నీలాగే–ఆ పిల్లని–లీలని వెదికించాను. నీలాగే జరిగిన తప్పిదానికి

ప్రాయశ్చిత్తం చేసుకుందామని. ఆరోజు ఆ పిల్లని వాళ్ల మేనమామ దగ్గరికి నా కొడుకు చేర్చాడు–జరిగిన నేరానికి చేతులు కడుక్కుందామని. అది వాడు ఆ పిల్లకి చేసిన ఘోరమైన అపకారం. నువ్వూ నాలాగే ఆ పిల్లని వెదుకుతున్నావు. నిన్ను నేను కనిపెట్టుకుని ఉన్నాను. ఆ పిల్లకి నీ వలన ఉపకారం జరుగుతోందని తెలిసి సంబరపడ్డాను. దేవుడు అన్నివేళలా అన్ని తలుపులూ మూసెయ్యడు బాబూ. కనీసం ఓ కిటికీ ఐనా తెరిచి వుంచుతాడు–ఆమాత్రం వెలుగు రావడానికి. లీల జీవితంలో ఆ వెలుగు పేరు–అబ్బుశాస్త్రి"

"ఇంకా మీరు నా ప్రశ్నకి సమాధానం చెప్పలేదు" అన్నాడు.

"చెప్తాను బాబూ. చెప్పాలనే వచ్చాను. చెప్పడానికి వేళ మించిపోకూడదని వెయ్యి దేవుళ్లకి మొక్కుకుంటూ–నిన్న ఎవరికీ చెప్పకుండా కారెక్కి వచ్చేశాను. ఒరే యెంకా! కొబ్బరినీళ్లియ్యరా" అన్నాడు డ్రైవరుతో.

"నేను దారిలో చచ్చిపోతే నా శరీరంలో రెండే గొప్ప అవయవాలున్నాయి బాబూ. కళ్లు, గుండెకాయ. కళ్లు పెట్టుకునే వ్యాపారం చేశాను. కొబ్బరిచెట్టుకింద నిలబడి కాయలు లెక్కపెట్టే వృత్తి. చేసిన పాపాన్ని కడిగేసుకునేదాకా ప్రాణాన్ని వదులుకోకూడదన్న గుండెధైర్యం. నేను చచ్చిపోతే ఈ రెండూ కాకినాడ మెడికల్ కాలేజ్‌కి ఇచ్చెయ్యమన్నాను బాబూ"

గడడా కొబ్బరినీళ్లు తాగాడు. పైపంచెతో మూతి తుడుచుకుని స్థిమితపడి చెప్పబోయాడు. "ఇలాక్కాదు. లోపలికి వస్తేకాని నేను మీరు చెప్పే మాటలు వినను" అన్నాడు అబ్బుశాస్త్రి.

ఒక కుర్చీని తెచ్చి డ్రైవరు వెంకయ్య, అబ్బు సీటులోంచి బుద్దని కదిపాడు. మెల్లగా నాలుగో ఆయన్ని కుర్చీమీదకి లాగారు. ఇద్దరూ కుర్చీని మొయ్యలేకపోయారు. మరో మనిషిని పిలిచి–ముగ్గురూ ఆ శరీరాన్ని ఇంట్లోకి సాయంపట్టారు. నాలుగో ఆయన్ని మంచంమీద కూలవేసేసరికి ముగ్గురూ అలసిపోయారు. నాలుగో ఆయనా అలిసిపోయాడు.

"అబ్బు బాబూ. అప్పుడప్పుడు అనిపిస్తుంది. దేవుడు కిలాడీ ముండాకొడుకు బాబూ. నీ శక్తి నాకు ఇచ్చి, నా డబ్బు నీకిచ్చివుంటే కొండల్ని పిండి చేసేవాడివి. ఆరోజు శ్రీరాములునాయుడు కారు ఊళ్ళోకి వచ్చివుంటే–ఆ బాబు కాళ్ళు కడిగి–పదెకరాల దస్తావేజులూ ఆ అయ్య చేతిలో పెట్టేవాడిని" అంటూ అబ్బు మొహం చూసి "కథ మధ్యలోంచి చెపుతున్నాను–ఆయమ్మ పెద్దల ఆస్తి పదెకరాలూ నా చేతిలో ఉండిపోయింది. కోరి దోచుకున్నది కాదు. అనుకోకుండా ఉండిపోయింది. డబ్బుకి ఓ జబ్బుంది. ఆ లంజ చాకచక్యం వుంటే బంగారం గుడ్లు పెడుతుంది. దగుల్బాజీతనం ఉంటే పెద్ద ప్రాణాన్నే మింగేస్తుంది. నేను గుడ్లు పెట్టించాను. కాని పెద్ద బాతు నాది కాదు.

శ్రీరాములునాయుడిది. ఇన్ని సంవత్సరాలూ ఆయనకివ్వలేకపోయాను. కనీసం దాన్ని మనవరాలుకైనా ఇవ్వందే చచ్చిపోనని దేవుడితో తగాదా యొట్టుకున్నాను. వొళ్లు పుచ్చిపోయింది. పెళ్లాం సచ్చిపోయింది. ఈ పదెకరాలూ ఆ పిల్లకియ్యాల"

అబ్బుశాస్త్రికి విషయం అర్థమైంది. నాలుగో ఆయన ఆర్తీ అర్థమైంది. ఆశ్చర్యపోయాడు. లోకంలో మంచితనానికి కరువు లేదు. మంచిని వెదుక్కునే సంకల్పానిదే కరువు. కళ్లు మూసుకున్నవాడికి సూర్యరశ్మి కనిపించదు.

"మరి ఆ అమ్మాయిదగ్గరికి వెళ్లక నా దగ్గరికెందుకొచ్చారు?"

నాలుగో ఆయన నిట్టూర్చాడు.

"మంచి ప్రశ్న అడిగావు బాబూ. మంచి కథ చెప్తాను. ఓసారి అదృష్టం దురదృష్టం పోటీపడ్డాయట. నేను గొప్పంటే నేను గొప్ప అని. 'నేను మనిషి జాతకాలు మారుస్తాను' అంది అదృష్టం. 'నేను ఎంతటివాడినైనా వొంచుతాను' అంది దురదృష్టం. దేవుడు నవ్వాడు. 'తేల్చుకోండి మీ గొప్పతనాల్ని' అన్నాడు. ఓ కుటుంబానికి అదృష్టంపట్టింది. డబ్బు కలిసొచ్చింది. జూదం, తాగుడు, విచ్చలవిడితనంతో కుటుంబం వీధిన పడింది. డబ్బున్న కుటుంబం నేలమట్టమైంది. ఇప్పుడు దురదృష్టం వారికి పేదరికాన్ని కట్టబెట్టింది. పేదరికం అందరినీ ఏకంచేసింది. కలిగివున్న రోజుల్లో కలిసి బతకని కుటుంబం ఒక్కటైంది. దేవుడు నవ్వాడు. "గొప్పతనం మీ ఇద్దరినీ కాదురా వెర్రికుంకలూ. వాళ్ళ కర్మదీ, దాన్ని నిర్వహించుకునేవారి సంస్కారానిదీ. కర్మ గతం నీకు కూడబెట్టి ఉంచినది. సంస్కారం ఇప్పుడు నువ్వు సంపాదించుకున్నది–అన్నాడట"

"ఐతే ఏం చెయ్యాలనుకున్నారు?"

"ఆరోజు వాళ్ళ నాన్న బతికుంటే ఆయనకిచ్చి చేతులు కడుక్కునేవాడిని బాబూ. ఇవాళ ఆ పిల్లకి ఇవ్వను. ఆమె మంచి చెడ్డల్ని తీర్చిదిద్దుతున్న నీకిచ్చి పోతాను. దేవుడి మాట గుర్తుంచుకో బాబూ. ఆమెది కర్మ. దాని ఆటుపోటుల్నుంచి ఆమెని కాపాడే సంస్కారం నీది. ఈ ఆస్తి నీ చేతుల్లో ఉంటే ఆ పిల్లకి మేలు జరుగుతుంది" అని–

"ఒరే యెంకా! నా సూట్‌కేస్ తీసుకురారా" అరిచాడు.

అబ్బుశాస్త్రి కళ్ళు మూసుకున్నాడు.

వెంకయ్య సూట్‌కేస్ తెచ్చాడు. ఓ ప్లాస్టిక్ సంచీలో భద్రపరిచిన దస్తావేజుల బొత్తిని తీశాడు నాలుగో ఆయన.

"ఇది నీ చేతుల్లో పెట్టాక నేను చచ్చిపోయినా పరవాలేదు బాబూ" అన్నాడు వణుకుతున్న గొంతుతో.

కళ్ళు విప్పాడు అబ్బుశాస్త్రి. అతని మనస్సు కొత్త ప్రణాళికని సిద్ధం చేస్తోంది. నిన్ననే లీల ఆస్తిని ఆమెకి చేర్చాడు. తెల్లవారగానే లీల కొత్త ఆస్తి తనని వెదుక్కుంటూ వచ్చింది. అంతా దైవికం.

"ఈ పది ఎకరాలూ ఎంత ఖరీదు చేస్తాయి?" అన్నాడు.

"ఇవాళ లెక్కల్లో ఎంతలేదన్నా కోటి రూపాయలు..." అన్నాడు నాలుగో ఆయన. ఉత్తేజపడలేదు అబ్బుశాస్త్రి. "డబ్బు నాకు కొత్త. డబ్బంటే భయం. మీరు మరికొన్నాళ్లు బతకాలి. దీన్ని ఏం చెయ్యాలో నేను చెప్తాను"

ఆ సాయంకాలమే ఇద్దరికి ఫోన్లు చేశాడు అబ్బుశాస్త్రి. రాజమండ్రిలో ఉంటున్న చార్టర్డ్ అకౌంటెంట్ రామశర్మకి, బొంబాయిలో ఉంటున్న ప్రముఖ పారిశ్రామికవేత్త ముకుల్ శిశోదియాకి.

## 40

అర్ధరాత్రి గడిచాక–టెడ్డీ బరువుగా ఊపిరి పీలుస్తూ మూలుగుతున్న సవ్వడి వినిపించి తుళ్లిపడి లేచింది లీల. టెడ్డీ ఎగవూపిరితో విలవిలలాడుతున్నాడు. ఊపిరి అందక యాతనపడుతున్నాడు. నోటి అంచున నురగ కనిపించింది. కంగారుపడిపోయింది. వాచీ చూసింది. ఒంటిగంట దాటింది. టెలిఫోన్ డైరెక్టరీ తీసి గాంధీ ఆసుపత్రికి ఫోన్ చేసింది. చాలాసేపు ప్రయత్నించాక నిద్రమత్తులో ఉన్న కుర్ర గొంతు వినిపించింది. ఎమర్జెన్సీ వార్డులో రాత్రి డ్యూటీని చేస్తున్న హౌస్ సర్జన్‌కి పేషెంటు సమస్యని చెప్పింది కంగారుగా.

అప్పుడే చదువుకుంటున్న కుర్ర డాక్టరు గొంతులో చిన్న ఉత్సాహం కనిపించింది. "Acute Hemolytic Crisis" రక్తంలో ఆక్సిజన్‌ని తీసుకెళ్లే హీమోగ్లోబిన్ పాళ్లు తగ్గిపోయాయి. ఆలస్యంచేస్తే డేంజరు. వెంటనే తీసుకురండి" అని ఫోన్ పెట్టేశాడు.

లీల గాభరా ఎక్కువైంది. ఏం చెయ్యాలో తెలీడంలేదు. టెడ్డీ నిస్సహాయంగా కొట్టుకుంటున్నాడు. అంబులెన్స్ నంబర్లని వెదికింది. ఒక నంబరుకి సమాధానం లేదు. మరో నంబర్లో అంబులెన్స్ పాడైంది. మరో నంబరులో అంబులెన్స్ ఉంది కాని డ్రైవరు శెలవులో ఉన్నాడు. మరో నంబర్లో తన ప్రశ్నే అర్థంకాని మత్తులో ఉన్న గొంతు మాట్లాడింది.

టెడ్డీని భుజంమీద వేసుకుని బయటికి పరిగెత్తింది. అప్పటికి మరో అరగంట గడిచింది. వాచ్‌మేన్ నిద్రపోతున్నాడు. రోడ్డు నిర్మానుష్యంగా ఉంది. వెళ్తున్న ప్రతి లారీని ఆపడానికి ప్రయత్నించింది. ఏడుపు తోసుకువస్తోంది. టెడ్డీ విలవిలా కదులుతున్నాడు.

లీలకి తెలియని విషయం–ఆమె అపార్టుమెంటు బయట వరండాలో ఒకపక్క ఏ ఎమర్జెన్సీకైనా సిద్ధంగా ఉన్న అపూర్వమైన అంబులెన్స్ ఒకటి ఉంది–దాని పేరు అబ్బుశాస్త్రి. తలకింద అంగవస్త్రం పెట్టుకు నిద్రపోతున్న అబ్బుశాస్త్రికి అరగంటముందే నిద్రపట్టింది. రోడ్డుమీద వెళ్తున్న స్కూటర్‌ని–రోడ్డుకి అడ్డంగా నిలబడి ఆపమని పెట్టిన గావుకేకకి తుళ్ళిపడి లేచాడు అబ్బుశాస్త్రి. ఇదేమిటి? లీల గొంతు రోడ్డుమీద వినిపిస్తోంది?

అక్కడ స్కూటర్ ఆగింది. లీల స్కూటర్ నడిపే కుర్రాడితో మాట్లాడలేదు. అడగలేదు. బతిమాలలేదు. కొడుకుని భుజంమీద వేసుకుని, స్కూటర్ వెనకసీటుమీద కూర్చుని "గాంధీ ఆసుపత్రికి" అంది శాసనంలాగ.

నాల్గు పెగ్గులు పీకి, చికెన్ బిర్యానీ తిని జల్సాగా ఇంటికి వెళ్తున్న కుర్రాడికి ఇది ఊహించని కమాండ్. ఆమె ఏడుపూ, కుర్రాడి విలవిల చూసిమరీ కంగారుపడిపోయాడు. తన స్కూటర్ వెనుక అంత బరువుని ఆ దశలో ఎప్పుడూ ఎక్కించుకోలేదు. విలవిలలాడే కుర్రాడి కదలికని తట్టుకుని స్కూటర్‌ని ఎన్నడూ నడపలేదు.

తాగి స్కూటర్ నడిపేవాడిలో ఓ గురి ఉంది. ఏకాగ్రత ఆకాశాన్ని తాకుతుంది. ఏక్సిలరేటర్ విర్రవీగుతుంది. రక్తంలో మత్తు మెత్తటి nonchalanceని పెంచుతుంది. ఎదురుగా సమస్యవస్తే తప్ప తాగినవాడు యాక్సిడెంటు చెయ్యడు. వస్తే తప్పించుకోవడానికి అతని reflexes పనిచెయ్యవు. తాగినప్పుడు జరిగే యాక్సిడెంటుల్లో 90 శాతం వాళ్ల ఏకాగ్రతకి ఆ దశలో భంగం కలగడమే. కలగనంతవరకూ వాళ్లని మించినవాళ్లు లేరు. కలిగితే వాళ్లే ఉండరు.

స్కూటర్‌ని నిలకడగా నడపడానికి కష్టపడుతున్నాడు కుర్రాడు. "త్వరగా–క్విక్–ప్లీజ్–" అంటోంది లీల. పసివాడిలో కదలికలు ఎక్కువయాయి. "Acute Hemolytic Crisis. త్వరగా రావాలి. లేకపోతే He may collapse" బిగ్గరగా ఏడుస్తోంది లీల. కుర్రాడి ఏగాగ్రత దెబ్బతింది. మత్తువల్ల వచ్చిన నమ్మకం సడలింది. వెనుక బరువు తట్టుకోలేనంత కష్టతరమైంది. కుర్రాడు భయపడ్డాడు. ఏం చెయ్యాలో తెలియలేదు.

స్కూటర్‌కి తన యజమాని ఏమీ చెయ్యలేదని అర్థమైంది. స్కూటర్ దారి తప్పింది. పుంజుకున్న వేగంతో స్కూటర్ రోడ్డుమధ్య ఉన్న మీడియన్‌కి కొట్టుకుంది. కుర్రాడు. స్కూటర్ ఉన్నచోటనే పడిపోయాడు. లీల, పసివాడు కూడా గాలిలో ఎగిరి దూరంగా పడ్డారు. ఆ క్షణంలో తల్లి ఆత్రం పసివాడి చుట్టూ రక్షణవలయాన్ని బిగించింది. అది కేవలం instinct. లీలకి ఎముకలు విరిగిన సంగతి ఆమెకే అర్థమైంది. పసివాడింకా మూలుగుతున్నాడు. థాంక్ గాడ్. పసివాడు చచ్చిపోలేదు. కిందపడిన కుర్రాడు భయంభయంగా లేచాడు. లేవగలిగాడు.

చలనంలేని స్త్రీని, ఏడుస్తున్న పసివాడినీ చూశాడు. వాళ్లని చూస్తూనే పాంటులో మూత్రవిసర్జనైపోయింది. ముఖుకు నుంచి రక్తం కారుతోంది. ఐనా లేవగలిగాడు. మరో ఆలోచన లేదు. అలా కుంటుకుంటూనే అక్కడినుంచి పారిపోయాడు.

దూరాన వెనక వస్తున్న లారీలో ఒకాయన ఈ భయంకరమైన యాక్సిడెంటుని కళ్లారా చూస్తున్నాడు. అతను అబ్బుశాస్త్రి. స్కూటర్‌నుంచి ఎగిరిపడిన తల్లీ కొడుకులను చూశాడు. అతని గుండె ఆగిపోయింది. లారీ డ్రైవరు లారీని ఆపాడు. అబ్బు కిందకి దూకాడు. డ్రైవరుకి నమస్కరిస్తూ.

దురదృష్టానికి కాళ్లు వుంటాయి. దూసుకువచ్చి మీద పడుతుంది. అదృష్టానికి గుండె ఉంటుంది. మనస్ఫూర్తిగా చెంతన చేరి ఆక్రమించుకుంటుంది. అబ్బు లీల ముక్కు దగ్గర వేలుపెట్టి చూశాడు. ఊపిరి తెలుస్తోంది. కుర్రాడి ఏడుపు తెలుస్తోంది. ఆ క్షణాన అటు వెళ్తున్న ఆటోని ఆపాడు. ఆటోలో ఎవరో ఉన్నారు. కిందకి దిగారు. అబ్బు లీలని రెండు చేతుల్లోకి ఎత్తుకున్నాడు. నొప్పితో మూలిగింది. సరాసరి వచ్చి ఆటోలో కూర్చున్నాడు. ఆటోలో ప్రయాణం చేస్తున్న వ్యక్తి కుర్రాడిని తీసుకొచ్చి అబ్బు తొడమీద తలపెట్టి పడుకోపెట్టాడు. లీల కళ్లిప్పింది. ఎదురుగా కృతనిశ్చయంతో, కార్యోన్ముఖుడైన దేవుడు కనిపించాడు. అబ్బు శాస్త్రిని గుర్తుపట్టింది. అంతే. ఆమెకి స్పృహ తప్పిపోయింది.

❖ ❖ ❖

రాత్రి ఇచ్చిన మత్తు ఇంజెక్షన్‌కి ఉదయం పది గంటలకి తెలివొచ్చింది లీలకి. ఎవరో నర్స్ మెడికల్ చార్ట్ చూస్తోంది.

"టెడ్డీ ఎలా ఉన్నాడు?"

నర్స్ అర్థంకాక చూసింది. "టెడ్డీ అంటే ఆ కుర్రాడా?"

లీల తలూపింది.

"నైట్ నర్స్ చెప్పింది. మరో అరగంట ఆలస్యమైవుంటే కుర్రాడు ప్రమాదంలో పడేవాడు. రక్తంలో హీమోగ్లోబిన్ 6 గ్రాములకంటే తగ్గిపోయింది. ఇప్పుడు బాగున్నాడు. ఇంకేం భయం లేదు". లీలగా రాత్రి సంఘటన గుర్తుకొచ్చింది లీలకి. మరొక ప్రశ్న అడగాలని మనసు ఆత్రపడింది.

"ఆయన-ఆయన-ఎక్కడ?"

"ఎవరు?"

ఇప్పుడు కిటికీలోంచి దూరాన చెట్టుకింద నిలబడిన అబ్బుశాస్త్రి కనిపించాడు. తన చెయ్యికి కట్టు వుంది. రెండో చేత్తో చూపించింది.

"ఆయన్ని పిలవండి. ప్లీజ్"

నర్స్ వెళ్లింది. కాస్సేపటికి అబ్బుశాస్త్రి వచ్చాడు. అతని వెనుక కళ్లు చూడలేనంత సూర్యరశ్మి. ముఖం కనిపించడంలేదు. దగ్గరకు రమ్మంది.

"ఓ కాలు, చెయ్యి విరిగిందన్నారు. కాలు పరవాలేదు. సోయితాని రమ్మన్నాను. మధ్యాహ్నం వస్తుంది"

లీలకి కృతజ్ఞత ఎలా చెప్పాలో తెలీదు. "మీకు దండం పెట్టడానికి రెండు చేతులూ కలిసిరానందుకు బాధగా ఉంది"

ముక్కుమీద వేలువేసి 'ఇష్!" అన్నాడు అబ్బు.

ఇద్దరూ ఈ లోకంలో పడ్డాక, ఇద్దరి జీవితాల్నీ భగవంతుడు విచిత్రమైన బంధాలతో బిగించాక–ఒకరిమీద ఒకరికి పూర్తిగా అవగాహన, ఆత్మీయతా కుదరని నేపథ్యంలో–నిశ్శబ్ద విప్లవం నుంచి ఇద్దరూ బయటపడిన మొదటి సంధి వచనాలవి.

లీలకి కళ్లనీళ్లు నిండాయి. అబ్బుకీ కళ్లనీళ్లు నిండాయి. ఎన్నడూ చెయ్యడానికి సాహసించని ఓ పని చేశాడు అబ్బుశాస్త్రి. దగ్గరికి వచ్చి–ఆప్యాయంగా ఆమె తల నిమిరాడు.

జ్ఞానం తెలీని వయస్సులో నష్టపోయిన తల్లి ప్రేమ రుచి–ఆ కాస్తలో లీల మనస్సంతా నిండిపోయింది.

❖ ❖ ❖

మరో నాలుగు రోజుల తర్వాత–లీల కాలికీ, చేతికీ ప్లాస్టర్‌తో అంబులెన్స్ ఆమెని ఇంటికి చేర్చింది.

టెడ్డీని ఎత్తుకుని అబ్బుశాస్త్రి ఇంట్లోకి అడుగుపెట్టాడు.

## 41

"నాకు కోటి రూపాయలిస్తే పది కోట్లు పెట్టుబడి తీసుకురాగలను..." అన్నాడు ముకుల్ శిశోదియా అబ్బుశాస్త్రి ఇంటి అరుగుమీద కూర్చుని. తన జీవితంలో ముకుల్ శిశోదియా ఏనాడూ అలాంటి ఇంట్లో అలాంటి అరుగుమీద కూర్చుని వుండడు.

ఆయన్ని చూసి, ఆయన అబ్బుశాస్త్రిపట్ల చూపే భక్తిని చూసి రామశర్మ, నాలుగో ఆయన నివ్వెరపోయారు. "ఇంత గొప్ప వ్యక్తిని ఎక్కడ పట్టుకున్నారు?" అన్నాడు నాలుగో ఆయన.

ముకుల్ శిశోదియా నవ్వాడు.

"ఇలాంటి గొప్ప వ్యక్తి దొరకడం నా అదృష్టం. నా బిడ్డ చేసుకున్న పుణ్యం" అన్నాడు.

"మీకు అనవసరంగా శ్రమ..." అనబోయాడు అబ్బుశాస్త్రి.

"ఇంతవరకూ ఏ శ్రమా ఇవ్వలేదని బాధపడుతున్నాను. ఇప్పుడు చాన్స్ దొరికింది. మీకు నచ్చదని ఊరుకుంటున్నానుకాని, మీరు ఆవిడకి చేయాలన్న ఉపకారాన్ని ఈ మదుపు అక్కర్లేకుండా నేనొక్కడినే చెయ్యగలను. నేను చేసే పనులేవీ మీరు చెయ్యలేరు. మీరు చేసే పనులేవీ నేను చెయ్యలేను"

రామశర్మ నీళ్ళు నమిలాడు. "కాని పది కోట్లు పెట్టుబడితో ఏం చేస్తాం...? ఏ పరిశ్రమని ఏర్పాటుచేస్తాం?"

సమాధానం అందరూ నిర్ఘాంతపోయేలాగ అబ్బు దగ్గర్నుంచి వచ్చింది. "నాకు తెలుసు"

అందరూ ఆశ్చర్యంగా చూశారు.

"ఓరిగామీ"

మళ్ళీ అబ్బుశాస్త్రే మాట్లాడాడు. "లీల ఎక్కువ చదువుకోలేదు. కాని ఆమెకి ఇష్టమైన, ప్రియమైన వ్యక్తిద్వారా ఆమెకి సంక్రమించిన కళ ఒకటుంది. బతికున్న రోజుల్లో కొండలరావు ఆమెకి ఈ హస్తకళని నేర్పాడు"

అంతా ముఖాలు చూసుకున్నారు. "ఏమిటి ఈ ఓరిగామీ?"

"ఆ ఇంట్లో ఓ గదినిండా ఆమె చేసిన ఓరిగామీ కాగితం బొమ్మల్ని చూశాను. అవి అద్భుతం"

రామశర్మ నవ్వాడు. కాగితం బొమ్మల తయారీతో వ్యాపారమా? దానికి పది కోట్ల పెట్టుబడా?"

కాని ముకుల్ శిశోదియా నవ్వలేదు. తిరుమలలో మనిషి జుత్తు పెద్ద వ్యాపారానికి పెట్టుబడి. స్వీడన్‌లో ఇంధనం ఉత్పత్తికి 'చెత్త'ని దిగుమతి చేసుకుంటారు. కొన్ని కోట్ల చెత్తని ఆ దేశం దిగుమతి చేసుకుంటుంది. అతని మెదడు రేసుగుర్రంలాగ పనిచేస్తోంది. ముకుల్ శిశోదియా బుర్రలో ఉన్న వ్యాపారి క్షణక్షణానికీ విశ్వరూపాన్ని దాలుస్తున్నాడు.

❖ ❖ ❖

లీల ఇంట్లో మళ్లీ వంటగదికి వకాల్తా పుచ్చుకున్నాడు అబ్బుశాస్త్రి.

గోల్‌నాకాలో యాద్గిరి చాలా కాలానికి అబ్బుని చూసి–చిరకాల మిత్రుడిని చూసినట్టు పొంగిపోయాడు.

"పండిట్ జీ! ఆయియే!" అంటూ ఆహ్వానం పలికాడు. బాగా ఎంపికచేసి మేక, పొట్టేలు కాళ్ళు కొన్నాడు. సగానికి సగం నీరు ఆవిరి అయేవరకూ ఉడకబెట్టి, పసుపు, ఉప్పు, కారం, వెల్లుల్లి, అల్లం, ఉల్లిపాయ దట్టించాడు. రసం చిక్కబడ్డాక సేరువాలాగ తయారైన దాన్ని వడగట్టి–దానిమీద మిరియాలపొడి, కొత్తిమీర చిలకరించి ఆరారా లీలచేత తాగించాడు.

లీల తిరిగబడింది. అతను మాంసం వంట చేయడాన్ని ససేమిరా ఒప్పుకోలేదు. లీల జీవితంలో పుచ్చుకున్న ఆఖరి వంటకం అబ్బు తయారుచేసిన బోన్ సూప్. తరువాత లీల పూర్తిగా మాంసాహారాన్ని విడిచిపెట్టింది.

ఏనాడూ ఆ ఇంట్లో కుర్చీమీద కూర్చోలేదు అబ్బు. మంచంమీద పడుకోలేదు. జీవితంలోనే మంచం అలవాటు లేనివాడు హాల్లో చల్లని నేలమీద ఓ మూల పడక.

నానాటికీ ఆరోగ్యం పుంజుకుంటున్న టెడ్డీకి చదువు చెప్పడానికి సికింద్రాబాద్ ఆంగ్లో ఇండియన్ కాలనీ నుంచి ఒక టీచర్ని ఏర్పాటుచేశాడు.

లీల వైద్యంకంటే అతని ఆదరణకు అతి సులువుగానే తేరుకుంది. తీరికవేళల్లో ఓ మూలన కూర్చుని జపం చేసుకునే అతన్ని ఆశ్చర్యంతో గమనించేది. ఆమె జీవితంలో ఏనాడూ చూడని ప్రశాంతత అతని ముఖంలో కనిపెట్టింది. అతని జీవితంలో ఆత్మస్థైర్యం ఉంది. హుందాతనం ఉంది. కరుడుగట్టిన తృప్తి ఉంది. ఇది ఏనాడూ ఎరగని జీవితం తనది.

సాయంకాలం లీల వీల్ ఛైర్‌లో కూర్చుంటే–పెరటివేపు సూర్యాస్తమయాన్ని చూస్తూ కిటికీ అరుగుమీద కూర్చునే అబ్బు కనిపించేవాడు.

తన చుట్టూ ఉన్న ప్రకృతిని చూసి తనివితీరా ఈ తరం ఆనందించి ఎన్నాళ్లయింది? ఎక్కువ మాట్లాడని అతని మౌనం ఆమెకి పాఠం.

అతన్నే చూస్తూ కూర్చుంది. అబ్బుశాస్త్రి నవ్వాడు. "ఏమిటి ఆలోచిస్తున్నావు?"

"నాకు అమ్మనీ, నాన్ననీ తెలీదు"

మళ్ళీ నవ్వాడు.

"కాని నన్ను తెలుసు"

"జీవితంలో 30 సంవత్సరాలు నష్టపోయాను"

"కాని ఇంకా 70 సంవత్సరాల జీవితం ముందుంది"

లీలకి నవ్వొచ్చింది. "అలా కళ్లు మూసుకు ఏం చేస్తారు?"

"అమ్మవారిని తలుచుకుంటాను"

"మీ అమ్మనా?"

"అందరి అమ్మనీ"

"నాకు దేవుడున్నాడన్న నమ్మకం లేదు. కాని ప్రశాంతత ఉంటుందని ఇప్పుడిప్పుడే అర్థమౌతోంది"

సింహావలోకనం వ్యక్తిత్వ వికాసానికి మొదటి మెట్టు. ఏకాంతం సింహావలోకనానికి ప్రాతిపదిక. ఆమె మనస్సు మలుపు తిరుగుతోందని అబ్బుకి అర్థమౌతోంది. బరువుగా నిట్టూర్చాడు. ఇది ఆమె జీవితంలో చిన్న మలుపు కాదు. లేచి వెళ్లబోయాడు.

"ఒక్క మాట"

ఆగాడు. ఆమె వీల్ ఛైర్ నడుపుకు దగ్గరగా, ఆయనకి దగ్గరగా వచ్చింది. అతన్ని చాలాసేపు గమనించింది. "నేను మిమ్మల్ని ముట్టుకోవచ్చా?"

అబ్బుశాస్త్రి ఆశ్చర్యపోయాడు. ఆమెకు అందడానికి అడుగు ముందుకు వేశాడు.

"అక్కడ కాదు" అతని కాళ్లు ముట్టుకోవాలని ప్రయత్నించి వొంగింది. కాని కాళ్లు అందలేదు. శరీరమంతా అతని కాళ్లమీద పడిపోయింది.

అబ్బు వొంగి లేవదీయబోయాడు. ఇంగ్లీషులో అంది సూటిగా, వాడిగా.


"Don't dare touch me. This is my place"

అబ్బుకి కళ్లనీళ్లు తిరిగాయి. కళ్లు మూసుకున్నాడు.

❖ ❖ ❖

ఒకనాటి ఆటవిక సంస్కృతి–యుద్ధకళకి పునాదులు వేసి, ప్రతీకారానికీ, పగకీ, ఆత్మాభిమానంకోసం ఆత్మహత్యకీ ఆటపట్టైన వీరుల జాతి అయిన జపాన్–అతి సరళమైన, సున్నితమైన కళలకి ఆటపట్టని గుర్తుపడితే ఆశ్చర్యం కలుగుతుంది.

నిన్నటి జపాన్‌కీ, నేటి చైనాకి వెన్నుదన్నుగా నిలిచిన అంశం–కుటీర పరిశ్రమే. పెద్ద పెద్ద పరిశ్రమలలో కీలకమైన భాగాలు–లక్షల లెక్కలో ఇవాల్టికీ ఇళ్ళల్లో తయారౌతాయి. చిన్న చిన్న కుటీరాల్లో రూపుదిద్దుకుంటాయి. ఆ యా వస్తువుల సరసమైన ధరలకి ఇది కీలకం. దాదాపు గత శతాబ్దపు తొలిరోజులలోనే అత్యంత సుందరమైనదిగా నిలదొక్కుకున్న హస్తకళ–ఓరిగామీ. సన్నని జపాన్ ఆడపిల్లల వేళ్ళమధ్య మామూలు సాదాసీదా కాగితం



ఓరిగామీ డిజైన్లు

విశ్వరూపం దాలుస్తుంది. ఎన్నో రకాలైన రూపులు దిద్దుకుంటుంది. మనిషి ఆలోచనాసరళిలో విస్తృతికి ఈ కళ ప్రాదుర్భావం ఒక నిదర్శనం.

మార్గశిర మాసంలో ప్రతి తెలుగింటి లోగిళ్ళినీ ముగ్గులతో అలంకరిస్తుంది తెలుగింటి ఆడపిల్ల. దీనికి శాస్త్రీయమైన చరిత్ర లేదు. అక్కర్లేదు. అమ్మలూ, అమ్మమ్మలూ, ముత్తవ్వలూ ఆ కళని పిల్లలకి వారసత్వంగా అందజేశారు. అలా తరతరాలకు వ్యాపిస్తూ–చెరగని సంప్రదాయంగా తెలుగు లోగిళ్లలో–ఆ మాటకివస్తే దక్షిణాది రాష్ట్రాలన్నింటిలో స్థిరపడిపోయిన గ్రామీణ సౌందర్యం–ముగ్గు.

ఈ ఓరిగామీ అలాంటిదే. 1900 ప్రాంతంలో 'అకిరా ఓషిజావా' అనే ఆయన ఈ కుటీర కళకి ఓ సాధికారికమైన రూపునీ, అస్థిత్వాన్నీ కల్పించాడు. బ్రిటన్, చైనా, జర్మనీ–ఇలా ఎన్నో దేశాలకు ఈ కళ ఓడలు ఎక్కి ప్రయాణం చేసింది. నానాటికీ కొత్త మలుపులు తిరిగి–కొత్త, గొప్ప రూపును సంతరించుకుంది. ఈ కళకి ప్రధాన అంశం కేవలం కాగితం. జపాన్ భాషలో 'కారి' అంటారు. 'వాషి' అంటే–మరింత దళసరి కాగితం. ఇంకా కాడో, ఆబాకా, హంజీ, గంపీ–ఇలా రకరకాలున్నాయి. ఐతే–ధనుర్మాసంలో తెల్లవారుఝామున వేసిన ముగ్గు–గొబ్బెమ్మల అలంకారాలతో తెలుగు సంస్కృతిని ప్రతిఫలించే ముగ్గు–పొద్దున్నే ఆలమందల గిట్టల కింద నలిగి మాయమైపోతుంది. కాగితం పువ్వూ అంతే. ఈ కళకి శాశ్వతత్వాన్ని ఇవ్వడానికి క్రమంగా అంతరిక్షనౌకకి వినియోగపడే అతి తేలికైన సోలార్ పేనల్‌ని ఈ ఓరిగామీ కళకి వర్తింపజేయడంద్వారా మరింత చిరంజీవత్వాన్ని ఇవ్వవచ్చునని 2008లో కనుక్కున్నారు.

ముకుల్ శిశోదియా గడుసైన మార్వాడీ. ఊసుపోకకి అన్నట్టు జపాన్ ఆడపిల్లల చేతుల్లో రూపుదిద్దుకున్న కళని పది కోట్ల పరిశ్రమగా తీర్చిదిద్దాడు. కాగితం కళకి మన్నికను కల్పించడానికి అల్యూమినియంని వాడారు. బంగారాన్ని వాడితే? వెండిని వాడితే? ఓరిగామీ కేరికేచర్లను నగలుగా ఎందుకు తీర్చిదిద్దకూడదు?

బొంబాయిలో ప్రముఖ నగల వ్యాపారులతో సంప్రదించి కాగితం పువ్వులు, కాగితం పక్షులు, కాగితం అలంకరణల మినీయేచర్స్‌ని మన్నికైన వస్తువులుగా తయారుచేయగల మార్గాన్ని అన్వేషించాడు. ఇదికాక ఓరిగామీ కాగితంతో బిజినెస్ కార్డులు, అందమైన ఫ్లవర్ వేజ్‌లూ, గోడ అలంకరణలూ–లైట్ షేడ్లూ, కేలండర్లూ, రైటింగ్ ప్యాడ్‌లూ–ఒకటేమిటి? ఒక కళని ఎన్ని రకాల వినియోగానికి పనినప్పగించాడు.

కళని వ్యాపారంగా రూపుదిద్దడంవలన వ్యాపారికి డబ్బు వస్తుంది. కళ డ్రాయింగ్ రూమ్‌ల్లోకి ప్రవేశిస్తుంది.

హిరోషియాలో ఈ కళని పెంచి పోషించిన సంస్థలున్నాయని తెలుసుకుని

రామశర్మని విమానం ఎక్కించాడు శిశోదియా. అక్కడ వృద్ధాశ్రమాల సముదాయాన్ని నిర్వహించే తన మిత్రులు–ఫూజియోనగావురా, యోషీ నగావురాలకు ఫోన్ చేసి–ఆ దంపతుల సహకారాన్ని అర్థించాడు.

ఏటినుంచి నీటిని కడవలో తీసుకొచ్చే పల్లెటూరి పిల్ల–ఏ పల్లెలోనైనా కనిపించే మామూలు దృశ్యం. కాని ఓ గొప్ప కళాకారుడు–రవివర్మ కుంచెలోంచి జాలువారితే అది కళాఖండం. శతాబ్దాలనాటి హస్తకళకి రెండు నెలల్లో కోట్ల వ్యాపారం చెయ్యగల పరిశ్రమగా ప్రాజెక్టు రిపోర్టుని తయారుచేయించాడు. ఇది ఇండియాలో కనీవినీ ఎరగని కొత్త ఉత్పత్తి. దీనికి దన్నుగా నిలబడింది పేరున్న ముకుల్ శిశోదియా.

ఐతే ఈ కంపెనీలో ఆఖరి యోధుడు అబ్బుశాస్త్రి. తర్వాతి యోధుడు ముకుల్ శిశోదియా. మొదటి యోధుడు నాలుగో ఆయన. కాగితం వస్తువుల వ్యవహారాలన్నీ అమావాస్యరాజుకి అప్పగించారు. ఆయన తర్వాత కంపెనీ ఆడిటర్ రామశర్మ. మరి లీల?

❖ ❖ ❖

"అదృష్టం, నీ కుడిచెయ్యి విరగలేదు" అంటూ నవ్వుతూ వచ్చాడు అబ్బుశాస్త్రి. ఆ నవ్వూ, ఆ నవ్వుకి కారణం ఏమిటో అర్థం కాలేదు లీలకి.

ఆమె ముందు పెద్ద ఫైలుతో కాగితాలు ఉంచి–ఇంటూ గుర్తులు పెట్టిన చోట్ల (అదేమిటో తనకీ తెలీదు!) కళ్లు మూసుకుని సంతకాలు పెట్టమన్నాడు అబ్బుశాస్త్రి.

ఇది ఈయన పని కాదని అర్థమైంది. నవ్వుకుంది. బుద్ధిగా, శ్రద్ధగా అతను చేతిని నడుపుతూంటే సంతకాలు చేసింది.

## 42

నాలుగో ఆయన ఆపరేషన్ దిగ్విజయంగా నడిచిపోయింది. ముకుల్ శిశోదియా ప్రత్యేకంగా నిపుణుల్ని బొంబాయినుంచి రప్పించాడు. పాతికేళ్లుగా మోస్తున్న వరిబీజం బరువు దిగిపోయింది. ఆపరేషన్‌కి చిన జగ్గుబాబు, అతని భార్య వచ్చారు. నాలుగో ఆయనకి డబ్బులోటు లేదు. ధైర్యం చెప్పి దన్నుగా నిలబడే మనిషే లోటు. ఆ పాత్రని అబ్బుశాస్త్రి పోషించాడు.

ఆసుపత్రి మంచంమీదనుంచే రెండు చేతులూ ఎత్తి అబ్బుకి నమస్కారం చేశాడు నాలుగో ఆయన. "సంవత్సరాల తరబడి ఈ నెత్తిన మోసిన రుణభారం దిగిపోయింది బాబూ. భగవంతుడు ఈ బరువూ దించేశాడు. అదే నేను చేసుకున్న పుణ్యం"

నాలుగో రోజుకే లేచి నిలబడ్డాడు నాలుగో ఆయన. ర్యాలి వెళ్లిపోడానికి సిద్ధపడ్డాడు. కాని ఎట్టి పరిస్థితులలోనూ వెళ్లడానికి వీల్లేదని అడ్డుపడిన మనిషి ముకుల్ శిశోదియా. "అసలు మీరే ఈ పరిశ్రమకి కారకులు. పెట్టుబడి మీ దగ్గర్నుంచి, మీ ద్వారా వచ్చింది. ఈ పరిశ్రమ బోర్డాఫ్ డైరెక్టర్ల జాబితాలో మీ పేరు ముందుంటుంది. మెమొరాండమ్ ఆఫ్ అండర్‌స్టాండింగ్, కంపెనీ లా రెడీ అవుతోంది. మీ సంతకాలు అవసరం"

నవ్వాడు నాలుగో ఆయన. "ఆ అమ్మకి దక్కాల్సిన ఆస్తి అప్పజెప్పాను. ఇన్నేళ్లు నా దగ్గర ఉంచుకున్న పాపానికి. వడ్డీని కూడా చెల్లించుకోవాలి. అలాగే వుంటాను బాబూ" అని–తనకి హైదరాబాదులో చిన్న ఇల్లు చూడమని కొడుక్కి పురమాయించాడు. ఆనాడు చెళ్లుమన్న చెంపదెబ్బ జగ్గూ బాబుమీద బాగా పనిచేసింది. దెబ్బకి దెయ్యం వదిలిపోయింది. జీవకణాల్లో సంప్రదాయపు ఔదార్యం, సంస్కారం ఉన్నాయి. పుట్టాక వచ్చిన బుద్ధులివి. మెల్లగా శలవు తీసుకున్నాయి.

❖ ❖ ❖

ఎంత బతిమాలినా–అబ్బుని మంచంమీద పడుకునేటట్టు చేయలేకపోయింది లీల.

"నా శరీరం అలవాటుపడిన సుఖం ఇది. దాన్ని ఇంత ఆలస్యంగా చెడగొట్టలేను" అన్నాడు అబ్బుశాస్త్రి.

కొందరికి సూర్యోదయంవేళ నమస్కారం చేసుకుంటే పుణ్యం వస్తుంది. పాశ్చాత్యులకి ఈ గొడవలు లేవు. సూర్యరశ్మి వారికి చర్మవ్యాధికి చికిత్స మాత్రమే. ఎన్నో రాత్రులు నిద్రపోతున్న అబ్బుశాస్త్రి సమక్షానికి వీల్ ఛైర్‌ని నడుపుకువచ్చి గంటలతరబడి అతన్ని చూస్తూ గడిపేది లీల. అలా చూస్తూంటే ఏమొస్తుంది? సత్సంగత్వం జీవన్ముక్తికి సోపానాన్ని నిర్దేశిస్తుందన్నారు ఆదిశంకరులు. మంచితనాన్ని నిశ్చలంగా దర్శించడంవల్ల కూడా జీవన్ముక్తి వస్తుంది. అది ఒక సాధన. జీవితమంతా కకావికలై, అల్లకల్లోలమైన ఆమె జీవితానికి అబ్బు శాస్త్రి దర్శనం–కేవలం ఊరడింపు. సమాధానం. ఉపశమనం. విముక్తి.

ఓ రాత్రి చటుక్కున తెలివొచ్చింది లీలకి. పక్కన టెడ్డీ కనిపించలేదు. మళ్లీ ఆనాటి పీడకల మనసులో కదిలింది. గుండె ఝుళ్లుమంది. మంచంమీంచి దూకి ఇల్లంతా వెదికింది. ఎక్కడా కనిపించలేదు. ఈసారి దుఃఖం తోసుకొచ్చింది. ఏమైంది టెడ్డీకి? ఎక్కడ టెడ్డీ?

అన్ని సమస్యలకీ పరిష్కారం వరండాలో నిద్రపోతోంది. అబ్బుశాస్త్రిని లేపడానికి పరిగెత్తుకు వచ్చింది. అక్కడ చూసిన దృశ్యానికి నిశ్చేష్టురాలైంది. అబ్బు పక్కన నేలమీద

అతనిమీద చెయ్యివేసి పడుకున్నాడు టెడ్డీ. బహుశా ప్రశాంతతని పక్క శరీరం నుంచి నింపుకుంటున్నాడు.

లీల హృదయం ఆర్ద్రమైంది. టెడ్డీమీద ఈర్ష్య కలిగింది. ఒక్కసారి–ఒక్కసారి–కొత్త ఆలోచన మనస్సులో కదిలింది.

డియర్ గాడ్! నా జీవితంలోకి రావడానికి ఎందుకింత ఆలస్యం చేశావు? ఆరోజున–అమ్మా, నాన్నా వెళ్లిపోయిన రోజున–నీ ఒడిలో ఇంత ప్రశాంతంగా సేదదీరి ఉంటే నా జీవితం వేరేగా ఉండేది.

ఆ రాత్రి లీల నిద్రపోలేదు. అక్కడే–దూరంగా–నేలమీద కూర్చుని–కన్నులతో ఆ దృశ్యాన్ని తనివితీరా తాగి మత్తెక్కింది.

మంచి సాంగత్యమే కాదు. ఆరోగ్యకరమైన దర్శనమూ జీవన్ముక్తికి హేతువే.

❖ ❖ ❖

అబ్బు ఇంటితలుపు తీసేసరికి లోపల అలికిడి వినిపించింది. ఆశ్చర్యపోయాడు. వీధి తలుపు తాళం తాను ఇప్పుడే తీశాడు. లోపలికి ఎవరూ వచ్చే ఆస్కారం లేదు. అనుమానంగా లోపలికి అడుగుపెట్టేసరికి పచ్చకర్పూరం గుప్పుమంది. కమ్మని కూర తాళింపు గాలిలో విహరిస్తోంది.

వంటగదివేపు నడిచాడు. ఎర్రటి కెంపులాంటి పట్టుచీరె మడిసారె కట్టుకుని వంటగదిలోనే లక్ష్మీదేవి ప్రత్యక్షమైనట్టు అనసూయ వంట చేస్తోంది. అబ్బుని చూసి నవ్వింది.

"నీ ఇంట్లో దొంగతనం చేయడం సుళువే. బయట తాళం ఉందని–గుమ్మంలో కూర్చుని కూర్చుని–ఇటు పెరటివేపు వచ్చాను. వెనక తలుపులు బార్లా తెరిచి ఉన్నాయి.

అబ్బు నవ్వాడు. "కావ్యకంఠ గణపతిశాస్త్రి అమ్మతో అంటారు–ఉమాసహస్రంలో. 'నేను ఏ నీడా లేనివాడిని. తలదాచుకునే స్థలానికైనా నోచుకోనివాడిని. ఆరుబయట ఉన్నాను. కాని నేను అదృష్టవంతుడిని. ఎందుకంటే–నీ కరుణ అనే వర్షం కురిసినప్పుడు అందరూ ఇళ్లల్లో ఉంటారు. నేను ఆ వర్షంలో తడిసి ముద్దవుతాను'–అని. ఈ పెరటి తలుపు తెరిచి ఉండడం నా అదృష్టం. ఏమిటిలా వచ్చావు?"

"ఇవాళ కార్తీక శద్ధ విదియ"

తుళ్లిపడ్డాడు. తిథులూ, వారాలూ మర్చిపోయి ఎన్నాళ్లయింది?

"భగినీ హస్త భోజనం పంచుకునే శుభదినం. తోడబుట్టిన అన్నయ్య చెల్లెలి ఇంటికి వెళ్లి ఆమె చేతి భోజనం చేసి ఆమెని ఆశీర్వదించాలి. ఈ అన్నయ్యకి ఆ తీరిక

లేదు. అందుకని నేనే వచ్చి ఇక్కడ వంట చేశాను. మామిడికాయ పప్పు, పనసపొట్టు కూర, కొబ్బరికాయ పచ్చడి, ముక్కల పులుసు దప్పళం, పచ్చకర్పూరం, సారపప్పు, కిస్మిస్, జీడిపప్పు, ఎండుద్రాక్ష వేసిన క్షీరాన్నం. స్నానంచేసి వస్తే వడ్డిస్తాను"

"పరీక్షిత్తు ఎక్కడ?"

మాట పూర్తికాకుండానే పెరట్లోంచి పరుగున వచ్చాడు పరీక్షిత్తు. పరీక్షిత్తు ఎత్తరి. అనసూయ పొట్టిదై, ఇంకా పొట్టిదై, రెండున్నర అడుగులై చిన్న లాగూ చొక్కా తొడుక్కుంటే పరీక్షిత్తు అయిపోతాడు.

"మామయ్యా" అంటూ అబ్బు భుజం ఎక్కాడు.

"వీడికి ఉపనయనం ఎప్పుడు చేస్తారు?"

"గర్భానా ఎనిమిదికి ఇంకా తొమ్మిది నెలలుంది. ఏమో-ముహూర్తం వాడి మామయ్యా, నాన్నా నిర్ణయించాలి" అంది అనసూయ.

అబ్బు మెడలో రుద్రాక్ష, పగడం, ముత్యాలు కలిపి బంగారుతీగెతో అల్లిన హారాన్ని సవరిస్తున్నాడు పరీక్షిత్తు.

అలనాడు-కాలు విరిగి-సకాల సంధ్యావందనం వ్రతం తప్పుతుందేమోనని చయనులుగారు భయపడినప్పుడు-ఆయన్ని భుజంమీద వేసుకుని 40 రోజులు కాలవగట్టుకి మోసుకెళ్లినప్పుడు-ఆ సేవకి ప్రసన్నులై-ఓరోజు తెల్లవారుఝామున అబ్బుని దగ్గరగా పిలిచి ఈ తావళాన్ని మెడలో వేశారు. చయనులుగారు, సోమిదేవమ్మ కాశీయాత్ర ముగించుకుని గంగనీటిని రామేశ్వరంలో కలపడానికి తరలివెళ్లినప్పుడు అక్కడ ఓ ముస్లిం దక్షిణావృత శంఖాన్ని, ఈ రుద్రాక్షల్ని చయనులుగారికిచ్చాడు. రుద్రాక్షలు, ముత్యాలు, పగడాలు కలిపి-బ్రహ్మం దగ్గర తావళాన్ని బెత్తాయించారు చయనులుగారు.

"దీన్నెప్పుడూ తియ్యకు. ఇది నీ మెడలో ఉన్నంతవరకూ నీకేం అనర్థం జరగదు" అన్నారు. అది మాట కాదు. ఆశీర్వాదం.

ఇప్పుడు పరీక్షిత్తుని కిందకి దించి ఆ తావళాన్ని వాడి మెడలో వేశారు. ఎవరూ నేర్పనక్కర్లేదు సంస్కారాన్ని. పరీక్షిత్తు రక్తంలో ఉంది. వొంగి అబ్బు రెండు కాళ్లకీ నమస్కారం చేశాడు. నారదుడి కాళ్లు పట్టుకున్న ధ్రువుడిలాగ కనిపించాడు పరీక్షిత్తు.

"చిరంజీవ" అన్నాడు అబ్బు.

స్నానంచేసి వచ్చాడు. అరిటాకు వేసి నీళ్లు పెట్టింది.

"సర్వమంగళం ఎక్కడ?"

"తనకోసం ఎదురుచూడొద్దన్నారు. ఇది నా ఇల్లు. నా పుట్టిల్లు. పట్టింపులు లేవు.

కూర్చో" అంది.

ఎదురుగా కూర్చుని ఆప్యాయంగా వడ్డించింది. చిన్నప్పుడు వొళ్లో కూర్చోపెట్టుకుని గోరుముద్దలు తినిపించిన అమ్మ సోమిదేవమ్మ గుర్తుకొచ్చింది.

ఉత్తరాపోశనం పట్టి చెయ్యి కడుక్కుని వచ్చాన "భగినీ హస్త భోజనం యమధర్మరాజు అన్న చెల్లెళ్లకిచ్చిన వరం. అపమృత్యువు నుంచి అన్నని కాపాడుకునే వరం. నన్ను దీవించు" అని పాదాభివందనం చేసింది అనసూయ.

పరిగెత్తుకువెళ్లి తన ట్రంకుపెట్టె తీశాడు. పదకొండు కాసుల సంచీని తీశాడు. "నాకు జ్ఞానం తెలిసినప్పటినుంచీ–అమ్మ నా పుట్టినరోజునాడు తలంటి–కొత్త అంగవస్త్రం కట్టించి పాదాభివందనం చేశాక ఓ వెండి రాములవారి మాడ ఇచ్చేది. పదకొండే ఉన్నాయి. ఆ తర్వాత–అమ్మ ఆదరణ–నా మనస్సుమీద మబ్బుతెర. ఇవి నాకు చాలా విలువైనవి. మరో విలువైన వ్యక్తికి వాటిని ఇస్తున్నాను" రెండు చేతుల్తో అందుకుని కళ్లు వర్షం కురియగా మురిసిపోయింది.

ఆకు తీసి, శుద్ధి చేసి–ఇంట్లోకి వచ్చేసరికి అబ్బు కనిపించలేదు. ఇదేమిటి? ఇంతలో మాయమయ్యాడు? వీధివేపు తిరిగేలోపున–పెరటివేపు చావిడిలో అబ్బు దగ్గు వినిపించింది. అటు నడిచింది. అబ్బు గోడని పట్టుకుని సేదదీర్చుకుంటున్నాడు. ఆ క్షణంలో కనిపించిన దృశ్యాన్ని చూసి అనసూయ కొయ్యబారిపోయింది. అబ్బు నోట్లోంచి రక్తం వాంతి చేసుకున్నాడు. నోటికి రక్తం చారలున్నాయి.

"అన్నా!" అంది భయంగా.

అబ్బుశాస్త్రి తుళ్లిపడ్డాడు. చేతిలో ఉన్న బిందెడు నీటిని రక్తంమీద గుమ్మరించాడు. నిముషంలో రక్తం మాయమయింది.

"ఏం లేదమ్మా–ఏదో..."

ఎదురుగా వచ్చి రెండు భుజాలూ పట్టుకుంది. "నా దగ్గర దాచకు. ఏమిటిది? ఏమైంది?" నోటి దగ్గర మిగిలిన రక్తంచారను తన కొంగుతో తుడిచింది. రక్తం రంగుచీరె రంగులో మాయమైంది.

"ఇది నన్నేం చెయ్యదమ్మా. కాన్సర్ శక్తికన్నా నీ శుభకామన శక్తివంతమైంది. నా చెల్లెలు మనసు నొప్పించడానికి దానికి ఎన్ని గుండెలు?"

కాన్సర్ అన్నమాట అతని నోటివెంటే విని వణికిపోయింది. ఏడుస్తూ "ఇంత పెద్ద రోగాన్ని ఉపేక్షించడానికి వీళ్లేదు. ఆయనకి చెప్పి..."

ఆమె నోరు మూశాడు. "ఇవాళ భగినీ హస్త భోజనం చేశాను. నీ కోరికను

తీర్చాను. ఈ అన్నయ్యకీ ఒక వరమివ్వాలి"

అనసూయ ఏడుస్తోంది.

"ఇస్తానని మాటియ్యి"

నోట్లో చీరె కుక్కుకుంది. "నువ్విప్పుడు చూసిందీ, విన్నదీ ఎవరికీ చెప్పకు"

మాటలకి తడువుకుంటూ అడిగింది–"ఎన్నాళ్లనుంచి?"

"చెప్పను"

"ఎప్పుడు నేను మాట తప్పొచ్చు?"

"నేను పోయాక"

భోరుమంది.

బయట తలుపు చప్పుడైంది. సర్వమంగళం వచ్చాడు. అబ్బు నవ్వడానికి ఎక్కవ సమయం పట్టలేదు. కాని అనసూయ అంత సుళువుగా ముఖంమీద మార్పుని తెచ్చుకోలేకపోయింది.

సర్వమంగళం అన్నాడు–"ఈ ఇంటి పరమార్థం అయిపోయిందిగా? ఎన్నాళ్లీ వనవాసం? ఇంటికి వచ్చెయ్"

అబ్బు నిస్సహాయంగా చూశాడు. అనసూయ రెండు చేతులూ పట్టుకుంది. "ఎన్నాళ్లో కాదు–ఇవాళే. ఇప్పుడే. నేను అన్నయ్యతోనే ఆ ఇంట్లో అడుగుపెట్టేది" అంది.

అబ్బు నిస్సహాయంగా చూశాడు.

"మాటకి మాట. నువ్వు నా మాటని కాదనకూడదు. ఇది భగినీ హస్త భోజనానికి నువ్విచ్చే వరం"

సరేనన్నాడు అబ్బు.

సర్వమంగళం భార్య భుజంమీద చెయ్యివేసి–ముందుకు వొంగాడు. ఇద్దరూ అబ్బు కాళ్లని నమస్కారం చేశారు.

"నువ్వు నాకంటే పెద్దవాడివి" అన్నాడు అబ్బుశాస్త్రి నోరు నొక్కుకుంటూ.

"పెద్దరికం ఈ జన్మది. ఈ నమస్కారం నీ జన్మాంతర సౌహృదానిది. పద బయట ఆటో వుంది. ఈ దిక్కుమాలిన ఇంటిని రేపు ఖాళీ చేద్దాం" అన్నాడు.

చయనులుగారు తపస్వి. ఆయన మాట శాసనం. తావళం అబ్బు మెడలో ఉన్నంతవరకూ కేన్సర్ భయపడింది. దాన్ని తొలగించగానే బయటపడింది. ఆనాడు అబ్బుకి తల్లి, తండ్రి–ఇద్దరి రక్షలూ దూరమయ్యాయి.

# 43

అతని పేరు లూర్దు రాజు. అసలు పేరు లోకయ్య. దళితుడు. వాళ్ల తాత చెప్పులు కుట్టాడు. పని సరిగ్గా చేసినా–చేసినందుకూ తన్నులు తిన్నాడు. అతని నాన్నకి చచ్చిపోదామని కనీసం మూడుసార్లు అనిపించి, రెండుసార్లు ప్రయత్నించి, అతని ప్రమేయం లేకుండానే ఆ ఊరి అగ్రవర్ణాల ప్రమేయంతో చచ్చిపోయాడు. లోకయ్య అమ్మతో కలవారింటి పాచిపనులకు వెళ్తూ ఆమెతోపాటు పేడతట్టలు మోశాడు. ఇంటి వసారాలో పెద్ద గొంతుతో చదువుకుంటున్న ఇంటి యజమాని కొడుకుని చూసి తనకీ అలా చదవుకోవాలని అనిపించింది. అమ్మతో చెప్పాడు. ఆమె గుండె బాదుకుని శోకాలెడుతూ “అమ్మో ఈ పెంటనాకొడుకు సదువుతాట్ట. ఈడి జిమ్మడ” అంటూ గుడిసెల్లో అందరికీ చెప్పి, కొడుకుని చావగొట్టింది–అలాంటి లేనిపోని ఆలోచన చేసినందుకు. పొరుగు పాక లింగన్న కూడా నోట్లో గడ్డి పెట్టాడు. అప్పుడే లోకయ్య మనస్సులో ఆలోచన బలంగా నాటుకుంది–చదువుకోవాలని.

అలవాటు తప్పకుండా అమ్మతో పాచిపనికి వెళ్లేవాడు. లక్ష్యం పాచిపని కాదు. యజమాని కొడుకు కిష్టిబాబు బూట్లు పాలిష్ చేస్తూ–అతను చదివే చదువుమీద చెవిని పెట్టేవాడు. ప్రైవేటు మేష్టారు తిరువేంగళాచారి చెప్పే ప్రతీ అక్షరాన్ని తలలో దోపుకునేవాడు. ఈ పని రహస్యంగా, ఏళ్ల తరబడి చేశాడు. తల్లికి చెప్తే చావబాదుతుందని–మనస్సులోనే తొక్కిపెట్టాడు.

ఐదో తరగతి పరీక్షల్నాడు–స్కూలు వసారాలో కూర్చుని పరీక్షలో స్కూలు కుర్రాళ్లకిచ్చిన ప్రశ్నలన్నిటికీ సమాధానాలు రాశాడు. ఆ దారిన వెళ్తున్న తిరువేంగళాచారి వాడిని చూశారు. తిరువేంగళాచారి ఒక మ్లేచ్ఛుడి పేపరు ముట్టుకోడానికి వొళ్లు జలదరించి, ఐనా కుతూహలం తీరక పేపరుమీద మడినీళ్లు జల్లి చదివాడు. చదివి షాక్ అయ్యాడు. తను లోపల విద్యార్థులను అడిగిన ప్రశ్నలకు ఇక్కడ కూర్చుని సమాధానాలు రాస్తున్నాడు. గొప్పగా రాస్తున్నాడు. తను రోజూ పాఠం చెప్తున్న కిష్టిగాడికి అత్తెసరు మార్కులు రాగా, ఈ వెధవ అన్ని ప్రశ్నలకూ అద్భుతంగా సమాధానాలు రాశాడు. నిర్ఘాంతపోయాడు.

విద్యని ఆపడానికి తనెవరు? ఐదో క్లాసుతో ఆ ఊరిలో చదువు అయిపోయింది. అక్కడికి ఆరు మైళ్ల దూరంలో కొరవపాడు. అక్కడ ఆరో క్లాసుకి పాఠం చెప్పే సుబ్బయ్య నాయుడికి ఉత్తరం రాసిచ్చాడు. చదువు చెప్పమని కాదు. ఇంట్లో చాకిరీకి చాకులాంటి కుర్రాడని. చదువు వాడికి రాసిపెట్టివుంటే అక్కడా పుంజుకుంటాడు. అదీ తిరువేంగళాచారి ప్రణాళిక. సుబ్బయ్య నాయుడు లోకయ్యపాలిటి ద్రోణాచార్యులు. వాళ్లింట్లో గేదెల్ని తోమి, పాలు తీసి, నాయుడి కాళ్లుపట్టి–రకరకాల పనులకు ఉమ్మడిగా దొరికిన పదకొండేళ్ల

కుర్రాడిని చూసి నాయుడు దంపతులు మురిసిపోయారు. చదువు చెప్పడం నాయుడు లక్ష్యం కాదు. చాకిరీ చేయించుకోవడమే లక్ష్యం. కాని ఇన్ని పనులు చేస్తూ–ఆ ఊరి కుర్రాళ్లకి నాయుడు చెప్పే పాఠాల్ని జుర్రుకునేవాడు లోకయ్య. ఏ విధంగా చూసినా దళితుడికి చదువుకునే ఆలోచన చెయ్యడానికైనా హక్కు లేదనుకునే తరమది.

చదువు సాగగా సాగగా–ఆ ఊరి కరణం–గొడ్లు కాచే ఈ కుర్రాడి గొంతులో వేమన పద్యాలు వినీ, సుమతీ శతకానికి ముచ్చటపడీ సుబ్బయ్య నాయుడిని మెచ్చుకున్నాడు కుర్రాడికి బాగా చదువు చెప్తున్నందుకు. లోకయ్య చదువు విషయం నాయుడికి తెలీదు. షాకై లోకయ్యని కొట్టి నౌఖరీ పీకేశాడు. విషయం తెలిసి తనకి చుట్టలు కట్టించుకోడానికి దగ్గర పెట్టుకున్నాడు కరణం. ఏ మొహాన ఉన్నాడో వాడిచేత మెట్రిక్ పరీక్షకు కట్టించాడు.

సామర్థ్యాన్ని నిరూపించుకోడానికి లోకయ్యకి ఇది రెండో అవకాశం. మొదటిది ఐదో క్లాసు పరీక్ష. మెట్రిక్ పరీక్షలో రాష్ట్రంలోకల్లా మొదటివాడిగా నిలబడ్డాడు. చదువుని ఉపాధి చేసుకునే తంటాలు పడేవాడికి–అది కలిసిరాదు. వచ్చినా ఉపాధిగానే మిగులుతుంది. చదువు విజ్ఞానమూ, వికాసమూ అని నమ్మేవాడికి అవధులు ఉండవు. ఇలాంటి పరిమితులకు వారి లక్ష్యం లొంగదు కనుక. ఆకాశమే దాని హద్దు. పరీక్షల్లో మొదటి స్థానంలో నిలవాలనికాని–తన ప్రతిభని చాటాలనికాని లోకయ్య మనస్సులో ఆలోచన లేదు. అసలు ఉండాలని తెలీదు. ఆ కారణానికే మొదటి స్థానంలో నిలిచాడు. లోకయ్య విద్య విముక్తి. తెరుచుకున్న ఒక తలుపు. చీకటికోణంలోకి జొరబడిన ఒక వెలుగు కిరణం. ఒక ఉద్యమం. ఒక తరం తిరుగుబాటు. చెడిపోయాడని తల్లి వీడిమీద ఆశలు వదులుకుంది. చదువుకుని చెడిపోయాడని పొరుగింటి పెద్దలు పెదవులు విరిచారు.

మెట్రిక్ పరీక్షల తర్వాత ఎవరి దయా దాక్షిణ్యాలూ అతనికి అవసరం లేకపోయింది. ఫాదర్ సాల్మన్ రాజు అనే ఇవాంజిలిస్ట్ లోకయ్యను వెదుక్కుంటూ వచ్చి పట్నంలో వసతినిచ్చి స్కాలర్‌షిప్‌ని ఏర్పాటుచేశాడు. ఆరోజుల్లోనే లోకయ్య లూర్దు రాజు అయ్యాడు. మొదటి తరగతిలో డిగ్రీని పుచ్చుకున్నాడు. చార్టర్డ్ అకౌంటెన్సీ పరీక్షల్లో బంగారుపతకం పుచ్చుకున్నాడు. కెనేడియన్ బాప్టిస్ట్ మిషన్ సంస్థలకి ఆడిటర్ అయ్యాడు. క్రమంగా ఒక జాతీయ సంస్థలో చేరాడు. అంచీలమీద ప్రయాణంచేసి, అందర్నీ విభ్రాంతుల్ని చేసి చేసి–ప్రస్తుతం దేశంలోకల్లా ప్రాచుర్యంలో ఉన్న ఒక జాతీయ బ్యాంకు చైర్మన్ అయ్యాడు. ఇది లోకయ్య అనే లూర్దు రాజు మహాప్రస్థానం.

ఈ సుదీర్ఘ ప్రయాణంలో–అతనిలో రెండు లక్షణాలు కరుడుగట్టిపోయాయి. ఒకటి : అగ్ర వర్ణాల పట్ల ద్వేషం. రెండు : ఎవరినీ నమ్మకూడదనే నమ్మకం. మొదటి కారణంవల్ల తను చేస్తున్న ఉద్యోగానికి ఏమీ నష్టం లేదు. రెండో లక్షణం–బ్యాంకు ఉద్యోగానికి

శ్రీరామరక్ష. వ్యాపారానికి విశ్వాసం పెట్టుబడి. పెట్టుబడికి అవిశ్వాసం రక్షణ. కష్టమర్లను శల్యపరీక్ష చేసి రుజువులనూ, నిజాలనూ రాబట్టడంలో అందెవేసిన చెయ్యి లూర్దురాజు. ఆ లక్షణమే అతన్ని జీవితంలో త్వరత్వరగా ఎన్నో మెట్లు ఎక్కించింది.

❖ ❖ ❖

అబ్బుశాస్త్రి, అతని సన్నిహితులు తలపెట్టిన బృహత్తర ప్రణాళికలో ఆఖరి మెట్టు–కావాల్సిన ఆఖరి సంతకం–లూర్దు రాజుది.

అగ్ర వర్ణాలతో ముందున్న అబ్బుశాస్త్రి వర్ణమూ, లూర్దు ద్వేషించే వర్ణమూ ఒకటి. ఇద్దరూ రెండు వేర్వేరు ధృవాలలో ఉన్నారు. ఏ విధంగానూ పొంతనకు ఆస్కారంలేని, కరుడుగట్టిన స్వభావాలకు ప్రతినిధులు వారిద్దరూ.

ఒక్క ముకుల్ శిశోదియా విజిటింగ్ కార్డ్ వినా, మరేదీ ఆ ఫైలులో లూర్దు రాజుని ఆకర్షించలేదు. ముకుల్ శిశోదియా బొంబాయిలో కోట్లు విలువచేసే వ్యాపారాధిపతి. కొడైకెనాల్ సెంట్ లూక్ పబ్లిక్ స్కూలు మేనేజింగ్ ట్రస్టీ, బొంబాయి నార్త్ లయన్స్ క్లబ్ ప్రెసిడెంట్. వాకింగ్ ఇంటర్నేషనల్ ఆర్గనైజింగ్ సెక్రటరీ, ఇంకా ఇంకా ఎన్నో ఉన్నాయి. ఈ 'ఓరిగామీ' గురించి లూర్దు రాజు ఎప్పుడు వినలేదు. కాగితంతో చేసే హస్తకళకి పది కోట్ల పెట్టుబడి ఎందుకు? ఏమిటీ వ్యాపారం? ఎంత ఆలోచించినా అంతుబట్టలేదు. లూర్దు రాజు అనుభవంలో ఇలాంటి అర్ధంపర్ధం లేని ప్రతిపాదనలు చాలా వస్తూంటాయి. చాలా చిన్న కారణాలకే వాటిని బుట్టదాఖలు చేసి మర్చిపోవడం కద్దు. ఒకటి రెండు కారణాలు–ముకుల్ శిశోదియా, ముకుల్ శిశోదియా తప్ప ఈ ఫైలు తనదాకా వచ్చేది కాదు.

సరే. సరిగ్గా ఐదు నిముషాలు–ఈ కంపెనీ డైరెక్టర్లకీ, ఈ కంపెనీ వివరాలు తెలుసుకోడానికీ ఖర్చు చెయ్యాలనుకున్నాడు. ఇలాంటి కంపెనీలతో చర్చించేటప్పుడు–పెట్టుబడి ప్రతిపాదనలు వచ్చినప్పుడు–లూర్దు రాజు ఒక ప్యాడ్‌ని తనముందు ఉంచుకుంటాడు. అందులో మూడు అంశాలుంటాయి. పెట్టుబడి ఇవ్వనక్కర్లేదు–ఎర్ర చుక్క. పరవాలేదు–నీలి చుక్క. ఇవ్వాలి–పచ్చ చుక్క. ఆ బృందంతో మాట్లాడుతున్నప్పుడు–అతని ప్యాడ్‌మీద మూడు రంగుల కలాలూ కలకలం రేపుతూంటాయి. సంప్రదింపుల చివర–తన ప్యాడ్ చెప్పేస్తుంది తన నిర్ణయాన్ని. ఇది లూర్దు ఆచరణ సరళి.

మూడు పెన్నులు, ప్యాడ్ సిద్ధం చేసుకుని–ఈ కె.ఎల్.ఓరిగామీ బృందాన్ని లోపలికి పిలిచాడు. ముందుగదిలోకి అడుగుపెట్టిన వ్యక్తిని చూసి తుళ్లిపడ్డాడు. అతి సాదాసీదా పైజామా, లాల్చీతో, నుదుటిన ఎర్రటి బొట్టుతో ఓ బ్రాహ్మణుడు–దేవాలయంలోకి

అడుగుపెడుతున్న అర్చకుడిలాగ లోపలికి వచ్చాడు. ఇదేమిటి? పది కోట్ల వ్యాపారానికి ఇతని ప్రమేయం ఏముంది? లూర్దు రాజు అసంకల్పితంగా ప్యాడ్‌మీద ఎర్ర చుక్క పెట్టాడు. అతని వెనుక పాతబడిన చారల కోటులో, అలవాటు తప్పిపోయిన పాతకాలపు టైని కట్టుకుని–పెద్ద కాగితాల బొత్తిని పట్టుకుని మరొక బ్రాహ్మణుడు–రామశర్మ–వచ్చాడు. అతని నుదుటినా ఎర్రని బొట్టు. ముఖం నిండా చిరునవ్వు. ఏ విధంగానూ లూర్దు రాజు మనస్సులో ఏపాటి నమ్మకమూ కలిగించని రెండో వ్యక్తి, ప్యాడ్‌మీద మరో ఎర్ర చుక్క.

వేరీజ్ ముకుల్ శిశోదియా?

తర్వాత నాలుగో ఆయన, అమావాస్యరాజు, వారి వెనుక పేరులేని ఓ జపాన్ మనిషి–బట్, వేరీజ్ దిస్ శిశోదియా?

అప్పుడు–ఆఖరున ముకుల్ శిశోదియా గదిలోకి అడుగుపెట్టాడు. అతన్ని చూసి నిర్ఘాంతపోయాడు లూర్దురాజు. వందమందిని నిలబెట్టి వారిమధ్య ముకుల్ శిశోదియాని గుర్తుపట్టమంటే చాలా సుళువు. తాజాగా–ఆధునిక నాగరికతకు ప్రతినిధిలాగ ఉన్నాడు. అద్భుతంగా కట్‌చేసిన జార్జియో ఆర్మానీ సూట్, హ్యూగ్ బాస్ టై, జాక్ అండ్ జోన్స్ షర్టుకి స్మిత్ అండ్ వెస్సన్ హాండ్ కఫ్స్, మెరెల్ బ్రాండ్ షూస్, కంటికి కార్టియర్ కళ్లద్దాలు–అంతర్జాతీయ వ్యాపార ప్రకటనకి అపురూపమైన మోడల్‌లాగ ఉన్నాడు. సగం బట్టతల. అతి హార్దికమైన చిరునవ్వు. ఇంతకుముందు గదిలోకి వచ్చివుంటే ప్యాడ్ నీలి చుక్కల్తో నిండిపోయేది.

అందరూ కూర్చున్నారు.

ఇప్పుడు మాట్లాడడం లూర్దు రాజు వంతయింది. ఫైలు తెరిచాడు. "ఈ కె.ఎల్.ఓరిగామీ ఎంటర్‌ప్రైజెస్‌ని ఎవరు ప్రారంభిస్తున్నారు?" మొదటి ప్రశ్న. ముకుల్ శిశోదియాని అడిగాడు లూర్దురాజు.

అందరూ అబ్బుశాస్త్రిని చూపించారు. "మీట్ మిస్టర్ అబ్బుశాస్త్రి" అన్నాడు శిశోదియా.

"ఈ ఫైలుతో ప్రిన్సిపల్ వ్యక్తి లీల అన్నారు. ఎవరావిడ?" అందరూ ఈ ప్రాథమికమైన ప్రశ్నకు సమాధానాన్ని తడువుకున్నారు.

అబ్బు చెప్పాడు–"ఆమె వ్యభిచారి"

అందరూ తుళ్లిపడ్డారు. లూర్దు షాక్ అయాడు.

ముకుల్ శిశోదియా షాక్ అవలేదు. నవ్వుకున్నాడు.

"ఈయన?"

"అబ్బుశాస్త్రి"

"ఈయన పేరు ఇక్కడ లేదేం?"

"ఉండదు"

"ఎందుకని?"

"ఈ కంపెనీలో ఆయన ఏమీ కాడు కనుక" అన్నాడు రామశర్మ.

అబ్బుశాస్త్రిని చూపిస్తూ "అసలు ఈయనెవరు?"

అందరూ మళ్లీ సమాధానానికి తడువుకున్నారు.

అబ్బుశాస్త్రి సమాధానం చెప్పాడు–''నేను లీల తల్లిదండ్రుల చావుకి కారణమైనవాడిని"

"వాట్!" నిర్ఘాంతపోయాడు లూర్దురాజు.

"ఈయనేం చేస్తారు?"

ముకుల్ అన్నాడు "ఆయన చదువుకున్నారు"

"చదువు ఉద్యోగం కాదు" అన్నాడు లూర్దు.

"ఈనాటి చదువుల లక్ష్యం అది. ఇతను వేదం చదువుకున్నాడు"

హఠాత్తుగా తనకీ ఆ మాట వర్తిస్తుందని గుర్తొచ్చింది లూర్దు రాజుకి. ఆనాడు తన చదువుకీ కారణం–ఉద్యోగం కాదు. చదువు ఉపాధి ఇస్తుందని చదవలేదు. చదువు బానిసత్వం నుంచి విముక్తి అని చదివాడు. చదువు లక్ష్యం చీకటినుంచి వెలుగులోకి ప్రయాణం. ఆ ప్రయాణాన్ని ఆనాడు చేసినవాడు లూర్దు రాజు. ఈనాడూ చేస్తున్నవాడు అబ్బుశాస్త్రి.

ప్యాడ్‌మీద ఏ చుక్క పెట్టాలి. ఈ విషయానికి చుక్కల్తో ప్రమేయం లేదు. ఏమీ పెట్టలేదు.

ఇప్పుడు రామశర్మ పూనుకున్నాడు. "ఒక్కసారి కంపెనీ ప్రొఫైల్ చెప్పమంటే..."

లూర్దు అతనివేపు చూశాడు.

"మెయిన్ ప్రిన్సిపల్–కోటి రూపాయలతో స్థలం, బిల్డింగ్ ఖర్చులు, ప్లాంట్ మిషనరీ, ఆఫీస్ సెటప్‌కి అయ్యే ఖర్చులూ, వర్కింగ్ క్యాపిటల్ అవసరాలకి వినియోగిస్తాం. ఇందులో ఈయన–మంగళగిరి శ్రీనివాసరామయ్య ఒక షేర్ హోల్డర్. రాజమండ్రిలో 40 పైగా హెవీ కార్గో ట్రక్స్ నడిపే వ్యాపారి. ఈయన అమావాస్యరాజు. అంతకుమించి ఆయనకి మరో పేరు లేదు. కొవ్వూరులో ప్రెస్సు ఉంది. పెద్ద విలువ చెయ్యదు. కాని 20 లక్షల

పెట్టుబడితో-అదే-షేర్ హోల్డర్ అవుతున్నాడు... వీరు..."

"ఇదంతా ఈ ఫైలులో ఉంది" అంటూ అతన్ని ఆపాడు లూర్దు రాజు. ఇంకా అబ్బుశాస్త్రి మాటల షాక్‌నుంచి తేరుకోలేదు. మొట్టమొదటిసారిగా బ్యాంకుతో సంబంధంలేని, అసలు ఈ ఫైలుతోనే సంబంధంలేని, ఓ బ్యాంకు చైర్మన్ అడగనక్కర్లేని ప్రశ్న అడిగాడు లూర్దు రాజు.

"ఈవిడ ఎందుకు-అదే-వ్యభిచారి అయింది?"

ముకుల్ ఇబ్బందిపడ్డాడు. "ఇది-ఇప్పటి చర్చకి..."

అబ్బుశాస్త్రి ఆయన్ని ఆపాడు. "తొమ్మిదో యేటనుంచీ అతి క్రూరంగా మానభంగానికి గురైంది"

"ఇటీజె టిపికల్ కేస్ ఆఫ్ చైల్డ్ ఎబ్యూజ్" అన్నాడు రామశర్మ.

"ఆ భయంకరమైన వాతావరణం నుంచి చాలా ఏళ్లు తప్పించుకోలేకపోయింది"

లూర్దు రాజు చలించిపోయాడు.

మాట మార్చాలని రామశర్మ చర్చలోకి చొచ్చుకువచ్చాడు. "ఈ కంపెనీ డైరెక్టర్లందరూ పెయిడప్ పెట్టుబడికింద పారిపస్సూ పద్ధతిన షేర్లు తీసుకుంటున్నారు. కంపెనీ మూడేళ్లలో స్థిరపడితే ప్రారంభదశలో పెట్టుబడి పెట్టిన వీరి షేర్లు డిబంచర్లుగా మార్చాలని ప్రతిపాదించాం"

లూర్దుకి ఈ మాటలేవీ చెవికెక్కడంలేదు. ఏం అడగాలో, ఏం చర్చ జరుగుతోందో మర్చిపోయాడు. ఇది బ్యాంకు పెట్టుబడికి సంబంధించిన సమావేశం కదా? ఆ స్పృహ లేదు.

"ఈ లీలకి ఎవరూ లేరా?"

ముకుల్ నిగ్గుతేలిన వ్యాపారి. ఒక పెద్ద బ్యాంకు చైర్మన్‌ని ఈ పరిశ్రమ మూల లక్ష్యం ఆకర్షించిందని గుర్తుపట్టాడు. కొన్ని నిర్ణయాలు లాభనష్టాలమీదే జరగవు. వ్యాపార లక్ష్యంమీద జరుగుతాయి. అంతరిక్షయానానికి దేశం పెట్టుబడి లాభనష్టాలకు సంబంధించినది కాదు. సమాజానికి, దేశానికి దీర్ఘకాలిక ప్రయోజనాలకు సంబంధించినది.

ఈ వ్యాపారంలో లాభనష్టాలు-రెండో ప్రమేయం. అసలు ఈ పరిశ్రమ మూల లక్ష్యం మొదటి ప్రయోజనం-లీలకి పునరావాసాన్ని కల్పించడం. కాని ఏ బ్యాంకూ అందుకు పెట్టుబడి పెట్టదు. ఐనా అక్కడే లూర్దు రాజుని గుంజి కార్పోపెట్టడం జరిగిందని గుర్తుపట్టాడు. ఇది కారు వేగంగా పోవడానికి గేరు మార్చడం కాదు. వేగంగా పోయే

కారునే మార్చడం. గో ఎహెడ్ పండిట్‌జీ–యా ఆర్ హిట్టింగ్ ది బుల్స్ ఐ" అనుకున్నాడు.

"ఈ లీలకి ఎవరూ లేరా?" ఈసారి ముకుల్ శిశోదియాయే చైర్మన్ ప్రశ్నని తిప్పి అడిగాడు.

అబ్బుశాస్త్రి స్థితప్రజ్ఞుడు–శ్రీసూక్తం చదివినంత క్లుప్తంగా చెప్పాడు. "ఉండేవాడు. ఆమెని మనసారా ప్రేమించి, ఆమె మనసారా ప్రేమించిన వ్యక్తి పెళ్లి కాకుండానే ఈ దేశంకోసం పోరాడుతూ చచ్చిపోయాడు. అతను మిలటరీ ఆఫీసరు. ఆమె ఒక్కగానొక్క కొడుకు ఆమె లైంగికమైన అనారోగ్యాన్ని వారసత్వంగా పుచ్చుకుని–జీవితాంతం రోగిగా ఉంటేటట్టు పుట్టాడు. ఆ కుర్రాడు ఉన్నాడు"

లూర్దు చేతిలో కలం జారిపోయింది. చుక్కల ప్యాడ్‌ని టేబిలుమీద పడేశాడు.

నాలుగో ఆయన, అమావాస్య రాజు–లూర్దు రాజు ప్రశ్నలకంటే అబ్బుశాస్త్రి సమాధానాలకు కంగారుపడిపోయారు.

"బాబూ. మనం వచ్చిన పని..." మెల్లగా అబ్బుశాస్త్రితో అన్నాడు నాలుగో ఆయన. వ్యవహారం తప్పుతోవ పడుతోందని ఆయన స్థాయిలోనే అర్థమౌతోంది.

అబ్బు శాస్త్రి స్పష్టంగా అన్నాడు : "మన పని నిజాన్ని దాచడం కాదు. నిజాన్ని అలంకరించడం కాదు. మనతో ఈ పరిశ్రమలో పాల్గొనబోయేవారికి ఈ పరిశ్రమ వెనుకనున్న వ్యక్తుల మంచిచెడ్డలు తెలియడం అవసరం"

మళ్లీ రామశర్మ కల్పించుకున్నాడు. "మాకు కొండంత ధైర్యం ముకుల్ శిశోదియాగారు. వారి జిప్ ఫాసనర్స్ కంపెనీ టర్నోవర్ 5000 కోట్లు. పదివేల మంది ఉద్యోగులు పని చేస్తున్నారు"

కాని ఇవన్నీ లూర్దు చెవిలోకి పోవడంలేదు.

"ఒక హస్తకళగానే ఉంటున్న ఈ ఓరిగామీని వ్యాపార కళని చెయ్యడానికి హిరోషిమాలో ఓరిగామీ పరిశోధనలు చేస్తున్న కేంద్రం నుంచి ఆకియో యోమాషితా అనే ఈ నిపుణుడిని మా కంపెనీలోకి తీసుకున్నాం. ఓరిగామీ కళలో అల్యూమినియం, బంగారం, వెండి, ప్లాటినం, గుడ్డ, ప్లాస్టిక్–అన్నిటితో రకరకాల వస్తువులు చెయ్యడానికి రిసెర్చ్ వింగ్, మాన్యుఫాక్చరింగ్ వింగ్‌లను ఏర్పాట్లుచేశాం. ఈ కొత్త సరుకు కొనుగోలుకి చైనా, కొరియా, ఫ్రాన్స్‌లలో (ముఖ్యంగా కళాత్మకమైన విలువలకి ఈ దేశం ప్రాధాన్యం ఇస్తుంది కనుక) వ్యాపార సంస్థలతో సంబంధాలు ఏర్పాటుచేసుకున్నాం. విదేశీ మారకద్రవ్యం సంపాదన వివరాలన్నీ..."

మధ్యలో ఆపాడు లూర్దు రాజు.

"ఇందులో నాకు అర్థంకాని విషయం ఒకటుంది. ఈ లీలకి ఈయనకీ ఏమీ సంబంధం లేదంటున్నారు. ఎప్పుడో నేరం జరిగిందంటున్నారు. ఇప్పుడు ఈ అబ్బుశాస్త్రి సహాయం చేయడంలో ఉద్దేశం?"

అబ్బుశాస్త్రి సమాధానం చెప్పాడు. "నేను చేసిన నేరానికి, నావల్ల ఆమెకు జరిగిన నష్టానికి నాకు నేను చేసుకుంటున్న ప్రాయశ్చిత్తం"

లూర్దు నవ్వాడు. "ప్రాయశ్చిత్తం వంటి ఆలోచనలకి వ్యాపారంలో చోటు లేదు. ముఖ్యంగా బ్యాంకుల్లో"

అబ్బుశాస్త్రి చలించలేదు. "అందుకే వీరంతా నాతో నిలబడ్డారు. నా లక్ష్యం మానసికం. వీరి ప్రమేయం వాస్తవం"

నాలుగో ఆయన, అమావాస్య రాజు, రామశర్మ, ఆకియో యోమాషితా, ముకుల్ శిశోదియాలను మార్చి మార్చి చూశాడు లూర్దు రాజు. ఇంకా ఈ విషయం బోధపడడంలేదు. ఇదంతా విచిత్రమైన కెలిడియోస్కోప్‌లాగ ఉంది.

"మీరెందుకు ఈయన పక్కన నిలబడ్డారు?"

"చచ్చిపోవలసిన నా కూతుర్ని ఆయన కాపాడాడు. నా ఒక్కగానొక్క కూతురు చచ్చిపోతే నా భార్య పిచ్చిదయ్యేది. నేను 5000 కోట్ల వ్యాపారాన్ని వదిలేసి రోడ్డుమీద పడేవాడిని. వ్యాపారం వ్యాపారం పరిధిని దాటి ఏదో ఒక దశలో 'సేవ'గా మారుతుంది. అదీ వ్యాపారానికి జీవలక్షణం. అప్పుడే దానికి విలువ. మిమ్మల్ని సేవ చెయ్యమనడంలేదు. మీ షరతులమీద అప్పివ్వండి. మీ ఆఖరి రూపాయి వరకూ నేను హామీగా ఉంటాను"

నాలుగో ఆయన మొదటిసారి మాట్లాడాడు. "పాతికేళ్లు ఆ అమ్మాయి ఉప్పు తిన్నాను బాబూ. 30 ఏళ్లు ఆమెని వెదికి–ఈ కోటి రూపాయల ఆస్తినీ అప్పగిస్తున్నాను. రాత్రి నిద్రపోవడంలో ఎంత సుఖం ఉందో నాకు తెలిసి రెండు నెలలే అయింది బాబూ"

అమావాస్య రాజు మాట్లాడాడు. "మంచితనం అంటువ్యాధి సార్. ఇన్ని రోజులు ఇలాంటి మనుషులతో కలిసి గడిపాక–ఆ వ్యాధి నాకూ సోకింది. డబ్బుకి కేవలం బతకడానికేకాక మంచి ప్రయోజనం ఉంటుందని–ఏ డబ్బూ చెయ్యలేని పనిని–ఈ అబ్బుగారికి నేనిచ్చిన ప్రతీ రూపాయీ ఖర్చుచేసి నిరూపించారు. అందుకూ నేనీ పనిలో దూరాను"

రామశర్మ నవ్వాడు. "నా సమాధానమూ ఉంది సార్. ఆర్ష సంప్రదాయానికి సరైన అర్థం వెదకడం నా హాబీ. ఆ ప్రయత్నంలోనే ఈ పన్నుని పోగొట్టుకున్నాను. కాని ఆ అర్థానికి మూర్తీభవించిన సమాధానం మానవరూపంలో నా ముందు ఉన్నదని

గుర్తుపట్టాను. ఆ రూపం పేరు అబ్బుశాస్త్రి"

ఓషియో యోమాషితా మాట్లాడాడు. "మాది యుద్ధంలో ఒకరినొకరు నరుక్కొన్న దేశం. యుద్ధం కారణంగా మా నడుం విరిగిన దేశం. కాని చిత్తశుద్ధి, నిజాయితీ పెట్టుబడులుగా తలెత్తుకున్న దేశం. అవినీతిలో కూరుకుపోయిన వ్యవస్థలో ఆ పని చేస్తున్న పదిమంది ఇక్కడ కనిపించారు. నేనిక్కడికి ఉద్యోగంకోసం రాలేదు. వీరి ఉద్యమంలో భాగం కావాలని వచ్చాను"

లూర్దు రాజుకి నోటమాట రాలేదు. ఎప్పుడూ ఎవరూ ఇలాంటి కేసుని తనముందు పెట్టలేదు. రంగురంగుల ప్యాడ్ తెల్లగా నవ్వుతున్నట్టు అతన్ని పలకరిస్తోంది. మెదడులో ఆలోచనలు కరుడుగట్టిపోయాయి.

ముకుల్ లేచాడు.

"మాలాంటి పిచ్చోళ్లకి మీరు చేదోడుగా నిలవకపోతే నేను అర్థం చేసుకోగలను సార్. నేనొక్కడినే ఈ పనికి పూనుకుంటాను. థాంక్యూ ఫర్ యువర్ టైమ్" అని కూర్చున్నవారితో "ఇంక లేవండి" అన్నాడు.

అందరూ లేచారు. తలుపుదాకా నడిచారు. అప్పటికి లూర్దు రాజు నోటిమాట పెగిలింది.

"ఆగండి. రండి. కూర్చోండి" అన్నాడు.

అందరూ ఆశ్చర్యపోతూ వెనక్కి వచ్చి కూర్చున్నారు. "నేను వ్యాపారిని. నష్టపోకుండా నా రూపాయిని కాపాడుకోవడం నా బాధ్యత. నా బ్యాంకు లక్ష్యం. వృత్తి. ప్రాయశ్చిత్తం, ఋణం, ఉద్యమం వంటి మాటలు మా dictionary లో లేవు. ఉండవు. మీ ఫైలుని క్షుణ్ణంగా చదివాను. మీ కేసులో రెండు విషయాలు నాకు కొట్టొచ్చినట్టు కనిపించాయి. ఈ రామశర్మ, ఓషియో చాలా నిర్దుష్టంగా కంపెనీ ప్రొఫైల్‌ని తయారుచేశారు. ఇది చూశాక కూడా ఈ అబ్బుశాస్త్రినీ, వీరినీ చూసి నేను 7 కోట్లు ఇచ్చేవాడిని కాదు. ఈ ముకుల్ శిశోదియా నా డబ్బుకి కొండంత హామీ"

ఆగి "కాని–కాని–వీటన్నిటినీ మించి–కేవలం వ్యాపార విలువలకేకాక–మానవత్వపు విలువలు, మనం ఏం చేసినా ప్రతి వ్యక్తికీ ఉండాల్సిన సామాజిక బాధ్యతని ఊహించలేని స్థాయిలో నిలిపిన ఈ అబ్బుశాస్త్రి నన్ను షాకయ్యేటట్టు చేశాడు. అతను ఇప్పుడు చేస్తున్న పని అతను చెయ్యనక్కర్లేదు. చెయ్యకపోయినా జవాబుదారీ లేదు కనుక. చెయ్యకపోయినా చెల్లిపోతుంది కనుక. ఈ దేశంలో చాలామంది చెయ్యడంలేదు. అదే మన దరిద్రం. "వెల్. ఆఖరి మాట చెప్తున్నాను. మీతో నేనూ

చేతులు కలుపుతున్నాను. మీకు 7 కోట్లు అప్పు ఇచ్చి మీతో నిలబడతాను. రేపు వచ్చి చెక్కు తీసుకువెళ్లండి"

అందరూ ఆనందంతో ముఖాముఖాలు చూసుకున్నారు. లూర్దు రాజు టేబిలు చుట్టూ తిరిగి అబ్బుశాస్త్రి ముందుకు వచ్చి నిలబడ్డాడు. "పంతులుగారూ. నిజానికి మీరంటే నాకు కోపం. కులాలు, వర్ణాలు అంటే ద్వేషం. ఆ ద్వేషంతోనే జీవితమంతా గడిపాను. తరతరాలు మా నోటిదగ్గర కూడుని మీరు దోచుకున్నారు. మమ్మల్ని కాలికింద పురుగుల్లాగ చూశారు. మనుషులుగా బతకడానికి అవకాశం ఇవ్వలేదు. కాని–కాని–మనిషి మనిషిగా బతకడానికి ఆ ద్వేషం అక్కర్లేదని మీరు నిరూపిస్తున్నారు. ఆఫ్రికాలో ఒకాయన–తనని పాతికేళ్లు జైల్లో పెట్టిన ఒక వ్యవస్థని క్షమించి ఆ విషయాన్ని నిరూపించారు. ఇవాళ మీరు–మీ లెవెల్లో మరో పాఠం నేర్పారు–థాంక్స్"

ఇప్పుడు టేబిలుమీద ఫైల్ తీసి–"ఈ కంపెనీలో ఒకరు కాపు. ఒకరు బ్రాహ్మణులు. ఒకరు మార్వాడీ. ఒకరు–గవర, ఒకరు–కొండజాతి. ఒకరు వైశ్యులు, ఒకరు రాజు. ఇప్పుడు–ఈ కంపెనీలో మరొకరు చేరుతున్నారు. అతను–మాదిగ. బ్రాహ్మణుడి నుంచి మాదిగ వరకూ ఇది సమగ్రమైన స్పెక్ట్రమ్. ఈ లంకెకు సయోధ్య–సహజీవనం, మానవత్వం, వండ్రఫుల్. నా ఉద్యోగాన్ని చెయ్యడంలో నేనేనాడూ ఇంత తృప్తిని పొందలేదు. నా కెరీర్లో మనస్ఫూర్తిగా పెట్టుబడిని ఇస్తున్న కొత్త కంపెనీ ఇది"

అబ్బుశాస్త్రి కళ్లనిండా నీళ్లు తిరిగాయి. లేచి–ఆర్ద్రంగా లూర్దు రాజు ముఖాన్ని చూసి సభక్తికంగా వొంగి అతని పాదాలకు నమస్కారం చేశాడు.

"శతాబ్దాల కిందట ఆదిశంకరులు ఈ పని చేశారు. ఈరోజు నేనూ ఆయన్ని అనుసరిస్తున్నాను" అన్నాడు. *

---

* **"జాగ్రత్స్వప్న సుషుప్తిషు స్ఫుటతరా యాసం విదుజ్జృంభతే**
**యా బ్రహ్మాది పిపీలికాంత తనుషుప్రోతా జగత్సాక్షిణీ**
**సై వాహం న చ దృశ్యవస్తితి దృఢ ప్రజ్ఞాపి యస్యాస్తిచేత్**
**చండాలోస్తు న తుద్విజోస్తు గురురి త్యేషా మనీషా మమ"**

**(మేలుకొన్నప్పడు, కళ్లు మూసుకొన్నప్పడూ ఏ చైతన్యం చక్కగా ప్రకాశిస్తుందో, బ్రహ్మ నుంచి చీమదాకా అన్ని చోట్లా సాక్షిగా నిలుస్తున్నదో-నేను జడుడిని కాను ఆ చైతన్య స్వరూపాన్ని అన్న జ్ఞానం ఎవరికుందో అతను చండాలుడైనా బ్రాహ్మణుడైనా అతనే నా గురువు) - మనీషా పంచకం, ఆదిశంకరులు.**

## 44

సర్వాంగ సుందరంగా కె.ఎల్.ఓరిగామీ ఎంటర్‌ప్రైజెస్ ఆఫీసు సిద్ధమైంది. సిద్ధమౌతున్నట్టు లీలకి తెలీదు. ఆమె తన కాళ్లా చేతులమీద నిలబడడానికి ప్రయత్నం చేస్తోంది. ఆమెని జీవితంలోనే నిలబెట్టడానికి మరొకపక్క ప్రయత్నం జరుగుతోంది.

కంపెనీ చైర్మన్‌కోసం ఆడీ ఎఫ్ 103 కారు కొన్నారు. చక్కని యూనిఫారంలో ఉన్న డ్రైవరుని నియమించారు. అన్ని విభాగాలకు కావలసిన సరంజామా సిద్ధమైంది. ఈ బృందంలో ఆమె పాత జీవితంలోంచి ఇద్దరు కొత్త అవతారాల్లో స్థిరపడ్డారు–నరిసిపండు, సోయితా. నరిసిపండుకి మంచిచెడుల విచక్షణని నిర్ణయించుకునే స్తోమతు లేదు.

బెర్నార్డ్ షా "పిగ్మాలియన్" నాటకంలో పువ్వులమ్ముకునే పిల్ల (ఎలిజా) తండ్రి డూలిటిల్‌ని ప్రొఫెసర్ హిగ్గిన్స్ ఒక సందర్భంలో నిలదీస్తాడు.

"మర్యాద నేర్చుకో" అని.

డూలిటిల్ నవ్వి "మర్యాద నాలాంటివాళ్లకి లాయకీ కాదు సార్ (I can't afford Governor)" అంటాడు.

నరిసిపండు ఆ జాతివాడు. ఆమెపట్ల గౌరవం ఉన్న ఇద్దరికీ ఆమెని ఉద్ధరించే పనిలో వాటాని కల్పించారు పెద్దలు.

సంస్థ ప్రారంభోత్సవానికి ఆమె ఏ చీరె కట్టుకోవాలో కూడా నిర్ణయమైపోయింది. తన గురించి ఏదో ప్రయత్నం జరుగుతున్నదని లీలకి అర్థమైంది. అయితే అదేమిటో తెలుసుకునే ప్రయత్నం చెయ్యలేదు. చల్లని రాత్రి నక్షత్రాల చాందినీ కింద పడుకున్నవాడు–వెలుగుకి కారణాలు వెదకనక్కర్లేదు. తన శ్రేయస్సుని ఆశించే వ్యక్తులపట్ల విశ్వాసం ఆమెకు ఊరట.

ప్రారంభోత్సవంనాడు నిర్ణయించిన చీరె కట్టుకుని బయటికి వచ్చింది. కొత్త కారుని చూసి ఆశ్చర్యపోయింది.

"ఎవరిదీ కారు?" అంది బలహీనంగా.

"మా చైర్మన్‌గారిది" అన్నాడు నరిసిపండు. డ్రైవర్ యూనిఫారంలో నరిసిపండు అవతారం చూసి ఆశ్చర్యపోయింది. ఎప్పుడూ కనిపించనంత పెద్దమనిషిలా కనిపిస్తున్నాడు. నవ్వుకుంది.

"ఎవరు మీ చైర్మన్?"

"కె.లీల మేడమ్"

ఆశ్చర్యపోయింది.

"దేనికి చైర్మన్?"

చెప్పడానికి ప్రయత్నించి "అన్ని విషయాలు నాకు తెలీవు మేడమ్" అన్నాడు.

"టైమవుతోంది మేడమ్" అన్నాడు డ్రైవరు టోపీ తీసి కారు తలుపు తీసి చేత్తో పట్టుకుని సెల్యూట్ చేసి. దేనికి టైం? ఆశ్చర్యాల లిస్టు ముందు ముందు పెద్దదే ఉంది.

అరటిచెట్లతో, మామిడితోరణాలతో అలంకరించిన అందమైన భవనంలోకి కారు నడిచింది. భవనంమీద పెద్ద అక్షరాలు పలకరించాయి. "కె.ఎల్.ఎంటర్‌ప్రైజెస్". ఏమిటీ 'కె.ఎల్.'కి అర్థం?

పెద్దమనిషి అవతారానికి మారిన నరిసిపండు పక్కకి తప్పుకుని నిలబడ్డాడు. పెద్దమనిషి అవతారంలోనే పుట్టిన పెద్దమనిషి ముకుల్ శిశోదియా కారు తలుపు తీసి ఆమెని ఆహ్వానించాడు.

"వెల్‌కమ్ మేడమ్!"

లీల ఆశ్చర్యపోయింది. "నేను కె.ఎల్.ఎంటర్‌ప్రైజెస్ మేనేజింగ్ డైరెక్టర్‌ని. మీట్ ది డైరెక్టర్స్–నాలుగో ఆయన, అమావాస్య రాజు, రామశర్మ, ఆకియో యోమాషితా–ఇంకా ఇంకా"

"కె.ఎల్. అంటే?"

"కొండ్రావు లీల ఓరిగామీ ఎంటర్‌ప్రైజెస్. మీరు చైర్మన్"

ఎన్నో ప్రశ్నలు. ఎంతో ఆశ్చర్యం. ఏది ముందు అడగాలో ఆలోచించేలోగానే అనసూయ చిరునవ్వుతో హారతి ఇచ్చింది. పాపిడిలో కుంకం దిద్దింది. తృతీయ సవనంలో పూర్ణకుంభం పట్టుకున్న సర్వమంగళం ఎత్తుకున్నాడు.

"పూర్ణా దర్వి పరాపత సుపూర్ణా పునరాపత<br>
వస్నేవ విక్రీణావహా ఇషమూర్జగ్ శతక్రతో

పదిమంది పండితులు గొంతులు కలిపారు. కెమెరాల ఫ్లాష్‌లు వెలుగుతున్నాయి. లీల ఉక్కిరిబిక్కిరి అవుతోంది. ఇంత ప్రయత్నాన్ని తన దగ్గర ఎందుకు దాచారు?

హాల్లోకి అడుగుపెట్టగానే నిర్ఘాంతపోయింది. ఎదురుగా తన ముత్తాత కొండమ్రి శ్రీరాములునాయుడు ఫోటో. పక్కనే లీలా ధాంపే. పక్కనే తన తాత మరిడినాయుడి ఫోటో. పక్కనే అవ్వ చంపావతి. పక్కనే తన తండ్రి శ్రీరాములు నాయుడు. పక్కనే తన తల్లి ముత్తేలమ్మ. తర్వాతి ఫోటో ఆమెను నిశ్చేష్టురాలిని చేసింది. ప్రాణం పోసుకుని ఎదుట నిలబడినంత అందమైన–ఆఫీసరు యూనిఫారంలో ఉన్న కొండ్రావు ఫోటో. పక్కనే తన ఫోటో. అటుపక్కన టెడ్డీ. ఆమెకి కళ్లనీళ్లు తిరిగాయి. ఈ ఏర్పాట్ల వెనుక

ఎంతో ప్రయత్నం, పరిశోధన, శ్రద్ధ, భక్తి తెలిసివచ్చింది.

వచ్చిన ఆహ్వానితులలో బ్యాంకు చైర్మన్ లూర్దు రాజు కూడా ఉన్నాడు. ముకుల్ శిశోదియా పరిచయం చేశాడు. "ఈ పరిశ్రమకి ఆయువుపట్టు ఈయన-ఏ.వన్.బ్యాంకు చైర్మన్ లూర్దురాజు"

ఎర్రటి పూలగుత్తిని చేతిలో పెట్టాడు లూర్దు రాజు. "ఈ పరిశ్రమ విషయంలో కొన్ని రూల్స్ విస్మరించాను. కొన్ని కొత్త రూల్స్‌ని నేర్చుకున్నాను. ఈ కంపెనీ చైర్మన్‌ని ఇంతవరకూ కలుసుకోలేదు. వ్యాపారానికి సంబంధించిన ఏ కారణానికీ నేనీ పెట్టుబడిని ఇవ్వలేదు. నా నమ్మకాన్ని మీరు నిజం చేస్తారని నమ్ముతున్నాను" అన్నాడు.

ఆయన చెప్పిన మాటలు సగం అర్థం కాలేదు లీలకి. తను ఊసుపోకకి కొండ్రావు దగ్గర నేర్చుకున్న చిన్న హస్తకళకి ఇంత విశ్వరూపమా?

ఉన్నట్టుండి లీల తుళ్లిపడింది. చాలామంది ఆహ్వానితుల వెనుక రెండు పరిచయమున్న ముఖాలు తళుక్కుమన్నాయి. కాశీ మామయ్య, మాళవిక. చరచరా నడిచివెళ్లి మాళవిక చేతులు పట్టుకుంది లీల.

ఇద్దరికీ ఒక్క క్షణం మాటలు పెగల్లేదు.

"కంగ్రాచ్యులేషన్స్ మేడమ్" అంది మాళవిక.

కాశీ మామయ్య నమస్కారం చేశాడు.

"మా బావ గొప్పవాడౌతాడని తెలుసు. కాని ఇలా పెద్దవాడౌతాడని తెలీదు" మాళవిక గొంతు వణికింది.

"ఎక్కడ? ఎక్కడ మీ ఆయన?" లీల రహస్యంగా అడిగింది.

మాళవిక నవ్వింది. "మా బావని ఎదిరించినప్పుడున్న ధైర్యం తర్వాత కలిసిరాలేదు మేడమ్. నేను పెళ్లిచేసుకోలేదు. థాంక్ గాడ్"

లీల కళ్లలో నీళ్లు నిండాయి.

"నీ మనిషిని దోచుకున్నాను"

"పరవాలేదు. నా జ్ఞాపకాల్ని దాచుకున్నాను"

ఇద్దరూ హార్థికంగా నవ్వుకున్నారు. ముకుల్ శిశోదియాని చూసింది. "నేనీ కంపెనీ చైర్మన్‌ని కదా?"

ముకుల్ శిశోదియా నవ్వుతూ తలూపాడు.

"చైర్మన్‌గా నా మొదటి నిర్ణయం. ఈవిడని నా పర్సనల్ సెక్రటరీగా

నియమిస్తున్నాను"

కొందరిని హోదా భయపెడుతుంది. కొందరిని హోదా అతి సహజంగా ఆహ్వానిస్తుంది. లీల మానసికంగా చైర్మన్ కావడానికి కేవలం 30 నిముషాలే పట్టింది. "ఒకే మేడమ్" అన్నాడు ముకుల్ శిశోదియా వినయంగా. తలుచుకుంటే ఇలాంటి డజన్ మంది వ్యాపారవేతల్ని సృష్టించగల వ్యాపారవేత్త ముకుల్ శిశోదియా. అధికారపు చాయల్ని పది ఆమడల దూరంలో గుర్తుపట్టగల వ్యక్తి. నవ్వుకున్నాడు. "షీ యీజె నేచురల్ లీడర్" అనుకున్నాడు.

ఇంతవరకూ తాను ఎదురుచూస్తున్న వ్యక్తి కనిపించడంలేదు లీలకి. లీల కళ్లు అతనికోసం వెదుకుతున్నాయి. వెతకగా–వెతకగా–ఎట్టకేలకు కనిపించాడు. లీల నడుస్తున్న పొడవైన కారిడార్ చివర–ఒక మూలన నిలబడిన–అబ్బుశాస్త్రి.

తన వెనుక నడుస్తున్న పరివారాన్ని దాటి–చరచరా అతని సమక్షంలో వెళ్లి నిలబడింది లీల.

అబ్బుశాస్త్రి నవ్వాడు.

"నాకు ఒక్క మాటైనా ఎందుకు చెప్పలేదు?"

"ఇది చెప్పి చెయ్యాల్సిన పని కాదు. ఇది నీ హక్కు. నీకు చేరడానికి ఆలశ్యమైంది. కాదు. నీకు చేర్చడానికి ఆలశ్యమైంది. కొత్త ఇంగ్లీషు మాటని నీకు చెప్పడానికి ఇప్పుడే నేర్చుకున్నాను–సారీ"

లీలకి దుఃఖం పొర్లుకొచ్చింది. పదికోట్ల పెట్టుబడితో–అంతర్జాతీయంగా రెక్కలు విప్పుకోబోతున్న సరికొత్త సంస్థ చైర్మన్–నేలకి వొంగి–ఆమె జీవితంలో ఎన్నడూ తెలియని, తెలుసుకోని పనిని చేసింది. అబ్బు పాదాలకు నమస్కారం చేసింది.

ఆమెను ముట్టుకోకుండానే "శతమానం భవతి. కొండ్రావులాగ తొందరపడకు. నువ్వు చెయ్యాల్సిన పనులు చాలా ఉన్నాయి" అన్నాడు అబ్బుశాస్త్రి మనస్ఫూర్తిగా.

❖ ❖ ❖

ఆ సాయంకాలం ఐదు నక్షత్రాల హోటల్లో పెద్ద విందుని ఏర్పాటుచేశారు కంపెనీ డైరెక్టర్లు. విందు వినోదం కాదు. తమ కంపెనీ నిర్మించబోయే సరకుల ప్రదర్శన. నగరంలో, దేశంలో ముఖ్యమైన వ్యాపార సంస్థలూ, పత్రికా ప్రతినిధులూ, పేరున్న ప్రముఖులూ–అంతా వచ్చారు. కారణం–ఓరిగామీతో వ్యాపారం చెయ్యడమంటే ఏమిటో–ఇది అంతర్జాతీయ వ్యాపారం ఎలా కాగలదో అర్థంకాని ఎందరో వ్యాపారులు కుతూహలాన్ని తీర్చుకోడానికి, లాయకీ అయితే చేయి కలపడానికి సిద్ధపడి వచ్చారు.

సంస్థ నిర్మించబోయే రకరకాల వస్తువులను-ప్రదర్శనని అతి హృద్యంగా ఏర్పాటుచేశారు. కాగితంతో ఓరిగామీ విభాగంలో-బిజినెస్ కార్డులూ, గ్రీటింగ్ కార్డులూ, కేలెండర్లూ, గోడ అలంకారాలూ, గుడ్డల విభాగాలలో-నేప్‌కిన్స్, రుమాళ్లు, పరుపులమీద ఓరిగామీ డిజైన్ల బెడ్ స్ప్రెడ్స్, ఇంకా అల్యూమినియం అలంకారాలు, రంగురంగుల టెలిఫోన్ హోల్డర్లు, కార్పొరేట్ టేబిళ్లమీద పెన్ హోల్డర్లు, వాచీల డిజైన్లు; వెండితో రకరకాల మీనియేచర్ వస్తువులు, కోటు బొత్తాములు, హాండ్ కఫ్స్, గోడ గడియారాల డిజైన్లు; బంగారంతో చెవి అలంకారాలు, బ్రేస్‌లెట్‌లు, ముక్కుపుడకలు; సన్నని తీగెలతో రాగి, వెండి, బంగారాల డిజైన్లు, ఓరిగామీ ఫోటో ఫ్రేముల అలంకారాలు-అది హస్తకళ విశ్వరూపం. పది రూపాయల నుంచి పది లక్షల రూపాయల వరకూ-అంతర్జాతీయంగా సరుకుని డిజైన్ చేయగల పనివాడితనం నమూనాల్ని పరిచి చూపించారు. కొత్త కళని కొత్త పనివాడితనంతో, కొత్తరకం అవసరాలను నిర్దేశిస్తూ-విదేశీ మారకద్రవ్యాన్ని ఎలా సంపాదించవచ్చో సోదాహరణంగా నిరూపించి చూపించారు. బ్రాండ్ పేరు "కేఎల్స్"

వచ్చినవాళ్లు నిశ్చేష్టులయారు. ఆయా వస్తువుల కొత్తదనాన్నీ, కొత్త సొగసుల్నీ చూసి ముచ్చటపడిపోయారు. పబ్లిక్ రిలేషన్ల టేబిలు దగ్గర కొన్ని డజన్ల ఓరిగామీ ఎంటర్‌ప్రైజెస్ బిజినెస్ కార్డులు చేతులు మారాయి.

ఇదంతా లీలకి కొత్త. ఈ విశ్వరూపానికి మూలకారకుడూ, ఇందులో నిశ్శబ్దంగా తన పాత్రని నిర్వహిస్తున్న అబ్బు శాస్త్రి ఒక మూల నిలబడి ఉన్నాడు. అందరి చేతులో విస్కీ, బ్రాందీలు విరివిగా ప్రవహిస్తున్నాయి. సన్నని జపాన్ సంగీతం అందరినీ పలకరిస్తోంది.

ఆ ఆహ్వానితులలో-ఒకప్పుడు నేలబారు మనిషిగా జీవికను ప్రారంభించి-పెరిగి పెద్దవాడైనా చిన్న బుద్ధులు పోని పెద్దమనిషి-సుభాష్ పట్నాయక్ ఉన్నాడు. చిన్నవాళ్లకి పెద్దవారి సాంగత్యంలో తమ గొప్పతనాన్ని చాటుకోవాలంటే ఒకనాటి తమ చిన్నతనమే అక్కరకు వస్తుంది. రోడ్డుమీద అడుక్కు తినేవాడికి ప్రధానమంత్రిని నేలమీదకి లాగడానికి అతని చిన్నతనమే అక్కర. "ఒకప్పుడు ఆయన టీ అమ్ముకునేవాడండీ, నేనే రోజూ రెండు రూపాయలిచ్చి తాగేవాడిని" అంటాడు. గొప్పవాళ్ల గొప్పతనాన్ని అంగీరించకుండా వాళ్లని నేలమీదకి లాగాలనుకున్నప్పుడు వాళ్ల చిన్నతనమే సాధనం.

సుభాష్ పట్నాయక్ అర్ధాంతరంగా ఎదిగినవాడు. సాయంకాలంనుంచీ ఈ చైర్మన్ లీలనీ, ఈ హంగామానీ చూస్తున్నప్పుడు ఒక్క విషయం అతని మనసులో కదులుతోంది. ఈ లీలని తనకు తెలుసు. ఇప్పుడు కోట్ల వ్యాపారానికి మూలస్తంభంగా నిలిచిన ఈ మనిషిని తాను చాలా రాత్రులు బట్టలేకుండా చూశాడు. నిజానికి అది ఏకాంతం. అతని

సొంతం. రహస్యం. ఆ నిజం బయటపెట్టడంవల్ల ఆమె పరపతి తగ్గుతుంది. కాని తన పరపతీ పెరగదు.

"అతన్ని నాకు తెలుసండీ. ఒకప్పుడు కల్లుపాకల్లో దేబిరించి తాగేవాడు" అంటే–మూడు బయటపడతాయి. ఎదుటివాడి పరపతి అగాథంలోకి కూలిపోతుంది. రెండోది–తన అడ్రసూ ఒకప్పుడు కల్లుపాకేనని నలుగురికీ అర్థమౌతుంది. మూడు–తన సంస్కారం పతనమౌతుంది. అయితే పెద్దవాడు కావాలనే చిన్నవాడి దురద ఆ విచక్షణను అటకెక్కించేస్తుంది. ఆ సాయంకాలం చేతుల్లో గ్లాసులు మారుతున్నకొద్దీ సుభాష్ పట్నాయక్‌కి ఆ దురద పెరుగుతూ వచ్చింది. తన భార్య లతిక తనకి దూరంగా మరెవరో పెద్దమనుషుల్తో మాట్లాడుతోంది.

తన చుట్టూ ఉన్న నలుగురితో మరో నలుగురికి వినిపించేటట్టు అన్నాడు సుభాష్ పట్నాయక్. "నాకీ ఛైర్మన్‌గారి అసలు అవతారం తెలుసండీ" అని.

అంతే. పదిమంది మాటలూ ఆగిపోయాయి. అవినీతికి ఒక జబ్బు ఉంది. అది మనల్ని రెచ్చగొట్టి, ఔచిత్యాన్ని అటకెక్కించేస్తుంది. అంతమంది ఆశ్చర్యంగా తనవేపు తిరగడం సుభాష్‌కి కొత్త బలాన్నిచ్చింది.

"ఒకప్పుడు ఈవిడగారు కాలు జారిన మనిషి"

అందరి ముఖాల్లో షాక్. ఆ దృశ్యం సుభాష్‌కి రుచిగా ఉంది. పదిమందీ అతని చుట్టూ చేరారు. సుభాష్ కడుపులో కితకితలు పెడుతున్న విస్కీ, అతని చుట్టూ చేరిన పదిమంది ప్రమోటర్లూ అతనికి ఎక్కడలేని శక్తినీ ఇచ్చాయి. సుభాష్ పట్నాయిక్ ముఖంమీద పెద్ద చిరునవ్వు మొలిచింది. "నేను దీన్ని–అంటే ఈ ఛైర్మన్‌ని–ఒకప్పుడు నంచుకున్నాను"

ఆ మాట పావురాల సమూహంలో తుపాకీలాగ పేలింది. రహస్యంగా చెప్పాననుకున్నాడు సుభాష్. కాని అతని ఉత్సాహానికి విస్కీ దోహదమై–అతని మాట రహస్యం అనిపించలేదు. ఒక ప్రకటనలాగ ప్రతిధ్వనించింది. అంతవరకూ నవ్వులతో, మాటలతో నిండిపోయిన హాలు ఉన్నట్టుండి కొయ్యబారిపోయింది. ఈ అనౌచిత్యానికి కాదు. ఇంత రుచికరమైన అనౌచిత్యపు వార్తకి. అందరిమధ్యా ఈ వార్త కొండనిప్పులాగ వ్యాపించింది. కొందరు నవ్వారు. కొందరు బుగ్గలు నొక్కుకున్నారు. కాని అందరూ ఈ ఉత్సాహానికి బానిసలయారు. పుకారు ప్రాథమిక బలం–అవినీతి. అవినీతికి అందమైన ముసుగు–పెద్దరికం. ఈ సాయంకాలాన్ని విప్లవాత్మకంచేసే ఓ వ్యవస్థ అధిపతి–ఒక వ్యభిచారి. ఓహ్! ఏం సరదా వార్త!

ముకుల్ శిశోదియా తుళ్లిపడ్డాడు. ఆయన కార్యదక్షుడు. ఇద్దరు హోటల్ సర్వర్లకు సంజ్ఞ చేశాడు. వెంటనే చర్య ప్రారంభమైంది. ఇద్దరూ వచ్చి సుభాష్ పట్నాయక్ భుజంమీద

చెయ్యి వేశారు. "పదండి సార్!" అన్నారు.

ఈపాటికి హాలంతా ఇటువేపే చూస్తోంది. ఇప్పుడు ఈ బలప్రయోగానికి తను లొంగడం బలహీనత అని తేల్చుకున్నాడు సుభాష్ పట్నాయక్. ఇప్పుడు తన అనౌచిత్యానికి రంగులు పూయడం తప్పనిసరి. ఇది నీటిలో మునిగిపోతున్నవాడి ఆఖరి ఉబలాటం. రక్షించేవాడిని కూడా తనతో కిందకి గుంజుతాడు.

"లీవ్ మీ ఎలోన్!" అని అరిచాడు.

మరో నాలుగు చేతులు భుజంమీద పడ్డాయి. అతని భార్య లతిక షాక్అయి దగ్గరికి వచ్చింది.

సుభాష్ అరిచాడు. "ఏం? నా నోరు మూయించాలని చూస్తున్నారా? నేను చెప్పింది నిజం కాదని ఆ బిచ్‌ని చెప్పమనండి. ఛాలెంజ్!"

ఇప్పటికి–ఒక జీవితకాలం కలలుగని, ఎందరో సహృదయుల మధ్య అంతర్జాతీయ స్థాయిలో రూపుదిద్దుకున్న ఒక గొప్ప ప్రయత్నం–ఒక సాయంకాలం కె.ఎల్.ఎంటర్‌ప్రైజెస్ యాజమాన్యం సాధించిన గొప్ప ప్రభావం–ఈ 'పెంట'తో సమూలంగా సర్వనాశనమైపోయింది. కెమెరాలన్నీ ఇప్పుడు సుభాష్ పట్నాయిక్‌మీద ఉన్నాయి. మూవీ కెమెరాలు ఆదరాబాదరాగా తిరుగుతున్నాయి. సుభాష్‌కి ఎక్కడలేని ధైర్యం వచ్చింది. కాదు. తెగింపు వచ్చింది. ఇది ఓ గొప్ప ప్రయత్నాన్ని విధ్వంసంచేసిన దౌర్జన్యకారుడి ఆఖరి విన్యాసం.

"హోటల్ లక్కీ రెసిడెన్సీ, సరిగ్గా ఏడేళ్ల కిందట–స్వాతంత్ర్యదినం మర్నాడు..."

ముకుల్ శిశోదియా అతి బలంగా, అతి క్రూరంగా అతని టై పట్టుకున్నాడు. నలుగురైదుగురు ఆపడానికి ప్రయత్నించారు. ఇద్దరు ముగ్గురు సుభాష్ పట్నాయిక్‌కి సహాయపడడానికి ముందుకొచ్చారు. ఈ హడావుడిలో ఓ టేబిలు తల్లకిందులైంది. పది గ్లాసులు, రెండు సీసాలూ, రెండు టేబులు లైట్లూ బద్దలయ్యాయి.

ఒకే కంఠం "అతన్ని విడిచిపెట్టండి. ప్లీజ్!" అని అరిచింది. ఆ కంఠం లీలది.

దూరంగా–చాలా దూరంగా నిలబడి ఈ అవ్యవస్థని గమనిస్తున్న అబ్బుశాస్త్రి ముఖంలో ఆశ్చర్యం మొలకెత్తింది.

ముకుల్ శిశోదియా చెయ్యి సడలింది. ఇప్పటికి హాలంతా నిశ్శబ్దమైపోయింది. సంగీతం ఆగిపోయింది.

లీల అతి హుందాగా సుభాష్ పట్నాయక్‌కి ఎదురుగా వచ్చి నిలబడింది. నలిగిపోయిన అతని టైనీ, సూటునీ సర్దింది. "వెరీ సారీ" అంది.

సుభాష్‌కి ఇది అంతులేని విజయం. నేరస్థుడి క్షమాపణ, అవినీతిపరుడి నిస్సహాయతకి విరుగుడు. తను చెప్పిన నిజానికి మద్దతు.

ఇప్పుడు పక్కటేబులుమీద ఉన్న మైక్ తీసుకుంది లీల. నెమ్మదిగా, ఠీవిగా "సార్ ఓ గొప్ప నిజాన్ని మర్చిపోయారు. లక్కీ రెసిడెన్సీ, డేటూ రైటే. సూట్ నంబర్–1142. అవును. నేను వ్యభిచారంచేసి బతికాను. దానికి మంచి సాక్ష్యం అప్పటి నా కస్టమర్–ఏమిటి మీ పేరు?"

"సుభాష్"

"వి.సుభాష్ చంద్ర బోస్, షిప్పింగ్ క్లియరర్స్ అండ్ స్టివడోర్స్. ఆ కంపెనీని వదిలిపెట్టి తర్వాత కుక్క బిస్కత్తుల ఫ్రాంచైస్‌లో వాటాదారుడయారు. కుక్క బిస్తత్తుల వ్యాపారం దక్కడానికి తన పెళ్లాన్ని బాస్ పక్కలో పడుకోపెట్టి–ఆ నిస్సహాయతను మర్చిపోడానికి–డబ్బిచ్చి–నాతో చెప్పుదెబ్బలు–కోపంతో కాదు–తనని తాను హింసించుకోడానికి–కొట్టించుకుని–కసిని చంపుకుని–తప్పతాగి–మూడో ఝామున భద్రంగా నోట్లకట్టని నా తలగడా కింద ఉంచి నేను లేవకముందే వెళ్లిపోయే ఈ నపుంసకుడు–మీట్ వి.సుభాష్ చంద్ర బోస్, లతిక డాగ్ ఫుడ్ సప్లయర్ అండ్ పింప్"

వింటున్న కొందరి ముఖాల్లో చిరునవ్వుల మొలకలు. సుభాష్ భార్య లతిక ముఖంలో ఉదాసీనత. సుభాష్ ముఖంలో నిస్సహాయత.

లీల మాట్లాడుతోంది. "అవును. నేను వ్యభిచారిని. కాని వ్యభిచారాన్ని అవకాశం చేసుకునే ఇలాంటి తార్పుడుగాళ్లు ఈ సమాజంలో పెద్దమనుషులు–మీట్ రెస్పక్టబుల్ పింప్ వి.సుభాష్ చంద్ర బోస్, ఎ మాన్ హూ లివ్స్ డాగ్స్ లైఫ్ ఆన్ డాగ్స్ ఫుడ్" అని అతిధులవేపు తిరిగి "ఇతని భార్య–లతిక–ఈయన వ్యాపారాన్ని కొనిపెట్టిన పెట్టుబడి. ఈ కంపెనీ పేరుకీ మరో గొప్ప కథ ఉంది. కొత్త కంపెనీని ప్రారంభించాక–ఈ దౌర్భాగ్యుడు కంపెనీకి తన కుక్క 'సీజర్' పేరు పెట్టాలనుకున్నాడు. తనకోసం వొళ్లిచ్చిన పెళ్లాంమీద విశ్వాసం లేదు. కాని వొళ్ళుని వాడుకున్న బాస్ ఆ విశ్వాసాన్ని చూపించాడు. కంపెనీకి పెళ్లాం పేరు పెట్టించాడు. ఈయనగారి కంపెనీ పేరు లతిక డాగ్ ఫుడ్స్–అని పేరు పెట్టడం ఈమెతో సుఖాన్ని మరిగి మరిగి ఆ బాస్ ఈ పశువుని తలవొంచి ఒప్పించిన షరతు"

ఇప్పుడు లతికవేపు నడిచింది "నన్ను క్షమించండి మేడమ్. మిమ్మల్ని ఇలా బయటపెట్టవలసివచ్చినందుకు సిగ్గుపడుతున్నాను. మనిద్దరం వ్యభిచారం చేశాం. కాని మీ వ్యభిచారానికి ముసుగు ఉంది. నా వ్యభిచారానికి లొసుగు వుంది. మేడమ్! ఇలాంటి వానపాముల్నీ, లుచ్చాల్నీ పెళ్లిచేసుకుని–ఇంత దరిద్రపు బతుకు బతికేకంటే మర్యాదైన

వ్యభిచారి కావడంలో మనశ్శాంతి ఉంది. మీ మొగుడు వంటి కుక్కలే వ్యభిచారానికి పెట్టుబడులు”

“చేతనైతే ఇలాంటి నీచుల్ని ఎదిరించండి. చెంప పగులగొట్టి–బయటికి నడిచి–ఏమీ చెయ్యలేకపోతే–వ్యభిచారిగా మారండి. అక్కడ మీ శరీరానికి స్వేచ్ఛ ఉంటుంది. ఇలాంటివాళ్లు చేయించే వ్యభిచారంలో ఆత్మవంచన ఉంది. ఇలా బయటపడే దారులన్నీ మూసుకుపోయినవారే–గౌరవంగా, గర్వంగా వ్యభిచారులౌతారు”

అందరూ నిర్ఘాంతపోయి చూస్తున్నారు. ఎవరి నోటివెంటా మాట లేదు.

అందరితో లీల అంది–“వెల్ జెంటిల్మన్! ఫుడ్ ఈజ్ రెడీ”

ఒక్కరే–ఒక్కరే ఒక్కరు–సంతృప్తిగా హోటల్లోంచి బయటికి నడిచారు–అబ్బుశాస్త్రి. అతని ముఖంలో చిరునవ్వు ఇంకా నిలిచే వుంది. గుండెల్లో తృప్తి ఉంది.

అపజయాన్ని తట్టుకోగలగడం గొప్ప విజయం. గతాన్ని గర్వంగా ఒప్పుకోగలగడం గొప్ప పరిణతి.

ఆమెలో పొగరుంది. కసి ఉంది. అన్నిటికీమించి ముక్కలుగా నరికే పదునైన నిజాయితీ ఉంది. మార్పుని గర్వంగా ఆహ్వానించే దమ్ముంది. ఇక లీల ధైర్యంగా, గొప్పగా బతకగలదు.

ఆమెకి తన అవసరం లేదు.

## 45

చేప నీటికి అలవాటుపడినట్టు అధికారానికి అతి సుళువుగా అలవాటుపడింది లీల. ఒకవిధంగా అది వారసత్వం. ఆమె జీన్స్‌లోనే ఉన్న లక్షణమది. మాళవికను తన ఇంటికే రప్పించుకుంది. జీవితంలో అవ్యవస్థ కారణంగా చదువు అస్తవ్యస్తంగా సాగింది. ఆరోజుల్లో తన జీవితానికి ఓ గమ్యం లేనట్టే తన చదువుకీ లేదు. ఇవాళ రెంటికీ అర్థం కనిపిస్తోంది. రెండు పనులు చకచకా చేసింది. కంపెనీ చైర్మన్ తన సెక్రటరీ మాళవిక దగ్గర బుద్ధిగా కూర్చుని–చదువుని అడ్డతోవలో ఆక్రమించుకుంది. ప్రైవేటుగా డిగ్రీ పరీక్షకు చదివింది. ఈ దశలో చదువుకి ప్రయోజనం డిగ్రీ కాదు. తన వ్యవహారాల నిర్వహణ. తన సామర్థ్యాన్ని ఎవరి ముందూ నిరూపించుకోనక్కర్లేదు. వినియోగించుకోవాలి. కొందరికి పుట్టుకతోనే వచ్చే ఇన్‌స్టింక్ట్ ఆ పని చేయిస్తుంది. చదువు సానబెడుతుంది. లీల విషయంలో అదే జరిగింది.

టెడ్డీ కొడైకెనాల్ వెళ్లలేదు. ముకుల్ శిశోదియా తలుచుకుంటే కొడైకెనాల్ స్కూలు

బ్రాంచిని హైదరాబాదు తీసుకురాగలడు. ఆమె నవ్వుకుంది. అవసరం లేదు. టెడ్డీ హైదరాబాదు పబ్లిక్ స్కూల్‌లో చేరాడు.

లీల కుర్చీలో కూర్చోగానే తీసుకున్న మొదటి నిర్ణయం–చైర్మన్‌గా అది రెండో నిర్ణయం (మాళవిక ఉద్యోగం మొదటిది)–రామశర్మనీ, లాయర్లనీ పిలిపించింది. కంపెనీ పేరు మార్చాలని నిర్ణయించింది. అందరూ గతుక్కుమన్నారు. అభ్యంతరం తెలిపారు. దానికి బోలెడు తతంగం ఉంది. మొమొరాండం మారాలి. పేపరులో ప్రకటన ఇవ్వాలి. బ్యాంకులతో చేసుకున్న ఒప్పందాలన్నింటిమీదా రెండు వర్గాలూ మళ్లీ సంతకాలు చెయ్యాలి. ఇంకా ఈ కంపెనీ ప్రారంభదశలోనే ఉంది. ఇలాంటి చర్య బాధ్యతారహితంగా, పరిణతిలేని ఆకతాయితనంగా కనిపిస్తుంది. లెటర్‌ప్యాడ్స్ మారాలి. కామన్ సీల్ మారాలి. చెక్కుబుక్కులు మారాలి. విజిటింగ్ కార్డ్స్ మారాలి. అన్నిటికన్నా ముఖ్యం అంతర్జాతీయంగా రిజిస్టరు చేసిన బ్రాండు పేరు "కెఎల్స్" మారాలి. కారణాల్ని ఎత్తిచూపుతూ హెచ్చరించారు.

లీల పట్టువిడువలేదు. ఏమిటి కొత్త పేరు? "అబ్బు ఓరిగామీ ఎంటర్‌ప్రైజెస్". నిస్సహాయంగా ప్రాథమిక స్థాయినుంచీ మార్పుకి పూనుకున్నారు. కంపెనీ బోర్డులు మారాయి. లోగో మారింది. ఫ్యాక్టరీ వస్తువులమీద బ్రాండు స్టాంపు మారింది. లెటర్‌హెడ్స్ మారాయి. సిబ్బంది వివరాలు మారాయి.

ఇప్పుడు తృప్తిగా "అబ్బు ఓరిగామీ ఎంటర్‌ప్రైజెస్" రిజిస్టర్డ్ ఆఫీసులో–చైర్మన్‌గదిలో కుర్చీమీద తృప్తిగా కూర్చుంది.

మాళవిక అడిగింది "ఎందుకింత రాద్ధాంతం చేశారు?"

లీల నవ్వింది. నాలుగే అక్షరాలు చెప్పింది. "కృతజ్ఞత. గతాన్ని మర్చిపోయినవాడు పశువు. గతాన్ని మరిపించి నా జీవితంలో కొత్త పేజీని తెరిపించిన వ్యక్తి నేను ఇక్కడ కూర్చున్న ప్రతీ క్షణం నా మనస్సులో కదలాలి"

ఒకప్పుడు కొండగ్రావు స్ఫూర్తితో సరదాగా నేర్చుకున్న హస్తకళ–ఓరిగామీ ఇంత విస్తృతమైన వ్యాపారం కావడం ఆమెని ఉత్సాహపర్చింది. ఈ పని తనకి తెలుసు. దాని లోతుపాతులు తెలుసు. చెయ్యాల్సిన పనులు తెలుసు. తెలిసిన మరో మనిషి ఓషియో యోమాషితా ఉన్నాడు. దానిని వ్యాపారం ఎలా చెయ్యాలో తెలిసిన డైరెక్టర్లు ఉన్నారు. సంస్థ అచిరకాలంలో మూడు పువ్వులూ ఆరు కాయలూ అయింది.

సంస్థ ప్రారంభమయాక–ఒక్కసారీ–అటువేపు రాలేదు అబ్బుశాస్త్రి. అందుకు కారణం–ఇకమీదట తన అవసరం లీలకి లేదని మనసారా నమ్మడమే. ఆ సత్యాన్ని నిరూపిస్తోందని రామశర్మద్వారా తెలుసుకుని ఆనందించడమే. కంపెనీ పేరు మార్చినందుకు ఒకవిధంగా బాధపడ్డాడు. పెద్దలందరూ కూర్చుని తీసుకున్న నిర్ణయమది.

సెంటిమెంటు ఆ ఏర్పాటుని చెడగొట్టకూడదు. కొందరిని గమ్యం ఉపశమనపరుస్తుంది. మరికొందరిని రెచ్చగొడుతుంది. న్యాయంగా ఆ దశలో అబ్బుశాస్త్రికి కలిగింది అంతులేని ఉపశమనం. కాని శరీరంలో రోగం ముదురుతోంది. ఆ విషయం మొన్నటివరకూ తన కొక్కరికే తెలుసు. ఇప్పుడా పరిధిలోకి చొచ్చుకువచ్చిన వ్యక్తి అనసూయ. అతను కోరకపోయినా అనసూయ అతని నీడ అయిపోయింది.

బాధకి కొందరు లొంగిపోతారు. మరికొందరు బాధని స్థితప్రజ్ఞులులాగ లొంగదీసుకుంటారు. ఇదివరకుకంటే తరుచుగా అబ్బుశాస్త్రి నోట్లోంచి రక్తం పడుతోంది. మాటల్లో శక్తి తగ్గింది. అనసూయ కన్నీటితో సేదదీరుస్తోంది. డాక్టర్ల సహాయం అవసరమని ప్రాధేయపడింది. కాని అబ్బు ఒప్పుకోలేదు.

ఆ తర్వాత–ఆ తర్వాత–అనసూయ ఎన్నో రాత్రులు మదనపడి మాట తప్పింది. అతని పరిస్థితిని చూసి ఇద్దరికే ఆ రహస్యాన్ని విప్పింది. సర్వమంగళానికి, రామశర్మకి. మూడో రోజు వచ్చి వాలాడు ముకుల్ శిశోదియా. ఏ సమస్యనైనా అరచేతితో ఆపగల ఆత్మవిశ్వాసం, సామర్థ్యం గల ముకుల్ ఆరోజు పసిపిల్లాడిలాగ ఏడ్చాడు.

"మీ ప్రాణాన్ని అడ్డంపెట్టి నా బిడ్డ ప్రాణాన్ని కాపాడారు. మీ ప్రాణాన్ని కాపాడడానికి నాకు ఛాన్స్ ఇవ్వలేదు" అన్నాడు. రోగం ముదిరింది. పరిస్థితి చెయ్యి దాటిపోయింది.

బొంబాయి రావడానికి నిరాకరించాడు అబ్బుశాస్త్రి. రేడియం చికిత్సని నిరాకరించాడు. ఒక్కటే చెప్పాడు. "నన్ను ఏ రోగమూ ఏమీ చెయ్యలేదు. నాకు నా చెల్లెలు శుభకామన శ్రీరామ రక్ష"

ఇది తెగించిన వ్యక్తి పలాయనం. ఆయన నిర్ణయాన్ని ఎవరూ మార్చలేకపోయారు. అబ్బు చేతులు జోడించి అందరినీ ఉమ్మడిగా ప్రార్థించినది ఒక్కటే. "దయచేసి ఈ విషయాన్ని లీలకి తెలియనివ్వకండి. ఆమె సగం జీవితం నాశనం కావడానికి కారణం నేను. మిగతా నా జీవితం కలిసిరాకపోవడానికి కారణం–విధి. మళ్లీ ఈ దశలో ఆమె మనశ్శాంతిని చెడగొట్టి నా పాపాన్ని పెంచకండి". అందరికీ ఈ కోరిక సబబుగా అనిపించింది. అందరూ నోరు మూసుకున్నారు.

ఒకటి రెండుసార్లు లీల అబ్బు సమాచారం అడిగింది–అబ్బు మాట కాదనలేని రామశర్మ–అబద్ధాలు చెప్పాడు. అతన్ని చూడడానికి రాబోయిన ఆమెని తన గ్రామానికి వెళ్లాడంటూ ఆపాడు.

సృష్టిలో విచిత్రమైన విపర్యయం ఉంది. అపూర్వమైన నిరాశకీ ముగింపు మృత్యువు. అపూర్వమైన విజయానికి ముగింపు మృత్యువే. మృత్యువు ఓ గొప్ప ఆదర్శానికి ముగింపు.

ఓ గొప్ప జీవితానికి ప్రతీక. ఓ గొప్ప సత్యానికి తెరచాప.

ఆ పని చాలా విచిత్రంగా జరిగింది అబ్బు విషయంలో.

శరీరంలో శక్తి సన్నగిల్లుతుండగా-తనని తాను బయట ప్రపంచం నుంచి మినహాయించుకున్న అబ్బుకి ఓ హెచ్చరిక అందింది-లీల దగ్గర్నుంచి. టెడ్డీ పుట్టినరోజు. అబ్బు ఆశీర్వాదం తీసుకోవాలి. ఊళ్లో లేదని కబురంపాడు అబ్బు. అది అబద్ధం కదా?

సుమంత్రుడు రథాన్ని నడుపుతూండగా శ్రీరాముడు సీతాలక్ష్మణులతో అడవికి బయలుదేరాడు. మహారాజు దశరథుడు శ్రీరాముడిని వెనక్కి పిలిపించమని నిస్సహాయంగా శాసనం చేశాడు. శ్రీరాముడికి తెలిసింది. రథం అప్పటికే నగరాన్ని దాటిపోయిందని చెప్పమన్నాడు. సుమంత్రుడు అడిగారు-తీరా తాను తిరిగివచ్చాక మహారాజు తన శాసనాన్ని ఉల్లంఘించినందుకు నిలదీస్తే? దశరథుడి మాట వినిపించలేదని చెప్పమన్నాడు శ్రీరాముడు. 'రామో విగ్రహవాన్ ధర్మః' అన్నారు కదా-మరి ఇది అధర్మం కదా? కాదన్నది గోవిందరాజీయ వ్యాఖ్య. తండ్రి మాటను తాను పాలించి, తండ్రి తన మాటను తాను పాలించేటట్టు చేశాడు. కనుక అది ధర్మమేనన్నారు పెద్దలు.

వచ్చే అవకాశం లేదని కబురుచేశాడు అబ్బుశాస్త్రి. ఇది ఒకవిధంగా నిజమే.

లీలకి దుఃఖం వచ్చింది. అబ్బుని చూసి చాలా కాలమైంది. కొడుకుని తీసుకుని కారులో బయలుదేరడానికి నిశ్చయించుకుంది. ఆ విషయాన్ని తెలియజేశాడు రామశర్మ.

అబ్బు లేచాడు. అంగవస్త్రం మీద వేసుకున్నాడు. శరీరంలో శక్తి సన్నగిల్లింది. అయిష్టంగా తనే లీల దగ్గరికి బయలుదేరాడు. అనసూయ భయపడింది. "నువ్వు వెళ్లలేవు అన్నా. ఆమెని రానీ" అంది.

అబ్బుశాస్త్రి ముక్కుమీద వేలేసుకున్నాడు. "ఆమె పెద్దింటి పిల్ల. గొప్ప పదవిలో ఉంది. తనని చూడాలంటే నేనే వెళ్లాలి". గుమ్మందాకా అతనితో నడిచింది అనసూయ. "భయపడకమ్మా. మృత్యువు నీకంటే శక్తిమంతమైంది కాదు" అన్నాడు.

నాలుగు అడుగులు వేసి మెయిన్ రోడ్డుమీదకు వచ్చాడు. ఆటో ఎక్కాలి. రోడ్డు రద్దీగా ఉంది. ఖాళీగా ఏ ఆటో కనిపించలేదు. ఫ్యాక్టరీ ఆఫీసు చాలా దూరం. కాళ్లు ఈడిగిలపడుతున్నాయి. అప్పుడు చూశాడు-రోడ్డుకి అటుపక్క ఉన్న లీల కారుని. అతన్ని చూసి ఆమె కారు దిగింది. ఆమె చెయ్యి పట్టుకుని టెడ్డీ. అబ్బు రోడ్డుకి అటుపక్క ఉన్నాడు. ఆమె ఇటుపక్క. చాలా నెలల తర్వాత ఆమెని చూస్తున్నాడు. మూర్తీభవించిన అధికారంలాగ ఉంది లీల. ఆత్మస్థైర్యానికీ, ఠీవికీ, హుందాతనానికీ అంగీ తొడిగినట్టుంది. సంవత్సరాల కిందట లీల చేతుల్లో టెడ్డీ బొమ్మ స్థానంలో తొమ్మిదేళ్ల టెడ్డీ మెరిసిపోతున్నాడు.

అది అతని మనస్సుని పరిపూర్ణంగా నింపిన దృశ్యం. ఇక మనస్సులో ఖాళీ లేదు.

ఇద్దరికీ మధ్య ధారావాహికంగా సాగిపోతున్న జనవాహిని.

లీల తన జీవితలక్ష్యానికి పరాకాష్టలాగ ఉంది. ఒక జీవితకాలం తాను చేసిన పాపాలకు క్షమాపణలాగ ఉంది. తను సంవత్సరాలనుంచీ కలలుగన్న విజయంలాగ ఉంది. వాహనాల రద్దీ అబ్బుకి తెలియడంలేదు. అతి అరుదైన సందర్భాలలో మాత్రమే తెగిపోయే వరదలాగ కళ్లు ధారలుకట్టాయి.

లీల పరిస్థితీ అదే. తనని ఆకాశంలో నిలిపి ఆనందిస్తున్న ప్రవక్తలాగ తన జీవితానికి ఉపశమనంలాగ ఉన్నాడు. తన విజయానికి నికేతనంలాగ ఉన్నాడు. ఆ క్షణంలో రోడ్డుమీదే వాహనాల ప్రవాహం స్థంబించింది. ఆమెకి ఒక్కటే కనిపిస్తోంది. అబ్బు ముఖం. టెడ్డీని పట్టుకుని అడుగు ముందుకు వేసింది.

ఒక్క లిప్తలో అబ్బు ఆలోచనాప్రవాహం తెగిపోయింది. బిడ్డ తల్లిలో వాత్సల్యాన్నే చూస్తుంది. తల్లి బిడ్డ రక్షణని చూస్తుంది. చిన్న చీమకైనా ఎంత ధైర్యం తన బిడ్డని కుట్టడానికి? కళ్లముందు వాస్తవం గొడ్డలిపెట్టులాగ మీద పడింది. ఆమెమీదకి దూసుకువస్తున్న లారీ. "లీలా–వద్దు–ఆగు" అని గావుకేక పెట్టాడు. పెట్టాననుకున్నాడు. గొంతు సహకరించలేదు. పెద్ద కేక చిన్న మూలుగు అయింది. కాని లీలకి ఆ పిలుపు వినిపించింది. ముందుకు వేయబోయిన రెండో అడుగు ఆగింది.

ఆమెని రక్షించాలన్న ఆత్రంతో–కలిసిరాని గొంతుకు ప్రత్యామ్నాయంగా–లేని శక్తితో ముందుకు దూకాడు అబ్బు. సరిగ్గా రోడ్డు మధ్యకి వచ్చాడు. ఆమెవేపు మీద పడబోయే లారీని చూశాడు. కాని తనమీదకి దూసుకువస్తున్న బస్సుని ఒక జీవితకాలం ఆలస్యంగా చూశాడు. బస్సు మీదకి దూసుకువచ్చింది. డ్రైవరు ఆపలేకపోయాడు. కీచుమన్న బస్సు బ్రేకులు. బస్సుకింద పడిన అబ్బు శరీరం. వాహనాల ప్రవాహం నిలిచిపోయింది. లీల పిచ్చిగా కేకపెట్టింది.

కింద–బస్సు చక్రాల కింద అబ్బు శరీరం. కళ్లు ఒక్క లిప్త తెరుచుకున్నాయి.

ఆ కళ్లనిండా లీల ముఖం నిండింది. ఆ కళ్లకు తెలిసిన ఆఖరి దృశ్యం అదే. వాటి లక్ష్యాన్ని ఆ శరీరానికి శాశ్వతంగా వదులుకున్నాయి.

అబ్బు కళ్లు అలాగే నిలిచిపోయాయి.

❖ ❖ ❖

సంస్థ ఆవరణలోనే అబ్బు అంత్యక్రియలకి ఏర్పాట్లు జరిగాయి. ఆ ఆవరణలోనే ఒక స్మారక స్థూపం ఏర్పడాలంది లీల.

ఒక జీవితకాలంపాటు అబ్బు సౌజన్యం స్పృశించిన వారంతా అక్కడే ఉన్నారు. ముకుల్ శిశోదియా, భార్య, కూతురు జాస్మిన్ వచ్చారు. లూర్దు రాజు భార్యతో వచ్చాడు. అమావాస్యరాజు, నాలుగో ఆయన, చిన జగ్గుబాబు, భార్య, కాశీ మామయ్య, మాళవిక, నరిసిపండు, సోయితా, యాద్గిరి, ఖాశీం–ఇంకా ఎవరో–ఎవరో–సౌజన్యం మంచి గంధం. దాని వ్యాప్తికి అడ్రసు లేదు.

అంత దుఃఖంలోనూ అనసూయ నవ్వుకుంది. “వెళ్లిపోతూ తన మాటని నిజం చేసుకున్నాడు. చెల్లెలి కామన కాన్సర్‌ని దగ్గరికి రానివ్వదన్నాడు. రానివ్వలేదు”

లీల మాటల్ని మర్చిపోయింది. అబ్బు చితిని తనే స్వయంగా పేర్చి, సర్వమంగళం మంత్రాలని పఠిస్తూండగా–దివ్వెను టెడ్డీ చేతికిచ్చి–స్వయంగా అబ్బు చితికి నిప్పంటించేటట్టు చేసింది.

ఒక జీవితాన్ని ఉద్యమం చేసుకున్న, తన ఉనికినే కేవలం సాధనగా మార్చుకున్న కర్మయోగి, అతి సామాన్య వ్యక్తి–అతి నిర్లిప్తంగా, నిశ్శబ్దంగా, తృప్తిగా పంచభూతాల్లోకి మాయమైపోయాడు.

## 46

ఆరోజు అబ్బు ఓరిగామీ ఎంటర్‌ప్రైజెస్ సంస్థ అబ్బు స్మారకార్థం 28వ వర్ధంతి సభని నిర్వహిస్తోంది.

కాలానికి కళ్లెం లేదు. ఈ 28 సంవత్సరాలలో ఊహించగలిగినవీ, ఊహించలేనివీ చాలా జరిగిపోయాయి. AOE (అబ్బు ఓరిగామీ ఎంటర్‌ప్రైజెస్) ప్రపంచంలో ప్రముఖమైన పురోగతి. మిగతా డైరెక్టర్ల, వర్కర్ల, సిబ్బంది సహకారంతో లీల సారథ్యంలో సాధించిన అపూర్వమైన విజయం ఇది. సంస్థ చరిత్రలో–అతి ముఖ్యమైన ఉత్సవం–ఏటేటా అబ్బు వర్ధంతి సభ. ఆనాడు వర్కర్లందరికీ ఒక నెల బోనస్‌ని ఇచ్చి స్వయంగా బట్టలు పంచిపెడుతుంది.

అబ్బుని దహనంచేసిన చోట చక్కని స్మారక మందిరాన్ని నిర్మింపజేశారు. హాలు మధ్యలో అబ్బు విగ్రహాన్ని ప్రతిష్ఠింపజేశారు.

ఈ 28 సంవత్సరాలలో ఆనాటి డైరెక్టర్లు చాలామంది వెళ్లిపోయారు. నాలుగో ఆయన రెండో యేటికే కన్ను మూశారు. మరో ఎనిమిదేళ్లకి అమావాస్య రాజు శలవు తీసుకున్నారు. వారి స్థానాల్లో వారి పిల్లలు డైరెక్టర్లయారు. కాశీ మామయ్య వెళ్లిపోయాడు. రామశర్మ మరో 19 సంవత్సరాలు డైరెక్టరుగా పనిచేసి రిటైరయాడు. వయస్సు ఒకే ఒక్క సౌకర్యాన్ని బెల్లించింది. ఇప్పుడు చెముడు వచ్చింది. చేతికి కర్ర వచ్చింది. వయస్సులో

సంప్రదాయాల మూలాలకు కారణాలను అన్వేషించే ప్రయత్నాన్ని విరమించుకున్నాడు. ఆర్ష సంప్రదాయం ఎందరో జిజ్ఞాసువుల, మేధావుల, ఋషుల కృషికి దర్పణం. వేదం మానవ జీవితాన్ని ధర్మబద్ధం, కర్మబద్ధం చేసే అపూర్వమైన గురువు. దాన్ని ఏ కాస్త అవగాహన చేసుకున్నా చాలు. అనవసరంగా కెలకనక్కర్లేదు. వ్యక్తికి దురాశ, దూరాశ–రెండూ అనవసరమే–ఇదీ రామశర్మ తీర్పు–తన ప్రయత్నం మీద. ఇప్పుడు రెండు పూటలా సంధ్యావందనం చేస్తాడు.

సర్వమంగళం, అనసూయమ్మల మీద వయస్సు దాడి చేసింది. ఇద్దరూ కంటికి రెప్పలాగ చూసుకున్న ఓ వ్యక్తిని పోగొట్టుకున్నారు–అబ్బుని. భగవంతుడు కరుణించి వారికి మరో ఇద్దరిని ఇచ్చాడు–కవల పిల్లలు. ఒకరికొకరు 120 సెకెన్ల వ్యవధిలో పుట్టారు. వారి పేర్లకి ఏమీ గజిబిజి లేదు. పెద్ద అబ్బు. చిన్న అబ్బు. పరీక్షిత్తు ఇప్పుడు ఓరిగామీ రీసెర్చి విభాగాన్ని చూసుకుంటున్నాడు. మిగతా ఇద్దరూ రెండు మార్గాలను ఎన్నుకున్నారు. పెద్ద అబ్బు తండ్రిని అనుసరించి స్మార్తాన్ని పట్టుకున్నాడు. చిన్న అబ్బు ఆధునిక జీవితానికి మొగ్గుచూపి కంప్యూటర్ ఇంజనీరయాడు.

లీల టెడ్డీకి పెళ్లి చేసింది. జీవితాంతం టెడ్డీ తప్పనిసరిగా పాటించవలసిన చికిత్స జరుగుతూనే ఉంది. రోగంలో రెండు పార్శ్వాలున్నాయి. తెలిసి పాటించాల్సిన పద్ధతులు. తీసుకోవలసిన జాగ్రత్తలు. ఈ రెండూ నిష్ఠతో జరిపి అనారోగ్యాన్ని జయించాడు టెడ్డీ. చిన్నప్పుడు హుందాతనంలో ఏ కాస్తో తల్లిని పోలినా, పెద్ద అవుతున్నకొద్దీ ముమ్మూర్తులా తండ్రి రూపాన్ని, స్వభావాన్నీ, చొరవనీ, సౌజన్యాన్నీ పుణికి పుచ్చుకున్నాడు. చిన్నతనంలో తన ఆరోగ్యాన్ని కాపాడిన వ్యక్తి తనకి గుర్తున్నాడు. పరోక్షంగా తనకి ప్రాణం పోసిన వ్యక్తిని మర్చిపోలేదు. 16 సంవత్సరాల కిందట తనకి కొడుకు పుట్టినప్పుడు–అతనికి పేరు పెట్టడానికి ఇద్దరు పోటీపడ్డారు. లీల మనస్సులో ఓ పేరుంది. టెడ్డీ మనస్సులో ఒక పేరుంది.

"ఈ ఒక్క విషయంలో నీ ఇష్టాఇష్టాలు చెల్లవు" అని కొడుకుమీద అధికారాన్ని చూపింది.

"ఈ ఒక్క విషయంలోనే నేను నీ మాటను ఒప్పుకోను" అన్నాడు టెడ్డీ–తండ్రి మిలటరీ స్వభావాన్ని పుణికి పుచ్చుకుంటూ.

ఇద్దరి గుండెల్లోనూ రాయి పడింది. తన మనస్సులో లేని కొత్త పేరును కొడుకు సూచిస్తే? తన తల్లిమాటను కాదని రాజీపడవలసిన అవసరం వస్తే?

ఇద్దరూ తమ తమ మనస్సుల్లోని పేర్లను కాగితాలమీద రాసి ఒకరికొకరు

ఇచ్చుకున్నారు. రెండు కాగితం మడతలూ విచ్చుకున్నాయి. రెండు కాగితం మడతల్లోనూ ఒకే పేరు కనిపించింది–అబ్బు.

ఇద్దరి కళ్లూ చెమర్చాయి. మంచితనం అంటువ్యాధి. దాన్ని 14 సంవత్సరాలు మనస్సులో దాచుకున్నాడు టెడ్డీ. 14 సంవత్సరాలుగా కలలుగంది లీల. ఇద్దరూ ఆ జ్ఞాపకాన్ని తమ జీవితంలో సుప్రతిష్ఠం చేయాలనుకున్నారు. అబ్బుకి ఇప్పుడు 17 సంవత్సరాలు.

మరొకచోట బొంబాయిలో అలాంటి ప్రయత్నమే జరిగింది. ముకుల్ శిశోదియా ఒక్కగానొక్క కూతురు జాస్మిన్ జర్మనీలో కొడుకుని ప్రసవించింది. కొలోన్ వింటర్ చైల్డ్ క్లినిక్‌లో కుర్రాడి పేరు–నాలుగు అక్షరాలు–ఇంగ్లీషులో రాసింది–ABBU. జర్మన్ నర్స్ "ఏమిటి ఈ పేరు అర్థం?" అనడిగింది.

"నా ప్రాణం" అంది జాస్మిన్.

ఆ విషయం తెలిసి ముకుల్ శిశోదియా పొంగిపోయాడు. తన జీవితంలో కృతజ్ఞత కూడా వారసత్వమే. ఇది జరిగి 16 సంవత్సరాలైంది. ఇప్పుడు శిశోదియా మీద అల్జిమర్స్ రోగం ముసురుకుంది. చాలా విషయాల్ని మర్చిపోతున్నాడు. కొందరు మనుషుల్నే గుర్తుపట్టడంలేదు. ఇప్పుడు ఆఫీసుకి వెళ్లడంలేదు. అల్లుడు వ్యాపారానికి వారసుడయాడు. జర్మనీ నుంచి వచ్చేశాడు.

విషయం తెలిసి–లీల బొంబాయి వచ్చింది ముకుల్‌ని చూడడానికి.

ముకుల్‌కి లీల గుర్తుంది. జాస్మిన్ కొడైకెనాల్‌లో నీటిలో పడడం గుర్తుంది. అంతకుమించి అతను ప్రతిదినం కూర్చునే కుర్చీలో ఎదురుగా పెద్ద అబ్బు ఫోటోలో వ్యక్తి తనకు గుర్తున్నాడు. తన బిడ్డని బతికించి ఇచ్చిన ఆ వ్యక్తి జ్ఞాపకాన్ని మరిపించడంలో ఆల్జైమర్స్ వ్యాధి ఓడిపోయింది. ఎనభయ్యో పడిలో గోడమీద ఉన్న అబ్బు, తన పక్కన ఉన్న మనుమడు అబ్బు ఆయనకి ఓదార్పు.

నరిసిపండు ముసలాడయాడు. సోయితా కూతుర్ని ప్రసవించి పురిటిలోనే చచ్చిపోయింది. పసిగుడ్డుని రెండు చేతుల్లో పట్టుకుని–అంతకంటే ఏం చెయ్యాలో తెలీదు కనుక–కూతురుకి అబ్బమ్మ అని పేరు పెట్టాడు.

మంచితనం వైరస్‌లాంటిది. అది నిదానంగా–కాని స్పష్టంగా ఆవరించుకుంటుంది. కృతజ్ఞత, ఉదాత్తత దాని కవల పిల్లలు.

అబ్బు ఓరిగామీ ఎంటర్‌ప్రైజెస్ ఆవరణ ఆహూతులతో రద్దీగా ఉంది. స్మారక

భవనంలో అబ్బు విగ్రహాన్ని అలంకరించారు. సర్వమంగళానికి స్వరం అందడంలేదు. ఆ పనిని ఇప్పుడు పెద్ద అబ్బు చేస్తున్నాడు. పూర్ణకుంభంతో చైర్మన్ రాకకి అందరూ ఎదురుచూస్తున్నారు.

కారాగింది. లీలని మనుమడు చెయ్యి పుచ్చుకుని దింపాడు. టెడ్డీ, భార్య ఆహ్వానించారు. లీల పండి ఒడిలిన అత్తిపండులాగ ఉంది. బంగారం అంచున్న తెల్లని చీరెలో వాడినా వాసన వదులుకోని సన్నజాజి పువ్వులాగ ఉంది. చర్మం ముడతలు పడింది. వార్ధక్యంలోనూ ఆమె ఠీవి సడలిపోలేదు.

కారులోంచి నేలమీద మోపిన కాలు తడబడితే కొడుకు ఆదుకున్నాడు. లీలకి నవ్వొచ్చింది. ఈ జీవితం తూలి నేలన వాలకుండా ఎంతమంది ఎన్ని దశలలో ఆదుకున్నారు?

ఎదురుగా అబ్బు విగ్రహం.

పురోహితుడు పెద్ద అబ్బుని అడిగింది–"ఎక్కడ అమ్మా నాన్నా?"

చూపించాడు. దూరంగా సర్వమంగళం, అనసూయ నిలబడి ఉన్నారు. పవిత్రంగా, ప్రశాంతంగా కనిపించారు. సర్వమంగళం తరతరాల ఆర్ష ధర్మానికి ఆఖరి అభిజ్ఞలాగ ఉన్నాడు. లీల వారివేపు నడిచింది. అనసూయ వొంగి నమస్కారం చెయ్యబోయింది. ఆమెని ఆపింది.

"అబ్బుకి సేవ చేసిన చేతులివి, ఇలాంటి పాపపు పనిని చేయకూడదు" అంటూ అనసూయని కావలించుకుంది లీల. పక్కనున్న తన కొడుకుని చూసింది. తల్లి చూపుని అర్థం చేసుకోవడం అలవాటు చేసుకున్నాడు టెడ్డీ.

సర్వమంగళాన్ని, అనసూయనీ కూర్చోపెట్టి ఇద్దరికీ బట్టలు పెట్టి బంగారు నాణాల సంచీని వారి చేతుల్లో పెట్టింది.

"ఎందుకమ్మా ఇది?" అన్నాడు సర్వమంగళం.

"మీకు నా ఋణం తీరిపోతుందేమోనని కొంచెమే ఇస్తున్నాను" అంది లీల.

"మనందరం అబ్బు అనే గొడుగు కింద సేదతీర్చుకున్న వాళ్లమే. ఒకరికొకరు ఊతం" అంది.

ఆమె అబ్బు విగ్రహంవేపు నడిచింది. బొంబాయి నుంచి జాస్మిన్ కొడుకు అబ్బుతో వచ్చింది.

వరసగా 'అబ్బు'లు కనిపిస్తున్నారు. చక్కని ఆధునిక దుస్తుల్లో చిన్న అబ్బు,

సంప్రదాయ ధోరణిలో పెద్ద అబ్బు, సూటులో తన మనుమడు అబ్బు. కుర్తా పైజామాలో జాస్మిన్ కొడుకు, చివరన-అరవిచ్చిన నల్లతామరలాగ-అబ్బమ్మ.

ఎన్ని ఋణాలు!

అబ్బు విగ్రహం దగ్గరికి వచ్చింది. "నీ మంచితనం విశ్వరూపం ఇది" ఆమె కళ్లు తృప్తిగా అందరినీ పరికించాయి. పెదాలు చిరునవ్వుతో వికసించాయి.

ఎవరో పళ్లెంతో పువ్వులు తెచ్చారు. అబ్బు పాదాలు అందనంత కింద ఉంది లీల. విగ్రహం ముందు చిన్న బల్ల ఉంచి ఆమెని దాని మీదకి అడుగు వేయించాడు మనుమడు. పువ్వులు రెండు చేతుల్లో తీసుకుంది.

"నీ పాదాలు నాకందనంత ఎత్తున ఉన్నాయి" అంటూ విగ్రహం పాదాలమీద పువ్వులు వేసింది.

చిన్న అబ్బు ఆమె ముందు మైకు పట్టుకుని నిలబడ్డాడు. అతని తల నిమిరింది.

హాలులో నిశ్శబ్దం. అందరి దృష్టీ లీలమీదే ఉంది. ఎప్పుడూ తను మాట్లాడలేదు. ఇప్పుడు-ఈ మైకు-తనకి మొదటి ఆహ్వానం.

అబ్బుల వరసని చూసింది. రామశర్మ, జాస్మిన్, సర్వమంగళం అంతా ఆమెనే గమనిస్తున్నారు.

మళ్లీ అబ్బుని చూసింది.

లీల గొంతు విడింది-రహస్యం చెప్తున్నట్టు.

"నాకు అబ్బు తల వొంచడం నేర్పాడు. కన్నీటి విలువని నేర్పాడు. మంచితనంతో జరిగిన నష్టాన్ని ఒక జీవితకాలం భర్తీ చేశాడు. బురదలో నలిగిపోయిన పువ్వుని ఏరి ప్రాణం పోశాడు. కాళ్లు నేలమీద ఉంటే ఆకాశం కిందకి దిగివస్తుందని రుజువుచేశాడు. ఆఖరికి-ఆఖరికి-నన్నూ నా కొడుకునీ కాపాడడంకోసం తన ప్రాణాన్ని అడ్డం వేశాడు. He-he is my God Father!-no-He is my God!"

లీల కళ్లు నీటి చెలమలయాయి. వాటి వెనుక లీలగా-అబ్బు ముఖం-విగ్రహం కాదు-కనిపిస్తోంది. గతం ఆమె కళ్లముందు ముసురుకుంది.

-అబ్బుని మొదటిసారి తిట్టిన సంఘటన.

-అబ్బు తన చెంప పగులగొట్టిన సంఘటన.

-ఆసుపత్రిలో అబ్బు టెడ్డీ రోగాన్ని వివరించిన క్షణం.

–ఆటోలో అబ్బు గాయపడిన తన శరీరాన్ని మోస్తున్న క్షణం.

–సంస్థ ప్రారంభోత్సవం సందర్భంలో అతని కాళ్లు స్పృశించిన క్షణం.

–ఆఖరున–సగం శరీరం బస్సుకింద ఉండగా అతని చూపులు తనమీద నిలిచిపోయిన క్షణం.

లీల కళ్లు తిరిగాయి. అబ్బుని చూస్తూనే అలా కూలిపోయింది. కూలిపోతున్న శరీరాన్ని మనుమడు రెండు చేతుల్తో పట్టుకున్నాడు.

ఆ దృశ్యాన్ని చూస్తున్న ఎవరూ చలించలేదు. అందరి కళ్లలోనూ నీళ్లు నిండాయి. అందరికీ ఏం జరిగిందో అర్ధమైంది.

లీల వెళ్లిపోయింది–తన దేవుడిని అనుసరిస్తూ.

# ఆఖరి మాట

ఈ నవల కేవలం కల్పితం. ఇందులో కొన్ని వాస్తవ సంఘటనలూ, వ్యక్తులూ ఉన్నా-కథకి 'రుచి'ని కల్పించడానికి చేసిన ప్రయత్నమే అది.

ఈ ఇతివృత్తం దాదాపు 14 సంవత్సరాలుగా నా మనస్సులో ఉంది. వ్రాయడం ప్రారంభించి నాలుగేళ్లయింది. మధ్యమధ్యలో ఎన్నో అవాంతరాలూ, సాగించలేని ప్రతిబంధకాలూ, ఆలోచన ముందుకు సాగని పరిస్థితులూ వచ్చాయి. ఐనా దాటుకు ఆఖరి వాక్యానికి చేరడానికి ఇన్ని సంవత్సరాలు పట్టింది.

ఈ నవల నేపథ్యం చాలా ప్రత్యేకమైనదీ, కత్తిమీద సాము కాగలిగినదీను. కోనసీమలో-పొడగట్లపల్లి, ముక్కామల, ఇరగవరం, గంగలకుర్రు, మురమళ్ల, ముమ్మిడివరం, కొవ్వూరు, శ్రీశైలం, విశాఖపట్నం-ఇలా ఎన్నో చోట్లకి ఎన్నోసార్లు వెళ్లి ఎంతోమందిని కలిసి, చర్చించి వారు చెప్పిన సంఘటనలూ, సందర్భాలను ఆకళించుకుని ఈ రచనలో అక్కడా అక్కడా ఉపయోగించాను. విషయం విస్తృతి అకాశం. నా రచన పరిధి అతి కురచ. అలాగే ఎందరో వైద్య నిపుణులూ, ఆయుర్వేద వైద్యులూ, పండితులూ, చార్టర్డ్ అకౌంటెంట్లూ తమ తమ రంగాలకు సంబంధించిన విషయాలలో నాకు సలహాలూ, సూచనలూ ఇచ్చి సహకరించారు. వారిలో కొందరి పేర్లు :

దుర్భా శ్రీరామమూర్తి
మాధవ శర్మ, సప్త రుషి పాఠశాల, దువ్వాడ
రేమెళ్ల బాపన్న శాస్త్రి, పొడగట్లపల్లి
దత్తాత్రేయ శర్మ, కపిలేశ్వరపురం
గంటి సుబ్రహ్మణ్య శాస్త్రి, మురమళ్ల
నాగాభట్ల రవిప్రసాద్ శర్మ, మురమళ్ల
శ్రీపాద శ్రీరామ నరసింహ ఘనాపాఠీ, గంగలకుర్రు
సామవేదం భాస్కరావధాన్లు, గంగలకుర్రు
శ్రీనివాస శర్మ, కొవ్వూరు
ముష్టి భీమశంకర శాస్త్రి, విశాఖపట్నం
మల్లాది కృష్ణానంద ఫణి శర్మ, శ్రీశైలం వేద పాఠశాల
యనమండ్ర వేణుగోపాల శాస్త్రి, కొవ్వూరు
నోరి భోగేశ్వర శర్మ, కొవ్వూరు
కంభంపాటి అవధాన్లు

లంక వెంకట రమణ శాస్త్రి
కొంపెల్ల లక్ష్మీనారాయణ అవధాన్లు
యనమండ్ర సుబ్రహ్మణ్య చయనులు
సామవేదం షణ్ముఖ శర్మ
డా॥ ఎ.వేంకట రమణ దీక్షితులు, తిరుమల ప్రధాన అర్చకులు
మేడా మస్తాన్ రెడ్డి
మేడా శివారెడ్డి
డా॥ శ్రీమత్తిరుమల నరసింహాచార్య
డా॥ సుమన
డా॥ పి.మురళీకృష్ణ
డా॥ కె.రవీంద్ర
డి.ఎస్.వి.గోపాలకృష్ణ, చార్టర్డ్ అకౌంటెంట్
మైలవరపు శ్రీనివాసరావు
డా॥ దేవెళ్ల చిన్ని కృష్ణయ్య
డా॥ అయ్యలసోమయాజుల గోపాలరావు
గోడా రామకృష్ణ

ఈ నవలని అక్షరం అక్షరం చదివి, సవరణలు సూచించి, కొన్ని అన్వయాలనూ, ప్రతిపాదనలూ చర్చించిన ఇద్దరు-గొల్లపల్లి సుబ్రహ్మణ్య ఘనాపాఠీ, పేరి రవికుమార్‌గార్ల సహాయం మరువరానిది. అపూర్వమైనదీ.

చివరగా, పాఠక దేవుళ్లకు శతాబ్దాలుగా మృష్టాన్న భోజనాన్ని ఆరగింపజేస్తున్న సంపాదక మిత్రులు స్వాతి బలరామ్‌గారు-మన సంప్రదాయ వైభవాన్నీ, పౌరాణిక, ఆర్ష సంప్రదాయ వైశిష్ట్యాన్నీ ఎప్పటికప్పుడు తన పత్రికలో వితరణచేసే సహృదయులు, స్వాతి పత్రిక ముఖతః ఈ నవల పాఠకులకు చేరడం సముచితం, నాకు అదృష్టం.

వీరందరికీ నా మనఃపూర్వక కృతజ్ఞతలు.

ఇతివృత్తం నేపథ్యాన్ని తెలుసుకుని ఏర్పర్చుకున్నది కనుక-ఇంకా ఏమైనా లొసుగులు, సవరణలూ పాఠకులకు తోస్తే-తెలియజేస్తే సవరించుకుంటాను.

**గొల్లపూడి మారుతీరావు**

విశాఖపట్నం
**18.11.2015**

## గొల్లపూడి మారుతీరావు ఇతర రచనలు

| పుస్తకం | వెల |
|---|---|
| నవలలు (చీకటిలో చీలికలు) | 100/- |
| నవలలు (ఎర్రసీత) | 100/- |
| నాటకాలు-1 | 100/- |
| నాటకాలు-2 | 100/- |
| నాటికలు-1 | 100/- |
| నాటికలు-2 | 100/- |
| వ్యాసాలు | 100/- |
| కథలు | 100/- |
| బాలసాహిత్యం | 100/- |
| జీవనకాలమ్-1 | 100/- |
| జీవనకాలమ్-2 | 100/- |
| జీవనకాలమ్-3 | 100/- |
| సాయంకాలమైంది (నవల) | 125/- |
| అమ్మ కడుపు చల్లగా (ఆత్మకథ) | 400/- |
| ఎలిజీలు | 200/- |
| షష్టిపూర్తి ప్రత్యేక సంచిక | 125/- |
| ఆత్రేయ-ఒక పరిశీలన | 200/- |

ప్రతులకు :

ఇ-మెయిల్ : raamraaki7@yahoo.com

ఫోన్ : 9704227222

స్వచ్ఛమయిన తెలుగు నుడికారంతో, సంప్రదాయ భాషతో "రుణం" అనే నామకరణం చేయడంలోనే యీ నవల ఒక ప్రత్యేకతను సంతరించుకుంది. మారుతీరావుగారు అటు ఆంగ్ల సాహిత్యాన్నీ, ఇటు తెలుగు సాహిత్యాన్నీ ఔపోశన పట్టడమే కాకుండా అక్షరజ్ఞానం అబ్బినప్పటినుంచీ విస్తృత పఠనం కొనసాగిస్తున్నారు. ఆ అనుభవాన్నంతటినీ యీ "రుణం" నవలలో క్రోడీకరించి పదిలపరిచారాయన. కొన్ని పాత్రలు భారతీయ సంప్రదాయానికీ, సంస్కృతికీ ప్రతీకలుగా, నిలువెత్తు సాక్ష్యాధారాలుగా రూపుదిద్దుకున్నాయి. మారుతీరావుగారు భారతీయ సంస్కృతీ సంప్రదాయ శక్తులనూ, ప్రత్యేకించి స్వచ్ఛమైన, పవిత్రమైన భారతీయతను ఆవిష్కరించారు. మహాభారతంలో అడవులపాలై, అజ్ఞాతవాసం చేస్తున్న పాండవులకు అన్ని సందర్భాలలోనూ అండగా నిలిచి వారిని పాలకులుగా ప్రతిష్ఠించిన కర్మయోగి శ్రీకృష్ణుడు అబ్బుశాస్త్రిలో కనిపిస్తాడు. తెలుగు నవలాసాహిత్యం తొలిదశలో కందుకూరి వీరేశలింగం పంతులుగారి 'రాజశేఖర చరిత్ర', చిలకమర్తి లక్ష్మీనరసింహంగారి 'గణపతి', విశ్వనాథ సత్యనారాయణగారి 'వేయిపడగలు', అడివి బాపిరాజుగారి 'నారాయణరావు' మొదలైన ఎన్నో నవలలు వచ్చాయి. ఇది భారతీయ నవల. ఈ దేశ సంస్కృతీ సంప్రదాయాలకు, కర్మభూమిలోని పవిత్రతకూ ఆటపట్టయిన నవల.

**– సి.యస్.రావు**
**ప్రముఖ కథా, నాటక రచయిత**

'రుణం' చదువుతుంటే ఒక సంఘటన గుర్తుకువచ్చింది. ఒకసారి ప్రఖ్యాత నవలా రచయిత 'శరత్‌చంద్ర ఛటర్జీ' ('దేవదాసు' రచయిత అంటే ఇప్పటివారు సులువుగా పోల్చుకుంటారేమో) గారిని, ఆయన అభిమాన పాఠకులు అడిగారట, "అయ్యా, మీ రచనలు మమ్మల్ని ఎంతో రంజింపచేస్తున్నాయి... అలాంటి మీకు ఇవ్వకుండా రవీంద్రనాథ్ ఠాగూర్‌గారికి 'నోబుల్' అవార్డు ఇచ్చారేమిటి?" అని. అందుకు శరత్‌గారు నవ్వేసి, "నేను మీకోసం రాస్తాను. రవీంద్రుడు నాకోసం రాస్తారు" అన్నారుట. నిజం చెప్పద్దూ నాకు గొల్లపూడివారి రుణం చదువుతుంటే చప్పున శరత్ మాటలు గుర్తొచ్చాయి. అయితే ఇక్కడొక చిన్న తేడా వుంది. అది నిర్ధారించుకోవడం కోసం కొంతమంది స్వాతి పాఠకుల్ని ప్రశ్నించాను. అందరూ ముక్తకంఠంతో 'రుణం' సీరియల్‌ని కీర్తించారు. అంటే గొల్లపూడివారు పాఠక రచయితల్ని, పాఠకుల్ని ఏకకాలంలో మెప్పించారు. తెలుగు పాఠకులు గొల్లపూడివారికి రుణపడ్డారో, గొల్లపూడివారే పాఠకులకి రుణపడ్డారో లెక్కలుకట్టి చెప్పడం కష్టం. గొల్లపూడివారు అడపాదడపా ఈ రుణానికి వడ్డీ చెల్లిస్తుంటే నాలాంటివాళ్ళం చాలా సంతోషిస్తాం. ఈ 'రుణం' ప్రచురించడంద్వారా ఉత్తమాభిరుచిలో తనకు తానే సాటి అని మరోమారు నిరూపించుకున్న స్వాతి సారథి శ్రీ వేమూరి బలరామ్‌గారూ, మిమ్మల్ని ఎంత అభినందించినా తక్కువే అవుతుంది!

**– మాడభూషి దివాకరబాబు**
**నాటక, సినీ రచయిత, హైదరాబాద్**

**RUNAM - Novel - Gollapudi Maruti Rao**
a Creative Links Publication, 2016

₹ 250/-